# తెలుగు దినపత్రికల్లో సాహిత్యం
# (1970-90)

**పర్యవేక్షణ**

**ఆచార్య రవ్వా శ్రీహరి**

**పరిశోధన**

కె. రామదాస్

హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి పి. హెచ్‌డి. పట్టా కోసం
సమర్పించిన సిద్ధాంత వ్యాసం

**జూన్ 1999**

Department of Telugu
University of Hyderabad
Central University (P.O)
HYDERABAD - 500 046

Dt. 30.6.1999

# C E R T I F I C A T E

This is to certify that I, **K. RAMDAS** have carried out the Research embodied in the present dissertation for the full period prescribed under Ph.D. ordinances of the University. My topic of the Ph.D. programme is **" TELUGU DINAPATRIKALLO SAHITYAM "** I declare to the best of my knowledge that no part of this dissertation was earlier submitted for the award of Research Degree of any University / Institution

SUPERVISOR

**K. RAMDAS**
Roll No. 92HTPH01

DEAN OF THE SCHOOL 3/7/99
DEAN
SCHOOL OF HUMANITIES
University of Hyderabad
Hyderabad-500 134

HEAD OF THE DEPARTMENT
Professor and Head
Department of Telugu
University of Hyderabad
Central University Post
HYDERABAD-500 134

# కృతజ్ఞతలు

తెలుగు దినపత్రికల్లో సాహిత్యం (1970-90) అనే అంశంపై పరిశోధనకు అనుమతించిన కేంద్రీయ విశ్వవిద్యాలయ నాటి తెలుగుశాఖాధ్యక్షులు, నా పరిశోధనకు పర్యవేక్షకులు ఆచార్య రవ్వా శ్రీహరి గారికి నమస్సులు. వృత్తిరీత్యా వారు ఎంతగానో పనిఒత్తిడిలో ఉన్నప్పటికీ నా పరిశోధనకు మార్గదర్శకులుగా వ్యవహరించిన గురుదేవులకు కృతజ్ఞతలు.

నా పరిశోధనాభిలాషను గుర్తించి ఎంతో ప్రోత్సహించినవారు-హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ అధ్యాపక బృందం ఆచార్య కె.కె. రంగనాథాచార్యులు, ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం, డా.సి.ఆనందరామం, డా. ముదిగొండ వీరభద్రయ్య, డా.పరిమి రామనరసింహం, డా.ఎన్.ఎస్.రాజు, డా.శరత్‌జ్యోత్స్నారాణిగార్లకు ప్రత్యేక కృతజ్ఞతలు.

నా పరిశోధనకు ఆలోచనలతో పాటు ఆత్మీయతను పంచిఇచ్చిన సహృదయులు, రాష్ట్ర సాంస్కృతిక మండలి అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆచార్య సి.నారాయణరెడ్డి, రాష్ట్ర ఉన్నతవిద్యామండలి చైర్మన్ ఆచార్య సి.సుబ్బారావు, కార్యదర్శి ఆచార్య జయరామిరెడ్డి, తెలుగువిశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ఆచార్య ఎన్.గోపి, ఆచార్య చేకూరి రామారావు, శ్రీ కె.వి.రమణారెడ్డి, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి, కె.శివారెడ్డి, వి.వి.కాలేజీలో సాయంత్రం కలిసే కవి మిత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

నన్ను వెన్నంటి, వెన్నుతట్టి నాచేత పరిశోధన పూర్తి చేయించినవారు శ్రీ జయధీర్ తిరుమలరావు, డా. అఫ్సర్‌లు. వారికి నమోవాకములు.

పరిశోధనలో పుస్తకాలిచ్చి సహకరించిన పెద్దలు శ్రీ ఎ.బి.కె. ప్రసాద్, వరదాచారి, 'విరసం' వేణుగోపాల్, 'ఆంధ్రజ్యోతి' పానుగోటి కృష్ణారెడ్డికి, 'వార్త' గుడిపాటికి, 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఎస్.రామకృష్ణకు, తెలుగువిశ్వవిద్యాలయ గ్రంథాలయాధికారి డా.శంకర్‌రెడ్డి, డైరక్టర్ ఆఫ్ లైబ్రరీస్ డా.టి.డి.ప్రసాదరావు, ఐసిఎస్ఎస్ఆర్ గ్రంథాలయపాలకులు యాదగిరి, ఇతర సిబ్బందికి కృతజ్ఞతలు.

నా రీసెర్చిలో ఆర్థికంగా బాధపడకూడదని జీతంతో కూడిన సెలవు మంజూరుచేసిన సహృదయులు 'వార్త' చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ శ్రీ గిరీష్ సంఘీ గారికి, సి.ఇ.ఒ. శ్రీ కె.ఆర్.కె.ప్రసాద్‌గారికి, సంపాదకులు శ్రీ కొండముది రామచంద్రమూర్తిగారికి, బ్యూరో చీఫ్ శ్రీ దామెర్ల సాయిబాబాగారికి, 'వార్త'లోని నా సహచర మిత్రులందరికీ.. కృతజ్ఞతలు..

నా బాధల్ని, సంతోషాల్ని పంచుకున్న స్నేహితులు 'ఈనాడు' మద్దాళి వెంకటేశ్వరరావుకు, 'ఆంధ్రజ్యోతి' మారం శ్రీనివాస్‌కు, 'వార్త' శివప్రసాద్‌కు...

అందరికన్నా నా పరిశోధనలో ఎక్కువగా సహకరించింది నా కుటుంబసభ్యులు. ఈ సందర్భంగా మా అమ్మ, అక్కయ్యలు, బావలు, వినయ్, ఉపేందర్, కృష్ణలకు...జాహ్నవికి...

చివరగా నా పరిశోధనను వెన్ను'తిట్టి'నడిపించిన సీఫెల్ ...'వెంపరాల'కు, వెంకటరెడ్డికి, విజయ్, ఇతర మిత్రులకు...

'బిగ్‌ఫైవ్' బృందానికి,ఎం.ఎ.,ఎం.ఫిల్.,పి.హెచ్‌డి.,సహోధ్యాయులకు ...

నేను మర్చిపోయిన ప్రతి ఒక్కరికి, ఎందరో మహనీయులు... అందరికీ కృతజ్ఞతాభివందనాలు.

★ ★ ★

# విషయక్రమం


## I. తొలినాటి తెలుగు పత్రికల్లో సాహిత్యం - ప్రమాణాలు, విలువలు 1-17

i. తొలి తెలుగు వార్తాపత్రిక 'వర్తమాన తరంగిణి'
ii. ప్రారంభదశలో వివిధ పత్రికలు
iii. తెలంగాణా సాహిత్య పత్రికలు
ఎ. నీలగిరి బి. హితబోధిని సి. తెలుగుపత్రిక డి. గోలకొండ ఇ.సుజాత ఎఫ్.దివ్యవాణి జి. విభూతి
iv. ముగింపు

## II.1970-80ల మధ్య దినపత్రికల్లో వచ్చిన సాహిత్యం 18-103

i.పత్రికావ్యవస్థలో వచ్చిన మార్పులు18-23

ఎ. అభ్యుదయ ఉద్యమం బి. విరసం ప్రవేశం సి. వ్యాపార సాహిత్య ధోరణి డి. సాహిత్యం - దినపత్రికలు

ii.ప్రధాన వ్యాసాలు
ఎ.నవల బి.కథాసాహిత్యం సి. అనువాద వ్యాసాలు

iii.ఇంటర్వ్యూలు

iv.వ్యంగ్యరచనలు

v.చర్చలూ- వాదోపవాదాలు

vi.కవులపై వచ్చిన వ్యాసాలు- వ్యక్తిగత పరిచయాలు

vii. ఇతర అంశాలు
ఎ. నాటకరంగంపై విమర్శలు బి. జానపద సాహిత్యం సి. బాలసాహిత్యం
డి. సాహిత్యవార్తల విశేషాంశాలు

viii. సృజనాత్మక రచనలు
ఎ. కవిత్వం బి. గేయాలు సి. కథలు డి. కవితల సూచిక ఇ. సమీక్షలు ఎఫ్. సమీక్షల సూచిక

III. 1980-90ల మధ్య దినపత్రికల్లో వచ్చిన సాహిత్యం 104-173

i. నేపథ్యం

ఎ. సామాజిక సాంస్కృతిక రంగాల్లో వచ్చిన మార్పులు
బి. కొత్తపత్రికలు - కొత్త శీర్షికలు
సి. సాహిత్య పేజీల్లో వచ్చిన మార్పులు
డి. డైలీ సీరియల్స్‌కు ప్రాముఖ్యం
ఇ. ఆదివారం అనుబంధాల్లో సాహిత్యం
ఎఫ్. వారం వారం సాహిత్య సంపాదకీయాలు
జి. సమీక్షల కోసం ప్రత్యేక పేజీలు
హెచ్. అనుదిన కార్టూన్ కవిత్వం
ఐ. పెరిగిన సాహిత్య శీర్షికలు
జె. ఇతర పేజీల్లో సాహిత్యం
కె. బాలసాహిత్యం
ఎల్. సాహిత్య వార్తావిశేషాల ప్రాధాన్యం
ఎం. సాహితీలేఖలు

ii. ప్రధాన వ్యాసాలు
1. చలం , శ్రీశ్రీలపై ప్రత్యేక వ్యాసాలు 2. శ్రీశ్రీ
ఎ. కవిత్వం బి. కథలు సి. నవల

iii. ఇంటర్వ్యూలు

iv. వ్యక్తిగత పరిచయాలు

v. అనువాదరంగం

vi. 1980-90ల మధ్య వచ్చిన వివిధ శీర్షికలు
ఎ. సాహిత్య శీర్షికలు బి. సృజనాత్మక శీర్షికలు సి. వ్యక్తిగత విశేషాంశాలతో కూడిన ప్రయోగాత్మక శీర్షికలు

vii. చర్చలు- వాదోపవాదాలు

IV. సాహిత్య సంపాదకీయాలు 174-196
i. సాహిత్య సంపాదకీయం
ఎ. సాహిత్యసంపాదకీయాలు- వివిధ రకాలు
1. వ్యక్తి ప్రధానంగా రాసిన సంపాదకీయాలు
2. సందర్భాన్నిబట్టి రాసిన సంపాదకీయాలు
3. దృక్పథం ప్రధానంగా రాసిన సంపాదకీయాలు

ii. 1970-80ల మధ్య సాహిత్య సంపాదకీయాలు
ఎ. తెలుగు సాహిత్యం - భాష బి. వ్యక్తులపై వచ్చిన సంపాదకీయాలు
సి. ఉద్యమ సంబంధిత సంపాదకీయాలు

iii. 1980-90ల మధ్య సాహిత్య సంపాదకీయాలు
ఎ. వ్యక్తులపై వచ్చిన సంపాదకీయాలు
బి. సంపాదకీయాల్లో దృక్పథాంశాలు

iv. ఇతర భాషాసాహిత్యాల గురించి సంపాదకీయాలు
ఎ. ప్రస్తావనగా చెప్పిన సాహిత్యాంశాలు
బి. తులనాత్మకంగా చెప్పిన అంశాలు
సి. ఇతర భాషాసాహిత్యాలపై సాహిత్య సంపాదకీయాలు
ముగింపు

V. ఉపసంహారం 197-201
ఎ. 1970-80ల మధ్య సాహిత్యంపై సమీక్ష
బి. 1980-90ల మధ్య సాహిత్యంపై సమీక్ష
సి. కొత్తధోరణులు- కొత్త శీర్షికలు

# ప్రవేశిక

**1985** నుంచి తెలుగు దినపత్రికల్లో వెలువడుతున్న సాహిత్య పేజీలను శ్రద్ధగా పరిశీలిస్తూ ఉండటం వల్ల ఈ పరిశోధనాంశాన్ని నేను స్వీకరించాను. ప్రస్తుత దినపత్రికల్లో సాహిత్యానికి ఇస్తున్న ప్రాముఖ్యాన్ని బట్టి దినపత్రికలకూ, సాహిత్యానికి మధ్య ఉన్న అనుబంధాన్నీ, పూర్వాపరాలనూ వెలుగులోకి తీసుకురావడమే ఈ పరిశోధన ప్రధాన ఉద్దేశం.

ఈ పరిశోధనకు సంబంధించిన మౌలికమైన అంశాలను, పరిశోధనా సామాగ్రిని ఏర్పరచుకోవడానికి ఎంతో శ్రమపడాల్సి వచ్చింది. ముఖ్యంగా ఆయా దినపత్రికల సాహిత్య పేజీలూ, ఇతర పేజీల్లో వెలువడిన వివిధ సాహిత్య వ్యాసాలను సేకరించి వర్గీకరించవలసివచ్చింది. పరిశోధనని మరింత నిర్దిష్టంగా కొనసాగించడానికి వీలుగా కొంతకాల పరిధిని విధించుకోక తప్పలేదు. **1970** నుంచి **90** వరకు తెలుగు దినపత్రికలను ఈ పరిశోధనకు ప్రధాన ఆకరంగా తీసుకున్నాను. ఈ రెండు దశాబ్దాలు వివిధ కారణాల వల్ల ఒక ప్రత్యేకతను సంతరించుకున్నవి. సామాజిక సాహిత్య రంగాలలో విశేషమైన పరిణామాలు ఈ దశాబ్దంలోనే ఏర్పడ్డాయి. సాహిత్యపరంగా అనేక కొత్త ధోరణులు తలెత్తాయి. సామాజికరంగంలో ఉపరితల అంశాల్లో మౌలికమైన మార్పులు జరిగాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఆయా పరిణామాలను సమన్వయించుకుంటూ దినపత్రికల సాహిత్య సేవను విశ్లేషించడమే ఈ పరిశోధన సారాంశం.

పత్రికారంగానికి సంబంధించి తెలుగులో తగినంత చరిత్ర వివరాలు గానీ, ఆధారాలు గానీ లేవు. పత్రికల పరిణామాన్ని విశ్లేషించే ప్రయత్నాలు కూడా చాలా తక్కువగా జరిగాయి. అయితే ఈ పరిశోధనలో ప్రధానంగా పత్రికల సాహిత్య కృషికి మాత్రమే పరిమితం కావడం వల్ల పత్రికారంగ పరిణామ వికాసాలను స్థూలంగా మాత్రమే చర్చించాను. భవిష్యత్తులో ఈ చర్చ ఒక సమగ్రమైన ఆకృతిని సాధించుకోవలసి ఉంది.

నేనీ పరిశోధన కోసం ప్రధానంగా ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఈనాడు, విశాలాంధ్ర, ప్రజాశక్తి, ఉదయం , తదితర దినపత్రికలను మాత్రమే

పరిశోధనకు ఎన్నుకున్నాను. 1970 నుంచి 80ల వరకు దినపత్రికల్లో నవలా, కథాసాహిత్యాలపైనే ఎక్కువగా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. కవిత్వంపైన ప్రధాన వ్యాసాలంటూ వెలువడింది 1980ల దశకంలోనే. అందుకే రెండవ అధ్యాయంలో నవలా, కథాసాహిత్యం, అనువాద రంగాలపైన వెలువడిన వ్యాసాల గురించి చర్చించి మూడవ అధ్యాయంలో 80ల్లో కవిత్వంపై వచ్చిన వ్యాసాలను విశ్లేషించాను.

ఈ పరిశోధనాంశాన్ని మొదటగా సూచించింది శ్రీతిరుమల రామచంద్రగారు. సీనియర్ పాత్రికేయుడిగా, సుప్రసిద్ధ రచయితగా ఆయన అందించిన 'తెలుగు పత్రికల సాహిత్య సేవ' గ్రంథం నా పరిశోధనకు ఎంతగానో ఉపకరించింది. రాష్ట్ర రాజధాని నగరంలోని అఫ్జల్ గంజ్ గ్రంథాలయం, ఉస్మానియా యూనివర్సిటిలోని ఐసిఎస్ఎస్ఆర్ లైబ్రరీ, చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీ, వేటపాలెం గ్రంథాలయం, రాజమండ్రిలోని గౌతమి గ్రంథాలయం ..... ఇలా రాష్ట్రంలోని ప్రముఖ గ్రంథాలయాల నుండి అవసరమైన సమాచారాన్ని సేకరించాను. వీటితో పాటు ఆయా తెలుగు దినపత్రికల కార్యాలయాల నుండి కూడా అవసరమైన సమాచారం లభ్యమైంది. వీటన్నింటితో 1970 నుండి 90 వరకు దినపత్రికల్లో వచ్చిన వివిధ వ్యాసాలు, కవితలు, కథలు, నవలలతో పాటు ఆయా శీర్షికలు, చర్చలు – వాదోపవాదాలు, ఇంటర్వ్యూలు తదితర ప్రక్రియలపై వచ్చిన సాహిత్యంపైన వీలైనంతమేర విశ్లేషించేందుకు ప్రయత్నించాను.

దినపత్రికల ద్వారా ప్రచారంలోకి వచ్చిన సాహిత్యానికి 1970-90 మధ్య సృజనాత్మకంగానూ, విమర్శనాత్మకంగానూ విశేషమైన గౌరవం దక్కింది. ప్రధానంగా సమకాలీనమైన అనేక కొత్త సాహిత్య ధోరణులకు పత్రికలే వేదికలుగా రూపుదిద్దుకున్నాయి. ఈ మార్పును ఏదో ఒక కోణం నుంచీ మాత్రమే చూడడం సాధ్యంకాదు. అనేక కోణాల నుంచీ దినపత్రికల సాహిత్య కృషికి సంబంధించి విశ్లేషణ జరగవలసి వుంది. అలాంటి ప్రయత్నానికి ఈ పరిశోధన ఒక ప్రారంభం మాత్రమే.

***

# మొదటి అధ్యాయం

## తొలినాటి తెలుగుపత్రికల్లో సాహిత్యం - ప్రమాణాలు, విలువలు

# i. తొలి తెలుగు వార్తాపత్రిక వర్తమానతరంగిణి

తొలి తెలుగు వార్తాపత్రిక ఏదీ అన్న వివాదాన్ని అవతల వుంచితే 1842లో వెలువడిన 'వర్తమాన తరంగిణి'తో పత్రికాప్రపంచంలో సాహిత్య రంగానికి స్థానం కలిగింది. వర్తమాన తరంగిణికి ముందు వచ్చిన ' ది కర్నాటిక్ క్రానికల్', 'సత్యదూత', 'వృత్తాంతిని', పత్రికల్లో సాహిత్యానికి ఏమాత్రం ప్రాముఖ్యం ఇవ్వలేదని అర్థమవుతోంది. ''వృత్తాంతిని లో సాహిత్యం ఊసే లేదు. వర్తమాన తరంగిణిలో సాహిత్య విషయాలు కూడా ప్రచురించడం మొదలైంది.''[1] 1842లో మాత్రమే పత్రికారంగానికి సాహిత్య రంగానికి మధ్య అనుసంధానం ఏర్పడింది. వర్తమాన తరంగిణి తొలి సంచికలో కావ్యప్రబంధాల శతకాల పట్టిక ఉంది. చిన్నయసూరి లాంటి మహా విద్వాంసులు ఈ పత్రికలో సంపాదకీయాలు రాసేవారు. వర్తమాన తరంగిణి లోనే మహాభారత సంపూర్ణ ముద్రణ ఆరంభమైంది. అప్పటివరకూ సాహిత్య చర్చ అంటే పద్యతాత్పర్యం, పదార్థ చర్చల వరకే పరిమితమయ్యేది. వ్యాకరణ విషయాలు, అలంకారాలు కూడా చర్చకు వచ్చేవి.

పూర్తిగా సారస్వత విషయాలకు పరిమితమైన మొట్టమొదటి పత్రిక 'సుజనరంజని' అని పరిశోధకులు గుర్తించారు. 1862-67 ల మధ్య వెలువడిన ఈ పత్రిక నిర్వాహకులు కూడా తెలుగు పండితులే. చిన్నయసూరి తమ రచనలను టీకాటిప్పణి ద్వారా అందులో ప్రచురించారు. మనుచరిత్ర లాంటి గ్రంథాలకు, భాస్కరరామాయణానికి కూడా లఘుటిప్పణి, చిన్నయసూరి నీతిచంద్రిక లఘుటిప్పణి 'సుజనరంజని' ద్వారానే ప్రచురితమయ్యాయి. అయితే ఆనాటి పత్రికల్ని కేవలం సాహిత్య పరులు, పండితులే ప్రోత్సహించేవారనడానికి కొన్ని ఆధారాలు దొరుకుతున్నాయి. సుజనరంజని, ఆంధ్రభాషా సంజీవని, అముద్రిత గ్రంథ చింతామణి లాంటి పత్రికలు వీటికి ఉదాహరణలు. ఈ పత్రికల్లో భాషకు ఎక్కువ ప్రాధాన్యం వుండేది. వివేకవర్ధని పత్రికలో వీరేశలింగం గారు ఈ పత్రికల గురించి రాస్తూ, '' కేవల సాహిత్యపరులు వృత్తాంత పత్రికాలేఖనకు పూనుకొనుట వలన వారి వ్రాత యందు గూఢపదములును, దీర్ఘసమాసనులను, క్లిష్టార్థ వాక్యములును, యమకాదులను తప్ప ఉపయుక్త విషయములంతగా కానరాకున్నవి.''[2] అంటే దీన్ని బట్టి సమకాలీనంగా ఉన్న సాహిత్య భాషా వివాదాలు తెలుగుపత్రికలపై ఎలాంటి ప్రభావాన్ని చూపించాయో కూడా అర్థమవుతోంది.

తెలుగు పత్రికల్లో భాష, ప్రయోగం, గ్రాంథికం నుండి వ్యవహారికానికి

మళ్లుతున్నకొద్దీ సామాజిక రంగాల మీద దృష్టి పెరగడం కనిపిస్తుంది. తెలుగు పత్రికారచన సంక్లిష్ట సమాసాలతో నిండి సామాన్యుడికి కొరకరాని కొయ్యగా మారిన స్థితిలో 1872లో ఉమారంగనాయకులు ప్రారంభించిన పురుషార్థప్రదాయిని పత్రిక వాడుకభాషను స్వీకరించి ఎక్కువ మంది పాఠకులను సంపాదించుకోగలిగింది. ఈ మార్పు వల్ల పత్రికలు పండితుల గుప్పెట నుండి బయటపడ్డాయి. అంటే తెలుగు పత్రికల నిర్దిష్టమైన సాహిత్య సేవ పురుషార్థప్రదాయినితో ప్రారంభమైంది. పురుషార్థప్రదాయిని సాహిత్య భాషాపరంగా తీసుకొచ్చిన మార్పులు కూడా విశేషమైనవి. పద్యకావ్యాల మాదిరిగా వుండే పత్రికా రచనల వల్ల ప్రయోజనం లేదని పురుషార్థప్రదాయిని మొదటి సంపుటి ఏడవ సంచికలో సంపాదకులు రాసిన వ్యాఖ్య ఈ సందర్భంగా గుర్తించదగింది. దాదాపు ఇరవై సంవత్సరాలు నడచిన ఈ పత్రిక అన్ని శాఖల్లోనూ సాహిత్యం విరివిగా వృద్ధి పొందాలనే ఆశయంతో పనిచేసింది. మహాభారత టిప్పణి, పుస్తకవిమర్శలు ఇందులో ఉండేవి. అయితే 1875 నుండి పదేళ్లపాటు నడిచిన జనవినోదిని మరో అడుగు ముందుకేసి బాలసాహిత్యాన్ని కూడా వెలుగులోకి తీసుకువచ్చింది. ఇదే సమయంలో ప్రాచీనప్రబంధాలు ప్రచురించడమే ప్రధాన లక్ష్యంగా గురజాడ శ్రీరామమూర్తి సంపాదకత్వంలో ప్రబంధకల్పవల్లి వెలువడింది. సకల విద్యాభివర్ధని, సుజనరంజని లాంటి పత్రికలు సగంలోనే నిలిపివేసిన కవి జీవితాల వివరాల్ని ప్రబంధకల్పవల్లి ప్రచురించింది. హిందూజన సంస్కారిణి అనే మరో పత్రికలో పుస్తకపరిచయాలను విశేషంగా ప్రచురించేవారు. పుస్తక సమీక్షకు సంబంధించినంతవరకూ ఒక పద్ధతిని స్థిరపరిచిన పత్రిక ఇదే. అప్పటినుండి ఒక అర్ధ శతాబ్ది వరకు నడిచిన వివిధ సాహిత్య పత్రికల్లో సాహిత్యేతర విషయాలు కూడా ఉండేవి. కానీ పూర్తిగా సాహిత్యానికే నిబద్ధత వహించిన పత్రిక అముద్రిత గ్రంథ చింతామణి. సాహిత్య విమర్శకు సంబంధించినంతవరకు ఈ పత్రికకు ఎంతో ప్రాధాన్యముంది. ముఖ్యంగా అప్పటివరకు తెలుగు సాహిత్యానికి అందనంత దూరంలో ఉన్న పాశ్చాత్య సాహిత్య విమర్శ ధోరణులను ఈ పత్రిక పరిచయం చేసింది. ఆధునిక తెలుగు సాహిత్యానికి మూలస్తంభాలు అనదగిన రచయితలంతా ఈ పత్రికలో రాసినవారే. వీటితోపాటు విమర్శవ్యాసాలతో పాటు ఈ పత్రికలో జరిగిన చర్చలు వాదోపవాదాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు 19 వ శతాబ్ది చివరి పాదపు సాహిత్య మార్గదర్శకంగా నిలబడ్డాయి. పేరును బట్టి దీని లక్ష్యాన్ని గుర్తించవచ్చు. అముద్రిత గ్రంథాలన్నింటిని సేకరించి ఈ పత్రికలో ప్రచురించటమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నారు.[3] ఈ పత్రిక నెల్లూరు నుంచి పూండ్లరామకృష్ణయ్యగారి సంపాదకత్వంలో వెలువడేది. ఈ పత్రికలో ఆనాటి మహోద్దండ పండితులంతా మహాభినివేశంతో చర్చలు జరిపేవారనేది సత్యం. మండపాక పార్వతీశ్వరశాస్త్రి, వేదం వెంకటరాయశాస్త్రి, నడకుదుటి వీరరాజ పంతులు మొదలైన పండితులంతా అముద్రిత గ్రంథ చింతామణిలో చర్చలు జరిపేవారు. దీనిలో ప్రాచీన గ్రంథ ప్రచురణం, సమకాలీన రచన ప్రచురణం, భాషాసాహిత్యాల చర్చ, మెట్రిక్యులేషన్ మొదలు ఎం.ఎ., వరకు పాఠ్య గ్రంథాల ప్రచురణ, కవుల నిర్యాణ వార్తలు, కవిపండితుల

ఉత్తర ప్రత్యుత్తరాలు, గ్రంథ సమీక్షలు వివిధ శీర్షికా విభాగాలుగా వచ్చేవి. ఈ పత్రికలో ప్రచురించిన సాహిత్య లేఖలు తర్వాత కాలంలో 'అముద్రిత గ్రంథ చింతామణి లేఖలు' అన్న పేరుతో పుస్తకరూపంగా వెలువడ్డాయి. ఈ ఉత్తర ప్రత్యుత్తరాలు 19 వ శతాబ్ది చివరిపాదపు సాహిత్యానికి కరదీపికలు. ఈ పత్రిక 1885 నుండి 1904 వరకు ఆంధ్ర సాహిత్య రంగాన్ని ఏకచ్ఛత్రంగా ఏలిందని చెప్పవచ్చు. కన్యాశుల్కం నాటకాన్ని ఈ పత్రికాసంపాదకులు ఇతర సాహిత్యవేత్తలందరూ కలిసి సమష్టిగా సమీక్షించడమనే కొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. చాటు పద్యాలను ప్రచురించిన తొలి పత్రిక ఇదే.

అముద్రిత గ్రంథ చింతామణి ప్రాచీన గ్రంథాలను ముద్రించడంతో సమకాలిక పత్రికలు మరికొన్ని ఈ పనికి పూనుకున్నాయి. వాటన్నింటిలో పేర్కొనదగింది న్యాపతి సుబ్బారావు పంతులు గారి ఆధ్వర్యంలో రాజమండ్రి నుండి వెలువడిన 'చింతామణి'. ఈ పత్రిక ప్రాచీన కావ్యాలైన విజ్ఞానేశ్వరీయం, భోజరాజీయం, వరాహపురాణం, మొల్ల రామాయణం, ప్రభావతీ ప్రద్యుమ్నం మొదలగు వాటిని ప్రచురించింది. 1890 నుండి 1894 వరకు కేవలం నాలుగేళ్లు మాత్రం ఇది నడిచింది. పత్రికా సాహిత్యంలో తెలుగు నవలా రచన పోటీలను తొలిసారిగా ప్రారంభించిన ఘనత చింతామణిదేనని చెప్పవచ్చు. అయితే ఆ రోజుల్లో ఈ ప్రక్రియకు నవల అన్నపేరు రూఢి కాలేదు. దీనిని వచన ప్రబంధమని వ్యవహరించేవారు. నవలా పోటీలు నిర్వహించి , ఉత్తమ నవలలుగా ఎంపికైన వాటికి బహుమతులివ్వటం అనే సాంప్రదాయాన్ని మొదటగా ఏర్పరచింది చింతామణి పత్రికే. మొదటి బహుమతి పొందిన నవలకు 75 రూపాయలు, రెండవ బహుమతికి 50 రూపాయలు నిర్వాహకులు ప్రకటించారు. 1893లో జరిగిన తొలి నవలా పోటీలకు వావిలాల వాసుదేవశాస్త్రి, కందుకూరి వీరేశలింగంలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీ నవలల బహుమాన నిర్ణయాన్ని 1893 జూలై సం.3,సం.1లో ప్రకటించారు. అప్పుడు మొదట బహుమానం ఖండవల్లి రామచంద్రుడు గారి ధర్మవతీ విలాసానికి, రెండవ బహుమానం తల్లాప్రగడ సూర్యనారాయణ గారి సంజీవరాయ చరితానికి వచ్చాయి.

ఇదే కాలంలో నెల్లూరు నుండి 1894-96లో శ్రీమద్వర్తమనా తరంగిణి అనే పత్రిక వెలువడింది. బెజవాడ బాలకృష్ణారెడ్డిగారు దీని సంపాదకులు. ఈ పత్రికకు బెజవాడ గోపాలరెడ్డి తండ్రిగారైన బెజవాడ పట్టాభిరామిరెడ్డిగారు మేనేజరు. శ్రీమద్వర్తమాన తరంగిణిలోని ఒక సంచికలో కందుకూరి వీరేశలింగం ముత్తాతల గురించి రాసిన వాక్యాలు బహుపసందుగా ఉన్నాయి. [4] బెజవాడ పట్టాభిరామిరెడ్డిగారే ఈ రచన చేశారు. ఆ కాలం నాటి నెల్లూరు ప్రాంత విశేషాలు, కవులు, వారి పాండిత్యం మొదలైన విషయాలన్నీ ఈ పత్రికద్వారా తెలుస్తాయి.

ఇక 1894-99ల మధ్యకాలంలో మద్రాసు నుండి వెలువడిన 'శ్రీ వైజయంతి' అన్న సాహిత్య పత్రిక కూడా ఆనాటి పండితుల మన్ననలు పొందింది. దీని సంపాదకులు

ఆ కాలంలో (1891) జాతీయ కాంగ్రెసు మహాసభకు అధ్యక్షులుగా పనిచేసిన పనప్పాకం అనంతాచార్యులు గారు. విద్యావిషయవ్యాసాలు, పురాతన గ్రంథాల గుణగణాలపై చర్చలు, అముద్రితాలైన పూర్వకృతులు నవీన కావ్యాలు, ఆధునిక గ్రంథ విమర్శనలు అన్నింటిని ఈ పత్రికలో ప్రచురించేవారు. ప్రఖ్యాత సంస్కృతాంధ్ర పండితులు మానవల్లి రామకృష్ణకవి గారు వైజయంతిలో సమీక్షలు చేసేవారు. వీరేశలింగం కవుల చరిత్ర ద్వితీయ భాగాన్ని 1895 ఏప్రిల్ సంచికలో రామకృష్ణకవి గారే సమీక్షించారు. 1897 లో ఉత్తర హరివంశం విశేషాలపై మొదటిసారిగా ఆయన వ్యాసం రాశారు. రామకృష్ణకవి గారి మృగావతి అన్న మహాకావ్యం వైజయంతిలోనే ఆ రోజుల్లో ధారావాహికంగా అచ్చయింది. కొక్కొండ వేంకట రత్నం పంతులుగారి ప్రసన్న రాఘవం కూడా ఇందులో ప్రచురించారు.

తెలుగుపత్రికల్లో తొలి మహిళా మాసపత్రిక 'బాలిక' కూడా ఆ రోజుల్లోనే వచ్చింది. దీని సంపాదకులు సంగీతరావు బాపిరాజు. ఇది 1895 ప్రాంతాన వెలువడింది. బాలిక పత్రికలో ఆ రోజుల్లో మహిళలు రాసిన అనేక వ్యాసాలు, కవితలు ప్రచురింపబడుతుండేవి. ప్రముఖ కవిశేఖరులు మల్లాది వెంకటరత్నం గారు ప్రారంభించిన పత్రిక 'తెలుగు జనానా'. 1893 నుండి 1906 వరకు దాదాపు పన్నెండు, పదమూడు సంవత్సరాలు నడిచిన సాహిత్య పత్రిక ఇది. తదనంతర కాలంలో రాయసం వెంకటశివుడు సంపాదక బాధ్యతలు నిర్వహించారు. వీరేశలింగం, వావిలాల వాసుదేవశాస్త్రిగార్లు దీనిలో రచనలు చేసేవారు. చెన్నపురి రాజధాని నుండి ఈ పత్రిక వెలువడేది. ఈ పత్రికలన్నీ 19వ శతాబ్ది చివరలో వచ్చినవన్నది చారిత్రక సత్యం. ఇదే కాలంలో మద్రాసు నుండి గట్టుపల్లి శేషాచార్యుల గారి ఆధ్వర్యంలో 'శశిరేఖ' అన్న వారపత్రిక వెలువడింది. సాహిత్యవేత్తల జీవిత ఘన చరిత్రల గురించి ఇందులో ప్రచురించేవారు.

ఆనాటి రోజుల్లో అప్రతిహతంగా పురోగమిస్తున్న జాతీయోద్యమాన్ని ప్రతిబింబించడం కోసం 1888లో దేశభక్తులైన నవ యువకులు 'ఆంధ్రప్రకాశిక' అన్న వారపత్రిక ప్రారంభించారు. దీనికి అప్పట్లో ప్రముఖ కాంగ్రెసువాది, దేశభక్తుడు, సాహితీవేత్త అయిన ఎ.సి.పార్థసారథి నాయుడు గారు సంపాదకులుగా వుండేవారు. ఆయన 25 సంవత్సరాలు ఈ పత్రికకు సంపాదకులుగా ఉన్నారు. నాలుగుదశాబ్దాల పాటు ఈ సాహిత్యసేవ చేసింది. 'ఆంధ్రప్రకాశిక' ప్రారంభమైన కాలంలోనే మద్రాసు నుండి సుప్రసిద్ధ వచన రచయిత ఓ.వి. దొరస్వామయ్య గారి సంపాదకత్వాన సత్త్వసాధని (1899-1905) పత్రిక వెలువడింది. దొరస్వామయ్య గారు తమిళంలో విద్వాంసుడు కనుక తమిళ రాయనారుల కథలను, వేదాంత విషయాలను దీనిలో ప్రచురించేవారు. మల్లంపల్లి భైరవశర్మ గారి సంపాదకత్వాన వెలువడిన 'రత్నాకరం'(1899-1902), పోలవరం జమీందారు రాజా కొచ్చెర్లకోట రామచంద్ర వెంకట కృష్ణారావు సంపాదకత్వాన రాజమండ్రి నుంచి వెలువడిన 'సరస్వతి' (1898-1912) , లక్కవరం జమీందారు

రాజా మంత్రిప్రగడ భుజంగరావు గారి సంపాదకత్వాన ఏలూరు నుంచి వెలువడిన 'మంజువాణి' (1898-1904) పరస్పరం పోటీలు పడి సాహిత్య సేవ చేశారని అనిపిస్తుంది. రత్నాకరంలో కోరాడ రామచంద్రశాస్త్రిగారి శాకుంతలానువాదం వెలువడింది. సరస్వతి పత్రికైతే తిరుపతి వెంకట కవుల్ని చాలా కాలం పోషించింది. ఈ పత్రిక అనేక కథల్ని జీవిత చరిత్రలను, నవలలను, నాటకాలను ప్రచురించింది. కొవ్వురాజు లక్ష్మణరావు గారుదీనిలో శివాజీ చరిత్రను ప్రచురించారు. సి.నరసింహరాయుడు గారు సర్ ఆర్థర్ కాటన్ చరిత్రను రచించారు. ఇక మంజువాణి పత్రిక తిరుపతి వేంకటకవులు వ్యావహారికంలోరాసిన 'పల్లెటూళ్ల పట్టుదలల్ని' ప్రచురించింది.

విజ్ఞానశాస్త్రానికే అంకితమైన పక్షపత్రిక విజ్ఞానవర్ధిని. 1894లో దీనిని రాయదుర్గం నుంచి యల్లమరాజు నారాయణమూర్తి ప్రచురించారు. కేవలం వ్యవసాయానికే అంకితమైన పత్రిక జ్ఞానోదయం (1893). దీనికి దాసు కేశవరావు గారు సంపాదకులు. వ్యవసాయం, గొడ్ల బాగు, వర్తకం, తోటల పెంపకం, కులాచారాలు,గెజిట్ ఆర్డర్లు, వినోదాలు, హాస్యాలుదీనిలో వుండేవి. అయితే కందుకూరి వారి 'వివేకవర్ధని'కి (1875) సమకాలికంగా వెలువడ్డ 'లోకరంజని'లో కూడా శాస్త్రీయ విషయాలు కొన్ని ప్రచురితమయ్యేవి. ఇది చెన్నపురి నుంచి వెలువడేది . సంపాదకులు కాకర్ల సుబ్బయ్యపంతులు. భూగోళశాస్త్ర విషయాలు. హాస్యకథలు, పరీక్షలకు అవసరమయ్యే టిప్పణులు ఈ పత్రికలో ప్రచురితమయ్యేవి. ఇవికాక 19 వ శతాబ్ది ఉత్తరార్థంలో దాసు శ్రీరామపండితుల 'అనల్పజల్పితాకల్పవల్లి' (1880), సి.గోపాలయ్య టీచరు(1888), నాదెళ్ల పురుషోత్తమకవి బుధవిధేయ (1880) క్రైస్తవమత ప్రచారం కోసం బళ్లారి నుంచివెలువడిన లూథరిన్ (1891), సత్తిరాజు సీతారామయ్య సంపాదకత్వంలో ఏలూరు నుంచి వెలువడ్డ లావర్తమాని, దేశోపకారి పత్రికలు, జనమంచి శేషాదిశర్మ గారి సంపాదకత్వాన నెల్లూరు నుంచి వెలువడ్డ ఆనందదాయిని (1889) ముఖ్యంగా పేర్కొనదగినవి. సామాజిక సాహిత్య రంగాలకు ఈ పత్రికలు చేసిన సేవ ఎంతో ప్రాముఖ్యత వహిస్తుంది. కొమాండూరు వేంకట రామానుజ శర్మ సంపాదకత్వాన నెల్లూరు నుండి వెలువడిన వాగ్వల్లి (1899-1903) , మహామహోపాధ్యాయ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి సంపాదకత్వంలో రాజమండ్రి నుంచి వచ్చిన కళావతి (1900) గొప్ప సాహిత్య సేవ చేశాయి.

సాహిత్యంతో పాటు విజ్ఞాన విషయాలను విరివిగా ప్రచురించిన పత్రిక 'కల్పలత'. దీని సంపాదకులు మహోపాధ్యాయ అచంట సాంఖ్యాయనశర్మ గారు. దీనిలోని వ్యాసాలన్నీ ఆయన వ్రాసేవారు. వెలువడిన 30 సంచికలు కూడా అమూల్యమైనవి. ఆధునిక రూపరేఖలతో కథానికలను, ఆధునిక కవితలను ప్రచురించిన తొలిపత్రిక ఇదే. చాటువులను ఇది విరివిగా ప్రచురించింది. ప్రాచీన తెలుగు సాహిత్యం నుండి వైజ్ఞానిక విషయాలను ఏర్చికూర్చేవారు దీని సంపాదకులు. ఇందులో వచ్చి ఒక కథే

తొలి తొలుగు కథానిక అన్న అభిప్రాయం కూడా ఉంది. ఈ కథ పేరు లలిత. రచయిత సాంఖ్యాయన శర్మగారు. ఆయనే ఈ పత్రిక ద్వారా సాహిత్య ప్రతిభా పాటవ పరీక్షలు కూడా నిర్వహించేవారు. వేంకట పార్వతీశ్వర జంటకవులు ఈ పత్రికద్వారానే ప్రభవించారు. ఇది 1903 నుచి 1905 వరకు, 1927లోను వెలువడింది. సాంఖ్యాయనశర్మగారు రాసిన కవితలన్నీ ఆసక్తికరంగా కొత్తమార్గంగా నడిపించేట్లుగా ఉండేవి. ఇక్కడివరకుతెలుగు పత్రికల సాహిత్యసేవలో ఒక అధ్యాయానికి తెరపడినట్లే. ఈ కాలంలో వచ్చిన ప్రతీ పత్రికా ప్రాచీన కావ్యాలను ప్రచురించేది. సాహిత్య విమర్శకు సంబంధించినంతవరకు భాషావిమర్శ తప్ప ఇతర ప్రక్రియలకు సంబంధించిన లోతైన చర్చలు ఏవీ జరిగేవి కావు. ఈ శతాబ్దంలో ప్రధానంగా కనిపించే లక్షణం పండితులు పత్రికలు నిర్వహించడం. ఈ పండితులకు సాహిత్యచర్చలు, సాహిత్య విమర్శ అంటే సి.పి. బ్రౌన్ చూపించిన మార్గం ఒక్కటే కనిపించింది. ఈ రకంగా ప్రాచీన కావ్యాల పరిష్కరణ చాలావరకు పూర్తయింది. పాఠపరిష్కరణపైన చర్చలు, విమర్శలు, ప్రతివిమర్శలు జరిగేవి. పద ప్రయోగ ఔచిత్యం, శబ్దచర్చ వ్యాకరణ విధేయత ఇవన్నీ సాహిత్య చర్చనీయాంశాలుగా ఉండేవి.

## *ii.* ప్రారంభ దశలో వివిధ పత్రికలు

అయితే 20 వ శతాబ్ది ప్రారంభంతోనే పత్రికల రూపురేఖలు మారిపోతాయి. కొత్త సాహిత్య విలువలతో వెలువడిన తొలి సాహిత్య పత్రిక 'ఆంధ్రభారతి'. ఈ పత్రికలో కొన్నివర్గాలకు, వాదాలకు చెందిన రచయితలకు సమప్రాధాన్యముంది. గురజాడ అప్పారావు 'దిద్దుబాటు' కథానిక ఇందులోనే వెలువడింది. వివిధ సాహిత్య ప్రక్రియలపై విమర్శనాత్మక వ్యాసాలు వెలువరించిన పత్రిక ఇది. ఈ కాలంలోనే ఆంధ్ర సాహిత్య పరిషత్ పత్రిక వెలువడింది. 1940 వరకు వెలువడిన ఈ పత్రిక భాషా సాహిత్య పరిశోధనా వ్యాసాలకు ప్రాధాన్యమిచ్చేది. పూర్తిగా సాహిత్య వారపత్రికగా వావిళ్ల సంస్థవారు త్రిలింగ అనే పత్రికను 40 సంవత్సరాల పాటు నడిపారు. గ్రంథ ప్రచురణ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన వావిళ్ల సంస్థ నిర్వహించిన ఈ పత్రికకు భాషా వాఙ్మయ సాంస్కృతిక రంగంలో విశేషమైన ప్రాధాన్యం దక్కింది.

అచ్చు సంస్కృతి వ్యాపిస్తున్న ఈ కాలంలోనే వ్యావహారిక భాషావాదం ఒక ఉద్యమంగా వేళ్లూనుంది. కొన్ని పత్రికలు వ్యావహారిక భాషను సమర్థిస్తే మరికొన్ని పత్రికలు వ్యతిరేకించాయి. 1919లో సెప్టెంబరు నెలలో వెలువడిన 'తెలుగు' పత్రికకు ఈ రకమైన చారిత్రక నేపథ్యముంది. కందుకూరి వీరేశలింగం గారి ఆధ్వర్యంలో ఏర్పడిన 'వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజమే' ఈ 'తెలుగు' పత్రికకు పునాది. గిడుగు రామమూర్తి పంతులు గారి సంపాదకత్వంలో వెలువడిన తెలుగు పత్రిక

కొద్దికాలంలోనే ఆంధ్ర దేశంలో ప్రతీ పట్టణానికీ, పల్లెకు విస్తరించిందంటే దీని వెనుక ఉన్న కృషిని అర్థం చేసుకోవచ్చు. రామమూర్తి పంతులుగారు యావదాంధ్ర ప్రాంతంలో స్వయంగా పర్యటించి సేకరించిన ఆంధ్ర వ్యవహార సమాచారాన్ని ఈ పత్రికలో ప్రచురించేవారు. ఈ పత్రికలో మొట్టమొదట చర్చించిన విషయం వ్యావహారిక భాష గురించే.[5] వ్యవహారభాషా ప్రవృత్తి, దాని ఉపయోగాలు, దాని గౌరవం, దానిని ఉపేక్షించడం వల్ల దేశానికి కలుగుతూ వున్న నష్టాల గురించి ఈ పత్రిక చేసిన ప్రచారం అద్భుతమైన ఆధునిక భాషాసేవగా మిగిలిందని చెప్పవచ్చు. కేవలం ఒక సంవత్సరం పాటు నడిచిన ఈ పత్రిక ఆంధ్ర సాహిత్యలోకంలో తీసుకువచ్చిన మార్పు అత్యంత ప్రశంసనీయం. ఆ తరువాతి కాలంలో తెలుగు పత్రికను చదివి ఉత్సాహవంతులైన యువకులు తరువాతి కాలంలో సాహితి సమితి స్థాపించారు. సాహితి సమితి యువకులు స్థాపించిన 'సాహితి' పత్రికే అనంతర కాలంలో అనేక వ్యావహారిక రచనలకు స్థానం కల్పించింది.

దీని తరువాతి రోజుల్లో కృష్ణాజిల్లా ముక్త్యాల నుండి పండితుల ఆధ్వర్యంలో 'ముక్త్యాల సరస్వతి' సాహిత్య పత్రిక వెలువడింది. రచయిత, విద్వాంసులు అయిన ముక్త్యాల రాజా వాసిరెడ్డి సదాశివేశ్వర ప్రసాద్ బహద్దూర్ గారి సంపాదకత్వంలో 1923-28 ల మధ్యవెలువడిన ఈ పత్రిక ప్రధానంగా ప్రాచీన కావ్య ప్రబంధాల ప్రచురణకు ఉద్దేశించినట్టిదే. సుప్రసిద్ధ పరిశోధక విద్వత్కవులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారే ఈ 'ముక్త్యాల సరస్వతి'లో నసికేతోపాఖ్యానము, ఉద్భటారాధ్యచరిత్ర, చారుచర్య, వైద్యగ్రంథ సముచ్చయం మొదలైన వాటిని సంస్కరించి ప్రచురించారు. క్షేమేంద్రుడు రాసిన అవధాన కల్పలతను రాజావారే అనువదించి వరుసగా ప్రచురించేవారు.

ఇదేకాలంలో 1921లో సుమారు రెండేళ్లపాటు అక్కిరాజు ఉమాకాన్త విద్యాశేఖరులు ఆధ్వర్యంలో వెలువడిన తెలుగు దేశ వాఙ్మయపత్రిక చాలామందికి తెలియకపోయినా అనేక సాహిత్య వ్యాసాలు ఇందులో ప్రచురించబడ్డాయి. మద్రాసులోని తిరువల్లిక్కేణి నుంచి ఈపత్రిక వెలువడేది. తెలుగుదేశపు వాఙ్మయ సమితిని ఆయన తెలంగాణా లిటరేచర్ అసోసియేషన్ అని ఇంగ్లీషులో సమానార్థకంగా ప్రతిపాదన చేయడం చూస్తే మొత్తం తెలుగునాడును ఆయన తెలంగాణాగా భావించడం స్పష్టమవుతోంది. కొమర్రాజు లక్ష్మణరావుగారు, మేడేపల్లి వేంకట రమణాచార్యుల వంటి గొప్ప విద్వాంసులు, పరిశోధకులు ఈ పత్రికలో రచనలు చేసేవారు. డాక్టరు కట్టమంచి రామలింగారెడ్డిగారి మహాభారతంపై గోఖలే హాలులో చేసిన ప్రసంగాన్ని ఉమాకాన్త విద్యాశేఖరుల వారు తన సహజమైన భారతీయ దృక్పథంలో ఈ పత్రికలోచేసిన విమర్శ అప్పట్లో పెద్ద వివాదాంశంగా మారింది.

కాకినాడలో 1923లో అఖిల భారత కాంగ్రెసుమహాసభ జరగడం తెలుగునాట పెక్కునూతన ప్రక్రియలకు నాంది పలికిందని చెప్పవచ్చు. ఈ సభ వల్లే దేశంలోని

వివిధ సాహితీవేత్తలతో మనవారికి గట్టిసంబంధాలే ఏర్పడ్డాయి. డైజెస్టు లాంటి పత్రిక దేశంలోని అన్నితెలుగు ప్రాంతాల వారి కోసం ఒకటి అవసరమనే భావన అందరిలో ఏర్పడింది. ఈ భావన ఫలితంగానే 'ఆంధ్ర సర్వస్వం', సారస్వత సర్వం' అనే పత్రికలు వెలువడ్డాయి. 'ఆంధ్ర సర్వస్వం' అనే పత్రిక 1924లో రాజమండ్రి నుండి ఏడిద వెంకటరావుగారి సంపాదకత్వాన వెలువడి వరుసగా రెండు సంవత్సరాల నడిచింది. దీని ముఖచిత్రం పైన An Illustrated Monthly Telugu Magazine Published to Depict Andhra henius అని ఆంగ్లంలో వుండేది. ''ఆంధ్రుల పూర్వ , ఆధునిక మత, సాంఘిక, రాజకీయ, ఆర్థిక, సారస్వత కళా పద్ధతులను గూర్చి వ్రాసిన స్వతంత్ర వ్యాసములు సత్కారింపబడును'' అని తెలుగులోను, ఆంగ్లంలోనూ ఉండేది. నిడదవోలు వెంకటరావుగారు, మల్లాది సూర్యనారాయణ శాస్త్రి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, పులుగుర్తి లక్ష్మీ నరసమాంబ తదితరులు దీనిలో వ్యాసాలు రాస్తూ ఉండేవారు. శ్రీమాన్ బహుజనపల్లి సీతారామాచార్యుల వారి జీవితంపై నిడదవోలువారు ఆ కాలంలోరాసిన ఇందులోని వ్యాసం పేర్కొనదగినది. చిలుకూరి నారాయణరావు లాంటి వారు విశాలాంధ్ర కోసం కన్నకలలు కవితలుగా ఇందులో ప్రచురించబడ్డాయి.

సరిగ్గా ఇదే కాలంలో అంటే 1924లో ఏలూరిపాటి రామభద్రచయనులు గారి సంపాదకత్వాన సారస్వత సర్వస్వం అనే సాహిత్య పత్రిక వెలువడింది. చిలుకూరి నారాయణరావుగారు, జనమంచి శేషాద్రిశర్మ గారు వంటి ప్రముఖులు దీనిలో రాసేవారు. ఇది కూడా రెండేళ్లు మించి రాలేదు. ప్రసిద్ధులు శ్రీ వేదం వెంకటరాయశాస్త్రి గారిపై ఆచార్య గిడుగురామమూర్తి పంతులు చేసిన 'మిధ్యాపవాదం' అన్న విమర్శ అప్పట్లో ఇందులోనే వచ్చింది.

తెలుగు కథాచక్రవర్తి, విమర్శకులు, సాహిత్య శిరోమణి శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి సంపాదకత్వంలో రాజమండ్రి నుంచి వెలువడిన 'ప్రబుద్ధాంధ్ర' పత్రిక అప్పట్లో (1924-36) తెలుగుదేశంలో ఒక కొత్త మార్పుకు నాంది పలికింది. గిడుగురామమూర్తి పంతులుగారి వ్యవహార భాషావాదాన్ని నూరుపాళ్లు సమర్థిస్తూ ఉద్యమ కరదీపికలా ఈ పత్రిక నడిచింది. తెలుగు కథాసాహిత్యాన్ని కొత్త పుంతలు తొక్కించిన శ్రీపాద వారి అపూర్వమైన కథలెన్నో ఇందులో వెలువడ్డాయి. శాస్త్రిగారికి హిందీ అన్నా, కాంగ్రెసు అన్నా, ఖద్దరన్నా అసలే గిట్టేది కాదు. 'హిందీ వల్ల తెలుగుకు జరుగుతున్న అపకారం' అన్న శీర్షిక ఈ పత్రికలో వుందంటే, అదీన్నూ శాస్త్రిగారే ఆ శీర్షికను నిర్వహించేవారంటే, ఆశ్చర్యం వేయకమానదు. వేమన జయంతి ఎప్పుడన్న అంశంపై రేగిన వివాదంపై శ్రీపాద వారు చేసిన సూచనలతో కూడిన సంపాదకీయం ఆ కాలంలో రెడ్డిసభ వారికి గొప్ప చురకలేవేసింది. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి పంతులు ప్రబుద్ధాంధ్రలో వ్యవహారవాదానికి ఈ పత్రిక చేస్తున్న అనన్య సేవా నిరతిని గురించి ప్రశంసించారు.[6] ప్రబుద్ధాంధ్ర పత్రికను ఎదుర్కొనేందుకు శ్రీపాద కృష్ణమూర్తి

శాస్త్రిగారు 1925 జనవరి నుంచి గ్రాంథికాంధ్ర వేదికగా 'వజ్రాయుధము' అనే పత్రికను వెలువరించారు. ఈ పత్రిక రెండో సంచికలో 'గ్రామ్యాచార్యులు' అనే పేరుతో గిడుగు వారిని నిందిస్తూ వ్యాసం వ్రాశారు. భాషదగవు పండిత పరిషత్తు తీర్చాలని, కొందరు పండితులతో పరిషత్తు ఏర్పరచాలని గిడుగువారు సవాలు చేస్తే, దానికి శ్రీపాద వారు నలుగురు చాలరని,, ఇరవై అయిదు మంది ఉండాలని ప్రకటించారు.[7]

ఇదే కాలంలో అంటే 1924-32 ల మధ్య రెడ్లు అంతా కలిసి రెడ్డిరాణి అనే పత్రిక నెలకొల్పారు. దీనిని మల్లిడి సత్తిరెడ్డిగారు తూర్పుగోదావరి జిల్లా రాయవరం నుంచి ప్రచురించేవారు. రెడ్డిరాజుల చరిత్రకు సంబంధించిన పెక్కు శాసనాల మొదలైనవాటిని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు దీనిలో ప్రకటించారు.

ప్రసిద్ధ పండితులు శ్రీ పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఈ పత్రికలో భారతానువాద సమస్యలు చర్చించారు. మల్లంపల్లి సోమశేఖరశర్మగారు రెడ్డిరాజుల చరిత్రకు సంబంధించిన రచనలు చేశారు. దీని తొలిసంచిక 1923 అక్టోబరులో వెలువడింది.

ప్రముఖ న్యాయవాది, మాజీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, శ్రీ పాకాల రాజమన్నారు కళకుసేవ చేయాలనే ఉద్దేశంతో 'కళ' అనే పత్రికను మద్రాసు నుంచి ప్రచురించారు. దీనిలోమానవల్లి రామకృష్ణకవి, కొమర్రాజు లక్ష్మణరావు వంటి పండిత పరిశోధకులు రచనలు చేసేవారు. దీనికి కూడా వేటూరి ప్రభాకరశాస్త్రి పరోక్ష సంపాదకులు. ఈ కాలంలోనే మద్రాసు నుంచి విశ్వనాథ సత్యానారాయణ, బాపిరాజు, కోలవెన్ను రామకోటేశ్వరరావు ప్రభృతుల నిర్వహణలో జయంతి పత్రిక వెలువడింది. పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి గారి వంటి ప్రముఖ పండితులు ఈ పత్రికలో నిఘంటు రచనా పరామర్శలు వంటి ప్రసిద్ధ వ్యాసాలెన్నో ప్రచురించారు.

నవ్య సాహిత్య పరిషత్తు వారి సఖి పత్రిక కూడా ఈ శతాబ్ది మూడో దశకంలో రెండేళ్లు వచ్చి ఆగిపోయింది. 1920 నాటికే నవ్య సాహిత్య ప్రచారం కోసం తల్లావఝుల శివశంకరశాస్త్రి, తిపురారిభట్ల వీరరాఘవస్వామి, కొడాలి ఆంజనేయులు, ప్రభృతులు సాహితీ పత్రికను ప్రారంభించారు. విశ్వనాథ, మునిమాణిక్యం, చింతా, నాయని, చలం రచనలు సాహితిలో చోటు చేసుకున్నాయి.

1920లో ఆంధ్రప్రదేశ్‌లోని తాడిపత్రికి వచ్చి ప్రసంగించిన మహాత్మాగాంధీ ప్రసంగాలకు ప్రభావితుడైన పప్పూరి రామాచార్యులు ఆ తరువాతికాలంలో 'పినాకిని' అనే పత్రికను 1922లో స్థాపించారు. ఆ తరువాత 1923లో శ్రీసాధన అనే పత్రికను ప్రారంభించారు. ఆయన కలచవీడు వెంకట రమణాచార్యులతో కలిసి 'హాస్యమంజూష' అనే గ్రంథం ప్రచురించారు. శ్రీసాధనలోనే 'విశ్వవినుత నామ వినుర రామ' అన్న మకుటంతో పద్యాలు రాసేవారు. ఈ పత్రికలో ఆయన రాసిన వదరుబోతు వ్యాసాలు విశేషప్రాచుర్యాన్ని పొందాయి. ఈ పత్రిక వజ్రోత్సవాన్ని జరుపుకుంది.

బెంగాలులో వెలువడుతున్న మోడర్న్ రివ్యూ లాంటి పత్రికల్ని ఆదర్శప్రాయంగా తీసుకుని శ్రీ కౌతా శ్రీరామశాస్త్రి గారు 'శారద' అనే మాసపత్రికను ప్రారంభించారు. ఇది బందరు నుండి 1922 సెప్టెంబరు నుంచి రెండున్నర సంవత్సరాలు వరుసగా వెలువడింది. అడవిబాపిరాజు లాంటి సాహితీవేత్తలు దీనిలో రచనలు చేసేవారు. బాపిరాజు గారి హిమబిందు నవల శారదలోనే మొదటిగా వచ్చింది.

1984లో వజ్రోత్సవాన్ని జరుపుకున్న గొప్ప సాహిత్య పత్రిక 'భారతి' మాసపత్రిక. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి యాజమాన్యాన గన్నవరపు సుబ్బరామయ్య గారి సంపాదకత్వంలో, అటు తర్వాత శివలెంక శంభుప్రసాద్ గారి సంపాదకత్వంలో వచ్చి, శివలెంక రాధాకృష్ణగారి సంపాదకత్వంలో మొన్నటివరకు నడిచింది. ఆంధ్రావళికి ఆరు దశాబ్దాలు నవరసోపేతమైన సాహిత్యపు విందులు అందించిన ఘనత 'భారతి'దే.

తెలుగు సాహిత్యానికే కాక సంస్కృత సాహిత్యానికి, చరిత్రకు, పురాతత్వానికి, శాసన పరిశోధనకు, విజ్ఞాన శాస్త్రానికి, సంఘ పురోగతికి మహిళాభ్యుదయానికి ఇలా అనేకరకాలుగా దేశపురోభివృద్ధికి సంబంధించిన సకల కార్యకలాపాలకు ఈ పత్రిక దోహదం చేసింది. నిడదవోలు వెంకటరావు గారు అన్నట్లు ఆంధ్రపత్రిక దినపత్రిక, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, భారతి, ఉగాది సంచికలపై ప్రత్యేక పరిశోధనలు చేసి సిద్ధాంత గ్రంథాలు వ్రాయవచ్చు.[8].

భారతి పత్రిక అన్నివర్గాల సాహిత్య వేత్తలను, అన్ని సిద్ధాంతాలరచనలను ప్రోత్సహించింది. చివరకు తనను విమర్శించిన వారి రచనలను సైతం ప్రచురించింది. 'భారతి' పత్రిక ఆరంభం వెనుక ఆసక్తికరమైన కథ ఒకటి ఉంది. సాహిత్య మాస పత్రికను ఒకదాన్ని ప్రారంభించాలని కాశీనాథుని నాగేశ్వరరావు గారు ఎప్పటినుంచో ఆలోచనలో ఉన్నారు. అప్పటికే ఆయన ఆంధ్రపత్రిక దిన పత్రిక, వారపత్రిక, ఉగాదిసంచికను నడుపుతున్నారు. ఈ ఆలోచనను తన స్నేహితులైన వేటూరి ప్రభాకరశాస్త్రి, పనప్పాకం అనంతాచార్యులు, వేపా రామేశం, టంగుటూరు ప్రకాశం గార్ల వంటి ప్రముఖులతో ఏర్పాటైన గోష్ఠులలో నాగేశ్వరరావు గారు ప్రస్తావించారు. వారు సైతం ఇచ్చిన ప్రోత్సాహం, వేటూరి వారి సిఫార్సుతో గన్నవరపు సుబ్బరామయ్య గారిని సంపాదకులుగా నియమించటం వెంట వెంటనే జరిగిపోయాయి. భారతి తొలి సంచిక ప్రభాకరుల 'శివకవులు' అనే తొలివ్యాసంతో వెలువడింది. భారతి ఆంధ్ర సంస్కృత సాహిత్యాలకు, చరిత్ర పురాతత్త్వ విజ్ఞానశాస్త్రాదులకు చేసిన సేవ అపూర్వం. 1924 నుండి 1990 వరకు అవిచ్ఛిన్నంగా నడచిన పత్రిక ఇది. తర్వాత కొంతకాలం మధ్యమధ్యలో కొన్ని సంచికలు వచ్చి ఆగిపోవటం జరిగింది.

ప్రభాకరులు ఈ పత్రికకు పరోక్షంగా సేవచేస్తూ అసంఖ్యాకంగా వ్యాసాలు రాశారు. కవితలు వ్రాశారు. దివ్యదర్శనం, కృతార్థుడు, కాళహస్తి- శివరాత్రి, సీతాఫలం, అమరావతీ శిల్పం మొదలైన కవితలు ఇందులోనే వెలువడ్డాయి. ప్రతిమానాటకం లాంటి

గొప్పనాటకం మొదలైనవి భారతిలో వచ్చినవే. భారతిలో పడిన వీరి పెక్కు వ్యాసాలు తర్వాత తెలుగు మెరుగులు, మీగడతరకలు, సింహావలోకనం మున్నగు సంపుటాలుగా వెలువడ్డాయి. ఈ కాలంలోనే ప్రభాకరులు బసవపురాణాన్ని ప్రామాణికమైన పీఠికతో ప్రచురించారు.

అదేకాలంలో డాక్టరు కె.ఎన్.కేసరి సంపాదకులుగా వెలువడిన గృహలక్ష్మి మహిళాభ్యుదయానికి ఎంతగానో దోహదం చేసిన పత్రిక. ఈ పత్రికలో రచనలు చేసి వెలుగులోకి వచ్చిన వారిలో కనుపర్తి వరలక్ష్మమ్మ లాంటి రచయిత్రులు ఎందరో ఉన్నారు. 'గృహలక్ష్మి కంకణం' అనే బహుమానంతో ప్రతిఏటా విదుషీమణులను, రచయిత్రులను ఈ పత్రిక సువర్ణకంకణాదులతో గౌరవించేది.

సుప్రసిద్ధ సంఘ సేవాసంస్కర్త, ఉత్తమ దేశభక్తురాలు గుమ్మడిదల దుర్గాబాయమ్మ గారు స్థాపించి రూపురేఖలు దిద్దిన ఆంధ్రమహిళాసభ పక్షాన 'ఆంధ్రమహిళ' అనే మాసపత్రిక కొన్నేళ్లు వచ్చింది. స్వాతంత్ర్యం రాకపూర్వం వెలువడ్డ సాహిత్య పత్రికలలో ముఖ్యంగా పేర్కొనవలసినవి ప్రతిభ, ఉదయిని, వీణ, జ్వాల, ఆంధ్రి, ఆంధ్రభూమి, మొదలైనపత్రికలు.

వేటూరి ప్రభాకరశాస్త్రి గారు చైతన్య సంప్రదాయానుయాయుల భేదాభేదవాదం లాగా పరోక్ష - ప్రత్యక్ష సంపాదకత్వం నిర్వహించిన పత్రిక 'ఆనందవాహిని'. మద్రాసులో ఆయన స్నేహితులుగా ఉన్న ఎస్.ఎస్. వాసన్ ఆధ్వర్యంలో వెలువడుతున్న ఆనందవికటన్ అనే తమిళ హాస్య మాసపత్రికకను చూసి వేటూరి ప్రభాకరశాస్త్రి గారు కూడా తెలుగులో అలాంటి పత్రిక నిర్వహించాలనుకున్నారు. దాని మొదటి సంచిక 1930 జనవరి ఒకటవ తేదీన వెలువడింది. దీని భాష శిష్టవ్యావహారికం. పండితుల దగ్గర్నుండి సామాన్య జనుల వరకూ అందరికీ అందుబాటులో ఉండేలా ఆ రోజుల్లో ఇంత సరళశైలిలో, హాస్యోక్తులతో, అడుగడుగునా చమత్కారాలతో నడిచిన ఏకైక పత్రిక ఆనందవాహిని. తొలి సంచికలోని 'స్వవిషయం' అన్న సంపాదకీయంలో వారు రాసిన సంపాదకీయ వ్యాఖ్యలను చదివితే పత్రిక మనోగతం మనకర్థమవుతుంది. ''హాస్యప్రధానంగా ఈ పత్రిక ఉంటుంది. ఇందులో ఎవరినీ నిందించడం ఉండదు. ఎప్పటికప్పుడు లోకంలో స్వదేశంలో జరుగుతూ ఉండే అపూర్వ విషయాలే ఇందులో నవ్వులాటతో వెల్లడించడమౌను. చిన్న చిన్న కథలు, కబుర్లు, మంచిమాటలు, పాటలు పదాలు, పద్యాలు ప్రకటిస్తాము. ఇది కాంగ్రెసు పత్రిక కాదు. జస్టిస్ పత్రిక కాదు, బ్రాహ్మణ పత్రిక కాదు. అది మాంధ్ర పత్రిక కాదు. ఏదీ కాదు గాని అన్నీ ఔను. అందరి పత్రికా ఔను. అందరికీ అందుబాటులో ఉండడం కోసం చందా సంవత్సరం ఒకటికి రూ 1-0-0 (ఒక రూపాయి) పెట్టినాము. ఆంధ్ర మహాజనులందరూ చందాదారులుగా తోడుపడవలసిందని, ఆనందమును కలిగించే విషయము వ్రాసి ప్రకటనకు కూడా పంపి సహాయపడవలసినదని వేడుకొంటున్నాము''. ఇంత స్వచ్ఛంగా, తేటతెల్లంగా, స్పష్టంగా ఆ కాలంలో సాహిత్యజనులు హాయిగా

చదువుకొనేందుకు వీలుగా వెలువడిన ఏకైక పత్రిక 'ఆనందవాహిని' యే అని చెప్పవచ్చు. 16 దమ్మిడీలు అంటే ఒక రూపాయి చెల్లిస్తే ఏడాది పొడవునా అందించే ఆనందవాహినికి ఆరోజుల్లో అపూర్వమైన ప్రతిస్పందన లభించింది. 1930లో వచ్చిన ప్రెస్ ఆర్డినెన్స్ వల్ల జూలై, ఆగస్టు, సెప్టెంబరు (1930) సంచికలు ఆగిపోయాయి. తిరిగి అక్టోబరు సంచికను గత మూడు సంచికల విశేషాలతో ప్రత్యేకంగా ప్రచురించారు.

ఆండ్ర శేషగిరిరావు గారి సంపాదకత్వంలో 1931లో ప్రారంభమైన 'ఆంధ్రభూమి' సచిత్ర మాస పత్రికలో సర్వ విషయాల్నీ చర్చిస్తూ ఉండేవారు. ఆండ్ర శేషగిరిరావుగారు ఆంధ్రులు. ఆంధ్ర రాష్ట్రం వచ్చే వరకు సిగముడి వేయనని చాణుక్యునిలాగా ప్రతిన పూని శిరోజాలూ, మీసాలూ పెంచిన దీక్షితులు. ఈ పత్రికలో ఆంధ్ర జాతికి సంబంధించిన వివిధ విషయాలను ప్రామాణికంగా, పరిశోధనా దృష్టితో ప్రచురించేవారు. ఈయన స్వయంగా సరళ గ్రాంథికవాది అయినా, గిడుగు రామమూర్తి గారి వ్యవహార భాషోద్యమాన్ని సమర్థించారు. ఆంధ్రభూమిలో ప్రతినెలా ఆంధ్రుని డైరీ పేరుతో ఆ నెలలో జరిగిన వివిధ సంఘటనలను చివరి పుటలో వెలువరించేవారు. సుమారు 1940 వరకు వచ్చిన 'ఆంధ్రభూమి' ఆ తరువాత కాలంలో ఆగిపోయింది. మళ్లీ దిన, వార పత్రికలుగా తదనంతరకాలంలో రావడం అందరికీ తెలిసిందే.

కొంపెల్ల జనార్దనరావు గారి సంపాదకత్వంలో మద్రాసు నుండి 1935 జనవరిలో వెలువడిన ద్విమాసపత్రిక ఉదయిని. ఇది రెండు సంవత్సరాల పాటు వచ్చింది. నవ్యసాహిత్యానికి ఆ రోజుల్లో అండగా నిలిచిన పత్రిక. సమకాలిక కవి పండిత పరిశోధకులందరూ దీనిలో తమ రచనల్ని ప్రచురించేవారు. జనార్దనరావు గారు 'కిరణాలు' అనే శీర్షిక కింద సంపాదకీయ వ్యాఖ్యలు వ్రాసేవారు.[9] వాటిలో ఆయా సమకాలీన సాహిత్యాంశాలపై పత్రికాభిప్రాయాలను వెల్లడించేవారు. జనార్దనరావుగారు రాసిన ఈ పత్రిక మొదటి సంచిక సంపాదకీయంలో ''రసాస్వాదనమును బట్టి మనస్సుకు సంస్కృతి ప్రసాదించే ఉత్కృష్ట సాహితీ కళాభ్యుదయానికి ఉదయిని సతతము తూర్పు దిక్కుయి ద్వారము తెరుస్తుంది'' అని వెలువరించిన అభిప్రాయములను బట్టి ఆ పత్రిక సారస్వత మనోగతం అర్థమవుతుంది. శ్రీ వేదుల సత్యనారాయణ శాస్త్రి రచించిన పద్యరచనలు, శ్రీ కవికొండల వెంకటరావుగారి 'ప్రేమతత్వం' అనే కథ ఉదయిని తొలిసంచికలో ప్రచురించబడుటం, విశేషాదరణ పొందటం ఒకేసారి జరిగాయి. ఈ సాహిత్య పత్రికలో శృంగాటకం, గ్రంథ పరిచయాలు, వాఙ్మయవీధి, తలపోతల కలపోతలు (లేఖావళి), వ్యాసాలు, నాటకాలు, కవితలు అనే శీర్షికలుండేవి. అత్యంత విషాదకరమైన విషయమేమిటంటే ఉదయిని సంపాదకులు కొంపెల్ల జనార్దనరావు పాతికేళ్ల వయసులోనే క్షయవ్యాధి వల్ల మరణించడంతో 'ఉదయిని' పత్రిక సైతం అంతమయింది. 'కొంపెల్ల' మరణాన్ని గురించి ఆనాటి పత్రికలన్నీ ఘనంగానివాళులు అర్పించాయి. మహాకవి శ్రీశ్రీ సైతం తన 'మహాప్రస్థానాన్ని' 'సెలవంటూ వెళ్లిపోయావా నేస్తం' అంటూ కొంపెల్ల జనార్దనరావుకే

అంకితం ఇచ్చారంటే జనార్దనరావు సాహిత్య వ్యక్తిత్వం ఎంతటిదో అంచనా వేయవచ్చు.

విద్యావ్యాప్తి, సంస్కృతి సామాన్య ప్రజలకు చేరాలంటే వ్యవహార భాష ఒక్కటే మార్గమని తలచిన నలుగురు విద్యావేత్తలు జె.ఎ. ఏట్స్, పి. టి. శ్రీనివాస అయ్యంగార్, గురజాడ అప్పారావు, గిడుగురామమూర్తి గార్లు దైనందిన వ్యవహార భాషలో బోధనను పాఠశాలల్లోనూ, కళాశాలల్లోనూ ప్రవేశపెట్టాలని తీవ్రంగా ప్రయత్నించారు. ఇదంతా 1910ల కాలంలో జరిగింది. వీరి ప్రయత్నాన్ని గమనించిన ఆంధ్ర దేశ పండితులంతా అయ్యో! భాష పాడయిపోతుందని, విద్యావిధానం నాశనమై పోతుందని పెద్ద ఆందోళన చేపట్టారు. వ్యవహార భాషోద్యమాన్ని ఎదుర్కోవడం కోసం వారంతా 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు' అనే సంస్థను స్థాపించారు. గ్రాంథిక భాషావాదులంతా కలిసి ఏర్పరచిన ఈ సంస్థ నుండి 1913లో 'ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక' అనే పేరుతో ఒక పత్రికను కూడా తీసుకువచ్చారు. ఈ పత్రిక ముఖపత్రంపై ''దేశభాషలందు తెలుగులెస్స'' అనే వాక్యాన్ని పరిషత్ ముద్రగా ప్రచురించారు.

ఈ పరిషత్తు గ్రాంథిక భాషారక్షణమే ధ్యేయంగా పనిచేస్తున్నందున గిడుగురామమూర్తి పంతులుగారి మొదలైన వ్యవహార భాషావాదులు వ్యవహార భాషా వ్యాప్తి కోసం అభినవాంధ్ర పండిత సభ పేరుతో 1933 మార్చిలో బరంపురంలో సమావేశమయ్యారు. దీనికి డాక్టరు చిలుకూరి నారాయణరావు గారు అధ్యక్షత వహించారు. ఈ సభ రెండవ సమావేశం 1933 డిసెంబరులో రాజమండ్రిలో జరిగింది. దీనికి రాయప్రోలు సుబ్బారావు గారు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలోనే అభినవాంధ్ర పండిత సభ నవ్యసాహిత్య పరిషత్తుగా మారింది. కేంద్ర కార్యస్థానాన్ని 'గుంటూరు'గా నిర్ణయించారు. ఆంధ్రసాహిత్య పరిషత్తులాగానే నవ్యసాహిత్య పరిషత్తు కూడా కొన్ని కార్యక్రమాలు చేపట్టి, లక్ష్యాలు ఏర్పరచుకుని ఆ లక్ష్య సాధన కోసం కృషి చేసింది. వివిధ ప్రదేశాలలోని కవులను, రచయితలను ఒక చోట చేర్చడం, సభలూ, సమావేశాలు జరపడం, వార్షికోత్సవాలు జరపడం, ప్రచారం కోసం ఒక పత్రికను ప్రచురించడం మొదలైన కార్యక్రమాలన్నీ నవ్యసాహిత్య పరిషత్తు వారు చేపట్టారు.

నవ్యసాహిత్య పరిషత్తు తమ కార్యక్రమాల్లో ప్రధాన బాధ్యతగా 'ప్రతిభ' పత్రికను 1936లో వెలువరించారు. దీని సంపాదకులుగా తెలికచర్ల వెంకటరత్నం గారు వ్యవహరించారు. గుంటూరు నుంచి వెలువడిన ఈ పత్రిక నవ్యసాహిత్యానికి మహావేదికగా నిలిచింది; ఉపయోగపడింది. గిడుగురామమూర్తి, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, తల్లావఝుల శివశంకరశాస్త్రి, చింతా దీక్షితులు, నోరినరసింహశాస్త్రి, శ్రీరంగం శ్రీనివాసరావు, పాలగుమ్మి పద్మరాజు మున్నగు వారి రచనల్ని ప్రతిభ ప్రచురించేది. శ్రీశ్రీ మహాప్రస్థానం లోని కవితలన్నీ మునుముందుగా 'ప్రతిభ' లో రావడం గమనార్హం.

కృష్ణాజిల్లా తేలప్రోలు నుంచి పాటిబండ మాధవశర్మ , రాజగోపాల్ గార్లు 1936 నుండి నడిపిన 'వీణ' సాహిత్య పత్రిక వ్యావహారిక భాషా వాదానికేగాక, నవ్యసాహిత్యానికి కూడా పట్టుగొమ్మయింది. 1936, జులై 'వీణ' సంచికలో ఆచార్య గిడుగు రామమూర్తి పంతులుగారికి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ప్రత్యేక పీఠం ఇవ్వాలంటూ రాసిన సంపాదకీయం ఆ రోజుల్లో అందరినీకదిలించిందంటే ఆశ్చర్యం లేకపోలేదు. కొంపెల్ల జనార్ధనరావు గారు కీర్తిశేషులయినపుడు వీణలో శ్రీ నోరి నరసింహశాస్త్రి గారుచేసిన ఆవేదనారచన సైతం అందరినీ కదిలించింది.

1946లో మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారి ఆధ్వర్యంలో సుమారు ఒక సంవత్సరం పాటు వెలువడిన సాహిత్యపత్రిక 'ఆంధ్రి'. ఆంధ్ర పురాణం, ఆంధ్ర రచయితలు మొదలైన బహుగ్రంథాలు రచించిన శాస్త్రి గారు కళాప్రపూర్ణులు. వేంకట రామకృష్ణకవులు, వేలూరి శివరామశాస్త్రి వంటి దిగ్గంతులు ఇందులో రచనలు చేశారు. కుందూరి ఈశ్వరదత్తుగారు ఆంధ్రలో ఆంధ్రి'' అనే శీర్షిక కింద ఆంధ్ర మహిళల కుచసౌష్ఠవం గురించి రాసిన వ్యాసం పెనువివాదాలనురేపింది. శతావధాని శివరామశాస్త్రి ఆంధ్రిలో 'గారు ' శబ్ద విచారం జరుపుతూ రాసిన వ్యాసం అందరినీ ఆకట్టుకుంది. ''కవులుపొగడవేళ గాంతలు రతివేళ సుతులు ముద్దువేళ శూరవరులు రణము సేయువేళ 'రా'కొట్టి పిలుతురు'' అని ప్రాచీన పద్యం ఉదహరిస్తూ ''ఆయా స్థలములలో రాకుండు గౌరవము 'గారు' కులేదు. ఇన్ని వేదములలో, ఇన్ని దర్శనములలో దేవుని చివర నెవరేని గారును చూచియున్నారా'' అని శాస్త్రిగారు ప్రశ్నించారు.[10]

కృష్ణాపత్రికను, ముట్నూరి కృష్ణారావుగారిని విడదీసి చూడలేం. సాహిత్య పత్రిక ద్వారా రాజకీయ చైతన్యాన్ని అందించిన మొదటి పత్రిక 'కృష్ణాపత్రిక'. సాహిత్యానికి ఈ పత్రిక చేసిన సేవ నిరుపమానం. ఆధునిక సాహిత్యం లోని ప్రక్రియా వైవిధ్యానికెంతగానో తోడ్పడింది ఈ పత్రిక. విశ్వనాథసత్యనారాయణ వంటి గొప్ప రచయితలు ఈ పత్రికలో తమ నవలలు ప్రకటించారు. సుమారు ఆరుదశాబ్దాలు ఈ పత్రిక తెలుగువారికెంతో స్ఫూర్తినిచ్చింది. అది అప్పుడప్పుడు ఆగి పెక్కు చేతులు మారి ప్రస్తుతం దినపత్రికగా మారి పిరాట్ల వెంకటేశ్వర్లు గారి సంపాదకత్వంలో దినపత్రికగా ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాద్ నుంచి వెలువడుతున్నది.

## *iii.* తెలంగాణా సాహిత్య పత్రికలు:

ఎ. నీలగిరి బి. హితబోధిని :

తెలంగాణాలో ఆ కాలంలో పత్రికానిర్వహణ చాలా కష్టాలతో కూడుకున్నపని.[11] దానికెంతో సాహసం అవసరమై ఉండేది. తెలంగాణాలో నూరేళ్ల కిందట గద్వాల వనపర్తి సంస్థానాల వారు నెలకొల్పిన అచ్చుయంత్రాలు మొట్టమొదటివి. అంతేకాక తపాలా సౌకర్యాలు కూడాలేవు. 1935లో వెలువడిన నీలగిరి పత్రిక సైతం హైదరాబాద్‌లాంటి నగరాల్లో తెలుగు ప్రెస్సు లేకపోవడంపై విచారం వ్యక్తం చేసింది. తెలంగాణాలో మొట్టమొదట 1915లోనే హితబోధిని అనే తెలుగు పత్రిక ప్రారంభమై ఒక సంవత్సరం పాటు వచ్చింది. దీని సంపాదకుడు శ్రీనివాసవర్మ.

సి. తెలుగు పత్రిక *(1920-25)* :

వరంగల్లు జిల్లా ఇనుగుర్తి అనే గ్రామంనుండి ఒద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవరంగారావు అనే సోదరుల సంపాదకత్వంలో 'తెలుగు పత్రిక' వచ్చింది. రాఘవరంగారావుగారు సంప్రదాయశుద్ధంగా సంస్కృతాంధ్రాలలో కృషి చేసిన విద్వద్వరేణ్యుడు. ఈ పత్రిక అనేక విజ్ఞానదాయక వ్యాసాలు ప్రకటించి అష్టకష్టాలతో అయిదేళ్లు 1920-25ల మధ్య సేవ చేసింది.

డి. గోలకొండ :

కవి, కథకుడు, పండితుడు, పరిశోధకుడు, పత్రికారచయిత అయిన సురవరం ప్రతాపరెడ్డిగారు 'గోలకొండ' పత్రికను1926లో స్థాపించారు. ఇది మొదట్లో వారానికి రెండుమార్లు వచ్చి తర్వాత దినపత్రికగా మారింది. ప్రతాపరెడ్డిగారు 1947 వరకు సుమారు 21 సంవత్సరాలు దీనికి సంపాదకులుగా ఉన్నారు. మీ తెలుగేమి తెలుగు అని ఎవ్వరో ఆక్షేపిస్తే ''అచ్చ తెనుంగు కట్టమునకాది పదంబయి పోల్చు భాగ్యమున్ హెచ్చుగగన్నదేశ'' మని ఘంటాపథంగా చెప్పి గోలకొండ కవుల సంచిక ప్రకటించి గర్వాంధ్రులకన్నువిప్పారు. ఇక గోలకొండ పత్రిక చేసిన సారస్వత సేవ గురించి చెప్పక్కర్లేదు. 'గోలకొండ' తర్వాత 'ప్రజావాణి' అన్న వారపత్రిక తీయాలని సురవరం ప్రతాపరెడ్డిగారు అనుకున్నారు. కానీ అనివార్యకారణాల వల్ల అది సాధ్యం కాలేదు.

ఇ. సుజాత *(1927-40, 50-53)*:

పసుమాల నరసింహశర్మగారి సంపాదకత్వాన 1927-40ల మధ్యకాలంలో వెలువడింది. 1940లో ఆగిపోయిన ఈ పత్రికను 1950లో గడియారం

రామకృష్ణశర్మగారు సంపాదకులుగా తిరిగి ప్రారంభించారు.

ఎఫ్ . దివ్యవాణి:

చివుకుల అప్పయ్యశాస్త్రి గారి సంపాదకత్వంలో సికింద్రాబాద్ నుండి వారపత్రికగా 1937లో వెలువడి కొంతకాలానికే ఆగిపోయింది.

*జి. విభూతి (1940-43):*

ఉద్దండ పండితులు, బహుభాషావేత్తలు అయిన చిదిరెమఠం వీరభద్రశర్మ గారి సంపాదకత్వాన సికింద్రాబాద్ నుండి విభూతి పత్రిక మూడు నాలుగేళ్లు మాత్రమే వచ్చినప్పటికీ అమూల్య వ్యాసాలతో, విమర్శ ప్రతివిమర్శలతో సాగింది. సురవరం వారి రామాయణ విశేషాలు, శ్రీపతి పండితుని శ్రీకర భాష్యభాగాలు దీనిలో ధారావాహికంగా వెలువడ్డాయి. వీరభద్రశర్మగారు కాశీ వీరశైవ పీఠానికి అధిపతిగా వెళ్లవలసివచ్చినందున పత్రిక ఆగిపోయింది.

## *iv.* ముగింపు

1940 వరకు ఒక ప్రధాన ధోరణిగా ఉన్న భావకవిత్వానికి పత్రికల ద్వారా అందిన ప్రేరణ, ప్రోత్సాహం విశేషించి చెప్పదగినవి. కల్పలత మొదలుకొని భారతి దాకా వచ్చిన పత్రికలన్నీ వివిధ కోణాల నుంచి భావ కవిత్వంలో ఆయా శాఖలను ప్రభావితం చేసింది. భావకవిత్వం వస్తువైవిధ్యాన్ని సంతరించుకుని రూపపరంగా వివిధ ప్రయోగాల దిశగా మళ్లడానికి పత్రికలు తోడ్పడ్డాయి. ముఖ్యంగా వివిధ భాషల్లో సమకాలీనంగా వస్తున్న కవిత్వ ధోరణులను పరిచయం చేయడమే కాకుండా కవితా ఖండికల అనువాదాలను సైతం ప్రచురించడం వల్ల వాటి నుండి ఇక్కడి తెలుగు కవులు ప్రేరణ పొందడానికి అవకాశం కలిగింది.

అలాగే సాహిత్య విమర్శకు సంబంధించినంతవరకూ పాశ్చాత్య దేశాలలో ప్రచురితమైన పెక్కు ధోరణులను పరిచయం చేయడం జరిగింది. దీనివల్ల కవిత్వ అనుశీలన పద్ధతుల్లో గుణాత్మకమైన మార్పు వచ్చింది. కావ్య విమర్శకు కావాల్సిన కొత్త సాధనాలు సమకూరాయి. సృజనాత్మక సాహిత్యానికి దాన్ని అందుకోవాల్సిన పాఠకవర్గానికి మధ్య విమర్శకుడు సరికొత్త ద్వారాలను తెరిచినట్టయింది.

పాదసూచికలు:

1. తెలుగు పత్రికల సాహిత్య సేవ - తిరుమల రామచంద్ర, '8',

2. వివేకవర్ధని, కందుకూరి వీరేశలింగం 1882, జూన్

3 తెలుగువ్యాసం- నూరు సంవత్సరాలు, సంపాదకులు: తిరుమలరామచంద్ర.,

4. మ్యానేజరు - (శ్రీ) మద్వర్తమాన తరంగిణి, 1895 అక్టోబరు. సం. 2. సం. 7.

5. 'తెలుగు' పత్రిక, 'విన్నపం' (సంపాదకీయం) సంపాదకులు
గిడుగురామ్మూర్తిపంతులు, సెప్టెంబరు, 1919.

6. సంపాదకులకు గిడుగువారి సలహా, ప్రబుద్ధాంధ్ర, ఏప్రిల్, 1934, రాజమండ్రి

7. మరోసారి గిడుగురామమూర్తి - (శ్రీ) వి. లక్ష్మణరెడ్డి వ్యాసమాల

8. Studies in the history of Telugu Journalism, పు.89.,

9. కిరణాలు, సంపాదకీయం 'ఉదయిని' , సం. కొంపెల్ల జనార్ధనరావు, జనవరి, 1935, ప్రారంభ సంచిక , మద్రాసు

10. ఆంధ్రి, మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి (సంపాదకులు) , అక్టోబరు 1941.

11. 'తెలంగాణము - తెలుగు పత్రికలు'- సుజాత సంచిక, సురవరం ప్రతాపరెడ్డిగారి వ్యాసం

★★★

# రెండవ అధ్యాయం

## *1970-80ల మధ్య దినపత్రికల్లో వచ్చిన సాహిత్యం*

# 1. పత్రికా వ్యవస్థలోవచ్చిన మార్పులు

1970-80 దశాబ్దంలో సాహిత్యపరంగానూ, సామాజికంగానూ అనేక పరిణామాలు జరిగాయి. 1970 దశకానికి తెలుగు సాహిత్య సామాజిక జీవనంలో ఒక ప్రత్యేకమైన ప్రాముఖ్యముంది. పత్రికా రంగంపై కూడా ఈ ప్రభావాలు కనిపిస్తాయి. ముఖ్యంగా పత్రికల నిర్వహణతోపాటు పత్రికా రచనా శైలి, భాష పూర్తిగా మార్పులకు లోనై భాషాపరంగా అంతకుముందు నుంచీ వున్న వ్యవహారిక భాషా శైలి 70ల తరువాత మరింతగా బలపడింది. పాఠకుల సంఖ్య పెరగడంతో అందరి అభిరుచులకూ తగినట్లుగా పత్రికల్లోని వివిధ శీర్షికలు రూపుదిద్దుకున్నాయి. పత్రికా వ్యవస్థలో వచ్చిన ఈ మార్పులు సాహిత్యగతంగా కూడా ఎన్నో పరిణామాలకు కారణమయ్యాయి.

పత్రికల సర్క్యులేషన్, పాఠకుల సంఖ్య అనేక రెట్లు పెరిగిన దశాబ్దమిది. స్వభావరీత్యా దేశ, విదేశీ వ్యవహారాల కంటే స్థానిక అంశాలపైననే పత్రికలు ఎక్కువ ఆసక్తి చూపించసాగాయి. దీనికి కారణం ప్రాంతీయ స్థాయిలో పత్రికల, పాఠకుల సంఖ్య పెరగడమే. అదీకాక పత్రికలపైన వాణిజ్యపరమైన ప్రభావం అధికంగా కనిపించిన దశాబ్దమిది. ''ప్రెస్ కమీషన్ నివేదిక ప్రకారం దేశంలోని మొత్తం పత్రికల సర్క్యులేషన్‌లో 50 శాతం 1952 నాటికి గుత్త పెట్టుబడిదారుల వర్గాల చేతుల్లోకి పోయింది. 1970 నాటికి ఇది 70 శాతానికి పెరిగింది.''[1]

దీనితో పత్రికలకు ఇంతకు ముందు నుంచీ వున్న వ్యాపార స్వభావం ఇంకా గట్టిపడింది. అందరి అభిరుచులకు తగ్గట్టుగా పత్రికలు రూపుదిద్దుకోవడంతో 1982 నాటికి వాటి సర్క్యులేషన్ 10.6 శాతం పెరిగింది. సాంకేతికంగా వస్తున్న ఆధునిక మార్పులను కూడా పత్రికా వ్యవస్థ స్వీకరించడంతో వార్తాసేకరణలను విస్తృత స్థాయిలో పాఠకులను ఏర్పరచుకోవడానికి వివిధ శీర్షికల నిర్వహణలోనూ పత్రికలు మున్నెన్నడూ లేనంత ఆసక్తి చూపించాయి.

అందుకే 1965 నుంచి 1990 దాకా గడిచిన భారతీయ పత్రికా రంగంలోని ప్రత్యేకించి తెలుగు పత్రికా రంగంలో ఒక కొత్త శకావిష్కరణకు సాక్షీభూతంగా వుంది.'' పాతికేళ్ళ పత్రికారంగ చరిత్రలో ప్రస్ఫుటించిన పాజిటివ్ ఫ్యాక్టర్స్, రాష్ట్రంలో

మొదటిసారిగా పెక్కు, దిన, వార పత్రికలు అవతరించడం, పాత్రికేయుల సంఖ్య పెరగడం, పత్రికా రచనలో వైవిధ్యం పెరగడం, రాజకీయ అవినీతి పట్ల, సంఘ దురాచారాల పట్ల, ప్రజా వ్యతిరేకమైన పరిణామాల పట్ల ఆగ్రహభార్గవులుగానే కాకుండా విచక్షణా దృష్టిగల ఆలోచనాపరులుగా విశ్లేషణకర్తలు కూడా యువతరం పాత్రికేయులు తమతనాన్ని మొహరు వేసుకోగలుగుతున్నారు''.[2]

ఈ దశాబ్దంలో పత్రికా వ్యవస్థలో వచ్చిన మార్పుల్ని, రెండు విధాలుగా విశ్లేషించవచ్చు. మొదటిది సాంకేతికమైన పరిణామమైతే రెండోది పత్రికా వ్యవస్థలో అంతర్గతంగా ఉండే రచనా నిర్వహణకు సంబంధించింది. ఇందులో రెండో అంశానికి సాహిత్య వ్యవస్థతో సంబంధముంది. మొదటి నుంచీ తెలుగు పత్రికా రంగంలో భాషా సాహిత్య, సాంస్కృతిక రంగాలకు విశేషమైన ప్రాముఖ్యముంది. తొలి తెలుగు దినపత్రిక 'ఆంధ్రపత్రిక' నుంచి పత్రికా రంగంలో సాహిత్య ప్రాధాన్యం ఒక సంప్రదాయంగా స్థిరపడింది. ఆంధ్రపత్రిక తొలి సంచికలోని కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు దినపత్రికకు సాహిత్యానికి మధ్య వుండే అనుబంధాన్ని విశేషించి పేర్కొన్నారు. దీనికి తగ్గట్టుగానే అర్ధశతాబ్దికి పైగా ఆంధ్రపత్రిక ఉగాది సంచికల ద్వారా చేసిన సాహిత్య సేవ చరిత్రాత్మకమైంది.

తెలుగు దినపత్రికలకు సంబంధించి 70ల తరువాత సాహిత్య ప్రభావం రెండు విధాలుగా కనిపిస్తుంది. మొదటిది ప్రత్యక్షంగా తెలుగు సాహిత్య చైతన్యాన్ని ఈ పత్రికలు ప్రతిబింబిస్తూ వచ్చాయి. దశాబ్దంపాటు సాహిత్య చరిత్రలో ప్రతీ సందర్భాన్ని దినపత్రికల్లో ఏదో ఒక రూపంలో మనం గమనించవచ్చు. ఆదివారం అనుబంధాల్లో సృజనాత్మక రచనల ద్వారా, ప్రత్యేక సాహిత్య పుటల ద్వారా వెలువడిన విమర్శ విశ్లేషణల వల్ల, అలాగే రోజువారీ వార్తా విశేషాల్లో సాహిత్య సభలు, సమావేశాలకు సంబంధించిన వార్తా లేఖల ద్వారా అనేక రూపాల్లో దినపత్రికలకు సాహిత్యానికి మధ్య సన్నిహితత్వం పెరిగింది. సాహిత్య చరిత్రలో ముఖ్యమైన వివిధ పరిణామాలకు తెలుగు దినపత్రికలు ప్రతిబింబంగా నిలిచాయి. సాహిత్యపరంగా 70ల తరువాత అభ్యుదయ, విప్లవ కవిత్వాల మధ్య సంఘర్షణను ప్రధానాంశంగా పేర్కొనవచ్చు. అర్ధశతాబ్దంగా తెలుగు సాహిత్యాన్ని అనేక రూపాల్లో ప్రభావితం చేసిన అభ్యుదయ ఉద్యమం 70ల తరువాత తగ్గుముఖం పట్టింది. 1970లోనే విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. 1975 తరువాత వ్యాపార సాహిత్య ధోరణి ప్రారంభమైంది. ఈ మూడు అంశాల ఆధార భూమిక నుంచి 1970-80ల మధ్య దినపత్రికలకు, సాహిత్యానికి మధ్య ఏర్పడిన సంబంధాలను విశ్లేషించవచ్చు.

**ఎ. అభ్యుదయ ఉద్యమం:** యాభై ఏళ్ళుగా తెలుగు సాహిత్య రంగంపై ఏర్పరచుకున్న ప్రభావ బలాన్ని నిలబెట్టుకోవడానికి అభ్యుదయ ఉద్యమం ఈ దశకంలో అన్ని విధాలుగా ప్రయత్నించింది. అభ్యుదయ దృక్పథాన్ని ప్రతిబింబించే పార్టీల

దినపత్రికలతోపాటు ఇతర పత్రికల్లో కూడా దీనికి సంబంధించిన చర్చలూ, వాదోపవాదాలు జరగడం ఈ పరిణామ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తుంది. అభ్యుదయ భావజాలం ప్రభావంతో సాహిత్య విమర్శ, సృజనాత్మక కృషి కొనసాగించడమే కాకుండా వివిధ ప్రాంతాలలో అభ్యుదయ సాహిత్య ఉద్యమాన్ని విస్తరించడానికి ప్రయత్నం జరిగింది. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల ఆరో మహాసభ 1973లో గుంటూరులో, ఏడో మహాసభ 1976లో హైదరాబాద్‌లో, 8వ మహాసభ 1978లో కాకినాడలో జరిగాయి. గుంటూరులో అరసం సభల నాటికే అభ్యుదయ విప్లవ సాహిత్యాల మధ్య తీవ్ర వైరుధ్యాలు పొడచూపాయి. వీటికి సంబంధించిన వార్తా విశేషాలతో సహా ఆయా రచయితల వ్యాఖ్యలు, విశేషణాలూ ఎప్పటికప్పుడు దినపత్రికల్లో నమోదవుతూ వచ్చాయి. ఈ దశాబ్దంలోనే అభ్యుదయ, విప్లవ సాహిత్యాలు రెండు శిబిరాలుగా ఏర్పడి సాహిత్య వాదోపవాదాలు సాగించాయి. 'అభ్యుదయం విప్లవానికి ఆటంకమనే వర్గం, అది కళా స్వేచ్ఛకు శృంఖలమనే శుద్ధ కళా వాదం రెండువైపుల నుంచి అభ్యుదయ సాహిత్యంపైన విమర్శలకు దిగాయి'' అని ఒక విమర్శకుడు వ్యాఖ్యానించారు.[3]

సాహిత్య రంగంలో నెలకొన్న దుందుడుకువాద, హితవాద గందరగోళ పరిస్థితుల మధ్య ప్రగతిశీల, ప్రజాతంత్ర రచయితల ఐక్యతను నినాదంగా తీసుకుని అరసం కొత్త కార్యాచరణ రూపొందించుకుంది.

**బి.** *విరసం ప్రవేశం:* 1970 తరువాత విరసం ఏర్పడటం సాహిత్య వాతావరణంలో కొత్త కదలిక మొదలైంది. ''సంస్కరణ వాదానికి కాలం చెల్లి సాంస్కృతిక వ్యవహారాల్లో స్తబ్దత పేర్కొని అభ్యుదయ రచయితల ఉద్యమం కూడా శవప్రాయమైన స్థితిలో జాతిని సమగ్ర విమోచనం వైపు నడిపే లక్ష్యంతో విప్లవ ఉద్యమ ప్రణాళిక రూపుదిద్దుకుంది.''[4]

1970-80ల మధ్యకాలం సాహిత్యంలో విప్లవ యుగంగా పేర్కొన్నారు. దేశంలో వున్న రాజకీయ పోరాటాలను సమర్థిస్తూ ప్రజలను సమరశీలురుగా చేయడమే ఈ విప్లవ కవితా లక్ష్యం. చాలామంది కవులు, రచయితలు విప్లవోద్యమ ప్రభావంతో రచనలు చేశారు. అభ్యుదయ ఉద్యమంలో ప్రసిద్ధులైన శ్రీశ్రీ, కుటుంబరావు, రావిశాస్త్రి, కెవిఆర్ వంటివారు విప్లవ సాహిత్యం వైపు వెళ్ళారు. సాహిత్య సృజన విషయంలో అప్పటివరకు ఉన్న అభిప్రాయాలు మారిపోయాయి. రచయితలు సాహిత్య వ్యక్తీకరణ కోసం జానపద బాణీల వైపు దృష్టి సారించారు. అలాగే సాహిత్య వస్తువులో రాజకీయ దృక్పథాంశాలు ఎక్కువ ప్రభావాన్ని చూపించసాగాయి. రాజకీయ, ఆర్థిక అంశాలు ప్రధాన ప్రభావంగా వుండడాన్ని సమకాలీన సాహిత్యవేత్తలు అంగీకరించలేకపోయారు. ఈ అంశంపై విప్లవోద్యమ సాహిత్యంతో పూర్తిగా భేదాభిప్రాయం ప్రకటించినవారు వున్నారు.

అభ్యుదయ, విప్లవ సాంప్రదాయ సాహిత్య ధోరణుల మధ్య సాగుతున్న ఈ

సంఘర్షణ చర్చలూ, వాదోపవాదాలు అనివార్యంగా దినపత్రికల ఆదివారం అనుబంధాల్లోనూ, సాహిత్య అనుబంధాల్లోనూ పేర్కొనబడ్డాయి. అభ్యుదయ, విప్లవ సాహిత్యకారుల మధ్య విభేదాలు దినపత్రికలలో వార్తా ప్రాముఖ్యాన్ని కూడా సంతరించుకున్నాయి. 1970-80ల మధ్య వివిధ దినపత్రికలను పరిశీలిస్తే దాదాపు ప్రతీ దినపత్రిక సాహిత్య శీర్షికలోనూ ఈ మూడు ధోరణుల సంఘర్షణ ప్రముఖంగా కనిపిస్తుంది. ఆయా సాహిత్య సంస్థల మాస పత్రికల్లోనే కాకుండా, దినపత్రికల్లోనూ ఈ చర్చనీయాంశాలు కొనసాగడం ఈ 'కల్లోల' దశాబ్దానికి ఒక నిదర్శనం. దినపత్రికలు విప్లవోద్యమ ప్రభావంతో వచ్చిన సాహిత్యాన్ని విశేషంగానే ప్రచురించాయి. అంతేకాకుండా విప్లవ సాహిత్య ప్రభావం వల్ల దినపత్రికల సాహిత్య చర్చలు, వాదోపవాదాలు సాహిత్యంలో రాజకీయ, ఆర్థిక భావ ప్రకటనల పరిధిపైన ప్రయోజనకరమైన చర్చలు సాగాయి. కొన్ని సందర్భాల్లో విప్లవ సాహిత్యంపైన తీవ్ర స్థాయిలో విమర్శ వెలువడినప్పటికీ చర్చను ముందుకు సాగించడానికి అవసరమైన వాతావరణాన్ని అవి కల్పించాయి. దీనివల్ల దినపత్రికల సాహిత్య శీర్షికలు, ప్రత్యేక అనుబంధాలు కొత్త కదలికలను సృష్టించగలిగాయి. పాఠకులలో కూడా వీటిపట్ల ఆసక్తి పెరిగింది. ఒక దశలో ఆయా సంఘాల మాసపత్రికల కంటె దినపత్రికల్లో జరుగుతున్న చర్చలే సమకాలీన సాహిత్య రంగానికి అవసరమైన సమతౌల్యాన్ని సాధించగలిగాయంటే అతిశయోక్తి కాదు.

సి. **వ్యాపార సాహిత్య ధోరణి:** 1970-80ల మధ్య దినపత్రికల పాఠకుల సంఖ్య పెరగడంతో వారి అభిరుచుల కనుగుణంగా పత్రికల సాహిత్య ప్రమాణాలు కొత్త రూపుదిద్దుకున్నాయి. ఒకవైపు సాహిత్య ధోరణులపైన సీరియస్‌గా ఆలోచనలు సాగుతున్న దశలోనే వ్యాపార సాహిత్యం వివిధ రూపాల్లో అవతరించింది. ముఖ్యంగా నవలలు, కథల్లో ఈ ధోరణి పెరిగిపోయింది. జీవన వాస్తవికతతోను, యధార్థ సామాజిక అంశాలతోను నిమిత్తం లేకుండా కాలక్షేపం కోసమే ఉద్దేశించినట్లుగా వ్యాపార సాహిత్యం వెలువడింది. ''70ల తరువాత పదో తరగతి వరకు చదువుకునే వారి సంఖ్యా, అంతవరకు మాత్రమే చదువుకోగల వారి సంఖ్యా పెరిగింది. వీరి వినియోగానికి కాలక్షేప సాధనాలు అవసరమయ్యాయి. వీరి స్థాయికి అందే కాలక్షేపమే వినియోగదారుల మార్కెట్‌ను శాసించసాగింది.''[5]

అంటే కొత్త వర్గం పాఠకులు ఏర్పడ్డారని అనుకోవచ్చు. ఈ పాఠకులకు సాహిత్య లక్ష్యాలు, ప్రయోజనాలతో ఎలాంటి సంబంధం లేదు. సాహిత్యం ఒక కాలక్షేప సాధనం మాత్రమే. ఇలాంటి పాఠకుల అభిరుచి కోసం పుంఖాను పుంఖంగా నవలలు వెలువడ్డాయి. దినపత్రికల్లోనూ సీరియల్స్ ప్రచురణ ప్రారంభమైంది. ఈ క్రమంలో ప్రామాణిక పత్రాలు అందించే సాహిత్యంలో సైతం సెక్స్, హింస పెచ్చు పెరిగిపోయాయి. కొత్త కాలక్షేప సాహిత్యంలో పత్రికల ప్రాముఖ్యం ఎక్కువే. ఇలాంటి సాహిత్యంలో తప్పుడు విలువలు, అమానవీకరణ లాంటి అంశాలు చేరడానికి

ప్రధానంగా వ్యాపార విలువలే కారణం. ''ఈ దశలో 1960లు దాటి, 1970లకు వచ్చేసరికి తెలుగు సీమలో మధ్యతరగతి శ్రీకాకుళ ఉద్యమంతో ప్రభావితమై అన్యాయాన్ని ఎదిరించడం, ప్రజాసేవ కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధపడటం వంటి ఉదాత్త విలువలను అనుసరించాలనే తపనను చూపడం మొదలైంది. అప్పటికే ఒక దశాబ్దంగా విజృంభిస్తున్న వ్యాపార నవల అటు అలవాటయిన కుటుంబ జీవితపు మూస రచనా పద్ధతికీ, ఇటు కొత్త విలువలకూ మధ్య ఊగిసలాడటం ప్రారంభమైంది. ఈ ఘర్షణలో కొత్త విలువలకు కొంత స్థానమిస్తూ వాటిని వికృతీకరిస్తూ తమ విలువలనే ఆకర్షణీయంగా ప్రచారం చేస్తూ రాయగల రచయితలు పాలక వర్గాలకు అవసరమయ్యారు. ప్రజా ఉద్యమాల వల్ల ప్రభావితులవుతున్న పాఠకులు పాత తరహా రచనల పట్ల అనాసక్తి ప్రదర్శించవచ్చు గనుక, పాఠకుల ఆసక్తినీ ఆమోదాన్నీ సాధించగల రచయితలు పెట్టుబడికి కావలసి వచ్చారు. ఈ క్రమంలో నవలల్లో దిగజారుడు, తప్పుడు విలువలు, నీచ విలువలు అమానవీకరణ ప్రారంభమయ్యాయి.''[6]

దినపత్రికల్లో వెలువడుతున్న వ్యాపార సాహిత్యానికి, సమకాలీన వాస్తవికతను ప్రతిబింబిస్తున్న ఉద్యమ సాహిత్యానికి మధ్య విపరీతమైన ఎడం వుండటం గమనించాల్సిన విషయం. తెలుగు నవలలపైన, కథలపైన కొన్ని దినపత్రికల సాహిత్య అనుబంధాలు నిర్వహించిన చర్చా వేదికల్లో కూడా ఈ విషయమే వ్యక్తమైంది. సాహిత్యం పోనుపోను వ్యాపారమయమై పోతుందన్న అభిప్రాయాన్ని ఈ చర్చల్లో పాల్గొన్న విమర్శకులంతా వ్యక్తం చేస్తూ వచ్చారు. దీనికి తగ్గట్లుగానే 70ల చివరకు వచ్చేసరికి దినపత్రికల్లో కనిపించే సాహిత్య మౌలిక స్వభావమే మారిపోయింది. పత్రికా నిర్వహణలో క్రమంగా వ్యాపార యాజమాన్యాల వత్తిడి పెరిగిపోతుండటం వల్ల సర్క్యులేషన్ లాంటి కారణాలపైన వ్యాపార సాహిత్యం మరింతగా వ్యాప్తి చెందింది. మొదట్లో కవిత్వానికి, సాహిత్య అంశాలకు ఎంతో కొంత స్థానాన్ని కల్పించిన పత్రికలు తరువాత తరువాత వాటికి ఏ మాత్రం వ్యాపార విలువ లేదని గ్రహించి తొలగించిన సందర్భాలూ వున్నాయి.[7]

**ఉ. సాహిత్యం - దినపత్రికలు:** వ్యాపార విలువలు అంతగా పెరిగిపోయినా సాహిత్య విలువలకు ఎంతో కొంత ప్రాముఖ్యాన్నిచ్చిన దినపత్రికలు 1970-80ల మధ్య కనిపిస్తాయి. ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, విశాలాంధ్ర, ఆంధ్రపత్రిక, ఆంధ్రభూమి దినపత్రికల్లో సాహిత్య అంశాలకు తగినంత ప్రాముఖ్యం దక్కింది. ఆంధ్రప్రభ దినపత్రిక ఒక పూర్తి పేజీని సాహిత్య అనుబంధం ప్రతీ వారం ప్రచురించేది. ఇందులో ప్రాచీన, ఆధునిక సాహిత్యాలకు సమానమైన ప్రాధాన్యం లభించింది. అలాగే ఆంధ్రజ్యోతి దినపత్రిక సాహిత్యవేదిక శీర్షికన ప్రతీ ఆదివారం అనుబంధంలోనూ ఒక విలువైన సాహిత్య వ్యాసాలను అందించేది. సమకాలీన అంశాలపై చర్చల్ని కూడా నిర్వహించింది. విశాలాంధ్ర దినపత్రిక ఆదివారం అనుబంధాల్లో సాహిత్య వ్యాసాల్లో, సమీక్షలు ప్రచురించడంతోపాటు కొన్ని ముఖ్యమైన సందర్భాల్లో ( అరసం సభలు, వివిధ వాడుక

భాషా సదస్సులు జరిగినప్పుడు) ప్రత్యేక సంచికలను కూడా ప్రచురించింది. దినపత్రికల ఆదివారం అనుబంధాల్లో కవిత, కథ, వ్యంగ్య రచనలు విధిగా ఉండేవి. ఇవన్నీ కూడా ఉత్తమ సాహిత్యానికి ఎంతో కొంత బలాన్నిచ్చేవి.

అంటే దినపత్రికలకు, సాహిత్యానికి మధ్యన ఉన్న అనుబంధం గతంలో మాదిరిగా బలంగా లేకపోయినా, పెద్దగా బలహీనపడలేదని చెప్పవచ్చు. దినపత్రికల వల్ల సాహిత్య రంగానికి ఎంత మేలు జరిగిందో సాహిత్య రంగంవల్ల దినపత్రికలకు కూడా అంతే మేలు జరిగింది. వార్తారచనా శిల్పంలో 1970ల తరువాత వచ్చిన మార్పుకు ఈ సాహిత్య విలువలే ఎంతో కొంత దోహదపడ్డాయని చెప్పవచ్చు. అయితే పాఠకుల అభిరుచినిబట్టి సాహిత్య సృష్టి జరుగుతుండటంవల్ల సాహిత్య విలువల్లో కూడా మార్పు తప్పలేదు. అంటే సాహిత్యం, పత్రికా వ్యవస్థ రెండూ భిన్నమైన ఉనికి, నిర్మాణ వ్యవస్థల్ని కలిగి వుంటూనే పరస్పర ప్రభావానికి లోనయ్యాయని చెప్పాలి. 1970-80ల మధ్య పత్రికరంగం ద్వారా వెలువడిన సాహిత్య విమర్శ సృజనాత్మక రచనల్ని పరిశీలిస్తే మనకు ఈ విషయం బోధపడుతుంది.

పాదసూచికలు:

1. పరకాల పట్టాభిరామారావు, 'తెలుగు పత్రికారంగం', ఆంధ్రప్రదేశ్ దర్శిని, పేజీ 544, విశాలాంధ్ర బుక్‌హౌస్, హైదరాబాద్.

2. ఎ.బి.కె. ప్రసాద్, 'పాతికేళ్ల పత్రికారచన', పేజీ 2.

3. ఒక విమర్శకుడు, అభ్యుదయ రచయితల సంఘ ప్రణాళిక, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘ ఎనిమిదవ మహాసభ, కాకినాడ, విశాలాంధ్ర ప్రత్యేకానుబంధం, విశాలాంధ్ర పత్రిక ఆదివారం డిసెంబరు 12,1978.

4. సృజన మాసపత్రిక సంపాదకీయం, నవంబరు 1972.

5. వివినమూర్తి '70 ల తర్వాత తెలుగుకథ, ఓ అభిప్రాయం', 'మనలో మనం' సంపాదకులు - కాళీపట్నం రామారావు, పేజీ 224.

6. ఎన్.వేణుగోపాల్, 'వ్యాపార సాహిత్యం - సంస్కృతి ', మనలో మనం, వ్యాస సంకలనం: పేజీ 160,161, సంపాదకులు : కాళీపట్నం రామారావు.

7. ఈనాడు దినపత్రికలో కొందరు కవుల కవితలు, పుస్తక పరిచయం, సాహిత్య వ్యాసాలు కూడా వచ్చేవి. రాను రానూ వ్యాపార దృక్పథం వల్ల ఆ పత్రిక నుంచి వాటిని తొలగించి కేవలం ఈనాడు ఆదివారం అనుబంధం సంచిక చివరల్లో పుస్తక సమీక్షల ప్రక్రియ వరకే పరిమితం చేశారు.

★★★

# ii. ప్రధాన వ్యాసాలు

1970-80ల మధ్య తెలుగు దినపత్రికల్లో వివిధ సాహిత్య ప్రక్రియలకుగాను విస్తృతమైన చర్చలకు అవకాశమేర్పడింది. ముఖ్యంగా వచన కవిత్వం, నవల వంటి ప్రక్రియల్లో వచ్చిన పరిణామాల మీద విలువైన వ్యాసాలు వివిధ దినపత్రికల్లో వెలువడ్డాయి. వీటిలో కొన్ని వ్యాసాలు సాహిత్య మౌలిక భావనల్ని చర్చిస్తే మరికొన్ని విడిగా ఆయా రచనల మీద విమర్శనాత్మక దృష్టితో సాగాయి. రచయితకు సామాజిక స్పృహ, రాజకీయ దృక్పథం అవసరమన్న భావంతో సాగిన విమర్శా వ్యాసాలు ఈ దశాబ్దంలో అధికంగా కనిపిస్తాయి. రచయిత సామాజిక వ్యక్తిత్వాన్ని గురించి ఇంత విస్తృత స్థాయిలో మునుపెన్నడు చర్చ జరగలేదు. అందుకే ప్రసిద్ధ రచయితలు శ్రీ మహీధర రామమోహనరావు ఒక వ్యాసంలో సామాజిక వ్యక్తిత్వమున్న రచయితలను ప్రత్యేకంగా వర్గీకరించారు. ''ఇంకో తరహావారున్నారు. సమాజంలో ఉన్న అభివృద్ధి స్థితి, అధ్వాన్న స్థితి కూడా వీరు గుర్తిస్తున్నారు. ఈ రెంటిని ఎవరో బుద్ధిపూర్వకంగా సృష్టించినవి కావని, సమాజ ప్రగతి క్రమంలో సహజ పరిణామాలుగా వచ్చినవేనని వారి దృఢ అభిప్రాయం. దాని కార్యకరణాలను శాస్త్రీయ రూపంలో పరిశీలించి నిర్ణయించుకున్నారు. ఈ స్థితిని తొలగించి మానవుడు సర్వతోముఖాభివృద్ధి పొందడానికి అవకాశం ఉన్నదని సిద్ధాంత రూపంలోనే కాక ఆచరణలో పెట్టి కూడా చూపించినారు.

వీరికి గల చరిత్ర బలం, తర్క బలం, సమాజ బలం మిగిలిన రెండు తరహాల వారికి లేని మాట నిజం.[1] రచయితకు ఆవేశపూరితమైన వ్యక్తీకరణ మాత్రమే కాకుండా చరిత్ర బలం, తర్క బలం, సమాజ బలం వుండాలని ఆయన ఉద్దేశ్యం. వాస్తవానికి వామపక్ష వాదుల సాహిత్య అభిప్రాయాల్లో వచ్చిన మౌలిక మార్పులకు ఈ వ్యాసం ఒక ఉదాహరణ మాత్రమే. రచయితను సామాజిక శక్తిగా భావిస్తూ ఈ దశాబ్దంలో దినపత్రికల్లో ప్రసిద్ధ విమర్శకులు, రచయితలు చర్చకు దారితీసిన అనేక వ్యాసాలు రాశారు. ఈ చర్చ ఎంతవరకు కొనసాగిందంటే సామాజిక చైతన్యాన్ని వ్యక్తంచేసే సాహిత్యం మాత్రమే నిజమైన ఆధునిక సాహిత్యమని కొందరు విమర్శకులు

అభిప్రాయపడ్డారు. ''కాలం మారినా మారని అవశేషాల వంటి వాళ్ళు కొందరు వుండవచ్చు కాని మంచి కవి తన చుట్టూ వున్న సమాజాన్ని తప్పించుకుని రాయలేడు. అందుచేత ఆధునిక సాహిత్యం అనే పేరుకి తగిన సాహిత్యం సృష్టిస్తున్న వాళ్ళు మంచి రచయితలు కారనే నా అభిప్రాయం.[2]

ఇక ప్రక్రియా పరంగా చూస్తే ఈ దశాబ్దంలో వచన కవిత్వం ప్రధాన చర్చనీయాంశంగా కనిపిస్తుంది. వచన కవిత్వానికి సంబంధించి అనేక కారణాలను ఆవిష్కరించే ప్రయత్నం జరిగింది. ప్రధానంగా 1976 కల్లా దినపత్రికల సాహిత్య శీర్షికల్లో వచన కవిత్వం రూప పరిణామాన్ని గురించి అసంఖ్యాకంగా వ్యాసాలు వెలువడ్డాయి. 1976కల్లా అప్పటి తెలుగు సాహిత్య ప్రపంచంలో వచన కవిత్వమొక ప్రధాన ప్రక్రియగా రూపుదిద్దుకున్నది. ఇతర ప్రక్రియల్లో కృషి చేస్తున్నవారు కూడా వచన కవిత్వం వైపు దృష్టి మళ్ళించారు. ''ఈ ఏడు జనవరి (1976) 28వ తేదీన అఖిల భారత తెలుగు రచయితల సంఘం వారు రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో కలలో కూడా ఊహించని విధంగా ప్రసిద్ధులైన కొందరు పద్యకవులు వచన కవితలు గానం చేశారు. శ్రీయుతులు ముదిగొండ వీరభద్రమూర్తిగారు, వానమామలై వరదాచార్యులుగారు, శ్రీ సి.వి.సుబ్బన్నఅవధాని వచన కవితలు చదవడం, నాకు వచన కవిత తెలుగు కవిత్వంలో ప్రక్రియకు సంబంధించిన విప్లవం అంటే కవిత్వంలో రూపవిప్లవము.''[3]

ఈ దశాబ్ది కవితా సంప్రదాయంగా వచన కవిత్వం స్థిరపడిందంటూ టి.ఎల్.కాంతారావు ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఈ దశాబ్దపు కవిత - ఒక పరిశీలన' అన్న శీర్షికతో ఒక సింహావలోకనం చేశారు. ఆయన తెలుగు కవిత్వాన్ని విశ్లేషిస్తూ సామాజిక చైతన్యంలో వెలువడుతున్న కవిత్వమే కాక వైయక్తిక స్థాయిలో విస్తరిస్తున్న నిరాశావాదం, వ్యక్తివాదం, శూన్యవాదం, ఆంగికవాదం, ప్రతీకవాదం, అనుభూతివాదం మొదలైన శాఖా భేదాల్ని కూడా గుర్తించాయి. ''ఈ దశాబ్ది కవితా సంప్రదాయంగా వచన కవిత్వం స్థిరపడింది. వివిధ రకాల భావాలు కలిగిన కవులందరికి వచన గేయం వాహికంగా నిలిచింది.

ఈ దశాబ్ది తెలుగు కవిత్వాన్ని విశ్లేషించినప్పుడు నిరాశావాదం, వ్యక్తివాదం, శూన్యవాదం, మార్మిక వాదం, ప్రతీకవాదం, అనుభూతి వాదం మొదలైన కొన్ని శాఖలే కాక ఉద్యమరూపంలో సాగుతున్న శాఖలు రెండు స్పష్టంగా కనపడుతున్నాయి. అభ్యుదయ కవులలో రెండు వర్గాలు ఏర్పడటం ఈ దశాబ్దంలోనే జరిగిన ఒక పరిణామం.''[4]

అదే సమయంలో వచన కవిత్వ రూపంలో కవిత్వం తగ్గిపోయి వచనమే ఎక్కువగా ఉండటం లాంటి విమర్శలు కూడా మొదలయ్యాయి. వచన కవిత్వంలో అస్పష్టత ఏర్పడుతుందన్న ఫిర్యాదు కూడా వుంది. ఈ విమర్శలకు కూడా దినపత్రికల సాహిత్య

అనుబంధాల్లోనూ, ఆదివారం అనుబంధాల్లోనూ తగినంత చోటు దొరికింది. రూపపరంగా వున్న సౌలభ్యం వల్ల ఏది రాసినా పాద విభజన చేస్తూ వచన కవిత్వమై పోతుందన్న తేలికపాటి అభిప్రాయాలు ఏర్పడటాన్ని అప్పటి విమర్శకులు ప్రధాన లోపంగా చూపించారు. ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో 'వచనా కవితారీతులు కొన్ని సూచనలు' శీర్షికన ఆచార్య నాయని కృష్ణకుమారి రాసిన వ్యాసం దీనికుదాహరణ. ఆమె వచన కవిత్వం రూపంపట్ల వున్న అభిప్రాయాల్ని విమర్శిస్తూ ఇలా అన్నారు. ''ఛందస్సు బెడద లేదు కదా అని మామూలు వాక్యాలను కర్త కర్మ క్రియలలో వ్యత్యయం చేస్తే వచన కవిత్వమౌతుందనే భ్రమలో చాలామంది ఉన్నారు. అనగా వచన కవిత్వానికి కావలసినవి భావాంశాలు (Units of thought).[5]

ఒక శక్తివంతమైన సాహిత్య రూపంగా వచన కవిత్వం ఏర్పడటానికి ఎలాంటి కృషి అవసరమో తెలియజెప్పే విమర్శా వ్యాసాలు కూడా దినపత్రికల సాహిత్య పుటల్లోనే వచ్చాయి. ఆధునిక కవిత్వంపై వస్తున్న వివిధ విమర్శలకు సమాధానమిస్తూ అమరేంద్ర 'ఆధునిక వచన కవిత : ఒక పరిశీలన' అన్న ఒక వ్యాసాన్ని 1978లో ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాశారు. ఇందులో వచన కవిత్వంపై వున్న అన్ని విమర్శలను ఆయన త్రిప్పికొడుతూ ''వచన కవిత పేరుతో వెలువడుతున్న రచనలలో కవిత్వం పాలు తక్కువగా వుంటున్నదని కొందరి విమర్శ. మరి ఛందస్సు తగిలించుకున్న పద్యకవితలో నూటికి నూరుపాళ్ళూ కవిత్వం వుందా! అస్పష్టతా! నీ మారుపేరు ఆధునిక కవిత అని ఒక సాహిత్యవేత్త అధిక్షేపించారు. ఈ ఆక్షేపణకు గురికాకుండా వచన కవిత స్పష్టతను సంతరించుకోవాలి. సామాన్య జన శ్రేయస్సును తన లక్ష్యంగా ఎంచుకునే వచన కవి చెప్పదలచిన దాన్ని సూటిగా ధాటిగా, తేటగా, నీటుగా చదువరికి అందించాలి.''[6] అని అన్నారు. దినపత్రికల్లో అసంఖ్యాకమైన వచన కవితలు వెలువడిన దశాబ్దమిది. దాదాపు ప్రతీ పత్రికా ఆయా ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే కాకుండా ఆదివారం అనుబంధాల్లోనూ విడిగా కళాసాహిత్యం ప్రత్యేక అనుబంధాల్లోనూ వచన కవిత్వాన్ని తప్పనిసరిగా ప్రచురించాల్సి వచ్చింది. ఆ క్రమంలో ఇతరేతర ధోరణులు కూడ కవిత్వ రూపాల్లో వ్యక్తం కాక తప్పలేదు. ముఖ్యంగా వైయక్తిక ధోరణులు ప్రధానంగా కనిపించే కవిత్వంలో అస్పష్టత కూడా చోటు చేసుకుంటోందన్న విమర్శ వచ్చింది. ఈ విధమైన అస్పష్టతను తొలగించుకోవాలన్న సూచన నాయని కృష్ణకుమారి, అమరేంద్ర మొదలైన వారి విమర్శల్లో కనిపిస్తుంది. మరోవైపు నుంచి కవిత్వ భాష మారాల్సిన అవసరాన్ని చెప్పే విమర్శా వ్యాసాలు కూడా వెలువడ్డాయి. దీనికి ఉదాహరణ 1980 ఆంధ్ర పత్రికలో ఆధునిక కవితా పరిభాష శీర్షికన సోమసుందర్ రాసిన వ్యాసం. కవిత్వంలో భాషా ప్రయోగాన్ని గురించి వ్యక్తీకరణ తీవ్రతకు ఉపయోగపడే భాష గురించి సోమసుందర్ ఈ వ్యాసంలో రాశారు. 'కవికి మూగ సైగలతో రోజు గడవదు. మూడునాలుగు వందల అల్పమైన పదాల శరీరంపై అనల్ప భావనా భారం మోపడం సాధ్యం కాదు. కావాలని వాడుకలో గల పదాలతోనే తన పబ్బం గడుపుకోజూస్తే

వ్యాగతనవెూ, నత్తో బయటపడుతుందే తప్ప - ఉత్తమ కవితాసారం ఆవిష్కరింపబడదు.''[7]

గత దశాబ్దంలో కవిత్వరంగ పునాదుల్ని కదిలించిన దిగంబర కవిత్వంపైన 1970-80ల మధ్య కూడా సుదీర్ఘమైన చర్చ జరిగింది. మహీధర రామమోహనరావు లాంటి మార్క్సిస్టు సాహిత్యవేత్తలు దిగంబర కవిత్వం సామాజిక స్పృహ స్వభావాన్ని వివరించే ప్రయత్నం చేశారు. 1940-50ల మధ్య అభ్యుదయ సాహిత్య ఉద్యమం వల్ల వినిపించిన పీడిత ప్రజానీకం ఘోష దిగంబర కవిత్వంలో ఇంకా బలపడిందన్న అభిప్రాయాల్ని ఆయన వ్యక్తం చేశారు. ''అహంకారమే గాని ఆత్మస్థానం ఎరుగని పెట్టుబడిదారీ పూర్వ సమాజపు మనస్తత్వం, కొత్తగా కనిపించే ప్రతీ భావం మీద, గంభీరంగా వినిపించే పెద్దపెద్ద మాటల మీదా మధ్యతరగతులు పెంచుకొనే అవితర్క మమకారాలూ, స్వంత గొంతుకు వినడానికే కాని, ఇతరుల అభిప్రాయాలు వినిపించుకోని ఆవేశాలు - వీటి మూర్తిమంతం దిగంబర కవిత...''[8] అని, మరో వ్యాసంలో దిగంబర కవిత్వ కర్తవ్యాన్ని గుర్తుచేస్తూ, ''దిగంబర కవుల ఆలోచనా ధోరణిలో అవకతవక లుండవచ్చు. తాత్త్వికాలోచనలలోసందిగ్ధత వుండొచ్చు. అహంకారం వుండొచ్చు. రాజకీయ జ్ఞానం ప్రదర్శించవచ్చు. ఎన్ని లోపాలైనా కనబరచవచ్చు. కానీ వారు తెలుగు కవితా రంగాన్ని తట్టి నిద్రలేపేరు. దాని కర్తవ్యాన్ని గుర్తుచేశారు. వారి ప్రభావం మన సాహిత్య రంగంలో నిలిచిపోయింది. 1940, 50 దశాబ్దాలలో అభ్యుదయ సాహిత్య శాఖ వారి కలం నుంచి మాత్రమే వినబడిన పీడిత ప్రజానీకం ఘోష, విప్లవ నినాదమూ నేడు కలం పట్టే ప్రతి తెలుగు వాడి ఘోషా నినాదమూ అయ్యాయి.''[9] అని అన్నారు.

పాదసూచికలు :

1. శ్రీ మహీధర రామమోహనరావు : 'రచయిత - సామాజిక స్పృహ', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, మే 15,1957.
2. శ్రీమతి జి. సుశీల, ఎం. ఏ., ''ఆధునిక సాహిత్యం - ఆధునికత'', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం ఆగస్టు 17, 1980.
3. శ్రీ కుందుర్తి ఆంజనేయులు: 'వచన కవిత', విశాలాంధ్ర దినపత్రిక, మార్చి 14, 1976.
4. శ్రీ టి. ఎల్. కాంతారావు: 'ఈ దశాబ్దపు కవిత' ఒక పరిశీలన'' విశాలాంధ్ర దినపత్రిక, నవంబర్ 9, 1978.
5. డాక్టర్ నాయని కృష్ణకుమారి: 'వచన కవితా రీతులు - కొన్ని సూచనలు', ఆంధ్రజ్యోతి, ఆదివారం సాహిత్య వేదిక, మే 27, 1979.

6. అమరేంద్ర, 'ఆధునిక వచన కవిత - ఒక పరిశీలన', ఆంధ్రజ్యోతి దినపత్రిక, 1978.

7. సోమసుందర్ : 'ఆధునిక కవితా పరిభాష', ఆంధ్రపత్రిక, ఆదివారం అనుబంధం, నవంబర్ 30, 1980.

8. శ్రీ మహీధర రామమోహన్‌రావు, 'దిగంబర కవిత - దాని సామాజిక స్వభావము' విశాలాంధ్ర ఆదివారం, జూలై 29, 1979.

9. శ్రీ మహీధర రామమోహన్‌రావు, 'దిగంబర కవిత - దాని సామాజిక స్వభావమూ', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, ఆగస్టు 5, 1979.

★★★

# ఎ. ప్రధాన వ్యాసాలు - నవల

ఈ దశాబ్దంలో విస్తృతంగా అభివృద్ధి చెందిన మరో సాహిత్య ప్రక్రియ నవల. అయితే నవలా రచన ప్రధానంగా రచయిత్రులదే అన్న భావన ఏర్పడిందీ ఈ కాలంలోనే. దినపత్రికల్లోనూ, ఇతర అన్ని రకాల పత్రికల్లోనూ నవల ఒక ప్రధాన ఆకర్షణగా మారింది. నవలా పాఠకుల సంఖ్య అపరిమితంగా పెరిగిపోవడంతో అతి కొద్దికాలంలో అది వ్యాపార విలువల్ని కూడా సంతరించుకుంది. దినపత్రికల్లో నవలా రచనలపై వెలువడిన విమర్శనాత్మక వ్యాసాలు పరిశీలిస్తే, నవల ఏ విధంగా వ్యాపార వస్తువుగా మారిందో అర్థమవుతుంది. రచయిత్రులపై వచ్చిన విమర్శలన్నీ కూడా ఈ సందర్భంగా గమనించదగినది. ప్రసిద్ధ రచయిత కొడవటిగంటి కుటుంబరావు ఈ పరిస్థితిని 1978 ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో రాసిన ఒక వ్యాసంలో విశ్లేషణాత్మకంగా ప్రస్తావించారు. ''కొంతకాలంగా సాహిత్య విమర్శ రచయిత్రులను విమర్శించడం, సమర్థించడంగా వుంటున్నది. అయితే కల్పనా సాహిత్యంలో నాకు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్న పరిణామం పాత్రలను వినియోగించుకోవడం.' 'శ్రామికులను 'ఆదర్శ' మంచి పాత్రలుగానూ, ధనిక దోపిడీదార్లను 'ఆదర్శ' చెడ్డ పాత్రలుగాను సృష్టించి, చెడ్డ అభ్యుదయ రచనలు చేసిన వారు లేకపోలేదు. అలాంటి రచనలు ఆమోదకరం కాకపోవడానికి ఒకే ఒక కారణం. అందులోని పాత్రలు 'సజీవమైనవి' కాకపోవడమే. రచయిత ఆశయం దొడ్డదే, సామాజిక దోపిడీని ఖండించాలని!' 'ఈ రోజులలో చాలామంది కల్పనా సాహిత్యం రాసేవారు సజీవ పాత్రల మీద ఆధారపడే ఇచ్ఛ లేకనో, శక్తి లేకనో, అవసరం గుర్తించకనో కొన్ని 'స్టీరియో టైప్స్' మీద ఆధారపడుతున్నారు.''[1] విమర్శకులు ప్రధానంగా నవలల్లో రచయిత్రులు సృష్టిస్తున్న అవాస్తవిక వ్యవస్థను విమర్శించడం ఈ వ్యాసాల్లో కనిపిస్తుంది. పాత్రలు సజీవమైనవి కాకపోవడం వల్ల ఆయా నవలలు వాస్తవికతకు బద్ధ వ్యతిరేకంగా తయారవుతున్నాయన్న అభిప్రాయం ఈ విమర్శల్లో వ్యక్తమవుతోంది. ''అవాస్తవికమైన ధోరణిలో అభూత కల్పనలతో, చాలా పరిమితమైన పరిశీలన, జీవితానుభవాలతో అతితక్కువ పఠనానుభవంతో, తక్కువ కాలంలో ఎక్కువ సంఖ్యలో కథలు రాయడం వల్ల ఈనాడు రచయిత్రులు రచయితల కన్నా ఎక్కువగా విమర్శింపబడుతున్నారు.

ఇలా విమర్శింపబడటానికి కొన్ని కారణాలున్నాయి. ఎక్కువ మందిలో విస్తృతమైన సాహిత్య రచన ప్రజల కెంతవరకు ఉపయోగపడుతుందనే సామాజిక దృక్పథం రచయిత్రులలో లోపిస్తుంది.''[2] నవలా రచనలో పాత్రల వ్యక్తిత్వం మొదలుకొని సన్నివేశ చిత్రణ వరకు పెరిగిపోతున్న అవాస్తవికత సామాజిక ప్రయోజనాన్ని ఎలా దెబ్బతీస్తుందో ఆయా విమర్శకులు ఈ విమర్శా వ్యాసాలలో హెచ్చరించారు. సామాజిక దృక్పథం రచయిత్రులలో పూర్తిగా లోపించిందన్న అభిప్రాయం కూడా ఈ సాహిత్య వ్యాసాల్లో వ్యక్తమైంది.[3] సాహితీ విమర్శకులునవలా రచనలో ప్రధాన లోపంగా చూపించిన మరొక అంశం సమస్యల పట్ల రచయిత్రుల అవగాహన లేకపోవడం. చాలా మంది రచయిత్రులు రచన సాగిస్తున్న రోజుల్లో వివిధ సామాజిక సమస్యల పట్ల చిత్తశుద్ధి కానీ, లోతైన నిశిత పరిశీలనా దృష్టి లేకపోవడం పైన విమర్శలువచ్చాయి. 'ఆధునిక తెలుగు నవలా సాహిత్యం - ధోరణులు' అనే అంశంపై ప్రసిద్ధ రచయిత నవీన్ విశాలాంధ్ర, ఆదివారం అనుబంధంలో రాసిన వ్యాసంలో ఈ విధమైన నవలల్ని పలాయన వాదానికి దారితీసేవిగా విమర్శించారు.[4]

ఈ దశాబ్దంలో నవలకు పాఠకుల సంఖ్య పెరిగింది. ఆ పాఠకుల్లోను ఎక్కువమంది మహిళలున్నారు. స్త్రీలు విరివిగా నవలల్ని చదవడం మొదలుపెట్టడంతో పాపులర్ నవలకు ఒక ఫార్ములా ఈ దశాబ్దంలోనే ఏర్పడింది. పాఠకులను వాస్తవిక ప్రపంచంలోంచి ఊహా ప్రపంచంలోకి తీసుకెళ్ళే ఒకరకమైన కాలక్షేపం వస్తువుగా నవల మారింది. అదే సమయంలో పాత్రల చిత్రీకరణలో చవకబారు ధోరణి కూడా మొదలైంది. ముఖ్యంగా స్త్రీ పాత్రల చిత్రణలో కొందరు పాపులర్ రచయితలు అనుసరిస్తున్న ధోరణి మొత్తంగా సాహిత్య తత్వానికే విలువలు పోగొట్టే స్థితిని తీసుకువచ్చింది. ''ఈ రచయితలు ఇటీవల కొన్ని సందర్భాలలో మరీ చవకబారు స్థాయిలో ఈ సంగతి నొక్కి చెప్తూ స్త్రీ మీద గౌరవాన్ని కలిగించవలసిన బాధ్యతగల వర్గానికి చెంది వుండి కూడా స్త్రీని గుర్తించి చాలా అసహ్యంగా తేలికగా ఆలోచించేట్లు చేస్తున్నారు. కొందరు ప్రఖ్యాత రచయితల కలాల నుండి వెలువడి పడక గదులలో 'లేమిలోలేను' మొదలైన కొన్ని కథలను చదువుతుంటే సున్నిత మనస్తత్వం గల పురుషులకు మరి ప్రాక్టికల్‌గా అగ్రెసివ్‌గా ఉండే భార్యలు లభించిన వాళ్ళు ఎలా బాధపడుతున్నారో అర్థమౌతుంది. అంటే దీనివల్ల తెలుస్తున్న విషయమేమిటంటే ఓ ప్రక్క ఉమెన్స్ లిబ్ బీజాలు మన సమాజంలో మొలకలెత్తబోతుంటే మరోవంక పురుష వివెూచనోద్యమాలకు కొందరు రచయితలు నాంది వాక్యాలు పలుకుతున్నారన్నమాట.''[5] అయితే ఈ కాలంలోనే జీవితాన్ని గాఢంగా శోధించే వాస్తవిక నవలలో కొన్ని రాకపోలేదు. నిజమైన సాంఘిక సమస్యల్ని తీసుకుని రచనలు సాగిస్తున్న వారి గురించి దినపత్రికల సాహిత్య అనుబంధాలు, విశ్లేషణాత్మక వ్యాసాలు కూడా వచ్చాయి. ''స్వాతంత్ర్య సముపార్జన తరువాత తెలుగు నవలలో సాంఘిక దృక్పథం కొరవడినట్లు కనిపిస్తుంది. నవల వ్యాపార ప్రక్రియగా వారి కుటుంబాన్ని

ఆశ్రయించింది. అయినా అక్కడ కూడా సాంఘిక దృక్పథం గల బలమైన నవలలు వెలువడుతూనే ఉన్నాయి.''[6] సాంఘిక ప్రయోజనాన్ని దృష్టిలో వుంచుకున్న నవలా రచనలపైన, రచనాత్మక ధోరణులపైన వచ్చిన విమర్శా వ్యాసాలు ఇక్కడ పేర్కొనదగినవి. ''అయితే స్త్రీలు రాస్తున్న నవలలన్నింటినీ ఫార్ములా నవలలే అని తీసివేయటానికి వీలులేదు. నిజమైన సాంఘిక సమస్యల్ని తీసుకుని నవలలు రాసిన వారున్నారు. రంగనాయకమ్మ రాసిన 'బలిపీఠం' వర్ణాంతర వివాహాలు సృష్టించే వివిధ సమస్యల్ని చక్కగా చిత్రిస్తుంది.[7] తెలుగు నవలా రచనలు ఒక సీరియస్ సాహిత్య ప్రక్రియగా స్వీకరిస్తూ ఆ ప్రక్రియకు సంబంధించిన వివిధ కోణాలను ఆవిష్కరించే వ్యాసాలు కూడా ఈ దశాబ్ది దినపత్రికల్లో వెలువడ్డాయి. నవలా రచన వికసిస్తున్న క్రమాన్ని విశ్లేషించడంతోపాటు అవి విస్తరించాల్సిన తీరును కూడా విమర్శకులు మార్గదర్శనం చేయించారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో 1978లో 'తెలుగు నవలా రచనలు - రావల్సిన పరిణామాలు' అనే అంశంపై వెలువడిన వ్యాసంలో విమర్శకులు ఇలా అన్నారు. ''సమకాలీన జీవితాన్ని ప్రతిబింబించేవీ. హృదయ స్పందన కలిగించేవీ, మానవత్వపు విలువల్ని పెంచేవీ అయిన మౌలిక రచనలు చేసే రచయితల, రచయిత్రుల సంఖ్య గర్వించదగినంతగా మాత్రం లేదు. అలాగే ఉన్నత ప్రమాణాల్ని నెలకొల్పాలని కృషిచేసే రచయితలను అభిమానించే చదువరుల సంఖ్య కూడా అల్పశాతంలోనే ఉన్నది.[8] ఇదే కాలంలో తెలుగు సాహిత్యంలో నవలా రచనకు కొత్త పునాదుల్ని ఏర్పరచిన ప్రసిద్ధ రచయితలపైన వారి తాత్త్వికత పైన విడివిడిగా కొన్ని వ్యాసాలు వెలువడ్డాయి. ''నీతి అనేది స్త్రీ పురుషులిద్దరికీ సంబంధించినది. అవినీతి అయినా ఇద్దరికీ సమానమే. కాగా ఒక నేరానికి పురుషుని క్షమించటమూ, స్త్రీని శిక్షించటమూనా? ఈ ద్వంద్వ ప్రమాణాల దురన్యాయంపై కత్తి గట్టి స్త్రీ స్వేచ్ఛా నినాదం ఇచ్చినవాడు మొదట చలం. స్వేచ్ఛ సామాజికమా, మానసికమా అనే ప్రశ్న వేసుకుని పదేళ్ళపాటు మదనపడి, స్వేచ్ఛ కేవలం మానసికావస్థ. ఎవరికి వారు అన్వేషించి సాధించుకోవలసింది. సంఘం వూరదు. ఎవరి సుఖం, స్వేచ్ఛ, ఆనందం కొరకు వారు పాటుపడాలి అని నిర్ణయానికొచ్చినది రెండో చలం.''[9] ప్రధానంగా చలం లాంటి రచయితలపైన ఈ దశాబ్దంలో ఎన్నో విమర్శనాత్మక సాహితీ వ్యాసాలు వచ్చాయి. ఈ వ్యాసాలు కేవలం చలాన్నీ ఒక నవలా రచయితగా మాత్రమే కాకుండా తాత్త్వికుడిగా అన్వేషించే దిశలో సాగాయి. అందుకే ఏటుకూరి బలరామమూర్తి వ్యాసంలో చలం భావ పరిణామంపైన ఒక భిన్నమైన కోణం నుంచి విశ్లేషణ సాగింది. దీనికి భిన్నంగా చలం నవలల్లోనూ స్త్రీ పాత్రల చిత్రీకరణ వంటి వేరువేరు సాహిత్యపరమైన అంశాలపైన లోతైన అనుశీలన నిండిన వ్యాసాలు కూడా వెలువడ్డాయి. దీనికి ఉదాహరణ 'చలం నవలలు - స్త్రీ పాత్రలు.' ఈ వ్యాసంలో చలాన్నీ, చలం పాత్రలనీ, సామాజిక కోణం నుంచి పరిశీలించే ప్రయత్నం జరిగింది. ''ఈ సమాజం గురించి సరైన అవగాహన వుంది. అలా వుండి కూడ వాళ్ళు వ్యక్తిగతంగా తమ జీవితాలనుబట్టి సామాజిక బాధ్యతలను పట్టించుకోకుండా గడుపుతున్నారు. ఈ పట్టించుకోక పోవడమనేది చలానికే ఉన్నప్పుడు

ఇక ఆయన పాత్రల సంగతి చెప్పేదేముంది. చలం గమనించని విషయం ఒకటి ముఖ్యమైనది ఉన్నది. స్త్రీ విముక్తి ఒక్కటే విడిగా జరగదనీ, మొత్తం మానవ జాతి విముక్తితో స్త్రీ విముక్తి ముడిపడి ఉన్నదనీ, ఈ సమాజంలో దారుణంగా దోపిడీ చేయబడుతున్నది స్త్రీ, బానిసలకు కూడా బానిసగా ఉంటున్నది స్త్రీ. ఆ స్త్రీ విముక్తం కావాలంటే ఈ దోపిడీ విధానపు పునాదులే కదిలిపోవాలి. మొత్తం సామాజిక ఆర్థిక విధానం మారిపోవాలి. ఉత్పత్తిలో స్త్రీ పాత్ర వుండాలి.''[10] నవలా రచనకు సంబంధించి ఇతరేతర అంశాలపైన కూడా చర్చకు అవకాశం కల్పించింది దినపత్రికలే. చారిత్రక నవలలు, నవలలు ఇతర భారతీయ భాషలలో వెలువడిన నవలలపైన తులనాత్మక అధ్యయనం కూడా ఈ దినపత్రికల సాహిత్య వ్యాసాలలో కనిపిస్తుంది. నవలకు, చరిత్రకు ఉన్న సంబంధాన్ని విశ్లేషిస్తూ నాయని కృష్ణకుమారి ఒక ప్రధాన వ్యాసం విశాలాంధ్ర ఆదివారం అనుబంధంలో రాశారు. ఆ వ్యాసంలో నవల ప్రస్తుత పరిస్థితిని గురించి కూడా ఆమె ప్రస్తావిస్తూ చారిత్రక నవలల ప్రాముఖ్యాన్ని వివరించారు. ''అసలు నవలలో చరిత్ర ఇమడ్చడమనే అంశం కొంత విచిత్రమైనదే. తెలిసిన వాళ్ళ మాటల్ని బట్టి చూస్తే నవల అనేది మనుష్యుల్ని కాలక్షేపం కోసం, వినోదం కోసం, హృదయరంజకత్వం కోసం చదివించే ప్రక్రియ. ఇందులో ఉపదేశాలు, అపచర్యలూ మొదలైన వాటిని అవగాహన చేసుకుని మనుష్యుడు లోకోపకారిగా మారతాడని ఆశించడం తప్పు కాదు గాని అది జరగడం అరుదు. ఒక్కో జాతిని ఉగ్గ్రూతలూపి, కళ్ళు తెరిపించి, గమ్యంవైపు నడిపించగల శక్తిని సంతరించుకునే నవలలు మొత్తం ప్రపంచమంతటిలోనూ చాలా తక్కువ. అందువల్ల నవల అన్న పదానికే హృదయరంజకమైన కళాత్మక ప్రక్రియ అని అర్థం చెప్పుకోవడంలో విప్రతిపత్తి లేదు.''[11]

వర్తమాన నవలా రచనల్లో లోపాల్ని ఎత్తిచూపించడమే కాకుండా వాస్తవిక నవల పునాదుల్ని అన్వేషించడానికి విమర్శకులు ప్రయత్నించారు. దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో ఇతర భారతీయ భాషల నవలా రచయితల గురించి, నవలల గురించి, అనువాదాల గురించీ వెలువడిన సాహిత్య వ్యాసాలు దీనికి ఉదాహరణగా నిలుస్తాయి. ముఖ్యంగా ప్రేమ్‌చంద్, కిషన్‌చంద్ లాంటి రచయితలపైన ఎన్నో వ్యాసాలు వెలువడ్డాయి. ఈ వ్యాసాలు కేవలం ఆయా రచయితల్ని, రచనల్ని పరిచయం చేయడమే కాకుండా రచనల లోతుపాతుల్ని లోతుగా చర్చించడం కూడా కనిపిస్తుంది. ఈ చర్చ కూడా తెలుగు సామాజిక సాహిత్య జీవనంతో ముడిపడి ఉండటం ఒక ప్రధాన విశేషం. ఈ తరహా విమర్శా వ్యాసాలకు ఉదాహరణ ఆంధ్రభూమి ఆదివారం అనుబంధంలో వెలువడిన 'గోదాన్ మాలపల్లి నవలల తులనాత్మక పరిశీలన' ''గోదాన్ మాలపల్లి నవలల్లో ఇతివృత్తాలను స్వీకరించటంలో రచయితల స్వాతంత్ర్యం నిరుపమానమైనది. మన భారతదేశంలో సామాన్య వ్యక్తి రైతు. సామాన్య జీవితానికి కొలతబద్ధ రైతు జీవితం. ఈ నవలలకు మూలాధారాలు సామాన్యులైన రైతు. వారి గ్రామీణ జీవితాలకు అడ్డుకట్టలు కట్టి నిరోధించాలనీ, పూడ్చి వెయ్యాలనీ ప్రయత్నించే వూరి పెద్దలు

మనకీ నవలలో కనిపిస్తారు. ఆర్థిక, సాంఘికాది సంబంధంగల అంశాలను చదవటం కథారూపాన దాన్ని మలచడం, చేతులు పంచముల వారి గూర్చి రాయబూనుట చెప్పుకోదగ్గ ముఖ్యాంశాలు.''[12]

సామాజిక బాధ్యతతో కూడిన సాహిత్య విమర్శ ఎంత ప్రయోజనవంతంగా రూపుదిద్దుకుంటుందో చెప్పడానికి ఈ దశాబ్ది నవలలపై దినపత్రికల్లో వచ్చిన విమర్శా వ్యాసాలే నిదర్శనం. సాహిత్య విమర్శ అనేది కేవలం రచయితల్ని పొగడడానికో, తెగడడానికో కాకుండా వారికి ఎంతో కొంత కొత్త దృష్టినీ అందివ్వాల్సి ఉంటుందన్న తాత్త్విక దృక్పథంతో వెలువడిన విమర్శా వ్యాసాలు ఈ కాలంలో ఎక్కువగా కనిపిస్తున్నాయి. అలాగే దినపత్రికలకు ఉన్న స్థలకాల పరిమితులను దృష్టిలో వుంచుకుని ఆలోచిస్తే ఇంత విశాలమైన పరిధి నుంచి సాహిత్య విమర్శ కొనసాగడం విశేషంగానే కనిపిస్తుంది.

పాదసూచికలు:

1. కొడవటిగంటి కుటుంబరావు, 'కల్పనా సాహిత్యంలో పాత్రల పాత్ర' - ఆంధ్రజ్యోతి దినపత్రిక, సాహిత్య వేదిక శీర్షిక. నవంబర్ 16, 1978.

2. శ్రీమతి సుశీల ఎం. ఏ., 'నేటి కథా సాహిత్యం - రచయిత్రులు' - విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, ఫిబ్రవరి 4, 1979.

3. 'హేతువాదం బలమైన ఆలోచనా శక్తిగల పాఠకులు పెంపొందితే తప్ప కల్పనా కలుపు తీసి నిజం మడిని పెంచలేరు. పాఠకుని విమర్శ రచయిత్రి భావవిస్తృతికి, నూతన ఊహాపథానికి దారి చూపాలి. అపుడు కానీ తెలుగు రచనలలో అవాస్తవికత అనే దౌర్భాగ్యం నశించదు'' - ఎం. కృష్ణకుమారి, ''రచయిత్రుల నవలల్లో అవాస్తవికత'' - ఆదివారం ఆంధ్రజ్యోతి, జనవరి 8, 1978.

4. ''తెలుగులో ఈనాడు నవలలు రాస్తున్న చాలామంది రచయిత్రులు ఇతివృత్త నిర్మాణంపట్ల గానీ, పాత్ర చిత్రణ పట్లగానీ సమాజంలోని వివిధ సమస్యల్ని - ప్రత్యేకంగా ఈనాటి స్త్రీ ఎదుర్కొంటున్న సమస్యల్ని చిత్రించటంపట్ల గానీ తగినంత శ్రద్ధను కనబరచటంలేదు. కేవలం వచ్చేవారం ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ ప్రేరేపించడం మాత్రమే వీరు రాస్తున్న నవలల్లో ప్రధానాంశంగా కనిపిస్తోంది.

ఆరంభ యవ్వనంలోని యువతీ యువకుల్ని ఒక రమణీయమైన కల్పనా ప్రపంచంలోకి తీసుకుపోతాయి. జీవితంపట్ల వాస్తవిక దృష్టిని పోగొట్టి ఒక రకమైన రొమాంటిక్ దృక్పథాన్ని కలిగిస్తాయి. మస్తిష్కానికి పదునుపెట్టే బదులు జో కొట్టి నిద్రపుచ్చుతాయి'' - నవీన్, ''ఆధునిక తెలుగు నవలా సాహిత్యం - ధోరణులు'' -

విశాలాంధ్ర, ఆదివారం దినపత్రిక, ఫిబ్రవరి 17, 1974.

5. పరిమళా సోమేశ్వర్, 'నేటి తెలుగు సాహిత్యంలో స్త్రీ పాత్రల చిత్రీకరణ' - విశాలాంధ్ర ఆదివారం దినపత్రిక, మార్చి 21, 1976.

6. దాశరథి రంగాచార్య, 'తెలుగు నవలలో సాంఘిక దృష్టి', విశాలాంధ్ర ఆదివారందినపత్రిక, డిసెంబర్ 31, 1978.

7. నవీన్, 1978. 'ఆధునిక తెలుగు నవలా సాహిత్యం - ధోరణులు' - విశాలాంధ్ర ఆదివారం దినపత్రిక, ఫిబ్రవరి 17, 1974.

8. శ్రీ పి. శ్రీనివాసరావు, 'తెలుగు నవలా రచనలో రావలసిన పరిణామాలు' - ఆంధ్రజ్యోతి దినపత్రిక, సాహిత్య వేదిక శీర్షిక, డిసెంబర్ 14, 1978.

9. ఏటుకూరి బలరామమూర్తి, విశాలాంధ్ర దినపత్రిక, 1975.

10. శ్రీమతి ఎస్. బీనా, 'చలం నవలలు - స్త్రీ పాత్రలు' విశాలాంధ్ర ఆదివారం దినపత్రిక, ఏప్రిల్ 20, 1975.

11. నాయని కృష్ణకుమారి, 'చారిత్రక నవలలు' విశాలాంధ్ర ఆదివారం దినపత్రిక, జనవరి 14, 1979.

12. ఎన్. స్వామి, 'గోదాన్ - మాలపల్లి నవలల తులనాత్మక పరిశీలన' ఆంధ్రభూమి ఆదివారం దినపత్రిక, మే 18, 1980.

★★★

# బి. ప్రధాన వ్యాసాలు - కథా సాహిత్యం

1970ల మధ్య తెలుగు కథా సాహిత్యంలో అనేక ప్రయోగాలు జరిగాయి. ఇతివృత్తాలను వాస్తవిక దృష్టితోపాటు ప్రయోగదృష్టి కూడా స్వీకరించే పద్ధతికి తెలుగు కథా రచయితలు స్వీకారం చుట్టారు. దీనివల్ల కథానిక అంతవరకు అస్పృశ్యం వున్న జీవన కోణాల్లోకి కూడా ప్రయాణించగలిగింది. ఈ దశాబ్ది సాహిత్య అనుబంధాల్లో కథా సాహిత్యంపై వచ్చిన విమర్శా వ్యాసాలను పరిశీలిస్తే ఈ మార్పులు మనకు కనిపిస్తాయి. కథా రచనలో ఇతివృత్త పరంగానూ, ప్రమాణ పరంగానూ వచ్చిన మార్పులను ప్రతిఫలించటమే కాకుండా వాటి లోటుపాట్లపైన కూడా ఈ వ్యాసాల్లో నిశితమైన చర్చలు జరిగాయి.

1970-80ల మధ్య కథా సాహిత్యంపై వచ్చిన విమర్శా వ్యాసాలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. ఒకటి! కథకి సంబంధించిన మౌలికమైన అంశాలను చర్చించే విమర్శా వ్యాసాలు. రెండు! విడివిడిగా కథా రచయితలపైన రచనలపైన ప్రత్యేకంగా రాసిన విమర్శ వ్యాసాలు. మొదటి తరహా వ్యాసాల్లో సమకాలీన కథా సాహిత్యంపైన సాధారణీకరించిన అంశాలపై చర్చ కనిపిస్తుంది. ఈ తరహా వ్యాసాలు కథల్లో కొత్తగా వచ్చిన లక్షణాలను శోధించడంతోపాటు అవి పాఠకుడిగా ఏ కారణం వల్ల సన్నిహితమయ్యాయో వివరించే ప్రయత్నం జరిగింది. ''నేటి కథలలోని మరో విశేషం.... కల్పనకు ఎక్కువ తావివ్వకుండా అనుభూతులను విశేషంగా చిత్రించటం నేటి కథలలోని మరో విశేషం. ఈనాటి కథలపై ఎక్కువగా పాశ్చాత్య ప్రభావం వున్నది. ఏది యేమైనా కథా సాహిత్యం తామరతంపరగా అల్లుకుపోయిన ఈ కాలంలో స్త్రీలు, పురుషులన్న విభేదం లేకుండా ఎంతోమంది రచయిత్రులు రచయితలూ వెలుగులోకి వస్తున్నారు.[1] ఈ దశాబ్దంలో కథా రచనలో కాల్పనికతకు బదులు వాస్తవికత ప్రధాన లక్షణం కనిపించడం ఒక మౌలికమైన మార్పు. నిర్మాణపరంగా జరిగిన ప్రయోగాల్లో కూడా వాస్తవిక దృష్టి ప్రధానంగా కనిపిస్తుందని ఆయా విమర్శకుల వ్యాసాల్లో అభిప్రాయాలను ప్రకటించారు. ముఖ్యంగా మనోవైజ్ఞానిక విశ్లేషణ ఈ దశాబ్ది కథల్లో మరింత గాఢంగా కనిపిస్తుంది. మనోవైజ్ఞానిక కోణం ఆవిష్కృతమవడంతో కథలో శిల్పమే పూర్తిగా మారిపోయింది. ''ఈనాడు వచ్చే కథలలో మనో వైజ్ఞానిక విశ్లేషణ జీవిత సత్యాలను యధాతథంగా

చిత్రీకరించటంపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించటం జరుగుతున్నది. నేటి కథలలోని మరో విశేషం సంక్షిప్తత. క్లుప్తంగా అందంగా చెప్పదలచుకున్నదేదో చెప్పివేయటం మరో ముఖ్య విశేషం. కథ ఎత్తుగడే ప్రత్యేకంగా ఆకర్షకంగా వుండటం పూర్తయేదాకా వదిలిపెట్టకుండా చదివే ఉత్కంఠతను కలిగించటం నేటి కథలలోని మరో విశేషం.'[2]

రెండో తరహా వ్యాసాల్లో విడివిడిగా కథల మీద, కథా రచయితల మీద వచ్చిన విమర్శ రచనలు. సమకాలీన కథకి కొత్త విలువను సంతరించిన రచయితల్లో ప్రత్యేకంగా కనిపించే లక్షణాలను విడమరిచే వ్యాసాలు ఈ తరహాలో వున్నాయి. కాళీపట్నం రామారావు కథలపైన ఈ దశాబ్దంలో వివిధ దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో విస్తృతమైన చర్చలు జరిగాయి. ''కాళీపట్నం రామారావు కథా వస్తువు సామాన్య మానవుడు - వాడి బతుకు. సామాన్య మానవుడి బతుకు ఎలా భగ్నమవుతున్నదో ట్రాజిడీ అవుతున్నదో నోరూ వాయలేని సామాన్యుడి స్థితి రోజురోజుకీ ఎంత హీనమై పోతుందో, అతి మామూలు కోరికలను తీర్చుకోవడానికి కూడా ఎంత వేదనకి గురికావలసి వస్తున్నదో, ఆర్థికంగా ఎలా దోపిడీకి గురవ్వవలసి వస్తున్నదో జీవిత యధార్థంలో నుండి కథల్లో చెప్పడానికి శ్రీ రామారావు ప్రయత్నించారు. ఈ యధార్థాన్ని చిత్రీకరించే ప్రయత్నంలో ఆయన తన పాత్రలని, వాటి మనోభావాలని మనఃక్లేశాలని, సంఘర్షణలను విశ్లేషించి చూపెట్టడానికి విస్తృత పరిధిలో పెద్ద కాన్వాసును తీసుకున్నారు. వీరి పాత్రల్లో పరిస్థితులకు తలఒగ్గి రాజీ పడుతున్న పాత్రలు, సంఘర్షణకి దూరంగా పలాయనం చేసిన పాత్రలు, ఎదురుతిరిగి పోరాడే పాత్రలూ వున్నాయి.''[3] కాళీపట్నం రామారావు కథల్లో రాజకీయార్థిక విలువలు వ్యక్తిగత సంఘర్షణలకు దారితీసే సామాజిక స్థితిని ఇతివృత్తంగా గ్రహించడం కొత్త లక్షణం. అలాగే శిల్పపరంగా కూడా వాస్తవిక జీవన పరిధుల్ని దాటకుండా వుండటం మరో ముఖ్య లక్షణం. ఈ అంశాన్ని చాగంటి తులసి విశాలాంధ్ర ఆదివారం అనుబంధంలో సాహితీ లోకం శీర్షికన వెలువడిన వ్యాసంలో విపులంగా విశ్లేషించారు. ''పల్లెటూరి జీవితం, జనం భాష రచయితకు బాగా తెలుసు. అందులో సందేహం లేదు. సిద్ధాంతం చెప్పిన పాత్రలు అసహజంగా, సిద్ధాంతం లేని పాత్రలు సజీవంగా మన ముందు కనపడతాయి. పరిస్థితులతో రాజీపడే పాత్రలు, సిద్ధాంతాన్ని ఆపాదించకుండా వాస్తవిక జీవితంలో నుండి మలచిన పాత్రలు అన్నీ శక్తివంతంగా వ్యక్తిత్వంతో సహజంగా కనపడతాయి. ఆ పాత్రల అంతర్మథన పాత్రల ప్రవృత్తి కనుగుణంగా సహజంగా రూపొందించి నిశిత పరిశీలనతో జీవిత వాస్తవికత నుండి తీర్చిదిద్దబడిన పాత్రలు 'ఆర్తి' కథలో ఎర్రెమ్మ, బంగారి, వాళ్ళ తగువు సన్నివేశ చిత్రణ, హింస కథలో పైడమ్మ గురించి తల్లీ చుట్టాలు పడిన మథన మొదలైన వాటిలో శక్తివంతమైన చిత్రణ కనపడుతుంది.''[4] ఆయా కథా రచయితల్లోనూ గుణాత్మకమైన అంశాలనే కాకుండా లోపాలను సైతం నిస్సంకోచంగా ఎత్తి చూపించే విమర్శా వ్యాసాలు కూడా ఈ దశాబ్దిలో కనిపిస్తాయి. తామరతంపరగా వస్తున్న కథల్లో నిర్మాణపరంగా వుండే లోపాల్ని విడమరచి

చెప్పడంతోపాటు దృక్పథపరంగా చిత్తశుద్ధి లేకపోవడం కూడా విమర్శకులు ప్రధాన అంశంగా చర్చించారు. ''ఈనాటి యువ పాఠకుల్లో భాషా జ్ఞానం భావనా వైశిష్ట్యం కొంత లోపించినట్లు తోస్తుంది. మళ్ళీ దీనికి అనేక కారణాలు. నేటి విద్యా బోధన కూడా సరైన పద్ధతిలో లేకపోవడం ఒక కారణం. రకరకాల పాఠ్యాంశాలతో సతమతమవుతున్న నేటి యువతరం భాషను పెంపొందించుకోవటానికి ఆరోగ్యకరమైన హృదయ విశాలత అలవరచుకోవడానికి అవకాశాలు ఎక్కువగా వుండటంచేత, ఏ పాఠ్యపుస్తకాల మధ్యనో పెట్టుకుని కథలు, నవలలు చదువుతుంటే ఏదో చదువుదామన్న ఆతృత, 'ఆ!... చదివిందంతా ఎక్కడ గుర్తు పెట్టుకోగలం' అన్న నిర్లక్ష్యం ద్యోతకమవుతున్నది.''[5]

పత్రికల సంఖ్య ఎక్కువవడం, ప్రతీ పత్రిక విధిగా కథల్ని ప్రచురిస్తూ వుండటం వల్ల పెద్ద సంఖ్యలో కథలు వెలువడేవి. ఈ దశాబ్దిలో ఎందరో వర్ధమాన రచయితలు కథా సాహిత్య వేదికపైకి ప్రవేశించారు. వాటిల్లో నిర్మాణపరంగా లోపాలు వుండటం సహజం. పైగా మాండలికంలో కథలు రాసే సాంప్రదాయం కూడా మొదలవడంతో శిల్పపరమైన లోటుపాట్లు కూడా కనిపించేవి. సమకాలీన విమర్శకులు వాటిని ఎప్పటికప్పుడు దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో వ్యాసాల ద్వారా చర్చించేవారు. ఈ చర్చ ఎంత దూరం వెళ్ళిందంటే కొడవటిగంటి కుటుంబరావు వంటి ప్రసిద్ధ రచయితలు కూడా విమర్శకుల బారిన పడక తప్పలేదు.

''విరసం : ఈ సైద్ధాంతిక పెడమార్గమే వారిని క్రమంగా విరసంవైపు ఆకర్షించింది. విరసంలో చేరిన తరువాత పెద్ద కథలు రాయలేదు. సిద్ధాంత వ్యాసాలతో ముగించుకున్నారు. రచయితగా వారు మరణించారు. యాంత్రిక భౌతిక వాదిగా, అస్పష్ట అతివాదిగా మిగిలిపోయారు.''[6]

కథా రచన వర్తమాన పరిస్థితినీ నిష్పక్షపాతంగా విశ్లేషిస్తూ వెలువడిన వ్యాసాలు అసంఖ్యాకంగా కనిపిస్తాయి. అలాగే కథా సాహిత్య భవిష్యత్తును వివరించే రచనలు కూడా ఈ దశాబ్దంలో వెలువడ్డాయి. ఈ చర్చలన్నింటినీ ఆశావహ దృష్టితో విశ్లేషించడానికి అన్నట్టుగా విశాలాంధ్ర దినపత్రిక 1980లో రేపటి కథా సాహిత్యం శీర్షికన కొడవటిగంటి కుటుంబరావుగారు ఎప్పుడో 1956లో అభ్యుదయలో రాసిన వ్యాసాలను పునర్ముద్రించారు. 'కథా రచన గురించీ, కథల యొక్క సాంఘిక ప్రయోజనం గురించీ కథకుడు నిర్వహించవలసిన పాత్ర గురించీ సరైన అభిప్రాయాలు వ్యాప్తి చెందినట్లయితే రేపటి కథా సాహిత్యం ఉజ్వలంగా ఉంటుంది. ఇంతకు రెండింతలు కథలు వచ్చినా అవి జీవితాన్ని సాధించడానికి తోడ్పడగలుగుతాయి. (అభ్యుదయ, 1956, మే)''[7] నిజానికి కుటుంబరావు గారు పాతికేళ్ళ క్రితం చెప్పిన ఈ అంశాలు ఈ దశాబ్ది కథకు కూడా వర్తిస్తాయి కాబట్టే విశాలాంధ్ర సాహిత్య అనుబంధం ఆ వ్యాసంలోని అంశాలను తిరిగి చర్చకు పెట్టింది. అంటే సమకాలీన సాహిత్య మార్గాన్ని నిర్దేశించడంలోగానీ వర్తమాన సాహిత్య ధోరణులకు బలాన్ని అందివ్వడంలోగానీ దినపత్రికల పాత్ర ఎంత

ప్రయోజనవంతంగా ఉంటుందో దీన్నిబట్టి అర్థమవుతుంది.

పాదసూచికలు:


1. కుమారి నాగపద్మినీదేవి, పుట్టపర్తి, 'తెలుగు కథా సాహిత్యం - ఒక పరిశీలన', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం జూలై 13, 1980.

2. కుమారి నాగపద్మినీదేవి, పుట్టపర్తి, 'తెలుగు కథా సాహిత్యం - ఒక పరిశీలన', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం జూలై 13, 1980.

3. కుమారి చాగంటి తులసి, 'కాళీపట్నం రామారావు కథల్లో పాత్రలు - సంఘర్షణ' విశాలాంధ్ర ఆదివారం దినపత్రిక, సాహితీ లోకం శీర్షిక, జూన్ 1, 1980.

4. కుమారి చాగంటి తులసి, 'కాళీపట్నం రామారావు కథల్లో పాత్రలు - సంఘర్షణ' విశాలాంధ్ర ఆదివారం దినపత్రిక, సాహితీ లోకం శీర్షిక, జూన్ 22, 1980.

5. కొండముది రుక్మిణీదేవి, 'తెలుగు కథ తీరుతెన్నులు' ఆంధ్రప్రభ దినపత్రిక, అక్టోబర్ 20, 1977.

6. ఏటుకూరు బలరామమూర్తి, 'కుటుంబరావు రచనలు, తాత్త్వికత, ఒక పరిశీలన' విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, నవంబర్ 2, 1980.

7. కొడవటిగంటి కుటుంబరావు, 'రేపటి కథా సాహిత్యం' - విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, ఆగస్టు 24, 1980.


★★★

# సి. అనువాద వ్యాసాలు

తెలుగు దినపత్రికల్లో సాహిత్య వ్యాసాలకు తగినంత ప్రాముఖ్యం ఏర్పడిన తరువాత విస్తృత సంఖ్యలో సృజనాత్మక రచనలతోపాటు విమర్శనాత్మక వ్యాసంగం కూడా కొనసాగింది. ముఖ్యంగా తెలుగులో భాషా సాహిత్య వికాసాల గురించి మాత్రమే కాకుండా ఇతర భాషా సాహిత్యాల్లోనూ ప్రపంచ సాహిత్యంలోనూ వస్తున్న అనేక రచనల అనువాదాలు, రచయితల విశేషాలు ముఖ్యమైన గ్రంథాల మీద చర్చలు మొదలయ్యాయి. ప్రధానంగా ఒక నిర్దిష్టమైన దృక్పథమున్న దినపత్రికల్లో ఉదాహరణకు విశాలాంధ్ర! ఇలాంటి ప్రపంచ సాహిత్య విశేషాలు కనిపిస్తున్నాయి. జీవితంలోనూ విభిన్న పార్శ్వాలనే కాకుండా వ్యక్తి జీవితాన్ని ఒక సామూహిక అంశంగా భావించిన రచయితలు రచనల గురించి ఇలాంటి దినపత్రికల్లో ఎంతో విలువైన చర్చ పెరిగింది. విశాలాంధ్ర దినపత్రిక సోవియట్ రచయితల గురించి తెలుగు విమర్శకులు రాసిన వ్యాసాలతోపాటు సోవియట్ విమర్శకులు రాసిన విమర్శనా వ్యాసాలను అనువదించి ప్రచురించింది. అయితే ఈ విమర్శల వ్యాసాల అనువాదంలో విశాలాంధ్ర ప్రాతినిధ్యం వహిస్తున్న వామపక్ష దృక్పథం బలంగా కనిపిస్తోంది. ''కవి తన ఊహా ప్రపంచంలో జీవిస్తూ పువ్వులను గురించి, ప్రకృతి సౌందర్యాన్ని గురించి గానం చేస్తూ వుండాలా లేక మానవ జాతి ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను తీసుకుని పాఠకులను ఉత్తేజపరచాలా!''[1] అని సోవియట్ విమర్శకులు ఓల్జాస్ సులైమనోవ్ సోవియట్ కవితలో సూచన ధోరణులను పరిచయం చేస్తూ ఒక ప్రశ్నను లేవనెత్తారు. విశాలాంధ్రలోని అదే పేజీలో 'ఆసియా ఆఫ్రికా రచయితల ఉద్యమంలో కొత్త దశ' అనే అంశంపైన దిమిత్రీ ఆర్థమత్స్కీ మరో వ్యాసం రాశారు. రచయితను ఒక ముఖ్య సామాజిక శక్తిగా భావిస్తూ ప్రజల భవిష్యత్తులో స్వాతంత్ర్యం కోసం, సామాజిక ప్రగతి కోసం వారు సాగించే పోరాటంలో రచయితకు విడదీయరాని పాత్ర వుంటుందన్న దృక్పథంతో ఈ విమర్శ సాగింది. లియోటాల్‌స్టాయ్ వంటి రచయితల రచనల్ని విశ్లేషిస్తున్నప్పుడు కూడా ఈ దృక్పథాన్నే గీటురాయిగా తీసుకోవడం ఈ పత్రికలో వచ్చిన విమర్శ వ్యాసాల ప్రధాన లక్షణం.''[2] ప్రసిద్ధ కవి రసూల్ రంజతోవ్ 'ఎవరి దూతను నేను' అనే వ్యాసంలో ఇలా అంటారు. 'నాదఘిస్తాన్‌కు, మానవ సంస్కృతికి ఒక ప్రతినిధిలాగా నేను అసాధారణమైన ఆ దూత పదవిలో తిరిగి వస్తుంటాను. నా యావత్తు దేశానికీ అంటే కాదు ప్రపంచానికంతటికీ

కూడా నేనొక ప్రతినిధిని''[3] అంటారు. రచయితల వ్యక్తిగత జీవన చిత్రాలను చూపించడం విశాలాంధ్ర ఆదివారం అనుబంధ వ్యాసాల్లో కనిపిస్తుంది. పాబ్లోనెరూడా, సజ్జాద్ జహీర్ లాంటి ఎందరో రచయితల సాహిత్య సేవను విశాలాంధ్ర పత్రిక తెలుగు పాఠకులకు అందించింది. ప్రముఖ ఉర్దూ రచయిత సజ్జాద్ జహీర్ కన్ను మూసినపుడు ఆ వార్తను మొదటి పేజీలో ప్రముఖంగా ప్రచురించడమే కాకుండా ఆయన గురించి ప్రత్యేక వ్యాసాలను విశాలాంధ్ర ప్రచురించింది.

ఇరుగు పొరుగు సాహిత్య పత్రికల గురించి ఆంధ్రప్రభ దినపత్రిక కళా సాహిత్య విజ్ఞాన వేదికలో విశిష్టమైన వ్యాసాలు వెలువడ్డాయి. ఇతర భాషల గురించి సృజనాత్మకంగా తెలుగువారు స్వీకరించిన వివిధ అంశాలను విడమరచి చెప్పే వ్యాసాలు తులనాత్మక సాహిత్య అధ్యయనానికి విశేషంగా ఉపయోగపడ్డాయి. ఉదాహరణకు ''ఇరుగుపొరుగు సాహిత్య ప్రక్రియలో-1' శ్రీ తిమ్మావఝ్ఝల కోదండరామయ్య ఇతర భాషా సాహిత్యాల ప్రభావం గురించి వివరిస్తూ ఇలా అంటారు. ''ఒక భాషలో ఒక సాహిత్య ప్రక్రియ బాగా వ్యాప్తి పొంది ప్రచారంలో వున్నపుడు దానిని చూసి అలాంటి ప్రక్రియనే తన భాషలోనూ ఒక కవి చేపట్టడంవల్ల తరువాతి కవులు కూడా కొందరు దాన్నే అనుసరించి రచించడం వల్లా అది ఒక సాహిత్య ప్రక్రియగా ఆ సాహిత్యంలో స్థిరపడిపోవచ్చు.''[4] అంటే ఇతర భాషల ప్రభావం సృజనాత్మకంగా ఎలా ఉంటుందో దీన్ని బట్టి అర్థమవుతోంది. మిగతా భాషలలో ప్రసిద్ధులైన ఎందరో రచయితల గురించి ఈ కాలంలోనే అనేక వ్యాసాలు వెలువడ్డాయి. ఆంధ్రజ్యోతి దినపత్రికలో శ్రీ వాసవ్య, శ్రీ మానేపల్లి, ఎం.ఎస్. మహంతయ్య, శ్రీ పురిపండా అప్పలస్వామి, శ్రీ కౌముది, శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ, శ్రీమతి ఇంద్రగంటి జానకీబాల, శ్రీ సంజీవ్‌దేవ్, శైలకుమార్ వంటి వారు విలువైన వ్యాసాలు రచించారు. ఆధునిక భారతీయ సాహిత్య లహరి శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆదివారం అనుబంధంలో వివిధ భారతీయ భాషల సాహిత్య పరిణామాలపైన సాధికారికమైన విమర్శా వ్యాసాలు వెలువడ్డాయి. ముఖ్యంగా ఒరియా సాహిత్యం గురించి పురిపండా అప్పలస్వామి రాసిన వ్యాసాలు పేర్కొనదగినవి.[5, 6, 7] అదే సమయంలో సమకాలిక సమాజాన్ని ప్రభావితం చేసిన పాశ్చాత్య రచయితల గురించి పరిచయాత్మక వ్యాసాలు ప్రచురితమయ్యాయి.[8, 9 10]

వివిధ భారతీయ భాషలలో రచయితలను ప్రభావితం చేసిన రచనల్ని, ధోరణుల్ని ఈ వ్యాసాల ద్వారా విమర్శకులు విశ్లేషించారు. ముఖ్యంగా మహాకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రభావాన్ని గురించి అనేక విమర్శా వ్యాసాలు వెలువడ్డాయి. ఆయా భాషలలో సృజనాత్మక ప్రక్రియలపై టాగూర్ ప్రభావం ఎంతమేరకు పడిందో పరిశోధించే ప్రయత్నం జరిగింది.[11]

సాహిత్యంలో ప్రతీ మార్పు కాలానుగుణంగా ఉంటుంది. భారతీయ సాంస్కృతిక విలువలకు సంబంధించి కొన్ని మౌలికాంశాలు ఒకే విధంగా ఉంటాయి. అవి భాషా సాహిత్యాలపై కూడా ప్రధాన ప్రాతిపదికలుగా ఉపయోగపడతాయి. ఆ ప్రాతిపదికల

గురించి వివిధ భాషా సాహిత్యాల మధ్య తులనాత్మక అధ్యయనం ఈ దశాబ్ది దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో ప్రత్యేకంగా కనిపించే అంశం. కన్నడ, బెంగాలీ సాహిత్యాలపై వచ్చిన విమర్శా వ్యాసాలు దీని కుదాహరణ.[12,13,14]

ఈ తరహా వ్యాసాల్లోనూ మౌలిక భావనలపై రాసిన వ్యాసాలు విడిగా రచయిత పేరన రాసిన వ్యాసాలు రెండు విధాలుగా కనిపిస్తాయి. ఒక్క రవీంద్రనాథ్ టాగూర్[15] గురించి మాత్రమే కాకుండా ఈ రకంగా వచ్చిన వ్యాసాల్లో ఉర్దూ సాహిత్యంలోని ప్రగతిశీల రచయితలపైన వచ్చిన వ్యాసాలు కనిపిస్తాయి.[16,17]

అలాగే ఉర్దూ సాహిత్య ప్రక్రియల మీదా విశ్లేషణాత్మక రచనలూ వచ్చాయి.[18]

ఇదే దశలో ఆయా భాషల మధ్య ఉన్న భాషాపరమైన బంధుత్వాన్ని అన్వేషించే ప్రయత్నం కూడా కనిపిస్తుంది.[19]

తెలుగులోకి ఆయా రచయితల అనువాదాలు మాత్రమే కాకుండా ఆయా భాషలపై విశ్లేషణాత్మక విమర్శా వ్యాసాలు రావడం విశేషం. దీనివల్ల సమకాలీన రచయితల దృక్పథ పరిధి విస్తరించడానికి అవకాశం ఏర్పడింది. ఇదే సందర్భంగా ఇతర భాషలలో తెలుగు సాహిత్యంపై జరుగుతున్న కృషిని వివరించటానికి భాషా సాహిత్య విమర్శకులు ప్రయత్నించారు. ఇతర రాష్ట్రాలలో జరుగుతున్న సాహిత్య కృషిని ఈ విమర్శకులు వివరించారు.[20]

అమెరికా, రష్యా వంటి దేశాల్లో తెలుగు సాహిత్య రంగంపై జరుగుతున్న పరిశోధనాత్మక కృషిని కూడా ఈ దశలో గమనించవచ్చు.[21]

పాదసూచికలు:

1. ఓల్జాస్ సులైమనోవ్, 'సోవియట్ కవితలో సూచన ధోరణులు', విశాలాంధ్ర దినపత్రిక, అక్టోబర్ 21, 1973. 3వ పేజీ ప్రసంగ వ్యాసం.

2. ''ప్రతీ వ్యక్తిలోనూ ప్రజా సమూహాల్ని అభిమానించారు. వ్యక్తిని అతని వ్యక్తిత్వాన్నిగానీ, ప్రజలనుగానీ అంత ఉదాత్త స్థితికి లేవనెత్తిన మరో రచయిత లేరు'' యుగ సందర్శకుడు, లియో టాల్‌స్టాయ్ ప్రత్యేక వ్యాసం - విశాలాంధ్ర దినపత్రిక, అక్టోబర్ 21, 1973.

3. 'ఎవరి దూతను నేను?' రసూల్ గమ్జతోవ్ - విశాలాంధ్ర దినపత్రిక, ప్రత్యేక వ్యాసం, సెప్టెంబర్ 23, 1973.

4. శ్రీ తిమ్మావఝ్ఝల కోదండరామయ్య, 'కళాసాహిత్య విజ్ఞాన వేదిక' ఆంధ్రప్రభ దినపత్రిక, ఆదివారం అనుబంధ సంచిక, సెప్టెంబర్ 13, 1970.

5. 'ఒడియా ప్రగతి కవులకు దివిటీ పట్టిన ప్రఖ్యాత రచయిత కామ్రేడ్ భాగవతీచరణ

పాణిగ్రాహి, విప్లవకరమైన కవితలతోను, రచయితలతోనూ యువతరాన్ని ఉద్రేకపరచిన యువకుడు. బయటికి ఎంత సౌమ్యుడో లోపల అంత విప్లవవాది' - 'ఒడియా సాహిత్యంలో ప్రగతి కవిత ప్రాదుర్భావం' శ్రీ పురిపండా అప్పలస్వామి, ఆంధ్రజ్యోతి ఆదివారం దినపత్రిక, జనవరి 16, 1977.

6.''రౌత్‌రామ్ కర్షకులు, కార్మికులు, దీనుల పక్షం వహించి ప్రభుత్వాన్ని, ధనికవర్గాన్ని ఎదిరించినట్టే కలలతో కవిత్వం అల్లే భావకవులను, పలాయనవాద రచయితలను తీవ్రంగా తిరస్కరించాడు. పాతను పరిత్యజించాడు'' - శ్రీ పురిపండా అప్పలస్వామి, 'కొత్త పుంతలు తొక్కుతున్న ఒడియా కవిత్వం.' ఆధునిక భారతీయ సాహిత్య లహరి శీర్షిక ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, జనవరి 23, 1977.

7.''గోపినాథ్ మహంతి ఒరియా నవలా సాహిత్యంలోనే కాదు, భారతీయ నవలా సాహిత్యంలోనే ఈయనది ఒక ప్రత్యేక స్థానమని చెప్పవచ్చు. నిన్న, మొన్నటి వరకు వెలుతురు చూరని కొండలు, అడవులు, శ్రమను లెక్కచేయకుండా తిరిగి ఆదివాసుల జీవన రీతులను, వారి మనస్తత్వాలను, సాంఘిక ఆచారాలు అధ్యయనం చేసి సృష్టించినవి ఆయన నవలలు - శ్రీ పురిపండా అప్పలస్వామి, 'ఒడియా సాహిత్యంలో నవల, నాటకం'. ఆధునిక భారతీయ సాహిత్య లహరి శీర్షిక, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఫిబ్రవరి 6, 1977.

8.''పాబ్లోనెరూడా తన కవిత ద్వారా, ఆడెన్ కవితాత్మకమైన రూపకాల ద్వారాప్రపంచంలోని దుస్సంఘటనలను, కుటిల రాజకీయాలను విమర్శించి ప్రజలను హృదయాలు కదిలేటట్లు ప్రబోధించారు. ఘోరమైన వాస్తవాల గురించి కళ్ళు కరిగిపోయే, నరాలు తెగిపోయే భావాలను పాఠకుల ముందుంచారు.'' - శ్రీ మానేపల్లి సత్యనారాయణ, 'సమకాలిక సమాజాన్ని ప్రభావితం చేసిన ఇద్దరు పాశ్చాత్య మహాకవులు'' నెరూడా, ఆడెన్, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, ఫిబ్రవరి 3, 1974.

9.''మహారచయిత వోల్టేర్... దానికి తగ్గట్టుగానే ఆయన రచనలలో అత్యధిక శాతం సునిశితమైన వ్యంగ్యం, అపహాస్యం చోటు చేసుకునేవి. '18వ శతాబ్దిని ప్రభావితం చేసిన మహా రచయిత వోల్టేర్.' కౌముది, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, జూన్ 12, 1977.

10.1977 నోబెల్ సాహిత్య బహుమతి పొందిన స్పానిష్ కవిశేఖరుడు, విసెంటె ఆలెక్స్యాండ్రె, శ్రీ ఇస్మాయిల్, ఆంధ్రజ్యోతి, ఆదివారం దినపత్రిక, అక్టోబర్ 16, 1977.

11.''మన తెలుగు భాష కవిత్వం, హిందీలో ఛాయావాదం గుబగుబలాడుతున్నాయి. బెంగాల్‌లో కల్లోల యుగం కల్లోల పరుస్తూ వుంది. భారతీయ సాహిత్యాకాశం మీద రవీంద్రుడు నడిమింటి రవిలాగా వెలుగుతున్నాడు.

ఆ వెలుగు ఆనాటి ఆధునికులందరి మీదా ప్రసరించడం సహజం. అయితే అది ఒడియా యువతరం మీద మరింత అధికంగా పడింది. శ్రీ పురిపండా అప్పలస్వామి, 'ఒడియా సాహిత్యంలో పద్య ప్రక్రియ, ఆధునిక భారతీయ సాహిత్య లహరి, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, జనవరి 9, 1977.

12. 'ఇతర భారతీయ సాహిత్యాల మాదిరిగా కన్నడ సాహిత్యం కూడా సమకాలీన ప్రజ్ఞతో యుగ ధర్మానికి అనుగుణంగా ముందంజ వేస్తున్నది.' - శ్రీ ఎం.ఎస్. మహంతయ్య. కన్నడ నాటకంపై పాశ్చాత్య ప్రభావం, ఆధునిక భారతీయ సాహిత్య లహరి, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, జనవరి 2, 1977.

13. 'యుద్ధానంతరం నవలాకారుల దృక్పథం చాలా మారింది. నవల, కథానికల ఇతివృత్తాలు మార్పు చెందడానికి దేశ ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థితిగతులే కారణం. యుద్ధం వల్ల సంభవించిన నష్టాలు, గత చరిత్ర ఆధారంగా నవలా రచన సాగింది.' - షర్మిలా బెనర్జీ, బెథన్ కాలేజి, కలకత్తా యూనివర్సిటీ, 'బెంగాలీ సాహిత్యంలో నవల, కథానిక, నాటకం' ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, ఫిబ్రవరి 20, 1977.

14. 'స్వీయ దుఃఖ గాథల నధిగమించి జాతి నిజ స్వరూపాన్ని, సమాజ పరిస్థితిని, మధ్యమ వర్గాల వారి కష్టాలను, శాపంగా పరిణమించిన నాగరికతా వ్యామోహాన్ని గుర్తెరిగిన కవులు, విష్ణుడే, సమర్ సేన్‌లు' - షర్మిలా బెనర్జీ, 'బెంగాలీ సాహిత్యంలో నవ్య కవితా రీతులు, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఫిబ్రవరి 13, 1977.

15. 'ప్రకృతిలో తను దర్శించిన ఆధ్యాత్మిక సౌందర్యాన్వేషణ ఆయన కవితలలో ఆధ్యాత్మిక ఆవేదనగా మారింది. కావ్యంలోని ప్రకృతి వర్ణనలు ఆధ్యాత్మిక పరిభాషికల ప్రతీలుగా నిలిచిపోయాయి. ప్రకృతిలోని మూగతనం ఆయన స్వభావంలో మూగ వ్యధను ప్రవేశపెట్టింది' - శ్రీవాసవ్య, 'రవీంద్రుని కలం నుంచి జాలువారిన ప్రేమ సౌందర్యారాధన' ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆగస్టు 9, 1970.

16. 'ఆ కాలంలో ఉర్దూ సాహిత్యంపై భక్తివాదం, భావకవిత్వాల ప్రభావం ఇంకా పూర్తిగా తగ్గలేదు. కవిత్వంలో గజల్‌తోపాటు నజం ప్రక్రియ కూడా నెమ్మదినెమ్మదిగా అభివృద్ధి చెందుతూ ఉంది. అలాంటి సమయంలోనే ఇక్బాల్ వంటి మహాకవి రంగంలోకి వచ్చాడు. ఆయన చేతులలో నజం ప్రక్రియ పూర్తిగా రంగులను సంతరించుకోవడమే కాదు. ఉర్దూ కవిత్వం అమాంతంగా అత్యున్నత శిఖరాలను అందుకున్నది' - సర్ మహమ్మద్ ఇక్బాల్ కవితా వైదుష్యం, 'ఉర్దూ పారశీక సాహితీ ప్రపంచాలను ప్రభావితం చేసిన మహాకవి. ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, ఫిబ్రవరి 5, 1978.

17. 'కిషన్ కళాచైతన్యం ముమ్మూర్తులా ఆధునికమైనది. అంతర్జాతీయ వైజ్ఞానిక తాత్త్విక చైతన్యం లేనిదే ఆధునికత్వానికి అవకాశం లేదు. అంతర్జాతీయ చైతన్యంతో ఆధునికత్వానికి సంబంధం లేదనుకునేవారు ఎప్పటికైనా సంప్రదాయ ఋడులై పోవడం

ఖాయం. కర్తవ్యోన్ముఖుడైన మానవుడు ఎక్కడ వాడైనా కీర్తినీయుడేననేది ఈ రచయిత అవగాహనలో ప్రధాన ధాతువు. కనుకనే అతని కథలలో అనేక దేశాల మానవులూ, అనేక చారిత్రక ఘట్టాల భాగస్వాములూ దర్శనమిస్తారు' - శ్రీ సోమసుందర్, 'బాహ్య వాస్తవికతను కళామయంగా ప్రతిబింబించిన కథనశిల్పి కిషన్‌చందర్' విశాలాంధ్ర ఆదివారం దినపత్రిక, ఫిబ్రవరి 4, 1978.

18. 'భావ కవితా పితామహుడైన శ్రీ దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రిపై కూడా ఈ ఉర్దూ సాహిత్య ప్రభావం కొంత వుందేమోననిపిస్తుంది' - శైలకుమార్, 'ప్రేయసి చుట్టూ తిరిగిన ఉర్దూ కవిత' ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, మార్చి 5, 1978.

19. 'భాషా దృష్టితో పరిశీలిస్తే తెలుగు, మళయాళములు దగ్గరి చుట్టాలు. ద్రవిడ భాషా కుటుంబానికి చెందిన భాషలవి. కానీ చారిత్రకంగానూ, సాంస్కృతికంగానూ పరిశీలిస్తే తెలుగువారూ, మళయాళీలూ అంత సన్నిహితులు కారు. తెలుగు వారికి కన్నడిగులకూ, తెలుగు వారికీ, తమిళులకూ మధ్య నెలకొన్న దగ్గరి చుట్టరికం తెలుగు, మళయాళీ భాషలు వ్యవహరించే వారి మధ్య నెలకొనలేదనడం సత్య సన్నిహితం' - చల్లా రాధాకృష్ణశర్మ, 'తెలుగు మలయాళ భాషలు' ఆంధ్రజ్యోతి ఆదివారం, నవంబర్ 6, 1977.

20. 'నేటి ఆంధ్రప్రదేశ్‌కు వెలుపల జరిగిన సాహిత్య సేవను గురించి ప్రసంగించేటప్పుడు మొట్టమొదట చెప్పుకోవలసింది తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోని తెలుగు వారిని గురించి ముందుగా తమిళనాడులో జరిగిన కృషిని వివరిస్తాను. విజయనగర సామ్రాజ్య పతనానంతరం దక్షిణ ప్రాంతాలలోని నాయకరాజులు స్వతంత్రులైనప్పటికీ ఆంధ్రభోజుని ఆదర్శంగా పెట్టుకొని సాహిత్యాది కళాపోషణ కొనసాగించారు.' - డాక్టర్ పివిఎస్ఆర్ అప్పారావు. 'ఏటికి ఎదురీతగా స్వసంస్కృతిని రక్షించుకొంటున్న రాష్ట్రేతరాంధ్రుల సాహిత్యం, ఆంధ్రభూమి దినపత్రిక, ఆదివారం 13, 1970.

21. '20వ శతాబ్దిలో తెలుగు భాషా సాహిత్యాల కృషి అమెరికా, రష్యా మొదలైన దేశాల్లో జరుగుతుంది. ఆయా దేశాల్లోని విశ్వవిద్యాలయాలు ఈ కృషికి చాలా సాయం చేస్తున్నాయి. గెరాల్డుకెల్లి మొదలైన వాళ్ళ కృషి భాష మీద, ఫ్రైకెన్‌బర్గు మొదలైన వాళ్ళ కృషి చరిత్ర మీద కేంద్రీకృతమై ఉన్నాయి. జాన్‌లేనార్డ్ కందుకూరి వీరేశలింగం మీద, ఏస్టెల్ స్త్రిజాక్ ఆధునిక కవిత్వం మీద గణనీయమైన కృషి చేశారు.

రష్యాలో తెలుగు భాషా సాహిత్యాల మీద మంచి కృషి జరుగుతోంది. వ్యాకరణాలు నిఘంటువులు వచ్చాయి. మాస్కో, లెనిన్‌గ్రాడ్ విశ్వవిద్యాలయాల్లోనే కాక ప్రోగ్రెస్ ప్రచురణాలయంలోను తెలుగులో లోతైన కృషి చేసిన వాళ్ళున్నారు. పెత్రునిచెవ, గురోవ్, స్వెత్లానా, వోల్గా మొదలైన వాళ్ళ కృషి గణనీయంగా ఉంది. గురజాడ వారి కన్యాశుల్కం అనూదితమైంది. 1978లో తెలుగు కథలు అనేకులు రాసినవి.

'గరోదక్‌మయి, సిరిపద' అనే పేరుతో అనువాద రూపంలో వచ్చాయి' - ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు, 'సాంస్కృతిక, సాహిత్య రంగాల వికాసానికి పాశ్చాత్యుల దోహదం' విశాలాంధ్ర దినపత్రిక, ఉగాది రౌద్రినామ సంవత్సర ప్రత్యేక అనుబంధం, మార్చి 17, 1980.

★★★

# *iii.* ఇంటర్వ్యూలు

సాహిత్య వాతావరణాన్ని ఎప్పటికప్పుడు చైతన్యవంతంగా రూపుదిద్దే సాధనం ఇంటర్వ్యూ. 1970-80ల మధ్య కాలంలో దినపత్రికల సాహిత్య అనుబంధాలలో ఇంటర్వ్యూల సంఖ్య పెద్దగా కనిపించదు గానీ వచ్చినంతమేరకు ప్రయోజనదాయకమైన ఇంటర్వ్యూలే కనిపిస్తాయి. ముఖ్యంగా 1977 ప్రాంతాల్లో ఆంధ్రప్రభ దినపత్రిక సాహిత్యప్రభ శీర్షికతో సాహిత్య విశేషాలను సమగ్రంగా అందించేది. అందులో భాగంగానే ప్రసిద్ధ రచయితలు కవుల ఇంటర్వ్యూలను ప్రచురించింది. శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు, బోయి భీమన్న, మొక్కపాటి నరసింహశాస్త్రి, పురిపండా అప్పలస్వామి, తుమ్మల సీతారామమూర్తి, అబ్బూరి రామకృష్ణారావు వంటి సుప్రసిద్ధుల ఇంటర్వ్యూలు ఈ సందర్భంగా ప్రచురితమయ్యాయి.

సమకాలీన సాహిత్య ధోరణులపైన, రచనలపై ఒక చర్చను కొనసాగించడానికి కావలసిన సామగ్రిని ఈ ఇంటర్వ్యూలు అందించేవి. ఉదాహరణకు వచన కవిత్వాన్ని గురించి మొక్కపాటి నరసింహశాస్త్రి 'వచన కవిత్వానికి భవిష్యత్తు లేదు. అభ్యుదయ కవిత్వం, కమ్యూనిస్టుల ప్రచార కవిత్వం, ప్రచార కవిత్వం కవిత్వమా?' అంటూ చేసిన వ్యాఖ్యానాలు అప్పట్లో కొంత వివాదాస్పదమయ్యాయి.[1] అలాగే అబ్బూరి రామకృష్ణారావు గారు దిగంబర కవిత్వాన్ని గురించి, ఆ కవిత్వంలో వున్న ప్రయోగ తత్వాన్ని గురించీ తీవ్రమైన విమర్శ బాణాలు సంధించారు. దిగంబర కవిత్వం గురించి తన అభిప్రాయాలు చెప్తూ 'అదొక రకం వచన కవిత, అవిచార మూలకమైన అభిప్రాయాలు, అనుచిత పదజాలం ఉన్నంత మాత్రాన కొత్తదనం రాదు. పాఠకుల్ని ఆకర్షించటానికి 'ఘటంచిద్యాత్ పటం చింద్యాత్' లాంటి మార్గాలు తొక్కవచ్చు. అంతమాత్రాన కవితా వస్తువు సాహిత్య వస్తువు మారినట్లు కాదు. కవితకు గౌరవమూ రాదు' అని అన్నారు.[2]

అలాగే ప్రసిద్ధ రచయితలు తమ సాహిత్య జీవితాన్ని గురించీ, రచనా ప్రక్రియ గురించీ సింహావలోకనం చేసుకోవడానికి ఈ ఇంటర్వ్యూలు బాగా దోహదపడ్డాయి. మహాకవి శ్రీశ్రీ 1977లో ఆంధ్రప్రభకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తనలోకి తాను తొంగిచూస్తూ తన జీవన సారాంశాన్ని గురించి చెప్పిన వాక్యాలు ఎప్పటికైనా విలువైనవే.

'రెండు సంవత్సరాల కిందట శ్రీశ్రీ 'అరవైదేళ్ళ నా జీవితాన్ని ఒక్కసారి సింహావలోకనం చేస్తే నాకు అఖండమైన విజయాలే ఎన్నో కనపడుతున్నాయి. అక్కడక్కడ చిన్నచిన్న పరాజయాలు కలుగక పోలేదు. వాటిని నేను లక్ష్యపెట్టను. ఇంకా నేను బ్రతికి వుండటమే ఒక గొప్ప విజయంగా భావిస్తున్నాను. ఆ మేరకు నేను కాలాన్ని ఓడిస్తున్నానని కూడా నాకు తెలుసు. అంతిమ విజయం కాలానిదే అనుకుంటారు కొందరు. కాదు మానవుడిదే అని గర్జిస్తాను నేను.'[3]

అలాగే పుట్టపర్తి నారాయణాచార్య ఒక ఇంటర్వ్యూలో తన రచనా పద్ధతి గురించి వివరిస్తూ, 'అసలు మొదటి నుంచీ నా రచనా పద్ధతి విచిత్రమైనది. ఇదీ ఒక పట్టాన పూర్తి చేయలేకపోవడం నాలోని బలహీనత. భావావేశం వచ్చినపుడు రచనకు కూర్చుంటాను. ఒక్కొక్కసారి ఒకసారి ప్రారంభించిన విషయం రెండు మూడేళ్ళ వరకు ముట్టుకోక పోవడమూ జరుగుతూ ఉంటుంది. ప్రస్తుతం శ్రీనివాస ప్రబంధం పూర్తి చేయాలి. లయప్రియ రామాయణం సుందరకాండలో ఉన్నాయి. అది సంపూర్ణం కావాలి. సంస్కృతంలో 'శివకర్ణామృతం' రచన చేస్తున్నాను. ఇది కృష్ణకర్ణామృతం ధోరణిలో వుంటుంది.'[4]

తమ సృజనాత్మకత ప్రక్రియ గురించి ప్రసిద్ధ రచయితలు వివరించి చెప్పడం సమకాలీన తరాలకు స్ఫూర్తినిస్తుంది. ఒక కావ్యసృష్టి వెనుక ఎంత మానసిక శ్రమ ఉంటుందో అది తుదిరూపం దాల్చడానికి ఎన్ని అవస్థలను అధిగమిస్తుందో రచయితలే చెప్పడం విశ్లేషణపరంగా కూడా ఉపయోగపడుతుంది. సమకాలీన సాహిత్య పరిణామాలు, ధోరణులు, సమస్యలు ఈ ఇంటర్వ్యూలలో ప్రస్తావనకు వచ్చేవి. దీనివల్ల సాహిత్య చర్చలకు అవకాశం పెరిగింది. అలాగే కొత్త ధోరణులపైన కృష్ణశాస్త్రిగారు ఇలా అంటారు. 'శ్రీశ్రీతో ప్రారంభమైన ఉద్యమం అభ్యుదయ రచయితల ఉద్యమమయింది. బుర్రకథలూ, పాటలూ రాసేవారు ఎందరు వచ్చినా ఏ ఇద్దరు ముగ్గురో తప్ప కవులు రాలేదు. ఆరుద్ర మంచికవి. శిల్పం వదులుకోని గడసరి. ఆ తరువాత విప్లవ కవులు వచ్చారు. వారిలోనూ మంచి కవులున్నారు. నిఖిలేశ్వర్, చెరబండరాజు, ఎంత కొత్త పోకడయినా కవిత్వం అంటే నాకు ఇష్టమే. దిగంబర కవి శ్రీకాంతశర్మ కానీయండి, రంధి సోమరాజు కానీయండి.'[5]

1970-80ల మధ్య రాజకీయ కవిత్వానికి, శుద్ధ కవిత్వానికీ మధ్య ఒక విధమైన సంఘర్షణ సాగిన దశ. విప్లవ కవిత్వంతోపాటు అనేక కొత్త పోకడలు ఈ దశలో కనిపిస్తాయి. కవిత్వంలో ప్రచార లక్షణం ఉండాలన్న వర్గం ఒకవైపు, కవిత్వంలో కవిత్వం మాత్రమే ఉండాలన్న వర్గం ఇంకోవైపు రెండు శిబిరాలుగా చీలిపోయిన ఈ కాలంలో ముందు తరం రచయితలు సమకాలీన ధోరణుల గురించి ఏర్పరచుకుంటున్న అభిప్రాయాలు తెలుసుకోవడానికి ఈ ఇంటర్వ్యూలు ఉపయోగపడ్డాయి.

సాహిత్యంలో భాషా సమస్య గురించి తుమ్మల సీతారామమూర్తి ఒక ఇంటర్వ్యూలో

ప్రస్తావించారు. తెలుగు సాహిత్యానికి సంబంధించి ఒక మౌలికమైన భావాలను ఆయన ఈ అభిప్రాయం ద్వారా వ్యక్తం చేశారు. 'మీ తెలుగు అర్థం కాదని అర్థం కాకపోవడం కాదు. ఆ పదాల అర్థాలు మీరు మరచిపోయారు. సంస్కృత భాషా వ్యామోహంలో పడి తెలుగువారు తెలుగు మరచిపోతే ఎలా? సంస్కృతిపరమైన భాష సంస్కృత భాష అలాగని అది మన తెలుగును మింగేయకూడదు. కన్నుపోయేటంత కాటుక మంచిదా మరి? చక్కని తెలుగు పదం ఉంటే సంస్కృత పదానికి బదులు తెలుగు పదాన్నే వాడతాను. అది సరైన పద్ధతి. తిక్కన అలాగే చేశాడు.[6] సాహిత్యంలో సంస్కృత ప్రభావాన్ని తొలగించి అచ్చంగా తెలుగు సాంస్కృతిక విలువల్ని తీసుకువచ్చే ధోరణి మొదలైన క్రమాన్ని తుమ్మల వ్యాఖ్యలో చూడవచ్చు.

తెలుగులో సృజనాత్మక ప్రక్రియలలో సమానమైన వేగాన్ని విమర్శ ప్రక్రియ సాధించలేకపోయిందన్న అభిప్రాయం ఉంది. ప్రఖ్యాత చరిత్రవేత్త దిగవల్లి వెంకటశివరావు ఈ విషయాన్ని 1977లో ఆంధ్రప్రభ కిచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. సమకాలీన విమర్శలో విపరీత ప్రశంసలో, విమర్శలో తప్ప సమన్వయం లేకపోవడాన్ని ఆయన ఒక లోపంగా భావించాడు. 'నేడు ముఖ్యంగా సరైన విమర్శనం లేదు. ఆకాశానికెత్తడం లేదా అధఃపాతాళానికి తొక్కడం అంతే కాని వివేచనతో కూడిన విమర్శ కనిపించదు. ప్రాచీన భారతీయ సాంఘిక వ్యవస్థను గురించి తెలుసుకోవడానికి జరగవలసినంత కృషి జరగలేదు. పందొమ్మిదో శతాబ్దికి సంబంధించి చారిత్రక విశేషాలూ, ఆధారాలూ ఎన్నో లభిస్తున్నాయి. అవి క్రమక్రమంగా మాయమై పోతున్నాయి. నా దగ్గరకు వచ్చిన వాళ్ళందరికీ నేను ఇదే హెచ్చరిక పదేపదే చేస్తున్నాను. కాని పట్టించుకొనేదెవరు? కొంతలో కొంత శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం బ్రౌన్ పరిశోధన విభాగమూ, రాష్ట్ర ప్రభుత్వ పురాతత్త్వ విజ్ఞాన శాఖా చిత్తశుద్ధితో పనిచేస్తున్నాయని నా అభిప్రాయం. పురాతత్త్వ విజ్ఞాన శాఖాధిపతి మంచి కృషి చేస్తున్నారు. ఈ రంగంలో మంచి అవగాహనా, పనిచేయవలెననే ఉత్సాహమూ, అందుకు కావలసిన పరిశ్రమ యోగ్యతా వారిలో వున్నాయి. తెలుగువారి చరిత్రను సాధికారంగా, సమగ్రంగా జాతీయ దృక్పథంతో పునర్నిర్మించవలసిన మహాయజ్ఞ నిర్వహణం ఒకరితో అయ్యేది కాదు.'[7]

1970-80ల మధ్య రచయితల్లో దృక్పథపరంగా ఒక స్పష్టమైన విభజన రేఖ కనిపిస్తుంది. ఇది సమకాలీన రచయితలకు మాత్రమే కాకుండా అంతకు ముందు నుంచి రాస్తూ ప్రసిద్ధ కవులుగా రంగంలో వున్నవారికి కూడా వర్తిస్తుంది. ఈ రచయితల అభిప్రాయాలను మాత్రమే కాకుండా సామాజిక మార్పు గురించి కచ్చితంగా తీర్పునివ్వగలిగిన స్థితిని చేరుకున్నారు. ప్రసిద్ధ కవి బోయి భీమన్న ఇంటర్వ్యూ దీనికి నిదర్శనం. 'ఇంతవరకు ఏది ఎలా జరిగినా ఇక ముందు మాత్రం గొర్రెలు గొర్రెలుగా వుండవు. గుడిసెలు, గుడిసెలుగా వుండవు.'[8]

1970-80ల మధ్య తెలుగు దినపత్రికల్లో సాహిత్యపరమైన ఇంటర్వ్యూలు సంఖ్యలో

తక్కువగానే ఉన్నప్పటికీ అవి తరువాత తరువాత ప్రధానమైన స్థానాల్ని ఆక్రమించుకోవడం కనిపిస్తుంది. ఇంటర్వ్యూల ప్రశ్నావళి, స్వభావాల్లో కూడా మౌలికమైన మార్పులు కనిపిస్తాయి. రచయితకు సంబంధించిన ప్రపంచాన్నే కాకుండా చుట్టూ వున్న ప్రపంచంలో రచయిత స్థానాన్ని కూడా అంచనా వేయడానికి ఈ ఇంటర్వ్యూలలో ప్రయత్నం జరిగింది.

పాదసూచికలు :

1. ఓగేటి అచ్యుతరామశాస్త్రి, ''తెలుగు చరిత్రకు కావ్యత్వం కల్పించిన'నవలాశిల్పి నరసింహశాస్త్రి', ఆంధ్రప్రభ దినపత్రిక, సాహిత్యప్రభ, ముఖాముఖిశీర్షిక,నవంబరు 3,1977.

2. డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ, 'సరస వచస్సుతో సాహితీ పిపాసువుల్ని తనిపె 'అబ్బూరి చలివేందిర', ఆంధ్రప్రభ, సాహిత్య ప్రభ, ముఖాముఖి శీర్షిక, అక్టోబర్ 20, 1977.

3. దేవులపల్లి ప్రభాకరరావు, 'మరో ప్రపంచానికి మార్గదర్శి శ్రీశ్రీ', 'అతడు ద్రష్ట, అతడు స్రష్ట, బ్రతుక్కతడు పరాకాష్ట' ఆంధ్రప్రభ, సాహిత్య ప్రభ శీర్షిక, నవంబర్ 17, 1977.

4. డాక్టర్ ఆర్. అనంత పద్మనాభరావు, 'సకల సుకవి మిత్ర, సరస్వతీ పుత్ర, పుట్టపర్తి నారాయణాచార్య' ఆంధ్రప్రభ, సాహిత్య ప్రభ, డిసెంబర్ 15, 1977.

5. పాలగుమ్మి పద్మరాజు, 'సురభిళ సంగీత కవితా స్ఫూర్తి కృష్ణశాస్త్రి' ఆంధ్రప్రభ దినపత్రిక, గురువారం, అక్టోబర్ 6, 1977.

6. తుమ్మల సీతారామమూర్తి, 'ఆంధ్ర సాహితీ కేదారాల్లో రసరాజనాలు పండించిన తేట తేనెల తెలుగు కవి' ఆంధ్రప్రభ దినపత్రిక, గురువారం, అక్టోబర్ 13, 1977.

7. అక్కిరాజు రమాపతిరావు, 'తాతతాతల నాటి కథలను త్రవ్వితీసిన ప్రఖ్యాత చరిత్రవేత్త దిగవల్లి వేంకట శివరావు' 'ఆంధ్రప్రభ దినపత్రిక, సాహిత్య ప్రభ శీర్షిక, గురువారం, డిసెంబర్ 22, 1977.

8. డాక్టర్ ఇందుర్తి ప్రభాకర్‌రావు, 'బోయి భీమన్న ఇంటర్వ్యూ' ఆంధ్రప్రభ దినపత్రిక, డిసెంబర్ 29, 1977.

★★★

# *iv.* వ్యంగ్య రచనలు

ఈ దశాబ్దంలో తెలుగు సాహిత్యంలో ఎన్నో పరిణామాలు ఒక్కుమ్మడిగా కనిపిస్తాయి. సృజనాత్మక రంగంలో అనేక ప్రయోగాలు జరిగాయి. విమర్శపరంగా వాటి మీద విస్తారమైన చర్చలు జరిగాయి. సాహిత్య లోకంలో ఎన్నో విషయాల గురించి గంభీరంగా మాత్రమే కాకుండా అలవోకగానూ, సరదాగానూ చర్చించుకునే వాతావరణం ఏర్పడింది. ఈ వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ ఈ దశాబ్ది దినపత్రికల్లో, ఆదివారం అనుబంధాల్లోనూ, సాహిత్య శీర్షికల్లోనూ వ్యంగ్య రచనలు వివిధ రూపాల్లో వికసించాయి. ఆ రకంగా ఒక పాత సాహిత్య రూపం కొత్త ధోరణితో పునః ప్రవేశం చేసింది. అది 'పేరడీ'. సమకాలీన రచయితల రచనాత్మక లక్షణాలను శైలిని అనుకరిస్తూ వచ్చిన రచనలు సాహిత్య వాతావరణాన్ని తేలిక పరచి ఒకింతసేపు పాఠకుణ్ని ఆశ్చర్యానికి గురిచేస్తాయి. ప్రముఖ రచయితల వచన రచనను పేరడీ చేస్తూ ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో శ్రీరమణ ఇలాంటి రచనలు చేశారు. అటు వచన రచయితలను, వచన కవుల్ని మాత్రమే కాకుండా సమకాలీన ధోరణులపై వ్యంగ్య బాణాలు విసరడం ఇందులో ప్రధానంగా కనిపిస్తుంది. పేరడీ ప్రక్రియకు కొత్త గౌరవాన్ని తీసుకువచ్చిన రచయిత శ్రీరమణ. నవల రచయితలుగా ఒక ప్రత్యేకమైనశైలిని ఏర్పరచుకున్న అడవి బాపిరాజు, చలం, ముళ్ళపూడి వెంకటరమణ, గొల్లపూడి, ముప్పాళ రంగనాయకమ్మ ప్రసిద్ధ రచయితల రచనా శైలిని శ్రీరమణ పేరడీ చేశారు. ఈ పేరడీల్లో కొత్తగా చేరిన అంశమేమిటంటే కొంత విమర్శనాత్మక దృష్టి. సాధారణంగా పేరడీ రచయితలు మూల రచనల్ని అనుకరించటానికి మాత్రమే పరిమితమవుతారు. ఈ దశాబ్దిలో వచ్చిన శ్రీరమణ లాంటి రచయితలు ఈ సాంప్రదాయానికి భిన్నంగా అనుకరణకు మాత్రమే పరిమితం కాకుండా కొంతలోతైన విమర్శ దృష్టిని కూడా కనబరచారు. ''డిటెక్టివ్ సాహిత్యాన్ని కొందరు శవ సాహిత్యం'' అని పిలుస్తారు. ఈ రంగంలో కృషి చేస్తున్నవారు అనేకులు. ఆ పరిధిలోనే నడుస్తున్న పత్రికలు అనేకం. అపరాధాలు, పరిశోధనలు వీళ్ళ బ్రెయిన్‌డియన్‌లో హమేషా జరుగుతూ వుంటాయి. టెంపో, సస్పెన్సు సాహిత్యానికి అలంకారం. మరుక్షణంలో ఏం జరిగేది చచ్చినా చదువరికి తెలియదు. భాష కథాకథనం అందరిదీ దాదాపు ఒకలాగే వుంటుంది శవ సాహిత్యం.'[1]

1970-80ల మధ్య తెలుగు సాహిత్యంలో సృజనాత్మకంగా వచ్చిన ప్రయోగాలను దృష్టిలో ఉంచుకుని మరో పేరడీ వచ్చింది. ఆ ప్రయోగాల గురించి ఈ పేరడీ రచయిత ఇలా వ్యాఖ్యానించారు. 'నవీన్ నవలల్ని 'కొని' చదివిన కొందరు గుడ్లనీళ్ళు గుడ్లనొత్తుకొనడం నేనెరుగుదును. అధివాస్తవికతా శిల్పం అలవాటు పడేదాకా అంపశయ్యలే అవుతాయి వీరి రచనలు. ప్రయోగాత్మక, ప్రయోజనాత్మక నవలలు రాశారని నవీన్‌గారిని గురించి పెద్దల అభిప్రాయం.[2]

సృజనాత్మక రచనల మీద పేరడీ రాయడం ఒక ఎత్తు, అనువాద రచయితలపై పేరడీ రాయడం మరో ఎత్తు. వేరువేరు భాషల నుంచి అనువదించినప్పుడు ఆయా భాషల ప్రాంతీయ వాసనలు వాటిల్లో ప్రతిఫలిస్తూ వుంటాయి. వాటిని సైతం అనుకరించడానికి పేరడీ రచయితకు చాలా ప్రతిభ అవసరం. విభిన్న రచయితల అనువాదాల రీతుల్ని శ్రీరమణ ఒక ఆదివారం అనుబంధం సంచికలో పేరడీ చేశారు.[3] అలాగే శ్రీరమణ ప్రేమలేఖల పేరడీ కూడా విశేషంగా పేర్కొనదగింది.[4]

మరికొన్ని వ్యంగ్య రచనలు స్కెచ్‌ల మాదిరిగా కనిపిస్తాయి. ఆంధ్రప్రభ, సాహిత్య ప్రభ అనుబంధం కింద ఇతిహాసం అనే శీర్షిక పేరుతో ఎందరో ప్రసిద్ధ రచయితలు ఇలాంటి వ్యంగ్య రచనలు చేశారు. ఈ రచయితలు సాహిత్య పరిణామాలను తూర్పారబట్టే హాస్యాన్ని పండించారు. ఉదాహరణకు 'సాహిత్యంలో సద్యోగర్భం' అనే శీర్షికన వాకాటి పాండురంగారావు రాసిన సెటైర్ (Satire) ''ఆధునిక తెలుగు సాహిత్యమూ : దాని మాతృకలూ'' అని డాక్టరేట్ యత్నం గనక చేస్తే కనీసం ఏడు డాక్టరేట్ పట్టాలకు సరిపడేంత విషయం 'గ్యారంటీ'గా దొరుకుతుంది. తూరుపు సూరీడు తగిలితే చాలు 'అరుణారుణమైన రచనలు చేసే కుంతీమణులున్నారు మనలో... (ఇచ్చటి 'కుంతీమణి' అన్న ప్రయోగమునకు లింగభేదము లేదని అరయుదురుగాక) గావుకేకలు, గర్జనలు, మార్చ్‌లూ, మరుభూములూ, రక్తపుటేరులూ, బందూకులూ వీరి ప్రధాన లక్షణాలు. పాతికేళ్ళనాటి చరిత్రే తప్ప నేటి చరిత్ర మనకనవసరం.[5]

సాహిత్యంలో విప్లవ ధోరణి ఒక 'ఫ్యాషన్'గా అనుసరించబడుతున్నప్పుడు వచ్చిన ఈ వ్యంగ్య రచన నిజానికి ఒక విమర్శనాస్త్రం. సాహిత్య విలువలపట్ల ఆయా రచయితల్లో పెరిగిపోతున్న అసహనాన్ని ఈ వ్యంగ్య రచన ప్రతిబింబిస్తుంది.

సాహిత్య రాజకీయాలతో సంబంధం లేకుండా కేవలం సరదా కోసమే ఉద్దేశించిన వ్యంగ్య రచనలు కొన్ని వెలువడ్డాయి. దీనికి ఉదాహరణ 'ఆంధ్రప్రభ' సాహితీ ప్రభలో అచ్చుతప్పుల్లో మెచ్చుతునకలు' అన్న శీర్షికన డాక్టర్ సి.నారాయణరెడ్డి రాసిన వ్యాసం పేర్కొనదగింది.[6]

పాదసూచికలు:

1. శ్రీరమణ, 'పేరడీలో బాపిరాజు, చలం, ముళ్ళపూడి, గొల్లపూడి, ముప్పాళ మరికొందరు ప్రముఖుల వచన రచన, రచన రచనపై పేరడీ, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, జనవరి 30, 1977.

2. శ్రీరమణ, 'పేరడీలో బాపిరాజు, చలం, ముళ్ళపూడి, గొల్లపూడి, ముప్పాళ మరికొందరు ప్రముఖుల వచన రచన, రచన రచనపై పేరడీ, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, జనవరి 30, 1977.

3. శ్రీరమణ 'విభిన్న రచయితల అనువాదాల రీతులు - పారడీ' ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం, మే 21, 1978.

4. శ్రీరమణ, 'కరుణశ్రీ, నారాయణరెడ్డి, శేషేంద్ర, దాశరథి, ఫిలిమ్ క్రిటిక్ - ప్రముఖుల ప్రేమలేఖలు: మరో పేరడీ' ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం, నవంబర్ 12, 1978.

5. వాకాటి పాండురంగారావు, 'సాహిత్యంలో సద్యోగర్భం' ఆంధ్రప్రభ దినపత్రిక సాహిత్య ప్రభ, ఇతిహాసం శీర్షిక, నవంబర్ 10, 1977.

6. 'అచ్చుతప్పులు అనేక విధాలు. కొన్నిటి అశ్లీలావతారాలను గూర్చి, కొన్నిటి అనర్థాలు తెచ్చి పెట్టే అవస్థలను గురించి రకరకాలుగా చెప్పుకోవడం చాలాకాలంగా ఉన్నదే. అయితే అప్పుడప్పుడు ప్రూఫులు చూసే అవకాశం ఏర్పడినప్పుడు నా చూపులకు చిక్కుకుని, మతిపొరల్లో నక్కుకుని, ఏటి నీటి మడతల్లోని చేపల్లా తళుక్కున స్ఫురించే అచ్చుతప్పులు కొన్ని ఉన్నాయి. అవి అనర్థాలిచ్చేవి కావు. అతీతార్థాలిచ్చేవి. తలా తోకా లేనివి కావు. బుర్ర కిర్రుమనిపించినా తోచనివి. కొన్ని అచ్చుతప్పులు అలాగే ఉంటేనే బాగుండేదే అనేటంత అద్భుత భావాల కుప్పలు. అనవసరంగా దిద్దుతున్నామే అనే బెంగతో కుంగతీసే అనూహ్యార్థ పేటికలు కొన్ని. అలాంటి అచ్చుతప్పుల్లో నుంచి మచ్చుకు - కాదు - మెచ్చుకు కొన్ని.'' - డాక్టర్ సి.నారాయణరెడ్డి. 'అచ్చు తప్పుల్లో మెచ్చు తునకలు' ఆంధ్రప్రభ దినపత్రిక, సాహిత్య ప్రభ, వ్యాఖ్యాలహరి శీర్షిక, అక్టోబర్ 13, 1977.

★★★

# V. చర్చలూ - వాదోపవాదాలు

1970-80ల మధ్య తెలుగు సాహిత్యంలో దృక్పథానికి సంబంధించి మౌలికమైన పరిణామాలు జరిగాయి. అభ్యుదయ సాహిత్య ప్రభావం క్రమంగా తగ్గిపోతుండటంతో ఇతరేతర సాహిత్య ధోరణులు తలెత్తసాగాయి. ముఖ్యంగా కొత్త, పాత ధోరణుల మధ్య ఒక విధమైన ఘర్షణ మొదలైంది. అప్పటివరకు సాహిత్యగతిని నిర్దేశిస్తున్న వ్యక్తుల సిద్ధాంతాలు వెనుకబడుతున్నాయి. ఈ దశాబ్దంలో దినపత్రికలు అనేకానేక కీలకమైన చర్చలకు వేదికలుగా మారాయి. రచయితలు, విమర్శకులు దినపత్రికల సాహిత్య పుటల మధ్య విస్తృతంగా వాదోపవాదాలకు దిగడం కనిపిస్తుంది. ఈ చర్చలు కూడా అనేక విధాలుగా సాగాయి. సాహిత్యంలో అభ్యుదయ దృక్పథానికి మార్గదర్శులుగా నిలిచిన కవులు, విమర్శకులు కూడా ఈ చర్చల్లోకి వచ్చేసరికి పాతతరం వాళ్ళుగా ముద్రపడ్డారు. ఈ యుగం నాది అని చాలా ధీమాగా పలికిన శ్రీ శ్రీ సైతం ఒకటీ రెండు అడుగులు వెనక్కి తగ్గి మాట్లాడాల్సిన సాహిత్య వాతావరణం ఏర్పడింది. శ్రీశ్రీని ప్రసవించిన యుగం మరణించిందని ఒక చర్చ సందర్భంలో దిగంబర కవి నగ్నముని అన్నమాట చర్చోపచర్చలకు దారితీసింది. శ్రీ శ్రీ ప్రభావం తెలుగు కవిత్వంపై క్రమంగా తగ్గిపోతుందనటానికి దాఖలాలు ఈ దశాబ్దంలో కనిపించసాగాయి. శ్రీశ్రీని సమర్థించేవారు, వ్యతిరేకించేవారు రెండు విభిన్న శిబిరాల నుంచి వాదోపవాదాలు సాగించటం ఈ దశాబ్ది విశేషాల్లో ఒకటి.

**'శ్రీ శ్రీ యుగం':** ఈ శతాబ్దాన్ని ఊగించి, శాసించిన మహాకవి 75ల తరువాత దినపత్రికల సాహిత్య పేజీలలో వివిధ రకాల చర్చల మధ్య ఊగిసలాడాల్సిన స్థితి ఏర్పడింది. కవిత్వ రంగంలో వేగంగా వస్తున్న మార్పులు కొత్త ధోరణులకు నాంది పలకడంతో సాహిత్యంపై ఒక ధోరణి ప్రభావం సన్నగిల్లుతోంది. దీనికి మొదటి సూచన శ్రీ శ్రీ యుగంపై జరిగిన చర్చలూ, వాదోపవాదాలు.

శ్రీ శ్రీ యుగం మరణించిందా అన్న అంశంపై కవులు, విమర్శకులు సమాధానం వెతుక్కుంటున్న దశాబ్దమిది. శ్రీ శ్రీ యుగం అంతరించి పోదని విమర్శకులు వాదించాల్సి వచ్చింది. ''ఇతిహాసమంతో, పురాణమంతో, ప్రబంధమంతో ఒక మహాకావ్యం ఆధునిక జీవితేతి వృత్తంతో రాలేదు అని ఇరవయ్యో శతాబ్దంలో మనం

విచారపడనక్కరలేదు. మహాప్రస్థానం ఒక్కటే చాలు - శ్రీశ్రీకి తిక్కన ప్రక్కన పీఠం వెయ్యడానికి!''[1]

శ్రీశ్రీని ఆధునిక మహాకవిగా నిలబెట్టిన అంశాలపైన తిరిగి చర్చ మొదలైంది. శ్రీశ్రీ ప్రవేశంతో సాహిత్యంలో అడుగిడిన అభ్యుదయ ధోరణుల పరిణామంపై కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే శ్రీశ్రీ ప్రభావంపైన వ్యక్తమైన అభిప్రాయాలు కేవలం వ్యక్తిగతమైన రాగద్వేషాలతో కూడుకున్నవని అన్నవారూ లేకపోలేదు. ''శ్రీశ్రీను ప్రసవించిన యుగం మరణించింది'' అంటున్నారు నగ్నముని. ఆయనే నాలుగైదు లైన్ల ముందు రాస్తూ కమ్యూనిజం పెరిగిన ఆ యుగోదయంలో ప్రపంచంలోని ప్రతి భాషా ఒక శ్రీశ్రీని ప్రసవించిందంటూ, ''అందువల్ల అది శ్రీశ్రీ యుగం కాదు అది కమ్యూనిజం'' అంటున్నారు. ప్రస్తుతం నగ్నమునికి శ్రీశ్రీ అంటే గిట్టకపోవచ్చు. శ్రీశ్రీలో అనేక వ్యక్తిగత వైరుధ్యాలుండొచ్చు. కాని పెట్టుబడిదారీ వ్యవస్థ రూపుదాలుస్తున్న రోజుల్లోనే ఆ చారిత్రక దశను దాటి ముందుకు చూసిన ద్రష్ట శ్రీశ్రీ. మోహన్‌ప్రసాద్ గారే 'మన కింతవరకూ రాని అసంబద్ధ వ్యతిరేక, అస్తిత్వపు అస్తవ్యస్త కవిత రావాలి' అంటూ అస్పష్టత మీద ఎంత మోజు ఉందో చెప్పుకుంటున్నారు.[2] శ్రీశ్రీ సాధించిన స్పష్టమైన విలువల్ని వ్యతిరేకిస్తున్న వారంతా ఇంకోవైపు నుంచి కవిత్వంలో అస్పష్టతకు పీఠం వేస్తున్నవారేనన్న అభిప్రాయం ఈ చర్చల్లో వ్యక్తమైంది.

శ్రీశ్రీ యుగంతోపాటు 'అభ్యుదయ' యుగం కూడా ఈ దశాబ్దంలో వాదోపవాదాలకు కారణమైంది. సాహిత్యగత కారణాలపైన కవిత్వంలో ప్రయోగవాదులు ఒకవైపు, సామాజిక కారణాలపైన విప్లవ వాదులు మరొకవైపు అభ్యుదయ సాహిత్యంపైన విమర్శలు కురిపించారు. ''ఇటీవల కొందరు బుద్ధి జీవులు - అభ్యుదయ యుగం అంతరించిపోయిందని దాని స్థానే ఆధునిక సాహిత్యంలో వేరొక ప్రత్యామ్నాయము సంభవించే అవసరం ఏర్పడిందనీ అంచనాలు వేస్తున్నారు. ఆ మేరకు కొంతకాలంగా ప్రచారమూ చేస్తున్నారు. మొదటి రకం వారు సర్వతోముఖంగా అభ్యుదయం అంటేనే గిట్టని వాళ్ళు, రెండవ వర్గం వారు తీవ్రవాదులు. విప్లవ శ్రేణులకూ, అజ్ఞాత వీరులకూ ఉత్తేజం కలిగించే తుపాకీ కవిత్వం అందించడమే ధ్యేయమనుకుంటారు.''[3] సాహిత్య చర్చలపైన ఆయా రాజకీయ పార్టీల ఎత్తుగడల ప్రభావం ఈ దశాబ్దంలోనే బలంగా కనిపిస్తుంది. ఒక దశలో ఈ కారణంగా కవుల రచనా శక్తిని గుర్తించలేని స్థితి కూడా ఏర్పడింది.'[4]

*ఆధునిక కవిత్వంపై వాదోపవాదాలు:-* ప్రయోగాలకు, కొత్త పరిణామాలకు కీలకమైన సందర్భంగా మారిన ఈ దశాబ్దంలో సాహిత్య ప్రక్రియలన్నింటిపైనా, సుదీర్ఘమైన చర్చలు జరిగాయి. వాటిలో ఆధునిక కవిత్వం ఎటు పోతున్నది అనే శీర్షికన జరిగిన చర్చ ప్రధానంగా పేర్కొనదగింది. ఆధునిక కవిత్వం

దిశ గురించి, వస్తు నిర్దేశాన్ని గురించి చర్చిస్తూ నగ్నముని ఇలా అన్నారు. 'తిరిగి ఈనాడు తెలుగు సాహిత్యంలో స్తబ్దత ఏర్పడింది. కాలరంగస్థలం ఎప్పుడూ ఖాళీగా వుండదు. తిరిగి మార్మిక వాదం, అనుభూత వాదం, ప్రకృతి గానం ఆధునికత పేరిట రోడ్డు మీది కొచ్చాయ్.'[5]

ఆధునిక కవిత్వానికి సంబంధించి అనేక అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. కవి దృక్పథాన్ని సృజనాత్మక ప్రక్రియను శాసించేటట్టుగా కొన్ని సిద్ధాంతాలు రూపుదిద్దుకున్నాయి. కవులు కొన్ని వస్తువులపైనే రాయాలని, ఒక విధంగానే రాయాలని శాసించే ధోరణుల పట్ల వ్యతిరేకత కనిపిస్తోంది. ఈ చర్చలో దాశరథి 'కవితను ఇలాగే రాయాలి. ఇలా రాయకూడదు అని చెప్పే హక్కు ఎవ్వరికీ లేదు. అర్థం కాకుండా రాస్తే కవిత అవుతుందని కొందరు భ్రమపడుతున్నారు. మహాకవుల రచనలు విధిగా అర్థమవుతాయి. అయితే శక్తినిబట్టి సాక్షాత్కారమన్నట్టు, మల్లినాధునికి తెలిసినంతగా మనకు కాళిదాసు అర్థం కాకపోవచ్చు కాని ఎంతో కొంత అర్థం కావడం ఖాయం' అని అంటారు.[6] కవిత్వంలో అస్పష్టత ఏర్పడటాన్ని కూడా వీరు గుర్తించారు. అస్పష్టతకు కారణమైన అంశాలపైన చర్చ మొదలైన దశాబ్దమిది. దీనికి కారణమైన అనుభూతివాదం, శుద్ధ కవితావాదంపైన విస్తృతమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అనుభూతి కవిత్వం నిర్వచనంపైనే మౌలికంగా వివాదం మొదలైంది. ''పదకాలంతో నిండిన కవిత్వాన్ని కొందరు విమర్శకమ్మన్యులు పనిగట్టుకొని ఇదేదో గొప్ప 'అనుభూతి కవిత్వ'మంటూ ముద్రగొట్టి ప్రచారం చేస్తున్నారు. అయితే వారు సావకాశంగా తప్పించుకుంటూ, దేనినెందుకు అనుభూతి కవిత్వమని పిలుస్తున్నారో నిర్వచనం ఇవ్వడంలేదు. నిర్వచనం ఇవ్వలేనిది, అంతర్లక్షణం యితిమిత్థంగా పోల్చుకోలేనిదీ ఏదైనా అనుభూతి కవిత్వ ముంటుందనుకుంటే అది ఒట్టి ఆషాఢభూతి కవిత్వమే కాగలదు!' అని ఈ సందర్భంగా సోమసుందర్ అభిప్రాయపడ్డారు.[7]

ఆధునిక కవిత్వం ఎటు పోతున్నది అనే అంశంపైన జరిగిన చర్చలో 'కుందుర్తి' కూడా అనుభూతి కవిత్వంపైన వ్యతిరేక అభిప్రాయాన్ని ప్రకటించారు. 'ఈ శుద్ధ కవితావాదం, అనుభూతి వాదము అనేవి తెనుగు సాహిత్యంలో భావ కవితాయుగానికి సంబంధించిన విలువలు''[8] ఈ చర్చలో కవిత్వ ధోరణులపైన వ్యాఖ్యానిస్తూ మూడు ముఖ్యమైన ధోరణులను వేగుంట మోహన్ ప్రసాద్ చర్చించారు. ''ఒకటి కేవలం అక్షర సముదాయమైన గణ, యతి, ప్రాసల ఛందోబంధితమైన సారస్వత కవిత, రెండోది కమ్యూనిస్టు ఉద్యమాల, సాంఘిక వర్గ సంఘర్షణలతో ప్రభావితమైన శారీరక కవిత (ఫిజికల్), మూడు. అనుభూతి అనుభవాల సంక్లిష్ట చేతనను స్ఫురింపజేసే ఆందోళనా పూర్వకమైన దార్శనిక కవిత (ఇంటర్నల్)[9] ఇదే సందర్భంగా కవిత్వంలో రూప ప్రాధాన్యాన్ని వివరించే ప్రయత్నం కూడా జరిగింది. ''కవిత్వంగా రాయడమంటే నిత్య జీవితంలోని సంఘర్షణను రాయడం, అంతేకానీ యిమేజీలు, సింబల్స్ గుప్పించడం కాదు. అవి ఎంతవరకు ఉండాలో అంతవరకు వుంటేనే వాటి మర్యాద దక్కుతుంది.''[10]

దీర్ఘకాలంపాటు సాగిన ఈ చర్చలో సమకాలీనంగా సుప్రసిద్ధులైన ఎందరో కవులు, విమర్శకులు అనేక కీలకమైన అంశాలపైన చర్చించటమే కాకుండా వర్తమాన కవిత్వ మార్గాన్ని నిర్దేశించడంలో తోడ్పడ్డారు. కవిత్వపరమైన గుణాలతోపాటు లోపాలపై కూడా విమర్శకులు దృష్టి సారించారు.[11] కొత్తపాతల సంఘర్షణను విశ్లేషించారు.[12]

అనుభూతివాదం:- ఈ దశాబ్దిలో ఎక్కువగా చర్చలకు గురైన అంశం - అనుభూతివాదం. కవులు అనుభూతి ప్రాముఖ్యాన్ని చెబుతూ వాటికి సంబంధించిన ఇతివృత్తాలనే స్వీకరించాలని భావించే ధోరణి ఏర్పడింది. సమకాలీన రాజకీయ కవిత్వాన్నంతా 'అకవిత్వంగా' అనుభూతి వాదులు తిరస్కరించారు. జీవితంలోని ఏ ఇజానికి కట్టుబడనక్కరలేదని అనుభూతివాదులు సూత్రీకరించారు. 'కవిత్వంలో అనుభూతి అనేది ఒక రసాయనిక చర్య! రసాత్మక చర్య. స్థూలమైన ప్రాపంచిక దృశ్యం - అది వస్తువైనా సరే, సంఘటన అయినా సరే. కవి మనస్సులో ఈ 'స్థితి' ని పొందిన తరవాతనే 'భావం'గా పరిణమించి, పాఠకుడికి స్పందన కలిగించే నిమిత్తం స్ఫాటిక స్వచ్ఛంగా మిగులుతుంది. కవిత్వం అంటే, కేవలం సూక్తి ముక్తావళి కాదని, ఛందస్సు, వచన రూపాల విచిత్ర విన్యాసం కాదని కథాకథనం, పాత్రోన్మీలనం మాత్రమే కాదని, ఏ ఒక్క ఇజానికీ కట్టుబడి వుండక్కర్లేదని చెప్పాలనుకుంటోంది.''[13]

అనుభూతివాదులు రాజకీయ దృక్పథంతో నిమిత్తం లేకుండా మౌలికంగా జీవితానికి సంబంధించిన సహజ స్వచ్ఛమైన అనుభవాల మీద దృష్టి కేంద్రీకరించారు. రాజకీయ విలువలు, ఎత్తుగడలు సాహిత్య మౌలిక స్వభావాన్ని కలుషితం చేస్తున్నాయని అనుభూతివాదులు వాదించారు. 1975ల తరువాత దాదాపు అన్ని ప్రధాన పత్రికల్లోనూ దీనికి సంబంధించిన చర్చ సాగింది.

తెలుగు కథ ప్రమాణాలపై చర్చ:- 1970ల తరువాత పత్రికల సంఖ్యతోపాటు వచన రచయితల సంఖ్య కూడా పెరిగింది. దాదాపు ప్రతీ పత్రిక కవిత్వం, నవలలతోపాటు కథల్ని కూడా ఎక్కువ సంఖ్యలో ప్రచురణకు స్వీకరించటంతో ఆదివారం అనుబంధాల్లో విధిగా ఒక కథ ప్రచురించే సాంప్రదాయం ఏర్పడింది. అయితే కథల సంఖ్య పెరిగినంతగా విలువలు పెరగలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుండటంతో మరోవైపు నుంచి దినపత్రికల్లో కథారచన పరిణామాలపైన విమర్శలు కూడా మొదలయ్యాయి. ఇవి విస్తృత రూపం దాల్చి ఒక చర్చకు దారితీశాయి. ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలోనే సమకాలీన తెలుగు కథా ప్రబంధాలపైన సుదీర్ఘమైన చర్చ జరిగింది. ముఖ్యంగా మంచి కథలు రావట్లేదని విమర్శ మొదలైంది. ''పదేళ్ళ నాటికంటే ఇవాళ పాఠకుడికి అందుతున్న కథల సంఖ్య కనీసం పదిరెట్లు పెరిగింది. కానీ మంచి కథల సంఖ్య మాత్రం పెరగడంలేదు.''[14] కథానికా రచన ఒక వ్యాపార సరకుగా మారిపోయిందన్న అభిప్రాయాన్ని కొంతమంది కథకులు వ్యక్తం చేశారు. ''సాహిత్యం పరిశ్రమగా మారిపోయినప్పుడు వాణిజ్య సూత్రాలను

ఆశ్రయించక తప్పదు. ఇప్పుడు వెలువడుతున్న ఒక వంద కథలను నమూనాగా తీసుకొని అధ్యయనం చేస్తే వాటిల్లో తొంభై శాతం కమర్షియల్ కథలు కనబడడంలో ఆశ్చర్యం లేదు. కమర్షియల్ కథంటే చక్కని ప్లాట్, ఉత్కంఠ కలిగించే క్లైమాక్స్, హీరో, విలన్, సంఘర్షణ, సెంటిమెంట్ మొదలనవి ప్రధానంగా గలవి.''[15] వ్యాపార విలువలే కథారచనను నిర్దేశిస్తున్నాయన్న అభిప్రాయం ఈ మాటల్లో వ్యక్తమవుతుంది. అలాగే జీవితానికి సన్నిహితంగా వుండే సీరియస్ కథకు సుదూరంగా వుండే కమర్షియల్ కథకు మధ్య ఉన్న అంతరాన్ని ఈ చర్చల్లో గుర్తించగలిగాయి. వ్యాపార కథ ఏ లక్షణాల వల్ల వాస్తవ కథకు దూరంగా వెళుతుందో ఆ లక్షణాలను వర్గీకరించే ప్రయత్నం జరిగింది.

గత దశాబ్ద కాలంలో తెలుగు కథ జాలి కలిగిస్తోందన్న అభిప్రాయాన్ని ఈ చర్చలో ఎక్కువమంది వ్యక్తం చేశారు.[16] అయితే కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్న పత్రికల మధ్య మంచి కథల్ని గుర్తించలేక మనం ఈ రకమైన వాదోపవాదాలు చేస్తున్నామన్న అభిప్రాయం కొంతమంది విమర్శకులు వ్యక్తం చేశారు. కొడవటిగంటి కుటుంబరావు ఇలాంటి చర్చల గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు. ''ఉత్తమ కథలు అధిక సంఖ్యలో రావాలనుకోవడం దురాశ. నన్నడిగితే తగినన్ని మంచి కథలు రాకపోవడంలేదు. ఈనాటి సమస్యల్లా ఉత్తమ కథలు కావలసిన వారికి అవి ఎక్కడ ఎప్పుడు వెలువడుతున్నదీ తెలియకపోవటం. పరమ చెత్తకథలు పదింటి మధ్య ఒక రత్నమాణిక్యం లాంటి కథ ఉండటం నేను ఎరుగుదును. వీటిని వేరు చెయ్యడానికి విమర్శకులు, విమర్శ చేయగల పాఠకులు పూనుకోవాలి. పాఠకుల లేఖలు ఇందుకు ఉపయోగించవచ్చు. కానీ, ఉపయోగించటంలేదు.''[17]

మొత్తంగా చూస్తే, ఈ దశాబ్ది దినపత్రికల సాహిత్య పుటల్లో కథా సాహిత్యం పైన, విడివిడిగా ఆయా రచయితలపైన, కథలపైన విస్తృతంగా చర్చలు, వాదోపవాదాలు సాగాయని చెప్పాలి. విడిగా 'తొలి తెలుగు కథ ఏదీ' అనే అంశంపై ఈ సందర్భంగా జరిగిన చర్చ కూడా పేర్కొనదగింది. ఆధునిక తెలుగు కథానికకు గురజాడ అప్పారావు ఆద్యుడని అందరికీ తెలుసు. కానీ ఇంతకు ముందే ఒక కథానిక తెలుగులో వచ్చిందని 'తొలి తెలుగు కథానిక ఏదీ' అనే శీర్షికన ఒక చర్చ జరిగింది. ''ఆధునిక తెలుగు కథానికకు ఆద్యుడు శ్రీ గురజాడ అప్పారావు అని చాలామంది అభిప్రాయం. కానీ ఆ మధ్య జరిగిన విశాఖ సాహితీ సభలో శ్రీ గురజాడ అప్పారావు 'దిద్దుబాటు' మొదటి తెలుగు కథ కాదని, శ్రీ ఆచంట వెంకటరాయ సాంఖ్యాయనశర్మ రాసిన 'లలిత' తొలి తెలుగు కథ అని శ్రీ పురిపండా అప్పలస్వామి అన్నట్లు తెలిసింది. శ్రీ ఆచంట వారు రాసిన కథ 'లలిత' విశాఖపట్నం నుంచి ప్రచరించబడే 'కల్పలత' అనే మాసపత్రికలో 1903 నవంబర్ నెలలో వచ్చింది.[18] దీనికి జవాబుగా మిగిలిన పత్రికల్లో సైతం చర్చ కొనసాగడం విశేషం. 'లలిత'ను చారిత్రకంగా తొలి తెలుగు కథగానూ, దిద్దుబాటును తొలి ఆధునిక తెలుగు కథగానూ పరిగణించవచ్చు. ఎన్నో కొత్త సమస్యలు, సంక్లిష్టతలు, సంఘర్షణలు ప్రవేశించాయి. ఫలితంగా మనిషి సైకాలజీయే

సమూలంగా మారిపోయింది. కొత్తగా వచ్చిన ఒక చిన్న సమస్యనో, సంఘర్షణనో, సంక్లిష్టతనో, మానసిక స్థితినో కథలు చిత్రిస్తున్నాయి.''[19]

తెలుగు కథానికపై 1970-80ల మధ్య తెలుగు దినపత్రికల్లో ఆరోగ్యకరమైన చర్చ జరిగింది. ఈ చర్చ కథానికను వ్యాపార చక్రబంధం నుంచి విముక్తం చేసే వాస్తవ జీవితానికి సన్నిహితంగా తీసుకువెళ్ళడానికి ఎంతో కొంత దోహదపడిందనే చెప్పాలి.

**తెలుగు నవలపై వాదోపవాదాలు:** - ఈ దశాబ్దంలో నవల ఒక వ్యాపార వస్తువుగా రూపుదిద్దుకుంది. వారపత్రికలకు కాలక్షేపం పాఠకుల సంఖ్య పెరిగిపోవడంతో వారి వినోదం పరమావధిగా పుంఖాను పుంఖాలుగా నవలలు రాసాగాయి. వీటిలో నిజ జీవితానికి బదులు కాల్పనికత అధికం. ఈ నేపథ్యంలో తెలుగు నవల స్థితిగతులపై వివిధ దినపత్రికల్లో చర్చకు అవకాశమిచ్చే విమర్శా వ్యాసాలు వెలువడ్డాయి. ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో కొన్ని వారాలపాటు తెలుగు నవలల స్థాయిపై రచయిత్రుల అభిప్రాయాలను సేకరించి ప్రచురించింది.

నవలా రచన వ్యాపారంగా మారిపోయిందన్న అభిప్రాయాన్ని చాలామంది రచయిత్రులు వ్యక్తం చేశారు. ప్రసిద్ధ రచయిత్రి మాలతీచందూర్ వర్తమాన నవలల పరిస్థితి గురించి చెప్తూ ''వర్తక వ్యాపారాల పరుగు పందెంలో భాగమైన తెలుగు నవలలో సాహిత్య విలువలూ, ఉన్నత ప్రమాణాలు వెతకడం గొంగళిలో అన్నం పెట్టుకున్నట్లుంటుంది.''[20] వ్యాపార నవలా సాహిత్యంలో విలువల్ని ఆశించలేమని ఆమె అభిప్రాయం. వ్యాపార నవలకి పాఠకుడి అభిరుచే గీటురాయి. పాఠకులు ఏం చెబుతున్నారో అవి మాత్రమే రచయితలు ఉత్పత్తి చేస్తుంటారు. అంటే తెలుగుదేశంలో ప్రధాన వినోద సాధనంగా సినిమా తెలుగు నవల విలువల్ని నిర్దేశించే స్థితికి చేరుకుంది. డ్యాక్టర్ సి. ఆనందారామం అన్నట్లు 'పత్రికా సంపాదకులు ఏరి కోరి కమ్మని ప్రేమ కథలు కావాలని అడిగి రాయించుకుని ప్రచురిస్తున్నారు.[21] కథ మొదలుకొని సంభాషణలు, ముగింపు వరకు సినిమా ఫ్రేములను మాత్రమే దృష్టిలో పెట్టుకుని ఈ రచయితలు నవలలు రాస్తారు. ఇలాంటి సినిమా నవలల్లో వాస్తవ జీవితానికి కానీ నిజ జీవిత చిత్రణకు కానీ ఏ మాత్రం అవకాశం లేదు. అసహజమైన వాతావరణం అడుగడుగునా కనిపిస్తుంది. 'ఈ నవలలు ఎక్కువగా సినిమాను దృష్టిలో పెట్టుకుని రాసినట్టుగా వుంటున్నాయి. వీటిలో కథ అసహజమైన మలుపులు తిరగడమే కాకుండా పాత్ర చిత్రణ కూడా దెబ్బతింటోంది. పాత్ర చిత్రణలో మానవ మనస్తత్వ పరిశీలన లోపించి ఎవరు, ఎప్పుడు, ఎందుకు, ఎలా మారతారో తెలియని అయోమయంగా వుంటోంది.'[22] నవలా రచన పూర్తిగా మారిపోయిందని ఈ స్థితికి ఏ రచయిత అతీతం కదని మరికొందరు రచయిత్రులు అభిప్రాయపడ్డారు. 'నేటి నవలల్ని గురించి రెండు స్థితులు ఉన్నాయి. సుస్థితి ఏమిటంటే రచయితలు కూడా తమ రచన ద్వారా జీవించడం సంతోషం. దుస్థితి ఏమిటంటే డబ్బు కోసం తొందరపడి విషయ నిరూపణ లేని,

బ్యాక్‌గ్రౌండ్ లేని ఏదో ఒకటి రాసి పారేయడం.'[23] అయితే సమాజానికి దర్పణంగా వుండే నవలలు కూడా వస్తూనే ఉన్నాయి.[24] నవల గ్రాంథిక భాష నుంచి వ్యవహారిక భాషకు మళ్ళినపుడు తనకు విస్తృత పరిధి ఏర్పడిందని, ఆ క్రమంలో నవలా రచనకు కొత్తదనం వచ్చిందని కావిలిపాటి విజయలక్ష్మి లాంటి రచయిత్రులు 'రాశి పెరిగా వాసి తగ్గిన మాట కొంతవరకు నిజమే! సమాజాన్ని అద్దం పెట్టి చూపించే నవలలు వస్తున్నాయి. చరిత్రాత్మక నవలలు సీరియల్స్‌గా వస్తున్నాయి. నవలల్లో కొత్తదనం లేదని ఎలా అనగలరు? గ్రాంథిక భాషనుంచి వ్యవహారిక భాషలో రచన మొదలైనప్పుడే నవ్యత వచ్చింది' అన్న అభిప్రాయాలను వ్యక్తం చేశారు.[25] నవలల్లో వస్తు వైవిధ్యం భాష, భావ వ్యక్తీకరణ పూర్తిగా లోపించిందన్న విమర్శను కొంతమంది రచయిత్రులు ఒప్పుకోలేదు. వ్యాపార విలువలు జీవితాన్ని ప్రతిబింబించే రచనలు కొన్నయినా వచ్చాయని వారంటారు. 'అసంఖ్యాకంగా, వంద వెల్లువలా వస్తున్న నేటి నవలలో ఒక 'చివరికి మిగిలేది' 'సమత' 'ఆలోచించు' 'పార్థు' నాకు నవలలుగా పదేపదే చదువుకుని మనసుని ఆలోచింపజేసేవిగా కనబడటానికి కారణం నాకే బోధపడదు. వస్తు వైవిధ్యం, భాష, భావ వ్యక్తీకరణ నేటి రచనలలో లోపించిందా అంటే పూర్తి... అదీ కారణం కాదు'[26] 'కొత్త కొత్త కలాలు చిత్రిస్తున్న నవలారంగ వల్లులలో చాలా వైవిధ్యం కనిపిస్తున్నది'[27]

రచయితలు ఇదివరకటి కంటే బాధ్యతాయుతంగా రచనా వ్యాసంగం సాగించాల్సి ఉంటుందన్న అభిప్రాయాన్ని ఇతరులు కూడా వ్యక్తం చేశారు. వ్యాపార విలువలకు ధీటుగా నిలబడటానికి కావలసిన రచనా విధానాన్ని ఇతర నవలా రచయితలు అలవరచుకోవలసి ఉంటుందని వీరంటారు. 'రోజురోజుకు అధిక సంఖ్యలో బయలుదేరుతున్న ప్రచురణకర్తలను, పత్రికలను ఎదుర్కోవాలంటే రచయిత తన బాధ్యతను నిజాయితీతో నిర్వహించవలసి ఉంటుంది. సరికొత్త రచనలు, వైవిధ్యంగల రచనలు, సామాజికాభివృద్ధికరమైన రచనలు చక్కటిశైలిలో మంచి శిల్పంతో పాఠకుడికి అందించాలంటే రచయిత కష్టపడాలి. గ్రంథ పఠనాన్ని, దేశ కాల పాత్రలను బాగా అవగాహన చేసుకోగల శక్తిని పెంపొందించుకోవాలి. భాషా పటిమను సంతరించుకోవాలి.'[28]

నవలా సాహిత్యంపైన ఇంత విస్తృత స్థాయిలో మునుపెన్నడూ చర్చ జరుగలేదు. ఒక శీర్షికగా వచ్చిన విమర్శలతోపాటు విడిగా వివిధ పత్రికల్లో నవలా రచనపై వచ్చిన వ్యాసాలు కూడా చర్చకు దారితీసాయి. ఈ చర్చ వల్ల వ్యాపార నవలకు సాహిత్య విలువలున్న నవలకు మధ్య ఎలాంటి అంతరం ఉంటుందో పాఠకులకు తెలిసింది. అంతేగాక రచయితలు సృజనాత్మకంగా ఆ బాధ్యతను గుర్తించడానికి ఈ చర్చలు అవకాశాన్నిచ్చాయి.

*ఇతర వాదాలు:* - 1970-80ల మధ్య దినపత్రికల్లో సాహిత్యానికి సంబంధించి ఇతర అంశాలపై వాదోపవాదాలు కూడా కనిపిస్తాయి. ప్రాచీన సాహిత్యానికి, సాహిత్య

చరిత్రకు సంబంధించిన అంశాలపైన చర్చలు వెలువడ్డాయి. చిన్నయసూరి 'బోగస్‌బొమ్మ'[29]'బ్రౌన్ ఆదిపర్వం ముద్రణ'[30] లాంటివి దీనికి ఉదాహరణలు.

పాదసూచికలు:

1టి.ఎల్.కాంతారావు, 'శ్రీశ్రీ యుగం మరణించిందా' విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, మార్చి 2, 1980.

2. డి.వి.వి.ఎస్. వర్మ 'శ్రీశ్రీని ప్రసవించిన యుగం మరణించిందా?' 'ఆధునిక కవిత్వం ఎటు పోతున్నది' ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, జూన్ 3, 1979.

3. శ్రీ సోమసుందర్, 'ఆధునిక సాహిత్యంలో అభ్యుదయ యుగం అంతరించిందా?' ఆంధ్రప్రభ దినపత్రిక, మార్చి 31, 1976.

4. 'శ్రీ కె.వి.రమణారెడ్డిగారు ఆగస్టు నెల 'సృజన'లో తెలంగాణా రైతాంగ పోరాటంలో వీరమరణం పొందిన నరసింహారావును స్మరిస్తూ ఒక వీరగాథను రాశాడు. ఆ గాథ నరసింహారావు విప్లవ వ్యక్తిత్వానికి వన్నె తెచ్చేదిగా గానీ, రమణారెడ్డికి కవిగా కీర్తి తెచ్చేదిగా గానీ ఎంత మాత్రం లేదు. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా ఈ ఒక్క ప్రయత్నంలోనే అటు నరసింహారావు విప్లవ తత్వాన్నీ అపహరించి ఇటు కవిగా తన అసమర్థతనూ శక్తివంచన లేకుండా రుజువు చేసుకున్నాడు రమణారెడ్డి. పోలీసులు నరసింహారావు భౌతిక కాయానికి మాత్రమే విఘాతం కల్పించగా అంతకంటే క్రూరంగా, నైచ్యంగా నరసింహారావు విప్లవ కీర్తికాయానికే శాశ్వతంగా విఘాతం కల్పిస్తున్నాడు రమణారెడ్డి. 'నల్లపాటి రామప్పనాయుడు', 'హైహై రమణారెడ్డి! నైనై నీలో కవితాశక్తి!' విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, సెప్టెంబర్ 9, 1973.

5. నగ్నముని, 'ఆధునిక కవిత్వం ఎటు పోతున్నది, శీర్షిక, 'సకల విలువల్నీ ధ్వంసం చేసే కవిత రావాలి' ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, మే.20, 1979.

6. డాక్టర్ దాశరథి, 'శాసిస్తే కవిత ఉద్భవించదు' 'ఆధునిక కవిత్వం ఎటు పోతున్నది' కొందరు ప్రముఖ కవుల అభిప్రాయాలు, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, మే 20, 1979.

7. శ్రీ సోమసుందర్, 'యువ రచయితలను కలవరపరుస్తున్న సంశయాలు' ఆదివారం, విశాలాంధ్ర దినపత్రిక, డిసెంబర్ 23, 1979.

8. శ్రీ కుందుర్తి సుబ్బారావు, 'కవిత్వం జీవిత సంఘర్షణలో వుంది, అలంకారాలలో కాదు' 'ఆధునిక కవిత్వం ఎటుపోతున్నది' శీర్షిక, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం మే 20, 1979.

9. వేగుంట మోహన్‌ప్రసాద్, 'ఆధునిక కవిత్వం ఎటుపోతున్నది' ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, మే 20, 1979.

10. శ్రీ కుందుర్తి సుబ్బారావు, 'కవిత్వం జీవిత సంఘర్షణలో వుంది, అలంకారాలలో కాదు' 'ఆధునిక కవిత్వం ఎటు పోతున్నది?' కొందరు ప్రముఖ కవుల అభిప్రాయాలు, మే 20, 1979.

11. అక్షరకళ అనే భావం బహు సంఖ్యాకుల్లో లుప్తమైంది. ఒకడు తానేం రాసినా ఎలా రాసినా ఒక వూపుతో ప్రతి వాక్యం రెండేసిమార్లు చదివితే చచ్చినట్టు కవిత్వంగా మారిపోతుందనే లోకువ ఏర్పడింది. 'సోమసుందర్, 'ఆధునిక కవిత్వం - అపూర్వ స్వర్ణయుగం' ఆంధ్రజ్యోతి దినపత్రిక, మే 20, 1979.

12. 'ఆశనిపాతంలా ప్రారంభించిన శ్రీ నగ్నముని అభిప్రాయ సంరంభం కొన్ని పడికట్టు పదాలతో, కొందరి వ్యక్తిగత విమర్శలతో సాగిందే తప్ప అభిప్రాయం తృప్తికరంగా ప్రస్తుతం వున్న సకలమూ 'విలువలు' అయితే వాటిని ధ్వంసం చేయడమెందుకు? వాటి కొత్త పునాదులు లేపడం దేనికి? - శ్రీ మధునాపంతుల సత్యనారాయణమూర్తి, 'కవిత్వానికి శాశ్వతత్వాన్ని ఆపాదించగల విలువలు' ఆధునిక కవిత్వం ఎటు పోతున్నది, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, జూన్ 3, 1979.

13. ఇంద్రగంటి శ్రీకాంతశర్మ 'ఆధునిక తెలుగు కవితలో అనుభూతివాదం' ఆంధ్రజ్యోతి దినపత్రిక, గురువారం సాహిత్య వేదిక శీర్షిక, అక్టోబర్ 19, 1978.

14. డి.వెంకట్రామయ్య, 'రచయితకు సామాజిక చైతన్యం కావాలి' 'నేటి తెలుగు కథ ప్రమాణాలు : అభిజ్ఞుల అభిప్రాయ పరంపర, ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం దినపత్రిక, మే 6, 1979.

15. తాళ్ళూరు నాగేశ్వరరావు, 'కుటీర పరిశ్రమగా మారిన కథా రచన' నేటి తెలుగు కథ ప్రమాణాలు, అభిజ్ఞుల అభిప్రాయ పరంపర, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం అనుబంధం, మే 6, 1979.

16. 'ఓ మూడు దశాబ్దాలపైగా తన సౌందర్యదీప్తితో మనల్ని అలరించి, సమ్మోహపరిచి, ఆలోచింపజేసిన తెలుగు కథ - గత 10, 15 సంవత్సరాలుగా చిక్కిపోతోంది'' - శ్రీ భమిడిపాటి జగన్నాధరావు, 'జాలి కలిగిస్తున్న నేటి తెలుగు కథ' నేటి తెలుగు కథ ప్రమాణాలు, అభిజ్ఞుల అభిప్రాయ పరంపర, ఆంధ్రజ్యోతి దినపత్రిక, మే 6, 1979.

17. శ్రీ కొడవటిగంటి కుటుంబరావు, 'ఉత్త కథలను, ఉత్తమ కథలను వేరు చేయగల విమర్శకులు కావాలి' నేటి తెలుగు కథ ప్రమాణాలు, అభిజ్ఞుల అభిప్రాయ పరంపర, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం మే 6, 1979.

18. బి.స్వర్ణాంబ 'తొలి తెలుగు కథానిక ఏదీ' ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం

అనుబంధం, 'లలిత - శ్రీ ఆచంట సాంఖ్యాయనశర్మ రచన' నవంబర్ 27, 1977.

19. సొదుం రామ్మోహన్, 'తొలి తెలుగు కథ ఏదీ' విశాలాంధ్ర దినపత్రిక, శనివారం, జనవరి 14, 1978.

20. శ్రీమతి మాలతీ చందూర్, 'నేటి తెలుగు నవలల స్థాయిపై ప్రముఖ రచయిత్రుల అభిప్రాయాలు' 'రెండు రకాల నవలలు, వాటి మంచి చెడులు' ఆంధ్రజ్యోతి దినపత్రిక, డిసెంబర్ 3, 1978.

21. డాక్టర్ సి. ఆనందారామం 'నేటి నవలలపై విమర్శలన్నీ పూర్తిగా సహేతుకం కాదు.'' ఆంధ్రజ్యోతి దినపత్రిక, డిసెంబర్ 3, 1978.

22. శ్రీమతి అధరాపురపు తేజోవతి, 'పాత్ర చిత్రణలో అవాస్తవికత', ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆదివారం అనుబంధం, నవంబర్ 26, 1978.

23. శ్రీమతి లత, 'నాతో సహా అందరికీ వర్తించే పరిస్థితులు', ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆదివారం అనుబంధం, నవంబర్ 26, 1978.

24. 'నవల బాగా కమర్షియలైజ్ అయిపోయింది. వారి మాసపత్రికల సంఖ్యతోపాటు నవలల సంఖ్య పెరిగింది. మంది ఎక్కువైతే మజ్జిగ పల్చగ కాదా మరి. మొత్తం మీద చెప్పేదేమంటే అసంఖ్యాకంగా వెలువడుతున్న నేటి నవలా సాహిత్యాన్ని వాపుచూసి బలం అని భ్రమించినట్టూ, బంపర్ క్రాప్‌గా కాక 'నవలా దుమారం'గా గుర్తించి వీలైనంతవరకు ఉత్తమ సాహిత్యాన్ని అందించే ప్రయత్నాలు జరగాలి' - ఎ. శ్యామలారాణి, 'సాహిత్యం సమాజానికి దర్పణంగా ఉండాలి' ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం అనుబంధం, డిసెంబర్ 3, 1978.

25. శ్రీమతి కావిలిపాటి విజయలక్ష్మి, 'మంచి రచనకు తగిన కృషి', ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం అనుబంధం, నవంబర్ 26, 1978.

26. శ్రీమతి ఐవిఎస్ అచ్యుతవల్లి, 'త్వరత్వరగా రాయడంవల్ల అనర్థాలు' ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం అనుబంధం, నవంబర్ 26, 1978.

27. శ్రీమతి నందుల సుశీలాదేవి 'తెలుగు నవలకు బంగారు భవిష్యత్తు' 'నేటి తెలుగు నవలల స్థాయిపై ప్రముఖ రచయిత్రుల అభిప్రాయాలు, ఆంధ్రజ్యోతి దినపత్రిక, డిసెంబర్ 3, 1978.

28. శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి, 'రచయితలు నిజాయితీతో బాధ్యతలను నిర్వర్తించాలి' ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం అనుబంధం, నవంబర్ 26, 1978.

29. 'ఆ సదరు బొమ్మ చిన్నయసూరిది కాదు. స్పష్టమైన దాఖలాయే దొరికింది. పెక్కు తెలుగు కావ్యాలను అందంగా ఉత్తమ వ్యాఖ్యలతో అచ్చువేసిన

ప్రాతఃస్మరణీయుడు. తంజనగరం తేవప్పెరుమాళ్ళయ్యది ఆ బొమ్మ' - బండి గోపాలరెడ్డి (బంగొరె బాంబు), శీర్షిక - 'చిన్నయసూరి బోగస్ బొమ్మ: కళాప్రపూర్ణ నిడదవోలు వారికి ఒక చిన్న ప్రశ్న' ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, మే 22, 1977.

30. 'ఆంధ్రజ్యోతి 1978 నవంబర్ 18వ తేదీ సంచికలో 'ఆదిపర్వం 1843 నాటి ప్రచురణ బ్రౌన్‌ది కాదు' ప్రకటించారు. 1948లో మొదలారిద్వయం ప్రచురించిన ఆదిపర్వం బ్రౌన్ ప్రచురణ కాదనడంలో విప్రతిపత్తి లేదు. కాని 'బ్రౌన్ కృషి మహాభారతానికి ప్రామాణిక ప్రతిని రాయించుట వరకే పరిమితమై వుండి వుండాలి' అన్న అభిప్రాయం మాత్రం సముచితం కాదు. 1842లో బ్రౌన్ ఆదిపర్వాన్ని ముద్రించాడనడానికి కొన్ని ఆధారాలను చూపడమే ఈ వ్యాసోద్దేశం. - ప్రొఫెసర్ జి. లలిత బ్రౌన్ ఆదిపర్వం ముద్రించాడనడానికి ఆధారాలు' ఆంధ్రజ్యోతి, గురువారం సాహిత్యవేదిక, డిసెంబర్ 7, 1978.

★★★

## vi. కవులపై వచ్చిన వ్యాసాలు/ వ్యక్తిగత పరిచయాలు

ఏదో ఒక సందర్భాన్ని (జయంతి కానీ, సన్మానాలు కానీ, వర్ధంతులు కానీ) వున్నపుడు మాత్రమే గతంలో విడివిడిగా ఆయా కవులు రచయితలపైన పరిచయంతో కూడిన వ్యాసాలు వెలువడేవి. అయితే 70ల తరువాత దినపత్రికలలో సాహిత్యానికి తగినంత స్థానం దక్కడంతో కవులు, రచయితలపైన సందర్భంతో సంబంధం లేకుండానే విడివిడిగా వ్యాసాలు ప్రచురితమవడం కనిపిస్తుంది. ఇతర భాషల్లోంచి ప్రేంచంద్, కిషన్‌చందర్, శరత్‌బాబు, ఠాగూర్ లాంటి రచయితల గురించి ఇలా వచ్చిన పరిచయ వ్యాసాలు అసంఖ్యాకంగా కనిపిస్తాయి. తెలుగు సాహిత్యానికి సంబంధించినంతవరకు కందుకూరి, గురజాడ, శ్రీశ్రీ, చలం లాంటి రచయితల గురించి అనేక వ్యాసాలు ప్రచురితమయ్యాయి. అంతేకాకుండా కవిత్వం, నవల, కథా సాహిత్య రంగాలలో కృషి చేస్తున్న ఇతర రచయితలపై వచ్చిన వ్యాసాలను వర్గీకరిస్తే కవులపై వ్యాసాలు ఎక్కువగా కనిపిస్తాయి. ఈ వ్యాసాలలో కొన్ని కేవలం పరిచయాత్మకమైనవి అయితే మరికొన్ని విశ్లేషణాత్మకమైనవి. పరిచయాత్మక వ్యాసాల కుదాహరణ 'తెలుగుకు సన్నిహితమైన తమిళ, కర్నాటక సాహిత్యము లందు కూలంకష ప్రజ్ఞ సంపాదించి అమూల్య పరిశోధనా రచనలు, సాగించిన 'పుట్టపర్తి' రాయలసీమ ప్రసాదించిన వినూత్న రత్నం.'[1] విశ్లేషణాత్మక వ్యాసాల కుదాహరణగా కాళోజీ నారాయణరావు గురించి ముకురాల రామారెడ్డి రాసిన వ్యాసాన్ని, పురిపండా గురించి వడలి మందేశ్వరరావు రాసిన వ్యాసాలు పేర్కొనవచ్చు. 'మొత్తంపై కాళోజీ గత వాదులతో రాజీపడలేదు. అతివాదులతో పోటీ పడలేదు. మితవాదులు కూడా కూడా దూరంగానే చూసినా ఆయన లెక్కపెట్టలేదు. ఆయా వర్గాల కవులెవ్వరూ ఆయన కవితా శైలితో పోటీకి తూగలేరు. ఒకవంక కవులనూ, మరోవంక పాఠకులనూ ఉద్దేశించి ఆయన అక్కడక్కడ చెప్పిన మాటల్లో ఆయన లక్ష్యం బాగా తెలుస్తున్నది. రెండు పూటల తిండి కోసం బుద్ధిహీనులంతా పొగడుకుంటూ తిరగకండి. కవిత్వం అంటే అబద్ధం అని అర్థం వచ్చేటట్లు రాయకండి అన్నారు.'[2] '1930 నాటి మనిషి 1950 నాటికి అలాగే స్థిరపడిపోయి 1970 నాటికి రెండు తరాల వెనుకటి భావాలతో చిత్రవస్తు ప్రదర్శనలోని పురాతన వస్తువులా మనకు దర్శనమివ్వడం తరచు మన అనుభవంలో కనబడుతుంది. అంతలో ఆయన ఆగిపోడు'[3] విశేషమేమిటంటే ఇటువంటి విశ్లేషణాత్మక వ్యాసాలే 70ల తరువాత

ఎక్కువగా కనిపిస్తాయి. కవి ఉపయోగించిన ఒకానొక ప్రతీకను విశ్లేషించే వ్యాసాలు కూడా కనిపించడం గమనించాల్సిన విషయం దీనికుదాహరణ. 'నారాయణబాబు గడ్డిపరకలోని వర్గ సంఘర్షణ గురించి ఎ. రజాహుస్సేన్ రాసిన వ్యాసం. 'సమాజంలో పీడితులై పడివున్న పేదలకు ప్రతినిధిగా గడ్డిపరక గొంతు వినిపిస్తుంది. సమాజంలోని సామాన్య మానవునికి ప్రతీకగా 'గడ్డిపరక'ను కవి స్వీకరించారు. పేదలు, వారి జీవితాలపై సాగిపోతున్న ధనికులు, వీరిరువురి మధ్య సంఘర్షణకు అద్దం పడుతుంది. 'గడ్డిపరక' గేయం కారల్‌మార్క్స్ 'గతితార్కిక భౌతిక వాదంలో' చెప్పిన 'పరస్పర విరుద్ధ శక్తుల మధ్య సంఘర్షణ' అనే సూత్ర ప్రభావం ఈగేయంపై ప్రసరించింది.'[4] ఇదే సందర్భంగా పూర్వకవుల రచనా వ్యాసంగాన్ని దృష్టిలో వుంచుకుని కొన్ని మౌలిక భావనల్ని తిరిగి నిర్వచించుకునే ప్రయత్నం జరిగింది. దీనికి ఉదాహరణంగా సోమసుందర్ ఆంధ్రజ్యోతి సాహిత్యవేదికలో 1978లో రాసిన వ్యాసాన్ని పేర్కొనవచ్చు. 'మేధావి సామాజికులతో అవిభాజ్యంగా తన హృదయాన్ని లీనం చేసుకుని, అధిక సంఖ్యాకుల సమస్యలను తనవిగా స్వీకరించడమే సంఘ చైతన్యం. అదే అభ్యుదయ దృక్పథం, అదే వర్గ చైతన్యాన్ని పురోగమింప చేయగలదు. ఆ చైతన్యంతోటే శ్రీ అనిశెట్టి 'తల్లీ ధరణి నీ యెద చల్లగా ప్రయాణింపుము, పొంగి పార్లి భువి నిండిన ప్రాణపవాహము నీవై' అంటాడు.'[5] పూర్వ కవుల్ని పరిచయం చేసే సందర్భంలో వర్తమాన సాహిత్య వివాదాల్ని కూడా అవగాహనతో ఉంచుకుని వ్యాఖ్యానించే ధోరణి కనిపిస్తుంది. 'నవభావామృత రసధుని తిలక్' శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రిక ఆదివారం అనుబంధంలో శ్రీరమణ రాసిన వ్యాసం దీనికుదాహరణ. తిలక్ సాహిత్య తత్వాన్ని విశ్లేషిస్తూ తిలక్‌లో సామాజిక విలువలు లేవన్న కొందరు విమర్శకుల అభిప్రాయాలను పూర్వపక్షం చేసి 'తిలక్‌కి సామాజిక దృక్పథం వుంది. లేనిది పార్టీ దృక్పథం' అని వ్యాఖ్యానించారు.[6]

సమకాలీన సాహిత్య ధోరణుల ప్రభావంతో పూర్వకవుల సాహిత్య కృషిని అంచనా వేయడానికి కొందరు విమర్శకులు ప్రయత్నించారు. శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు, బైరాగి లాంటి కవులపైన వచ్చిన వ్యాసాల్లో ఈ ధోరణి కనిపిస్తుంది. 'శ్రీ కృష్ణశాస్త్రి తన కెదురుగా నిలిచి ఉన్న ఆంధ్రభాషను ప్రథమశః తన కనుకూలమైన కవితాభాషగా శిల్పీకరించుకొన్నారు. తెలుగు భాషలోని బండ బాదుళ్ళకు, రాంధోళ్ళ పెటుకు శబ్దాలకూ, స్వస్తి చెప్పారు. ఆధునిక కావ్య భాషగా తెలుగు భాషకు ఒక సౌకుమార్యాన్ని చేకూర్చారు. కానీ జీవిత యాథార్థ్యం అలా బ్రతకనివ్వలేదు. 'కౌర్య కౌటిల్య కల్పిత కఠిన దాస్య శృంఖలాలు' గలగలా మ్రోగుతున్నాయి. తన యథేచ్ఛకేవో కనిపించని అవరోధాలు కలిగిస్తున్నాయి. ఈ ఆత్మ చైతన్యం కవిదర్శనను మార్చింది. కనుకనే 'జగము నిండ స్వేచ్ఛాగాన ఝరులు' నింపడానికి ఉద్యుక్తులయ్యారు శ్రీ కృష్ణశాస్త్రి. తెలుగు కవితా చరిత్రలో మహోజ్వల ఘట్టాన్ని ఆవిష్కరించి చిరతర దీప్తుల నెలయించారు.'[7] 'అతని కవిత్వపు తీరే వేరు, మహాప్రస్థానం మొదలు త్వమేవాహమ్ వరకు ఆధునిక కవులంతా తమ కావ్యాలకు

సంస్కృత సమాసాలే శీర్షికలుగా వుంచారా. ఇతను ఉత్త తెలుగు సమాసంతో గొప్ప బొమ్మ కట్టాడు. ఒక నిరంతరక్లేశాన్నీ, జీవన్గ్లానినీ ప్రతిధ్వనించాడు.'[8] ప్రసిద్ధ కవులు, రచయితలు కన్ను మూసినపుడు వారితో తమకున్న అనుబంధాన్ని చెబుతూ స్మృతి ప్రధానమైన వ్యాసాలు అనేకం వెలువడ్డాయి. అబ్బూరి రామకృష్ణారావు మరణించినపుడు 'కుందుర్తి' ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో రాసిన వ్యాసం దీనికుదాహరణ. 'భావకవితోద్యమానికి తొలి రూపురేఖలు దిద్దిన ఆద్యులు, పూజ్యులు అబ్బూరి రామకృష్ణారావుగారి మరణం తెలుగుదేశానికి తీరని లోటు. ఈ 'తీరని లోటు' ఎవరు మరణించినా అనే మాటే గదయ్యా, అంతటి వాడిక్కూడా ఈ వాడిపోయిన 'వాడి'పోయిన మాటే వాడావా అంటే తెనుగు నుడికారంలో మరేం దొరకడంలేదు. చావమంటారా నన్ను? ఆయన మరణవార్త రేడియో వినగానే మనస్సు మళ్ళీ ఒకసారి ఒకనాటి భావ కవితా లోకంలోకి ఎగిరి గంతేసింది.'[9] సాహిత్య తపస్వి సింగరాచార్య చనిపోయినప్పుడు కూడా వచ్చిన స్మృతి వ్యాసం పేర్కొనదగింది.[10]

సృజనాత్మక రచయితల్లో చలం మాదిరిగా వివాదాస్పద రచయిత మరొకరు లేరు. అలాగే చలాన్ని గురించి వచ్చినన్ని వ్యాసాలు మరెవరిపైనా రాలేదు. అయితే ఈ వ్యాసాల్లో చలాన్ని వ్యక్తిగతంగానూ, సాహిత్యపరంగానూ రెండు విధాల విశ్లేషించే ప్రయత్నం జరిగింది. వ్యక్తిగతంగా చలాన్ని విశ్లేషిస్తూ కొడవటిగంటి కుటుంబరావు ఒక వ్యాసంలో 'చలం ఎంత ఒంటరివాడో చలం రచనలు అంతగా జనాదరణ పొందాయి' అని వ్యాఖ్యానించారు.[11] చలం సాహిత్య జీవిత క్రమ పరిణామాన్ని వివరిస్తూ వావిలాల సుబ్బారావు ఒక విశ్లేషణాత్మకమైన వ్యాసం రాశారు? '' ఆయన రాయడం మాని సంవత్సరాలు దాటింది అన్నవారు చలంగారు ప్రవాస జీవితంలో రాసిన అనేక రచనల విలువను గుర్తించదలచుకోవడం లేదు. 'సమాజానికి ఉపయోగపడ్డ మేరకే వ్యక్తి విలువ' అన్న నిశిత దృష్టిగలవారికి ప్రవాసియైన 'చలం' వారు అప్పటి రచనల మీద గౌరవం లేకపోయినా వ్యక్తివిలువను వ్యక్తిత్వంతో అంచనా వేసేవారికి ఆయన జీవితాన్ని సత్యశోధనగా భావించిన వారికి ఆయన ప్రేమర్షి - అమరుడు'' [12] చలంలోని వైరుధ్యాలను ఎత్తి చూపించే విమర్శనాత్మక వ్యాసాలు కూడా వచ్చాయి. [13] కాగా ప్రసిద్ధులైన రచయితలపైన విడివిడిగా వచ్చిన వ్యాసాలు అనేకం కనిపిస్తాయి. వీటిల్లో వీరేశలింగం, గురజాడ, గిడుగు, రోణంకి, అడవి బాపిరాజు లాంటి రచయితలపైన ఎన్నో వ్యాసాలు వెలువడ్డాయి.

వీరేశలింగం అందుకున్న ఉత్తరాలు అనే శీర్షికన అక్కిరాజు, రమాపతిరావుగారు ఒక వ్యాసం రాశారు. ''తన చుట్టూ వున్న సమాజాన్ని సంస్కరించాలని, ఆదర్శమైన ఉన్నతమైన సాంఘిక విలువగల వ్యవస్థను నిర్మించుకొనేట్టు సాంఘికులను ప్రబోధించాలని వీరేశలింగం నిరంతరం పరిశ్రమించాడు. [14]గురజాడ శాస్త్రీయ మానవతాతత్త్వం గురించి పరిచయం చేస్తూ ఓ చిన్నపరెడ్డి ఒక వ్యాసంలో ''గురజాడ తెలుగువారికే గ్రాంధిక భాషకు బదులు వాడుక భాషను చేకూర్చాడు. తెలుగు

సాహిత్యంలో కాల్పనికానికి బదులు వాస్తవికాన్ని ప్రవేశపెట్టాడు. తెలుగువారికి ఆధ్యాత్మిక తత్త్వం బదులు శాస్త్రీయ మానవతా తత్త్వం పరిచయం చేశాడు. ఈ విధంగా రకరకాలుగా నవయుగ వైతాళికుడుగా వెలుగొందాడు గురజాడ.[15] భాషకి గిడుగు అందించిన సేవల గురించి వాసా సుబ్రహ్మణ్యశాస్త్రి 'గిడుగు కాదు చిచ్చరపిడుగు' అన్న వ్యాసంలో ఇలా అంటారు. ''రేడియోలలో, గ్రంథాలలో వ్యవహారిక భాష నిర్విరోధంగా వాడబడుతున్నదంటే అది గిడుగువారి చేతిచలవే, లేకపోతే తెలుగుశైలి యింకా చిన్నయసూరిగారి నీతిచంద్రికలోని కృతకశైలి అనే కీకారణ్యంలో పడి కొట్టుమిట్టాడుతూ వుండవలసిందే, నాటికి నన్నయ్య వాగనుశాసనుడనిపించుకున్నాడు. నేటికి 'గిరాంమూర్తి'గారు అభినవ వాగమశాసనుడనిపించుకున్నారు''.[16] ఇంకా సాహిత్య విమర్శకులపై వచ్చిన వ్యాసాలు కూడా ఈ సందర్భంగా పేర్కొనదగినవి. ఉదాహరణకు డి.వి.వి. ఎస్.వర్మ రాసిన వ్యాసంలో ''రాచమల్లు రామచంద్రారెడ్డి 'మార్క్సిస్టు దృక్పథావసరాలు' కళాత్మక విలువల్ని అంచనా కట్టటంతోటే ఊరుకోవు. సాహిత్యంయొక్క సామాజికప్రయోజనాన్ని కూడా దర్శిస్తుంది. అందుచేత మార్క్సిస్టు దృక్పథం కళకళ కోసమేననే వాదనలాంటి పాక్షికమైంది కాదు, పరిపూర్ణమైంది. ఉన్నత సాహిత్య ప్రమాణాలను, ఉత్తమ సాహిత్య ప్రయోజనాలను నెలకొల్పుతుంది. సరిగ్గా రారా చేసిందీ అదే. అందుకే ఆ వ్యాసాలు సంచలనాన్ని సృష్టించాయి'' అని అన్నారు.[17]

పాదసూచికలు :

1. రావినూతల శ్రీరాములు, 'తాత్త్విక ద్రష్ట, సాహిత్య, సంగీత రసస్రష్ట. పుట్టపర్తి నారాయణాచార్యులు, ఆంధ్రపత్రిక దినపత్రిక, మంగళవారం, అక్టోబర్ 21, 1980.

2. డాక్టర్ ముకురాల రామిరెడ్డి, 'కాలమేదైతేమి కాళన్న కాళన్నే' ఆంధ్రప్రభ దినపత్రిక, సాహిత్య ప్రభ, డిసెంబర్ 29, 1977.

3. శ్రీ పడలి మందేశ్వరరావు, 'పురిపండా కాదు, పులిపంజా', ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం అనుబంధం, ఫిబ్రవరి 27, 1977.

4. ఎ. రజాహుస్సేన్, 'నారాయణబాబు 'గడ్డిపరక' లో వర్గసంఘర్షణ' విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం సాహితీ లోకం శీర్షిక, జూలై 20, 1980.

5. శ్రీ సోమసుందర్ 'అభ్యుదయ కవి అనిశెట్టి కవితా తత్త్వం' ఆంధ్రజ్యోతి దినపత్రిక, సాహిత్యవేదిక, నవంబర్ 23, 1978.

6. 'తిలక్ కథలలో సామాజిక విలువలు తగినంతగా లేవనే విమర్శ కూడా ఉంది. తిలక్‌కి సామాజిక దృక్పథం వుంది. లేనిది పార్టీ దృక్పథం' - శ్రీరమణ, 'నవభావామృత రసధుని - తిలక్', ఆంధ్రజ్యోతి ఆదివారం దినపత్రిక, మే 15, 1977.

7. శ్రీ సోమసుందర్, 'కవితావాగ్దేవికి కలికితురాయి కల్పించిన మహాకవికృష్ణశాస్త్రి' ఆంధ్రభూమిదినపత్రిక, ఆదివారం, ఫిబ్రవరి 8, 1976.

8. శ్రీ సోమసుందర్, 'వైరాగ్య రాగంలో మీటిన ఏక్‌తార బైరాగి కవిత్వం' ఆంధ్రజ్యోతి దినపత్రిక, గురువారం సాహిత్య వేదిక, అక్టోబర్ 5, 1978.

9. శ్రీ కుందుర్తి సుబ్బారావు 'అబ్బూరి: మనల్ని విడిచి వెళ్ళిన మరొక వైతాళికుడు' ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం సాహిత్యవేదిక, జూన్ 3, 1979.

10. '1940లలో తెలుగు కవితలో పేర్కొనదగిన ప్రయోగాలు జరిగాయి. అలా నూతన ప్రయోగాలు జరిపిన ప్రముఖులలో ఒకరు ఇటీవలే కీర్తిశేషులైన శ్రీ బి.వి.సింగరాచార్య (బొమ్మకంటి వేంకట సింగరాచార్య) - శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ, సాహిత్య తపస్వి కీర్తిశేషుడు సింగరాచార్య, ఆంధ్రజ్యోతి గురువారం, సాహిత్య వేదిక, అక్టోబర్ 26, 1978.

11. కొడవటిగంటి కుటుంబరావు, 'ఒంటరివాడుగా జీవించిన చలం', ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం సాహిత్య వేదిక, మే 13,1979.

12. శ్రీ వావిలాల సుబ్బారావు, 'చలం సాహితీ జీవితంలో క్రమపరిణామం', ఆంధ్రజ్యోతి దినపత్రిక, సాహిత్య వేదిక, జూన్ 10,1979.

13. ''చలం జీవితంలో ఈ రెండు సంఘటనలు వున్నాయి. తీవ్రమైన ఉద్రేకంతోపాటు సంఘాన్నీ, కట్టుబాట్లని నీతుల్ని నటనల్నీ తూర్పారబట్టి, తునాతునియలు చేసిన సాహసికాంశం వుంది. రమణాశ్రమం చేరి భగవాన్ సన్నిధిలో శాంతి సంపాదించుకోవాలనే కామనా వుంది. - ఆర్.వి. ఆర్., 'సమకాలిక సమాజ వైరుధ్యాల ప్రతిబింబం చలం', విశాలాంధ్ర, ఆదివారం, మే 13, 1979.

14. శ్రీ అక్కిరాజు రమాపతిరావు, 'వీరేశలింగం అందుకున్న ఉత్తరాలు'. మే 25, 1980.

15. న్యాయమూర్తి ఒ.చిన్నపరెడ్డి, 'నవయుగ వైతాళికుడు గురజాడ', ఆంధ్రభూమి దినపత్రిక, జనవరి 15, 1976.

16. వాసా సుబ్రహ్మణ్యశాస్త్రి, 'గిడుగు కాదు, చిచ్చరపిడుగు', ఈనాడు దినపత్రిక, ఏప్రిల్ 8, 1975.

17. డి.వి.వి. ఎస్.వర్మ 'మార్క్సిస్టు సాహిత్య విమర్శకుడిగా రారా', విశాలాంధ్ర దినపత్రిక సోమవారం, జనవరి 9, 1978.

***

# vii. 1970-80ల మధ్య దినపత్రికల్లో వచ్చిన ఇతర అంశాలు

భాషా సాహిత్యాలపట్ల ఆసక్తీ, అభిరుచి పెరిగిన తరువాత తెలుగు దినపత్రికలలో కేవలం సాహిత్య సంబంధమైన అంశాలే కాకుండా వాటి చుట్టూ వుండే భాషానువాదంలాంటి ఇతర అంశాలు కూడా తగినంత ప్రావుఖ్యాన్ని సంచరించుకోసాగాయి విద్యాలయాల్లోనూ, విశ్వవిద్యాలయాల్లోనూ భాషా బోధన సాహిత్య అధ్యయనానికి సంబంధించి ఎన్నో విషయాలు చర్చకు వచ్చాయి. వీటన్నిటికి కూడా దినపత్రికలు వేదికగా మారడం విశేషం. తెలుగు భాషా బోధన గురించి మారుతున్న కాలానికి అనుగుణంగా భాషా సాహిత్యాల సిలబస్ మారాల్సిన అవసరాన్ని గురించి విద్యావేత్తలు, సాహిత్యవేత్తలు చర్చలు జరిపారు. ప్రముఖ అనువాద రచయిత ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు ''నవీనాలైన అవసరాలకు వీలుగా పత్రికా రచన, సృజనాత్మక రచన, గ్రంథ సంపాదన మొదలైన విషయాలు ఎం.ఏ. స్థాయిలో ఐచ్ఛిక విషయాలుగా వుండటం మంచిది. ముఖ్యంగా అనువాద పద్ధతుల్ని గురించి లక్ష్య లక్షణ పూర్వకమైన అధ్యయనమూ, ద్వితీయ భాషగా తెనుగును బోధించడానికి తగిన పద్ధతుల్ని అధ్యయనం చేయడమూ మన సిలబస్సులో చేర్చుకొనడం మంచిది''[1] అంటారు. పరిశోధన స్థాయిలో కూడా తెలుగు భాష వాడుకలో మార్పు రావలసిన అవసరాన్ని చెబుతూ డాక్టర్ ఎం. కులశేఖర్‌రావు ఒక వ్యాసంలో తెలుగులో శాస్త్రీయ అంశాల పరిభాషను రూపొందించుకోవలసిన అవసరాన్ని తెలియజేశారు. 'భాషాంతరీకరణం అనేది ఒక కళ అంటూ వుండేవారు. ఇటీవల దాన్ని ఒక శాస్త్రంగా గుర్తిస్తున్నారు. ఇది కళా? శాస్త్రమా? అనే ఆలోచన లేకుండానే చాలా మంది అనువాదాలు చేస్తున్నారు. ఇతర భాషల్లో వుండే అసంఖ్యాకమైన సృజనాత్మక రచనలైతేనేమి, శాస్త్రగ్రంథాలయితేనేమి తెలుగులో వెలువడుతూనే ఉన్నాయి. ప్రఖ్యాతమైన ప్రచురణ సంస్థలు వీటిని వెలువరిస్తూనే ఉన్నాయి.[2] ఈ దశలోనే అనువాద భాషల తెలుగు ఎంత విస్తరించాల్సిన అవసరముందో గోవిందరాజు రామకృష్ణారావు ఒక వ్యాసంలో ఇలా అన్నారు. '' ఇంగ్లీషులో విశేషపాండిత్యం సముపార్జించినవారూ, తెలుగులో సమాన ప్రతిభావ్యుత్పత్తులున్న వారు ఈ అనువాద కృషికి దోహదం చేయాలి. తమ అనువాదాల ద్వారా వారు తెలుగును సుసంపన్నం చేయాలి. తెలుగును

క్రమాధికంగా అన్ని స్థాయిలకు విస్తరింపచేసే కార్యక్రమాన్ని శీఘ్రతరం చేయాలి''[3] భాషకు సంబంధించి విస్తృతమైన చర్చ జరగడానికి దినపత్రికలు ఉపయోగపడ్డాయి. భాషలోని తేడాలను, వైవిధ్యాన్ని వివరించే వ్యాసాలు లెక్కకుమించి వెలువడ్డాయి. తెలుగులో గ్రాంథికం, వ్యవహారికం అనేసరికి ఏవో విభిన్నమైన కేటగిరీలకు సంబంధించిన భాషలు కాబోలు అన్న అభిప్రాయం ఏర్పడేట్లుగా రూపొందాయి ఆ శబ్దార్థాలు.

వ్యవహారంలో అంటే మామూలుగా మాట్లాడే భాషలో కానివ్వండి, రాతలో ఉపయోగించే శిష్ట వ్యావహారికం వంటి భాషలో కానివ్వండి. మనం వాడే శబ్దాలు ''చావుబ్రతుకులు'' పేరుతో గ్రాంథికం, వ్యవహారికం అవుతాయి. మామూలుగా వ్యవహారంలో లేని ధేనువునకు - ఆవునకు, వచ్చుట, తెచ్చుట, ఇచ్చిరి, మెచ్చిరి వంటి రూపాలు గ్రాంథికంగా నిలిచే మాట స్పష్టమైన విషయమే''నని అన్నారు. [4] భాషకు సంబంధించిన అంశాలు గాఢంగా చర్చించబడటంతో సమకాలీన విమర్శా వ్యాసాలపై వాటి ప్రభావం కనిపిస్తుంది. భాషాగతంగా ఉన్న స్వల్పమైన సంశయాలు కూడా తొలగిపోయి పూర్తిగా వాడుక భాషే వ్యక్తీకరణకు వాహికగా మారటం ఈ దశలో గమనించవచ్చు.

## నాటకరంగంపై విమర్శలు:

సాహిత్యంలో నాటకాన్ని మించిన అద్భుతమైన ప్రక్రియ మరొకటి లేదని లాక్షణికులు అంటారు. కానీ ఆధునిక కళల్లో అంత అద్భుతమైన దశ నాటకానికి చాలా అరుదుగా కనిపిస్తుంది. ముఖ్యంగా చలన చిత్రకళ అధికంగా ప్రజాదరణ పొందడంతో నాటకరంగ సంస్థలు నాటక సాహిత్యం తెరమరుగయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ అంశంపై తెలుగు దినపత్రికల్లో విస్తృతంగా కాకపోయినా అప్పుడప్పుడు కొద్దిపాటి చర్చలు జరిగాయి. ప్రసిద్ధులు నాటకరంగంపై దుస్థితికి తమ ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చారు. ''నేడు సినిమారంగ విజృంభణతో ఆధునిక నాటక రంగం అధోగతి పాలై నానాటికీ క్షీణించి పోయింది. కళారంగానికి గ్రహణం పట్టి అనేక సినిమా సంస్థలున్నాయే కానీ చెప్పుకోదగ్గ నాటక సంస్థలు నేడు లేవు. [5]అయితే విడిగా ఆయా నాటకాల్లోని సామాజిక చైతన్య అంశాలను ప్రస్తావించే వ్యాసాలు మాత్రం అప్పుడప్పుడు కనిపిస్తాయి. నిర్దిష్టమైన దృక్పథంలో నడిచే దినపత్రికల్లో వామపక్ష భావజాలం కలిగిన నాటకాలను, వాటి ప్రదర్శనలను గురించి విశేషంగా రాయడం కనిపిస్తుంది. '' 'మాభూమి' నాటకం తెలంగాణా ప్రజల బాధామయ గాథలకు దర్పణం బట్టి చూపెట్టడమే కాకుండా ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాన ప్రజలు సాగించిన ప్రతిఘటనోద్యమం ఒక్కటే సంస్థాన ప్రజల విముక్తికి రాచబాటని ఎలుగెత్తి చాటింది. ఈ నాటకం ప్రదర్శనలు కేవలం తెలంగాణా ప్రజలనేగాక యావదాంధ్ర ప్రజలను ఉర్రూతలూగించింది. [6]

*జానపద సాహిత్యం:* 1970ల తరువాత తెలుగు దినపత్రికలలో జానపద సాహిత్యానికి సంబంధించి విషయాలు చర్చనీయాంశాలైనాయి. విప్లవ సాహిత్య ప్రభావం వల్ల జానపద బాణీలకు, మాండలిక ప్రయోగాలకు తగు ప్రాధాన్యం దక్కడంతో జానపద సాహిత్యంలోని మౌలిక అంశాల అన్వేషణ దిశగా కొంత కృషి జరిగింది. జానపద సాహిత్యానికి సామాజిక శాస్త్రాలలో ఉన్న సంబంధాన్ని విశ్లేషిస్తూ వివిధ వ్యాసాలు వెలువడ్డాయి. జానపద వాఙ్మయానికి సామాజిక రంగాలతో ఉన్న సంబంధాన్ని చెబుతూ డాక్టర్ నాయని కృష్ణకుమారి విశాలాంధ్ర దినపత్రికలో 'జానపద వాఙ్మయం' శీర్షికతో ఒక వ్యాసం రాశారు. ''అనగా ఒక జాతి పుట్టుపూర్వోత్తరాలు దాని ఆలోచనా విధానం తెలుసుకోవాలంటే ఆ జాతికి చెందిన జానపద వాఙ్మయాన్నే ఆశ్రయించాలి. అందువల్ల ఈ వాఙ్మయానికి తత్త్వశాస్త్రం, సాంఘిక శాస్త్రం, మతం మొదలైనవి ఎన్నో శాస్త్ర శాఖలతో పరోక్షసంబంధం వున్నది''.[7] అయితే సామాజికుల సంఘర్షణ వ్యక్తమయ్యేంతవరకే జానపద వాఙ్మయాన్ని ఆధునికులు స్వీకరించటం ప్రధాన అంశంగా కనిపిస్తుంది. ''సామాజికులు తమలో తామూ, ప్రాకృతిక దుశ్శక్తులలో తామూ, నిత్య సంఘర్షణకు తలపడుతూనే వుంటారు. ఇదికాక సామాజికుడు తనలో తాను సంఘర్షిస్తాడు. అంటే సామాజికులకు బహిస్సంఘర్షణ ఎంత అనివార్యమో అంతస్సంఘర్షణ సైతం అంతే అనివార్యమవుతుందని తెల్లమవుతుంది. ఈ ఉదాత్త జానపద కళారూపాన్ని సముద్ధరించాలన్న సదాశయం ప్రతీచోటా, ప్రతి నోటా వినిపిస్తూనే వుంది. కానీ ఆచరణలో మాత్రం ఏమి జరగడంలేదు''.[8]

తెలంగాణా పోరాట కాలంలో జానపదం ఉపయోగపడిన తీరును సమకాలీన విమర్శకులు విశ్లేషించారు. తెలంగాణా పోరాటానికి చైతన్యవంతమైన సాధనంగా జానపద గేయాలు ఎలా ఉపయోగపడ్డాయో చెబుతూ ఒక విమర్శకుడు ''తెలంగాణా సాయుధ పోరాట కాలంలో సాహిత్యమెంతగానో ప్రజలను ఉత్తేజపరిచింది. ఇందుకు ప్రముఖుల రచనలు, జానపద గేయాలు ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను రేకెత్తింపజేసి వారి శక్తియుక్తులను పోరాటంవైపు మరలించుటలో సహాయపడింది. తుపాకి తూటాకంటే గూడా ఆనాటి గేయాలు శక్తివంతమైనవని నిరూపించినవి. అటువంటి గేయాలన్నీ చెల్లాచెదురుగా ప్రజల నోళ్లలోనే వున్నాయి'' అని అన్నారు.[9] జానపద భావాలను ఆధునిక సాహిత్య భావాలతో సరిపోల్చుకునే ధోరణి కూడా ఈ దశకంలో కనిపిస్తుంది. '' ఒక్కోచోట జానపదుల భావాలు కావ్యాల్లోని, మహాకవుల భావాలతో సరితూగలిగేవిగా వున్నాయి. ఇంకా వస్తే ఇప్పటి ఆధునిక సాహిత్యంలోని భావాలతో కూడా సరిపడేట్లుగా వున్నాయి. అయితే ఎక్కడ అనేది ప్రశ్న! ఏ కొందరో కొన్నిచోట్ల పోలికలు చూపారు కాని అది చాలదు''.[10] ఇవికాక జానపద సాహిత్యంలోని ఇతర అంశాలను పరిశీలించే రచనలు కూడా దినపత్రికల ఆదివారం అనుబంధాల్లో వెలువడ్డాయి.[11] వివిధ ప్రాంతాలవారీగా జానపద సాహిత్యాన్ని సేకరించి వాటిపై

విశ్లేషణలను దినపత్రికల్లో అవకాశం లభించింది. [12]

## బాలసాహిత్యం:

బాలసాహిత్యంపైన అతి తక్కువగానైనా విలువైన విమర్శా వ్యాసాలు 1970-80ల మధ్య వచ్చాయి. బాల సాహిత్యంలోని భావశైలిని వివరిస్తూ డాక్టర్ ముకురాల రామిరెడ్డి ''బాలల రూపాలనూ భాషను, భాషితాలనూ సేకరించే పథకం ఇప్పుడైనా ప్రారంభించాలి. జిల్లాకు ముగ్గురు కార్యకర్తల చొప్పున వెళ్లవచ్చు. అంటే కోస్తా, రాయలసీమ, తెలంగాణా ఈ మూడు ప్రాంతాల నుంచి ఎన్నుకొన్న భాషా నిపుణులు ప్రతి జిల్లాకు ముగ్గురు చొప్పున వెళ్లి టేపురికార్డులు ఉపయోగించి ఆయా ప్రాంతాల బాలల భాషను సేకరించవచ్చు. అలా సేకరించడంలో సాంస్కృతికంగా, సామాజికంగా సంపన్నమైన మధ్యతరగతి తెలుగు కుటుంబాల బాలబాలికలను ఎన్నుకుంటే ఒక సాధారణ ప్రమాణంగల భాష లభించే వీలుంది. అలా సేకరించిన భాష బాలసాహిత్య రచన మాదిరి భాషగా పనికి వస్తుంది'' అని వ్యాఖ్యానించారు. [13]

ఈ రకమైన వ్యాసాలు వివిధ దినపత్రికలలో మరికొన్ని ప్రచురితమయ్యాయి.

## వార్తల విశేషాలు:

సాహిత్య సభలు, సమావేశాలు, ఇతర విశేషాల గురించి సమాచారాన్ని అందించడం ద్వారా దినపత్రికలు పాఠకులలో తమ సాహిత్య అభిరుచిని పెంపొందించడానికి కృషి చేశారు. 1970-80ల మధ్య వివిధ రచయితల సంఘాల ఆధ్వర్యంలో ఎన్నో సదస్సులు, గోష్ఠులు జరిగాయి. వాటి విశేషాలను పత్రికలు విశ్లేషణతో సహా అందించాయి. 1976లో 'సమాజం నవల' అన్న అంశంపై హైదరాబాద్ అభ్యుదయ రచయితల మహాసభలో జరిగిన ప్రసంగాలను యథాతథంగా వ్యాసరూపంలో విశాలాంధ్ర ప్రచురించింది. [14] వాడుక భాషా ఉద్యమంపైన విశాఖపట్నంలో 1980 ల్లో జరిగిన 'మూడు రోజుల విశేష సదస్సుపై కూడా దినపత్రికల్లో విస్తృతమైన చర్చకు అవకాశం కలిగింది. ఆ సదస్సు తీర్మానాలను భాషా శాస్త్రవేత్తలు చర్చించడమే కాకుండా ఇతర రచయితల్లో వాటికి సంబంధించిన చైతన్యాన్ని తీసుకురావడానికి ప్రయత్నించారు. [15] ఖమ్మంలో జరిగిన ఈ దశాబ్ది నవలా సదస్సుపైన [16] కడపలో 1980లో జరిగిన విమర్శ సదస్సుపైన[17] వెలువడిన వార్త వ్యాఖ్యలు పేర్కొనదగినవి. ఇదే సమయంలో ఇతర రాష్ట్రాలలో జరుగుతున్న సాహిత్య కృషిగురించి వెలువడిన వార్తావ్యాఖ్యాల కూడా చెప్పుకోదగినవి. [18] ప్రసిద్ధకవులు, రచయతలకు విశిష్టమైన గౌరవ సత్కారాలు లభించినపుడు దినపత్రికలు ఆ వార్తా విశేషాలకు విశేష ప్రాముఖ్యానిచ్చాయి. ఉదాహరణకు 1977 లో కుందుర్తికి సాహిత్య అకాడమీ అవార్డు లభించినపుడు ఆ వార్తను దాదాపు అన్ని పత్రికల ప్రాధాన్యమిచ్చి ప్రచురించాయి. ప్రసిద్ధ రచయతలు కన్నుమూసినపుడు మొదటి పేజీల్లోనే ఫోటోలతో సహా ఆయా పత్రికలు ప్రచురించాయి. [19] ప్రముఖ కవి శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి అస్తమించినపుడు కూడా

ఫిబ్రవరి 26, ఆ వార్తకు తగినంత ప్రాముఖ్యాన్ని ఇచ్చాయి. [20,21] ఇతర భాషా సాహిత్యాలకు సంబంధించిన రచయితలు మరణించినపుడు కూడా ఆ వార్తకు మొదటి పేజీలో ప్రముఖంగా ప్రచురించడం కనిపిస్తుంది. ఉదాహరణకు 1973 సెప్టెంబర్ 14న ప్రముఖ ఉర్దూ కవి సజ్జాద్ జహీర్ మృతి వార్తను ప్రముఖంగా ప్రచురించారు. [22]

పాదసూచికలు :

1. కొత్తపల్లి వీరభద్రరావు, 'స్నాతకోత్తర స్థాయిలో తెలుగు', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, జూలై, 1979.

2. డాక్టర్ ఎం. కులశేఖరరావు, 'పరిశోధనాంశంగా తెలుగు', విశాలాంధ్ర దినపత్రిక, జూలై 1, 1979.

3. శ్రీ గోవిందరాజు రామకృష్ణారావు, 'అనువాద భాషగా తెలుగు', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, జూన్ 10, 1979.

4. డాక్టర్ వడ్లమూడి గోపాలకృష్ణయ్య ''తెలుగులో గ్రాంథికం - వ్యవహారికం'', ఆంధ్రప్రభ దినపత్రిక, ఆదివారం, అక్టోబర్ 9, 1977.

5. 'శివశ్రీ', 'నూరేళ్ళ తెలుగు రంగస్థలం - ఒక పర్యావలోకనం', విశాలాంధ్ర ఆదివారం దినపత్రిక, మార్చి 30, 1980.

6. శ్రీ ఎ. బోధాయన, 'ప్రజాసాహితీ సేద్యంలో సుంకర', సెప్టెంబర్ 7వ తేదీ వర్ధంతి సందర్భంగా, విశాలాంధ్ర దినపత్రిక, సెప్టెంబర్ , 1980.

7. శ్రీమతి డాక్టర్ నాయని కృష్ణకుమారి, 'జానపద వాఙ్మయము', విశాలాంధ్ర దినపత్రిక, బుధవారం మార్చి 31, 1976.

8. శ్రీ సోమసుందర్, 'సామాజిక సృజనలుగా జానపద కళలు', విశాలాంధ్ర ఆదివారం దినపత్రిక, జూలై 22, 1979.

9. ఒక విమర్శకుడు, 'జానపద హృదయాలు చీల్చుకొని వచ్చిన తెలంగాణా పోరాటం నాటి సాహిత్యం - ప్రజల సాహిత్యం ' శీర్షిక, ఆంధ్రభూమి దినపత్రిక ఆదివారం, ఆగస్ట్ 20, 1978.

10. దేవరాజు మహారాజు, 'జానపద గేయాలు - పరిణామం', విశాలాంధ్ర దినపత్రిక, జనవరి 15, 1976.

11. '' ఏ దేశంలోనైనా, ఏ భాషలోనైనా చిరస్థాయిగా నిలిచి వెలిగేది జానపద సాహిత్యం మాత్రమే. అందునా గేయసాహిత్యం విశిష్టమైనది. నాగరికత పెరగని కాలంలో బాధ, ఆవేదన, ఆనందం, సంతోషాలను వ్యక్తం చేయడానికో, శ్రమ మరచిపోవడానికో, పిల్లలను ఊరడించడానికో ఏదో విధంగా మనోగత భావాలను కమ్మని పాటలుగా పాడుకుంటుండేవారు. ఆనాడు అసలు పాడుకోవటం కాదు అలా వారి నోటి నుంచి

మనోగత భావాలు గేయరూపంగానో, గీతల రూపంగానో, అసంకల్పితంగానో, గీతల రూపంగానో వెలువడేవి. అలాంటి పాటలకు రచన ఫలానా అని అందుకే ఎవరు నిర్ణయించలేదు. అలా వచ్చిన పాటలలో బాలసాహిత్యం చాలా ఎక్కువ. అందులో కూడా 'లాలిపాటలు - జోలపాటలు' ప్రత్యేకించి పేర్కొనదగినవి - 'శ్రీ ఆయపిళ్ల అనంతరామారావు, 'తెలుగు సాహిత్యపు తేనె సోనలు, జోలపాటలు', ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, ఏప్రిల్ 24, 1977.

12. బి.పురుషోత్తమరావు, 'జానపదాల సహజశృంగార జీవనప్రతీకలు' - ఆదిలాబాద్ జిల్లా జానపద శృంగారగేయాలు, ఆంధ్రభూమి దినపత్రిక, ఆదివారం, మే 14, 1978.

13. డాక్టర్ ముకురాల రామిరెడ్డి, 'బాలసాహిత్యంలో భావశైలి - భాషాశైలి', ఆంధ్రప్రభ దినపత్రిక, ఆదివారం, డిసెంబర్ 2, 1979.

14. ''సమాజం - నవల'': అందుకే నాటికీ, నేటికీ సమాజాన్ని క్షుణ్ణంగానూ, సంపూర్ణంగానూ పరిశీలించిన నవల 'మాలపిల్ల' మాత్రమేనని నా దృఢ విశ్వాసం'. 'అలా సామాన్యులు మాట్లాడే భాషలోని సొంపులను చూపారు'. 'మాలపిల్ల' మనకు జాతీయ నవల'. 'తెలంగాణ గురించి తొలి నవల రాసినవారు బొల్లిముంత శివరామకృష్ణ' - వారి రచన మృత్యుంజయులు - 'దాశరథి రంగాచార్య', విశాలాంధ్ర దినపత్రిక, మార్చి 3, 1976.

15.'పరీక్షలలో సమాధానాలు ఎలా వున్నా ప్రశ్నాపత్రాలు మాత్రం గ్రాంథికంలోనే వుండాలని తీర్మానం పెట్టారు. హాస్యాస్పదమైన ఈ తీర్మానం కొన్ని షరతులకు లోబడి నెగ్గించుకున్నారు. ఫలితంగా వాడుక భాష ప్రగతి కుంటుపడింది. వాడుక భాషలో పాఠ్య గ్రంథాల నిర్ణయం మందగించింది. నష్టపడుతున్నది విద్యార్థులు, కుంటుపడుతున్నది సాహిత్యం'. 'వాడుకభాషోద్యమం, డెబ్బై ఏళ్ల ఉత్సవం' (ఏప్రిల్ 26, 27 ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నంలో) - విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, ఏప్రిల్ 20, 1980.

16.''ప్రయోజనాత్మకమైన నవలలే ప్రయోగాత్మక నవలలకంటే ప్రజల దగ్గరకు పోగలుగుతాయి. జనం దగ్గరకు పోయి వాళ్లకు పనికి వచ్చేవీ, వాళ్లల్లో చైతన్యం కలిగించేవి అయిన విషయాలను నవల అనే శక్తివంతమైన వాహిక (Medium) ) ద్వారా చెప్పవచ్చు. సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యం తేవడానికి నవలే సరియైన పరికరం'' - డా॥ నాయని కృష్ణకుమారి, ' ఈ దశాబ్ది నవలా సదస్సు - ఒక పరిశీలన', ఆదివారం విశాలాంధ్ర, మార్చి 9, 1980.

17. 'సాహిత్య విమర్శలో భావ, పలాయనవాద, ఫ్రాయిడ్‌వాద వ్యక్తిధోరణులను నిరసిస్తున్నది' - 'సాహిత్య విమర్శలో శాస్త్రీయ దృక్పథం', అరసం ఆధ్వర్యాన కడపలో జరిగిన సదస్సు తీర్మానాలు, విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, ఆగస్ట్ 24, 1980.

18. ''ఒరిస్సాలో ఈ సాహిత్య సాంస్కృతిక సంస్థలలో ప్రముఖంగా యువతరం నేతృత్వం వహిస్తున్నారు. ప్రగతిశీల భావాలు వారి ప్రాతిపదిక. అభ్యుదయం వారి పంథా సాహిత్యం లలిత కళలయొక్క దగ్గరి సంబంధాన్ని వారు అర్థం చేసుకుని యువతరానికి మానసిక వికాసం కలిగిస్తూ నిర్మాణయుతమైన మేధాశక్తిని సాహిత్యంలో పెంపొందించడానికి పరిశ్రమ చేస్తున్న సంస్థలివి. ఈ సంస్థల సాహిత్య కృషి తెలుగుదేశం గర్వించదగినది - శ్రీమతి పి.చిరంజీవినీకుమారి, '' ఒరిస్సాలోని ప్రవాసాంధ్రుల తెలుగు సాహిత్య సమారాధన'', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం సాహితీలోకం శీర్షిక, జూన్ 6, 1979.

19. ''గుడిపాటి వెంకటాచలం చనిపోయినప్పుడు విశాలాంధ్ర దినపత్రిక 1979 మే 6వ తేదీన చలం ఫోటోతో సహా ప్రచురించాయి'' - 'గుడిపాటి వెంకటాచలం స్మృతి', విశాలాంధ్ర దినపత్రిక, మే 6, 19979.

20. 'కృష్ణశాస్త్రి అస్తమయం', విశాలాంధ్ర దినపత్రిక, ఫిబ్రవరి 26, మంగళవారం, 1980.

21. 'అనిసెట్టికి అభ్యుదయ రచయితల శ్రద్ధాంజలి', విశాలాంధ్ర ఆదివారం దినపత్రిక జనవరి 20, 1980, ఎనిమిదో పేజీలో.

22. 'ప్రముఖ ఉర్దూకవి సజ్జాద్ జహీర్ స్మృతి', 'విశాలాంధ్ర దినపత్రిక, శుక్రవారం, సెప్టెంబర్ 14, 1973.

★★★

# viii..సృజనాత్మక రచనలు

1970-80ల మధ్య దినపత్రికల్లో వెలువడిన సృజనాత్మక సాహిత్యాన్ని పరిశీలనలోకి తీసుకుంటే వివిధ ప్రక్రియలకు తెలుగు పత్రికలు అందించిన ప్రోత్సాహం ఎంత విలువైందో తెలుస్తుంది. దాదాపు ప్రతీ సాహిత్య ప్రక్రియకు దినపత్రికల ద్వారా ఎంతో మేలు జరిగింది. కవిత్వం మొదలుకొని లోతైన విమర్శా వ్యాసాల వరకు తెలుగు దినపత్రికల్లో విశేష ప్రాముఖ్యాన్ని దక్కించుకున్నాయి. సమకాలీన సాహిత్యరంగంలో సాగుతున్న కొత్త పరిణామాలకు ప్రతిబింబంగా దినపత్రికల సాహిత్య కృషి కనిపిస్తుంది. అభ్యుదయ, విప్లవసాహిత్య రంగాలతోపాటు ఇతరేతర ధోరణు లకు కూడా దినపత్రికలు సమానమైన ప్రోత్సాహాన్ని అందించడం ద్వారా ఆయా ప్రక్రియల పరిణామ వికాసాలకు బాగా దోహదపడ్డాయి.

## కవిత్వం:

1970ల తరువాత విస్తృత వ్యాప్తిలోకి వచ్చిన ప్రక్రియ వచన కవిత్వం. పత్రికలకు వుండే స్థలకాల పరిమితుల్లోనూ వచన కవిత్వానికి తగినంత స్థానం దక్కింది. అప్పుడప్పుడు పండుగల సందర్భాల్లోనూ, ఇతర సందర్భాల్లోనూ పద్య కవిత్వం కనిపించినప్పటికీ 70ల తరువాత విస్తృతంగా కనిపించే సాహిత్యరూపం కవిత్వమే. అయితే పండుగల సందర్భాల్లో కూడా వచన కవిత్వమే వెలువడటం ఒక సాహిత్య విశేషంగా చెప్పుకోవాలి. పండుగల్ని ఆనందకోలాహలంగా వర్ణించే స్థితి 1970ల తరువాత కనిపించదు. ఉదాహరణకు సంక్రాంతి పండుగ గురించి ఆర్.వి. ఎస్.సుందరం ఒక కవితలో ''పండుగ పేరెత్తితేనే / నవ్వులు విరబూస్తాయి భయపడుతున్నావా.... ఇక పండుగ పేరెత్తకు / నా నోరు నొక్కకు'' అని అంటారు. [1] అలాగే 'ఎదురు సన్నాహం' అనే కవితలో గొల్లపూడి మారుతీరావు ఉగాది పండుగపైన 'ఎంతయినా... మన ఇంటి ఆడపడుచు / ఏటేటా మన ఇంటికి రావడం రివాజు / పదండి వెళ్లి పలకరించి వద్దాం / ముఖం చిన్నబుచ్చుకోకముందే హృద్యంగా మనగృహానికి తరలించుకువద్దాం'' అని అంటారు. [2] ఈ కవితలు వచన కవిత్వ వ్యాప్తిని గురించి , వాటి ప్రచార బలాన్ని గురించి చెప్పడానికి పండుగ కవితలు ఉపయోగపడతాయి. ఇవికాకుండా వచన కవిత్వం

బహుముఖీన జీవన వాస్తవికతను ప్రతిబింబించే సాధనంగా ఈ దశకంలో కనిపిస్తుంది. 'నా దేశం - నా ప్రజలు' లాంటి ప్రసిద్ధ కావ్యాల్లోని కొన్ని భాగాలు మొదట దినపత్రికల్లో ప్రచురితమైనవే. కర్షకుడు జీవితంలో విభిన్న సందర్భాల్లో అతడి భావచ్ఛాయలు కవితగా మలిచే ప్రయత్నంలో శేషేంద్రశర్మ రాసిన ఈ ఆధునిక ఇతిహాసం 1975 లో విశాలాంధ్ర దినపత్రికలో వెలువడింది. [3] కుందుర్తి, సి.నారాయణరెడ్డి, బైరాగి, సోమసుందర్, నగ్నముని, ఇస్మాయిల్, వరవరరావు, కె. శివారెడ్డి, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, వేగుంట మోహన్‌ప్రసాద్, కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ, దేవీప్రియ, ఎన్.గోపి, అద్దేపల్లి రామమోహన్‌రావులాంటి ప్రసిద్ధ కవులు విస్తృతంగా రాసిన దశకం ఇది. దినపత్రికల్లో వీరు రాసిన కవితలే తరువాత కాలంలో ఆయా కవితా సంపుటాల్లో చేరాయి. వచన కవిత్వం ఒక బలమైన ప్రక్రియగా రూపుదిద్దుకోవడానికి ఈ కవితలు ప్రధాన సాధనాలుగా ఉపకరించాయి. కవిత, ఈ వారం కవితలాంటి శీర్షికలు దినపత్రికల ఆదివారం అనుబంధాల్లో వెలువడినవి. ఈ శీర్షికల ద్వారా అటు కొత్తతరం కవులకు మాత్రమే కాకుండా ఇటు యువతరం కవులకు కూడా విశేషమైన స్థానం దక్కింది. 75ల తరువాత అదృష్టదీపక్, జయధీర్ తిరుమలరావు, రామా చంద్రమౌళి, గుడిహాళం రఘునాథం, దస్తగిర్, నందిని సిధారెడ్డి, జూరాశర్మ, ఆసు రాజేంద్ర, జింబో, పెమ్మరాజు గోపాలకృష్ణ, అలిశెట్టి ప్రభాకర్, దేవరాజు మహరాజులాంటి కొత్తతరం కవుల వచన కవితలు దినపత్రికల్లోనే వెలువడ్డాయి. దినపత్రికల్లో వెలువడిన వచన కవిత్వానికి స్థల కాల నిబద్ధమైన కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ జీవన వాస్తవికతను వ్యక్తం చేయడంలో వాటిలో ప్రయోగ దృష్టి కూడా కనిపిస్తుంది. వేగుంట మోహన్‌ప్రసాద్‌లాంటి కవులు రాసిన కవితలు కూడా దినపత్రికల్లో విశేష ప్రాముఖ్యాన్ని పొందాయంటే వచన కవిత్వంలో ప్రయోగాత్మకతపట్ల దినపత్రికల విశాల దృష్టి ఎంతో కనిపిస్తుంది. 'ఈనాడు ' దినపత్రిక సైతం 1977లో ఏడాది పొడవునా 'కొత్తపాళి' శీర్షికన వచన కవిత్వాన్ని ప్రచురించింది. వై. యోగీశ్వర్‌గౌడ్, చక్రవర్తుల వేణునాగేందర్, సనారా, గింజల నరసింహారెడ్డి, మన్నెం శారద, యార్లగడ్డ రాఘవేంద్రరావు, ఎం. డి. నయీమ్, బోధనం నర్సిరెడ్డి వంటి కవుల కవిత్వం రోజూ ప్రచురించడం ఒక విశేషంగా చెప్పవచ్చు. [4]

## గేయాలు:

ఈ దశకంలో బాగా వ్యాప్తిలోకి వచ్చిన మరో సాహిత్య రూపం గేయం. దృక్పథం ప్రధాన బలంగా కనిపించే దినపత్రికల్లోగేయరచన విస్తృతంగా సాగింది. గజ్జెల మల్లారెడ్డి సమకాలీన సమస్యలపై రాసినగేయాలు వివిధ పత్రికల్లో కనిపిస్తున్నాయి. ఉదాహరణకు రాజకీయ అంశాలను కూడా ఇలాంటి గేయాల్లో ముక్కుసూటిగా వ్యక్తం చేయడం కనిపిస్తుంది. ఉదాహరణకు ''జై ఆంధ్ర ముసుగులో / జరిగిపోయిందంత / ప్రజల ఉద్యమమన్న / భక్షక భటాచోర్లు / అన్నమడిగినవాళ్ల / అంతు చూస్తారంట!'' అని అంటారు. [5] అంతర్జాతీయ స్థాయి రాజకీయాలను కూడా కవులు తీవ్రంగా ఈ దశకంలో పట్టించుకున్నట్లు కనిపిస్తుంది. ఉదాహరణకు తిరునగరి రామాంజనేయులు

'భయపడక ఎదిరించరా' అన్న గేయంలో ''డాలరూ సామ్రాజ్య ఏలికలు యీనాడు / పేట్రేగి స్వాతంత్ర ప్రభుతలను పడగొట్టి / సి ఐ ఎ హంతకుల జేర్చి ప్రతి దేశాన / చిచ్చుబెట్టగనెన్నో వుచ్చులను పన్నారు''.. అన్న గేయ రచనల పట్ల కొత్తతరం కవుల్లోనూ ఆసక్తి కనిపిస్తుంది. [6] మురారి [7] చందు సుబ్బారావు [8] కె. రాజేశ్వరరావు, ఎస్వీలాంటి[9] కవులు గేయాలు రాశారు. అలాగే దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన గేయాలు ఆంధ్రప్రభ దినపత్రికలో అచ్చయ్యాయి. ఉదాహరణకు ''ప్రతి కోవెలకూ పరుగెడకూ / ప్రతి బొమ్మకు కైమోడ్పుకు' అన్న గేయం ఆంధ్రప్రభలో 1977 లో ప్రచురించారు.[10] తిరుమల శ్రీనివాసాచార్యులువంటి వారుకూడా దినపత్రికల్లో గేయాలు రాశారు. [11]

## కథలు:

దినపత్రికలకు ఉన్న పరిమితుల్లోనే ఆదివారం అనుబంధాల్లో కథానికలు ప్రచురించే సాంప్రదాయం కూడా ప్రారంభమైంది. కొడవటిగంటి కుటుంబరావు, మధురాంతకం రాజారాం, కేతు విశ్వనాథరెడ్డి, ఇల్లిందల సరస్వతీదేవి, తాళ్ళూరు నాగేశ్వరరావువంటి ప్రసిద్ధ రచయితలు దినపత్రికలకు కథలు రాశారు. ఇవేకాకుండా ఇతర భాషల నుంచి అనువాదాలు కూడా ప్రచురితమయ్యాయి. ఉదాహరణకు శరత్ పూర్తిచేయని కథ 1977లో ఆంధ్రజ్యోతిలో వెలువడింది. [12] ఒరియా ప్రసిద్ధ కథ 'మృగయా' (రచయిత: భగవతీ చరణ్ పాణిగ్రాహి) విశాలాంధ్ర దినపత్రికలో వెలువడింది. [13] 1975ల తరువాత దినపత్రికల పాఠకుల సంఖ్య పెరుగుతుండటం, వారి అభిరుచికి తగినట్లుగా వివిధ రూపాల సృజనాత్మక రచనలు ప్రచురితం కాసాగాయి. కథలతోపాటు 1980కి అటూ, ఇటుగా దినపత్రికల్లో సీరియల్స్ ప్రచురణ కూడా మొదలైంది. 80ల తరువాత ఈ ధోరణి మరింత పెరిగింది.

పాదసూచికలు :

1. ఆర్. వి. ఎస్. సుందరం, 'సంక్రాంతి' కవిత, ఆంధ్రపత్రిక దినపత్రిక, జనవరి 14, 1973.
2. శ్రీ గొల్లపూడి మారుతీరావు, ''ఎదురు సన్నాహం'', ఉగాది కవిత, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఏప్రిల్ 8, 1978.
3. శ్రీ గుంటూరు శేషేంద్రశర్మ, 'నా దేశం, నా ప్రజలు' ఆధునిక ఇతిహాసం నుంచి కొన్ని భాగాలు, విశాలాంధ్ర దినపత్రిక, జూలై 6, 1975.
4. 'కొత్తపాళి' శీర్షిక - ఈనాడు దినపత్రిక, జనవరి 1977.
5. గజ్జెల మల్లారెడ్డి ' ఉక్కు పిడికిళ్లెత్తి', గేయం విశాలాంధ్ర ఆదివారం దినపత్రిక, ఆగస్ట్, 12, 1973.
6. తిరునగరి రామాంజనేయులు, 'భయపడక ఎదిరించరా', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, అక్టోబర్ 5, 1975.

7. మురారి, ' ఉక్కు పిడికెళ్లెత్తి,వొక్కటై లేవండి', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, సెప్టెంబర్ 30, 1973.

8. చందు సుబ్బారావు, 'మహాశయా', విశాలాంధ్ర, ఆదివారం, సెప్టెంబర్ 30, 1973.

9. ఎస్.వి.సత్యనారాయణ, 'పీడిత జనచైతన్య దీప్తి', విశాలాంధ్ర దినపత్ర సెప్టెంబర్ 2, 1973.

10. శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి, 'కవిత', ఆంధ్రప్రభ దినపత్రిక, డిసెంబరు 15,1977.

11. తిరుమల శ్రీనివాసాచార్యులు, 'హరివిల్లూ - తెలుగిల్లూ', ఆంధ్రభూమి దినపత్రిక, నవంబర్ 7, 1976.

12. శరత్ పూర్తిచేయని కథ, మూలం: శరత్‌బాబు, అనువాదం : నన్నపనేని సుబ్బారావు, విశాలాంధ్ర దినపత్రిక, సెప్టెంబర్ 18, 1977.

13. 'మృగయా' కథాస్రష్ట భాగవతీ చరణ్ పాణిగ్రాహి (1908-1943), తెలుగు కథనం: నిడవర్తి ఉమా రాజేశ్వరరావు, విశాలాంధ్ర ఆదివారం అనుబంధం, ఏప్రిల్ 10, 1977.

★★★

# కవితల సూచిక

1. గజ్జెల మల్లారెడ్డి, 'ప్రతీక్ష' కవిత, విశాలాంధ్ర దినపత్రిక, శనివారం, జనవరి 26, 1974.
2. మంజు, 'ఉపాధ్యాయుడు' కవిత, విశాలాంధ్ర, ఆదివారం ఫిబ్రవరి 17, 1974.
3. దేవరకొండ దుర్గాప్రసాద్, 'ఉగాదోన్మేషము' కవిత, విశాలాంధ్ర, శనివారం, ఏప్రిల్ 12, 1975.
4. శైలేంద్ర, 'ఉగాదివేళ' కవిత, విశాలాంధ్ర, శనివారం ఏప్రిల్ 12, 1975.
5. గంగాధర్‌రావు దేశ్‌పాండే, 'దీక్ష' కవిత, ఆంధ్రభూమి, నవంబరు 14, 1976.
6. నిమ్మల అర్జునగౌడు, 'నెహ్రూ పుట్టిన దినం' కవిత, ఆంధ్రభూమి, నవంబరు 14, 1976.
7. తిరుమల శ్రీనివాసాచార్యులు, 'విశ్వనాథ!' కవిత, ఆంధ్రభూమి, నవంబరు 14, 1976.
8. వెల్దుర్తి మాణిక్యరావు, 'పురుషార్థులు' కవిత, ఆంధ్రభూమి, నవంబరు 28, 1976.
9. చొప్పకట్ల చంద్రమౌళి, 'కల్తీవెలుగులు' కవిత, ఆంధ్రభూమి, డిసెంబర్ 5, 1976.
10. హరిశ్చంద్రప్రసాద్, 'విజేత' కవిత, ఆంధ్రభూమి, డిసెంబర్ 5, 1976.
11. మన్నెం శారద, 'కొత్తనీరు' కవిత ,ఈనాడు, జనవరి 6, 1977.
12. యార్లగడ్డ రాఘవేంద్రరావు, 'మాతృమూర్తి' కవిత, ఈనాడు, జనవరి 17, 1977.
13. సనారా, 'అనూహ్యం' కవిత, ఈనాడు ,జనవరి 4, 1977.
14. వై. యోగీశ్వరగౌడు, 'సామాన్యుడు' కవిత, ఈనాడు, జనవరి 1, శనివారం 1997.

15. చక్రవర్తుల వేణునాగేందర్, 'కవి-క్వాలిఫికేషన్' కవిత, ఈనాడు, సోమవారం జనవరి 3, 1977.

16. గింజల నరసింహారెడ్డి, ఎం.ఏ, 'ఇదేమిటి ఆనందరేఖలు' కవిత , ఈనాడు, జనవరి 5, 1977.

17. రెంటాల గోపాలకృష్ణ, 'సుభాషిత రత్నావళి' కవిత, ఆంధ్రప్రభ, జులై 10, 1977.

18. నగ్నముని, 'మానవుడా ఓ మానవుడా' కవిత, ఆంధ్రప్రభ, అక్టోబర్ 20, 1977.

19. శశికాంత్ శాతకర్ణి, 'వరండాలో కోయిల' కవిత, ఆంధ్రజ్యోతి, ఏప్రిల్, 2, ఆదివారం, 1978.

20. గుడిహాళం రఘునాథం, 'చెట్టు-గాలి' కవిత, ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 2, 1978.

21. చందు సుబ్బారావు, 'నేలపై నడక' కవిత, విశాలాంధ్ర, మార్చి 12, 1978.

22. దాట్ల నారాయణమూర్తి రాజు, 'కళ్ళుఖడ్గాలు' కవిత, విశాలాంధ్ర, ఆదివారం 1978.

23. దస్తగీర్, 'సూరీడు' కవిత, విశాలాంధ్ర, ఏప్రిల్ 2, 1978.

24. అద్దేపల్లి రామమోహనరావు, 'కన్నీరు లేని మబ్బుతునక' కవిత, మే 28,1978, ఆంధ్రజ్యోతి.

25. నందిని సిధారెడ్డి, 'క్రియాత్మ' కవిత, మే, 14, 1978, ఆంధ్రజ్యోతి.

26. రామా చంద్రమౌళి, 'ఎగిరేపక్షి' కవిత, మే 7, 1978, ఆంధ్రజ్యోతి.

27. 'దేవిప్రియ', 'వాన' కవిత, ఆంధ్రజ్యోతి, మే 7, 1978.

28. రామా చంద్రమౌళి, 'కళ్లలో మబ్బు ముక్కలు' కవిత, ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 30, 1978.

29. ముళ్ళపూడి శ్రీనివాసప్రసాద్, 'సంస్పందనమ్ కవిత, ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 8, 1978.

30. నందిని సిధారెడ్డి, 'కన్ను' కవిత, ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 30, 1978.

31. గుడిమెట్ల గోపాలకృష్ణ, 'మధ్యతరగతి మంటలు' కవిత, మే, 28, 1978. ఆంధ్రజ్యోతి.

32. కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ, 'జీవబీజం' కవిత, ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 22, 1979.

33. జింబో, 'జ్ఞాపకాల దొంతరలు' కవిత, ఆదివారం, ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 29, 1979.

34. ఇజ్జాడ వెంకట్రావు, 'మూలపదార్థం' కవిత, ఆదివారం, ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 29, 1979.

35. దేవరాజు మహారాజు, 'విలువలు' కవిత, ఆదివారం ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 29, 1979.

36. శశికాంత్ శాతకర్ణి, 'నవ్వుల్ని గాలిలో వదిలేసి...' కవిత, ఆదివారం ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 29, 1979.

37. ఆచంట సుదర్శనరావు, 'నైరాశ్యం' కవిత, ఆదివారం ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 29, 1979.

38. శ్రీభాష్యం రాంబాబు, 'అనుభూతి రాగం' కవిత, ఆదివారం ఆంధ్రజ్యోతి, మే 13, 1979.

39. ఎ. ఎల్.నారాయణ్, 'ఏకత్వంలో భిన్నత్వం' కవిత. ఆదివారం ఆంధ్రజ్యోతి, మే 13, 1979.

40. అలిశెట్టి ప్రభాకర్, 'రాజకీయం' కవిత. ఆదివారం ఆంధ్రజ్యోతి, మే 13, 1979.

41. మిరియాల రామకృష్ణ, 'బ్యాంకింగ్' కవిత. ఆదివారం ఆంధ్రజ్యోతి, మే 13, 1979.

42. మేకా సుధాకరరావు, 'పద్మవ్యూహం' కవిత. ఆదివారం ఆంధ్రజ్యోతి, మే 13, 1979.

43. ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, 'కల-వరం' కవిత. ఆదివారం ఆంధ్రజ్యోతి, మే 20, 1979.

44. కొమురవెల్లి అంజయ్య, 'సిద్ధాంతవాదులు' కవిత ఆదివారం ఆంధ్రజ్యోతి, మే 20, 1979.

45. ఆసు రాజేంద్ర, 'వసంతం నా ప్రియనేస్తం' కవిత. ఆదివారం ఆంధ్రజ్యోతి, మే 20, 1979.

46. తనికెళ్ళ భరణి, 'గుండుసూది' కవిత. ఆదివారం ఆంధ్రజ్యోతి, మే 27, 1979.

47. జింబో, 'కాలాన్ని హత్యచెయ్యడం' కవిత. ఆదివారం ఆంధ్రజ్యోతి, మే 27, 1979.

48. వారాల ఆనంద్, 'జాగ్రత్త?' కవిత. ఆదివారం ఆంధ్రజ్యోతి, మే 27, 1979.

49. పెమ్మరాజు గోపాలకృష్ణ, 'చీకటితో...' కవిత. ఆదివారం ఆంధ్రజ్యోతి, మే 27, 1979.

50. రామాచంద్రమౌళి, 'అగ్నిగోళం' కవిత. ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 1, 1979.

51. గుడిహాళం రఘునాథం, 'సంధ్యలు' కవిత. ఆంధ్రజ్యోతి, ఏప్రిల్, 1, ఆదివారం 1979.

52. గుడిహాళం రఘునాథం, 'కన్నీటి పంజాలు' కవిత. ఆంధ్రజ్యోతి, జూన్ 3, 1979.

53. అలిశెట్టి ప్రభాకర్, 'విద్యార్థులు' కవిత. ఆంధ్రజ్యోతి, జూన్ 3, 1979.

54. పసుపులేటి వెంకటరమణ, 'అసంపూర్ణ చిత్రం' కవిత. ఆంధ్రజ్యోతి, జూన్ 3, 1979.

55. నందిని సిధారెడ్డి, 'దృక్' కవిత. ఆంధ్రజ్యోతి జూన్ 3, 1979.

56. జొరాశర్మ, 'అలారమ్' కవిత. ఆంధ్రజ్యోతి, జూన్ 17, 1979.

57. శశికాంత్ శాతకర్ణి, 'గాలి తలపై మృత్యుధూళి' కవిత. ఆంధ్రజ్యోతి, జూన్ 17, 1979.

58. శ్రీభాష్యం రాంబాబు, 'ముసాఫిర్' కవిత. ఆంధ్రజ్యోతి, జూన్ 17, 1979.

59. కె. రాజేశ్వరావు, 'రణభేరి' కవిత. ఆంధ్రజ్యోతి, ఆదివారం, జూన్ 10, 1979.

60. మైత్రేయ, 'అరుణతార పిలిచింది' కవిత. విశాలాంధ్ర, ఆదివారం, జూన్ 10, 1979.

61. రామాచంద్రమౌళి, 'పలికే అలలు' కవిత. ఆదివారం, ఆంధ్రజ్యోతి, జూన్ 10, 1979.

62. రామసూరి, 'లైఫ్' కవిత. ఆదివారం, ఆంధ్రజ్యోతి జూన్ 10, 1979.

63. ''కందిపాటి'' 'ని(రా)శ' కవిత. ఆదివారం, ఆంధ్రజ్యోతి, జూన్ 10, 1979.

64. వేగుంట మోహనప్రసాద్, 'దిగాలుబడి...' కవిత. ఆంధ్రజ్యోతి, జూన్ 10, 1979.

65. జి. జగన్, 'జ్యోత్స్న' కవిత. ఆంధ్రపత్రిక, జులై 6, 1980.

66. తుంగతుర్తి విశ్వనాథశాస్త్రి, 'భయం' కవిత, ఆంధ్రపత్రిక, జులై 13, 1980.

67. డా॥ సి.నారాయణరెడ్డి, 'సూక్తులు' కవిత, ఆంధ్రపత్రిక, జులై 20, 1980.

68. శ్రీదేవి, 'కవీ! కవిత' ఆంధ్రపత్రిక, సెప్టెంబర్ 13, 1980.

69. జి.చంద్రశేఖరరెడ్డి, 'నీకూ నాకూ బేధము' కవిత.

70. మంజుల, 'శూన్యం' కవిత. ఆంధ్రపత్రిక సెప్టెంబర్ 21, 1980.

71. ఎస్వీ లక్ష్మీనారాయణ, 'లచ్చిపాట' కవిత, ఆంధ్రపత్రిక, సెప్టెంబర్ 21, 1980.

72. ''కల్యాణశ్రీ'' 'కళ్యాణ గణపతి' కవిత.

73. శనగన నరసింహస్వామి, 'నమస్తే!' కవిత. ఆంధ్రపత్రిక, సెప్టెంబర్13, 1980.

74. గొట్టిముక్కల కృష్ణమూర్తి, 'వినాయకా!' కవిత. ఆంధ్రపత్రిక, సెప్టెంబర్ 13, 1980.

75. ఎ.రజాహుస్సేన్, 'రంజాన్' కవిత. ఆంధ్ర పత్రిక, జూలై 27, 1980.

76. రాధశ్రీ, 'సాంప్రదాయం, అభ్యుదయం' కవిత. ఆంధ్రపత్రిక, జులై 27, 1980.

77. శ్రీమతి సులోచన సింహాద్రి, 'జీవితం కొందరికి' కవిత, ఆంధ్రపత్రిక, సెప్టెంబర్ 28, 1980.

78. నేతి సత్యశేఖర్, 'బాపనోళ్ళం' కవిత.

79. దేవరకొండ మల్లిఖార్జునశర్మ, 'చరిత్రపుటలు' కవిత. ఆంధ్రపత్రిక, ఆగస్టు 31, 1980.

★★★

# 1970-80ల మధ్య వివిధ దినపత్రికల్లో వచ్చిన సమీక్షలు

1970-80ల మధ్య వివిధ దినపత్రికల్లో ఎక్కువ భాగం సమీక్షలే వచ్చాయి. దినపత్రికల ఆదివారం అనుబంధాల్లో సైతం క్రమం తప్పకుండా గ్రంథ సమీక్షల శీర్షికల నిర్వహణ సాగింది. అప్పట్లో వెలువడిన అన్ని పుస్తకాలపైన వివరమైన సమీక్షలు వుండేవి. సమీక్షలంటే కేవలం కథా వివరాలు మాత్రమే కాకుండా విషయ, విశ్లేషణలు కూడా బాగా వుండేవి. 1970ల ప్రారంభంలో దినపత్రికల్లో అడపాదడపగా ప్రారంభమైన శీర్షికలు 1975ల నాటికి స్పష్టమైన రూపంతో శీర్షికలుగా కొనసాగుతూ వచ్చాయి. గ్రంథ సమీక్ష, గ్రంథావని, గ్రంథ స్వీకారం, పుస్తకాలు వంటి పలు పేర్లతో 1980ల వరకు శీర్షికలన్నీ ఆయా దినపత్రికల్లో వెలువడ్డాయి. ఈ సమీక్షలు ప్రధానంగా ఆయా రచయితల కవితాసంపుటాలపై, నవలలపైన, కథాసంకలనాలపైననే గాకుండా ప్రసిద్ధమైన వ్యక్తుల జీవిత చరిత్రల గ్రంథాలపైనా, భాషా వ్యాసావళులపైన, అనువాద రచనా సంపుటాలపైన వచ్చాయి.

*కవిత్వం:* 1970-80ల మధ్య వెలువడిన ఆయా కవుల కవితా సంకలనాలపైన మంచి సమీక్షలే వెలువడ్డాయి. సి.నారాయణరెడ్డి రచించిన వివిధ కవితా సంపుటాలపై ఆచార్య కొలకలూరి ఇనాక్, డాక్టర్ ఎస్.వి.రామారావు, కె.రామమోహనరాయ్, మధూకర్‌రెడ్డి తదితరులు చేసిన సమీక్షలు ఇక్కడ పేర్కొనదగినవి. సినారె రాసిన 'మధ్యతరగతి మందహాసం' కవితా సంపుటిని కొలకలూరి ఇనాక్ సమీక్షిస్తూ, '' ఈ పదేళ్లలో సాంప్రదాయకత నుంచి నూతన ప్రయోగాలు చేస్తున్న సాహితీ లోకంతోపాటు డా॥ సి.నారాయణరెడ్డి పయనించిపోవటం, క్రొత్త దృక్పథం ఏర్పరచుకొని తదనుగుణంగా కవితా సృజనం ప్రారంభించటం గమనించవచ్చు'' అంటూ కవి వికాస క్రమాన్ని విశ్లేషిస్తారు. అలాగే, కవిత్వంలోని గుణదోషాలను చర్చిస్తూ ''వర్తమాన కవితాధోరణిలో రాస్తున్న డా. సి.నారాయణరెడ్డి కవిత మునుపు ఉన్నంత గుండె దగ్గరగా ఇవాళ ఉండటం లేదేమోనని అనిపిస్తుందని'' వ్యాఖ్యానించారు.[1] సినారె రాసిన 'మంటలూ - మానవుడూ' కవితా సంకలనాన్ని 1973లో సమీక్షించిన మధూకర్‌రెడ్డి

'సరికొత్త సత్యం' అన్న కవిత గురించి చెప్తూ, ''శ్రమజీవి చెమటబిందువులో ఆణిముత్యమూ ఉంది, అగ్నిగోళమూ ఉంది'' అన్న సూక్తులను ఉదహరిస్తూ, శ్రమజీవుల్లోని సహనాన్ని, పీడితుల్లోని శౌర్యాన్ని కవి సమన్వయించారని వ్యాఖ్యానిస్తారు.[2] 1953లో ప్రకటితమైన 'నవ్వని పువ్వు' నుంచి 1973లో యువభారతి ప్రచురించిన 'మందార మకరందాలు' కవితా సంకలనం వరకు అంటే ఇరవై ఏళ్లలో 24 సంకలనాలను సినారె వెలువరించారని ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్శిటీ తెలుగు శాఖ అధ్యాపకులు డ్యాక్టర్ ఎస్.వి.రామారావు ఒక సమీక్షలో ఉదాహరిస్తారు. 1974లో ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం అనుబంధంలో 'అకాడమీల బహూకృతులు అందుకున్న నారాయణరెడ్డి కవితా ఖండాలు' అన్న సుదీర్ఘమైన సమీక్షా వ్యాసాన్ని డా. ఎస్.వి.రామారావు రాశారు. ''భాష - భావం ఒకదానితో ఒకటి పెనవేసుకొని సమన్వయంగా కొనసాగడం అందరు కవులలో అరుదుగా కనిపించే గుణం. కాని, నారాయణరెడ్డి కావ్యాలలో మాత్రం ఈ రచనా కళ సంపూర్ణంగా సిద్ధించింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన కవిత అందమైన పదాల మధురమైన పొందిక. ఈ పొందులో రమణీయ భావాలు అడుగడుగునా చిందులేస్తూ వుంటాయి. అలంకారాలు కూడా ఆయన కవితకు సహజాభరణాలై పిలవకముందే వలచి వచ్చినట్లుగా, ధ్వనిగర్భితంగా గోచరిస్తాయి'' అంటూ తమ అభిప్రాయాల్ని స్పష్టంగా చెప్పారు.[3] సినారె రాసిన 'ఇంటిపేరు చైతన్యం' కవితా సంపుటిని ఆంధ్రజ్యోతి దినపత్రికలో 1978లో కె.రామమోహన్‌రాయ్ సమీక్షిస్తూ ''వారి కావ్యసంపుటాలు చదువరులకు పూర్తి నిరాశ కలిగించవు. రసాత్మకమైన వాక్యాలతో మరుపుగొలిపే చిన్న చిన్న కావ్యఖండికలతో తటిల్లతలవలె పాఠక హృదయాలలో మెరుస్తాయి. ఆ వెలుగే చాలుననుకునేవారు నారాయణరెడ్డి కవితలనాస్వాదిస్తూనే వున్నారు. నిరంతరమైన వారి కవితాచైతన్యానికి చిహ్నంగా వెలువడిన సరికొత్త రచన 'ఇంటిపేరు చైతన్యం' అని అన్నారు.[4] అదేవిధంగా విప్లవ చైతన్యంతో కవిత్వాన్ని రాసిన కవుల సంకలనాల గురించి కూడా ఈ దశకంలో అనేక సమీక్షలు వచ్చాయి. నిఖిలేశ్వర్, కె.శివారెడ్డి, సలంద్ర వంటి ప్రసిద్ధ విప్లవ కవులు రాసిన సమీక్షలను ఈ సందర్భంగా ఉదహరించవచ్చు. 1974లోనే విశాలాంధ్ర దినపత్రికలో అంపశయ్య నవలాకర్త 'నవీన్', 'కె.శివారెడ్డి రచించిన 'రక్తం-సూర్యుడు' కవితా సంకలనాన్ని సమీక్షిస్తూ, ''సాహిత్యంతో సమాజంలో చైతన్యాన్ని సృష్టించవచ్చునంటూ స్తబ్ధ ప్రపంచం బద్దలయ్యేందుకు శబ్దప్రపంచ సృష్టి అంటాడని'' పేర్కొన్నారు. ఇదే భావాన్ని మరోచోట శివారెడ్డి పేర్కొన్న విషయం గురించి నవీన్ రాస్తూ 'సిరాచుక్క వుంది చూశావ్, విద్యుదాగారం విప్లవాకాశం సిరాచుక్క స్పర్శ చెమట చుక్కని రక్తం చేస్తుంది.. కళ్లల్లో కోటానుకోట్ల సూర్యుళ్లు నిద్రలేచారు. రక్తం సూర్యుడు రక్తం ప్రతిచర్య'' అంటాడని చెప్తూ ఆవేశానికి సరిపోయిన అభివ్యక్తి గొప్ప కవితాత్మ కలిగిన పాదాలను రాశాడని నవీన్ పేర్కొన్నాడు.[5] ఈ వ్యవస్థలో ముళ్లు తప్ప మరేమీ మొలవని, ఈ వ్యవస్థ విధ్వంసం కావాలని, దానిస్థానే మరో మహత్తర వ్యవస్థ ఉద్భవించాలనేది కె.శివారెడ్డి ఆశయమంటూ 'నేత్రధనస్సు'

కవితా సంకలనాన్ని సమీక్షించిన టి. ఎల్.కాంతారావుగారు అంటారు.[6] 1970 దశకంలో విప్లవ కవిత్వాన్ని ఘంటాపథంగా చెప్పిన దిగంబరకవి నిఖిలేశ్వర్ తమ జైలు జ్ఞాపకాలను ''గోడల వెనక'' అన్న కవితా సంకలనంగా వెలువరించారు. దీనితోపాటు ఆయనే రచించిన 'మండుతున్న తరం' అన్న సంకలనాన్ని కూడా ఆర్వీయార్ విశాలాంధ్ర దినపత్రికలో 1973లో సమీక్షిస్తూ ఇలా విమర్శించారు. ''పదజాలం నేర్చుకున్నంతగా తత్త్వాన్ని జీర్ణించుకోలేదని'', హృదయాన్ని కదిలించే కవితలు లేకపోవడానికి కారణం అదే అయివుండవచ్చునని ఆయన అభిప్రాయపడతారు.[7] అదే దినపత్రికలో అభ్యుదయ కవి ఏటుకూరి ప్రసాద్ కవితా సంకలనం 'ఎర్రజెండా'ను సమీక్షించిన డాక్టర్ ముకురాల రామారెడ్డి ఈ సమీక్షలో 'ఎర్రజెండా హసాద్ - ఏటుకూరి ప్రసాద్' అన్న చమత్కార బాణీని వదిలారు. ''పునరుక్తిని తగ్గించుకుంటే, జానపద దరువులలోకి ఇంకా బాగా వెళ్లగలిగితే భాషతో ఇంకా ప్రజల దగ్గరకు రాగలిగితే, రచనలో గుణం ఇంకా పెంచుకోగలిగితే, పెత్తందార్లు వేసే బహురూపుల వేషాలు ఇంకా ఓపికగా పరిశీలించి చెప్పగలిగితే ప్రజల హృదయాలలో ప్రసాద్ తొందరగానే ఎదుగుతాడు'' అని ముకురాల రామిరెడ్డి తమ సుదీర్ఘ సమీక్షలో అభిప్రాయాన్ని బలంగా చెప్పగలిగారు.[8] కాగా పత్రికా రచయిత, కవి 'సలంద్ర' రాసిన వేడిగాలి కవితా సంకలనంపైన సుధామ విశాలాంధ్ర దినపత్రికలో సమీక్ష చేస్తూ, ''సలంద్ర తన చుట్టూ సంఘంలో చూస్తున్న అనేక అంశాలతో చేసిన సంఘర్షణ. అతని భావాల వేడిగాలి పేరిట ఈ కవితగా రూపొందింది'' అంటారు. ''వేడిగాలి కవిత రాసిన యువకవి సలంద్ర తనను తాను పరిచయం చేసుకుంటూ '' ఆశా నిరాశలేం లేవు. కల్పిత కష్టాల ఊబిలో చిక్కుకున్న జనం నాకవితకు ఊపిరి'' అంటున్నాడని సుధామ ఈ సందర్భంగా కవి దృక్పథాన్ని విశ్లేషిస్తారు.[9]

అభ్యుదయ కవిత్వోద్యమ తొలి దశలో మంచి కవిగా, ఉద్యమ నిర్మాతగా యువకవులకు తోడునీడగా నిలిచిన కవి శ్రీపురిపండా అప్పలస్వామి. గిడుగు రామమూర్తికి శిష్యులుగా ఆంధ్రదేశంలో వాడుక భాషా ఉద్యమానికి నడుంగట్టిన పురిపండా కవితా సంకలనం పేరు 'పులిపంజా'. ఈ సంకలనాన్ని శ్రీనాథబారవి ఆంధ్రజ్యోతిలో సమీక్షిస్తూ ''సంప్రదాయాన్ని ఛేదిస్తూ, భావకవిత్వపు ఆవరణ దాటివస్తూ పాతకు భరతవాక్యం పలుకుతూ రాసిన గీతం 'సుడిగాలి' అని అందులోని ఒక కవితను విశ్లేషిస్తారు.[10] ముద్దుకృష్ణ 'వైతాళికులు' తరహాలో వెలువడిన వివిధ కవితా సంకలనాలతో 'మహాసంకల్పం' ఒకటి. పత్రికా సంపాదకులు నండూరి రామమోహనరావు, ఇంద్రగంటి శ్రీకాంతశర్మల సంపాదకత్వంలో వెలువడిన మహాసంకల్పాన్ని విశాలాంధ్రలో బు 'ఒక పాఠకుడు' పేరుతో చేసిన సమీక్ష అప్పట్లో వివాదాస్పదమైంది. ''కాగా మహోద్యమంగా వ్యాపిస్తున్న ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం కవుల్ని (గంగినేనిని క్షమించినా) పూర్తిగా నిషేధించారు. సంపాదకులలో ఒకరు తన ఉపోద్ఘాతంలో ఉద్ఘోషించినట్లుగా ''ఏ వ్యక్తిగత రాజకీయ,

రాగద్వేషాలకూ లోనుకాకపోవడమంటే ఇదేనా?'' అని ' ఒక పాఠకుడు' ప్రశ్నిస్తారు. ''నారాయణబాబు'' గీతాలకు చోటిచ్చి 'శిష్ట్లా'ను మరిచిపోవడం ఎందుకోసం జరిగిందో తెలియదు. ''మంచి కవితగుణం వున్న వాటితో బాటుగా పేలవంగా, గాలిలో పేలపిండిలాగా తేలిపోయేవీ, అయోమయంగా వుండేవీ, ఉత్తరకుమార ప్రజ్ఞతో పలికే విరసంవారి కవితలనబడేవీ, పాఠకుణ్ణి 'దీని భావమేమి తిరుమలేశా' అన్న సందేహంలో పడవేసేవీ, దిగులు పుట్టించి ఏవిటీ పాడు బ్రతుకనిపించేవీ ( చూ॥ అజంతా గీతాలు) ఒంటిమీద జెర్రులు పాకించేవి దీనిలో దండిగానే ఉన్నాయి'' అని బాహాటంగా విమర్శిస్తారు.[11] 1973 లో అభ్యుదయ ఝ్యుమట్టి' నాటకం. వీటిలోని గుణదోషాలను చర్చిస్తూ '' సంపుటాలలో కొన్నిచోట్ల కవితా పాఠం కొరతగా కనిపిస్తుంది. కాని పాకం కమ్మగా వుండి ఆరోగ్యానికే కీడుచేసే పదార్థమైతే ఏవిటి లాభం? వేమన చెప్పినట్టు 'భాండశుద్ధి లేని పాఠమేల'? అని అన్నారు.[12]

ఆ రోజుల్లో వచ్చిన ప్రతీ రచనపైనా ప్రత్యక్షంగా, పరోక్షంగానో అభ్యుదయ ఉద్యమ ప్రభావం వుండేదనడానికి ఈ మూడు సంకలనాలను పేర్కొనవచ్చని సమీక్షకుడు అభిప్రాయం.

## *కథలు:*

1970 దశకంలో కవిత్వంపైనా, కవితా సంకలనాలపైనా వచ్చిన విధంగా కవులపై, కథానికలపై దినపత్రికల్లో ఎక్కువగా సమీక్షలు రాలేదని చెప్పవచ్చు. 1977-80ల మధ్యలో విశాలాంధ్ర, ఆంధ్రజ్యోతివంటి కొన్ని దినపత్రికలలో కథలపైన వచ్చిన సమీక్షలు కనిపిస్తాయి. ''ఇతివృత్తాన్నెంచుకోవడంలో ప్రస్తుత రచయిత్రులందర్లోనూ విలక్షణంగా కనిపిస్తూ ప్రత్యేకత నిలుపుకునే వారిలో డి.కామేశ్వరిగారు ఒకరు'' అంటూ ఆమె రాసిన ' ఇదీ జీవితం' కథల సంపుటిని విశాలాంధ్ర దినపత్రికలో డ్యాక్టర్ పరుచూరి రాజారామ్ సమీక్షించారు.[13] అదేవిధంగా తెలుగుదనానికి అద్దంపట్టిన అమరావతి కథలపైన ఆర్. ఎస్.సుదర్శనం ఆంధ్రజ్యోతి దినపత్రికలో సమీక్షిస్తూ ''శంకరమంచి కథల్లోని 'మంచి' ఆయన సహృదయానుభవ్యక్తి విశేషమే తప్ప మరొకటి కాదు. ఈ సహృదయానుభూతి సాహిత్య సృజనగా ఒక్కొక్కసారి మనల్ని ఆశ్చర్యంలో ముంచెత్తివేస్తుంది. '' ఎంతో స్నిగ్ధ మనస్కులు, గుమ్మపాలవంటి మనస్సూ ఆనందంతో గంతులు వేసే లేగదూడ వెర్రి సాహసమూ - ఉంటే తప్ప 'లేగదూడ చదువు' అనే కథ ఒక రచయిత రాయలేడు'' ''శంకరమంచి సంప్రదాయంలోని మంచినీ, అందాన్నీ ప్రేమిస్తాడు. ఛాందసత్వాన్ని కాదు, సంప్రదాయం అంటే ఒక ఆచారంలోని మంచిని అందాన్ని కొనసాగించడం, మార్పుని నిరోధించడం కాదు'' అని చెపుతూ సంస్కారానికి అతీతమైన స్థాయిలో జీవన ముగ్ధత్వాన్ని ( Innocent life) విలువగా గుర్తించగల సాహసం రచయిత శంకరమంచి సత్యానికే వుందని చెపుతారు.[14] అదేవిధంగా అచంట జానకీరామ్ ఆంధ్రజ్యోతి దినపత్రికలో శ్రీమతి ఉప్పల రాజామణి రాసిన

''మాతృమూర్తి'' కథాసంపుటిని సమీక్షిస్తూ ''నిత్య జీవితంలో జరిగే సంఘటనలనే కొత్తగా రూపకల్పన చేసి జీవితమనే మహా గ్రంథంలో నుంచి కొన్ని పుటలను మనకు వ్యాఖ్యానిస్తూ చెప్పినట్లు వుంటాయి ఆ కథలు''. ''కథానికల దొంతిలో నుంచి ఒక మంచి రచనను తీయగలిగిన అదృష్టం సామాన్యమైనది కాదు'' అంటూ కథాసారాన్ని వివరిస్తారు. [15]

నవల:

ప్రసిద్ధ రచయితలు రాసిన నవలలపైన 1970 దశకంలో మంచి సమీక్షలే వెలువడ్డాయి. ఈ దశాబ్దంలో కథలకన్నా నవలలే విరివిగా రావటం ఒక ప్రత్యేకతగా చెప్పవచ్చు. చిల్లర దేవుళ్లు, మోదుగుపూలు మొదలైన నవలలతో తెలుగు నవలా సాహిత్యంలో ఒక స్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్న శ్రీ దాశరథిరంగాచార్య 1973లో రాసిన 'రానున్నది ఏది నిజం' అన్న నవలపై నవీన్ సమీక్ష చేస్తూ సూటిగా తమ అభిప్రాయాలను వ్యక్తీకరిస్తారు. '' ఒక్క మాటలో చెప్పాలంటే ''రానున్నది ఏది నిజం''ను నవల అనటం కంటే నవల రూపంలో వున్న మన దేశంలో రావలసిన సోషలిస్టు సమాజానికి రూపకల్పన అంటే బాగుంటుంది. షా రాసిన ''గైడ్ టు సోషలిజం''లాంటిదిది. ''వ్యక్తుల్ని కాకుండా వ్యవస్థల్ని మారిస్తే వ్యక్తులు తప్పనిసరిగామారతారన్న సోషలిస్టు సూత్రాన్ని ఈ నవలలో రచయిత పదే పదే నిరూపిస్తాడు'' అంటూ నవీన్ తమ అభిప్రాయాలను చెప్తారు. [16] భారతీయ మత గ్రంథాలపై విమర్శనాత్మక రచనలు ఎన్ని వచ్చినా తెలుగులో ఈ రకమైన ప్రయత్నం చేసిన ప్రసిద్ధ రచయిత్రులలో రంగనాయకమ్మ మొదటి వరుసలో ఉన్నవారని చెప్పవచ్చు. రామాయణగాథ క్రీ.పూ. 1000 నాటికే అనగా మహాభారత గాథకు పూర్వమే ప్రజలలో ప్రచారంలో వున్న కథ. ఈ గాథను గురించిన ప్రస్తావన భారతంలో ఉంది. రామాయణానికి అందులోని మానవత్వ లక్షణాల వల్ల, పాత్ర చిత్రణా చాతుర్యంవల్ల ఆకర్షణ ఏర్పడింది. మహాకావ్య లక్షణాలన్నీ కలిగి వున్న రామాయణంపైన రంగనాయకమ్మగారు 'రామాయణ విషవృక్షం' అన్న నవల రాశారు. దీనిని విశాలాంధ్ర దినపత్రికలో ఏటుకూరి బలరామమూర్తి సమీక్షిస్తూ ''రంగనాయకమ్మగారి రచన కూడా అదే కోవలో ఉంది. తాను మార్క్సిస్టు పరిశీలనాదృష్టితో ఈ గ్రంథం రచించానని ఆమె ప్రకటించుకున్నంత మాత్రాన పుస్తక స్థాయిలో ఏమీ తేడాలేదు..'' అని వ్యాఖ్యానిస్తారు. [17] దక్షిణాదికి చెందిన ద్రవిడ ప్రజలందరూ ఆర్యుల విజయానికి చిహ్నమైన రామాయణాన్ని బహిష్కరించాలని రచయిత్రి కోరడంపైన బలరామమూర్తి ఆక్షేపణ వ్యక్తం చేయడం ఆయన విమర్శనారీతిని తెలియజేస్తుంది. పల్లె ప్రాంతాల్లో ప్రజా సేవ పేరుతో ప్రజానాయకమ్మన్యులు చేసే దోపిడీలను పదవుల కోసం వాళ్లు చేసే రాజకీయ గారడీలను సజీవంగా చిత్రించిన నవల 'రాబందులూ - రామచిలుకలూ' సుప్రసిద్ధ రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి రచించిన 'రాబందులూ - రామచిలుకలూ' అన్న ఈ నవల విశాలాంధ్రలో ఉమారాజ్ సమీక్ష చేస్తూ, ''పలువురు రచయిత్రుల్లో

పూజ్యంగా వుండే సునిశిత సాంఘిక దృష్టి, ప్రగతిశీలతా, సీతాదేవిగారి రచనల్లో కనిపిస్తాయి'' అని ఆయన వివరిస్తారు.[18] రాచకొండ విశ్వనాధశాస్త్రి (రావిశాస్త్రి)గారి రచనల గురించి తెలుగువారికి కొత్తగా చెప్పక్కర్లేదు. ఆయన రాసిన రత్తాలు రాంబాబు నాలుగు భాగాల నవల ఆ రోజుల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. రత్తాలు రాంబాబు మొదటి భాగంపైన విశాలాంధ్ర దినపత్రికలో డాక్టర్ పరుచూరి రాజారామ్ సమీక్షచేశారు. ''రావిశాస్త్రి రచనల్లో ఏ సమకాలీన రచయితలోనూ కనిపించనంతటి నిశిత పరిశీలన వుండి రచనా శిల్పమూ - శైలీ మాండలికాన్ని వాడుకోవటమూ అత్యున్నత స్థాయిలో ఉన్నాయి'' ''నవల చదువుతుంటే కుప్రిన్ నవల యమా ది పిట్ (యమకూపం - రెంటాల గోపాలకృష్ణ అనువదించారు) జ్ఞాపకం వస్తుంది'' అని పోల్చి చూపిస్తారు.[19]

పాదసూచికలు :

1. కొలకలూరి ఇనాక్, 'మధ్యతరగతి మందహాసం' గ్రంథ సమీక్ష శీర్షిక, ఆంధ్రపత్రిక దినపత్రిక, ఆదివారం, డిసెంబర్ 7, 1969.

2. మధూకర్‌రెడ్డి, 'మంటలూ - మానవుడూ', కార్యపరిశీలన శీర్షిక, విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, ఆగస్టు 19, 1973

3. డాక్టర్ ఎస్. వి. రామారావు, 'నారాయణరెడ్డి కవితా ఖండాలు', సమీక్షా వ్యాసం, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం అనుబంధం..

4. కె. రామమోహన్‌రాయ్, 'డాక్టర్ నారాయణరెడ్డి ఇంటిపేరు చైతన్యం', పుస్తకాల శీర్షిక, ఆంధ్రజ్యోతి దినపత్రిక, సెప్టెంబర్ 4, 1978.

5. నవీన్, 'రక్తం - సూర్యుడు' కె. శివారెడ్డి వచన కవితా సంకలనం, విశాలాంధ్ర ఆదివారం దినపత్రిక, మార్చి 17, 1974.

6. టి. ఎల్.కాంతారావు, 'నేత్రధనస్సు' కె. శివారెడ్డి, ఆంధ్రపత్రిక దినపత్రిక, ఆది, నవంబర్ 23, 1980.

7. ఆర్వీయార్, 'మండుతున్నతరం, గోడల వెనుక', నిఖిలేశ్వర్ కవితా సంపుటాలు, విశాలాంధ్ర దినపత్రిక, ఆగస్టు, 12, 1973.

8. డాక్టర్ ముకురాల రామారెడ్డి, ' ఎర్రజెండా హసాద్, ఏటుకూరి ప్రసాద్' విశాలాంధ్ర సాహితీ స్రవంతి, ఆగస్టు 12,1973.

9. సుధామ, సలంద్ర కవిత 'వేడిగాలి', గ్రంథ సమీక్ష శీర్షిక, విశాలాంధ్ర దినపత్రిక,

ఫిబ్రవరి 21, 1977.

10. శ్రీనాథ భారవి, పురిపండా విప్పిన 'పులిపంజా' పుస్తకాలు శీర్షిక, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఏప్రిల్ 3, 1977.

11. ఒక పాఠకుడు, 'మహాసంకల్పం', గ్రంథ సమీక్ష, విశాలాంధ్ర, ఆదివారం, 1976, జనవరి 14.

12. సాధక్, ఎర్రపూలు, విప్లవాన్ని ఆహ్వానించు, ఎర్రమట్టి, (కవితా సంకలనాలు, నాటకం), విశాలాంధ్ర దినపత్రిక, సెప్టెంబర్ 16, 1973.

13. డా. పరుచూరి రాజారామ్ 'ఇదీ జీవితం' (డా. కామేశ్వరి కథల సంపుటి), విశాలాంధ్ర దినపత్రిక, జనవరి 31, 1977. రెండవ పేజీ.

14. శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం, 'తెలుగుదనానికి అద్దంపట్టిన అమరావతి కథలు', రచయిత: సత్యం శంకరమంచి '' ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం, మే 20, 1979.

15. ఆచంట జానకీరామ్, మాతృమూర్తి, కథల సంపుటం, రచన: శ్రీమతి ఉప్పల రాజామణి, ఆంధ్రజ్యోతి దినపత్రిక, మూడవ పేజీ, ఏప్రిల్ 3, ఆదివారం.

16. నవీన్, 'రానున్నది ఏది నిజం' రచయిత శ్రీ దాశరథి రంగాచార్య, విశాలాంధ్ర దినపత్రిక, సెప్టెంబర్ 23, 1973.

17. ఏటుకూరి బలరామమూర్తి, 'రామాయణ విషవృక్షం' రచన: రంగనాయకమ్మ, విశాలాంధ్ర దినపత్రిక, జనవరి 14, 1975.

18. ఉమారాజ్, రాబందులూ - రామచిలుకలూ - వాసిరెడ్డి సీతాదేవి నవల, విశాలాంధ్ర దినపత్రిక ఆదివారం, ఆగస్టు 3, 1975.

19. డాక్టర్ పరుచూరి రాజారామ్, 'రత్తాలు - రాంబాబు', నవల మొదటి భాగం, రాచకొండ విశ్వనాధశాస్త్రి విశాలాంధ్ర దినపత్రిక, జనవరి 3, 1977.

★★★

# గ్రంథ సమీక్షలు

## 1972 :

1. ''చరిత్రకెక్కిన చరితార్థులు'', రచన: చల్లా రాధాకృష్ణశర్మ, సమీక్షకులు: శివకుమారి, ఆంధ్రపత్రిక దినపత్రిక, ఆదివారం, నవంబర్ 12,1972.

2. ''శ్రీమద్భాగవతము: దశమ స్కంధము - పూర్వభాగము, రచన: చదలవాడ జయరామశాస్త్రి, సమీక్షకులు నోరి నరసింహశాస్త్రి, ఆంధ్రపత్రిక దినపత్రిక, ఆదివారం, నవంబర్ 12, 1972.

3. '' ఏటి అవతల'', హిందీ మూలం: గుల్షన్ నందా, అనువాదం: ఆచంట అంజని, సమీక్షకులు ఫాలాక్షుడు, ఆంధ్రపత్రిక దినపత్రిక, ఆదివారం, నవంబర్ 12, 1972.

## 1973 :

4. Facts in Ramayana రచన: శ్రీస్వామి బాలానంద, సమీక్షకులు: బులుసు వేంకటరమణయ్య, ఆంధ్రపత్రిక దినపత్రిక ఆదివారం, జనవరి 20, 1973.

5. 'వ్యావహారిక భాషావికాసం' రచన: డాక్టర్ బూదరాజు రాధాకృష్ణ. సమీక్షకులు: యామిజాల పద్మనాభస్వామి, ఆంధ్రపత్రిక దినపత్రిక ఆదివారం, జనవరి 20, 1973.

6. 'జముకుల కథ' రచన: సుబ్బారావు పాణిగ్రాహి, సమీక్షకులు, అవంతి, సమీక్ష పేరు: శ్రీకాకుళం పోరాటగాథ. విశాలాంధ్ర, ఆదివారం ఆగస్టు 26, 1973.

7. 'బాలాభిరామం' రచన: మిరియాల రామకృష్ణ, సమీక్షకులు: పి.వి.సుబ్బారావు, విశాలాంధ్ర, శనివారం అక్టోబర్ 3, 1973.

8. 'ఆంధ్రభారతం' తొలి ముద్రణ, ప్రధాన సంపాదకులు డాక్టర్ ఖండవల్లి లక్ష్మీరంజనం, డాక్టర్ దివాకర్ల వెంకటావధాని, సమీక్షకులు: ఎన్. ఆంధ్రజ్యోతి ఆదివారం, డిసెంబర్ 9, 1973.

## 1974 :

9.(History of the Chalukyas of Vengi) రచన: భావరాజు వెంకట కృష్ణారావు, సమీక్షకులు: బలరామమూర్తి, విశాలాంధ్ర ఆదివారం మార్చి 3, 1974.

10.'ఆంధ్ర నిఘంటువు' కూర్పు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కళాభవన్, హైదరాబాద్. సమీక్షకులు: నిడమర్తి సత్యనారాయణమూర్తి, విశాలాంధ్ర ఆదివారం మార్చి 10, 1974.

11.'ఆర్తవిపంచి' (కవితా సంపుటి) రచన: జి.వెంకటేశ్వర్లు, సమీక్షకులు: 'ప్రజారామ్' విశాలాంధ్ర ఆదివారం, మార్చి 10, 1974.

12.'ఉదయం' (యువ భారతీయుల కథల సంపుటి) సమీక్షకులు: నవీన్, విశాలాంధ్ర ఫిబ్రవరి 17, 1974.

13.'జ్వాలాపథం' ఖమ్మం జిల్లా యువ రచయితల సమాఖ్య, విశాలాంధ్ర ఫిబ్రవరి 17, 1974.

## 1975:

14.'ఈశ్వరార్చన కళాశీలుడు' రచన: డాక్టర్ కొర్లపాటి శ్రీరామమూర్తి, సమీక్షకులు: బులుసు వేంకటరమణయ్య. ఆంధ్రపత్రిక ఆదివారం ఫిబ్రవరి 16, 1975.

15.'నటస్థానం' రచయిత నరసింహారావు, సమీక్షకులు మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి. ఆంధ్రపత్రిక ఆదివారం ఫిబ్రవరి 16, 1975.

16.'మేం' (కవితా సంకలనం, రచయితలు: సుధామ, నాగినేని భాస్కరరావు, యువభారతి కింగ్స్‌వే) విశాలాంధ్ర మార్చి 9, 1975. సమీక్షకులు: కాంచనపల్లి చినవెంకటరామారావు.

17.'తిరిగివచ్చిన గాడిద', కిషన్‌చందర్ (నవల) అనువాదం: నీరుకొండ హనుమంతరావు. సమీక్షకులు: కౌముది. విశాలాంధ్ర ఆదివారం మార్చి 23, 1975.

18.'నవయుగం' (సాంఘిక నాటకం - రచన ప్రకాశ్). సమీక్షకులు: కాంచనపల్లి చినవెంకటరామారావు. విశాలాంధ్ర ఆదివారం మార్చి 23, 1975.

19.'కథలెలా రాస్తారు' (12 మంది కథకుల వ్యాసాలు) సమీక్షకులు: ఆర్వియార్. విశాలాంధ్ర ఆదివారం ఏప్రిల్ 27, 1975.

20.'ఇతిహాసాలను ఎలా అధ్యయనం చేయాలి?'

''కవిత్రయ కవితావైజయంతి'' వర్ధమాన సమాజం, నెల్లూరు. సమీక్షకులు -

బలరామమూర్తి. విశాలాంధ్ర ఆదివారం జులై 20, 1975.

## 1977:

21.''ముంతాజ్ మహల్'' జాషువాగారి సుందరకాండ కావ్యము. సమీక్ష: జాషువా కృతులు. సమీక్షకులు: విం.శి.రా. ఆంధ్రజ్యోతి, ఆదివారం జనవరి 9, 1977.

22.'ఇందిర భారతం' (ఇందిరాగాంధీ జీవిత చరిత్ర) రచయిత అవధానం రమేష్. సమీక్షకులు: సుధామ. విశాలాంధ్ర సోమవారం ఫిబ్రవరి 28, 1977.

23.'పుత్తడిబొమ్మ' (నవల) రచన: రామవరపు వేణుగోపాలరావు. సమీక్షకులు: డ్యాక్టర్ పరుచూరి రాజారామ్. విశాలాంధ్ర సోమవారం ఫిబ్రవరి 7, 1997.

24.'బాపు' బొమ్మల రామాయణం' రచన: ముళ్ళపూడి వెంకటరమణ సమీక్షకులు: ఉమారాజ్. విశాలాంధ్ర సోమవారం ఫిబ్రవరి 7, 1977.

25.'అవినీతి! నీవెక్కడ?' నాటకం. రచయితలు అనిశెట్టి, పినిశెట్టి, పాప, గొల్లపూడి మారుతీరావు. సమీక్షకులు డ్యాక్టర్ పరుచూరి రాజారామ్. విశాలాంధ్ర సోమవారం ఫిబ్రవరి 7, 1977.

20.'మీరైతేం ఏం చేస్తారు' 'జారుడుమెట్లు' రెండు నాటికలు. రచన: కాశీ విశ్వనాధంగారు. సమీక్షకులు - కాంచనపల్లి చిన వెంకట రామారావు. విశాలాంధ్ర సోమవారం ఫిబ్రవరి 14, 1977.

27.'అనురాధ' నవల. రచన: నెప్పల్లి రాధ. సమీక్షకులు: డా॥ రాజారామ్. విశాలాంధ్ర సోమవారం ఫిబ్రవరి 14. 1977.

28.'అందానికి సమాధి' నవల. రచన: తమిరిక జానకి, సమీక్షకులు : డా॥ రాజారామ్ విశాలాంధ్ర సోమవారం ఫిబ్రవరి 14, 1977.

29.'తమిళ సాహిత్య చరిత్ర' చల్లా రాధాకృష్ణశర్మ.

కన్నడ సాహిత్య చరిత్ర డా॥ ఆర్. వి.యస్.సుందరం.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్. సమీక్షకులు: బలరామమూర్తి, విశాలాంధ్ర సోమవారం జులై 4, 1977.

30.'గిడుగు రామమూర్తి' జీవితచరిత్ర. రచన: జి.వి.రామమూర్తి. సమీక్షకులు: కాంచనపల్లి చిన వెంకట రామారావు. విశాలాంధ్ర సోమవారం జులై 11, 1977.

31.'సాహిత్యావలోకం' రచన: సోదుం రామ్మోహన్, సమీక్షకులు: సాధక్. విశాలాంధ్ర సోమవారం జులై 11, 1977.

32.'జాతక కథలు' (ఆరవ సంపుటి) శివశంకరస్వామి, సమీక్షకులు. బలరామమూర్తి. విశాలాంధ్ర సోమవారం ఆగస్టు 1. 1977.

33.'మాండలిక వృత్తి పదకోశం' (ఐదవ సంపుటం - కుమ్మరం) సంకలన కర్త. సంపాదకుడు: ఆచార్య జె. యస్.రెడ్డి. సహాయ సంపాదకులు: డాక్టర్ జి.నాగయ్య. సమీక్షకులు - వి. లక్ష్మణరెడ్డి. విశాలాంధ్ర సోమవారం ఆగస్టు 8, 1977.

34.'అందరికీ చదువు' రచన: యన్.మంగాదేవి. టి. అన్నపూర్ణ. సమీక్షకులు: డాక్టర్ పరుచూరి రాజారామ్. విశాలాంధ్ర సోమవారం ఆగస్టు 8, 1977.

35.'రాజకీయ అవగాహన' రచన సి.నరసింహారావు సమీక్షకులు: వర్మ. విశాలాంధ్ర సోమవారం ఆగస్టు 8, 1977.

36.'జైమిని భారతం': అనువాదం: ఏలూరుపాటి అనంతరామయ్య. సమీక్షకులు - బలరామమూర్తి. విశాలాంధ్ర సోమవారం సెప్టెంబర్ 12, 1977.

36.'కథలు - కల్పనలు': రచన రవీంద్రుని మాతృ్యాకకు తెలుగు. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు. సమీక్షకులు - కాంచనపల్లి చినవెంకటరామారావు. విశాలాంధ్ర సోమవారం సెప్టెంబర్ 12, 1977.

37.'చిట్టిరాజు - గూనిగుర్రం' రచన: కె. రాజేశ్వరరావు. సమీక్షకులు మదన్. విశాలాంధ్ర సోమవారం సెప్టెంబర్ 26, 1977.

38.'శ్రీహర్ష నైషధము' (ద్వితీయ భాగము) వ్యాఖ్యాత: ఉడాలి సుబ్బరామశాస్త్రి. సమీక్షకులు: పి. వి. సుబ్బారావు. విశాలాంధ్ర సోమవారం సెప్టెంబర్ 26, 1977.

39.'పరుశురామ పంతుల లింగమూర్తి' (జీవితము - సాహిత్యము) ఆంధ్ర సారస్వత పరిషత్తు. సమీక్షకులు - కాంచనపల్లి చిన వెంకట రామారావు.

40.'యోగదర్శనము' కళాప్రపూర్ణ కొండూరు వీరరాఘవాచార్యులు. సమీక్షకులు - బలరామమూర్తి. విశాలాంధ్ర, సోమవారం అక్టోబర్ 10, 1977.

41.'అనల కిరీటం' (కవితా సమాహారం) రచన: సోమసుందర్. సమీక్షకులు: కాంచనపల్లి చిన వెంకటరామారావు అక్టోబర్ 10, 1977.

42.'సుకవి మనోరంజనము' రచన: కూచిమంచి వేంకటరాయుడు. సమీక్షకులు: వి. లక్ష్మణరెడ్డి. అక్టోబర్ 10, 1977.

43.'పల్నాటి మాంచాల' రచన: శ్రీమతి చోడవరపు సత్యవతీదేవి. సమీక్షకులు - ఎమ్. ఆర్. అక్టోబర్ 10, 1977.

44.'తెలుగుపూలు' రచన నార్ల చిరంజీవి, సమీక్షకులు - డాక్టర్ పరుచూరి రాజారామ్. విశాలాంధ్ర సోమవారం అక్టోబర్ 24, 1977.

45.'మూడు నాటికలు' రచన: పోతుకూచి సాంబశివరావు. సమీక్షకులు పరుచూరి రాజారామ్. విశాలాంధ్ర, సోమవారం అక్టోబర్ 24, 1977.

46.'అంతా కలిస్తే అమెరికా' రచన: కొడాలి వెంకటేశ్వరరావు. సమీక్షకులు -పట్టాభిరామారావు. సోమవారం నవంబర్ 14, 1977.

47.'వెన్నెలలో కోనసీమ' రచన: సోమసుందర్. సమీక్షకులు - చక్రవర్తి. విశాలాంధ్ర సోమవారం డిసెంబర్ 5, 1977.

48.'కొత్తపాళీ నవభారతం' (నవల) (వచన కవితా సంకలనం) సంకలనకర్త బులుసు వెంకట కామేశ్వరరావు. సమీక్షకులు - డా॥ పరుచూరి రాజారామ్. విశాలాంధ్ర సోమవారం జనవరి 10, 1977.

49.'నిశిత పరిశీలనా? దగాకోరు పరిశీలనా?' రచన: రంగనాయకమ్మ. కుటుంబరావుగాంధీ, సమీక్షకులు డా॥ పరుచూరి రాజారాం. విశాలాంధ్ర సోమవారం జూన్ 6, 1977.

50.'వీరనారి మల్లి' (నవల) రచన: కోలాహలం లక్ష్మణరావు. సమీక్షకులు - ఎస్. విశాలాంధ్ర సోమవారం జూన్ 6, 1977.

51.'శరత్‌చంద్రఛటర్జీ' (వ్యక్తి, రచయిత) రచన: సుబోధ చంద్రసేన్ గుప్త. సమీక్షకులు: బలరామమూర్తి. విశాలాంధ్ర సోమవారం జూన్ 13, 1977.

52.'ప్రజాకవి వేమన' (వేమన పద్యరత్నాకరము) తాత్పర్యకర్త బులుసు వెంకటరమణయ్య. పీఠిక డా॥ జి. అప్పారావు. సమీక్షకులు - శ్రీనాథభారవి. ఆంధ్రజ్యోతి. జూన్ 19, 1977.

53.'ప్రగతిశీల మానవతావాదిగా గురజాడ' రచయిత: డా॥ గంధం అప్పారావు. సమీక్షకులు: కె. రామమోహనరాయ్, ఆంధ్రజ్యోతి. ఆదివారం సెప్టెంబర్ 18, 1977.

54.'రాజూ -పేద' మూలం: మార్క్‌ట్వేన్. అనువాదం: నండూరి రామమోహనరావు. సమీక్షకులు: బాబు. ఆంధ్రపత్రిక జులై 9, 1978.

55.'యోగశాస్త్ర గ్రంథాలు' రచయిత నల్లగొండ రామచంద్రరావు. సమీక్షకులు - కళాప్రపూర్ణ నిడదవోలు వేంకటరావు. ఆంధ్రపత్రిక ఆదివారం ఆగస్టు 6, 1978.

56.'కరపత్రాల దుమారం. తెరవెనుక భాగోతం' సంకలనకర్తలు అనంతం అండ్ లక్ష్మీకాంతం. సమీక్షకులు: డా॥ కేతు విశ్వనాథరెడ్డి. విశాలాంధ్ర సోమవారం జనవరి 9, 1978.

57.'భారతీయ సాహిత్య నిర్మాతలు' రచన: తోరూదత్ పద్మినిసేన్‌గుప, తెలుగు అనువాదం నాయని కృష్ణకుమారి, సమీక్షకులు - బలరామమూర్తి. విశాలాంధ్ర సోమవారం, ఫిబ్రవరి 13, 1978.

58.'కంచి మహాకవి' రచన: ఎస్. మహారాజన్, సమీక్షకులు: బలరామమూర్తి. విశాలాంధ్ర, సోమవారం ఫిబ్రవరి 13, 1978.

59.'మార్పుకోసం' (కథలు) ట్వంటీఫస్ట్ సెంచరీ రైటర్స్, సమీక్షకులు - పరుచూరి రాజారాం. విశాలాంధ్ర, సోమవారం ఫిబ్రవరి 13, 1978.

60.'ప్రాణం' రచయిత అదృష్టదీపక్. సమీక్షకులు - చందు ,విశాలాంధ్ర సోమవారం ఫిబ్రవరి 13, 1978.

61.'బతుకుపాట' చిగుళ్ళు, అభ్యుదయ రచయితల సంఘం, సమీక్షకులు: ఆర్వియార్. విశాలాంధ్ర సోమవారం, ఫిబ్రవరి 27, 1978.

62.'యుగరశ్మి' (కవితాసంపుటి) ఎస్.వెంకటరంగారెడ్డి, సమీక్షకులు - ఆర్వియార్. విశాలాంధ్ర సోమవారం ఫిబ్రవరి 27, 1978.

64.'యింకానా యికపై సాగదు' (నాటకం) రచయిత: బొల్లిముంత నాగేశ్వరరావు. పొద్దు పొడిచింది (నాటిక) రచయిత: బొల్లిముంత నాగేశ్వరరావు. సమీక్షకులు: యం.జి., విశాలాంధ్ర, సోమవారం ఫిబ్రవరి 27, 1978.

65.'మహాదార్శనికుడు' (ఖలీల్ జిబ్రాన్ ది ప్రాఫెట్) అనువాదకులు: ఆచార్య ధనకుధరం. సమీక్షకులు: డా॥ కేతు విశ్వనాథరెడ్డి. విశాలాంధ్ర ,సోమవారం మే, 8, 1978.

66.'శతావతారాలు' రచన: ముక్కామల నాగభూషణం. సమీక్షకులు: బలరామమూర్తి, విశాలాంధ్ర, సోమవారం మే 8, 1978.

67. 'ఊహాశక్తి' (ద్వివూస సైన్సు పత్రిక) ప్రచురణ: శ్రీవివేకానంద విద్యాపరిషత్. సమీక్షకులు: మునగాల జనార్దరెడ్డి. విశాలాంధ్ర ,సోమవారం మే 8, 1978.

68.'వ్యావహారిక భాషా పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి'. రచన - జి.వి.రామమూర్తి. సమీక్షకులు - ''శేషు''.

''తెలుగు దేశపు జానపద గీతాలు'' రచన: డా॥గంగప్ప. సమీక్షకులు - ''శేషు'' ఆంధ్రజ్యోతి, ఆదివారం జులై 3, 1977.

69.'రంగవల్లి' రచన: పోరంకి దక్షిణామూర్తి, సమీక్షకులు - శ్రీనాథభారవి, ఆంధ్రజ్యోతి, మే 1, 1977.

70.'స్నేహానుబంధం' (నాటకం) రచన: బాబూరావు, సమీక్షకులు - కాంచనపల్లి చిన వెంకట రామారావు.

'చంద్రసేన' (నాటకం) రచన: అంగర సూర్యారావు, సమీక్షకులు - కాంచనపల్లి చిన వెంకట రామారావు. విశాలాంధ్ర, సోమవారం, జూన్ 13, 1977.

71.'కడప జిల్లా ఊర్లపేర్లు' పరిశోధక గ్రంథం, రచన: డా॥ కేతు విశ్వనాథరెడ్డి. ఊర్ల పేర్ల వ్యుత్పత్తిపై తొలి పరిశోధనా గ్రంథం. సమీక్షకులు - శ్రీనాథభారవి.

ఆంధ్రజ్యోతి, మే ఆదివారం 22, 1977.

72. 'రసమంజరి' (సాహిత్య వ్యాస సంపుటి) రచన: ఆకుల వేంకట పానకేశ్వరరావు. సమీక్షకులు - ఆర్వీయార్. సాహితీ స్రవంతి (వ్యాస సంపుటి) పి. శంభుప్రసాద్, ఎ. వి. పానకేశ్వరరావు. సమీక్షకులు - ఆర్వియార్. విశాలాంధ్ర, సోమవారం జులై 3, 1978.

73. 'కమలనయన్' (కథలు) రచన: కంఠంనేని రాధాకృష్ణమూర్తి. సమీక్షకులు - పి., విశాలాంధ్ర, సోమవారం జులై 3, 1978.

74. సమకాలీన జీవిత ప్రతిబింబాలైన మూడు నవలలు.

1. 'బలిపశువు' రచన: జాతశ్రీ

2. 'కోటి కుటుంబాల ఘోష' రచన: కె. బ్రహ్మానందరావు

3. 'సంకెళ్లు తెగుతాయి' (కన్సొలేషన్ బహుమతి నవల)

రచన: మల్లిక్. సమీక్షకులు - చక్రవర్తి

విశాలాంధ్ర సోమవారం జులై 10, 1978.

75. 'పచ్చని జీవితానికో నచ్చని రూలు' (కథానికలు) డా॥ పెళ్ళకూరు జయప్రద, రంజని, కీ.శే. పానుగంటి నరసింహారావు స్మృతికి అంకితం చేశారు. సమీక్షకులు - ఎస్. విశాలాంధ్ర, సోమవారం జులై 31, 1978.

76. 'తారాశంకర్ బంధోపాధ్యాయ' ( ఆంగ్లమూలం: మహాశ్వేతాదేవి. తెలుగు అనువాదం: ఎస్. ఎస్. ప్రభాకర్, సమీక్షకులు - కేతు విశ్వనాథరెడ్డి. విశాలాంధ్ర అక్టోబర్ 2, 1978.

77. 'అరుణోదయం' కథల సంపుటి రచన: అరుణకిరణ్, సమీక్షకులు - సంగాల, విశాలాంధ్ర అక్టోబర్ 2, 1978.

78. 'మరో స్వాతంత్ర్య చరిత్ర' స్నేహలత సంస్కరణ సంచిక గౌ॥ సంపాదకులు సంజీవదేవ్. సంకలన కర్తలు: రావెల సోమయ్య, సురమౌళి.

'అత్యాచార పర్వం' సంకలనం: శ్రీ శక్తిపుత్ర. సమీక్షకులు - పిరాట్ల వెంకటేశ్వర్లు.

'జనవిజయం' రచయిత: భండారు సదాశివరావు. సమీక్షకులు - పిరాట్ల వెంకటేశ్వర్లు. ఆంధ్రపత్రిక ఆదివారం సెప్టెంబర్ 10, 1978.

79. 'లోక్‌నాయక్ జయప్రకాష్' రచన: ఎం. యల్. నరసింహారావు. సమీక్షకులు ''చాణుక్య'' ఆంధ్రపత్రిక. ఆదివారం సెప్టెంబర్ 24, 1978.

80. 'ఇదా నువ్విచ్చే తీర్పు' (కథలు) పెళ్ళకూరు జయప్రద. సమీక్షకులు - ఎస్.

'జలపాతం' (కవితా సంకలనం) సంపాదకుడు: కాళోజీ, సమీక్షకులు - రవి. విశాలాంధ్ర, సోమవారం సెప్టెంబర్ 4, 1978.

81. సమకాలీన సామాజిక, ఆర్థిక పరిస్థితుల గురించి వర్ధమాన రచయితలలో లోపించుతున్న శాస్త్రీయ అవగాహన.

'రాధామనోహరాలు' (కథల సంపుటి) రచన: రాధామనోహరన్. సమీక్షకులు - పరకాల పట్టాభిరామారావు. విశాలాంధ్ర, సోమ, సెప్టెంబర్ 25, 1978.

82. 'మలినాంచలం' ఫణీశ్వరనాథ్ రేణు - అనువాదం, దండమూడి మహీధర్. సమీక్షకులు - బలరామమూర్తి, అక్టోబర్ 2, 1978, విశాలాంధ్ర.

83. 'ఎర్రజండాలు' (తెలంగాణా గెరిల్లా యోధుల జీవితగాథలు) రచన: గంగినేని వెంకటేశ్వరరావు. సమీక్షకులు - పరకాల పట్టాభిరామారావు. విశాలాంధ్ర. అక్టోబర్, 1978.

84. 'జననం' కవిత. రచన: బి.నరసింగరావు. సమీక్షకులు - సంగాల ,విశాలాంధ్ర సోమ, అక్టోబర్ 23, 1978.

85. 'అభ్యుదయ తోరణాలు' (కవితలు) రచన: వంగల రంగాచార్యులు. సమీక్షకులు - ఆర్వియార్. విశాలాంధ్ర సోమవారం, అక్టోబర్ 23, 1978.

86. 'పాశ్చాత్యుల - తెలుగు భాషా సంస్కృతులు' రచన: కె. ఆర్.కె.మోహన్. సమీక్షకులు - వి.లక్ష్మణరెడ్డి. విశాలాంధ్ర, సోమవారం నవంబర్ 27, 1978.

## 1979 :

87. 'సాహితీ సుధాలహరి' రచన: ''భాషాప్రవీణ'' పత్తికొండ సీతారామయ్య

'ప్రభవ' రచన: పురాణపండ రంగనాథ్

'పూర్ణ పురుషుడు' రచన: కవిరత్న యామిజాల పద్మనాభస్వామి

సమీక్షకులు - మైత్రేయ., విశాలాంధ్ర సోమవారం, ఫిబ్రవరి 12, 1979.

88. 'మరో పెళ్ళి - ఆశా పెళ్ళి' రచన: రావిమన్ అవధాని.

'పీటల కింద పెళ్ళి' రచన: నిష్టల వెంకటరావు.

'తిరోగమనం మళ్ళీ' రచన: మందా వెంకట రమణరావు.

సమీక్షకులు - ఆర్వియార్.

విశాలాంధ్ర, ఆదివారం, మార్చి 25, 1979.

89. 'సచి రౌత్‌రాయ్' కథలు,అనువాదం: చాగంటి తులసి. సమీక్షకులు - మైత్రేయ.

'కావ్యవిధానము' (సాహిత్య విమర్శక గ్రంథం) రచన: సాహితీ శిల్పి, శ్రీ రూపనగుడి నారాయణరావు. సమీక్షకులు - మైత్రేయ.

'ప్రతిజ్ఞాశాలి' (యేఫ్తా చరిత్ర - పదకావ్యం) రచన: బొడ్డు ప్రకాశం. సమీక్షకులు - మైత్రేయ. విశాలాంధ్ర ఆదివారం, మార్చి 18, 1979.

90. 'రేపటి కోసం' (బ్రెస్ట్ కవితానువాద సంకలనం) సంపాదకుడు: ఏటుకూరి ప్రసాద్. సమీక్షకులు - మైత్రేయ, విశాలాంధ్ర సోమవారం మార్చి 5, 1979.

91. 'మంచు మండింది' నవల రచన: రవిబాబు

పాశ్చాత్యులు: తెలుగు భాషా సంస్కృతులు, రచన: కె. ఆర్.కె.మోహన్. సమీక్షకులు - జి.రామకృష్ణారావు. ఈనాడు ఏప్రిల్ 1, 1979.

92. 'నూతిలో గొంతుకలు' రచన: ఆలూరి బైరాగి, సమీక్షకులు వై.రామకృష్ణారావు. ఈనాడు ఏప్రిల్ 8, 1979.

93. 'ఒక కన్య చెప్పిన కథ' రచన: మందా వెంకటరామారావు. సమీక్షకులు - పి. ఆర్. విశాలాంధ్ర, ఏప్రిల్ 9, 1979.

94. 'మేఘమాల' (నవల) రచయిత: మల్లాది వెంకటకృష్ణమూర్తి. సమీక్షకులు - మహేంద్ర, ఈనాడు, ఏప్రిల్ 15, 1979.

95. 'ఆధునిక తమిళ సాహిత్య నిర్మాతలు' రచన: డా॥ చల్లా రాధాకృష్ణశర్మ.

'మలయాళ వాఙ్మయ చరిత్ర' రచన: పి.కె.పరమేశ్వరన్‌నాయర్. అనువాదం: దివాకర్ల వేంకటావధాని.

'సూర్యుడు దిగిపోయాడు' (నవల) రచన: కొమ్మూరి వేణుగోపాలరావు. సమీక్షకులు - రాధారమణ్. ఈనాడు ఆదివారం, మే 20, 1979.

96. 'కందుకూరి రుద్రకవి' రచన: డా॥ రేవూరి అనంత పద్మనాభరావు. సమీక్షకులు - బలరామమూర్తి. విశాలాంధ్ర ,సోమవారం జూన్ 4, 1979.

97. 'బ్రాహ్మణ పిల్ల' (నవల). రచన: లత. 'రాళ్ళపల్లి పీఠికలు' రచన, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

'అనంతరాగం' రచన: రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ.

సమీక్షకులు - వై.రామకృష్ణారావు. ఈనాడు జూన్ 10, 1979.

98. 'యుగాంతం' మూలం - ఇరావతి కార్వే, అనువాదం: బాలచంద్ర అప్టే. సమీక్షకులు - బలరామమూర్తి. విశాలాంధ్ర, సోమవారం జులై 23, 1979.

99. 'మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు' రచన: బంగోరె, సమీక్షకులు - బలరామమూర్తి.

'రైతు పోరాట గీతాలు' రచన: తుమ్మల వెంకటరామయ్య.

'కాంచన ద్వీపం' ఆర్. యల్.స్టీవెన్‌సన్, అనువాదం: నండూరి రామమోహనరావు. సమీక్షకులు - ఆర్వియార్.

'మా ఊరు మారింది' కవితలు - ఆవంత్స సోమసుందర్, సమీక్షకులు - మైత్రేయ. విశాలాంధ్ర సోమవారం, జులై 16, 1979.

100. మూడు మంచి నవలలు.

'మనిషికీ మనిషికీ మధ్య' రచన: వి. రాజారామమోహనరావు.

'స్మశానం దున్నేరు' రచన: డా॥ కేశవరెడ్డి.

'శతాబ్దాల నిశ్శబ్దం' రచన: దశరథ్. సమీక్షకులు - వర్మ.

విశాలాంధ్ర, సోమవారం జులై 30, 1979.

101. 'రథచక్రాలు'

'ఈ దారి ఎక్కడికి?' రచన: మహీధర రామమోహనరావు వారి తెలుగు నవలలు. సమీక్షకులు - పురాణపండ.

ఆంధ్రప్రభ అక్టోబర్ 20, 1979.

102. 'ఒక కన్య చెప్పిన ( ఆదర్శాల) కథ' రచన: మంథా వెంకట రమణారావు. సమీక్షకులు - శుచిముఖి.

'మహాభారత ఉపన్యాసములు' రచయిత: నండూరి సుబ్రహ్మణ్యశర్మ. సమీక్షకులు - ధర్మపురి శేషగిరిశర్మ. ఆంధ్రప్రభ, అక్టోబర్ 14, 1979.

103. 'మాధవి' నవల, రచయిత్రి డా॥ అనుపమ నిరంజన్ తెలుగు: కల్యాణి. సమీక్షకులు - మైత్రేయ (స్వతంత్ర జీవన సంకేతంగా మాధవి పాత్ర తిరుగుబాటు) విశాలాంధ్ర, సోమవారం , నవంబర్ 12, 1979.

104. 'యాత్ర' (స్త్రీల నవలా సాహిత్యంలో కొత్త తెన్నులు) (నవల) రచన: చాగంటి తులసి, సమీక్షకులు - సోమసుందర్. విశాలాంధ్ర సోమవారం , నవంబర్ 26, 1979.

105. 'కవితకు ప్రాణం సంచలనమ్!

చలనమ్' కవితా సంపుటి, రచన: విహారి. సమీక్షకులు - సోమసుందర్. విశాలాంధ్ర, డిసెంబర్ 9, 1979.

106. 'మానవారణ్యం' (నవల) రచయిత: జి. సి. కొండయ్య, సమీక్షకులు -

ఆర్వియార్., ఈనాడు ఏప్రిల్ 6, 1980.

107.'చరమరాత్రి' (కథాసంకలనం) రచయిత: శ్రీశ్రీ., సమీక్షకులు - జగన్నాథశర్మ.

'విముక్తి' (నవల) రచయిత: ఎం.డి.సౌజన్య. సమీక్షకులు - రవీంద్రనాధ్. ఈనాడు ఏప్రిల్ 13, 1980.

108.'విచిత్ర వ్యక్తి' (మూలం: మార్క్‌ట్వేన్) అనువాదం: నండూరి రామమోహనరావు. సమీక్షకులు - రవి.

'ఆకర్షణ - వ్యామోహం' (నవల) రచయిత: కవనశర్మ, సమీక్షకులు - రవి. ఈనాడు ఏప్రిల్ 20, 1980.

109.'రసాయన మూలకాల రహస్యాలు (సుగమ విజ్ఞాన శాస్త్రం)' యల్.వ్లాసావ్, డి.త్రిఫోనావ్, ఆంధ్రానువాదం: భట్టి శ్రీనివాసులు). సమీక్షకులు - రవీంధ్రనాధ్. ఈనాడు మే 4, 1980.

110.'గురజాడ' రచన: వి.ఆర్.నార్ల. సమీక్షకులు - సి.ఇ.ఆరె. మహాకవి శ్రీశ్రీ అభినందన సంచిక (70వ జన్మదినోత్సవానికి వివిధ రచయితలు కూర్చిన వ్యాసాలు) సమీక్షకులు - మైత్రేయ. విశాలాంధ్ర ఆదివారం మే 4, 1980.

111. సాహితీ యోగ్యతా నవలగా ''ఇన్‌క్రెడిబిల్ గాడెస్'' రచన: చిత్తూరు గంగాధరం. సమీక్షకులు - మైత్రేయ.

'నలిగిపోయిన డైరీలో చిరిగిపోయిన పేజీ' (నవల) రచన: ఎస్.కాశీవిశ్వనాధ్.

ఆలూరి బైరాగి సంస్మరణ సంచిక.

'అక్షరం' రచన: జి.వై. గిరి.

సమీక్షకులు - మైత్రేయ. విశాలాంధ్ర ఆది, మే 19, 1980.

112.'జాషువా జీవిత కవితా ప్రస్థానం' రచన: డా॥ బి. భాస్కరచౌదరి.

'తెలుగుదేశంలో స్వాతంత్ర్యోద్యమం' రచన: పి. యన్.మూర్తి.

సమీక్షకులు - ఆర్. ఆర్. జి. ఈనాడు జూన్, 1980.

113.'భారత జనని' ఖండకావ్యం, కృతికర్త: కవి కంఠీరవ వేళ్ళ సాంబశివరావు.

వికటనీతులు, వ్యంగ్య శతకము, కె. విశ్వం.

ఉపగుప్త, బౌద్ధకావ్యము, విద్వాన్: జక్కా వెంకటేశ్వరుడు.

సమీక్షకులు - టి. యల్.కాంతారావు.

ఆంధ్రపత్రిక ఆదివారం, అక్టోబర్ 5, 1980.

114.'బాణోచ్ఛిష్ట మిదంజగత్!'

పుస్తకం పేరు: బాణభట్టు. మూలం: కె.కృష్ణమూర్తి, ఆంధ్రీకరణం: డా॥ పుల్లెల శ్రీరామచంద్రుడు. సమీక్షకులు - సోమసుందర్.

115.'రామాయణ' రచనలు ( రచన) తెలుగు: చిలకపాటి వెంకట రామానుజశర్మ.

'శ్రీ మదాంధ్ర కందరామాయణ రసానంద మంజరి' రచన: ఘోరకవి రాజేశ్వరరావు.

'శ్రీ మద్రామాయణ తత్త్వదర్శనము సుందరకాండము' రచన: జీరెడ్డి బాలచెన్నారెడ్డి. సమీక్షకులు: యామిజాల పద్మనాభస్వామి.

పరిశోధన , వ్యాస సంకలనం డా. నాయని కృష్ణకుమారి.

'ముత్తుస్వామి దీక్షితుల కృతుల సవావరణ' రచన: టి.యన్.పార్థసారధి. భావరాజు నరసింహరాజు.

సమీక్షకులు - వేంకట్రావు.

ఆంధ్రపత్రిక ఆది, అక్టోబర్ 12, 1980.

116.'భారతీయ సాహిత్య నిర్మాతలు' సంకలనకర్త డా॥ సుబోధ చంద్రసేన్‌గుప్త. అనువాదం: దేవులపల్లి రామానుజరావు. సమీక్షకులు - సోమసుందర్. విశాలాంధ్ర ఆదివారం, అక్టోబర్ 19, 1980.

117.'ప్రతాపరుద్రీయ మందించి అమరులైన వేదంవారు'

రచన: వేదం వెంకటరాయశాస్త్రి - కేంద్ర సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ. విశాలాంధ్ర ఆదివారం, నవంబర్ 23, 1980.

118.'కడుపుకోత' రచన: దేవరాజు మహారాజు. సమీక్షకులు - మైత్రేయ.

'వేమన్నవాదం' వ్యాఖ్యాత: డా॥ ఎన్.గోపి. సంపాకుడు డా॥ చేకూరి రామారావు. సమీక్షకులు - డాక్టర్ మిరియాల రామకృష్ణ. విశాలాంధ్ర డిసెంబర్ 2, 1980.

119. ఉద్గీధ ( కవితా సంకలనం) రచన: పసుమర్తి.

'ఇది హృదయం' (కవితా సంపుటి) రచన: మాస్టర్ రవి.

ఆర్కెస్ట్రా ( వచన కవితా సంకలనం) సంకలనం - ఆశావాది ప్రకాశరావు. టి.యల్.కాంతారావు సమీక్షకులు.

ఆంధ్రపత్రిక, ఆదివారం డిసెంబర్ 21, 1980.

★★★

# మూడవ అధ్యాయం

*1980-90ల మధ్య దినపత్రికల్లో వచ్చిన సాహిత్యం*

# i. నేపథ్యం

## ఎ. సామాజిక, సాంస్కృతిక రంగాల్లో వచ్చిన మార్పులు :

1980ల తర్వాత సాహిత్యరంగంలో అప్పటివరకు ప్రధానస్రవంతిగా ఉన్న విప్లవవాదం ప్రభావం తొలగిపోవడం మొదలైంది. రాజకీయంగా విప్లవ సంస్థల్లో వచ్చిన మార్పులు, పరిణామాలు సాహిత్య రంగాన్ని కూడా అనివార్యంగా ప్రభావితం చేశాయి. వాస్తవానికి ఉద్యమకారుల్లో చీలికలు 70ల్లోనే మొదలైనప్పటికీ 80లకు చేరుకునేసరికి అవి మరింత ఎక్కువయ్యాయి. వాటికి అనుబంధంగా ఉన్న సాహిత్య సంఘాలు కూడా చీలిపోయాయి. 1980ల దశకంలో ప్రారంభం నాటికి విప్లవరచయితల సంఘం, జనసాహితి, ప్రజారచయితల సమాఖ్య అనే మూడు సంఘాలుగా చీలిపోవడంతో విప్లవసాహిత్యానికి ఒక ప్రధానస్రవంతిగా కొనసాగే అవకాశం లేకుండా పోయింది. ఇదేసమయంలో సాహిత్యపరంగా రాజకీయ ప్రాధాన్యాన్ని అంతగా పట్టించుకోని మధ్యతరగతి భావజాలం ప్రభావితం చేయసాగింది. '' ఈ దశాబ్దిలో ఉద్యమ స్థాయిలో వచ్చిన మార్పులు, ఏర్పడిన చీలికలు, రచయితల సంఘాల్లో కూడా ప్రతిఫలించాయని గుర్తించాం. అంతే కాదు, ఉద్యమ కవిత్వ పరిధి కూడా తగ్గింది. ఈ దశాబ్దిలో కవితారచనకుపక్రమించిన చాలా మంది కవులకు ఉద్యమ స్ఫూర్తి లేదు. బహుశా ఉద్యమ కవిత్వం వీళ్లను ఏమంతగా కదిలించలేదనుకోవాలి. ప్రకృతిలో వస్తువులను గురించో, వ్యక్తి జీవిత సంఘటనల గురించో, అస్పష్ట, అవ్యక్త, మనోభావ సంచలనాల గురించో గాఢమైన భావనతో , ఉన్నతమైన వస్తువైవిధ్యంతో , నైరూప్య (abstract )కవిత్వం రాసే ధోరణి ఒకటి ఇటీవల బాగా పెరుగుతున్నది.''[1] సాహిత్యపరంగా వచ్చిన ఈ మార్పుల వల్ల అంతకు ముందు భావవ్యక్తీకరణకు ఉన్న పరిమితులన్నీ తొలిగిపోయాయి. రచయితలు సాహిత్యపరంగా కొత్త స్వేచ్ఛను పొందారు.

మరోవైపు వ్యాపార సాహిత్య దృక్పథం బాగా పెరిగిపోయింది. ఉత్తమాభిరుచులకు ప్రతీకగా ఉండాల్సిన సాహిత్యంలో జనాకర్షణ ప్రధానాంశంగా చేరింది. దీనికి ఒక కారణం సమకాలీన పత్రికావ్యవస్థ. 1980 తర్వాత తెలుగు పత్రికారంగంలో విశేషమైన మార్పులు ప్రవేశించాయి. పాఠకుల సంఖ్య గతంతో పోల్చినప్పుడు విపరీతంగా పెరిగిపోవడంతో

దినపత్రికలు మరిన్ని వెలువడసాగాయి. దినపత్రికల్లో కూడా డైలీ సీరియల్ ఒక తప్పనిసరి అంశంగా చేరింది. వ్యాపార సాహిత్యాన్ని గతంలో మాదిరిగా వారపత్రికలే కాకుండా దినపత్రికలు కూడా పెంచిపోషిస్తున్నాయి. సాహిత్యపరంగా వ్యాపార సాహిత్యం , నిజమైన సాహిత్యం అనే వర్గీకరణ స్పష్టంగా ఏర్పడింది. అయితే దినపత్రికలకు సంబంధించినంతవరకు డైలీ సీరియల్స్ మినహాయిస్తే సాహిత్య అనుబంధాల్లోనూ, ఆదివారం అనుబంధాల్లోనూ మంచి సాహిత్యానికి మాత్రమే ప్రాముఖ్యం దక్కింది. 1980 నుంచి ఒక దశాబ్దం పాటు దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో వెలువడిన సాహిత్యవ్యాసాలను, చర్చలూ, వాదోపవాదాలను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుంటే వారపత్రికల సాహిత్య సంస్కృతికి భిన్నంగా అవి ఏ విధంగా భిన్నంగా ఉన్నాయో అర్థమవుతుంది.

## బి. కొత్తపత్రికలు:కొత్తపాఠకులు:

ఈదశాబ్దంలో పత్రికావ్యవస్థలో వచ్చిన మార్పులు కేవలం సాంకేతికమైనవి మాత్రమే కావు; భౌతికంగా దినపత్రికల స్వరూపంతో పాటు వాటి అంతర్గత విలువలు కూడా అనేక మార్పులు పొందాయి. తెలుగు పత్రికాప్రపంచంలో సంస్థాగతంగా వచ్చిన ఈ మార్పులు సాహిత్య సాంస్కృతిక అంశాలను కూడా మార్చాయి. 1980 నుంచి ప్రారంభమైన ఉదయం దినపత్రిక దినపత్రికారంగంలో ఒక ముఖ్యమైన మలుపు. పత్రికారచనకు సంబంధించిన మార్పుల్ని తీసుకురావడమే కాకుండా సమకాలీన పాఠకుల అభిరుచికి తగ్గట్టుగా పత్రికల్లోని వివిధ శీర్షికలను తీర్చిదిద్దారు. దినపత్రికల్లో ఏ వర్గం పాఠకులకు కావలసిన సమాచారాన్ని ఆ వర్గానికి అందించేందుకు వీలుగా ప్రతిరోజూ ఒక ప్రత్యేక పేజీకి శ్రీకారం చుట్టింది ఈ దశాబ్దంలోనే. దీనివల్ల పత్రికావ్యవస్థకు పాఠకులకు మధ్య మరింత సన్నిహిత అనుబంధం ఏర్పడింది. దీంతోపాటు సాహిత్యం కోసం రెండు ప్రత్యేకమైన పేజీలను ఉదయం దినపత్రిక తీసుకువచ్చింది. ఇంతకుముందే ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి లాంటి పత్రికలు సాహిత్యానికి పూర్తి పేజీ కేటాయిస్తూ వచ్చినప్పటికీ సమకాలీన ఆధునిక ధోరణులకు ప్రాముఖ్యం ఇచ్చింది ఉదయం దినపత్రికే. సాహిత్య సంబంధమైన అంశాలకు విశేష ప్రాముఖ్యం కూడా దక్కింది.

1980 తరువాత తెలుగు దినపత్రికలో కొత్త పాఠకులను సమకూర్చుకోవడంలో నిమగ్నమయ్యాయి. ఉద్యమాలు లేని సామాజిక, రాజకీయ వాతావరణంలోంచి, ఉద్యోగాలు లేని ఆర్థిక నైరాశ్యం లోంచి పుట్టుకువస్తున్న కొత్తతరానికి కావలసిన సాధన సంపత్తులను సమాకూర్చేదశగా ఈ పత్రికలో రూపుదిద్దుకున్నాయి. దీనితో కొత్తపాఠకుల సంఖ్య విశేషంగా పెరిగింది. మిగతా అన్ని పత్రికలపై కూడా ఈ ప్రభావాలు కనిపిస్తాయి.

## సి. సాహిత్య పేజీల్లో వచ్చినమార్పులు:

ఇంతకు ముందు దశాబ్దాల కంటే ఈ దశాబ్దంలో పత్రికలపై ఎలక్ట్రానిక్ మీడియా ప్రభావం అధికంగా కనిపిస్తుంది. ఎలక్ట్రానిక్ మీడియా దేశవ్యాప్తంగా మారుమూల పల్లెలకు సైతం విస్తరించడంతో ఎప్పటికప్పుడు తక్షణ సమాచారాన్ని అందించే సౌలభ్యం వాటికి ఉండటంతో దినపత్రికలపై ఈ ప్రభావం ఎక్కువగానే కనిపిస్తుంది. అయితే దినపత్రికల సాహిత్య అనుబంధాలపై మాత్రం ఈ ప్రభావం పేర్కొనతగిన స్థాయిలో లేదని చెప్పవచ్చు. ఒక విధంగా చెప్పాలంటే గతంలో కంటే ఇప్పుడు దినపత్రికలు సాహిత్య , సాంస్కృతిక అంశాలను మరింత విస్తారంగా పాఠకులకు అందజేయగలుగుతున్నాయి. ఉదాహరణకు 80ల కంటే ముందు ఆంధ్రజ్యోతి దినపత్రికలో సాహిత్య వేదిక ఆదివారం అనుబంధంలో ఒక భాగంగా మాత్రమే ఉండేది. 80వ దశకంలో మొదట్లో అది ప్రతి సోమవారం నాడు ఒక ప్రధానవ్యాసం , ఒక సమీక్ష , మరి కొన్ని శీర్షికలు కలుపుకుని ఇతర సాంస్కృతిక అంశాలతో పాటుగా వెలువడేది. క్రమేణా అది ఒక పూర్తి పేజీ స్థాయిని అందుకుంది. ఈ దశలో ఒక ప్రధాన వ్యాసం, ఒక కవిత, కొన్ని సమీక్షలు, ఇతర శీర్షికలు, ఒక కాలమ్( ఇవన్నీ సాహిత్య సంబంధమైనవే) ఈ పేజీలో ఉండేవి. అలాగే మిగతా దినపత్రికలు కూడా ఈ ధోరణిని ఒక సంప్రదాయంగామలుచుకున్నాయి.

దినపత్రికల్లో సాహిత్య అనుబంధాల స్వరూపం మనకు ఈ దశాబ్దంలోనే కనిపిస్తుంది. పూర్వకాలం నాటి విడివిడి సాహిత్య పత్రికలకు అనేకరెట్లు ఎక్కువైన సాహిత్య సేవను ఈ పత్రికలు అందించాయి. సాంప్రదాయికమైన రచనావిధానంలో కూడా మార్పు వచ్చింది. ముఖ్యంగా ప్రధానవ్యాసాలలో ప్రచురించే రచనలు స్వభావరీత్యా మార్పునకు గురయ్యాయి. సమకాలీన సాహిత్య అంశాలకు విశేషమైన ప్రాధాన్యం దక్కింది. అలాగే ఆధునిక రచయితలతో ఇంటర్వ్యూలు, అనేకరకాల ఫీచర్లు ప్రారంభమయ్యాయి. దాదాపు ప్రతి దినపత్రికా ఒక పూర్తి పేజీని సాహిత్యానికి కేటాయించింది.

## డి. డైలీ సీరియల్స్‌కు ప్రాముఖ్యం:

వార, మాస పత్రికలకు మాత్రమేపరిమితమైన డైలీ సీరియల్స్ ఈ దశాబ్ది నుంచీ దినపత్రికల్లో కూడా ప్రాధాన్యాన్ని సంపాదించుకున్నాయి. డైలీ సీరియల్స్ ద్వారా పాపులర్ రచయితలు కూడా దినపత్రికల్లో కనిపించడం మొదలైంది. యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది వెంకటకృష్ణమూర్తి, చల్లా సుబ్రహ్మణ్యం లాంటి రచయితల డైలీ సీరియల్స్ వివిధ దినపత్రికల్లో వెలువడ్డాయి. సాధారణ వారపత్రికల్లో మాదిరిగానే దినపత్రికల్లో కూడా రచయితలతో ముఖాముఖీ లాంటి పాపులర్ ధోరణులు దినపత్రికల్లో ప్రచురించసాగారు. అయితే సాహిత్య విలువలున్న ఉత్తమ నవలలు కూడా కొన్ని సందర్భాల్లో ప్రచురితమయ్యాయి. ఉదాహరణకు సి. సుజాత

'సుప్తభుజంగాలు' ఆంధ్రజ్యోతి దినపత్రికలో సీరియల్‌గా వెలువడినదే.

## ఇ. ఆదివారం అనుబంధాల్లో సాహిత్యం:

ఈ దశాబ్దంలో ఆదివారం అనుబంధాలు కొత్తరూపాన్ని సంతరించుకున్నాయి. సాధారణ జనజీవనానికి సంబంధించిన అంశాలతో పాటు సాహిత్య సాంస్కృతిక విశేషాలకు తగినంత ప్రాముఖ్యం లభించింది. ప్రతీ ఆదివారం అనుబంధంలోనూ సాహిత్యవ్యాసాలు, కవిత్వం, పుస్తకసమీక్షలు, కథలు తప్పనిసరి శీర్షికలయ్యాయి. ఈ దశాబ్దంలో అనేక సంకలనాలలో చేరిన ఉత్తమ కవిత్వం, కథలు ఆదివారం అనుబంధాల్లో వెలువడ్డవే. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, విశాలాంధ్ర ఆదివారం అనుబంధాల్లో సాహిత్య విలువలకు పెద్ద పీట వేస్తే ఈనాడు లాంటి పత్రికల ఆదివారం అనుబంధాల్లో వివిధ జనాకర్షక శీర్షికలు నిర్వహించారు. అయితే అలాంటి పత్రికల్లో కూడా కథ, పుస్తకసమీక్ష శీర్షికలు తప్పనిసరిగానిర్వహించవలసివస్తోంది. ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధాల్లో సమకాలీన సాహిత్య ధోరణులపై చర్చలు, వాదోపవాదాలు సాగడం ఈదశాబ్దిలో ఒక ప్రధానమైన అంశం. ఉదాహరణకు వచన కవిత్వంపైన ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో, నవలాసాహిత్యం పైన ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలోనూ ఆసక్తికరమైన చర్చలు కొనసాగాయి.

## ఎఫ్. వారం వారం సాహిత్య సంపాదకీయాలు:

1980ల తర్వాత సాహిత్య, సామాజిక రంగాలతో పాటు పత్రికారంగంలో విశేషమైన మార్పులు వచ్చాయి. ఈ దశాబ్దంలోనే వ్యక్తులపై ఎక్కువ సంఖ్యలో సంపాదకీయాలు వెలువడ్డాయి. తెలుగుదినపత్రికల్లో సాహిత్య సంపాదకీయానికి 1980ల్లోనే ఒక సమగ్రమైన ఆకృతి ఏర్పడింది. కొత్త సామాజిక ధోరణులకు తగినట్టుగా ఎప్పటికప్పుడు సాహిత్య పరిణామాలపై వ్యాఖ్యానించడానికి వారం వారం సాహిత్య సంపాదకీయాలు ఒక సంప్రదాయంగా ప్రారంభమయ్యాయి. సాహిత్య సంపాదకీయాలు ఒక ప్రక్రియగా అభివృద్ధి చెందడానికి దినపత్రికల్లో వారం వారం రాసిన సంపాదకీయాలు ఎంతో దోహదపడ్డాయి.

## జి. సమీక్ష కోసం ప్రత్యేక పేజీలు:

ఎలక్ట్రానిక్ మీడియా విస్తృత వ్యాప్తిలోకి వచ్చినప్పటికీ ఈ దశాబ్దిలో పుస్తక ప్రచురణరంగం చాలా అభివృద్ధి చెందింది. సాహిత్య ప్రాధాన్యమున్న పుస్తకాలతో పాటు వివిధ రంగాలకు సంబంధించిన ఇతర రంగాలుకూడా విశేష సంఖ్యలో అచ్చయ్యాయి. ఇక పాపులర్ నవలాసాహిత్యం గురించి వేరే చెప్పనక్కరలేదు. డైరెక్టు నవలలు పెద్ద సంఖ్యలో మార్కెటులోకి ప్రవేశించాయి. దీనితో పాటు సాహిత్యేతర గ్రంథాలు ముఖ్యంగా వైద్యం, మానసికశాస్త్రం, వ్యక్తిత్వ వికాసం లాంటివి మార్కెటులో స్థానాన్ని సంపాదించుకున్నాయి. ప్రచురణరంగమన్నది ఒక పరిశ్రమగా రూపుదిద్దుకుంది. ఈ

సంఖ్యలో దినపత్రికల్లో పుస్తక సమీక్షల కోసం ఒక పూర్తి పేజీని కేటాయించడం కనిపిస్తుంది. దీనితో పుస్తకసమీక్ష అనేది ఒక సమగ్రమైన ఆకృతిని ఏర్పరచుకుంది. ఆంధ్రభూమి దినపత్రికలో 'కితాబు', ఉదయం దినపత్రికలో 'చదువు' శీర్షికలు పుస్తక సమీక్షకు కేటాయించబడినవే. అయితే ఈ సంప్రదాయం ఎక్కువకాలం కొనసాగకపోవడం గమనించాల్సినవిషయం. కానీ సాహిత్యపరంగా అనేకమంది కొత్త సమీక్షకులు, విమర్శకులు రావడంతో ఈ శీర్షికలకు విశేష ప్రాధాన్యం లభించింది.

## హెచ్. అనుదిన కార్టూన్ కవిత్వం:

సమకాలీన రాజకీయ సంఘటనలపై కవిత్వరూపంలో వ్యాఖ్యానాలు చేయడం తెలుగు పత్రికారంగంలో సాధారణమే కానీ అదొక అనుదిన ఆనవాయితీగా మారింది మాత్రం ఈ దశాబ్దంలోనే. ఈ శీర్షికల్లో సమకాలీన రాజకీయ, సామాజిక వార్తా విశేషాలపై ఎప్పటికప్పుడు చమత్కార బాణాలు బలమైన వ్యంగాస్త్రాలు విసరడం కనిపిస్తుంది. ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఉదయం దినపత్రికల్లో మొదటి పేజీల్లో ఇది విధిగా కనిపించే శీర్షికగా మారింది. గజ్జెల మల్లారెడ్డి, దేవీప్రియ, 'నిజం', రాంభట్ల కృష్ణమూర్తి లాంటికవులు ఈ శీర్షికల నిర్వహణలో కొత్త ప్రయోగాలు చేసి చూపించారు. అలాగే ఆంధ్రజ్యోతి హైదరాబాద్ ఎడిషన్ వరకు అలిశెట్టి ప్రభాకర్ 'సిటీలైఫ్' మరో కవితా ప్రయోగం.

## ఐ. పెరిగిన సాహిత్య శీర్షికలు :

1980- 90 ల మధ్య దినపత్రికల్లో సాహిత్య శీర్షికలకు ప్రాధాన్యం పెరిగింది. సాహిత్య పేజీల్లోనూ, ఆదివారం అనుబంధాల్లోనూ సాహిత్య శీర్షికలు ప్రముఖమైన స్థానాన్ని సంపాదించుకోవడమే కాకుండా సమకాలీన సాహిత్యరంగం మీద వాటి ప్రాధాన్యం ఎంతో కనిపిస్తుంది. ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో దీర్ఘకాలంపాటు నడిచిన శీర్షిక 'చేరాతలు'. ప్రసిద్ధ భాషాశాస్త్రవేత్త చేకూరి రామారావు ఈ శీర్షిక నిర్వహించారు. ఆధునిక కవిత్వాన్ని సామాజిక, భాషాశాస్త్ర దృక్పథం నుంచి విశ్లేషించే ప్రయత్నం జరిగింది. అలాగే కొత్త తరం కవులు ,కవయిత్రులపైన పరిచయాలతో కూడిన విశ్లేషణావ్యాసాలు చేరాతల్లో పేర్కొనదగినవి. అదే సమయంలో ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో కూడా టివిల్ కాంతారావు కలాలు- సంకలనాలు శీర్షిక వెలువడింది. ఆధునిక సాహిత్య వికాసంలో మేలు మలుపులుగా చెప్పుకోదగిన అనేక కథలు, కవిత్వం సంకలనాలను ఈ శీర్షిక ద్వారా టివిల్ కాంతారావు విశ్లేషించారు. జి.వి. సుబ్రహ్మణ్యం 'సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు' శీర్షిక అనేక వారాలపాటు నిర్వహించబడింది. తెలుగులో ప్రక్రియాపరమైన విమర్శకు నాందిపలికిన శీర్షిక ఇది. ఇక వేరు వేరు రచయితలు నిర్వహించిన శీర్షికలు కొన్ని ఈ దశాబ్దిలో గమనించవచ్చు. ఆంధ్రజ్యోతి సాహిత్యవేదికలో నేపథ్యం, ఉదయం ఆదివారం అనుబంధంలో సంతకాలు, ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం 'జ్ఞాపకాలు' శీర్షిక పేర్కొనదగినవి.

నేపథ్యం శీర్షిక అనేక మంది సుప్రసిద్ధ కవులు, రచయితల సాహిత్య జీవనక్రమాన్ని సాధారణ పాఠకులను సైతం ఆకట్టుకునేలా వివరించారు. ఇస్మాయిల్, శివారెడ్డి వంటి కవులు కేశవరెడ్డి, పతంజలి వంటి వచన రచయితలు ఈ శీర్షికలో విలువైన రచనలు చేశారు. 'సంతకాలు' శీర్షిక భాషా సాహిత్య రంగాలలో సుప్రసిద్ధులైన అనేక మంది రచయితల విశిష్ట పరిచయ వేదిక. సమకాలీన సాహిత్యరంగంలో ఉన్న ప్రసిద్ధుల గురించి ప్రసిద్ధులే రాసిన పరిచయ వ్యాసాలు ఈ శీర్షిక కింద చూడవచ్చు. ఈ దశాబ్దం ప్రధానంగా సాహిత్య శీర్షికల విజయాన్ని సూచిస్తుంది. దినపత్రికల్లో వెలువడే విమర్శవ్యాసాలు ప్రామాణికంగా రూపుదిద్దుకోవడానికి ఈ కృషి ఎంతగానో తోడ్పడింది.

## జె. ఇతర పేజీల్లో సాహిత్యం:

ఈ దశాబ్దంలో దినపత్రికల్లో ప్రత్యేక పేజీల సాంప్రదాయం మొదలైంది. ప్రతి దినపత్రికలోనూ వివిధ రంగాలకు ప్రత్యేకంగా ఒక స్పెషల్ పేజీని కేటాయించడం ఒక కొత్త పరిణామంగా గుర్తించవచ్చు. ఈ విధంగా ప్రాధాన్యం సంతరించుకున్నవాటిలో మహిళల పేజీలు ముఖ్యమైనవి. ఆంధ్రజ్యోతి దినపత్రిక 'స్త్రీశక్తి', ఈనాడులో 'వసుంధర', ఉదయంలో 'మానవి' స్త్రీలకోసం ప్రత్యేకంగా వెలువడిన పేజీలు. స్త్రీశక్తి పేజీలో స్త్రీవాద ఉద్యమానికి సంబంధించిన తొలి సాహిత్య కృషిని గుర్తించవచ్చు. ఉద్యమానికి సృజనాత్మకమైన తోడ్పాటును అందించిన అనేక రచనలు ఈపేజీల క్రింద వెలువడ్డాయి. కథలు, కవిత్వంతో పాటు ఈ పేజీ క్రింద ప్రచురితమైన శీర్షికలు (ఉదా: కఠోరషడ్జమాలు) కూడా విశేషించి పేర్కొనదగినవి. ఈనాడువసుంధరలో ప్రతీవారం ఒక కథ ప్రచురితమయ్యేది. ఉదయం 'మానవి' లో కూడా సాహిత్య సంబంధమైన విశేషాలు, అనువాద కవిత్వం ఎక్కువగా ఉండేది. వివిధ దినపత్రికల్లో యువతరానికి సంబంధించిన శీర్షికల్లో కథానికలు, కవిత్వం వెలువడేవి.

## కె. బాలసాహిత్యం:

సాధారణ మార్కెటులో బాలల సాహిత్యం ఏ మాత్రం విలువ లేని స్థితిలో తెలుగు దినపత్రికల్లో బాలల సాహిత్యం తగినంత ప్రాముఖ్యాన్ని సంపాదించుకుంది. విశాలాంధ్ర దినపత్రికలో మొదటి నుంచీ 'చిన్నారిలోకం' వంటి శీర్షికలు కనిపిస్తాయి. ఆ తర్వాతి కాలంలో వివిధ దినపత్రికలన్నీ ఆదివారం అనుబంధాల్లోనూ, మిగతా రోజుల్లో బాలసాహిత్యానికి స్థానం కల్పించాయి.

## ఎల్. సాహిత్య వార్తావిశేషాల ప్రాధాన్యం:

1980 నుంచి 90 వరకు తెలుగు సాహిత్యంలో అనేక ముఖ్యమైన పరిణామాలు, సంచలనాలు జరిగాయి. రచయితల ఉద్యమాలకు, సాహిత్య ధోరణులకు సంబంధించిన అనేక అంశాలు చర్చలకు దారితీశాయి. వీటికి సంబంధించిన అంశాలు దినపత్రికల్లో వార్తా ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. ప్రసిద్ధ రచయితలు, కవులకు

గొప్ప సత్కారాలు లభించినప్పుడు ఆయా రచయితల సాహిత్య కృషిని వివరించే అంశాలు కూడా వార్తల్లోకి ఎక్కాయి. ప్రముఖులు అస్తమించినప్పుడు వాటిని మొదటిపేజీల్లో ప్రముఖంగా ప్రచురించడం కనిపిస్తుంది. ఉదా: చలం, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి.

## ఎం. సాహితీలేఖలు:

ఈ దశాబ్దంలో సాహిత్య రంగానికి ప్రతి దినపత్రిక ఒక ప్రత్యేక పేజీని కేటాయించడంతో పాఠకులు, రచయితల ప్రతిస్పందనలు తెలియజేసే లేఖల ప్రచురణకు ఇదివరకెన్నడూ లేని ప్రాముఖ్యత ఏర్పడింది. చాలా సందర్భాల్లో ఈ లేఖలు సాహిత్య వివాదాల్లో కొత్త చర్చనీయాంశాలను తీసుకువచ్చాయి. వీటిలో రెండురకాల లేఖలు కనిపిస్తాయి. ఒకటి పాఠకుల వైపు నుంచి వచ్చిన ఉత్తరాలు, రెండు రచయితల వైపు నుంచి వచ్చి ఉత్తరాలు. పాఠకుల నుంచి వచ్చిన ఉత్తరాలు సాధారణంగా ప్రతిరోజూ ప్రచురించే 'లేఖలు' శీర్షికల్లో వెలువడేవి. ఇవి కాక సాహిత్య పేజీల్లో ప్రతిస్పందనగా ప్రచురించబడేవి. రచయితలవైపు నుంచి వచ్చిన ఉత్తరాల్లో పేర్కొనదగినవి. ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో ప్రచురించబడిన 'శేషేంద్ర లేఖలు' అనే శీర్షిక.

పాదసూచిక :

1. చేకూరి రామారావు, 'ఆధునిక తెలుగుకవిత్వంలో రెండు దశాబ్దాలు', మనలో మనం- సామాజిక అభివృద్ధి తీరుతెన్నులు, గౌ. సంపాదకులు : కాళీపట్నం రామారావు, సాగర గ్రంథమాల, విశాఖపట్నం ప్రచురణ, సెప్టెంబరు, 1990.

★★★

# ii. ప్రధాన వ్యాసాలు

1980 తరువాత సాహిత్యరంగంలో వచ్చిన పరిణామాలు, కొత్త భావనల ప్రభావం పత్రికల సాహిత్య స్వభావాన్ని గుణాత్మకంగా మార్చింది. సాహిత్యరంగంలోని వివిధ ప్రక్రియల్లో మౌలికమైన పరివర్తన రావడంతో సాహిత్య స్వభావ, ప్రభావాల గురించి కొత్త నిర్వచనాలు అవసరమయ్యాయి. కొత్త సాహిత్య ప్రమాణాల్ని విశ్లేషించడానికి విమర్శపరంగా కొత్త సాధనాలను సమకూర్చుకునే ప్రయత్నం 1980 తరువాత బలంగా కనిపిస్తుంది. వివిధ పత్రికల సాహిత్య అనుబంధాలలో ప్రచురితమైన ప్రధాన వ్యాసాల్లో వీటికి సంబంధించిన అంశాలు చర్చించబడ్డాయి. ఈ కారణంగానే అంతకుముందు దశాబ్దం పత్రికల్లో ప్రచురితమైన ప్రధాన వ్యాసాలకు ఈ దశాబ్దంలో వెలువడిన ప్రధాన వ్యాసాలకు మౌలికంగా అంతరాలు కనిపిస్తాయి. ఇంతకుముందు సాహిత్యంలో వ్యక్తమయ్యే వాస్తవికతకు కొన్ని పరిమితులుండేవి. రాజకీయ, ఆర్థిక పరిణామాలే సాహిత్య వస్తు రూపాలని నిర్దేశిస్తాయనే అభిప్రాయం వుండేది. '' ఆర్థిక పరిణామాల ఆధారంగా సాహిత్య పరిణామాన్ని పరిశీలించడం అత్యంత శాస్త్రీయమైనది, సమంజసమైనది'' అని భావించేవారు. [1] లేదంటే వామపక్ష సాహిత్య సిద్ధాంతాల వల్ల వచ్చిన వాస్తవికవాద భావజాలం విమర్శల్లో వ్యక్తమయ్యేవి. సోషలిస్టు వాస్తవికత గురించి వచ్చిన విమర్శా వ్యాసాలు దీనికి ఉదాహరణ. [2] వీటికి పూర్తి భిన్నంగా సాహిత్యంలో కొత్త జీవన వాస్తవికత ప్రతిబింబిస్తున్నట్లు పత్రికల్లో వచ్చిన సాహిత్య విమర్శ వ్యాసాలవల్ల అర్థమవుతోంది. సాహిత్యకారుడికి వాస్తవ జీవితం ముడిసరుకు మాత్రమేనన్న అభిప్రాయం బలపడసాగింది. ''సాహిత్యకారుడికి వాస్తవ జీవితం ముడిసరుకు మాత్రమే. ఉత్పాదకం కాదు. పునాది మాత్రమేభవనం కాదు. భవనానికి ఒక నిర్ణీత, శైలి, అలంకారాలు, ఇతర సామాగ్రి వుండాలి. వాస్తవికతలాగే సహజత్వం కూడా ఆదర్శం కాదు. సాహిత్య పఠనానుభవం చెట్లమీద, గుహల్లోను జీవిస్తున్నట్టుకాక, అందమైన భవనంలో జీవిస్తున్న అనుభూతి ఇవ్వాలి''. [3] కాలానుగుణంగా వచ్చే మార్పులు వాస్తవికతకు సంబంధించిన ఎన్ని భిన్న కోణాలను ఆవిష్కరిస్తాయో విమర్శకులు గుర్తిస్తున్న దశ ఇది. కేవలం వాస్తవికతకు సంబంధించిన ఉపరితల అంశాల

మాత్రమకాకుండా వాస్తవికతను సునిశితంగా శోధించే గాఢమైన అనుభూతి కోణాన్ని కూడా ఈ విమర్శా వ్యాసాలు చర్చిస్తున్నాయి.

అత్యాధునిక సాంకేతిక పరిణామాలను సైతం ఈ దశాబ్ది సాహిత్య విమర్శకులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. సామాజిక వ్యవస్థతోపాటు సాంకేతిక వ్యవస్థ తీసుకువచ్చే మార్పులు సాహిత్యాన్ని ఏ మేరకు నిర్దేశిస్తాయో ఈ విమర్శకులు విశ్లేషిస్తున్నారు. ఎప్పటికప్పుడు వచ్చే మార్పులను ప్రతిబింబిస్తూ సాహిత్య వస్తురూపాలు మౌలికంగానే మారడం ఒక ప్రధాన అంశంగా ఈ సాహిత్య చర్చల్లో కనిపిస్తుంది. ''సాంకేతిక సమాజం తారాస్థాయినందుకున్నప్పుడు సాహిత్యం ఎలా వుండబోతుంది? విలువలు ఎలా మారబోతున్నాయి? సాహిత్యానికి నేడున్న ప్రతిపత్తి నిలబడుతుందా? అనే ప్రశ్నలు అందరినీ సహజంగానే వేధిస్తాయి. సాహిత్యం త్రికాల బాధితంగా ఛందస్సులోనే వుంటుందని భావించడం ఎంత తప్పయిందో ఇలాగే వుంటుందని మన సమకాలీనులు భావించినా అంతే తప్పవుతుంది''. [4]

ముఖ్యంగా కవిత్వ విమర్శరంగంలో ఈ పరిణామాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. కవిత్వంలో వ్యక్తమయ్యే వాస్తవికత స్వభావమే పూర్తిగా మారిపోయిందని ఈ దశాబ్ది సాహిత్య విమర్శకులు చెప్తూ వచ్చారు. అంతకుముందు 70లలో ప్రచారం ఒక ముఖ్య లక్షణమైతే 80లకు వచ్చేసరికి కవిత్వంలో ఆ ధోరణి వెనక్కి తగ్గిపోయింది. అనుభవ గాఢతను ప్రధానాంశంగా భావించడం మొదలైంది. ''సూటిగా ఉపదేశం చేయటం మితబోధకుల పని. సంఘ సంస్కర్తలూ, రాజకీయవేత్తలూ తమ సందేశాలు సూటిగా అందిస్తారు. కాని సాహిత్యం అందించే సందేశాలు ఏటవాలుగా వుంటాయి. చేదు మాత్రలకు పంచదార పూత వేసినట్లుంటాయి. తేనెలో రంగరించినట్లుంటాయి'' [5]

సాహిత్య స్వభావంతోపాటు, ఆధునిక, సామాజిక అంశాలు కూడా తిరిగి కొత్త సాంస్కృతిక, సాహిత్య నేపథ్యంలో మారుతూ వచ్చాయి. ఈ క్రమంలో ఆధునికతకు కొత్త నిర్వచనాన్ని అన్వేషించే ప్రయత్నం జరిగింది. '' ఆధునికత స్వతస్సిద్ధమైనది, తొలగించడానికి వీలుకానిది ఆధునిక మానవుడి జీవితంలో, ఆధునిక ప్రపంచగమనంలో సంకీర్ణత బలమైన లక్షణంగా వుంది. ప్రాచీన ప్రపంచానికి దేనికి ఎక్కడా పోలికలేదు. ఆధునిక కవిత్వపు ఆకృతిని సరూపం (Organic form) నిరూపం (Abstract form) అని రెండు రకాలుగా దర్శించవచ్చును. సహజ నియమాలతో, నూతన కల్పనలతో ఉద్యమించి వస్తువును, నిర్మాణ పథకాన్ని సమగ్రంగా ఐక్యం చేసేది సరూప నిర్మితి''. [6] సమకాలీన కవిత్వరంగంలో వచ్చే మార్పులు గత సాహిత్య పరిణామాలలో ఏ విధంగా ముడిపడి వుంటాయో కొందరు విమర్శకులు విశ్లేషించారు. కొత్తగా వచ్చే మార్పులు సంపూర్ణంగా కొత్తది కాదని అందులో సాంప్రదాయ సంబంధిత అంశాలు కొన్ని వుంటాయని వీరు భావించారు. ''తెలుగు కవిత్వంలోని ఒక ముఖ్య లక్షణం దాని అవిచ్ఛిన్నత (కంటిన్యుటీ). గత సంస్కృతితో పూర్తి విచ్ఛేదనం (బ్రేక్ విత్ ది పాస్ట్) తెలుగు కవిత్వంలో ఏ దిశలోనూ కన్పించదు. ఈ అవిచ్ఛిన్నత పునాదులు

భారతీయ సంస్కృతిలోనే వున్నాయి. వాటిని మొదటగా గుర్తించిన వ్యక్తి దామోదర్ ధర్మానంద్ కోశాంబి''[7] వర్తమాన సాహిత్య సందర్భాన్ని అర్థం చేసుకోవడానికి గతంలోని రచయితలు, కవులు వారి సాహిత్య కృషికి దోహదపడతాయన్న అభిప్రాయం కొందరు విమర్శకులు వ్యక్తం చేశారు. సమకాలీన సాహిత్యంలో ప్రతిబింబిస్తున్న సంక్లిష్టత రూపవైవిధ్యం గతంలోని కొందరు రచయితలు ప్రయోగించారన్న నిదర్శనాలు కూడా వీరు చూపిస్తున్నారు. ''సాహిత్యానికి ప్రచార ప్రయోజనమే వుండాలని వాదించేవాళ్ల అంగీకరించినా, అంగీకరించకపోయినా తెలుగు కవిత్వంలో ఆధునిక జీవనతత్త్వం సరిగా పట్టుకోగలిగింది నారాయణబాబే. ఇటీవలి కాలంలో తెలుగు కవిత్వాన్ని శాసిస్తున్న కొత్త ధోరణుల వేళ్లు నారాయణబాబు కవిత్వంలోనే ఉన్నాయి.[8] అయితే కవిత్వపరంగా వాస్తవికతకు సంబంధించిన అనుభూతి బలంగా వ్యక్తమవడం ఈ దశాబ్దిలో ప్రధాన ధోరణి. సాహిత్యానికి రాజకీయార్థిక భూమికను అంగీకరిస్తూనే అనుభవ వ్యక్తీకరణలో అనేక ప్రయోగాలకు ఈ దశాబ్దిలో అవకాశం పెరిగింది. అనుభూతిని ఒక ప్రత్యేక వాదంగా భావించేంతవరకు ఇంతవరకు ఈ ప్రయోగధోరణి విస్తరించింది. అయితే దీనిని ఒక ప్రత్యేక వాదంగా పరిగణించాల్సిన అవసరం లేదని విమర్శకులు భావించారు. ''కవిత్వంలో అనుభూతిని ఒక ప్రత్యేకవాదంగా పరిగణించవలసిన అవసరం ఏమీలేదు. కవిత్వమంతా అనుభూతికి చెందినదే. కాకపోతే ఎవడి అనుభూతి వాడిది. మరి ఏది మంచి, ఏది చెడు అంటే మనుషులందరినీ ఏకం చేసేదేదైతే వుందో అది మంచి, మనుషుల్ని విడదీసేదేదైతే వుందో అది చెడు, దానికి, దీనికి కూడా కొన్ని సిద్ధాంతాలు ఆధార భూమికలైతే తప్పదు''.[9]

సాహిత్య విమర్శలో పెరిగిపోతున్న పెడధోరణులను నిష్కర్షగా విమర్శించే ప్రధాన వ్యాసాలు ఈ దశాబ్దంలో ప్రధానాంశంగా కనిపిస్తాయి. సాహిత్యానికి, చరిత్రకు మధ్య వుండే సంబంధాలను విశ్లేషించే రచనలు వెలువడ్డాయి. సాహిత్యాన్ని విశ్లేషించే సాధనాలతోపాటు వక్రీకరించే ధోరణులపట్ల గుర్తింపు కూడా ఈ దశాబ్దంలో కనిపిస్తుంది. తెలుగు విమర్శలో ఇటీవలి పెడధోరణుల గురించి వల్లంపాటి వెంకటసుబ్బయ్య ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో ఒక ప్రధాన వ్యాసం రాశారు. వర్తమాన సాహిత్య విమర్శకు సంబంధించి అనేక ముఖ్యమైన అంశాలను ఈ వ్యాసం చర్చించింది. సాహిత్య విశ్లేషణతోపాటు వక్రీకరణల్ని కూడా ఆయన ఈ వ్యాసంలో చర్చకు తీసుకువచ్చారు. ''సాహిత్యంలాగే సాహిత్య విమర్శ కూడా చరిత్రలో ఒక భాగం. ఇవి రెండూ కూడా చరిత్రకు విధేయులుగానే వుంటూ చరిత్రను నిర్మిస్తాయి. కనీసం నిర్మించడానికి దోహదం చేస్తాయి. కాబట్టి సాహిత్యాన్ని వక్రీకరించే విమర్శ చరిత్రకూ, చరిత్రను వక్రీకరించే విమర్శ సాహిత్యానికీ ద్రోహం చేస్తాయి. ఇవి రెండు కూడా పెడధోరణులే.[10] మరొకవైపున తెలుగు సాహిత్య విమర్శ స్థితిని ప్రశంసిస్తూ వివిధ వ్యాసాలు ఈ దశాబ్ది దినపత్రికల్లో కనిపిస్తాయి. తెలుగు విమర్శలో తలెత్తుతున్న కొత్త ధోరణుల్ని విశేషంగా భావిస్తూ కొందరు విమర్శకులు వ్యాసాలు రాశారు. ఉదాహరణకు

ఉదయం దినపత్రికలో 'తెలుగు సాహిత్య విమర్శ తేజరిల్లుతోంది' అనే శీర్షికన టి.యల్.కాంతారావు రాసిన వ్యాసంలో ఇలా అంటారు. ''తెలుగు విమర్శ నిస్సందేహంగా పురోగమిస్తున్నది. అందుకు ఉదాహరణగా ఇప్పుడొస్తున్న గ్రంథబాలాన్నంతా ఇక్కడ క్రోడకరించటం దుస్సాధ్యం. మరొక్కమాట చెప్పాలి. విమర్శ పురోగతికి అధోగతికి కూడా ఇప్పుడొస్తున్న పరిశోధక గ్రంథాలు కొంతవరకు కారణమవుతున్నాయి''. [11]

1980 తరువాత మార్క్సిస్టు సాహిత్య విమర్శను అనుకూలంగానూ, ప్రతికూలంగానూ విశ్లేషించే ధోరణి వివిధ వ్యాసాల్లో కనిపిస్తుంది. మార్క్సిస్టు సాహిత్య విమర్శ ప్రవేశపెట్టిన వివిధ అంశాలను గతంలో మాదిరిగా యథాతథంగా స్వీకరించడం మాత్రమే కాకుండా ప్రశ్నించే ధోరణి మొదలైంది. అందువల్ల మార్క్సిస్టు సాహిత్య విమర్శకుల్లో తమ ధోరణిని సమర్థించుకునే వ్యాసాలు అధికంగా కనిపిస్తాయి. ఉదాహరణకు 'సాహిత్యంలో శత్రువు' అనే శీర్షికన ఆంధ్రభూమి దిన పత్రికలో చందు సుబ్బారావు రాసిన వ్యాసంలో మార్క్సిస్టు సాహిత్య తత్వానికి సంబంధించిన మౌలికమైన అంశాలను తిరిగి చర్చకు తీసుకువచ్చారు. ''శత్రువును గుర్తించిన అనంతరం రచయిత అతడి పైశాచిక రూపాన్ని సులభంగా, సున్నితంగా విడమరిచి చూపాలి తప్ప సమాజంకంటే సంక్లిష్టమైన పద్ధతిని ఎంచుకోరాదు. అలా ఎంచుకొన్న తక్షణం శత్రువు కనుమరుగవుతాడు. గాలిలో యుద్ధం చేసినట్లవుతుంది. శత్రు నిర్ధారణలో రచయిత కర్కశమైన, కఠోరమైన నిష్పాక్షిక సదాగ్రహ దృష్టి అన్నింటికంటే అత్యవసరం.[12] దీనితోపాటు గతంలో వివిధ సందర్భాల్లో మార్క్సిస్టు సాహిత్య తత్వానికి బలాన్నిచ్చిన సంఘటనల నేపథ్యంలో వచ్చిన సాహిత్యాన్ని పునః విశ్లేషించే ప్రయత్నం జరిగింది. ముఖ్యంగా విశాలాంధ్ర, ప్రజాశక్తిలాంటి పత్రికల్లో ఈ విధమైన సాహిత్య వ్యాసాలు అధికంగా కనిపిస్తాయి. ఉదాహరణకు 'వీర తెలంగాణా సాయుధ విప్లవ పోరాట కాలంలో ''నీ గోరికడతాం కొడుకో నైజాం సర్కారోడో'' అనిగొంతెత్తి పాడినందులకు ఆ పాట కవియైన యాదగిరిని కాల్చి చంపారు''. [13] అలాగే మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతాలతో పొసగని కవులు, విమర్శకులు కూడా వాటికి సంబంధించిన విషయాలను చర్చించడం ఈ దశాబ్దంలో కనిపించే మరో ముఖ్య లక్షణం. ''మార్క్సిస్టు సాహిత్య సిద్ధాంతానికి మూల సూత్రాలైన ప్రవచనాలు మూడున్నాయి. ఇందులో రెండు ఏంగిల్స్ రాసిన ఉత్తరాల్లోనూ, మూడోది లెనిన్ వ్యాసంలోనూ లభ్యమవుతాయి. 1885లో మిన్నాకాట్స్కీకి, ఏంగెల్స్ రాసిన ఉత్తరాలను చూస్తే ఈ విషయం అర్థమవుతుంది.'' [14] తెలుగు సాహిత్య మార్క్సిస్టు విమర్శకులు మార్క్సిస్టు సాహిత్యాన్ని గురించి కల్పించిన అపోహల్ని తొలగించే ప్రయత్నంలో భాగంగా ఇలాంటి విమర్శా వ్యాసాలు ఈ తరహా కవులు, విమర్శకులు వెలువరించారు.

సాహిత్యపరంగా మానవీయ విలువల విశ్లేషణ కూడా ఈ దశాబ్ది ప్రధాన వ్యాసాల్లో ఒక ముఖ్య లక్షణం. సాహిత్యానికి మొత్తంగా మానవ ప్రపంచంలో, సంస్కృతిలో వున్న

సంబంధాలను అన్వయిస్తూ వెలువడిన వ్యాసాలు ఈ దశాబ్దిలో కనిపిస్తాయి. ''ఈ నాటి సాహిత్యంలో మనిషికి మానవత్వానికి ఏ ప్రాధాన్యత లేకుండా పోవటం మనిషి మనిషికి మధ్య మిథ్యాడంబరాలు కృత్రిమమైన మానవతా విలువలు ధ్వంసం కాబడటం నిజంగా ఈ పరిణామం అలక్ష్యం చేయరానిది. దీని ఫలితం ఇప్పటికీ యువతరంపై పనిచేస్తూ వ్యక్తికి సమాజానికి ఉండే సంబంధం పట్ల వ్యక్తికి వ్యక్తికి మధ్య వుండే సంబంధాల పట్ల సరైన అవగాహన లేకుండా చేస్తూ వ్యక్తుల మధ్య వుండే సజీవ సంబంధాలకు సమాధి కడుతున్నదనటంలో సందేహంలేదు. [15]

సాహిత్యంలో వివిధ వర్గాలపట్ల రచయితల దృష్టిని విశ్లేషించే ధోరణి కూడా ఈ దశాబ్దంలో కనిపిస్తుంది. ముఖ్యంగా స్త్రీవాద దృక్పథం నేపథ్యంగా వర్తమాన సాహిత్యాన్ని కొత్తగా విశ్లేషించే విమర్శ సాధనాలు ఈ దశాబ్దిలో సమకూరినట్లుగా కనిపిస్తుంది. సమకాలీన సాహిత్యంలో స్త్రీ పాత్రల చిత్రీకరణ గురించి స్త్రీ సమస్యల గురించి ప్రత్యేకమైన విశ్లేషణలు, విశేషాంశంగా కనిపిస్తాయి. 1980ల తరువాత వెలువడిన వ్యాపార సాహిత్యంలో స్త్రీ పాత్రల గురించి విశ్లేషిస్తూ ఆంధ్రజ్యోతి దినపత్రిక స్త్రీశక్తి శీర్షికన ఒక వ్యాసం వెలువడింది. '' ఇక ఇటీవల విజృంభించిన వ్యాపార సాహిత్యంలో స్త్రీపాత్రలు అర్థంలేని పాత్రలుగా వుంటున్నాయి. వెర్రితలలు వేసిన వ్యాపారధోరణిలో నడుస్తున్నాయి. స్త్రీ సమస్యలు చిత్రణ పేరుతో అశ్లీల అసభ్య సాహిత్యం సృష్టి అవుతోంది. వ్యాపార సాహిత్యంలో స్త్రీ సమస్యలు, పరిష్కారాలు ఎలా చిత్రించబడుతున్నాయో పరిశీలించడానికి మంచి ఉదాహరణ''. [16]

పైకి అభ్యుదయకరంగా కనిపించే సాహిత్యంలోనూ స్త్రీ పాత్రల్ని కించపరిచే ధోరణి ఎలా కొనసాగుతున్నదో విశ్లేషించే వ్యాసాలు కూడా ఈ దశలో వెలువడ్డాయి. ''కొన్ని కథలు, నవలలు చదువుతుంటే ఎంతో అభ్యుదయకరంగా ఉన్నట్లు కనిపిస్తాయి. వాటిల్లోనూ పురుషాహంకారాన్ని సమర్థించే అంశాలను తేలిగ్గానే చూపవచ్చు. ఇటీవలే ఒక మాస పత్రికలో వచ్చిన నవల ఇందుకు ఉదాహరణ, 'పెళ్లంటే కట్నం కోసం కాదు, పిల్లల కోసమూ కాదు. జీతం లేని పనిమనిషి కోసమూ కాదు... ఓదార్పు కోసమంటూ'' చెబుతూనే ఆఫీసులో పనిచేసి అలసిపోయి వచ్చిన భర్తకు కాఫీకప్పుతో ఎదురై భార్య సేదతీర్చాలని రచయిత సందేశమూ ఇస్తాడు''. [17]

విమర్శపరంగా అనేక కొత్త అంశాలపై దృష్టిసారించే తత్త్వం 1980ల తరువాత సాహిత్య వాతావరణంలో కనిపిస్తుంది. భిన్న కోణాల నుంచి సాహిత్యాన్ని విశ్లేషించే విశాల దృష్టి ఈ దశాబ్దంలో ఏర్పడిందనటానికి దినపత్రికల్లో వచ్చిన ప్రధాన వ్యాసాలే నిదర్శనం.

## *1. 'చలం, శ్రీశ్రీ' లపై ప్రత్యేక వ్యాసాలు :*

తెలుగు సాహిత్యంలో రెండు ప్రక్రియల్లో సంచలనాలను సృష్టించిన శ్రీశ్రీ, చలం ఈ దశాబ్దంలోనే కన్నుమూసారు. ఆ ఇద్దరు మహారచయితల సాహిత్య విశ్లేషణ గురించి

వారి వారి వ్యక్తిగత అభిరుచుల గురించి దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో అసంఖ్యాకంగా వ్యాసాలు వెలువడ్డాయి. ఈ వ్యాసాలు చాలావరకు సాహిత్య విలువలతో కూడుకుని వున్నాయి. చలం, శ్రీశ్రీలపైన వచ్చినన్ని వ్యాసాలు బహుశా మరే రచయితపైన వచ్చి వుండవు. ఈ వ్యాసాల్లో కొన్ని ఆయా రచయితలను కేవలం పరామర్శించినవి మాత్రమే కాకుండా భిన్నమైన దృక్పథంతో విశ్లేషించినవీ వున్నాయి. ముఖ్యంగా చలాన్ని గురించి వచ్చిన వ్యాసాల్లో ఈ వైవిధ్యం అధికంగా కనిపిస్తుంది. మార్క్సిస్టు దృక్పథంతో చలాన్ని విశ్లేషించిన విమర్శకుల్లో మహీధర రామమోహనరావు ఒకరు. 1986 ఆంధ్రజ్యోతి దినపత్రిక మే 4 సంచికలో 'చలం దృష్టిలో ప్రేమ అంటే' అనే శీర్షికన మహీధర రామమోహనరావు ఒక విమర్శా వ్యాసం రాశారు. చలానికీ, సమాజానికీ పాఠకులకు మధ్యన వున్న సంబంధాన్ని విశ్లేషిస్తూ ఆయన ఇలా అంటారు. ''అంటే ఒక విస్పష్టమైన, సమగ్రమైన అవగాహనతోగాక చలం ఒక ఉద్వేగంతో కొట్టుకుపోయి సంఘంలో ఒక తిరుగుబాటును బోధించారు. దానిని స్వీకరించే స్థితికి సమాజం వచ్చి వుంది. ఆయన కథల్నీ, సాహిత్యాన్ని పత్రికలు వేశాయి. ప్రజలు చదివేరు. చదివారు కనుకనే పత్రికలు వేశాయి''. [18] చలం వివాహ వ్యవస్థపై సాగించిన యుద్ధాన్ని గురించి మహీధర ఒక వ్యాసంలో విశ్లేషించారు. ''స్త్రీల దుస్థితినీ, సాంఘికాచారాల విధి నిషేధాలను ఆయన ప్రధానంగా సెక్స్ కోణం నుంచే వ్యతిరేకించారు. వ్యక్తిత్వం, ఆర్థిక స్వాతంత్ర్యం మొదలైనవానిని ఆలోచించినా, సెక్స్ జీవితానికి సంబంధించిన మేరకే వాని ప్రసక్తి. అందుచేతనే ఆయన ప్రధానమైన దండయాత్ర వివాహ వ్యవస్థమీద'', [19] వివిధ ప్రక్రియల్లో చలం ఒక విశిష్ట రచయితగా సాగించిన కృషిని వివరిస్తూ అనేక వ్యాసాలు వెలువడ్డాయి. 'మ్యూజింగ్స్' చలం సృష్టించిన అపూర్వమైన సృజనాత్మక ప్రయోగం. ఈ ప్రయోగాన్ని గురించి 'చలం పూయించిన కొత్తపూలు' అనే శీర్షికన కె. యస్. రమణ ఒక వ్యాసం రాశారు. చలం మ్యూజింగ్స్‌కు వున్న సామాజిక పరిమితుల్ని కూడా ఈ వ్యాసం పరిశీలనలోకి తీసుకుంది. ''మ్యూజింగ్స్ ప్రక్రియ వస్తురీత్యా ఆనాటి సామాజిక పరిస్థితులను, మార్పును కొంతమేరకు ప్రతిబింబించేదిగా రూపుదిద్దుకుంది. కొంత మేరకు అని ఎందుకనవలసి వచ్చిందంటే ఆ ప్రక్రియ సృష్టికర్త వ్యక్తివాది. కాల్పనికవాది కావడంవల్ల ఆయన అవగాహనకు కొన్ని పరిమితులు వున్నాయి''. [20] చలం వచన రచనల శైలి అత్యంత విశిష్టమైనది. చలాన్ని ఇతర రచయితలకు అందనంత ఎత్తున, శిఖరాగ్రాన నిలిపిన శైలి గురించి విశ్లేషించే వ్యాసాలు వెలువడ్డాయి. ''చలం భావ ప్రభావం అంతా కూడా అతడు చెప్పే వచన రచన తీవ్రతలోను, అంతకన్నా తీవ్రమైన భావవాదంలోను వుంది. చలం సృజనాత్మక రచనలు చదివే పాఠక మనోభావాలపై ప్రభావం చేసి తర్కానికి అంకురార్పణ చేస్తాయి''. [21] చలానికి ఈ వచన శైలి ఎలా ఏర్పడిందన్న అంశంపైన వివిధ విమర్శకుల మధ్య పరస్పర విరుద్ధ అభిప్రాయాలు వుండటం సహజం. ఎందుకంటే అనితర సాధ్యమైన మార్గంలో చలం వచన శైలిని ఏర్పరచుకున్నాడు. ఈ శైలి విదేశ సాహిత్యంలోంచి అలవడిందన్న అభిప్రాయాన్ని పూర్వపక్షంచేసే విమర్శా వ్యాసాలు

కూడా దినపత్రికల్లో కనిపిస్తాయి. ''చలం తాను ఏ రచయితల్నీ, కవుల్నీ ఎడ్మైర్ చేశాడో చాలాచోట్ల చెప్పుకున్నాడు. చలం సాహిత్యానికి అసలు ఫోర్సు జీవితపు నగ్నసత్యాలూ, మానవ హృదయాంతరాళాల్లో రహస్యంగా పనిచేసే సున్నితమైన ప్రోద్బలాలు అనే సంగతి విమర్శకులు ఒప్పుకోలేక కాపీ అని కొట్టిపారేస్తూ వచ్చారు. మళ్లీ వీరంతా చలం శైలిని పొగిడినవారే''. [22]

చలం నుంచి తెలుగు సాహిత్యం అందుకున్న లక్షణాలు చాలా కనిపిస్తాయి. వాటిల్లో కొన్ని ఇతివృత్తానికి సంబంధించినవైతే మరికొన్ని రూపగతమైనవి. ఈ విషయాన్ని చెప్పే రెండు వ్యాసాలు 'చలం గురించి చలం', 'ఇవి చలం చెక్కిన శిల్పాలు', వివాహ వ్యవస్థను ప్రశ్నించడమే కాకుండా చలం సాధించిన ఇతర అంశాలు కూడా ఎన్నో వున్నాయి. ఈ అంశాలు కూడా దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో చర్చకు వచ్చాయి. [23,24]

## *2. శ్రీశ్రీ:*

దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో రెండు మూడు దశాబ్దాలుగా శ్రీశ్రీ పైన లెక్కలేనన్ని వ్యాసాలు వెలువడి వుంటాయి. అయితే 80వ దశకంలో (1983, జూన్ 15) శ్రీశ్రీ కన్నుమూయడంతో ఆ సందర్భంగా అనేక ప్రత్యేక రచనలు వెలువడ్డాయి. వ్యక్తిగానూ, సాహిత్యవేత్తగానూ శ్రీశ్రీకి సంబంధించిన ఎన్నో పార్శ్వాలను శోధించే వ్యాసాలు అనేకం వెలువడ్డాయి. తెలుగు సాహితీ ప్రపంచంలో ఒక జ్వాలాశిఖరంగా శ్రీశ్రీని పేర్కొంటూ విశాలాంధ్ర ఆదివారం అనుబంధంలో వ్యాసం వెలువడింది. ''గురజాడతో తెలుగు కవితతో ప్రారంభమైన నూతన రీతి. ఆధునిక దృక్పథం తదనంతర కవులలో వ్యక్తివాదంగా రూపాంతరం చెంది నానారకాల వికారాలను ప్రతిబించిస్తున్న తరుణంలో సామాజిక చైతన్య స్ఫోరకమైన సాహితీ సృజనలో ఒక కాంతిపథంలా నిలిచాడు శ్రీశ్రీ. [25]

శ్రీశ్రీ సాహిత్యపరంగా బహుముఖమైన వ్యక్తిత్వం కలిగినవాడు. విమర్శ నుంచి కార్టూన్ కవిత్వం దాకా దాదాపు ప్రతీ ప్రక్రియలోను శ్రీశ్రీ తన ప్రత్యేక ముద్రను కనబరిచాడు. విమర్శపరంగా శ్రీశ్రీ తొలి తరం మార్క్సిస్టు విమర్శకుల శ్రేణిలో వుంటాడు. 'తెలుగులో తొలి మార్క్సిస్టు విమర్శకుడు శ్రీశ్రీ' అనే శీర్షికన ఉదయం దినపత్రికలో 1988 లో వెలువడిన ఒక వ్యాసం ఈ అంశాన్ని 'ప్రత్యేకంగా చర్చించింది. 'లక్ష్యప్రకటనలుగా సాగిన శ్రీశ్రీ సాహిత్య విమర్శ తెలుగులో అంతకుముందు లేని విమర్శకు దారులు వేసింది. శ్రీశ్రీ చేసిన సూచనలను వివరిస్తూ అనంతర విమర్శకులు మార్క్సిస్టు దృక్పథ విమర్శను అభివృద్ధి పరచడానికి వీలుంది. [26] అలాగే కవిత్వాన్ని ఒక ఆయుధంగా ప్రయోగించినవాడు శ్రీశ్రీ. అందుకే కార్టూన్ కవిత్వాన్ని కూడా ఆయన మినహాయించలేదు. హాస్య, వ్యంగ్య కవిత్వానికి ఒరవడిగా నిలిచే కవిత్వాన్ని శ్రీశ్రీ రాశాడు. ''మూడు యాభైలు'' అన్న సంపుటం తెలుగులో హాస్య

కవిత్వానికి ఒరవడి. ఇంగ్లీషులో ఆగ్డెన్ నాష్, జేమ్స్ తర్బర్‌లాంటి వాళ్లు చేసిన పనిని తెలుగులో మొదటిసారిగా చేసి ఇక్కడ కూడా మొదటి స్థానంలో నిలబడ్డాడు''. [27]

కవిగా శ్రీశ్రీ అనేక దశలను దాటి వెళ్లాడు. వాటిని విశ్లేషించడానికి అవసరమైన సాధనాలు ఏవీ తెలుగు సాహిత్య విమర్శ సాధించుకోలేకపోయింది. ఈ విషయాన్ని 'చేరాతలు' శీర్షికలో చేకూరి రామారావు ఈ విధంగా ప్రస్తావించారు. ''శ్రీశ్రీ తన కవిత్వం జాతి జనులు పాడుకునే మంత్రంగా మోగాలని ఆశించాడు. ఆ ఆశ ఆయన జీవితకాలంలోనే ఫలించింది. శ్రీశ్రీ వాడిన మాటలు పాతవే అయినా వాటికిచ్చిన స్ఫూర్తి కొత్తది. శక్తి నూతనం. మాటలు కలిపిన పద్ధతి అపూర్వం. ( దీన్ని ఇంగ్లీషులో డిక్షన్ అంటారు) శ్రీశ్రీ కవిత్వానికి ఇప్పుడున్న నిఘంటువులు చాలవు. వ్యాకరణం ఆయన కవిత్వాన్ని అర్థం చేసుకోటానికి పనికిరాదు''. [28]

శ్రీశ్రీ వచన రచనల్లో 'అనంతం' ఒక విశిష్టమైన ప్రక్రియ. దీనిపై చెలరేగిన వివాదం అంతా ఇంతా కాదు. అనంతం వెలువడినపుడు ఆ పుస్తకంపై వచ్చిన సమీక్షలు విమర్శలు మొత్తంగా శ్రీశ్రీ సాహిత్య వ్యక్తిగత జీవితాన్ని మరోసారి తరచి చూసుకునేట్టు చేశాయి. 'అనంతం'పై జరిగిన చర్చల్లో ప్రధానంగా పేర్కొనవలసిన వ్యాసం 'మహాకవి శ్రీశ్రీ కూడా మానవుడు శ్రీశ్రీయే', ''జీవితాన్ని జీవితంగా, వాస్తవాన్ని వాస్తవంగా, అరమరికలు లేకుండా తమ జీవిత అనుభవ శకలాల్ని అల్లి శ్రీశ్రీ నిర్మించుకున్న ఆత్మకథను నేను ఆహ్వానిస్తున్నాను. లోనికి తీసుకుంటున్నాను. మంచీ చెడూ నిర్ణయించమని తన జీవిత పత్రాన్ని విశాల విశ్వం ముందుంచిన శ్రీశ్రీని కాకుండా మనం మరెవరిని గౌరవించాలి?''. [29] శ్రీశ్రీని వివాదాస్పదంగా మార్చిన మరో రచన 'మరోప్రస్థానం'. మరోప్రస్తానానికి, మహాప్రస్థానానికి మధ్య వున్న వైరుధ్యాలను విశ్లేషించే విమర్శా వ్యాసాలు ఈ సందర్భంగా పేర్కొనదగినవి. మరోప్రస్థానానికి అనుకూలంగానూ, ప్రతికూలంగానూ వాదప్రతివాదాలు సాగాయి. ''మహాప్రస్థానకర్తగానే శ్రీశ్రీ మిగిలిపోయారుగాని 'మరోప్రస్థాన' కర్తగా కాదు. అదే సమయంలో 'మరోప్రస్థానం' కవితలు భూతద్దంలో చూసి, 'మహాప్రస్థాన' మహత్తర స్ఫూర్తిని మరుగుపరుస్తామంటే మనం అంగీకరించలేము. [30]. అయితే కాలానుగుణంగా వచ్చిన మార్పులనుబట్టి మరో ప్రస్థానాన్ని విశ్లేషించాల్సి వుంటుందని భావించిన విమర్శకులూ వున్నారు. ''మహాప్రస్థానాన్ని'' సాహిత్య వికాస క్రమంలో నుంచి మాత్రమే చూడాలి. 'మరోప్రస్థానాన్ని' సాహిత్య, సామాజిక, రాజకీయ, చారిత్రక వికాసక్రమంలో నుంచి చూస్తేగానీ అర్థం చేసుకోలేము. ఈ తరాన్ని ప్రభావితం చేస్తున్నది. 'మరోప్రస్థానమే'గాని 'మహాప్రస్థానం'కాదని నిస్సంశయంగా చెప్పుకోవచ్చు. [31]

నాటికా సాహిత్యంలో కూడా శ్రీశ్రీ తన ప్రయోగాలు చేశారు. మానవ మనస్తత్వానికి సంబంధించిన అంశాలను తెరకెక్కించాలన్న తపన ఈ నాటికల్లో కనిపిస్తుంది. రంగస్థలంపై అలాంటి ప్రయోగాత్మక దృష్టిని విశ్లేషిస్తూ ఒక వ్యాసం ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో 1988లో అచ్చయింది. ''ఆబ్‌స్ట్రాక్ట్ ధోరణిలో సాగిన

'గ్రామ్‌ఫోన్ రికార్డుల తిరుగుబాటు' బీభత్సరస ప్రధానంగా సాగిన 'గుమాస్తాకల' సుప్తచేతనలోని సంఘర్షణ 'మరోప్రపంచం'. మానవత్వం మీద విశ్వాసాన్ని విసర్జించవద్దనే 'గవేషణ' ఇవన్నీ ఒక ఎత్తు అయితే గుండెల్ని పిండిచేసే 'విదూషకుడి ఆత్మహత్య' ఒక్కటీ ఒక ఎత్తు. నిజమైన హాస్యం విషాదంలో నుంచి పుడుతుందని చెప్పడానికి అక్షర ప్రతీక ఈ విదూషకుడు''.[32]

వచనంలోనూ, విమర్శ రూపంలోనూ శ్రీశ్రీ గురించి వెలువడిన రచనలు ఒక ఎత్తయితే కవిత్వ రూపంలోనే శ్రీశ్రీ గురించి కొన్ని రచనలు దినపత్రికల్లో వెలువడ్డాయి. వీటిలో పేర్కొనదగినవి శ్రీశ్రీ కోసం అనే శీర్షికన వెల్చేరు నారాయణరావు రాసిన కవిత., ' ఎక్కుపెట్టిన బాణంలా / ఎగరేసిన జెండాలా / డొక్కచీరే కృపాణంలా / నీ కవిత్వం మాకు వుంది / నువ్వు వేసిన దారి వుంది / అడ్డు వచ్చిన గొడ్డుజాతిని / హతం చేసే శక్తి వుంది / నువ్వు మాకు మార్గానివి / నువ్వు మాకు మార్గగామివి.''[33] శ్రీశ్రీ మార్గాన్ని స్పష్టం చేస్తూ రాసిన కవిత ఇది.

పాదసూచికలు :

1. ఎ.వి.పుల్లారావు, 'సాహిత్యంలో ప్రతిబింబించిన సామాజిక మార్పులు', ప్రజాశక్తి దినపత్రిక, ఏప్రిల్ 22, 1990.

2. ''సోషలిస్టు వాస్తవికతలో చారిత్రకత అంతర్లీనంగా వుంటుంది. వాస్తవాన్ని గురించిన నిర్దిష్ట విషమ పరిజ్ఞానము రచయితకుండాలి. వేరు వేరు సంఘటనలు ఒకదానిలో మరొకటి సంబంధాన్ని కలిగి వుండి చారిత్రక ప్రాధాన్యతను కూడా కలిగి వుంటాయనేది రచయిత తెలుసుకోగలగాలి. ''సమకాలీనత - చారిత్రకత'' అనే రెండు వేరు వేరు కక్ష్యలలో కళాకారుడెప్పుడు తిరుగుతూ వుంటాడు'' - 'చేకూరి శ్రీనివాసరావు', 'సోషలిస్టు వాస్తవికత - ఒక పరిశీలన', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, మార్చి 21, 1982.

3. కె.గోదావరిశర్మ, 'సాహిత్యంలో వాస్తవికత ఎంతవరకు', ఆంధ్రజ్యోతి దినపత్రిక, సోమవారం, ఫిబ్రవరి 12, 1990.

4. చందు సుబ్బారావు, 'రేపటి సాహిత్యం ఏం చేస్తుంది'', ఆంధ్రజ్యోతి దినపత్రిక, సోమవారం, ఫిబ్రవరి 5, 1990.

5. అమరేంద్ర, 'సందేశం కాదు - కవిత్వం ముఖ్యం', ఆంధ్రప్రభ దినపత్రిక, మార్చి 1, 1981.

6. డాక్టర్ యు. ఎ.నరసింహమూర్తి, 'కవిత్వంలో ఆధునికత అంటే', ఆంధ్రప్రభ దినపత్రిక, సాహిత్య ప్రభ, డిసెంబర్ 3, 1990.

7,8. అఫ్సర్, '' ఆధునిక కవిత్వానికి నాంది'', ఆంధ్రజ్యోతి దినపత్రిక,

సోమవారం, ఏప్రిల్ 16, 1990.

9. టి.యల్.కాంతారావు, 'కవిత్వం - అనుభూతి', ఆంధ్రపత్రిక దినపత్రిక శనివారం, జనవరి 11, 1986.

10. వల్లంపాటి వెంకటసుబ్బయ్య, 'తెలుగు విమర్శలో ఇటీవలి పెడ ధోరణులు', ఆంధ్రజ్యోతి దినపత్రిక, సోమవారం జూన్ 4, 1990.

11. టి.యల్.కాంతారావు, 'తెలుగు సాహిత్య విమర్శ తేజరిల్లుతోంది', ఉదయం దినపత్రిక, ఏప్రిల్ 21, 1985.

12. డాక్టర్ చందు సుబ్బారావు, ''సాహిత్యంలో శత్రువు'', ఆంధ్రభూమి దినపత్రిక, మార్చి 17, 1990.

13. ఒక రచయిత, 'సాహిత్యంపై పాలకవర్గం', ప్రజాశక్తి దినపత్రిక ఏప్రిల్ 16, 1989.

14. ఇస్మాయిల్, 'ఇద్దరు భాష్యకారులు' , ఆంధ్రప్రభ దినపత్రిక, ఫిబ్రవరి 8, 1981.

15. ఎస్.ఎస్.లక్ష్మి, ''సాహిత్యంలో మానవత్వం విలువలు'', విశాలాంధ్ర దినపత్రిక, జులై 10, 1983.

16. ఒక రచయిత్రి, ''మధురవాణి నుంచి మందాకిని'దాకా, ఆంధ్రజ్యోతి దినపత్రిక, మే 24, 1988.

17. 'కోకిల', 'స్త్రీపాత్రను దిగజార్చి వేస్తున్న సాహిత్యం', ప్రజాశక్తి దినపత్రిక, నవంబర్ 5, 1989.

18. మహీధర రామమోహన్‌రావు, 'చలం దృష్టిలో ప్రేమ అంటే' ఆంధ్రజ్యోతి దినపత్రిక, మే 4, 1986.

19. మహీధర రామమోహన్‌రావు, 'వివాహ వ్యవస్థపై చలం దండయాత్ర' ఆంధ్రజ్యోతి దినపత్రిక ఏప్రిల్ 27, 1986.

20. డాక్టర్ కె.యస్.రమణ, 'చలం పూయించిన కొత్త పూలు', ఆదివారం ఆంధ్రజ్యోతి అనుబంధం, మే 20, 1984.

21. నాళేశ్వరం శంకరం, 'తెలుగు అక్షరం మీద చలం ప్రభావం అచంచలం', ఆంధ్రజ్యోతి దినపత్రిక, మే 15, 1988.

22. బి.వి.రామిరెడ్డి, 'రేపటి యుగానికి వెలుగురేఖ చలం', ఆంధ్రజ్యోతి దినపత్రిక, మార్చి 9, 1986.

23. 'వివాహ వ్యవస్థను స్త్రీ, పురుష సంబంధాలను తూర్పారపట్టి జీవితపు చీకటి

కోణాలను వెలుగునకు తెచ్చి తెలుగు జాతిలో నూతన దృక్పథాన్ని, భావుకతను ప్రవేశపెట్టి తెలుగ భాషకు వచన సాహిత్యానికి తెలుగ పదాలకు నూతన జీవం పోసి సాహిత్యంలో జీవిత వాస్తవికతను చిత్రించడం నేర్పించినవాడు చలం' - పొనుగోటి కృష్ణారెడ్డి, 'చలం గురించి చలం', ఆంధ్రజ్యోతి అనుబంధం, మే 19, 1985.

24. 'అనేక విషయాల్లో చలం విశిష్టమైన వ్యక్తి. ఆయన దృష్టి వేరు. మన దృష్టి వేరు. రచయితగా చలం జీవితం చాలా గొప్పది. శాశ్వతమైనది. ప్రతిభావంతమైనది. ఆయన యుగకర్త. చలంలాంటి వాడు పుట్టలేదు. పుట్టబోడు. ఆయన పూర్తిగా సంఘం కోసమే రచనలు చేసిన శ్రేయోభిలాషి. ఆయన సహజమైన కవి. కవిత్వం చదివి కంట నీరెట్టేవాడట. చలం జీవితం, సాహిత్యం రెండూ ఉన్నతమే. అర్థం చేసుకొనేవారికి - బి. శివకుమార్, 'ఇవి చలం చెక్కిన శిల్పాలు' ఉదయం దినపత్రిక, సెప్టెంబర్ 3, 1989, ఆదివారం.

25. కె. రాజేశ్వరరావు, 'తెలుగు సాహితీ ప్రపంచంలో జ్వాలాశిఖరం', విశాలాంధ్ర దినపత్రిక, జూన్ 16, 1985 ఆదివారం.

26. కాసుల ప్రతాప్‌రెడ్డి, 'తెలుగులో తొలి మార్క్సిస్టు విమర్శకుడు శ్రీశ్రీ', ఉదయం దినపత్రిక, మార్చి 16, 1988, బుధవారం.

27. దేశెట్టి కేశవరావు, ''శ్రీశ్రీ కార్టూన్ కవితలు'', ఆదివారం అనుబంధం, ఆంధ్రప్రభ దినపత్రిక, ఆగస్ట్ 25, 1985.

28. చేకూరి రామారావు, 'శ్రీశ్రీకి ఒక మరణం వుంటుందని ఎవరూ ఊహించలేదు!', ఆంధ్రజ్యోతి దినపత్రిక 28, డిసెంబర్ 1986.

29. బి.నరసింగరావు, 'మహాకవి శ్రీశ్రీ కూడా మానవుడు శ్రీశ్రీయే', ఆంధ్రజ్యోతి దినపత్రిక, డిసెంబర్ 28, 1986.

30. 'తెలకపల్లి రవి, 'మహాకవి శ్రీశ్రీ సాహిత్య వారసత్వం', ప్రజాశక్తి దినపత్రిక, అక్టోబర్ 21, 1990.

31. అఫ్సర్ 'అక్షరం ఆయుధంగా మారినవేళ', ఆంధ్రజ్యోతి దినపత్రిక, జూన్ 15, 1986.

32. టి.సత్యనారాయణ, 'రంగస్థలంపై మరో శ్రీశ్రీ', ఆంధ్రజ్యోతి సాహిత్యవేదిక, మే 13, 1988.

33.''వెల్చేరు నారాయణరావు'', 'అరవై ఏళ్ల శ్రీశ్రీ కోసం', ఆంధ్రజ్యోతి సాహిత్య వేదిక, మే 16, 1988.

★★★

# ఎ. కవిత్వం

1980 నుంచి 90 వరకు వచ్చిన కవితా సంకలనాల సంఖ్య అధికం. ఇవి రాశిలోనే కాకుండా కవిత్వ విలువల్లో కూడా ముఖ్యమైన మార్పులకు నాంది పలికాయి. అయితే కవిత్వానికి చెందిన అనేక కోణాలను ఈ కవితా ఈ కవితా సంకలనాలు ఆవిష్కరించాయి. కవిత్వరంగానికి సంబంధించినంత వరకు ఈ దశాబ్దంలో పత్రికల నుంచి అందిన ప్రోత్సాహం పేర్కొనదగినది. కవిత్వ పరిణామ క్రమంలో అనేక కొత్త మౌలిక భావనల వ్యక్తీకరణకు, వాటి వ్యాప్తికి దినపత్రికల ద్వారా ఎంతో మేలు జరిగింది. ప్రతీ దినపత్రిక సాహిత్య అనుబంధంలోనూ కవిత్వ విమర్శ వ్యాసాలకు అగ్రప్రాధాన్యం దక్కింది. అయితే సమకాలీన కవిత్వంలోని గుణాత్మకమైన అంశాలను పేర్కొనడం మాత్రమే కాకుండా ఇతర ప్రతికూల అంశాలను కూడా ఈ వ్యాసాలు ఎత్తి చూపించాయి. '' ఇప్పుడొస్తున్న కవితా సంకలనాలను గురించి ఆలోచిస్తే కవిత్వ పాఠకునికి ఎక్కువగా నిరాశే కలుగుతుంది. కవితా చైతన్యం మున్నెన్నడూ లేనంతగా ఈనాడు విస్తరించిన మాట నిజమే. ఈ చైతన్యం పేరుతో వస్తున్న కవిత్వమంతా కవిత్వ భ్రాంతే. ఔత్సాహిక సాహిత్య సంస్థలు యువకులకు ఎక్కువగా ప్రోత్సాహమిచ్చి వారి రచనలను సంకలనాలుగా ఆయా సంస్థల తరపున ప్రచురిస్తున్నాయి. ఇది ఒక రకంగా[1] యువ కవులకు మంచి ఉత్సాహాన్నిచ్చే మాట కూడా వాస్తవమే. ఈ దశాబ్దంలో కవిత్వంపై వచ్చిన ప్రధాన విమర్శల్లో అస్పష్టత ఒకటి. కవిత్వంలో అత్యాధునిక భావ వ్యక్తీకరణ సంబంధాల్లో అస్పష్టత తప్పదని కొందరు విమర్శకులు, అస్పష్టత అనవసరమని కొందరు విమర్శకులు రెండు భిన్న వర్గాలుగా చర్చలూ, వాదోపవాదాల్లో పాల్గొనడం కనిపిస్తుంది. ''వచన కవిత నేడు వివాదాస్పదమైన ప్రక్రియ. ఈనాడు వచన కవిత పేరుతో వస్తున్న వాటిలో అర్థపదాలు వుండడంలేదు. అర్థమైన వాక్యాలూ వుండడం లేదు అని విద్యాధికుల ఆరోపణ. కాని వచన కవితకు వయసు మళ్లిందని మరి కొందరి అభియోగం''. [2] సుదీర్ఘకాలంపాటు వచన కవిత్వంలోని వివిధ అంశాలపైనే దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో వ్యాసాలు వెలువడ్డాయి. ఈ వ్యాసాల్లో కొన్ని నేరుగా కవిత్వ విశ్లేషణకు వీలు కల్పించేవి అయితే మరికొన్ని కవిత్వ ధోరణుల్ని అవహేళన చేసే విధంగా ఉన్నాయి. ''ఏమి తోచనప్పుడల్లా ఆ పదాల్ని వాక్యాల్లో

ఇరికించాలి. ఇరికించాలి అంటే గుర్తొచ్చిందీ, అనుభూతి కవి చేసే పని ఈ 'ఇరికించడమే'. తెలిసిన భాషకీ, తెలియని భావాలకీ మధ్య పొంతన కుదరక పాఠకుడు ఎంత ఇరుక్కుంటే, ఎంత తల బాదుకుంటే కవిత అంత హిట్ అయినట్టు, పేలిపోయినట్టు అర్థం చేసుకోవాలి''. [3] కవిత్వ అనుశీలనలో సాంప్రదాయక ధోరణులతోపాటు కొత్త కోణం నుంచి వివరించే ప్రయత్నాలు కూడా జరిగాయి. కవిత్వంలో ప్రాగ్రూపాలు, పురాగాథల ప్రాధాన్యాన్ని వివరించే వ్యాసాలు దినపత్రికల్లో వెలువడ్డవే''. ''ఆధునిక కవిత్వంలో ఈ ప్రాగ్రూపాల స్ఫురణ అధికంగానే ఉన్నది. శ్రీశ్రీ 'మహాప్రస్థానం' అన్న పేరుతో అవ్యక్తంగానే జీవిస్తూ వున్న ఈ జగత్తును విడిచి నూతన జగత్తుకు అభిముఖంగా ప్రయాణము చేయడమే ప్రధానాంశం. మహాభారతంలోని మహాప్రస్థానానికి దీనికి వస్తుతః భేదం ఉన్నా ఒక సుదూర లక్ష్యం గూర్చిన సర్వమూ త్యాగం చేసిన ఒక మహా సాహస ప్రయాణం ఇక్కడ సుమలక్షణం.''[4]

ఈ దశకం తొలి భాగంలో మినీ కవిత్వంపైన దినపత్రికల దృష్టి ఎక్కువగా కేంద్రీకరించాయి. పత్రికలకున్న స్థలకాల పరిమితుల దృష్ట్యా మినీ కవిత్వం ప్రచురణకు ఎక్కువ అవకాశాలు లభించాయి. అలాగే మినీ కవిత్వాన్ని విశ్లేషించే విమర్శ ధోరణి కూడా గమనించవచ్చు. ''మినీ కవిత ఆవిర్భావానికి చారిత్రక దృష్టికాని సామాజిక అవసరంకానీ లేవు. పత్రికలయొక్క స్థలాభావం వలన మినీ కవిత పుట్టింది. మినీ కవిత ఈనాడు యువకవులకు మంచి వాహికగా ఉపకరిస్తోందనడంలో ఎలాంటి సందేహంలేదు. [5] మరొకవైపున అభ్యుదయ కవిత్వ ధోరణిని కొనసాగిస్తున్న విమర్శకులు కూడా కనిపిస్తారు. వివిధ సందర్భాలను దృష్టిలో వుంచుకుని అభ్యుదయ కవిత్వానికి సంబంధించిన అంశాలను విమర్శకులు దినపత్రికల ద్వారా ప్రస్తావిస్తూనే వున్నారు. ''సాహిత్యంలో మార్పు పొందిక సుస్థిరంగా నిలచిన సకల మార్గాలనూ సకల సంప్రదాయ బంధాలను, గతానుగతిక కావ్యేతి వృత్తాలనూ ఛిన్నాభిన్నం చేసింది. అభ్యుదయ సాహిత్యోద్యమమే. ఈ ఉద్యమ ఫలితంగా నాలుగు తరాల రచయితలు వందలాదిగా ఆకర్షితులయ్యారు. అపూర్వ వేగంతో విరివిగా సాహిత్యాన్ని సృష్టించారు. లక్షలాదిగా పాఠకులనూ పెంపొందింపజేశారు. [6]

అభ్యుదయ కవిత్వానికి పూర్వాపరాలను శోధించే కృషి కూడా ఈ దశకంలో కనిపిస్తుంది. ఈ శతాబ్దం ప్రారంభం నుంచి అభ్యుదయ కవిత్వానికి కావలసిన పూర్వరంగాన్ని సమకూర్చిన రచయితలు ధోరణులపైన విశ్లేషణాత్మక వ్యాసాలు వెలువడ్డాయి. ''ఆనాటి కవులవీ, వారి పోషకులవీ, పాఠకులవీ అభిరుచులు ఇందుకు తగినవి. వాస్తవ జీవిత చిత్రణ, కావ్య రచనకు సంబంధించిన సంగతి. దానికి ఎంత ఎడంగా వుంటే కావ్యానికి అంత పుష్టి. కమ్మని కవిత్వమంటే ఇదేనని ఆ కాలపువారి నమ్మకం. [7] గురజాడ, శ్రీశ్రీల కవిత్వంలో అభ్యుదయ దృక్పథాన్ని గురించి మాత్రమే కాకుండా తెలుగులో ఈ విధమైన చైతన్యానికి కారకులైన ప్రతీ రచయిత గురించి సాహిత్య వ్యాసాలు వెలువడటం ఈ దశలో గమనించాల్సిన అంశం. దృక్పథ

ప్రాముఖ్యాన్ని వివరించే సాహిత్య రూపాలను, వాటి మూలాలను అన్వేషించడం ఈ కృషిలో ఒక భాగం. విశాలాంధ్ర ఆదివారం అనుబంధంలో 1989 డిసెంబర్ 24 సంచికలో వెలువడిన 'తెలుగులో తొలి ఎర్రజెండా గీతం' అనే వ్యాసం దీనికి ఉదాహరణ.[8] అలాగే ఇతర ప్రక్రియల్లో పేరు ప్రఖ్యాతులు పొందిన ప్రసిద్ధ రచయితలు తొలినాళ్లలో రాసిన కవిత్వాన్ని గురించి వెలువడిన వ్యాసాలు వచన కవిత్వ ప్రాముఖ్యాన్ని చెప్తాయి. [9]

వచన కవిత్వంలో మొదటి నుంచి ప్రయోగానికి పెద్దపీట వేసిన కవుల కవిత్వ నిర్మాణ పద్ధతులను విశ్లేషించే విమర్శా వ్యాసాలు ఈ దశలో వెలువడ్డాయి. ఆధునిక కవిత్వరంగంలో పఠాభిది ఒక విశిష్టమైన మార్గం. ఛందోబందోబస్తులను తెగ్గొట్టడంతోపాటు అనేక కొత్త తరహా కవిత్వ వస్తువులను పఠాభి ఆవిష్కరించాడు. వచన కవిత్వ నిర్మాణానికి పఠాబి దృక్పథానికి వున్న సంబంధాన్ని శోధిస్తూ వచ్చిన విమర్శావ్యాసాలు '' ఆధునిక కవిత్వం - పఠాభి'' అనే శీర్షికన 1985లో వెలువడిన వ్యాసం పేర్కొనదగింది. 'అనుసరిస్తా నవీన్ పంథా, భావ కవిన్ మాత్రము కాన్నే, నేనహంభావి కవిని' అని చాటుకున్నట్లు అటు పూర్వకాలపు కవులకు, ఇటు భావ కవులకు మధ్యగా ఒక సరికొత్త ధోరణిని ప్రతిపాదించాడు. భావంలో అది వాస్తవికత, ప్రతీకవాదమూ, ఛందస్సులో వచనశైలి పఠాభి కవితకు ముఖ్య లక్షణాలు. ఛందస్సులో ఈయన గొప్ప వైవిధ్యం సాధించారు. అందుకే ఆరుద్ర లాంటి ఆధునిక కవులెందరికో మార్గదర్శకుడయ్యాడు. వీరి నగర వర్ణనలు తిలక్, కుందుర్తి వంటి ఉత్తమ కవులకూ, దిగంబర కవులకూ వడి పెట్టాయి. ఆధునిక కవితలో 'పఠాభి'ది ప్రత్యేక పేట. [10] వచన కవిత్వం ప్రయోగ దృష్టితో కాకుండా ప్రయోజన దృష్టిలో విశ్లేషించిన కవుల గురించి విడివిడిగా వచ్చిన వ్యాసాలు ఈ సందర్భంగా గమనించదగినవి. 1990 ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఉద్యమాల ఊపిరి తుమ్మల కవిత్వం' అలాంటి ఒక వ్యాసం. ''ఆయన కవిత్వం ప్రజా హృదయాలను ప్రతిబింబించింది. సమకాలీన ఆంధ్ర చరిత్రకూ, భారతదేశ చరిత్రకూ కళారూపమైంది. కుగ్రామంలో పుట్టి, పెరిగి ఆరుగాలమూ సేద్యం చేయడం చేత రైతు బ్రతుకుమీద గ్రామ నివాసం మీదా ఆయనకు ఎనలేని మక్కువ ఏర్పడింది. బ్రతుకు ధర్మబద్ధమైన గ్రామీణ సంస్కృతిని ప్రదర్శించింది''. [11] రాయలసీమ జనజీవితాన్ని ఆర్ద్రంగా చిత్రించిన పెన్నేటి పాటపై ఒక విమర్శా వ్యాసం 1987 ఆంధ్రప్రభ దినపత్రికలో వెలువడింది. ఈ 'పెన్నేటి పాటను విశ్వంగారు 1956 లో ప్రచురించారు. రాయలసీమ ప్రకృతి విలయతాండవాన్ని, ప్రజల నికృష్ట జీవితాన్ని అక్కడ కరువు భయంకర పరిస్థితులను గుండెలు నీరయ్యేలా వ్యక్తీకరించడానికి, కంగుమన్న తన గుండెను మ్రోగించటానికి వెదురు ముక్కలాంటి ఒక అల్పుడి కథను తీసుకెళ్లారు''. [12] అభ్యుదయ కవిత్వంలో పీడితుల హృదయాక్రోశాన్ని వ్యక్తం చేసిన కవుల్లో తిలక్‌ది అగ్రశ్రేణి అయితే అదే సందర్భంలో ఆయన వచన కవిత్వంలో వైవిధ్య పూరితమైన ప్రయోగాలు కూడా చేశారు. వాటిని

అర్థం చేసుకోలేని సాహిత్య వాతావరణం సమకాలీనంగా నెలకొని వుందన్న అభిప్రాయం కొన్ని వ్యాసాల్లో వ్యక్తమవుతుంది. ''కాని నేటి కువిమర్శకులకా సత్తా కనిపించదు. చిన్నమ్మా అనే తెలుగు మాటకే అర్థం అంతుపట్టక వెర్రిమొర్రి వ్యాఖ్యలు చేసిన అర్భకులు తయారయ్యారు. గొప్ప కవిత్వాన్ని ఆవిష్కరించే బాధ్యత ఉత్తమ విమర్శకులదే.''[13] వచన కవిత్వానికి ప్రయోగ దిశను చూపించిన ఆధునిక కవులపై వారి వచన కవిత్వ నిర్మాణ సంవిధానాలపై వివిధ వ్యాసాలు వెలువడ్డాయి. వచన కవిత్వంలో నాటక లక్షణాలను మేళవించి ఒక వినూత్న వ్యక్తీకరణకు నాంది పలికిన బైరాగి కవిత్వంపై వెలువడిన వ్యాసాలు పేర్కొనదగినవి. ''నాటక, నాటిక లక్షణాలను మేళవించి క్రమం మార్చి తన కావ్యమైన ''నూతిలో గొంతులు'' లో ప్రవేశపెట్టి నూతన ప్రయోగం చేశాడు. బైరాగి, ఇతిహాస చారిత్రక సాంఘిక ప్రఖ్యాత ఇతివృత్తాలకు తన భావనాబలంచే కొత్త రూపునిచ్చాడు. హామ్లెట్ షేక్స్‌పియర్ విషాదాంత నాటక నాయకుడు, అర్జునుడు, వ్యాసుడి మహాభారత నాయకుడు రాస్కాల్నికోవ్, డోస్టావిస్కీ 'నేరము- శిక్ష' నవలలోని నాయకుడు. లేబుళ్లు బైరాగివి కాకపోయినా డబ్బాలోని సరుకు మాత్రం బైరాగిదే. రసము, కరుణ, భయానక మిశ్రమమునకు మూలమైన మానవుని వేదన. [14] ''ప్రతీ కవికీ ఏదో ఒక సందర్భంలో తన భావ వ్యక్తీకరణకు మాటలు చాలని, దొరకని లోపం కనిపించి తీరుతుంది. గొప్ప కవులందరూ ఈ అసంతృప్తిని ఎప్పుడో అప్పుడు వ్యక్తపరిచారు. కవితా సతిచేలాంచలాలు అందినట్టే అనిపించి అల్లంత దూరంలోనే మాయమవుతాయన్న బైరాగిలోనూ ఆ అసంతృప్తి తొంగి చూస్తుంది''.[15] వచన కవిత్వంలో కొత్త ప్రయోగాలు సాగుతున్న క్రమంలో వాటికి బలాన్నిచ్చే కొన్ని పాతధోరణులకు సంబంధించిన విశ్లేషణా వ్యాసాలు వెలువడ్డాయి. సమకాలీన సాహిత్య ధోరణులతో సరిపోల్చుకుంటూ విమర్శ పరిధిని విస్తరించడానికి ఇలాంటి వ్యాసాలు ఉపయోగపడ్డాయి. వచన కవిత్వాన్ని రూపపరంగా బద్దలుకొట్టి కొత్త రూపం కోసం అన్వేషణ సాగించిన దిగంబర కవిత్వంపై వచ్చిన విమర్శలు దీనికుదాహరణ. ''దిగంబర కవుల్ని తెగ దూషించిన వాళ్ళూ వున్నారు. కానీ అప్పటికంటే ఇంకా ఇంకా బాగా కుళ్లిపోయిన వ్యవస్థ కూడా ఈ తరం కళ్లముందుకి వచ్చింది. ఈ వ్యవస్థకు జ్వరం పుట్టించడానికి మరో దిగంబరతరం రావాల్సిన అవసరం వుండనే వుంది. ఆ తరం కోసమే ఇప్పుడు కవిత్వం పురిటి నొప్పులు పడుతోంది. దిగంబర కవిత్వం ఒక ఉద్యమంగా వేళ్లూనిందని ఇవాళ ప్రత్యేకంగా చెప్పుకోనవసరం లేదు''. [16] మరోవైపు నుంచి కవిత్వంలో వస్తు రూపాల్లో స్వానుభావిక పునాది వుండాలన్నవాదం బయలుదేరింది. 1970ల ద్వితీయ భాగంలోనూ, 1980ల మొదటి భాగంలోనూ ఈ విధమైన ధోరణి బాగా విస్తరించింది. కవిత్వ వ్యక్తీకరణలో ఇన్నివిధాల 'పరిశుభ్రత'ను సాధించిన కవుల ప్రయోగధోరణిని విశ్లేషించే వ్యాసాలు వెలువడ్డాయి. దీనికి ఉదాహరణ కవిత్వంలో నిశ్శబ్దం శీర్షికన ఇస్మాయిల్ రాసిన వ్యాసాలు. ''తెలుగు సాహిత్యపు చీకటింటికి శ్రీశ్రీ తెరిచినన్ని కిటికీలు ఇంకెవ్వరూ తెరవలేదు. ఇతను తెలుగుకి చేసిన గొప్ప మేలేమిటంటే శవప్రాయమైన గ్రాంథిక కావ్య భాషని

రోడ్డుపక్క కీడ్చి జవసత్వాలూరే వాడుక మాటలని చేర్చటం''.[17] అనుభవిక తీవ్రతను వ్యక్తం చేసే క్రమంలో ఈ కవులు అనేక ప్రయోగాలు చేశారు. అలాంటి విభిన్నమైన ధోరణిని వ్యక్తం చేసిన కవులను అనుభూతివాదులుగా పేర్కొన్నారు. ఈ తరహా కవులు కవిత్వమే కాకుండా తమ వాదనలను బలాన్నిచ్చే విమర్శావ్యాసాలు కూడా అనేకం రాశారు. '80ల తరువాత ఈ ధోరణితో వచ్చిన విమర్శావ్యాసాలు వాటిపై సాగిన చర్చలూ ప్రత్యేకించి పేర్కొనదగినవి. '' ఇస్మాయిల్‌గారు అంటారు - దైనందిన జీవితాన్ని వెలిగించే చిన్న చిన్న సుఖాలూ, అప్పుడప్పుడూ కన్నీళ్లు, పరిచయాలూ, సరదాలూ, ప్రేమలూ, ఎడబాట్లూ, దిగుళ్లూ, కోరికలూ, తృప్తి, అసంతృప్తి, ఆలోచనలూ, ఊహలూ, వీటన్నిటినీ ఆవరించి మనచేత జీవితాన్ని జీవింపజేసే ఒక ఉత్సాహమూ, ఆనందమూ ఇదిలేందే జీవితం లేదు. వీటన్నిటితో సంపూర్ణంగా బతకటంలోనే ఆనందం వుంది అని.''[18]

విప్లవ కవిత్వ భాషలో వచ్చిన మార్పులపై కూడా విమర్శకులు దృష్టి సారించారు. విప్లవ దృక్పథానికి అవసరమైన కవిత్వ భాషను సాధించిన తీరుతెన్నులపై అనేక విమర్శా వ్యాసాలు ఈ దశలో వెలువడ్డాయి. విప్లవ చైతన్యానికి కవిత్వానికి మధ్య సాగుతున్న సంఘర్షణను ప్రతిబింబించే వ్యాసాలు కూడా ఈ సందర్భంగా ప్రస్తావించదగినవి. ''తెలుగు సాహిత్యంలో ఇక్కడే పేచీ. రాజకీయ పార్టీ వరకు ఎలాంటి పేచీలేదు. కానీ ఆ పార్టీ పేరుతో కాయలమ్ముకునే రచయితల పార్టీ ఒకటి తయారుకాకూడదు. సాహిత్యం కారులమ్ముకునే వ్యాపారం కాదు. అసలు పార్టీ కోసం ఒక ప్రచార సాహిత్య ఉపపార్టీ ఉండడం ఎంతమాత్రమూ ఆక్షేపణీయం కాదు. కానీ వాళ్లు వాళ్ల పాత్రను మించి వ్యవహరించగూడదు. వాళ్లకు ఆశక్తి లేదు. పైగా ఘోరం! ప్రతీవాడిలో విప్లవ చైతన్యం వ్యాప్తి చేయడానికి బదులు వాళ్లు విప్లవ చేతన ఉన్నవాడ్ని కూడా విప్లవ విరోధి అని ప్రచారం చేస్తున్నారు. విప్లవాత్మక చైతన్యమున్న కవుల్ని వాళ్ల కావ్యాల్ని బుద్ధిపూర్వకంగా నిందిస్తున్నారు. ఇది స్పష్టంగా విప్లవ వ్యతిరేక చర్య. ఇది విప్లవ ద్రోహం. వాళ్లు తమకు లభించిందని భ్రమిస్తున్న ఏదో ఒక గొప్ప పీఠం అన్య విప్లవ కవులచేత వారి కావ్యాలచేత పడిపోతుందేమో అనే ఒక స్వలాభ ప్రేరిత భయం చేత ఈ పనిచేస్తున్నారు.[19]

వచన కవిత్వంలో ఎన్ని ప్రయోగాలు జరిగాయో వాటితోబాటు ఆ ధోరణిని సామాన్య పాఠకులకు దూరంగా తీసుకు వెళ్లడానికి కూడా అంతే ప్రయత్నం జరిగింది. సామాజిక దృష్టి వున్న రచయితల్లో తప్ప ఇతరేతర ధోరణులకు ప్రాతినిధ్యం వహిస్తున్న రచయితలందరిలోనూ శుద్ధ సాహిత్య విలువల పేరిట ప్రయోజనానికి భిన్నమైన ధోరణులు కనిపిస్తాయి. అయితే సామాజిక ఆలోచనల పేరుతో కవిత్వ విలువల్ని తృణప్రాయంగా భావించే ధోరణుల్ల వచన కవిత్వంలో కొత్తదనం లోపించింది. ఇలాంటి స్థితిలో వచన కవిత్వానికి అసలు పాఠకులున్నారా అన్న ప్రశ్న కూడా తలెత్తింది. ''సామాజిక ఆలోచనలపేర సకలమైన భావాల్నీ కవిత్వంలోకి దింపేయగలగడం

కవిత్వానికి లక్ష్యంకాదు. ఆలోచన ఆవేశవంతమై ఉద్వేగ రూపంగా మారితీరాలి. అందుకు పొదగని భావాలు ఆశకొద్దీ దింపేయడంకన్నా వదిలి వేయడం మంచిది. తాత్త్విక రూపం ధరించే భావ సంపుటిని కవిత్వానికి ఆపాదించడం మూలసత్యానికి భంగం కలిగిస్తుంది. ఏది కవిత్వమో అదే కవితా ప్రయోజనం సాధిస్తుంది తప్ప ఏది ప్రయోజనకరమో అది కవిత్వంగా మారలేదు. [20]

1980ల తరువాత వచన కవిత్వంలో రూపపరంగా ఎంతో పరిణతి కనిపిస్తుంది. వచన కవిత్వం అతి వ్యాప్తివల్ల కొన్ని పెడధోరణులు వున్నప్పటికీ కొత్త జీవన మూలాలను శోధించే సాధనంగా ఈ రూపం ఎంతో ఉపయోగపడిందనడానికి దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో వెలువడిన వ్యాసాలే నిదర్శనం. కవిత్వ ప్రయోజనం ప్రయోగం రెండూ ఏకకాలంలో నెరవేరడం ఈ దశలోనే కనిపిస్తుంది. వచన కవిత్వంలోని అనుకూల అంశాలతోపాటు ప్రతికూల అంశాలపైన కూడా విస్తృతమైన చర్చకు దోహదపడిన దశాబ్దమిది. వచన కవిత్వ పరిణామ వికాస చరిత్రలో ఒక మలుపుగా నిలిచే ఈ దశాబ్దంలో దినపత్రికల పాత్ర కూడా బహుముఖమైంది. ముందు ముందు కవిత్వ రంగంలో ఏర్పడనున్న కొత్త పరిణామాలకు పునాదిగా నిలిచిన అంశాలలో పత్రికల పాత్ర విశేషంగా పేర్కొనదగినవి.

పాదసూచికలు :

1. టి.ఎల్.కాంతారావు 'ఇప్పుడొస్తున్న కవితా సంకలనాలు' ఆంధ్రపత్రిక, శనివారం, ఫిబ్రవరి 1, 1986.

2. పైడిపాల, 'వచన కవిత ఏ మార్గాన పోతున్నది', ' ఆంధ్రప్రభ దినపత్రిక' నవంబర్ 17, 1982.

3. 'అ', 'కొరకరాని కొయ్య' కవిత్వం, ఆంధ్రభూమి దినపత్రిక, ఫిబ్రవరి 17, 1990.

4. ప్రొఫెసర్ కోవెల సుప్రసన్నాచార్య, 'సాహిత్య అనుశీలనలో ప్రాగ్రూపాల, పురాణ గాథల ప్రాధాన్యము', ఆంధ్రప్రభ దినపత్రిక, ఆదివారం ఆగస్టు 11, 1985.

5. టి.యల్.కాంతారావు, 'వచన కవిత్వ సంక్షిప్త రూపమే మినీ కవిత', విశాలాంధ్ర దినపత్రిక, సాహితీ లోకం శీర్షిక, మే 1981.

6. శ్రీ సోమసుందర్, 'అభ్యుదయ కవిత్వం: ఆరంభ వికాసాలు', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం సెప్టెంబర్ 15, 1985.

7. శ్రీ సెట్టి ఈశ్వరరావు, 'ఆంధ్ర భాషా సాహిత్యాల నవ యుగోదయం' 'గురజాడ యుగం', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, నవంబర్ 11, 1984.

8. ''తెలుగులో ఇప్పటికీ లభ్యమవుతున్న వాటిలో వామపక్ష గీతాలను సమగ్ర సంకలనంగా కూర్చిన ఘనత శ్రీ గద్దెలింగయ్యకు దక్కుతుంది. ఆయన సంపాదకత్వంలో వెలువడిన క్రాంతి గీతాలను తొలి తెలుగు వామపక్ష గీతికా సంకలనంగా భావించవచ్చు'' ఎస్వీ, 'తెలుగులో తొలి ఎర్రజెండా గీతం'. ఆదివారం విశాలాంధ్ర దినపత్రిక, డిసెంబర్ 24, 1989.

9. ''1940 దశకపు తొలి రోజుల్లో తెలుగు తల్లి, భారతి, ఆనందవాణి, ఢంకా మొదలైన పత్రికల్లో చాసో కవితలు అచ్చయ్యేవి. మరికొంత పరిశోధన చేసి ఆయన కవితలన్నిటిని గూర్చి పరిచయం వివరణ చేర్చి చిన్న పుస్తకంగా ప్రచురించడం ఎంతయినా మంచి పని'' - మానేపల్లి సత్యనారాయణ, 'చాసో కవిత' దినపత్రిక, జనవరి 14, 1985.

10. డాక్టర్ శివలెంక ప్రకాశరావు, ' ఆధునిక కవిత్వం - పఠాభి', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, జులై 21, 1985.

11.నాగళ్ల గురుప్రసాదరావు, 'ఉద్యమాల ఊపిరి - తుమ్మల కవిత్వం', ఆంధ్రజ్యోతి, సోమవారం సాహిత్యవేదిక, మార్చి 26, 1990.

12. సుందర రామశర్మ, ''ఇంత మంచి పెన్నతల్లి ఎందుకిట్లు మారెనో'', ఆంధ్రప్రభ దినపత్రిక, డిసెంబర్ 6, 1987.

13. సోమసుందర్, 'తిలక్ కవిత్వంలో పీడితుల హృదయాక్రోశం', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, ఆగస్టు 11, 1985.

14. 'భాను, 'నూతిలో గొంతుకలు'లో నాటకీయత', విశాలాంధ్ర ఆదివారం దినపత్రిక జూన్ 3, 1984.

15. బొమ్మారెడ్డి వెంకటరామిరెడ్డి, 'చీకటి గుండెల్లో పలికిన గొంతుక', ఆంధ్రజ్యోతి దినపత్రిక, మే 18, 1986.

16. అభిమన్యు, ''దిగంబర కవితకు పాతికేళ్లు'', ఆంధ్రజ్యోతి దినపత్రిక సోమవారం మే 7, 1990.

17. పురాణం సుబ్రహ్మణ్యశర్మ, ''ఇస్మాయిల్‌సాహిత్య దృక్పథం', కవిత్వంలో నిశ్శబ్దం, ఉదయం దినపత్రిక, సోమవారం జులై 10, 1989.

18. రవూఫ్, 'అర్ధై నిండిన అపురూప కవి ఇస్మాయిల్', ఉదయం దినపత్రిక, సెప్టెంబర్ 10, 1998.

19. గుంటూరు శేషేంద్రశర్మ, 'విప్లవ కవిత్వము - సాహిత్య విమర్శ', ఆంధ్రపత్రిక (భారతి సారస్వతానుబంధం) జులై 29, 1987.

20. డాక్టర్ చందు సుబ్బారావు, 'అసలు వచన కవిత్వానికి పాఠకులున్నారా', ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఏప్రిల్ 18, 1988

★★★

# బి. కథలు

ఈ దశాబ్దం పత్రికారంగం విశేషంగా వ్యాప్తి చెందడంవల్ల కథానికా ప్రక్రియకు పేర్కొనదగిన ప్రాముఖ్యం లభించింది. దినపత్రికల్లో కథానిక ప్రక్రియకు ఇంతకుముందెన్నడూ లేని ప్రచారం లభించింది. ప్రతీ దినపత్రిక ఆదివారం అనుబంధాల్లో కథానికను ప్రచురించడం ఒక సాంప్రదాయంగా స్వీకరించింది. కొన్ని దినపత్రికల్లో రోజుకోకథ ప్రచురించిన సందర్భాలు కూడా ఉన్నాయి. పాఠకుల నుంచి వీటికి విశేషమైన ప్రతిస్పందన లభించడమే కాకుండా సాహిత్య వర్గాల్లో కూడా సద్విమర్శలకు అవకాశం ఏర్పడింది. అలాగే కథాసాహిత్య విమర్శకు సంబంధించి విశ్లేషణాత్మక వ్యాసాలు కూడా ఈ దశాబ్దిలోనే కనిపిస్తాయి. కథలకు మాత్రమే ప్రత్యేకించిన విమర్శ శీర్షికలు వెలువడటం మరో విశేషం. ఉదాహరణకు అందాల తెలుగుకథ ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో, ఆంధ్రభూమి దినపత్రికలో కథలెలా రాస్తారు, కాళీపట్నం రామారావు శీర్షికలు ఉదాహరణలు. అలాగే సాహిత్య అనుబంధాల్లో తెలుగు కథలతోపాటు ఇతర భాషల నుంచి అనువదించిన కథలను కూడా ప్రచురించారు.

కథానికకు సంబంధించి దినపత్రికల్లో వెలువడిన రచనల్లో మౌలికంగా సృజనాత్మకమైనవి అధికంగా వున్నాయి. విశ్లేషణకు సంబంధించినవి సృజనాత్మక రచనల అంతస్సారాన్ని ఆవిష్కరించే రచనలు కూడా అంతే స్థాయిలో వెలువడ్డాయి. కథానిక పుట్టుపూర్వోత్తరాలు వివరించే విశ్లేషణా వ్యాసాలను డాక్టర్ పోరంకి దక్షిణామూర్తి విశాలాంధ్ర ఆదివారం అనుబంధంలో ప్రచురించారు. కథానిక లక్షణాలను వివరిస్తూ ఇలా అంటారు. ''ఒక నిర్దిష్ట సాహిత్య ప్రక్రియగా రూపొందిన ఆధునిక వచన రచనా విశేషం కథానిక. మామూలు కథకంటె ఇది సునిశితమూ, సూక్ష్మమూ. ప్రతి కథానికా ఒక కథేకాని ప్రతీ కథా కథానికకాదు. కథకు విషయం ప్రధానమైతే కథానికకు శిల్పం ప్రధానం. రచయిత ఏం చెప్పాడన్నది రెంటికీ వర్తిస్తుంది.[1] తెలుగు కథకు మొదటి నుంచి కూడా గ్రామీణ జీవితంలో సన్నిహిత అనుబంధం వుంది. చాలా మంది కథకులు గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చినవారు కావడంతో గ్రామీణ జీవితాన్ని యథాతథ దృష్టిలో చూడటమే కాకుండా విశ్లేషణాత్మక అవగాహనతో వీక్షించారు. ఈ విషయాన్ని

విశ్లేషిస్తూ ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో పోలాప్రగడ సత్యనారాయణమూర్తి, ''తెలుగు కథల్లో గ్రామీణ జీవితం' అనే అంశంపైన వ్యాసం రాశారు. ఆ వ్యాసంలో గ్రామీణ జీవన మాధుర్యమనేది వర్తమాన తెలుగు కథలో కనిపించదని వ్యాఖ్యానించారు. రాజకీయ వ్యవస్థ ప్రవేశించడం వల్ల గ్రామీణ జీవితం ఏ విధంగా ఛిన్నాభిన్నమైందో ఆయన విశ్లేషించారు. ''పైన ఆకాశం మెరిస్తే, క్రింద భూదేవి నవ్వితే అణువణువూ పులకించిపోతూ పరిమళం చెడని ప్రొద్దుతిరుగుడు పువ్వుల్లా ఊళ్లో గంతులు వేస్తూ తిరిగే బొద్దు అయిన తెలుగు కన్నెపడుచులూ, కల్లాకపటం లేకుండా కష్టించి పనిచేస్తూ పదిమందికి చేయు సాయం చేసి పోరగాళ్ళూ, అందరినీ తమవాళ్లుగా చూసుకునే తాతలూ బామ్మ ఆభరణాలు! కాలవలూ, బల్లకట్లూ రహదారీ పడవలు, కొబ్బరిచెట్లూ, మామిడి తోపులూ పరిగెట్టే సెలయేళ్లూ, వెన్నెట్లో మిలమిలలాడే నదులూ, పచ్చికబయళ్లూ, గుడిగంటలూ, ధనుర్మాసం ప్రసాదాలు ఇవన్నీ తెలుగు గ్రామాల్లో కనిపించే అందమైన స్వర్గాలు. అక్కడి ప్రజలు ఆ స్వర్గాల్లో నడయాడే అచ్చమైన అప్సరలు. గోపీచంద్ అన్నట్లు రాజకీయాలు ప్రవేశించి ఆ స్వర్గాన్ని ఇవాళ నరకాలుగా మార్చాయి. అందుకే ఇవాళ వస్తున్న కథల్లో నాటి గ్రామీణ జీవన మాధుర్యం కనిపించడం మానేసింది.[2]

కొత్త విస్తృతినీ, కొత్త పాఠకుల్ని సమకూర్చుకునే క్రమంలో తెలుగు కథానిక కొత్త ప్రయోగాలకు నాంది పలికింది. ఆ క్రమంలో కథలశైలిలో అనేక మార్పులు పెరిగాయి. ఇంతకుముందు కథనశైలికి 80ల తరువాత వచ్చిన తెలుగు కథ శైలికి ఎంతో అంతరం కనిపిస్తుంది. కథాకథనంలో వచ్చిన ఈ మార్పును విశ్లేషిస్తూ పులికంటి కృష్ణారెడ్డి ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో ఒక వ్యాసంలో ఇలా వ్యాఖ్యానించారు. ''నాటి నుంచి తెలుగు కథ ఎత్తుగడలో, ముగింపులో, శిల్పంలో, కథనంలో సామాజిక స్పృహలో అనేకానేక మెరుగులు దిద్దుకుంటూ నేటికి విశ్వసాహిత్యంలో ఒక విశిష్ట స్థానాన్ని సముపార్జించుకొంది. దాదాపు డెబ్బై ఏండ్ల వయస్సు వచ్చేటప్పటికి ఒక ప్రముఖ సాహిత్య ప్రక్రియగా రూపొంది జీవిత సత్యాన్ని చాటే తత్త్వాన్ని సంతరించుకుని నేటికీ సాహితీ సన్మానాల్ని అందుకునే అర్హత సంపాదించుకుంది''.[3] కథన శిల్పానికి ప్రాధాన్యం పెరిగిపోయిందన్న విమర్శను కూడా ఈ దశాబ్ది తెలుగు కథ ఎదుర్కొంది. ఇతివృత్తాన్నిబట్టి కథన శైలి రూపుదిద్దుకుంటుందన్న అభిప్రాయాన్ని సాదుం రామ్మోహన్ ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఒక వ్యాసంలో వెలిబుచ్చారు. ''కథలోకానీ మరే రచనలోకానీ శిల్పంకంటే వస్తువే ముఖ్యం. అందులో సందేహంలేదు. అయితే నువ్వు పాఠకుడికి చేరవేయదలుచుకున్న వస్తువు తాలూకు సందేశం కూడా నీ రచనలో సరైన శిల్పం వున్నప్పుడే చేరుతుంది. కాబట్టి వస్తువు (లేక మూలం) లక్ష్యం (End) అయితే సాధనం (means). శిల్పానికి అది ప్రాముఖ్యం ఇవ్వడం తప్పే.[4] తెలుగు కథ అనేక ధోరణులకు శ్రీకారం చుట్టింది ఈ దశాబ్దంలోనే. ప్రయోగాత్మక కథతోపాటు ప్రయోజనాత్మక కథల్లో కూడా వినూత్న ప్రయోగాలు జరిగాయి. దినపత్రికలో సైతం

విస్తృత స్థాయిలో కథానికల పోటీలను నిర్వహించడం కొత్తతరం రచయితలు, కొత్త ధోరణి రచనా విధానంతో పాఠకుల ముందుకు వచ్చారు. ఉదాహరణకు హాస్య, వ్యంగ్య కథానికలు ఈ దశాబ్దంలో పెద్ద సంఖ్యలో వెలువడ్డాయి. [5]

దినపత్రికలకు సంబంధించి సాహిత్య అనుబంధాల్లో విడివిడిగా కొన్ని కథలపైన కూడా విస్తృత విశ్లేషణలతో కూడిన విమర్శా వ్యాసాలు వెలువడ్డాయి. కాళీపట్నం రామారావు 'యజ్ఞం' కథపై జరిగిన చర్చ విశ్లేషించి పేర్కొనదగినది. అలాగే 'భయం' కథపై కూడా విడివిడిగా విమర్శా వ్యాసాలు వెలువడ్డాయి. భయం కథపై జరిగిన చర్చపైన ఆంధ్రభూమి దినపత్రికలో ఒక విమర్శా వ్యాసం వెలువడింది. ''ఇంత మంచి కథను ఏ కొద్దిమందో తప్పించి అర్థం చేసుకోలేకపోతున్నారంటే బాధపడాలి. ఒక మాటలో నాగభూషణం గారన్నట్లు 'పెయింటింగ్ మూసిన వెయిటింగ్'లాగా ముఖ్యమైన విషయం తెరమరుగున వుండిపోయింది. [6] తెలుగులో కథారచనకు నాంది పలికిన గురజాడ 'దిద్దుబాటు'పైన కొత్త దృక్పథంతో కూడిన విశ్లేషణా వ్యాసాలు కూడా ఈ దశాబ్దంలోనే వెలువడ్డాయి. 'దిద్దుబాటు'ను తెలుగులో ఆణిముత్యంగా పేర్కొంటూ డాక్టర్ రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ఇలా వ్యాఖ్యానించారు. ''ఆధునిక మహిళలు చరిత్రను తిరగ రాస్తారు అన్నది గురజాడ నమ్మకం. దీనికి అనుకూలంగా వుంది ఈ కథ. ఇందులో ముచ్చటగా మూడే పాత్రలు. ఈ మూడు పాత్రల్ని గురజాడ తన కథాలక్ష్యానికి వినియోగించుకున్న తీరు అతని చేయితిరిగినతనాన్ని రుజువు చేస్తుంది. 'దిద్దుబాటు' అంటే సరిచేయడం, సరిచేసుకోవటం'' [7] కథారచనకు సంబంధించిన నేపథ్యాన్ని వివరించే రచనలు దినపత్రికలో వెలువడ్డాయి. ఉదాహరణకు ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో పురాణం సుబ్రహ్మణ్యశర్మ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నీలికథ నేపథ్యాన్ని వివరించారు. ''ఈ కథ నేను నా ఇరవై ఒకటవ ఏట రాశాను, రచనలో మాటల పొందిక, శైలి కూడా సముపాళ్లలో వున్నాయి. అయిత ఈ కథ గురించి నాకు నచ్చని విషయం ఏమిటంటే ఇది కథానిక పరిమితుల్ని దాట ప్రయత్నించింది.'' [8]

విడివిడిగా ఆయా రచయితలపై వెలువడిన విమర్శా వ్యాసాలు కూడా విశేషించి పేర్కొనదగినవి. రావిశాస్త్రి, చాసో, ముళ్లపూడి వెంకటరమణ, సత్యం శంకరమంచి, కరుణకుమార, పులికంటి, భూషణంలాంటి ప్రసిద్ధ కథకులపైన, వారి కథలపైన అసంఖ్యాకంగా విమర్శా వ్యాసాలు వెలువడ్డాయి. చాసో కథలమీద దినపత్రికల్లో అనేక విశ్లేషణా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. చాసో కథాతత్త్వాన్ని వివరిస్తూ కాత్యాయని విద్మహే విశాలాంధ్ర సాహిత్య అనుబంధంలో ఒక వ్యాసం ప్రచురించారు. ఆ వ్యాసంలో చాసో కథకు జీవ చైతన్యాన్ని అందించిన విశిష్ట లక్షణాలను ఆమె వివరించారు. ''చాసో కథలు పాఠకుల్ని ఆలోచనకు ప్రేరేపిస్తాయే తప్ప పాఠకులకు అవి నేరుగా, నేలబారుగా బోధించవు. అనగా వీరి కథల్లో బోధనా తత్త్వం లేదు. ఉత్తమ కళలో ఆవేదనకు ప్రథమ స్థానం, ఆలోచనకు ద్వితీయ స్థానం వుంటుంది. ఆవేదన లేకుండా, ఆలోచన మాత్రమే

నిండివున్న కళ సాధారణంగా ప్రచార స్థాయికి దిగజారిపోతూ వుంటుంది. అన్ని కళలకూ మూలం ఆవేదనే అయితే ఆవేదన, ఆలోచన మధ్య కార్యాకరణ సంబంధం వుంటుంది. ఒక్కోసారి ఆవేదన ఆలోచనకు దారితీస్తే మరోసారి ఆలోచన ఆవేదనకు దారితీయవచ్చు.[9] చాసో కథకు సౌందర్యాన్ని అందించిన వాస్తవికత గురించి రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు ఒక వ్యాసంలో వివరించారు. చాసో కథకు నేపథ్యంగా నిలిచిన జీవన యథార్థాన్ని ఆయన విశ్లేషించారు. ''ప్రతీ పాత్రా సజీవంగా, ప్రతీకథా ఆత్మీయంగా గోచరించేలాగా రచనలో కథాత్వంకాక జీవితం రూపుకట్టేలాగా సరళ సహజ సుందరంగా రాయడం చాసోలాంటి కొద్దిమందికే పరిమితం. పాఠకుణ్ణి ఆలోచించమనడం మంచి రచయిత లక్షణం. నవల విషయంలో లేని నిస్సందిగ్ధతతో తెలుగు కథని గురించి 'ప్రౌఢం' అని చెప్పగలుగుతున్నామంటే 'చాసో' వంటి కథకుల పరిణత ప్రజ్ఞ కారణంగానే.''[10]

కథలో భాషా ప్రయోగానికి సంబంధించిన చర్చ కూడా ప్రముఖంగా జరిగింది. ముఖ్యంగా ముళ్ళపూడి వెంకటరమణలాంటి రచయితలు పదప్రయోగం ద్వారా హాస్య, వ్యంగ్య రచనల్లో తీసుకువచ్చిన మార్పులను విశ్లేషించే ప్రత్యేక అధ్యయనం కూడా దినపత్రికల్లో కనిపించడం ఒక విశేషం. ''ప్రత్యేకంగా పేరడీకీ గుడికడుతూ ఒక రచన చెయ్యకపోయినా చెప్పుకోదగ్గ వైవిధ్యం ప్రదర్శించి పదం మొదలు పద్యందాకా పేరడీకరించి భాషతో హాస్యానికి సేవ చేయించి, భాషా సేవతో తెలుగు హాస్యానికి చేవ కలిగించారు రమణ.''[11]

ఈ దశాబ్ది తెలుగు కథ వాస్తవ జీవితానికి అతి సన్నిహితంగా నిలిచిందనడానికి ఎన్నో దాఖలాలు కనిపిస్తాయి. వాటికి నికార్సయిన ఉదాహరణ అమరావతి కథలు. ఎలాంటి అతిశయోక్తులు, కృత్రిమ నిర్మాణ చాతుర్యం లేకుండా సహజ సిద్ధమైన జీవన పరిమళంతో సత్యం శంకరమంచి రాసిన ఈ కథలపైన దినపత్రికల్లో కూడా చక్కని విశ్లేషణా వ్యాసాలు వెలువడ్డాయి. ఉదాహరణకు బొమ్మారెడ్డి వెంకటరామిరెడ్డి ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాసిన వ్యాసం పేర్కొనదగినది. '' ఈ కథా శిల్పంలోని నమ్రత, తాదాత్మ్యతకు సత్యంగారు ఆకాశమంత గర్వపడాలి. ఎందుకట్టెల్లాంటి ఉత్తి సిద్ధాంతాలతోగాక తనూ ఒకడై బ్రతికిన సమాజంలోని అన్ని వేపుల్ని కోణాల్నీ అంత తాదాత్మ్యంగా అద్దం పట్టారు సత్యం శంకరమంచి''.[12] కథాశిల్పంలో కొత్త సొగసులు చూపించి ఒక తరాన్ని ప్రభావితం చేసిన రావిశాస్త్రి కథలపైన కూడా సంఖ్యానేకంగా విశ్లేషణా వ్యాసాలు వెలువడ్డాయి. రావిశాస్త్రి ఇతివృత్తంగా తీసుకున్న జీవన అంశాల్ని ఒక సామాజిక దృక్పథంతో గ్రహించిన రాజకీయార్థిక వ్యవస్థకు విహంగాలోకనం చేసే రచనలు విశేషించి పేర్కొనదగినవి. ఉదాహరణకు టి. యల్.కాంతారావు, రావిశాస్త్రి ప్రొహిబిషన్ కథలమీదే ఒక విశ్లేషణను అందించారు. ''న్యాయమూర్తుల చేతుల్లో, దొంగసాక్షుల చేతుల్లో ఘోరంగా పరాజయం పొందటమేకాక అతి సామాన్యుల జీవితాలకు ఒక శాపమై అన్యాయం న్యాయంగా, అధర్మం ధర్మంగా చలామణి

అయ్యేవరకూ వచ్చింది. అందుచేతనే మెజిస్ట్రేట్ గవర్నమెంట్‌కు పిచ్చెత్తింది అన్నది. ఈ కథల్లో ప్రొహిబిషన్ అరాచకత్వమేకాక జీవితంలోని అనేక కోణాలు బహు ప్రతిభావంతంగా ప్రదర్శింపబడినై.'' [13] సమకాలీన కథారచయితలపై ఎప్పటికప్పుడు దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో విమర్శనాత్మక వ్యాసాలు వెలువడటం ఈ దశాబ్దంలోనే కనిపించే ఒక విశేషం. కాళీపట్నం రామారావు, పులికంటి కృష్ణారెడ్డి, భూషణంలాంటి సమకాలీకులపై అనేక వ్యాసాలు ప్రచురితమయ్యాయి. పులికంటి కృష్ణారెడ్డి కథల్లో విశిష్టతను వివరిస్తూ - ఆంధ్రప్రభ దినపత్రికలో ఒక వ్యాసం ప్రచురితమైంది. ''భాషలోను, భావంలోను తెలుగు కథను పల్లె పట్టుకు పరుగులెత్తించి బస్తీ బతుకులోని సుస్తీకి కొత్త మందు కనిపెట్టి పంపిన సాహితీ 'భిషక్కు'. జానపద కథాశిల్పి శ్రీ పులికంటికృష్ణారెడ్డి ఈనాడు శక్తివంతమైన కథలు రాసే కొద్ది మందిలో ఒకడు.'' [14] తెలుగు కథా రచన పోనుపోను ప్రాంతీయ ముద్రను సంతరించుకుంటోంది. ఆయా ప్రాంతాల ప్రాంతీయ విశిష్టతలను వివరించే ధోరణి క్రమంగా విస్తరిస్తోంది. తెలంగాణా, రాయలసీమ, ఉత్తరాంధ్ర జీవితాల్లోని నిర్దిష్టమైన అంశాలను ఈ కథకులు అన్వేషిస్తున్నారు. ఈ వాస్తవికతను ప్రతిబింబించే విశ్లేషణా వ్యాసాలు పేర్కొనదగినవి. ఉదాహరణకు సముద్రాల సత్యనారాయణ 'శ్రీకాకుళ భారత వ్యాసుడు భూషణం' అనే వ్యాసం ఆంధ్రభూమి దినపత్రికలో వెలువడింది. ''కొండగాలి నవలలో భూషణం నూరుపాళ్లు కనిపిస్తాడు. శ్రీకాకుళం మాండలీకం అతని చేతుల్లో వుంది. ఇంతకీ భాష అంటే? అదో పనిముట్టు .దానితో భూషణం చూపించిన పనివాడితనం ఈ నవల. పాఠక జనాల జీవితాలలో ఒక్కొక్క మహాభారత గాథ ఇమిడి ఉంది.'' [15]

1980ల తరువాత తెలుగు కథ నిర్దిష్టమైన పరిణామక్రమాన్ని ఏర్పరచుకుంది. కొత్త ప్రయోగాలతోపాటు కొత్త ధోరణులు కూడా తెలుగుకథలో ప్రవేశించాయి. వీటన్నిటికి ప్రతిఫలనంగా నిలిచే విమర్శా వ్యాసాలు దినపత్రికల్లో కనిపిస్తాయి. కథా రచనకు సంబంధించి విమర్శరంగంలో ఒక కొత్తతరం ప్రవేశించిందనడానికి దినపత్రికల సాహిత్య అనుబంధాలే ఆధారం. కథల సారాంశాన్ని వివరించడానికే పరిమితమయ్యే వ్యాసాలతోపాటు ఆయా కథల్లో పరోక్షంగా పేర్కొనబడిన సామాజిక, రాజకీయార్థిక అంశాలను విశ్లేషించే విమర్శావ్యాసాలు కూడా ప్రత్యేకంగా ప్రస్తావించదగినవి, సృజనాత్మకంగా కథారచనలో ఏయే మార్పులు వచ్చాయో దానికి తగ్గట్టుగానే కథా విమర్శ రంగంలో కూడా కొత్త విమర్శ సాధనాలు ఏర్పడ్డాయి. 1980 నుంచి 90 వరకు తెలుగు దినపత్రికల్లో వెలువడిన కథాసాహిత్య విమర్శ వ్యాసాలను మొత్తంగా కథాసాహిత్యానికి ప్రామాణికంగా తీసుకోవచ్చు.

పాదసూచికలు :

1. డ్కాక్టర్ పోరంకి దక్షిణామూర్తి , 'తెలుగు కథానిక : పుట్టు పూర్వోత్తరాలు' , ఆదివారం , విశాలాంధ్ర దినపత్రిక, నవంబర్ 22,1981.

2. పోలాప్రగడ సత్యనారాయణ, 'తెలుగు కథల్లో గ్రామీణ జీవితం', ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం, ఫిబ్రవరి 23, 1986.

3. పులికంటి కృష్ణారెడ్డి '' ఆధునిక కథారచనలో కథనం'', ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం, జూన్ 24, 1984.

4. సొదుం రామ్మోహన్, ' ఇక 'శిల్పం' మాటకొస్తే'..., ఆంధ్రజ్యోతి దినపత్రిక ఏప్రిల్ 1988.

5. ''పూర్వ కథకులలో శ్రీపాద, చలం, కొడవటిగంటి, గోపీచంద్, బుచ్చిబాబు, తురగా కృష్ణమోహనరావు, నేటి కథకులలో ఆదివిష్ణు, రావి కొండలరావు, తంబు, కవనశర్మ, మధురాంతకం రాజారాం, పోలాప్రగడ రాజ్యలక్ష్మి, మల్లాది వెంకట కృష్ణమూర్తి, యర్రంశెట్టి సాయి ప్రభృతులు తమ కథలలో అవకాశం దొరికినపుడల్లా హాస్యాన్ని పండించారు. నవ్వటం తేలికగానీ, తెలుగు పాఠకుడిని హాయిగా నవ్వించే కథరాయడం అంత తేలికకాదు'' - కనక్‌ప్రవాసి, తెలుగులో హాస్య కథలు, ఆంధ్రప్రభ దినపత్రిక, డిసెంబర్ 15, 1985.

6. డి. రజనీకుమారి, 'భయంలేని 'భయం' కథ', ఆంధ్రభూమి దినపత్రిక, ఆగస్టు 13, 1988.

7. ఆర్. చంద్రశేఖర్‌రెడ్డి, 'తెలుగు కథల్లో ఆణిముత్యం - దిద్దుబాటు', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం అనుబంధం, డిసెంబర్ 4, 1983.

8. పురాణం సుబ్రహ్మణ్యశర్మ, ' నీలికథ ఎప్పుడు, ఎలా రాశాను', ఆంధ్రజ్యోతి సాహిత్య వేదిక, మే 13, 1988.

9. కాత్యాయని విద్మహే, 'చాసో కథలలో జీవ చైతన్యం', విశాలాంధ్ర దినపత్రిక, శుక్రవారం మార్చి 22, 1985.

10. రెంటాల శ్రీవెంకటేశ్వరారవు, 'చాసో కథాకమామిషు', ఆంధ్రజ్యోతి దినపత్రిక, జులై 20, 1986.

11. రెంటాల శ్రీవెంకటేశ్వరారవు, 'ముళ్లపూడి వెంకటరమణీయం', ఆంధ్రజ్యోతి దినపత్రిక, మే 25,1986.

12. బొమ్మారెడ్డి వెంకటరామిరెడ్డి, 'అమరావతి కథల ఆధునిక ప్రపంచం', ఆంధ్రజ్యోతి దినపత్రిక సోమవారం ఫిబ్రవరి 5, 1990.

13. టి.యల్.కాంతారావు, 'ప్రొహిబిషన్ కథలు: రావిశాస్త్రి', ఆంధ్రభూమి దినపత్రిక, ఆగస్టు 1, 1987.

14. ఒక విమర్శకుడూ, 'పులికంటి కథల్లోని కమనీయత', ఆంధ్రప్రభ దినపత్రిక, అక్టోబర్ 20, 1985.

15. సముద్రాల సత్యనారాయణ, 'శ్రీకాకుళ భారత వ్యాసుడు భూషణం', ఆంధ్రభూమి దినపత్రిక, జులై 23, 1988.

★★★

# సి. నవల

1980ల తరువాత తెలుగు నవలా సాహిత్యంలో వ్యాపార విలువలు మరింత పెరిగిపోయాయి. దిన, వారపత్రికల్లో వెలువడుతున్న సీరియల్ నవలల్లో యథార్థ జీవితానికి ఏ మాత్రం సంబంధం లేని ఇతివృత్తాలతో నిండిపోయాయి. 1980-90ల మధ్య తెలుగు దినపత్రికల్లోనూ, సాహిత్య అనుబంధాల్లో వచ్చిన వ్యాసాల్లో నవలా ప్రక్రియలోని ఈ ధోరణిని విమర్శించేవి అధికంగా వుండటం ఆశ్చర్యమేమీకాదు. వ్యాపార దృక్పథంలో నవల నిజ జీవితానికి దూరమవుతుందన్న ఆవేదన సాహిత్య విమర్శకులు వ్యక్తం చేస్తూ వచ్చారు. నవలకు జీవితానికి మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషిస్తూ వల్లంపాటి వెంకటసుబ్బయ్య 'నవల జీవితం' అనే శీర్షికన ఆంధ్రభూమి దినపత్రికలో రాసిన వ్యాసంలో ఇలా అన్నారు. '' ఈనాడు తెలుగు నవలను వ్యాపార దృష్టి ప్రముఖంగా పరిపాలిస్తున్నది. పత్రికలు, రచయితలు జీవితాన్ని తిరస్కరించడంలో ఒకరితో మరొకరు పోటీ పడుతున్నారు. జీవితం నుంచి ప్రేరణ పొందవలసిన నవలా రచయితలు ప్రేరణ కోసం జీవితం బయట మాత్రమే వెదుకుతున్నారు. కొన్ని మినహాయింపులుండవచ్చుకానీ సాధారణ పరిస్థితి మాత్రం ఇలాగ ఉంది. ఈ వ్యాపార ప్రవాహంలో చాలా మంది మంచి నవలా రచయతలు కొట్టుకుపోయారు. మరికొందరు మతం మార్చుకుని జీవితాన్ని త్యజించి వ్యాపారాన్ని కౌగిలించుకున్నారు.''[1] వ్యాపార నవల ప్రధానంగా వాస్తవికతకు పూర్తిగా వ్యతిరేకమైన ఊహా ప్రపంచాన్ని పాఠకుల కోసం సృష్టించింది. దీనివల్ల నవలా సాహిత్యానికి సంబంధించినంత వరకు రెండురకాల పాఠకులు ఏర్పడ్డారని విమర్శకులు వర్గీకరించారు. '' ఈలోగా కొత్తరకం పాఠకులు పుట్టుకువచ్చారు. వంటింటిలోంచి ఉన్నపళంగా ప్రపంచంలోకి వచ్చిపడిన ఈ పాఠకులకు కలల్ని పెంచి పోషించే సాహిత్యం కావలసి వచ్చింది. తమ జీవితాలలో సాధించలేమని అనుకున్న వాటిని నవలలు చదవడం ద్వారా వాటిల్లో హీరో, హీరోయిన్ల ద్వారా నెరవేర్చుకోసాగారు. ఫలితంగా పాఠకులు రెండు రకాలుగా చీలిపోయారు. సీరియస్ పాఠకులు ఒక రకం, కాలక్షేపం పాఠకులు మరొక రకం. సీరియస్ పాఠకుల విషయం అలా ఉంచి ' ఎంటర్‌టైన్‌మెంట్ పాఠకుల'ను గురించి కొద్దిసేపు ఆలోచించవలసిన బాధ్యత మనకున్నది.'' [2] ఉత్తమాభిరుచి పాఠకుల

కోసం కాక కేవలం కాలక్షేపం కోసం చదివేవారికి సీరియల్ నవలా సాహిత్యం పరిమితమైంది. చాలా మంది విమర్శకులు ఈ రకమైన 'రచన' ధోరణిని సాహిత్యరూపంగా భావించడానికి నిరాకరించాయి. దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో ఈ క్షీణధోరణులను నిరాకరిస్తూ, అనేక విమర్శా వ్యాసాలు వెలువడ్డాయి. ''తులసిదళం వంటి నవలతో ఈ రకమైన జుగుప్సావహమైన రచనలు పెద్దగా ప్రాచుర్యం పొందాయి. నిజానికి వీటిని సాహిత్యరూపంగా 'భ్రమించటానికి' కూడా మనస్కరించడంలేదు. అయినా ఈ బాపతు రచనలు సామాన్య పాఠకుల ఆలోచనా ధోరణులను అపమార్గం పట్టించడానికి, మూఢ విశ్వాసాల పాతాళంలోకి అణగదొక్కడానికి చేయగలిగినదంతా చేస్తాయి.''[3] అయితే ఇదే సమయంలో వాస్తవ జీవితాన్ని ప్రతిబింబించే నవల విశ్లేషణ కూడా దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో కనిపిస్తుంది. చాలా కాలంగా నవలా సాహిత్యాన్ని విమర్శకులు పరిశీలించకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని భావించిన విమర్శకులు ఉన్నారు. ''మన పెద్దలకి చాలా కాలంగా నవలంటే చిన్నచూపు. ఇదేదో కాలక్షేపపు సాహిత్యంగా వారికి కనిపించేది. ఎవరూ సీరియస్‌గా నవలని చాలా కాలం వరకూ పట్టించుకోలేదు. అందుకే నవలమీద తెలుగులో తగినంత విమర్శ లేదు.''[4] విడివిడిగా తెలుగు నవలలోని గుణాత్మకమైన అంశాలు ప్రస్తావిస్తూ వివిధ విమర్శా వ్యాసాలు వెలువడ్డాయి. నవలా రచనా ధోరణుల్ని విశ్లేషించే వ్యాసాలు, విడివిడిగా వివిధ నవలల్ని పరామర్శించే వ్యాసాలు వివిధ దినపత్రికల్లో విశేషంగా కనిపిస్తాయి. 'తెలుగు నవలపై మహిళా ఉద్యమాల - ప్రభావం' అనే అంశంపై ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో కాత్యాయిని విద్మహే ఒక వ్యాసం ప్రచురించారు. నవలా సాహిత్యానికి సంబంధించి మౌలిక భావనల్ని అన్వయించే విమర్శా వ్యాసాలు గంభీరమైన అంశాలను చర్చకు పెడుతూ సాహిత్య అనుబంధాల్లో వెలువడ్డాయి. మహిళా ఉద్యమం నవలను ఏ విధంగా ప్రభావితం చేసిందో కాత్యాయిని తమ వ్యాసంలో విశ్లేషిస్తూ ఇలా అన్నారు. ''కమ్యూనిస్టు ఉద్యమంతో ముడిపడ్డ మహిళా ఉద్యమ ప్రభావంతో వచ్చిన నవలలకు రంగనాయకమ్మగారి 'జానకి విముక్తి'ని బలమైన ప్రతినిధి నవలగా చెప్పుకోవచ్చు.''[5]

నవలా సాహిత్యాన్ని గురించి దినపత్రికల వ్యాసరూపంలో విస్తృతమైన చర్చలకు అవకాశం ఏర్పడింది 80ల తరువాతనేనని చెప్పవచ్చు. నవలా రచనకు సంబంధించిన భిన్న కోణాలను ఆవిష్కరిస్తూ అనేక విమర్శావ్యాసాలు దినపత్రికల సాహిత్య అనుబంధంలో వెలువడ్డాయి. ఉదాహరణకు తెలుగులో 'హాస్య నవలలు' అనే శీర్షికన కోడూరి శ్రీరామమూర్తి ఆంధ్రప్రభ దినపత్రికలో ఒక వ్యాసం రాశారు. అందులో ఇటీవలి కాలంలో నవలల్లో హాస్యరస పోషణకు ఎంత ప్రాధాన్యం ఏర్పడిందో వివరించారు. ''తెలుగు సాహిత్యంలో హాస్యరసపోషణకు ప్రాధాన్యత లభించడం అనేది ఇటీవలి పరిణామమనే చెప్పాలి. మన పూర్వీకులకు ఈ రసంపట్ల ప్రత్యేకమైన శ్రద్ధ కనబడదు. ''శృంగార వీరమోర్వన!'' అంటూ మన లాక్షణికులు ప్రధాన రసాలైన శృంగార వీరరసాలకు హాస్యరసాన్ని 'అంగం'గా మాత్రమే ఉపయోగించమన్నారు. దానికి

'అంగి' రసంగా అంటే ప్రధానరసంగా ఉపయోగించడం అనేది ఒకప్పుడు సంస్కృత ప్రహసనాల్లో మాత్రమే కనబడేది. కొందరు పూర్వ కవుల రచనల్లో గిలిగింతలు పెట్టే హాస్యం తళుక్కున మెరిసిన సందర్భాలు లేకపోలేదుగానీ దానికి వున్న ప్రాధాన్యత తక్కువే అని చెప్పాలి.'' [6]

ఇవికాక నవలా సాహిత్య విశ్లేషణ గురించి దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో వెలువడిన వ్యాసాల్లో మరో మూడు ముఖ్యమైన తరహాలో కనిపిస్తాయి. వాటిల్లో మొదటిది ఒక రచయితకు సంబంధించిన నవలా సాహిత్యాన్ని అంతా, మొత్తంగా విశ్లేషణకు స్వీకరించడం, రెండవది: విడివిడిగా ఒక్కొక్క నవలను తీసుకుని లోతైన అధ్యయనం ద్వారా కొన్ని కొత్త అంశాలను వెలుగులోకి తీసుకురావడం, మూడవది: సాహిత్య అనుబంధాల్లో వివిధ శీర్షికల ద్వారా నచ్చిన నవలలను పరిచయం చేయడం. ఇందులో మొదటి తరహా పద్ధతి అంటే ఒక్కొక్క రచయిత నవలా సాహిత్యం తీసుకుని విశ్లేషించే పద్ధతికి ఉదాహరణ : ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో 'గోపీచంద్ నవలల్లో భావపరిణామం' శీర్షికన టి. యల్. కాంతారావు రాసిన వ్యాసం. ఈ తరహా వ్యాసాల్లో రచయత సమగ్ర వ్యక్తిత్వాన్ని సాహిత్య క్రమపరిణామాన్ని సాధారణీకరించి చెప్పడం కనిపిస్తోంది. 'గోపిచంద్ నవలల్లో భావ పరిణామం' ద్వారా సాహిత్య వ్యక్తిత్వ వికాసాన్ని విశ్లేషిస్తూ టి. యల్. కాంతారావు ఇలా అంటారు. ''గోపిచంద్ రాసిన అనేకానేక కథలలో తన తండ్రిగారి భావాలకు వారసుడిగానే కనబడతాడు. నవలా రచనలో ఆయనలో వచ్చిన క్రమపరిణామాన్ని జాగ్రత్తగా అవలోకిస్తే తండ్రిగారి భావనా ప్రపంచం నుంచి పోనుపోనూ దూరంగా జరిగిపోయాడని అర్థం అవుతుంది. అలా సాగిన ఆయన భావనా ప్రపంచ ప్రస్థానం సహజమైనదేకాని లౌకికమైనది కాదు. స్వలాభాపేక్షితమైనదీకాదు. అతని వ్యక్తిత్వం, భావ ప్రపంచం, రచనా ప్రపంచం అంతా మానవుని మనుగడకు, సంక్షేమానికి, పురోగమనానికి చెందినదని ఘంటా ఘోషంగా చెప్పవచ్చు. ఆయన నమ్మకంలో వున్న నిజాయితీ ఆయన రచనలో చిత్తశుద్ధిగా ప్రతిఫలించింది. [7]

ఇక రెండవ పద్ధతి విడివిడిగా ఆయన భావాల్ని తీసుకుని ఇతివృత్తాన్ని , రచనా విధానాన్ని , తాత్త్వికసారాంశాన్ని పరిశీలించే ధోరణి కనిపిస్తుంది. దీనికి ఉదాహరణగా నిలిచే విమర్శా వ్యాసాలు 1980 తరువాత పెద్ద సంఖ్యలోనే కనిపిస్తాయి. ఈ విధంగా చర్చించబడిన నవలల్లో ఓల్గా 'మానవి'. ఈ నవలపైన విస్తృ, తస్థాయిలో చర్చ జరిగింది. ఆంధ్రభూమి దినపత్రికలో ఈ నవలపై వెలువడిన ఒక వ్యాసం ఇలా కొనసాగింది. '' ఈ పుస్తకం రెండు ప్రేమల సిద్ధాంతానికి ఘనంగా స్వాగతం చెప్పాలని ప్రయత్నించింది. స్త్రీల సమస్యల గురించి ఆలోచించినట్లు కనపడే ఈ పుస్తకంలో ఎక్కువగా మగవాళ్ల 'సమస్యలే' ప్రధానమయ్యాయి.'' [8] తెలుగు దినపత్రికల్లో సాహిత్య విమర్శకు ఎంత విస్తారమైన పరిధి ఏర్పడిందో ఇలాంటి విమర్శా వ్యాసాల వల్ల అర్థమవుతోంది . ఒక పత్రికలో ఒకే నవలపై సుదీర్ఘకాలంపాటు చర్చలు కొనసాగిన సందర్భాలు కూడా

ఉన్నాయి. రచయితలు వాటికి సమాధానమిచ్చిన సందర్భాలు వున్నాయి. మానవి నవలపై జరిగిన చర్చలో రచయిత్రే స్వయంగా తన నవలపై వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు. ''మానవి నవలలో రెండు అంశాలున్నాయి. అవి ఒకటి: స్త్రీ, పురుష సంబంధాలకు సంబంధించిన అంశం. రెండు: పార్టీ కార్యకలాపాలకు (నిర్మాణానికి) సంబంధించిన అంశం. అయితే నేను మొదటి విషయం (స్త్రీ, పురుష సంబంధాలను) గురించి మాత్రమే నా అభిప్రాయాలను చర్చకు పెడదామనుకుంటున్నాను. (పార్టీల నిర్మాణాలూ, వాటి కార్యకలాపాలూ చీలికలూ మొదలగు అంశాలు అప్రధానమైనవని నా అభిప్రాయం కాదు కానీ ఈ 'మానవి'నవలలో స్త్రీ, పురుష సంబంధాలకు సంబంధించిన అంశమే ప్రధానమైనదని భావించి 'పార్టీ'లకు సంబంధించిన చర్చ వదిలేస్తున్నాను.'' [9]

ప్రయోగాత్మక నవలలపై కూడా విశేషమైన విమర్శా వ్యాసాలు వెలువడటం ఈ దశాబ్దంలో గమనించవచ్చు. చైతన్య స్రవంతి శిల్ప ప్రయోగంలో వెలువడిన అంపశయ్య నవలపైన కాత్యాయినీ విద్మహే 1990 ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఒక వ్యాసం రాశారు. ఈ నవలలోని ప్రయోగాత్మక లక్షణాలను ఆమె విశ్లేషించారు. ''స్వతంత్ర భారతదేశంలో ఉద్యోగాల వేటలో వున్న యువ మేధావుల మనోలోకాలను బుచ్చిబాబు చైతన్య స్రవంతి కథలో మన ముందుంచాడు. ఈ కథ చదివి ప్రేరణ పొంది ఈ నిరుద్యోగ యువ మేధావి చదువుకుంటున్నప్పుడు ఎలా వుండటానికి వీలుందో భావన చేసి మరింత విస్తృతమైన భూమిక నుంచి 'అంపశయ్య' నవల రాశాడు నవీన్.'' [10]

నవలా సాహిత్య రూపంలో వచ్చిన నిర్మాణాత్మకమైన మార్పును విశ్లేషించే వ్యాసాలు కూడా ఈ దశాబ్దంలో వచ్చాయి. ఉదాహరణకు మధురాంతకం మహేంద్ర 'స్వర్ణసీమకు స్వాగతం' అనే నవలపై ఆర్. యస్. సుదర్శనం రాసిన వ్యాసంలో నవలా రూపానికి సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. [11] శిల్పపరంగా రావిశాస్త్రి నవలలు ప్రత్యేకించి పేర్కొనదగినవి. వాటిపైన సంఖ్యానేకంగా విమర్శా వ్యాసాలు వెలువడ్డాయి. [12, 13] ప్రసిద్ధ విమర్శకులు, రచయితలు తమకు నచ్చిన నవలల్ని గురించి వివిధ శీర్షికల క్రింద రచించారు. దాదాపు ప్రతీ సాహిత్య అనుబంధంలోనూ ఈ విధమైన నవలా పరిచయ శీర్షికలు వెలువడ్డాయి. ఉదాహరణకు విశాలాంధ్ర దినపత్రిక 'నాకు నచ్చిన నవల' అనే శీర్షికను నిర్వహించింది. [14]

పాదసూచికలు :

1. వల్లంపాటి వెంకటసుబ్బయ్య, 'నవల - జీవితం', ఆంధ్రభూమి దినపత్రిక, సెప్టెంబర్ 5, 1987.

2. అఫ్సర్, 'నిజం చూడలేని నేటి తెలుగు నవల', ఆంధ్రజ్యోతి దినపత్రిక, మార్చి 30, 1986.

3. సి. ఉమామహేశ్వరరావు, 'తెలుగు నవలలో క్షీణధోరణులు', విశాలాంధ్ర

ఆదివారం దినపత్రిక, ఫిబ్రవరి 1, 1989.

4. కాత్యాయిని విద్మహే, ''తెలియని జీవితాలకు తప్పుడు నకళ్లు నేటి నవలలు''.

5. కాత్యాయిని విద్మహే, 'తెలుగు నవలపై మహిళా ఉద్యమాల ప్రభావం', ఆంధ్రజ్యోతి సాహిత్య వేదిక, సోమవారం మే 21, 1990.

6. కోడూరి శ్రీరామమూర్తి, 'తెలుగులో హాస్య నవలలు', ఆంధ్రప్రభ దినపత్రిక, మార్చి 23, 1986.

7. టి. యల్.కాంతారావు, 'గోపిచంద్ నవలల్లో భావపరిణామం', ఆంధ్రజ్యోతి సాహిత్య వేదిక, ఏప్రిల్ 28, 1985 ఆదివారం అనుబంధం.

8. వి.పద్మ, '' ఓల్గా నవల అవ'మానవీ'యం'', ఆంధ్రభూమి దినపత్రిక, జనవరి 5, 1990.

9. ఓల్గా, 'మానవి - బంధవిముక్తి', ఆంధ్రభూమి దినపత్రిక, మార్చి 2,1990.

10. కాత్యాయినీ విద్మహే, 'చైతన్య స్రవంతి శిల్ప ప్రయోగంలో సఫలమైన నవల 'అంపశయ్య', ఆంధ్రజ్యోతి దిన పత్రిక, మార్చి 5, 1990.

11. ' ఈ నవలలో అంతా ప్రత్యక్ష దృశ్యమే. భిన్న ప్రవృత్తులుగల వ్యక్తుల చిత్రణను, వారి హావభావాల ద్వారా, చేష్టల ద్వారా కన్నులుగట్టేలా చెయ్యడంలో రచయిత ఒక ఆర్కెస్ట్రాని తయారు చేసిన ప్రతిభ కనబరచాడు', - ఆర్. యస్. సుదర్శనం, 'స్వర్ణసీమకు స్వాగతం' (మానవత్వపు సంక్షోభాన్ని ఉన్నతంగా చిత్రించిన నవల).

12. మందడి మాధవరెడ్డి, రావిశాస్త్రి గ్రామీణ జీవితానికి నిలువుటద్దం - 'సొమ్ములు పోనాయండి', ఆంధ్రభూమి దినపత్రిక, ఫిబ్రవరి 10, 1990.

13 ' ఇందులో గోవులొస్తున్నాయి జాగ్రత్త, శ్రీకాకుళ పోరాట నేపథ్యంగా వుంది. అమాయకమైన గోవులు అవసరమైతే ఎలా ఎదురు తిరుగుతాయో చూపించడం, అన్యాయంగా ఆక్రమించిన భూములను విడిపించుకోవడంగా మరీడీ మాలక్ష్మిని రాజయోగి చెర నుంచి విడిపించడంతో పోల్చారని చెప్పవచ్చు' - జి. రుక్మిణి, 'తెగింపు ఆ పాత్రల స్వభావం', ఆంధ్రజ్యోతి దినపత్రిక, జూన్ 6, 1988.

14. ' ఈ నవల రచయిత ఎలెక్స్‌హేలీయొక్క సూక్ష్మమైన, తీక్షణమైన పరిశోధనా లక్షణానికి నిజాయితీ చిత్రణం, ఎలెక్స్‌హేలీ తన అమ్మమ్మ నోటి నుండి విన్న తన పూర్వీకుల చరిత్రను ఆధారంగా చేసుకొని, అమెరికా పౌరుడిగా చలామణి అవుతున్న తాను, తన వంశవృక్షపు తల్లివ్రేళ్లు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవాలన్న జిజ్ఞాసతో శాస్త్రీయమైన, శ్రమతో కూడిన, ఖర్చుతోకూడిన పరిశోధన చేసి రాసిన గ్రంథమే 'రూట్స్' ( ఏడుతరాలు) నవల - 'కాత్యాయినీ విద్మహే, 'నాకు నచ్చిన నవల - ఏడుతరాలు' విశాలాంధ్ర దినపత్రిక, గురువారం జనవరి 14, 1982.

***

# iii. ఇంటర్వ్యూలు

1980-90ల మధ్య వివిధ దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో వచ్చిన ఇంటర్వ్యూలు ఆయా సాహిత్య సామాజిక సందర్భాలను వివాదాస్పదమైన వ్యాఖ్యలతో విస్తారమైన చర్చలకు అవకాశం కల్పించింది. కవుల, రచయితల అభిప్రాయాల ప్రకటనలకు మాత్రం ఈ ఇంటర్వ్యూలు పరిమితులు కాలేదు. ఆధునిక సాహిత్యానికి సంబంధించిన అనేక అంశాలు ఈ ఇంటర్వ్యూలలో ప్రస్తావించబడ్డాయి. వర్తమాన నవల గురించి రావూరి భరద్వాజ ఒక ఇంటర్వ్యూలో ప్రస్తావిస్తూ అదనపు సుఖాల కోసం అధమ రచనలు చేయడం నేరమంటారు. అలాగే తమ చైతన్య దృక్పథాన్ని గురించి చెబుతూ....''వాళ్ళు సంఘటిత కార్మికులు కాదండి. విపరీతమైన దరిద్రం అనుభవిస్తున్న దశలో కూడా నేనా విధంగా రాయలేకపోయాను. నాకా చైతన్యం వున్నదని ఇతరుల్ని మభ్యపెట్టలేను. నన్ను నేను మభ్యపెట్టుకోలేను''.[1] సాహిత్యంలో వాస్తవికత ప్రతిబింబించే తీరును వివరిస్తూ ప్రసిద్ధ రచయిత రావిశాస్త్రి ఒక ఇంటర్వ్యూలో ఇలా అంటారు.''జీవితాన్ని ఉన్నదున్నట్లుగా సాహిత్యంలో చిత్రించడం ఎప్పుడూ జరగదు. ఏ విషయాన్ని తీసుకోవాలనుకున్నప్పుడే మనిషికీ మనిషికీ తేడా వస్తుంది. జీవితం గురించి వారి వారి అభిప్రాయాలనుబట్టి చిత్రించడం జరుగుతుంది.''[2] ఆధునిక కవిత్వానికి సంబంధించిన కొత్తకోణాలపై దృష్టిసారించే ప్రయత్నం ఈ దశాబ్దంలో వివిధ ఇంటర్వ్యూల్లో కనిపిస్తుంది. ఆధునిక వచన కవిత్వం రాజకీయ నినాదాలతో నిండిపోయిందన్న అభిప్రాయం ఒక వర్గం రచయితల్లో ఏర్పడింది. అది ఒక దశలో మార్క్సిస్టు వ్యతిరేకంగా కూడా పరిణమించింది. ఆచార్య పేర్వారం జగన్నాథం ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ''అభ్యుదయ కవిత్వానంతర ధోరణులు'' పుస్తకం ప్రచురించడానికిగల కారణాలు కేవలం మార్క్సిస్టు వ్యతిరేకతా కాదు. సమగ్ర మానవ వికాసానికి అవసరమైన అన్ని హంగుల్ని, అవకాశాల్నీ, అంతస్తుల్నీ గుర్తించి అసూయాద్వేషాలు లేని, కలతలూ కలహాలూ లేని, దోపిడీ దౌర్జన్యాలు లేని వ్యవస్థా నిర్మాణం కోసం ప్రేరేపిస్తూ మనిషిని మనిషి ప్రేమిస్తూ మానవతకు మహోన్నత శిఖరంపై అధిష్ఠింపజేసే ఉత్తమ సాహిత్యంపై ఆసక్తిని, అనురక్తిని పెంపొందించాలన్న తపన, ఆ పుస్తక ప్రచురణ వెనకాల వున్న బలమైన సామాజిక సిద్ధాంతం. [3]అని పేర్కొన్నారు. సాహిత్య రాజకీయాలు కూడా ఈ ఇంటర్వ్యూల్లో చర్చకు వచ్చాయి.

అరసం, విరసం రాజకీయ దృక్పథాల్లో ఉన్న అంతరాన్ని వివిధ డాక్యుమెంట్లతో వివరించిన 'తెలుగు సాహిత్యంలో కల్లోల దశాబ్దం' గ్రంథ రచయిత అనంతం ఇంటర్వ్యూ ఆంధ్రప్రభ దినపత్రికలో వెలువడింది. ఆ ఇంటర్వ్యూలో ఆయన అరసం చీలికకు, విరసం ఆవిర్భావానికి ప్రేరణ దిగంబర కవులేనన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తన గ్రంథ నేపథ్యాన్ని వివరిస్తూ అనంతం ఈ విధంగా పేర్కొన్నారు. ''తెలుగు సాహిత్యంలో కల్లోల దశాబ్దం (1965-75).. నేను ఎమర్జన్సీ రోజుల్లో రాశాను. తర్వాత పది సంవత్సరాలు (1975-85) క్షీణ దశాబ్దంగా రెండో సంపుటి 1987 ప్రాంతాల్లో రాశాను. కల్లోలం తరువాత క్షీణం రావడం తెలుగు సాహిత్యం చేసుకున్న దౌర్భాగ్యం.''[4] సాహిత్య చరిత్ర రచనల్లో ఆరుద్ర కొత్త ప్రమాణాలను ఏర్పరచారు. సమగ్రాంధ్ర సాహిత్యం సంపుటాలు ఎంతో ప్రసిద్ధమైనది. 1989 లో ఇరవై ఏళ్ల తరువాత వాటిని పునర్నిర్మించిన ప్రజాశక్తి ఆదివారం అనుబంధాల్లో పూర్తిగా సమగ్రాంధ్ర సాహిత్యాన్ని గురించే ఆరుద్రతో ప్రత్యేక ఇంటర్వ్యూ ప్రచురితమైంది. సమగ్రాంధ్ర సాహిత్య రచనకు ప్రేరణ కలిగించిన అంశాలను పేర్కొంటూ ఆరుద్ర ''నేను చదివిన సాహిత్య చరిత్రలు అంత తృప్తి కలిగించలేదు. అందుకే కొత్తగా రాద్దామనుకున్నాను. పైగా వీరేశలింగంగారికి ముందు సాహిత్య చరిత్ర రచన పుక్కిటి పురాణాలు కాగా కావ్యాల అవతారికల ఆధారంగా జరిగింది. ఈ ధోరణిని విభేదించి చారిత్రక దృష్టితో సాహిత్య చరిత్ర రాయడానికి ప్రయత్నించినవారే వీరేశలింగం, వేటూరి ప్రభాకరశాస్త్రిగారి వంటివారు. అయితే వీరేశలింగంగారి కలానికి వున్న ఆకరాలు తక్కువ. శాస్త్రీయ దృక్పథం కూడా అంతగా పెరగలేదు. అప్పటికన్నా త్వరితకాలంలో ఆకరాలు, పరిశోధనా పద్ధతులు, శాస్త్రీయ దృక్పథమూ అన్నీ పెరిగాయి''. [5] వచన కవిత్వానికి, పద్యానికి మధ్య సంఘర్షణను ప్రతిబింబించే అంశాలు అనేకం కొన్ని ఇంటర్వ్యూల్లో ప్రతిఫలించాయి. కవిత్వం లేకున్నా పద్యం నిలుస్తుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన విమర్శకులూ ఉన్నారు. [6] అయితే భావానికి ఛందస్సు అవరోధం కాదన్న అభిప్రాయాన్ని మధునాపంతుల వంటివారు వ్యక్తం చేశారు. ''కేవలం భావం ఉన్నంతమాత్రాన కవిత్వం ఎలా అవుతుంది? భావాన్ని అభివ్యక్తీకరించడానికి భాష పటిష్టంగా ఉండాలి. భావాన్ని వ్యక్తీకరించగలమనుకోవడం ఒట్టి భ్రాంతి. ఆధునికులు భాషా సాధనను తగ్గించి భావాన్ని వ్యక్తీకరించాలని ప్రయత్నిస్తున్నారు. దానివల్ల వారి రచనల్లోంచి స్పష్టత గోచరిస్తుంది''. [7] ఆధునిక కవులు కవిత్వ వికాసాన్ని గురించి చెప్పుకోవడానికి ఇంటర్వ్యూలు ఒక సాధనంగా ఉపయోగపడ్డాయి. ఉదాహరణకు ''స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ వికృత ప్రపంచంమీద, శవ సంస్కృతి మీద తిరుగుబాటు చేసిన మొట్టమొదటి ఆధునిక కవిని నేను. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మొదటి తిరుగుబాటు కవిని నేనే''. [8] డాక్టర్ సి. నారాయణరెడ్డి 'విశ్వంభర' కావ్యాన్ని గురించి చెపుతూ 'విశ్వంభర చేవ్రాలు - చైతన్యం ఆనవాలు' అని నిర్వచించారు. ఇదే సందర్భంలో శ్రీశ్రీకి ముందూ వెనుక శూన్యం అన్న అభిప్రాయంపైన వ్యాఖ్యానిస్తూ ఆయన ఇలా అంటారు. ''శ్రీశ్రీకి ముందు శూన్యం కాదు. పూర్ణం., శ్రీశ్రీ తర్వాత

కూడా పూర్ణం అంటే నిండు అని నా అభిప్రాయం. శ్రీశ్రీ తక్కువ వాడుకాదు. పూర్ణత్వమనేది ముందూ వుంది, తర్వాత వుంది. శ్రీశ్రీ ఉన్నప్పుడూ వుంది. అయితే పాళ్లలో తేడా వుంది. ఏదీ శూన్యం కాదు''. [9]

విమర్శకుల సాహిత్య విమర్శకు సంబంధించిన వివాదాలు ఇంటర్వ్యూల్లో ప్రస్తావించబడ్డాయి. వర్తమాన యుగం సాహిత్యంలో కాలుష్య యుగమన్న అభిప్రాయాన్ని అనేక ఇంటర్వ్యూలో చర్చకు తీసుకువచ్చారు. ఆంధ్రజ్యోతి దినపత్రికకు 1988లో ఇచ్చిన ఇంటర్వ్యూలో జి.వి.సుబ్రహ్మణ్యం ఈ విషయం చర్చిస్తూ ''కాలుష్యం అనే మాటను వారు ఏ అర్థంలో వాడాలో ముందు నిశ్చయించాలి. అవాంఛనీయమైన అంశాలు సాహిత్యంలో చేరి సాహిత్యరంగం కలుషితమైందనా? లేక విభిన్న దృక్పథాలు సాహిత్య రంగంలో ప్రతిఘటిస్తూ సంకుచితంగా వాతావరణాన్ని మార్చాయా? బహుశా ఇలాంటి వారి ఉద్దేశం రెండవదే అయి వుంటుంది'' [10] అని అంటారు.

1980లకు అటూ ఇటూగా బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన రూపం మినీ కవిత. ఎందరో యువకులు మినీ కవితను ఒక బలమైన వ్యక్తీకరణ సాధనంగా స్వీకరించారు. అంతమాత్రాన కేవలం మినీ కవిత్వానికే పరిమితమయ్యే ధోరణిని సమర్థించరాదని అగ్రశ్రేణి కవులు అభిప్రాయపడ్డారు. కుందుర్తి ఒక ఇంటర్వ్యూలో ''మినీ కవితను గురించి మాట్లాడుతూ శ్రీశ్రీ మహాప్రస్థానం రాసి మహాకవి అయినాడు కాని 'ఆ' అనే మినీ కవిత రాయటం వలన కాదని గట్టిగానే సమాధానం ఇచ్చారు..'' [11] అయితే ఆధునిక నాటకాన్ని గురించి ప్రస్తావించబడిన సందర్భాలు పత్రికా సాహిత్యంలో కూడా అరుదే. అప్పుడప్పుడు ప్రసిద్ధ నాటక రచయితలతోనో, విమర్శకులతోనో వచ్చిన ఇంటర్వ్యూలు మాత్రమే ఈ ప్రక్రియ గురించి చర్చించడానికి వీలు కల్పించాయి. వర్తమాన నాటక రంగ దుస్థితికి పూత మెరుగు ప్రయోగాలే కారణమంటూ డాక్టర్ పి.వి.రమణ ఆంధ్రభూమి సాహిత్య పేజీ 'అక్షరం'లో ఒక ఇంటర్వ్యూ ఇచ్చారు. నాటకరంగం ప్రస్తుత దుస్థితిని ఆయన వ్యాఖ్యానిస్తూ, ''వ్యవస్థ, వ్యక్తి ఘర్షణతో నిండిన సమగ్రమైన వస్తువుపట్లగాక, ఆ నాటకాన్ని ఏ ప్రయోగం ద్వారా ప్రజల ముందుకు తీసుకుపోవాలన్న ఆరాటం అటు నాటక రచయితలలో, ఇటు దర్శకులలో ప్రబలమైంది. ఈ రెండు దశాబ్దాల నుండి యూరప్ నాటకరంగాన్ని ఆవహించి, అతలాకుతలం చేసి నాటక అస్తిత్వానికే చేటు తెచ్చిన అనేకానేక సిద్ధాంతాల్ని, టెక్నిక్‌లను, ప్రయోగాల్ని మనవాళ్లు దిగుమతి చేసుకోవటం అధికమైంది. ఫలితంగా నాటక స్వరూపం కుదించబడింది. ప్రయోజనం దెబ్బతింది'' అంటారు. [12] ముందుతరం రచయితలు తమ సాహిత్య అనుభవాలను, జ్ఞాపకాలను వివరించిన ఇంటర్వ్యూలు కూడా ఈ దశాబ్దంలో చూడవచ్చు. ప్రసిద్ధ కథా రచయిత చాగంటి సోమయాజులు తన సాహిత్య వ్యాసంగం ప్రాథమిక దశను వివరిస్తూ ఇలా అంటారు. ''మొదట ఇంగ్లీష్‌లో కవిత్వం చెప్పేవాణ్ణి. ఇంగ్లీష్‌లో కవిత్వం కొన్నాళ్లు చెప్పింతర్వాత ఈ

కవిత్వాన్ని అచ్చువేయడానికి భారతదేశంలో ఎక్కడా పత్రికలు లేవు. ఇంగ్లండ్ పంపిస్తే వాళ్లు మాకు జవాబు రాయలేదు. అయితే మరొక చిక్కు కూడా నాకు వచ్చింది. నేను నమ్మేదేమిటంటే 'స్పీచ్ రిథమ్స్' అని ఇంగ్లీష్‌లో వాళ్లు పేరుపెట్టుకున్నారు.'' [13] తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తి ఒక ఇంటర్వ్యూలో తన సాహిత్య జీవిత ప్రేరణను వివరిస్తూ ''నా జీవితానికి కొంత వాసి తెచ్చిన సన్నివేశాలలో మొదటిది మా నాయనగారి ధర్మనిష్ఠ. ఆయన నిరుపేదగా బ్రతుకుతూ ఒక మిత్రుడు తనయొద్ద దాచిన పది వీశెల బంగారమును ఆ మిత్రుడు కోరినపుడు ప్రతిఫలాపేక్ష లేక అతనికిచ్చెను. మానవుడిట్లు బ్రతుకవలెను కాబోలు అన్న పాఠము ఆయన చెప్పిన ఈ కథవల్ల నేర్చుకొంటిని'' అని అంటారు.[14]

పాదసూచికలు :

1. రామమోహన్‌రాయ్, 'అదనపు సుఖాల కోసం అధమ రచనలు చేయడం నేరం', 'రావూరి భరద్వాజతో ముఖాముఖి', ఆంధ్రజ్యోతి దినపత్రిక, సోమవారం, మే 16, 1988.

2. 'రావిశాస్త్రితో త్రిపురనేని శ్రీనివాస్'', 'అలగాజనం ఆయన కలానికి జవం', ఉదయం దినపత్రిక మార్చి 31, 1988.

3. 'జానకి', ఆచార్య పేర్వారం జగన్నాథంతో ముఖాముఖి, 'రాజకీయ నినాదాలతో, ఉపన్యాసాల రోకటిపాటలతోకవిత్వాన్ని ఖూనీ చేస్తున్నారు, ఆంధ్రజ్యోతి దినపత్రిక.

4. శ్రీఅనంతం, 'అరసం చీలికకూ విరసం ఆవిర్భావానికి ప్రేరణ దిగంబర కవులే', ఆంధ్రప్రభ దినపత్రిక, సాహిత్య ప్రభ, ఏప్రిల్ 16, 1990.

5. ఆరుద్రతో ఇంటర్వ్యూ, 'సామాన్యులకు సాహిత్య చరిత్ర చెప్పాలనేదే నా ఆశయం', ప్రజాశక్తి దినపత్రిక, ఏప్రిల్ 16, 1989.

6. 'ఆచార్య కె.వి. ఆర్.నరసింహం', 'కవిత్వం లేకున్నా పద్యం నిలుస్తుంది', ఆంధ్రభూమి దినపత్రిక, జులై 5, 1987.

7. పున్నమరాజు నాగేశ్వరరావు, 'భావానికి ఛందస్సు అవరోధం కాదు', మధునాపంతుల వారితో ప్రత్యేక ఇంటర్వ్యూ, ఆంధ్రప్రభ దినపత్రిక, జులై 12, 1987.

8. నగ్నమునితో ఇంటర్వ్యూ, గుడిహాళం రఘునాథం, కె.శ్రీనివాస్, '1947 తరువాత మొదటి ఆధునిక కవిని నేనే', ఉదయం, జూన్ 3, 1990.

9. డా॥ సి.నారాయణరెడ్డితో ఇంటర్వ్యూ, 'విశ్వంభర చేవ్రాలు.. చైతన్యం ఆనవాలు', ఉదయం దినపత్రిక, నవంబర్ 27, 1988.

10. జి.వి.సుబ్రహ్మణ్యంతో టి.యల్.కాంతారావు ముఖాముఖి, 'గతం శూన్యమనుకుంటే వర్తమానానికి విలువలేదు. ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఏప్రిల్ 18, 1988.

11. 'కుందుర్తితో కాసేపు', రావి రంగారావు, ఆంధ్రప్రభ దినపత్రిక, డిసెంబర్ 16, 1982.

12. డా॥ పి.వి.రమణతో పాండురంగ ఇంటర్వ్యూ, అక్షరం పేజీ, 'నేటి నాటక రంగ దుస్థితికి పూత మెరుగు ప్రయోగాలే కారణం', ఆంధ్రభూమి దినపత్రిక, మార్చి 31, 1990.

13. ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, 'మంచి కథకు మరోపేరు చాసోతో కాసేపు', 'చలం, కృష్ణశాస్త్రి అప్పుడే వెగటు కలిగించారు'.

14. మన్నవ గిరిధరరావు, 'తెనుగులెంక శ్రీ తుమ్మల వారితో ఇష్టాగోష్ఠి', 'నేటి తరం వారికి పునాది తక్కువ' , ఆంధ్రప్రభ దినపత్రిక, అక్టోబరు 4, 1987.

★★★

# *iv.* వ్యక్తిగత పరిచయాలు

1980-90ల మధ్య దినపత్రికల సాహిత్య పేజీలలో ఒక ప్రధానమైన మార్పు కనిపిస్తుంది. అంతకుముందు కవులు, రచయితలు వ్యక్తిగత పరిచయాలతో కూడిన వ్యాసాలు విస్తృతంగా వచ్చాయి. 1980ల తరువాత సాహిత్య స్వభావంలో వచ్చిన మార్పువల్ల విమర్శ సాధనాలు మరిన్ని అందుబాటులోకి రావడం వల్ల కేవలం వ్యక్తిగత పరిచయాలతో కూడిన వ్యాసాలు తక్కువగా కనిపిస్తాయి. అయితే ఒక సందర్భానికి తగినట్టుగా కవులు, రచయితల వ్యక్తిగత పరిచయాలను సాహిత్య పేజీలలో చూడవచ్చు. రచయితలు, రచయితల మధ్య వుండే సాహిత్య సాన్నిహిత్యాన్ని వివరించే వ్యాసాలు మరొక శ్రేణిలో కనిపిస్తాయి. శ్రీపాద సుబ్రహ్మణ్యంశాస్త్రి గారితో మధునాపంతుల తన అనుబంధాన్ని చెబుతూ ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో ఒక వ్యాసం రాశారు. ''శ్రీపాదతో నా సాన్నిహిత్యం ఎంతో చిన్న వయసు నుంచే ఏర్పడింది. నేను, ఆయనా రామకృష్ణకవుల వద్ద శిష్యులం. గురువులకు శిష్యులుగా, సాహిత్యంలో మిత్రులుగా మాది 'గురుతర' స్నేహంగా సంవత్సరాల పాటు సాగింది''. [1] ఇలాంటి వ్యాసాలు ఆయా రచయతల మధ్య వుండే సత్సంబంధాలను తెలియజేయడమే కాకుండా పాఠకులలో సాహిత్య అభిరుచిని పెంపొందించడానికి తోడ్పడ్డాయి. 1988 లో వెల్చేరు నారాయణరావు ఆంధ్రజ్యోతి దినపత్రికలో భద్రిరాజు కృష్ణమూర్తి గురించి ఒక విశేషమైన పరిచయ వ్యాసం రాశారు. భాషాశాస్త్రం నుంచి సాహిత్య విమర్శలోకి భద్రిరాజు కృష్ణమూర్తి తీసుకొచ్చిన విమర్శ సాధనాలను వెల్చేరు వివరించారు. '' ఆయన ఇప్పటికీ, ఇంతగా పరిపాలన రంగంలోని సమస్యలతో సతమతమవుతూ కూడా భాషా శాస్త్రరంగంలోనూ, తెలుగు సాహిత్య విమర్శరంగంలోనూ కొత్త కొత్త ఆలోచనలు చేస్తున్నారు. ఆయన రాసిన ప్రతి వ్యాసమూ కొత్త ప్రమాణాలు సృష్టిస్తోంది''. [2]

కథారచయితల గురించి వెలువడిన వ్యాసాల్లో ఆయా రచయితల వ్యక్తిగత అంశాలతో పాటు కథారచనకు సంబంధించిన అంశాలు కూడా పరిచయకర్తలు వివరించే ప్రయత్నం చేశారు. 'బుచ్చిబాబు కథలు వాటి ప్రేరణలు' అనే శీర్షికన ఆంధ్రప్రభ దినపత్రికలో డి.రామలింగం ఒక వ్యాసం వ్రాశారు. తెలుగు కథకుల్లో సుప్రసిద్ధులైన బుచ్చిబాబు గురించి ఆయన లోని తాత్త్విక అంశాల గురించి రామలింగం

ఈ విధంగా వివరించారు. '' ఒక విలక్షణమైన కథావస్తు సంపదతో, అనన్యమైన కళాశోభతో, చిత్రమైన తాత్త్విక విజిగీషతో ఆయన తన కథలను నిర్మించాడు. కేవలం వాస్తవిక జీవితాన్ని చిత్రించడంకాక శారీరక, మానసిక, ఆధ్యాత్మిక తాత్త్విక విలువలను చొప్పించి లౌకిక సాహిత్యమైన కథారచనను కొంత ఉన్నత పథానికి గొనిపోయాడు. ఇటువంటి రచయిత ఎలాంటి ప్రేరణలతో ప్రభావితుడై రచించాడన్నది తెలుసుకోదగిన విశేషం. [3]

పాతకాలపు సాహిత్య విశేషాలను, రచయితలను పరిచయం చేసే వ్యాసాలు 80 ల తరువాత చాలా అరుదుగా కనిపిస్తాయి. అయితే సాహిత్య చరిత్రలో విస్మరించరాని పాత్రలుగా మిగిలిపోయినవారి గురించి అప్పుడప్పుడైనా కొన్ని వ్యాసాలు వెలువడ్డాయి. ''సాహిత్య చరిత్రల నిధి ఆచార్య కురుగంటి సీతారామయ్య ''గురించి జి.వెంకటరామారావు ఆంధ్రప్రభ దినపత్రికలో పరిచయాత్మక వ్యాసం రాశారు. ఆ వ్యాసంలో సీతారామయ్య కృషిని వివరిస్తూ ''సీతారామయ్యగారు సంస్కృతాంధ్రాంగాల్లో మంచి పాండిత్యం కలవారు. ప్రాకృత, హిందీ భాషల్లో ఆయనకున్న ప్రవేశం కూడా గొప్పదే. దేశ చరిత్రపై ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ చరిత్ర సంస్కృతులపై ఆయన చేసిన పరిశోధనలు చెప్పుకోదగ్గవి.'' [4] శ్రీ శ్రీలాంటి కవులకు స్ఫూర్తినిచ్చిన కొంపెల్ల జనార్దన్‌రావు గురించి ఇప్పటికీ పూర్తి వివరాలు వెలుగులోకి రాలేదు. కానీ అందుబాటులో వున్నంతమేరకు వాటిని తెలియజేసే ప్రయత్నం ద్వానాశాస్త్రి చేశారు. ''మనకి కొంపెల్ల జనార్దనరావు అనగానే శ్రీ శ్రీ గుర్తుకు వస్తాడు. 'తలవంచుకు వెళ్లిపోయావా నేస్తం! సెలవంటూ ఈ లోకాన్ని వదిలి' అని శ్రీ శ్రీ విలపించిన ఎలిజీ వెంటనే గుర్తుకు వస్తుంది. 1906లో తూర్పుగోదావరి జిల్లాలో పుట్టిన కొంపెల్ల జనార్దనరావు జీవిత విశేషాలు మనకంతగా తెలియకపోవడం విచారకరం. భారతిలో ఉపసంపాదకుడిగా కొంతకాలం పనిచేశారు. [5]

పద్యకవితారంగంలో తమదైన విశిష్ట స్థానాన్ని నిలుపుకున్న పుట్టపర్తి తుమ్మల సీతారామమూర్తిలాంటి కవుల గురించి ఆయా సందర్భాల్లో వివిధ వ్యాసాలు వెలువడ్డాయి. 'సరస కవితామూర్తి పుట్టపర్తి', అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో పి. ఆర్.చక్రవర్తి ఇలా అభిప్రాయం వ్యక్తం చేశారు. ''సామాజిక స్పృహ అనేది ప్రసిద్ధకవులందరికీ ప్రాచీన, అర్వాచీన అనే తేడా లేకుండా వుందని వారి విశ్వాసం. 'కమిట్‌మెంట్' కవికి ఉండాలి. ఈనాడు అది చాలా మందికి లేదని అంటారు. అంటే రచనల్లో చూపించే ఆదర్శాలనే జీవితంలోనూ ఆచరించాలి అదే 'కమిట్‌మెంట్' అంటారాయన. ఇప్పుడున్న కవుల్లో చాలా మంది వ్రాయడానికి చూపించే ఉత్సాహం చదవడానికి చూపించడంలేదని వాపోయారు శ్రీ పుట్టపర్తి.'' [6]

పద్యంలో తెలుగుతనానికి మారుపేరు తుమ్మల సీతారామమూర్తి. ఆంధ్రభూమి దినపత్రికలో 1981 లో 'తెనుగులెంక తుమ్మల సీతారామమూర్తి' శీర్షికన వ్యాసం వెలువడింది. తెలుగుతనానికి తుమ్మలవారికి వున్న అనుబంధాన్ని చెబుతూ వ్యాసకర్త

ఇలా అంటారు. 'తెలుగు భాష, తెలుగుతనం, తెలుగు పండుగలు, తెలుగు వీరులు... ఇలా 'తెలుగు' అంటే చాలు తుమ్మలవారికి మూపులు మూడవుతాయి. కలం లాస్యం చేస్తుంది. తెలుగుతనానికి ఇంతగా మురిసిపోయేవారిలో విశ్వనాథ, రాయప్రోలుల తరువాత తుమ్మల వారినే చెప్పాలి. 'సంక్రాంతి' సొగసుని వర్ణించే పద్యాలు మనోజ్ఞాలు.''[7]

నాటక సాహిత్యాన్ని గురించి ఈ దశాబ్దంలో కొన్ని విలువైన వ్యాసాలు వెలువడ్డాయి. పూర్వకాలపు నాటక రచయితల మీద వెలువడిన వ్యాసాలు పేర్కొనదగినవి. 'మన నాటక రచయితలు' శీర్షికన ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో గండవరం సుబ్బరామిరెడ్డి ఒక వ్యాసం రాశారు. సమకాలీన సమాజంలో సాహిత్య ధోరణులతో సాధారణంగా నాటక రంగానికి వుండే సంబంధాన్ని కూడా విశ్లేషిస్తూ ఈ వ్యాసరచన సాగింది. కొప్పరపు సుబ్బారావు గురించి రాసిన వ్యాసంలో ఆయన ఈ విధంగా అంటారు. ''పద్యాలలోని భావాన్ని గాలికి వొదిలేసి, సంగీత పాండిత్య ప్రకర్షకు ప్రాధాన్యమిచ్చే గాయక నటులు బయలుదేరి నాటక ప్రదర్శనలను సంగీత కచేరీలుగా మార్చుతూ నాటక రంగాన్ని పరిహాస పాత్రం చేస్తున్న కాలంలో శ్రీ కొప్పరపు సుబ్బారావు పూనుకుని నిర్మాణాత్మకమైన కృషిచేశారు.''[8]

వ్యక్తిగత పరిచయాలతో కూడిన వ్యాసాల తీరులో మార్పు వచ్చిందనడానికి పైన పేర్కొన్న వ్యాసాలు కొన్ని ఉదాహరణలు మాత్రమే. పరిచయ వ్యాసంలో విశ్లేషణకు సంబంధించిన అంశాలను జోడించడం ఈ మార్పులో మొదటి లక్షణం. అలాగే సమకాలీన సాహిత్య చరిత్రలో ఆయా వ్యక్తుల జీవనాంశాలను అన్వయించడం రెండో లక్షణం. ఆ రకంగా సాహిత్య విమర్శ పరిపుష్ఠం కావడానికి ఈ పరిచయ వ్యాసాలు దోహదపడ్డాయి.

పాదసూచికలు :

1. మధునాపంతుల, 'పదరహస్యం తెలిసిన కథకుడు శ్రీపాద', ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఏప్రిల్ 23, 1990.

2. వెల్చేరు నారాయణరావు, 'తెలుగు సాహితీ మేస్త్రీ! పరిశోధనల కృష్ణమూర్తి', ఆంధ్రజ్యోతి దినపత్రిక, జూన్ 26, 1988.

3. జి.రామలింగం, ''బుచ్చిబాబు కథలు: వాటికి ప్రేరణలు'', ఆంధ్రప్రభ దినపత్రిక, జులై 14, 1985.

4. జి.వెంకటరామారావు, 'సాహిత్య చరిత్రల నిధి ఆచార్య కురుగంటి సీతారామయ్య, ఆంధ్రప్రభ దినపత్రిక, నవంబర్ 4, 1986.

5. ద్వానాశాస్త్రి, 'తలవంచుకు వెళ్లిపోయిన నేస్తం', ఆంధ్రప్రభ దినపత్రిక,

డిసెంబర్ 2, 1986.

6. పి. ఆర్.చక్రవర్తి, 'సరస కవితామూర్తి - పుట్టపర్తి', ప్రజాశక్తి దినపత్రిక, సెప్టెంబర్ 9, 1990.

7. వ్యాసకర్త, 'తెనుగులెంక శ్రీతుమ్మల సీతారామమూర్తి', ఆంధ్రభూమి దినపత్రిక, జూన్ 28, 1981.

8. గండవరం సుబ్బరామిరెడ్డి, 'మన నాటక రచయితలు శ్రీకొప్పరపు సుబ్బారావు', ఆదివారం ఆంధ్రప్రభ దినపత్రిక అనుబంధం, జులై 7, 1985.

★★★

# V. అనువాదరంగం

ఈ దశాబ్దంలో దినపత్రికల్లో సాహిత్య పేజీలకు విశేషమైన ప్రాముఖ్యం దక్కడంతో ప్రతీవారం సాహిత్య పేజీలు వెలువడుతుండటంతో ఇతర భాషల నుంచి అనువాదాలకు కూడా పత్రికల్లో తగినంత స్థానం లభించింది. ఎప్పటికప్పుడు ఇతర భాషా సాహిత్యాల్లో జరుగుతున్న పరిణామాలను పాఠకులకు తెలియజేయాలన్న ఆసక్తికరమైన వాతావరణం తెలుగు సాహిత్యంలో ఏర్పడింది. సమకాలీన సాహిత్య ప్రముఖుల విశేషాలతోపాటు సృజనాత్మక రచనలు కూడా ఎన్నో తెలుగులో వెలుగుచూశాయి.

1987 ప్రాంతాల్లో విశ్వసాహిత్యం అనే శీర్షికన మానేపల్లి సత్యనారాయణ ఒక ప్రత్యేక శీర్షికనే నిర్వహించారు. ప్రపంచ ప్రసిద్ధ రచయితలు, కవుల గురించి ఆయన ఈ వ్యాసాల్లో వివరించారు. ''అనేక మంది అంతగా గుర్తించని చిన్న చిన్న విషయాలను తీసుకొని చక్కని విశ్లేషణాత్మక దృష్టిలో, మానవతావాదంతో, ప్రగతిశీల దృక్పథంతో కథలు రాశాడాయన. [1] '' ఈ నేలమీద అన్యాయం, అణచివేత అధికార దర్పం ఉన్నంతకాలం వాటిని నెరూడా కవితాకంఠం నిర్ద్వంద్వంగా ఖండిస్తూనే వుంటుంది. ఆర్తుల హృదయాల్లో అజరామరంగా అల్లుకునే వుంటుంది. [2] విశాలాంధ్ర దినపత్రికలో అభ్యుదయ రచయితల గురించి ఎన్నో వ్యాసాలు వెలువడ్డాయి. ఆయా రచయితల గురించి వేరు వేరు సందర్భాల్లో ఈ రచనలు వెలువడినప్పటికీ తెలుగు సాహిత్య వాతావరణానికి అన్వయం కుదిరేటట్లుగా వ్యాసాలు వుండటం విశేషం. తాతార్ ప్రజాకవి, ముస్సాజలీల్ గురించి 1985లో.. సోమసుందర్ ఒక వ్యాసం రాస్తూ ఆ కవికి సంబంధించిన ప్రత్యేక లక్షణాలను వివరించారు. ''స్వేచ్ఛాలోకాన్ని తన కవితల్లోనైనా చూడగలనో లేదో నిర్ధారణ లేదు. అయినా ఒక తీవ్ర ఆశావాదం అతని హృదయాన్ని నైరాశ్య తమస్సుల నుంచి రక్షిస్తూనే వుంది. అతని అంతశ్చైతన్యం వికసించిన పరిమళ పుష్పాలే అతని కవితలు''. [3] అదే పత్రికలో మయకోవ్స్కీ గురించి వెలువడిన వ్యాసం కూడా పేర్కొనదగింది. '' ఒక నిమిషం నుండి ఒక శకాన్ని, ఒక దేశం నుండి బ్రహ్మాండమంతటినీ ఆవహించగల భావుకుడు మయకోవ్‌స్కీ, ఆయన సృజన సరళమైంది''. [4] శ్రామికవర్గ దృక్పథం కలిగిన రచయితల గురించి ప్రజాశక్తి దినపత్రికలో ప్రశంసాత్మక వ్యాసాలు వెలువడ్డాయి. ఆయా రచయితల్లోని

దృక్పథబలాన్ని విశేషంగా వివరించే ప్రయత్నం వీటిల్లో కనిపిస్తుంది. ఉదాహరణకు యూజిని పాటిర్ గురించి ప్రజాశక్తి దినపత్రికలో 1989లో ఒక వ్యాసం వెలువడింది. ''ప్రప్రథమంగా శ్రామికవర్గ మహాసంగ్రామ కాలంలో ప్రభవించిన అంతర్జాతీయ గీతం ద్వారా 'సకల దేశాల కార్మికులారా ఏకంకండి' అనే మార్క్స్, ఏంగిల్స్‌ల పిలుపుకి విశేషమైన ప్రచారాన్నిచ్చాడు యూజినీ పాటర్.'' [5] ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ దినపత్రికలు కూడా పాశ్చాత్య రచయితల గురించి విలువైన వ్యాసాలను అందించాయి. ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో నోబెల్ బహుమతి పొందిన కవయిత్రి గేబ్రిలా మిస్ట్రా గురించి విమర్శకులు అఫ్సర్ రాసిన వ్యాసం పేర్కొనదగింది. ''నిజానికి సంఖ్యలో ఇవి చాలా తక్కువ కానీ ఒక్కో కవిత ఒక శక్తివంతమైన ఆయుధం వంటిది. సంవేదనా భరితమైన హృదయావేశం, సున్నితత్వం, ఊహాబలం, భావవిహ్వలత మానవ సహజమైన మమతానురాగాలు, వీటితో పాటు ప్రస్తుత పరిస్థితుల పట్ల ఏవగింపు, భవిష్యత్ స్వప్నాలు... ఇవీ ఆమె కవితా వస్తువులు''. [6] ఆంధ్రజ్యోతి దినపత్రికలోనే బెర్టోల్ట్ బ్రెక్ట్ గురించి సీతారామారావు ఒక వ్యాసం రాశారు. ''పెట్టుబడీదారీ వ్యవస్థ పట్ల తీవ్రమైన నిరసన వుండేది బ్రెక్ట్‌కు, అయినా మౌనంగానే ప్రకటించేవాడు. చేతులు రెండూ మౌనంగా కదిలాయి. రక్తం చేతుల్లోకి రివ్వున దూసుకువచ్చేది. గుండె గాయపడి ఒంటి కన్నుతోనే కన్నీళ్లు కార్చేది. ఆ చేతులు రెండూ మౌనంగా కలాన్ని అందుకున్నాయి. ఆ కలం రాసే ప్రతీ మాట తూటా ఆయన గతాన్ని చెరిపేస్తూ కొత్త ప్రపంచపు తలుపు తెరుస్తూ చీల్చుతూ పోయేది. కలం పూర్తి విశ్వాసంతో ముందుకు నడిచేది. అది బ్రెక్ట్ కలమే. [7] విడిగా రచయితల గురించి మాత్రమే కాకుండా ఆ రచయితల దృక్పథాన్ని ఆత్మకథనంగా వివరించే నేపథ్యాలు, ఇంటర్వ్యూలు కూడా సంఖ్యానేకంగా వెలువడ్డాయి. దీనికి ఉదాహరణ ఉదయం దినపత్రికలో 1988 లో వెలువడిన ఎర్నెస్ట్ హెమింగ్వే ఇంటర్వ్యూ పేర్కొనదగినది. ''జరిగిన సంఘటనల నుంచి, ఉన్న సంఘటనల నుంచి, నీకు తెలిసిన, తెలియని అన్ని సంఘటనల నుంచి నీవు కనిపెట్టింది నీవు రాస్తావు. అది ప్రాతినిధ్యం కాదు. కానీ వాస్తవమైనది, సజీవమైనది, అందుకే నీవు రాస్తావు. కాని ఎవరికి తెలియని అన్ని కారణాల మాట ఏమిటి?'' [8]

అదే పత్రికలో 1988లోనే ప్రసిద్ధ రచయిత బోరిస్ పాస్టర్నక్ వచన రచయితగా తన వికాసాన్ని వివరిస్తూ ఒక ప్రక్రియగా వచన సాహిత్యం చేయవలసిన కృషిని గురించి ''వచనం ఇవ్వాల్టి రూపం. ఇవ్వాల్టి రచన జీవితంలోని అన్ని భాగాల్ని పునః సృష్టించాలి.'' [9] అని అన్నారు. రచయితలు తమ నేపథ్యాన్ని వివరించే శీర్షికలు కూడా దినపత్రికల్లో ప్రచురితమయ్యాయి. 1988 ఏప్రిల్ 14 'ఉదయం' సంచికలో ఓలెసోయంకా వివరించిన సాహిత్య అనుభవాలు ఈ సందర్భంగా పేర్కొనదగింది. '' ఒక్క హిందూ పులేకాక, వివిధ మతాల, వివిధ సంస్కృతుల, వివిధ దేశాల ఆచార వ్యవహారాల గురించి నేను క్షుణ్ణంగా చదివాను. నాకు భగవద్గీతలోని కవిత్వం చాలా ఇష్టం. బౌద్ధ సాహిత్యం

కూడా నాకు అత్యంత ఇష్టమైనది. దీని లోతులు తెలుసుకునేందుకు నేను కొన్ని సంవత్సరాలు శ్రమించాను. [10]

బెంగాలీ అభ్యుదయ కవుల గురించి వెలువడిన వ్యాసాల్లో విశాలాంధ్రలో 1984 లో సోమసుందర్ రాసినది పేర్కొనదగింది. ఈ వ్యాసంలో ఆయన ప్రసిద్ధ అభ్యుదయ కవి నజ్రుల్ ఇస్లామ్ గురించి చెబుతూ ఆయన ప్రభావ విశేషాలను తెలుగు కవిత్వానికి సైతం అన్వయించారు. ''స్లామ్ అందించిన వారసత్వం శ్రమైక జీవన సౌందర్యమే! విప్లవాత్మక పురోగమనునాదమే! గమన నాదమే! ఆ వారసత్వాన్నే తెలుగు భాషలో ఆధునిక కవిత్రయం శ్రీశ్రీ, నారాయణబాబు, పురిపండాగార్లు పాదుకొల్పారు. దాన్ని మనం పరంపరాగతంగా పరిరక్షించుకుంటూ పురోగమించాలి.'' [11] పురిపండా అప్పలస్వామి కూడా ఆంధ్రజ్యోతి దినపత్రికలో నజ్రుల్ ఇస్లామ్ జీవన విశేషాలను తెలిపే వ్యాసం రాశారు. ''నజ్రుల్ ఇస్లామ్ బెంగాలీ విప్లవ కవి, మహాకవి, భావంలోనూ, భాషలోనూ ఛందస్సులోనూ, సంగీతంలోనూ అతడిలా విప్లవం తెచ్చిన కవి నాటికీ, నేటికీ భారతదేశంలో మరొకడు లేడు. అతడి జీవితమే ఒక పెద్ద విప్లవం. అతడు మోయించింది అగ్నివీధి., పాడింది ప్రళయ సంగీతం. అతడి కవిత పెల్లుబికిన అగ్నిపర్వతం. నజ్రుల్ 1899 మే 28న వర్ధమాన జిల్లా చురులియా గ్రామంలో ఒక పేద ముస్లిం కుటుంబంలో పుట్టాడు. తండ్రి ఖాజీ ఫకీర్ అహమ్మద్, తల్లి జాహెదా ఖాతూన్., ఫకీర్ అహమ్మద్ చురులియా మసీదులో పనిచేస్తూ కుటుంబం నెట్టుకు వస్తుండేవాడు. [12] అభ్యుదయ సాహిత్య ఉద్యమ నిర్మాతల గురించి వివిధ సందర్భాల్లో వెలువడిన వ్యాసాలు విలువైనవి. సజ్జాద్ జహీర్ గురించి రాసిన వ్యాసంలో సోమసుందర్ ఇలా అంటారు. ''రచయితల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం నిరంతర కృషిసల్పిన మహనీయుడు జహీర్. సామాజిక న్యాయం కోసం, శాంతి స్నేహాల కోసం, జీవితాంతం కృషిసల్పిన సజ్జాద్ జహీర్'' [13] ఇదే సందర్భంగా జహీర్ వియత్నాంపై రాసిన కవితల తెలుగు అనువాదాలు కూడా పేర్కొనదగినవి. ''కత్తిమొనల పదునువారు / కొండకొమ్ము అంచులలో / పురుషోత్తమ సహస్రాల వజ్రశక్తి విరిసే నేడు / అరుదైై విలువైన పూలనెత్తినోహో వియత్నామ్'' [14]

విశాలాంధ్ర దినపత్రికలో హరీంద్రనాథ చటోపాధ్యాయ గురించి అనేక వ్యాసాలు ప్రచురితమయ్యాయి. హరీంద్రనాథ ఛటోపాధ్యాయ తెలుగు భాషలో రాయనప్పటికీ తెలుగు కవులంత అభిమానాన్ని ఇక్కడ సంపాదించుకున్నారు. ఆయన రచనలను తెలుగు నాటగేయ నాటకాలుగా ప్రదర్శించిన సందర్భాలు అనేకం. అలాంటి ఒకగేయ నాటిక గురించి విశాలాంధ్ర దినపత్రికలో 1990 లో పరిచయం చేశారు. తన దేశభక్తియుత గేయాలు, నాటికల ద్వారా విద్యార్థులలో, యువకులలో హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ కలిగించిన ఉత్సాహానికి, ఉత్తేజానికి నిదర్శనం ''విగ్రహం'' అనే గేయనాటిక. ఈ నాటికను 1938 లో కాకినాడ పి. ఆర్. కాలేజీ విద్యార్థి, యువ రచయిత ముప్పన చిన అంకయ్య సరళ వ్యావహారిక భాషలో చక్కగా అనువదించారు. దేవుని

పేరుతో స్వార్థపరవర్గాలు, పూజారులు సామాన్య ప్రజలను ఎలా అజ్ఞానాంధకారంలో ఉంచి వారి శ్రమఫలితాన్ని దోచుకుంటున్నారో ఈ నాటిక చిత్రిస్తుంది. ఒక ముసలిది, యువతి, యువకుడు, గృహస్తు, గృహిణి, మిల్లు కూలీ , ప్రజలు, పూజారి, కవిపాత్రల ద్వారా హరీన్ ఛటోపాధ్యాయ సమాజంలోని ఆర్థిక అసమానతలు, ప్రజల దారిద్ర్యం గురించి దేవునికి సూటి ప్రశ్నల రూపంలో వర్గ దోపిడీని బహిర్గతం చేస్తారు. ఆనాటి పార్టీ పత్రిక 'నవశక్తి'లో ప్రచురించబడిన ఈ నాటికను హరీన్ స్మృతికి చిహ్నంగా పాఠకులకు తిరిగి అందించారు. హరీన్ ఛటోపాధ్యాయ మాదిరిగానే తెలుగువారి సాహిత్య జీవనంలో కలగలసిపోయిన మరోకవి మఖ్దూం మొహియిద్దీన్. కవిగా, ఉద్యమ కారకుడిగా మఖ్దూం మొహియిద్దీన్ గురించి వివిధ వ్యాసాలు అచ్చయ్యాయి. ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో ముఖ్దూంని పరిచయం చేస్తూ ఒక వ్యాసకర్త ఇలా అంటారు. '' ఒకవైపు అభ్యుదయ కవిత్వంసృష్టిస్తూ రెండోవైపు కమ్యూనిస్టు నేతృత్వం నెరపిన అపురూప సంవిధాన స్వరూపి మఖ్దూం!'' [15]

భారతీయాంగ్ల రచయితల రచనల్లో, వ్యక్తిత్వంలో కనిపించే భారతీయత గురించి పలువురు విమర్శకులు వివిధ వ్యాసాల్లో విశ్లేషించారు. ప్రసిద్ధ నవలా రచయిత ముల్క్‌రాజ్ ఆనంద్ గురించి ఉదయం దినపత్రికలో మానేపల్లి సత్యనారాయణ వ్యాసం రాస్తూ ముల్క్‌రాజ్‌లోని భారతీయ లక్షణాలను ఈ విధంగా పేర్కొన్నారు. '' ఆంగ్ల భాషనీ, సంస్కృతినీ ఒంటబట్టించుకున్నాడుగానీ అమ్ముడుపోలేదు. విస్తృతంగా విదేశాల్లో పర్యటించి ఒకానొక సందర్భంలో యుద్ధాన్ని కళ్లారా చూసి తన అనుభవాల్నే వాస్తవ చరిత్రకు అద్దం పట్టే విధంగా నవలల రూపంలో మలిచారు. ఆనంద్ రచనలపై, ఆలోచనా సరళిపై ఇప్పటికే ఎన్నో గ్రంథాలు వెలువడ్డాయి. [16] అదే పత్రికలో ముల్క్‌రాజ్ ఆనంద్‌తో 'ముఖాముఖం' కూడా వెలువడింది. ఈ ముఖాముఖంలో కూడా ఆయన సాహిత్య వ్యక్తిత్వం బలంగా కనిపిస్తుంది. ''భారతీయత 99 శాతం పల్లెపట్టునే వుంది. జాతీయ సంస్కృతి, భాషా, వారసత్వంగా పెద్దల నుండి యువతకు చేరుతోంది. వారి నానుడి మన మేధావుల చేతుల్లో అశ్లీలంగా మారి బాలీవుడ్ ( బొంబాయి), మాలీవుడ్ ( మద్రాస్) సినిమాల సంభాషణల్లో చోటు చేసుకుంటున్నాయి. నిజానికి మన సాహిత్య సంపదకు పునాదిరాళ్లు జానపద సాహితీ సంస్కృతులు. [17] ఇతర భాషా సాహిత్యాల గురించి రాస్తున్నపుడు ఆయా విమర్శకులు తెలుగు సాహిత్యంలోని వివిధ ధోరణులతో పోల్చి చూడటం ఇలాంటి వ్యాసాల్లో ఒక లక్షణంగా కనిపిస్తుంది. సరోజినినాయుడు కవిత్వాన్ని గురించి విశాలాంధ్ర దినపత్రికలో డ్యాక్టర్ ఎస్.గంగప్ప రాస్తూ ''వాస్తవానికి భారతకోకిల కవిత రొమాంటిక్, సంప్రదాయ పద్ధతిలో నడిచింది. అంటే మన తెలుగులోని భావ కవితా ధోరణిలో సాగిన కవిత. ఆమె కవితలో ప్రకృత్యారాధన సౌందర్యోపాసన, పరిపూర్ణ ప్రణయంతో కూడిన ఆత్మార్పణ అచంచలమూ ప్రగాఢమూ అయిన దేశభక్తి మొదలైన గుణాలు ప్రాధాన్యం వహిస్తాయి. [18] ఆయా రచయితలపైన పనిచేసే ప్రభావాలు, ప్రేరణల గురించి రచయితల మాటల్లోనే వివరించే

ప్రయత్నం కూడా జరిగింది. ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో 1988లో ప్రసిద్ధ రచయిత భీష్మసహానీ సంచలన నవల 'తమస్' గురించి ఒక నేపథ్య వ్యాసం వెలువడింది. అందులో భీష్మసహానీ తన ప్రేరణ గురించి మాట్లాడుతూ ''నవలా రచయిత జీవితాన్నుంచి తప్పించుకోలేదు. నేను పలాయనవాదిని అసలేకాను. నిజాన్ని వక్రీకరించడం నా పని కానేకాదు. ఉన్మాదం ఏ మతంలోనైనా వుండవచ్చు. వాడు ఫలానా హిందువో, ఫలానా ముస్లిమో అని కాదు. కేవలం హిందువులో, ముస్లింలో మతోన్మాదులని చెప్పడం పిచ్చిపని.'' [19] అని అంటారు. దక్షిణ భాషా సాహిత్యాల మధ్య వారధిగా ఉపయోగపడే అనేక వ్యాసాలు తెలుగు దినపత్రికల్లో వెలువడ్డాయి. కన్నడ నాటక రచయిత టి.పి.కైలాసం గురించి ఆంధ్రజ్యోతి దినపత్రికలో జానుమద్ది హనుమచ్ఛాస్త్రి ఒక వ్యాసం రాస్తూ కన్నడ నాటకరంగానికి భావ విప్లవకారుడిగా హాస్య చక్రవర్తిగా, నటుడిగా, నాటకకర్తగా అన్నీ మించి మహోన్నత మానవుడిగా ఆ రచయితను పేర్కొన్నారు. [20]అలాగే విశాలాంధ్ర దినపత్రికలో తమిళ మహాకవి సుబ్రహ్మణ్యభారతి గురించి సదానంద్ శారద ఒక వ్యాసం రాశారు. ఆ వ్యాసంలో ఆయన ఇలా అంటారు. ''సరళ వ్యవహారిక భాషలో, చిన్న చిన్న వాక్యాలలో ఎంతో ప్రభావితంగా ఉండే ఆయన రచనలతో తమిళ సాహిత్యం ప్రజలకు అతి చేరువైందని చెప్పాలి''.[21] 1990లో విశాలాంధ్ర దినపత్రికలో రాంభట్ల కృష్ణమూర్తి ఉర్దూ జ్ఞానపీఠ్ పురస్కార విజేత 'ఖుర్రతులైన్ హైదర్' గురించి ఒక వ్యాసం రాస్తూ సాధారణ సాహిత్య భావనల నుంచి ఆ రచయిత్రిని విశిష్టంగా నిలబెట్టిన అంశాలపైన చర్చించారు. ''సాహిత్యం విశిష్టమైన సుందరమైన, సామాజిక చైతన్యరూపం అంటారు శాస్త్రవేత్తలు. అందుచేత సౌందర్యం సాహిత్యానికి శరీరంలాంటిది. శరీరంలేని ప్రాణమెలా వుంటుందో మనకు తెలీదు. ఒకవేళ వుంటే సౌందర్యంలేని సాహిత్యం కూడా అలాగనే వుంటుంది. ఖుర్రతులైన్ నవలలు మాత్రం అలాంటివికావు.'' [22] ప్రపంచ భాషా సాహిత్యాల గురించి, భారతీయ భాషా సాహిత్యం గురించి వెలువడిన విశ్లేషణాత్మక వ్యాసాలు కూడా ఈ సందర్భంగాపేర్కొనదగినవి. ఆంధ్రప్రభ దినపత్రికలో కె.గోదావరిశర్మ 'సాహితీ సరోవరంలో వికసించిన నల్లకలువ' అనే శీర్షికన ఒక వ్యాసం రాస్తూ ఇలా అంటారు. ''శతాబ్దాలుగా చీకటి ఖండంగా నిరాదరణకీ, నిర్లక్ష్యానికీ గురైన ఆఫ్రికా, ఇటీవలనే తన ప్రాచీన సంస్కృతీ సంప్రదాయాల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పడమేకాక ప్రపంచ సంస్కృతీ వికాసానికి ఆఫ్రికా దేశస్థుల ఆచార వ్యవహారాలు, భాషలు, మతాల అధ్యయనం, అవగాహన ఎంత అవసరమో కూడా గుర్తించేటట్లు చేస్తున్నది. [23] అదే పత్రికలో డాక్టర్ బాలాంత్రపు శ్యామలరావు 'భారతీయ రచయితల ఇంగ్లీషు నవలలు' అనే అంశంపైన విషయ ప్రధానమైన మంచి వ్యాసాన్ని అందించారు. వీరితోబాటు అనేక మంది రచయిత్రులు కమలామార్కండేయ, ఈత్‌ప్రానర్, జాబ్‌వాలా, నయన్‌తారా షెహగల్, అనితాదేశాయ్, శాంతారామారావ్, అతియా హుస్సేన్ అగ్రస్థానం సంపాదించుకున్నారు''. [24] ఇతర భాషల్లో వచ్చిన మంచి సాహిత్యాన్ని పరిచయం చేసే శీర్షికలు కూడా ఈ దశాబ్ది తెలుగు దినపత్రికల్లో కనిపిస్తాయి. మహీధర

రామమోహనరావు ఆంధ్రభూమి దినపత్రికలో 'ది రెయినీ సీజన్' అనే నవల గురించి మాట్లాడుతూ ఆ నవలలో ఉన్న రాజకీయ విశేషాంశాలను ప్రస్తావించారు. ''మొత్తంమీద 'పోచినాలోనే' నేటి ఆఫ్రికన్ రాజ్యాల పరిస్థితి, అక్కడి అభ్యుదయాత్మక ప్రభుత్వాలకు సాయం చేస్తున్న సోవియట్ ప్రభుత్వ కార్యాలయాలు ఎదుర్కొంటున్న సమస్యల్నీ చాలా చక్కగా చెప్పి చదివించగలుగుతున్నారు. [25] సృజనాత్మకంగా ఇతర భాషల సాహిత్యాన్ని తెలుగులోకి యథాతథంగా అందించే ప్రయత్నం కూడా ఈ దశాబ్దంలో జరిగింది. ఉదాహరణకు విశాలాంధ్ర దినపత్రికలో 'బెర్టోల్ట్ బ్రెక్ట్' కవిత్వానికి కాట్రగడ్డ కేశవ్‌గోపాల్ ఇలా అంటారు. ''పట్టణాలకు, పల్లెలకూ, పిల్లలకూ / పెట్టారు ఆయన పేరు / ఎన్నెన్నో భాషల్లో ఉపన్యాసాలు / కొల్లలుగా సభలూ, ప్రదర్శనలూ / ఇటు షాంఘై నుంచి అటు చికాగో వరకు / అన్నీ లెనిన్‌గౌరవార్ధమే., [26] ''కానీ.. యివ్వండి / నాక్కావలసింది యంత / తెల్లకాగితం... నల్లసిరా!'' [27]

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రసిద్ధ భారతీయ రచయితల కథల అనువాదాలు వెలువడ్డాయి. ఆ వరుసలో తక్కళి శివశంకర్‌పిళ్లే కథ మనియార్డర్ పేర్కొనదగింది. ''మనిషి మనో ప్రపంచాన్ని సూటిగా స్పష్టంగా వ్యక్తం చేయగల శక్తివంతమైన కథారచయిత తక్కళి శివశంకర్‌పిళ్లే. మరిన్ని వివరాల జోలికి పోకుండా మలుపులు తిప్పకుండా నిరాడంబరంగా కథ చెప్తారు పిళ్లే. మంచి కథా రచయిత చెప్పినదానికంటే చెప్పని కథే చాలా వుంటుందట. పిళ్లే కథ చదివాక 'అసలు కథ' మనకే వదిలేసి వెళ్లిపోయాడే! అనిపిస్తుంది.

'చెమ్మీన్' నవలా రచయితగా తక్కళి భారతీయులకు సుపరిచితుడు. కేరళలోని ఎక్కడో మారుమూల పల్లెలో పుట్టిన పిళ్లే 1984లో జ్ఞానపీఠ్‌గెలుచుకున్నారు. లోతైన సామాజికదృక్పథం, అంతరంగాన్ని పట్టి కుదిపే అద్భుతమైన వచనశైలి పిళ్లే ప్రత్యేకత. 'మని ఆర్డర్' ఆయన రాసిన గొప్ప కథల్లో ఒకటి. ఒక అనాథ చావుపుట్టుకల కథ ఇది. ఈ కథలో మనకు పరిచయమయ్యే రామన్ అయ్యర్ నిజానికి మనకందరికీ బాగా తెలిసినవాడే., [28] అలాగే విశాలాంధ్ర దినపత్రికలో కూడా అనువాద కథలు అచ్చుయ్యాయి. [29]

ఈ దశాబ్దిలో కనిపించే మరో ప్రధాన లక్షణం అనువాద సాహిత్యానికి సంబంధించి సృజనాత్మక కృషిమాత్రమే కాకుండా సైద్ధాంతిక స్థాయికూడా కొంత ప్రయత్నం జరగడం. ఉదాహరణకు అనువాద విధానంలోని లోటుపాట్ల గురించి డాక్టర్ పురిపండా అప్పలస్వామి విశాలాంధ్ర ఆదివారం అనుబంధంలో ఒక విలువైన వ్యాసం రాశారు. ''అనువాదవిద్య ఒక విధంగా పరకాయ ప్రవేశం వంటిది. అనువాదకుడు మూలరచయితలో ప్రవేశించి అతడి భావాలు తన భాషలో మనముందు పెట్టాలి. ఈ విద్య ఎంత గొప్పదో అంత ప్రమాదకరమైంది. అర్థం పొరబడితే భావం అనర్థమవుతుంది.. [30] తెలుగు భాషనుంచి ఇతర భాషల్లోకి వెళ్లిన అనుభవాల గురించి వెలువడిన వ్యాసాల్లో ఆంధ్రప్రభ దినపత్రికలో వి. ఎస్. ఆర్. మౌళి రాసిన 'సాహితీ

వనంలో అనువాద సుమాలు' విశేషమైనవి. శ్రీశ్రీ, దేవులపల్లి, గుర్రం జాషువా, సినారె, దాశరథి, గోపీచంద్, శివరామశాస్త్రిల రచనలను అమరేంద్ర ఆంగ్లంలోనికి అనువదించారు. అంతేకాక సాహిత్య వ్యాసాలు, షేక్స్పియర్ నాటకాలు కూడా అనువదించారు.

సినారెగారి 'విశ్వంభర'ను ఆంగ్లంలోనికి అనువదించారు. ఎర్నెస్టు హెమింగ్వే రాసిన 'ఫర్ దిహోమ్ ది బెక్స్‌రోల్స్'ని 'ఘంటారావం' పేరున అనువదించారు. [31]

1980 తరువాత తెలుగు దినపత్రికల సాహిత్య అనుబంధాల కృషివల్ల అనువాద ప్రక్రియ వేగవంతంగా కొనసాగిందని చెప్పడానికి ఈ ఉదాహరణ. వివిధ భారతీయ భాషల నుంచి మాత్రమే కాకుండా ప్రపంచ భాషల గురించి కూడా విశేషమైన రచనలు తెలుగులోకి అనువాదమయ్యాయి. అలాగే ఇతర భాషల్లోకి అనువాదమైన తెలుగు రచనలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నాయి. మొత్తంగా అనువాద ప్రక్రియకు సంబంధించిన కొత్త భావనలు తెలుగు సాహిత్యంలో తగినంత స్థానాన్ని సంపాదించుకున్నాయని చెప్పవచ్చు.

పాదసూచికలు :

1. మానేపల్లి సత్యనారాయణ, విశ్వసాహిత్యం శీర్షిక, ఉదయం దినపత్రిక, డిసెంబరు 6,1987.

2. మానేపల్లి సత్యనారాయణ, విశ్వసాహిత్యం శీర్షిక, ఉదయం దినపత్రిక, ఫిబ్రవరి 21,1988.

3. శ్రీ సోమసుందర్, 'తాతార్ ప్రజా కవి ముస్సా జలీల్ వీరమరణం', విశాలాంధ్ర, దినపత్రిక, ఆదివారం , డిసెంబరు 1,1985.

4. ప్రత్యేక వ్యాసం, 'విప్లవకవి మయ్‌కోవ్‌స్కీ', విశాలాంధ్ర దినపత్రిక, జూలై 31,1983.

5. అనువాద వ్యాసం, 'శ్రామికవర్గ రచయిత యూజిని పాటిర్', ప్రజాశక్తి దినపత్రిక, డిసెంబరు 17,1989.

6. అఫ్సర్, 'కవయిత్రి గెబ్రీలా మిస్‌ట్రాల్', ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం, ఏప్రిల్ 8, 1984.

7. ఆర్. సీతారామారావు, 'సృజనాత్మక రచయిత బెర్టోల్ట్ బ్రెక్ట్', ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఫిబ్రవరి 9,1986.

8. ఎర్నెస్ట్ హెమింగ్వే, 'పరిశీలన లేకపోతే రచయిత బతుకే లేదు', ఉదయం దినపత్రిక , మే 4,1988.

9. బోరిస్ పాస్టర్నక్, 'జీవిత రహస్యాలను కోల్పోవడం ఇష్టం లేదు', ఉదయం దినపత్రిక, జూన్ 3, 1988.

10. ప్రసేన్, 'జీవితం - కవిత్వం పోరాటం, వెరసి... సోయెంకా', 'ఉదయం 'దినపత్రిక, ఏప్రిల్ 14, 1988.

11. 'సోమసుందర్, 'మానవతావాది, మహాకవి నజ్రుల్ ఇస్లామ్', విశాలాంధ్ర దినపత్రిక, మే 20, 1984.

12. పురిపండా అప్పలస్వామి, 'విద్రోహ కవి నజ్రుల్ ఇస్లామ్', ఆంధ్రజ్యోతి దినపత్రిక, నవంబర్ 28, 1982.

13. సోమసుందర్, 'భారత అభ్యుదయ సాహిత్యోద్యమ నిర్మాత', విశాలాంధ్ర దినపత్రిక, మే 19, 1985.

14. సోమసుందర్, 'సజ్జాద్ జహీర్ వియత్నామ్ కవితలు', విశాలాంధ్ర దినపత్రిక, మే 19, 1985.

15. కొప్పర్తి, 'సామ్యం కోసం సాగే పథికుల సారథి మఖ్దూం మొహియిద్దీన్', ఆంధ్రజ్యోతి దినపత్రిక, జూన్ 23,1985.

16. మానేపల్లి సత్యనారాయణ, 'ముల్క్‌రాజ్ ఆనంద్' ఉదయం దినపత్రిక, ఏప్రిల్ 3, 1988.

17. ముల్క్‌రాజ్ ఆనంద్ తో శ్రీహరిమూర్తి ముఖాముఖం, 'ఆధునిక తెలుగు సాహిత్యం తుపానులో చిక్కుకుంది', ఉదయం దినపత్రిక, జనవరి 2,1989.

18. డా॥ఎస్.గంగప్ప, 'సరోజినినాయుడు కవితలో సామాజిక స్పృహ, విశాలాంధ్ర దినపత్రిక, జనవరి 14, 1981. అని అంటారు.

19. అఫ్సర్, 'నేను చూసిన నిజాల నిజరూపమే తమస్', ఆంధ్రజ్యోతి దినపత్రిక మే 23, 1988.

20. ''కన్నడ నాటక రంగంలో భావవిప్లవకారుడిగా, హాస్యచక్రవర్తిగా, నటుడిగా, నాటకకర్తగా అన్నీ మించి మహోన్నత మానవుడిగా నివాళులందుకొన్న కైలాసం 1946లో కన్నుమూశారు. ఈ యేడు ఆయన శతజయంతిని కన్నడ ప్రజలు జరుపుకుంటున్నారు'' జానుమద్ది హనుమచ్ఛాస్త్రి 'కన్నడ నాటక రచయిత టి.పి.కైలాసం. ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం, సాహిత్యవేదిక, ఏప్రిల్ 14, 1985.

21. సదానంద్ శారద, 'మహాకవి సుబ్రహ్మణ్యభారతి'', విశాలాంధ్ర దినపత్రిక, జనవరి 30, 1983.

22. రాంభట్ల కృష్ణమూర్తి, ' ఉర్దూ జ్ఞానపీఠ పురస్కార విజేత' ఖుర్రతలైన్

హైదర్', విశాలాంధ్ర దినపత్రిక, అక్టోబర్ 14, 1990.

23. కె.గోదావరిశర్మ, ''సాహితీ సరోవరంలో వికసించిన నల్లకలువ', ఆంధ్రప్రభ దినపత్రిక, డిసెంబర్ 13, 1986.

24. డాక్టర్ బాలాంత్రపు శ్యామలరావు, 'భారతీయ రచయిత్రుల ఇంగ్లీషు నవలలు', ఆంధ్రప్రభ దినపత్రిక, ఆగస్టు 28, 1988.

25. మహీధర రామమోహనరావు, 'ది రెయినీ సీజన్, ఒక కొత్త మంచి నవల, కితాబు శీర్షిక, ఆంధ్రభూమి దినపత్రిక, మార్చి 23, 1987.

26. జర్మన్ మాతృక 'బెర్టోల్ట్ బ్రెక్ట్', తెనుగుసేత : జి.కాట్రగడ్డ, 'లెనిన్‌కు కుయాన్ బులాక్ తివాసీ నేత పనివారి గౌరవాంజలి', విశాలాంధ్ర దినపత్రిక, ఏప్రిల్ 21, 1985.

27. కేశవగోపాల్ ' ఒక్కొక్క క్షణం' అనువాద కవిత, విశాలాంధ్ర దినపత్రిక, ఏప్రిల్ 14, 1985.

28. అఫ్సర్, 'మనీ ఆర్డర్', తక్కళి శివశంకర పిళ్లే కథ, అనువాదం, ఆంధ్రజ్యోతి దినపత్రిక, జూన్ 6, 1988.

29. జ్వాలావలయాలు కథానిక, మరాఠీ మూలం: యోగీరాజ్ వాఘ్మరి, అనువాదం: సాకేత్, విశాలాంధ్ర దినపత్రిక, జూన్ 10, 1984.

30. డా॥ పురిపండా అప్పలస్వామి, 'అనువాద విధానం - అందులోని లోటుపాట్లు, విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం, ఆగస్టు 18, 1985.

31. వి. ఎస్. ఆర్.మౌళి, 'సాహితీ వనంలో అనువాద సుమాలు', ఆంధ్రప్రభ దినపత్రిక, సెప్టెంబర్ 21, 1986.

★★★

# *vi*. వివిధ శీర్షికలు

ఈ దశాబ్దంలో తెలుగు దినపత్రికల్లో సాహిత్య సంబంధమైన శీర్షికలకు విశేష ప్రాధాన్యం లభించింది. సాధారణంగా దినపత్రికల్లో సంపాదకీయ పేజీల్లో ఒక హాస్య, వ్యంగ్య శీర్షికను నిర్వహించడం ఆనవాయితీగా వుంది. గోపాలభూపాలం, మాటకచేరీ, పుణ్యభూమి, జీవనకాలమ్, ముత్యాలపందిరి లాంటి శీర్షికలు కనిపించేవి. జీవితానికి, సమాజానికీ సంబంధించిన స్వల్పమైన విషయాలను వ్యాఖ్యానిస్తూ సరదాగా సాగే ఈ శీర్షికలు దాదాపు ప్రతీ తెలుగు దినపత్రికలోనూ వెలువడ్డాయి. అయితే 80-90ల తరువాత ఒక ప్రత్యేకమైన ధోరణి కనిపిస్తోంది. సాధారణ, వ్యంగ్య శీర్షికలే కాకుండా సాహిత్య సంబంధమైన విశ్లేషణాత్మక శీర్షికలు కూడా విశేష సంఖ్యలో వెలువడుతున్నాయి. చేరాతలు, సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు, సంతకాలు లాంటి శీర్షికలు ప్రధానంగా పేర్కొనదగినవి. ఇదే సమయంలో సాహిత్యపరంగా విశేషంగా పేర్కొనదగిన శీర్షికలు కూడా ( ఉదాహరణకు పతంజలి భాష్యం, పచ్చనాకు సాక్షిగా) వెలువడ్డాయి. అంటే 80 ల తరువాత వచ్చిన శీర్షికలను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. ఎ. సాహిత్య శీర్షికలు బి. సృజనాత్మక శీర్షికలు సి. వ్యక్తిగత విశేషాంశాలతో కూడిన ప్రయోగాత్మక శీర్షికలు.

## ఎ. సాహిత్య శీర్షికలు:

నేరుగా సాహిత్య అంశాలే ప్రధానాంశంగా వెలువడిన శీర్షికల్ని ఈ వర్గీకరణలో పేర్కొనవచ్చు. సమకాలీన సాహిత్య విశేషాలపైన వ్యాఖ్యలతో కూడిన ఈ శీర్షికలు సాధారణ పాఠకులకు సైతం ఆసక్తికరంగా కొనసాగాయి. 1982 లో కె.వి.రమణారెడ్డి అక్షర జగత్తు, ఆరుద్ర వ్యాస పీఠం, టి.యల్.కాంతారావు వారానికో రోజు, మసూనా మరుగునపడ్డ మాణిక్యం... ఈ విధంగా పేర్కొనదగినవి. ఆరుద్ర వ్యాసపీఠం ఆంధ్రజ్యోతి దినపత్రికలో శీర్షికగా వెలువడిన వ్యాసాలు సాహిత్య విమర్శను, పరిశోధనను గాఢమైన అంశంగా స్వీకరించే అనేక కొత్త విషయాలను సైతం సోపపత్తికంగా ఆరుద్ర వివరించారు. సాధారణంగా దినపత్రికల్లో వచ్చే సాహిత్య శీర్షికలు కూడా కేవలం వ్యాఖ్యలకే పరిమితమవడం సాంప్రదాయం. ఆ సాంప్రదాయాన్ని ఎదిరించి సాహిత్య శీర్షికకు పరిశోధనాత్మక విలువను సంతరించిపెట్టిన శీర్షిక ఆరుద్ర వ్యాస పీఠం.

ఉదాహరణకు 'తెనుగా? తెలుగా? ఏదీ ప్రాచీనం'' అనే వ్యాసం . ''పాశ్చాత్యులు ద్రావిడ భాషలపై ఎంత పరిశోధన చేశారో సోవియెట్ శాస్త్రజ్ఞులు కూడా అంత విపులంగా పరిశోధనలు చేశారు. 1960లోనే జడ్. ఎన్.పెత్రుని చేవా తెలుగు భాష మీద ఒక మోనోగ్రాఫ్ రాయడం జరిగింది. అయితే, రష్యన్ భాషలో వుంది. దీని ఇంగ్లీష్ అనువాదం వుందా, లేదా చెప్పమంటూ మాస్కోలోని యుయస్‌యస్ ఆర్, అకాడమీ ఆఫ్ సైన్సెస్ వారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌కు ఉత్తరం రాశాను.''[1]

ఈ శీర్షిక ఆరుద్ర ఒక కాలమిస్టుగా మాత్రమే కాకుండా సునిశిత అవగాహన కలిగిన పరిశోధకులుగా కనిపిస్తారు. అదే విధంగా పాండిత్య ప్రమాణాలతో కూడిన మరో శీర్షిక ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి 'ముఖే ముఖే', ఆంధ్రజ్యోతి దినపత్రికలో వెలువడిన ఈ శీర్షిక అనేక ప్రాచీన సారస్వత విషయాలను చర్చించింది.

ఆంధ్రజ్యోతి దినపత్రికలోనే సోమవారం సాహిత్య వేదిక అనేక వారాల పాటు ఆసక్తికరంగా నిర్వహించబడిన మరో శీర్షిక కోడూరి శ్రీరామమూర్తి' అందాల తెలుగుకథ'. ఈ శీర్షికలో తెలుగుసాహిత్యంలో ఉన్నత ప్రమాణాలతో కూడుకున్న కొన్ని అద్భుతమైన కథలను కోడూరి శ్రీరామమూర్తి విశ్లేషణాత్మకంగా పరిచయం చేశారు. ఒక్కొక్క కథనే తీసుకుని విశేషంగా వ్యాఖ్యానించిన ఇలాంటి శీర్షికలు అంతకు ముందు ఇంతగా లేవు. కథావిశ్లేషణలో ఒక ప్రత్యేకమైన ఒరవడిని ఏర్పరచిన శీర్షికే. ఉదాహరణకు మల్లాది రామకృష్ణశాస్త్రి 'సర్వమంగళ' కథనువ్యాఖ్యానిస్తూ కోడూరి శ్రీరామమూర్తి ఇలా అంటారు.'' శాస్త్రి గారి కథలు కవిత్వానికి సన్నిహితంగా ఉంటాయి. ఒకటి, రెండు సార్లు చదివితే కానీ వాటిలోని సారస్యం బోధపడదు. అప్పుడు గానీ ఆయనతో చేయి కలిపి 'సై' అనుకోము! శాస్త్రిగారిలోని మరో ప్రత్యేకత తన పాత్రలకు తాళ్లు బిగించి 'ఇలా మాట్లాడండి' అని చెప్పకపోవడం.[2] అలాగే కథల్లో వుండే ప్రత్యేకతను ఆవిష్కరించడంలో ఈ శీర్షిక ఎంతో ఉపయోగపడింది. ''పద్మరాజు కథల్లోని మరో ప్రత్యేకత. పాండితీప్రకర్ష కలిగి పెద్దలమని చెప్పుకునే వాళ్ల కంటే జీవితాన్ని యథాతథంగా చూడగలిగిన సామాన్యులు ఎంతో ఎత్తున కనబడటం. పద్మరాజు గారి కథల్లో నాకు 'వెండిసీసా' నచ్చుతుంది. 'గాలివాన', 'పడవప్రయాణం' వంటి ప్రసిద్ధ కథలతో పోల్చి చూస్తే ఇది సామాన్యమైనదిగా కనబడవచ్చు.''[3] కథారచనశైలిలో ఆయా రచయితల ప్రత్యేకతల్ని ఇతర భాషలకు చెందిన రచయితలతో పోల్చి చూపడంలో కూడా ఒక విధమైన సంయమనాన్ని ఈ శీర్షిక సాధించింది. ఉదాహరణకు ''మానవ జీవితాన్ని, అందునా మధ్యతరగతి కుటుంబీకుల మనస్తత్వాన్ని నిశితంగా పరిశీలించిన గొప్ప కథకుడు కొడవటిగంటి కుటుంబరావు. రాశిలోనూ, వాసిలోనూ కుటుంబరావు గారి కథలు ప్రత్యేకతను కలిగినవి.

కథారచనారీతిలో కుటుంబరావుగారిని ప్రసిద్ధ రష్యన్ కథకుడు చెకోవ్‌తో

పోల్చవచ్చు. [4]మునిమాణిక్యం, చలం, శ్రీపాద లాంటి ముందుతరం రచయితలతో పాటు ఈ తరం కథారచయితలనుకూడా ఈ శీర్షిక విశ్లేషణాత్మకంగా పరిచయం చేసింది. [5,6,7].

## చేరాతలు:

1986 అక్టోబరు నుంచి 1994 మార్చి వరకు ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో సుదీర్ఘకాలంపాటు వెలువడిన 'చేరాతలు' శీర్షిక ఆధునిక కవిత్వానికి ఒక విమర్శవేదికగా ఉపయోగపడింది. భాషాశాస్త్ర దృక్పథం నుంచి చేకూరి రామారావు దాదాపురెండు వందలకు పైగా ఖండికలను రాశారు. ఈ శీర్షిక ఒక సాధారణమైన కాలమ్ మాదిరిగా కాకుండా ఆధునిక కవిత్వానికి సంబంధించి విమర్శా, పరామర్శలకు ఒక కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. శైలికి సంబంధించినంతవరకూ భాషాపరమైన నేపథ్యం నుంచి విశ్లేషణను అందించింది. ఈ విశ్లేషణ వచన కవిత్వానికి పరిమితం కాకుండా పద్య కవిత్వానికి, కవిత్వంలో ఇతర నిర్మాణ వ్యూహాల అన్వేషణకు ఉపయోగపడింది. ముఖ్యంగా 1980 ప్రాంతాల నుంచి తెలుగులో వెలువడుతున్న కొత్తరకం కవిత్వానికి చేరాతలు ఒక అర్థవంతమైన వ్యాఖ్యానాన్ని సమకూర్చిపెట్టింది. పద్యకవిత్వానికి సంబంధించినంతవరకూ ఆధునిక భావ వ్యక్తీకరణ వున్న సందర్భాలను చేరా విశ్లేషణకు స్వీకరించారు. ఉదాహరణకు విశ్వనాథ సత్యనారాయణ అంధబిక్షువు అనే కవితను చేరా విశ్లేషిస్తూ ఇలా అంటారు. ''విశ్వనాథ సత్యనారాయణ గారి అంధ బిక్షువులో ఆధ్యాత్మికత లేదు. పూర్వజన్మప్రసక్తి, ఆధ్యాత్మికత కోసం వచ్చింది కాదు. కవిత్వం కోసం తెచ్చింది. బిక్షుకుని సర్వహైన్యాన్ని, కనుగూళ్ళ శూన్యాన్ని మన మనసులో ముద్రించడం కోసం కవికి పూర్వజన్మ పనికి వచ్చింది. ఆ స్వరం వింటున్నప్పుడు , కనుబొత్తలు చూస్తున్నప్పుడు అతని పూర్వజన్మ వృత్తాంత భ్రాంతి కలిగి అతన్ని బావిలోంచి తీద్దామా అన్న త్వర పుడుతుంది కవికి. పాట ఆగిపోవడంతోనే కవికి ఈ ప్రపంచపు స్పృహ ఈ జన్మపు తెలివి కలుగుతాయి.''[8]

80ల తరువాత తెలుగు కవిత్వాన్ని మలుపుదిప్పిన అనేక కొత్తధోరణుల్నిచేరా తన కాలమ్ ద్వారా కొత్త పద్ధతుల్లో విశ్లేషించారు. అత్యాధునిక కవులు తమ కవితల్లో ప్రయోగిస్తున్న కొత్త సాంకేతిక వ్యూహాల్ని చేరాతలు శీర్షిక ఆవిష్కరించింది. ఉదాహరణకు అఫ్సర్ కవితను విశ్లేషిస్తూ''భౌతిక ప్రపంచానికి కొన్ని నియతమైన సూత్రాలున్నాయి. ప్రపంచంలో ఏ వస్తువూ దీనికతీతంకాదు. మనిషి ఆలోచన తప్ప. కవిత్వంలో ఈ భౌతిక సూత్రాలకతీతమైన సంఘటనలు కనిపిస్తాయి. కవితలో ఉద్దేశించిన విషయాన్ని పాఠకుల మీద గాఢంగా ముద్రించటానికి ఎన్నుకునే టెక్నిక్ ఇది.''[9]

ముఖ్యంగా స్త్రీవాద కవిత్వం పైన చేరా విశ్లేషణ పేర్కొనదగినది. 'జయప్రదంగా ఫెమినిస్టు జయప్రద' అన్నశీర్షికన రాసిన వ్యాసంలో ఆయన ఇలా అంటారు.

''జయప్రభ శక్తి అంతా కొత్త ఊహలు చెయ్యటంలో ఉంది. మనం విన్న కథలు, చదివిన పుస్తకాలు ఆమెకు వేరుగా కనిపిస్తాయి. భిన్నంగా స్పందిస్తుంది. ముఖ్యంగా స్త్రీ విషయాలు వచ్చినపుడు ప్రపంచాన్ని ఒక నూతన స్త్రీ దృక్కోణం నుంచి చూడడం వల్ల ఈ కొత్తదనం వచ్చిందనుకుంటాను.''[10]

విమర్శరంగంలో కొత్తధోరణిని ప్రవేశపెట్టడమే కాకుండా ఒక సృజనాత్మక ప్రక్రియగా కవిత్వ రంగంపై కూడా ప్రభావాన్ని ప్రసరించిన విశిష్టమైన శీర్షిక 'చేరాతలు'.

## వారానికోరోజు:

1986లో ఆంధ్రపత్రికలో 'వారానికో రోజు' శీర్షికను టి.ఎల్.కాంతారావు నిర్వహించారు. ఈ శీర్షికలో ఆయన సాహిత్యానికి సంబంధించిన అనేక అంశాలను తన దృష్టికోణం నుంచి విశ్లేషించారు. కరుణ కుమార కథలు, దాశరథి మహేంద్రోదయం , కృష్ణశాస్త్రి ఊర్వశి, రాయప్రోలు వారి రమ్యాలోకం ఈ శీర్షిక కింద వెలువడిన వ్యాసాల్లో పేర్కొనదగినవి.

## కలాలు సంకలనాలు:

ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో టిఎల్ కాంతారావు నిర్వహించిన మరో శీర్షిక 'కలాలు సంకలనాలు'. సుదీర్ఘకాలం పాటు నిర్వహించబడిన ఈ శీర్షికలో కొత్త రచనల గురించి, పుస్తకాల గురించి ప్రత్యేకించి ఆయన విశ్లేషణ అందించారు. ఉదాహరణకు కథాసంకలనాల గురించి చేసిన విశ్లేషణల్లో పేర్కొనదగింది. కేతు విశ్వనాథరెడ్డి కథలపై 'కథలు కావు జీవితాలు' అనే శీర్షికన రాసిన వ్యాసం. ఆ వ్యాసాల్లో టిఎల్ కాంతారావు విశ్వనాథరెడ్డి సాహిత్య దృక్పథాన్ని విశ్లేషిస్తూ ఇలా అంటారు.''విశ్వనాథరెడ్డి గారి కథలు ఈనాటి వాస్తవికతను ప్రదర్శిస్తూనే రాబోయే మార్పును సూచ్యం చేస్తే అట్లా కథారచన చేసేటప్పుడు కథ రెండు రకాలుగా బయటికి రావచ్చు). వాస్తవికత వరకూ కథాగమనం నైసర్గికమూ, సహజమూ అయి మార్పునకు దారితీసేటప్పుడు రచయిత ఆదర్శంగా 'ఐడియలైజ్' చేసే పద్ధతి ఒకటి.''[11] ఆధునిక కవితాసంకలనాలపైన రాసిన విమర్శ కూడా విశేషించి చెప్పుకోదగింది. ఈ సందర్భంగా ఆయన 'పెన్గన్' అనే ప్రగతికవుల కవితాసంకలనాల్ని విశ్లేషించారు. ఇందులో ఆధునిక కవిత్వ లక్షణాలను, గుణాత్మకతను పేర్కొంటూనే ప్రతికూల అంశాలను కూడా ప్రస్తావించారు. ఉదాహరణకు ''వర్తమాన వచన కవిత్వం ఒక మహోత్కృష్టమైన దశకు చేరుకుంది. ఈ దశలో ఇంకా కవులు నైరాశ్యం చుట్టూ పరిభ్రమించడం ఏమంత మంచిది కాదేమో! అట్లాగే కేవలం ఒక అనుభూతిని, ఒక దృశ్యాన్ని, ఒక సంఘటనను చిత్రించడంతోనూ సరిపోదేమో! ఈ సంకలనంలోని కవులంతా ఈ విషయాలను గురించి ఆలోచిస్తే మంచిది.''[12]

ఆధునిక కవిత్వంలో వ్యక్తి అస్తిత్వానికి, సామాజిక పరిణామాలకు మధ్య వున్న సంబంధాలను విశ్లేషించడమే కాకుండా కవితా నిబద్ధతను గుర్తించే నిశిత దృష్టిని ఈ

శీర్షిక ద్వారా ఆయన కనబరచారు.'' వ్యక్తి అస్తిత్వం వ్యక్తితో ముడిపడిలేదు. జనంతో ముడిపడివుంది. ఆ జనం కూడా ఎటువంటి జనమో శివారెడ్డి తన కవిత్వంలో చెబుతున్నాడు.'' [13]

## సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు:

ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో ఆచార్య జివి సుబ్రహ్మణ్యం 1988 నుంచి రెండేళ్ల పాటు సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు అనే శీర్షికన సంఖ్యానేకంగా వ్యాసాలు రాశారు. ప్రాచీన, ఆధునిక, సమకాలీన సాహిత్యాలను గురించి, ఆయా సందర్భాలలో తలెత్తిన వివాదాల గురించి జి.వి.సుబ్రహ్మణ్యం ఈ శీర్షిక ద్వారా దీర్ఘంగా చర్చించారు. ప్రక్రియాత్మక విమర్శను పొదుకోల్పడంలో ఈ శీర్షిక విశేషంగా దోహదపడింది. ప్రక్రియా భేదాలు, స్వరూప స్వభావాలు సాహిత్య వికాస చరిత్రకు, ప్రక్రియావికాసానికి ఉన్న సంబంధం, సాహిత్య ఉద్యమాలు- సామాజిక ఉద్యమాలు వాటి స్వరూప స్వభావాలు, సాహిత్య ప్రయోగాలు మొదలైన వాటిని ఆయన విశ్లేషించారు. ప్రక్రియ ప్రాముఖ్యాన్ని గురించిచెపుతూ ఒక బలమైన ప్రక్రియ ఎలా రూపుదిద్దుకుంటుందో విశ్లేషిస్తూ ఆయన ఇలా అంటారు.''ఒక బలమైన ప్రక్రియ మరికొద్ది ప్రక్రియల స్వభావాలను తనలో మేళవించుకుని ఒక మిశ్ర స్వభావాన్ని సంతరించుకున్నా తనదైన వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా తనను తాను రక్షించుకుంటుంది. ఒక్కొక్క సారి ఉద్ధత ప్రవృత్తి కలిగిన వాడు సహవాస ప్రభావం వల్ల సౌజన్య ప్రవృత్తిని తనలో కొంతవరకు జీర్ణించుకునేఅవకాశం ఉన్నది. అలాగే వస్తుతః వీర రసోచితమైన ఇతిహాసం ఒక్కొక్కసారి కొంతవరకు కాల్పనిక కవితాస్వభావాన్ని, గ్రామీణ ప్రకృతి వర్ణన కావ్యస్వభావాన్ని అలవరుచుకున్నా తననైజ స్వభావాన్ని కోల్పోకుండా ఉండటం నైజం. అలా ఉంటేనే ప్రక్రియా పరిపోషణలో వైవిధ్యంతో కూడిన వ్యక్తిత్వం వెలుగొందుతుంది. ''[14]

ప్రక్రియాపరమైన విమర్శనే కాకుండా నవ్యసాంప్రదాయవాదానికి సంబంధించి అనేక కోణాలను జి.వి.సుబ్రహ్మణ్యం ఈ శీర్షికల ద్వారా రచించారు. జాతీయోద్యమ స్పృహ సాహిత్యోద్యమంగా రూపొందటమే సామాజిక సాహిత్య స్పృహగా నవ్యసాంప్రదాయవాదులు ఏ విధంగా సంభావించారో ఈ శీర్షిక ద్వారా ఆయన వివరించారు. రచయితలు ఉద్యమాలతో సంబంధం లేకుండా స్వతంత్రులుగా మాత్రమే వ్యవహరించగలరని అంటూ ఆయన ఇలా అంటారు. 'ఏ ఉద్యమ తరంగం కూడా రచయితల భావాలను శాసించలేదు, నియంత్రించలేదు. ఈ ఉద్యమాలలో రచయితలు స్వతంత్రులు. స్వాతంత్ర్యం మొదట రచయితకు ఇచ్చింది స్వాతంత్ర్యోద్యమం. రచయితలు ఏ పార్టీకి సాంస్కృతిక దళంగా పరిగణింపబడలేదు. గాంధేయమార్గంలో నవ్యసాంప్రదాయవాదులు గ్రహించిన స్వాతంత్ర్య సూత్రంమిదే. ఉద్యమం దేశకాల పాత్రలకు పరిమితమై ఉంటుంది. దాన్ని , దాన్ని తత్త్వాన్ని సాహిత్యంలో దేశకాల పాత్రాతీతంగా ప్రతిపాదించే బాధ్యత రచయితలకున్నదని నవ్యసాంప్రదాయవాదులు

విశ్వసిస్తారు.[15]

సాహిత్య ఉద్యమాల్లో విమర్శకుల పాత్రను బలంగా ప్రతిపాదించిన శీర్షిక 'సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు', భవిష్యత్ దర్శనాన్ని రూపొందించే నేటి సాహిత్యోద్యమాలకు విమర్శకులే నాయకులని చెప్పిన శీర్షిక ఇది.

ఇతర శీర్షికలు: ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలోనే 1987 ప్రాంతాల్లో 'శేషేంద్ర లేఖలు' ఓ శీర్షికగా వెలువడ్డాయి. కవిత్వాన్ని ఒక సౌందర్యాత్మక ఆత్మకళగా ఆరాధిస్తూ వివిధ సందర్భాల్లో శేషేంద్ర రాస్తూవచ్చిన లేఖా పరంపరలోని అంశాలు ఇందులో ఉన్నాయి. కవిత్వ సృజనకు సంబంధించిన కొన్ని విలువైన ప్రతిపాదనలు ఈ శీర్షిక తీసుకువచ్చింది. మంచి కవిత్వం ఎలా రూపొందుతుందో వివరిస్తూ ఇలా అంటారు. ''మంచి కవిత్వం మంచి కవిత్వంగా రూపొందటానికి ఎప్పుడూ ప్రచ్ఛన్నంగా కాని బహిరంగంగాగానీ ఒక పాట ఆత్మాశ్రయత్వ కళను స్వీకరించింది. వస్తువు ఆత్మాశ్రయమైనా పరాశ్రయమైనా దాన్ని సాహితీకరించే శిల్పకళ మాత్రం కవి యొక్క 'ఆత్మకళే' గదా!''[16] ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో 1988లో తారీఖులు-దస్తావేజులు అనే శీర్షికన 'హరి' సాహిత్యానికి సమాజానికి మధ్య కాలానికి సంబంధించిన అంశాలను చర్చించారు. ముఖ్యంగా ఆధునిక యుగానికి సంబంధించిన అనేక అంశాలు ఈ శీర్షిక ద్వారా ప్రస్తావనకు వచ్చాయి. ''1850కి కొంచెం అటూఇటుగా పుట్టిన వారి తరం తెలుగుజీవితంలో కొత్త దృక్కోణాలను ప్రవేశపెట్టారు. సంఘసంస్కరణ అందులో ప్రధానలక్షణం. అంతకు ముందు సంస్కరణ లక్షణాలు అసలు లేవని కాదు. 1857 తర్వాత బ్రిటీషు సామ్రాజ్యవాదం ఇక్కడి భారతదేశంలో ప్రభువుల, భూస్వాముల వర్గంతో రాజీపడిపోయింది. సతీసహగమన నిషేధం లాంటి చట్టం బెంటింక్ కాలం అమలులోనికి వచ్చింది. కనక సరిపోయింది కానీ, అదే 1857 తర్వాత సాధ్యమయ్యేదా? అని చారిత్రకులకు అనుమానం.''[17] సమాజానికి చరిత్రకు సాహిత్యానికి మధ్య ఉండే అనుబంధాన్ని వివరించటంలో ఈ శీర్షిక సఫలమైంది.

ఇవి కాకుండా వివిధ రచయితల చేత పత్రికల వారు రాయించిన శీర్షికలు కొన్ని ఉన్నాయి. వాటిల్లో ప్రసిద్ధమైనది ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'నేపథ్యం'. సమకాలీన సాహిత్య వేదికపై ఉన్న రచయితలు, కవులు వారి వారి నేపథ్యాన్ని వివరిస్తూ ఆత్మకథాత్మకంగా రాసిన శీర్షిక ఇది. కథారచయిత్రి ఇల్లిందల సరస్వతీదేవి 'నీ బాంచన్ కాల్మొక్త' నవలా నేపథ్యాన్ని వివరిస్తూ ఇలా అంటారు. ''ఈ మాట తెలంగాణాలో పేదవారు ధనికులతో అనే మాట. బానిసత్వానికి చిహ్నం. షెడ్యూల్డ్ కులమని చెబితే గాని మార్కులతో సీటురాని విద్యార్థి మనసులో ఉద్భవించిన మాట. 'ఇదే మన సమాజం' అని విజ్ఞులు అనుకునేమాట. ఇదే 'నీ బాంచన్ కాల్మొక్త' నవల నేపథ్యం.''[18] తెలంగాణా జీవితంలోని అణచివేతను ప్రధానాంశంగా తీసుకుని రాసిన 'నీ బాంచన్ కాల్మొక్త' ప్రధాన ప్రేరణల్ని రచయిత్రి వివరించారు. అలాగే గత తరానికి సంబంధించిన కవులు, రచయితలు తమ కాలం నాటి సాహిత్య, సామాజిక స్థితిగతులను వివరించడానికి

కూడా ఈ శీర్షిక ఉపయోగపడింది. ఉదాహరణకు ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'నేపథ్యం' శీర్షికన అభ్యుదయ రచయిత రెంటాల గోపాలకృష్ణ ఇలా అంటారు. ''ఇంత ఆత్మవిశ్వాసంతో, దీక్షతో, మహాసంకల్పంతో పరవళ్లు తొక్కుతూ ముందుకు పోతున్న అభ్యుదయ రచయితలకు కమ్యూనిస్టు పార్టీ రెండుగా చీలిపోవడం ఒక పెను అఘాతమైంది. రచయితలుకూడా రెండు పక్షాలుగా చీలిపోయారు. అప్పటివరకు ఏకోన్ముఖంగా సాగిన అభ్యుదయ సాహిత్యోద్యమం దానితో పాటు ప్రజానాట్యమండలి, ఆంధ్ర ఆర్ట్స్ థియేటర్ మున్నగు వైజ్ఞానిక, సాంస్కృతిక ఉద్యమాలు కూడా చిన్నాభిన్నమైపోయి ఎవరి మార్గంలో వారు సాగిపోయారు.''[19]

అదేవిధంగా సమకాలీన కవిత్వరంగంలో సుప్రసిద్ధులైన వారి నేపథ్యాలుకూడా ఈ శీర్షిక క్రింద ప్రచురితమయ్యాయి. సమకాలీన కవులు తమ జీవన సాహిత్య మూలాలను అన్వేషించడానికి ఈ శీర్షికను ఒక సాధనంగా స్వీకరించారు. ఉదాహరణకు విప్లవకవి కె. శివారెడ్డి బాల్యంపైన తన జ్ఞాపకాల్ని ఇలా వివరిస్తారు. ''జ్ఞాపకం ఒక నెత్తుటి మరక , జ్ఞాపకం ఒక వాడని పువ్వు, జ్ఞాపకం చెమటలో నానిన మట్టి! కళ్లు మూసుకుని కళ్లు తెరిస్తే కళ్ల ముందు మెదిలేది దురదృష్టకరమైన, కష్టభూయిష్ఠమైన బాల్యమే, బాల్యమే లేని బాల్యం, బాల్యంలో పొందాల్సిన ఆనందాన్ని ఇవ్వని బాల్యం, బరువు బాధ్యతలు మీద పడ్డ బాల్యం, చివరికంటా వెంటాడే బాల్యం, బాల్యం మిగిల్చిన జ్ఞాపకాల సంపుటి ఒక లఘుకావ్యం.,''[20]

ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో 'జ్ఞాపకాలు' అనే శీర్షిక, ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో 'నా స్మృతిపథంలో' అనే శీర్షిక పేర్కొనదగినవి. ఈ రెండు శీర్షికల్లో ఎందరో రచయితలు, కవులు, ఆనాటి జ్ఞాపకాలను చెపుతూ వచ్చారు. ఉదాహరణకి ధనికొండ హనుమంతరావు జ్ఞాపకాలను చెబుతూ ఒక మిత్రుడు ఇలా రాశారు'' విమర్శ గురించి చెపుతూ ఎవరన్నా ఏదన్నా కూర వేసి అది ఎలా ఉందయ్యా అని అడిగితే తిన్న కూరను కక్కి చూపడం కాదు. దానిని జీర్ణం చేసుకుని ఆ రుచిని వివరించాలి. అలాగే సాహిత్య విషయంలో కూడా...''[21]

ఆంధ్రభూమి దినపత్రికలో 'దృక్పథం' అనే శీర్షికన సమకాలీన కవులు సాహిత్య జీవనానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన అంశాలపై వ్యక్తం చేసిన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కవిత్వానికి ఉద్యమానికి మధ్య ఉండే అనుబంధాన్ని వివరిస్తూ ఈ శీర్షికలో కె. శివారెడ్డి '' నా పరిమితులకు లోబడి ఉద్యమాలతో నాకున్న సంబంధాల పరిమితులకూ లోబడి నా శక్త్యానుసారంగా గాఢంగా నన్ను నేను వ్యక్తీకరించుకునేందుకు చేసే ప్రయత్నమే నా కవిత్వం. నేను నా ప్రజలకేమిటో చెప్పే ప్రయత్నం కూడా కవిత్వమే. నా జీవితం నుంచి నన్ను విడదీసి నా కాలాన్నుంచి నన్ను విడదీస్తే నా కవిత్వమేమీ మిగలదు. ఏ సాహిత్యమూ మిగలదు.''[22] అంటారు.

సాహిత్య ప్రయోజనానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను కూడా రచయితలు

స్పృశించారు. కేతువిశ్వనాథరెడ్డి సాహిత్యంలో వుండే సామాజిక లక్షణాలను వివరిస్తూ ''సాహిత్యానికి ప్రయోజనం లేదనడం ఆత్మవంచన, పరవంచన కూడా! లిఖిత, మౌఖిక సాహిత్యాలు పుట్టినప్పటి నుంచీ వాటికి నిర్దిష్టమైన సామాజిక లక్షణాలున్నాయి. ఒక వర్గం లేదా సమూహం లక్ష్యం కావచ్చు'' అంటారు [23]

ఆంధ్రభూమి దినపత్రికలోనే కాళీపట్నం రామారావు 'కథలెలారాస్తారు?' అనే శీర్షికన కథకు సంబంధించి సృజనాత్మక, విమర్శనాత్మక అంశాలను విశ్లేషించారు. కథను గుర్తించటానికి అవసరమైన లక్షణాలను క్రోడీకరిస్తూ కథాకమామీషు చెప్పుకొస్తారు.'' కథను గుర్తించటానికి తెలియవలసిన అంశాలన్నీ క్రోడీకరిస్తే ప్రదేశాలు వాటి వర్ణనలూ , సన్నివేశాలు, సంఘటనలు , పాత్రల చర్యలు, వాటి సంభాషణలు, మొదలైనవన్నీ ఉన్నంతమాత్రాన ఓ రచన కథ కాదు. పై కథాసామాగ్రి అంతా క్రమబద్ధంగా అమరి ఉంటేవాటివల్ల ఒక వృత్తాతం తెలుస్తుంది. అదైనా వృత్తాంతమే కానీ అదే కథ కాదు.''[24] కథలు ఎలా రాస్తారో వాటి సృజనాత్మక వ్యవస్థ ఎలా ఉంటుందో వివరిస్తూ కాళీపట్నం ఇలా అంటారు. '' పెరిగే దశలో దోహదకారులైనవి పెరిగిన దశలో అభివృద్ధికి ఆటంకాలవుతాయి. మనుషులు, జాతులు ఎన్నాళ్ళయినా, ఎన్నేళ్లయినా ఇతరుల మీదే ఆధారపడటం కొనసాగిస్తే వారి లేక వాటిలో దౌర్బల్యం బానిసత్వం పెరుగుతాయి.

కాబట్టి మన రచయితలు స్వాభిమానం కలవారు కావచ్చు, లేదా మన సాహిత్యాన్ని అభిమానించేవారు కావచ్చు. అలాంటివారెవరైనా వీలైనంత వేగంగా వీటినుండి బయటపడాలి. తమ శక్తిమేరకే కావచ్చు, తమ కథలు తామే రాసుకోవాలి. కనీసం ఆ మేరకు ఈనాడు ఒక గట్టినిర్ణయం తీసుకోగలిగిన సంతోషించవలసిందే.''[25]

## సంతకాలు:

1985-86 ప్రాంతాల్లో ఉదయం ఆదివారం అనుబంధంలో సుప్రసిద్ధమైన శీర్షిక 'సంతకాలు'. రాచకొండ విశ్వనాథశాస్త్రి, దాశరథి, కరుణశ్రీ, చాసో, చేరా, గద్దర్, రోణంకి అప్పలస్వామి, వాసిరెడ్డి సీతాదేవి,సినారె, తిరునగరి రామాంజనేయులు, ఆరుద్ర,హరి ఆదిశేషు, దాశరథి కృష్ణమాచార్య, నాజర్, ఆత్రేయ, పుట్టపర్తి, దిగవల్లి శివరావు లాంటి ఎందరో సుప్రసిద్ధుల గురించి పరిచయాత్మక విశ్లేషణా వ్యాసాలు వెలువడ్డాయి. రావిశాస్త్రి గురించి పరిచయం చేస్తూ కె.ఎన్.వై. పతంజలి ఆయన సాహిత్య దృక్పథాన్ని కూడా సూచ్యంగా వివరిస్తారు. ''state అనేది ఒక evilఅని స్పష్టంగా తెలిసి, I have nothing but contempt for the courts అని ఖండితంగా చెప్పి , Man the suffering man is my friend అని ఎంతో గర్వంగా లోకానికి తెలియచెప్పి , యువకులైన వాళ్లు కత్తులైనా పట్టాలి, కత్తుల్లాంటి కలాలైనా పట్టాలని నిర్మొగమాటంగా చెప్పిన రచయిత రావిశాస్త్రి'' [26]

చాగంటి సోమయాజుల గారించి సంతకాల శీర్షికలో ఆయన వ్యక్తిత్వానికి, కథకు మధ్య బంధుత్వాన్ని వివరిస్తూ పరిచయకర్త ఇలా విశ్లేషించారు. ''చాసో కథ ఎంత

నిజాయితీగా ఉంటుందో ఆయన కూడా అంత నిష్పక్షపాతంగానూ ఉంటారు. ఆయన ఉనికి ఆలంబనగా, ఆయన కథలు ఉత్తేజంగా స్వీకరించిన రచయితలు కథను పట్టుకెళ్లి ఎలా ఉందని అడిగితే ఆ కథ ఎందుకు బావుందో, లేక బాగులేదో మనమే చెప్పేసి వచ్చేస్తాం. చాసో విమర్శ వేపపండులాంటిది.''[27] అలాగే అరుదైన వ్యక్తుల గురించి, వారి సాహిత్యసేవ గురించి గుర్తు చేసిన శీర్షిక కూడా ఇదే. జానపద సాహిత్యం మీద మొదటి పుస్తకం వెలయించి మరుగున పడిన 'హరి ఆదిశేషువు' గురించి ఈ శీర్షికలోనే దేవరాజు మహారాజు పాఠకులకు పరిచయం చేస్తారు. [28]

తెలంగాణా ఉద్యమ కవిత్వానికి ఊపిరినిచ్చిన దాశరథిని పరిచయం చేస్తూ ఆయన లోని రాజకీయ నిబద్ధతను పాలమూరు కవి కోట్ల వెంకటేశ్వరరెడ్డి ఇలా వివరించారు.''రజాకార్ల రాక్షసత్వానికి జైళ్లు చూసినా, సంకెళ్లు మోసినా తన కవితాకంఠంతో జైళ్లగోడల్ని బద్దలు చేశాడు. సంకెళ్లగుండెల్ని పిండిచేశాడు. తెలంగాణా విమోచనతో దాశరథి సంతృప్తి చెందలేదు. ముక్కలైపోయిన తెలుగునేలను ఒక్కటిగా కావాలని ఆకాంక్షించాడు. కోటిరతనాల వీణ అయిన తెలంగాణాను ఆంధ్ర, మహారాష్ట్రంతో కలిపేవరకు ఆయన విశ్రమించలేదు.'' [29]

'భాషాభాష్యకారుడు చేకూరి రామారావు' అనే శీర్షికను చేరా విమర్శతత్త్వం వెనక వున్న మూలాలను వివరిస్తూ మరొక రచయిత ఇలా అంటారు'' రాతల్లో నిక్కచ్చిగా ఉండే రామారావు మితభాషి, స్మితభాషి, స్నేహశీలి కూడా, అవును, విభేదించటంలో మార్దవం.....మనిషి మంచివారే కానీ అదోరకం అన్నట్టు కనిపిస్తారు. చుట్టూ విద్యార్థులను, పరిశోధకులను సమకూర్చుకుని ఎప్పుడూ అకడమిక్ విషయాలు చర్చించే క్షణం తీరిక లేని నిరాదాయపరుడు రామారావు.'' [30]

## బి. సృజనాత్మక శీర్షికలు:

దినపత్రికల సంపాదకీయాల్లో రెండవ వ్యాసంగా లేదా వ్యాస లక్షణాలు లేకుండా అటు కాల్పనిక అంశాలు మితిమీరకుండా వచ్చిన రచనల్ని సృజనాత్మక శీర్షికలుగా పేర్కొనవచ్చు. 1980 తరువాత తెలుగు దినపత్రికల్లో ఈ విధమైన సృజనాత్మక శీర్షికలు అనేక కొత్త ప్రయోగాలకు నాంది పలికాయి. సాధారణంగా ఈ శీర్షికలు కేవలం హాస్య, వ్యంగ్య శైలిని మాత్రమే ఆశ్రయించి వుండేవి. ఈ దశాబ్దంలో అవి లోతైన జీవన అంశాలను అనుభూతి స్పర్శతోనూ, ఇతర సామాజిక రాజకీయ అంశాలతోనూ , కొరడా ఝుళిపింపులతోనూ ( Satire ), ఒక వినూత్నశైలి విన్యాసంతో కూడుకున్నవి. ఈ విధంగా పేర్కొనదగిన శీర్షికలు పచ్చనాకు సాక్షిగా, స్వగతాలు, పతంజలి భాష్యం, అక్షరాయుధం, జీవనకాలమ్ మొ॥నవి.

## సి. అనుభూతి ప్రాధాన్యమున్న శీర్షికలు:

జీవన అంశాలను కేవలం హాస్య, వ్యంగ్య సన్నివేశాలకు పరిమితం చేయకుండా ఒక సున్నితమైన కోణం నుంచి తరచి చూసే శీర్షికలు ఈ దశాబ్దంలో ప్రత్యేకంగా

పేర్కొనదగినవి. దీనికి ఉదాహరణ పచ్చనాకుసాక్షిగా, స్వగతాలు. నామిని సుబ్రహ్మణ్యం నాయుడు ఉదయం దినపత్రికలో నిర్వహించిన శీర్షిక పచ్చనాకు సాక్షిగా. ఈ శీర్షికలకు సంబంధించినంతవరకు ఇది ఒక ప్రయోగంగా భావించవచ్చు. గ్రామీణ జీవితంలోని అత్యంత స్వల్పమైన విషయాలను తీసుకుని లోతైన పరిశీలనలు చేసిన శీర్షిక ఇది. ఈ శీర్షిక ఇతివృత్తంలోనే కాకుండా రచనా సంవిధానంలో కూడా ప్రయోగాత్మకమైనదే. '' ఒకరోజు పండగపూట మా నాయన చేతికి మా అమ్మ రెండు రూపాయలిచ్చి (సారాయి) తాగేసి రమ్మనింది. మా నాయన ఒద్దంటే ' మొగోడు లచ్చినాలే లేవే?' అనింది. ఆ మాటతో మా నాయన ఆ రోజు తాగేసి వచ్చినాడు. అయితే ఆయన వికారంగా మాటల్లోకి దిగకుండా మంచం మీద ముసుగేసుకుని పడుకున్నాడు. పడుకునివుండే మా నాయన్ని చూసి మా అమ్మ ' నా మొగుడంత తిక్కలోడు ఈ కలిగ్గాన వుండునా?' అనింది.[31] బాషాపరంగా శీర్షికల శైలిలో వచ్చిన మార్పుకు ఈ శీర్షిక ఒక ఉదాహరణగా నిలుస్తుంది. అలాగే మాండలిక భాషలోనే పూర్తిగా శీర్షికలు నిర్వహించే సాంప్రదాయం కూడా ఈ దశాబ్దంలో బలపడింది. దీనికి ఉదాహరణ ఉప్పల నరసింహం ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాసిన 'స్వగతాలు'.తెలంగాణా జీవితంలోని నిత్యజీవిత సమస్యలను తీసుకుని తెలంగాణా భాషలోనే వ్యక్తం చేసిన శీర్షిక ఇది. ''మీరైతే పటేండ్లయితిరి. పది ఊర్లను ఏలుతున్న ప్రభువులైతిరి. రాజులు మీరయితిరి. రాజీర్కం మీ చేతులున్నదాయె, మీరెట్ల మాట్లాడినా సర్రాసుగనే వుంటది. పల్లేరుగారు ఎట్లేసిన సక్కగానే అన్నట్టు మీరెటు విధంగా మాట్లాడినా సాబంది వుంటది.'' [32] సమస్యలను పీడితుల స్వరంలోంచి వినిపించే శైలిని ఈ రచయిత ఎన్నుకున్నారు. దీనికి ఉదాహరణ '' ఈయన అసుంటోడు ఏంకాడుగాని, సంసారమంతా శెదరగొట్టినట్టయపోయె. శేతులకేలి బువ్వకుండ జారిపడ్డట్టాయే యిప్పుడు యెడ అన్నిటికి సంపుకోని వుండవడింది. తల్లిగారింటికాడ వుండి ఒక మంచి బట్టకట్టనా కష్టమే. మంచిగనెత్తితీసుకున్న కష్టమే! ఓ బొట్టు పెట్టుకున్నా తప్పే! నెత్తిలయిన్ని పూలు పెట్టుకున్న ఓర్వది ఈ 'లోకం' ఎన్నడన్న పండుగ పూట నెత్తికి పోసుకోని, ఉతికిన శీర గట్టుకోని నిండుగ కనిపిస్తేసరి! అగో అదిగట్ల తయారయ్యింది భోగం దాని కింద లెక్క అంటరు ఈ 'లోకం'ల.''[33]

గిరిజన ప్రాంతాల్లోని జీవితంలోని ఎగుడుదిగుళ్లను ప్రత్యక్షంగా చూసిన అనుభవంతో ఫణికుమార్ ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో 1988లో 'గోదావరి గాథలు' శీర్షికన కథనాత్మకశైలిలో రాశారు. ఈ శీర్షికలో కొండజనం ఎందుర్కొనే ప్రాణాంతకమైన సమస్యలను ఆయన ఇతివృత్తాలుగా స్వీకరించారు. ఉదాహరణకు 'రాకితల్లి' కథ. ''అయ్యా! అన్యాయమైపోయింది అని గుండెలు పగిలేలా ఏడుస్తూ నన్ను కావలించుకున్నారు. రాత్రి గూడెంపై రెండు ఎలుగుబంట్లు దాడి చేశాయి. గొడవ విని అందరం లేచి ఆ ఎలుగుబంట్ల తరిమివేసేలోపు జరగకూడనిది జరిగిపోయింది. బయట తిరుగుతున్న 'రాక్కి' ని కొరికి నానా బీభత్సం చేశాయి. ఆమెకు మోహమన్నది

లేదిప్పుడు. గూడెంలో స్పృహ తప్పిపడింది అన్నారు. వరంగల్ ఆస్పత్రిలో డాక్టర్లు ఎంతో కష్టపడి ఆమె ప్రాణాలు కాపాడారు. కొన్ని రోజుల తరువాత ఆ గూడెంవారు ప్రమాదం గడచిపోయిందని, అయితే ఇంటికి తిరిగివచ్చిన రాకి మొహంలో చాలా భాగం లేదనీ చెప్పారు. ''మిమ్మల్ని కూడా గుర్తు చేస్తోంది, మీరెప్పుడొస్తున్నారు'' అని అడిగారు.''[34] అదేవిధంగా గిరిజన ప్రాంతాల్లో గిరిజనులలో మమేకమై పనిచేస్తున్న అధికారుల గురించి కూడా ఆయన రాశారు. ఉదాహరణకు 'శాస్త్రిగారు' అనే శీర్షిక ''1981 ఏప్రిల్ 21న ఆదివాసులు తీవ్రవాద వర్గాల ఆధ్వర్యంలో ఇంద్రవెల్లిలో సమావేశమయ్యారు. ఆ రోజు కొన్ని అవాంఛనీయమైన సంఘటనలు జరిగాయి. ప్రతిగా పోలీసు కాల్పులు. అప్పటికే రగులుకొంటున్న అశాంతికి, ఈ సంఘటనలు ఆజ్యం పోశాయి. ఈ పరిస్థితులలో ఈ సమస్యల పరిష్కారానికి అప్పుడు కరీంనగర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.వి.పి.చంద్రశేఖరశాస్త్రిగారిని పంపింది ప్రభుత్వం. మానవ మాత్రుడైన ఒక అధికారి ఎన్ని సమస్యలను పరిష్కరించగలడో అన్నింటిని శాస్త్రిగారు పరిష్కరించారు. వ్యక్తిగత జీవితం, సరదాలు ఆయన ఎరగడు. మహర్షి ఎస్. ఆర్.శంకరన్‌గారిలాగానే ఆయనకు బడుగువర్గాలు తప్ప వేరే చుట్టాలు లేరు.''[35]

## డి. వ్యంగ్య శీర్షికలు:

సమకాలీన వ్యవస్థ విశ్వరూపాన్ని ప్రదర్శించే వివిధ వ్యంగ్య శీర్షికలు ఈ దశాబ్దంలో అనేకం వచ్చాయి. ఇలాంటి శీర్షికల్లో ప్రధానంగా రాజకీయ వ్యవస్థను చీల్చిచెండాడే ధోరణి ఎక్కువ కనిపిస్తుంది. గజ్జెల మల్లారెడ్డి మాటకచేరీ, పతంజలి భాష్యం, నగ్నముని అక్షరాయుధం, వీటికుదాహరణ. మల్లారెడ్డి మాటకచేరి అటు వచనం, ఇటు కవిత్వం కలగలిసిన శీర్షిక. ఈ శీర్షికలో సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలతోపాటు సాహిత్యపరమైన అంశాలను కూడా ఆయన తీసుకున్నారు. మల్లారెడ్డి శైలి గంభీరంగా తీవ్ర వ్యంగ్యంగానూ సాగుతుంది. ఉదాహరణకు మాటకచేరీలో 'నా స్మృతిపథంలో శ్రీశ్రీ' శీర్షికన శ్రీశ్రీ గురించి మల్లారెడ్డి తన అభిప్రాయాలను నిస్సంకోచంగా వ్యక్తం చేశారు. ''శ్రీశ్రీని ఆధునిక కవితకు పీఠాధిపతిగా చిత్రించిన ఆయనతో ఎవరైనా విభేదిస్తే అదేదో మహాపరాధం అయినట్లు భావించే ఒక గణాచార్ల బృందం ఇప్పుడు ఆయన సమాధి చుట్టూ చేరింది. శ్రీశ్రీ రాసిందంతా మహాకవిత్వమనీ, దాన్ని ఆక్షేపిస్తే సహించమని శివాలు తొక్కుతోంది. మరోమాటలో వ్యక్తి ఆరాధనాతత్వాన్ని పరాకాష్ఠకు చేర్చింది.''[36] ఈనాడు దినపత్రికలో ''పుణ్యభూమి'' శీర్షిక ద్వారా రాజకీయ, సామాజిక వ్యంగ్య రచనకు మల్లారెడ్డి ఎంతో విలువను తీసుకువచ్చారు. అటు తరువాత ఎన్నో శీర్షికలకు ప్రేరణగా మారింది.

**అ. పతంజలి భాష్యం:** Satire కు అక్షర సాక్ష్యంగా నిలిచే కవిత పతంజలి భాష్యం - 1985లో ప్రతీవారం ఉదయం దినపత్రికలో సంపాదకీయ పేజీలలో వెలువడిన ఈ శీర్షిక వస్తుపరంగానూ, రూపపరంగానూ ఎంతో మార్పును తీసుకువచ్చింది.

సమకాలీన తరాన్ని పట్టిపీడిస్తున్న అనేక అంశాలను ఈ రచయిత ఈ శీర్షిక ద్వారా వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఉదాహరణకు '' ఇక్కడ రిటైర్‌మెంట్ అంటే భోజనాల పంక్తి లోంచి లేచిపోవడం తప్పించి మరేమీ కాదు. ఇక్కడ ఉద్యోగం అంటే ఏ పూటకాపూట భోజనం చేయడం తప్ప ఇంకేమీ కాదు. రిటైర్‌మెంట్ అంటే నాకు నవ్వొస్తుంది. ఏడుపు కూడా వస్తుంది. ఎవరైనా గానీ ఎందుకు రిటైర్ కావాలి ఎప్పుడు రిటైర్ కావాలి? ప్రతిదీ ఒక నాటకం, ఒక దొంగాటకం. అయినా మన రాజు గారి దేశంలో నిరుద్యోగుల కోసం రిటైర్ కావాలి. '' [37]

ఆ. నగ్నముని 'అక్షరాయుధం': 1985లోనే నగ్నముని అక్షరాయుధం శీర్షిక ఉదయం దినపత్రికలో వెలువడింది. ఈ శీర్షిక కూడా హాస్య, వ్యంగ్య పరిమితులన్నీ ఛేదించుకుని ఒక గంభీరమైన శైలిలో సాగింది. ఉదాహరణకు 'అంధకారంలో ఆంధ్రభాష' అనే శీర్షిక క్రింద ఆయన ఇలా అంటారు. ''భాష నేర్పడమంటే కాసిని పద్యాలు వల్లెవేయడం, వాచకాలు ముక్కుల్లోకి ఊదడం, కొద్ది పదాలతో పరిచయమేర్పరచడం కాదు. భాష నేర్పడమంటే దశలవారీగా పదాల స్వరూపస్వభావం, పదాల అర్థాల పరిధి తెలియజెయ్యడం, పదాలపై సంపూర్ణ అధికారం కలిగేటట్లు చేయడం, తద్వారా వివిధ రంగాల్లో గతంలో అభివృద్ధి ఎంతవరకు జరిగిందో, వర్తమానంలో ఏం జరుగుతున్నదో, ఒక్క మాతృభాష రావడం ద్వారానే సకల ప్రపంచమూ పూర్తిగా తెరుచుకోవవడం.. [38]

ఇ. గొల్లపూడి జీవనకాలమ్: గొల్లపూడి మారుతీరావు ఆంధ్రజ్యోతి దినపత్రికలో సుదీర్ఘ కాలంగా రాస్తున్న శీర్షిక 'జీవనకాలమ్'. జీవితానికి సంబంధించిన దాదాపు ప్రతీ కోణాన్ని సున్నితంగా స్పృశించిన శీర్షిక జీవనకాలమ్. ఈ శీర్షికలో అనుభవాలు, సంఘర్షణలు, వ్యక్తులు వాటన్నింటిపై వ్యాఖ్యలు ప్రధానంగా కనిపిస్తాయి. ఉదాహరణకు ''ఘనత వహించిన సంపాదక మహాశయా! / ఆనవాయితీగా ఈ రోజు మా ఇంటికి రావల్సిన ఆడపిల్ల / ఆచూకి తెలియక అందరూ కంగారుపడుతున్నాం / ఆంధ్రదేశంలోనో, అఖండ భారతదేశంలోనో / ఎక్కడో బిక్కుబిక్కుమంటూ వుంటుంది / ధైర్యం చెప్పి మా ఇంటికి చేర్చినవాళ్లకి / అడిగినంతా ఇస్తామని హామీ ఇవ్వండి / అమ్మాయి పేరు విభవ, సరిగ్గా ఈ సమయంలోనే / వసంతాన్ని తోడుతెచ్చుకుని / కొత్త ఆశల్ని గుండెలనిండా విచ్చుకొని / కొండంత ఆనందంతో తరలి వస్తుంది'' [39]

ఈ. గోపాలభూపాలం: ఉదయం దినపత్రికలోనే మరో మంచి శీర్షిక 'గోపాలభూపాలం'. ఈ శీర్షికలో చాలా సందర్భాల్లో సాహిత్యపరమైన అంశాలు, జ్ఞాపకాలు ప్రస్తావనకు వచ్చాయి. గోపాలచక్రవర్తి స్వయంగా కవి కూడా అయివుండడం వల్ల తన కాలం నాటి కావుల గురించి వివిధ సందర్భాల్లో పేర్కొన్నారు. మహాకవి శ్రీశ్రీ శీర్షికన ''శ్రీశ్రీ చదువుతూంటే హాలంతా చప్పట్లతో మారుమోగింది. నిజానికి శ్రీశ్రీ తన కవిత్వాన్ని చక్కగా పఠించలేకపోయేవాడు. ఆయన సాహిత్య

వ్యక్తిత్వం మీద ఉండే అపారమైన ప్రేమతో గౌరవంతో శ్రోతలు కవితను నిశ్శబ్దంగా వినేవారు. మద్రాసులో ఒకసారి ఒక స్వీడిష్ కవి వొచ్చినపుడు స్థానిక సాహిత్య సంస్థవారొకరు ఒక సమావేశం ఏర్పాటు చేశారు. శ్రీశ్రీ తన కవిత్వాన్ని (జగన్నాథ రథచక్రాలు) చదివితే యిండ్క్విస్ట్ అనే ఆ స్వీడిష్ కవి ఏమి చలించలేదు. అది చూసిన జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రిగారు ఆ కాగితాలు తీసుకుని తను మళ్లీ ఆ కవితను చదివాడు. అద్భుతంగా చదివి వినిపించాడు. ఆ శబ్ద సౌందర్యం ఆ పాశ్చాత్య కవిని ముగ్ధుణ్ణి చేసింది. తర్వాత ఆ పద్యం అర్థం చెప్పించుకుని దీన్ని ఆకళింపు చేసుకుని ఆయనే ఎంతోగానో శ్రీశ్రీని మెచ్చుకున్నాడు.'' [40]

ఉ. **కార్టూన్ కవిత్వ శీర్షికలు:** 1980-90ల మధ్య వర్తమాన రాజకీయ, సామాజిక అంశాలపై అనేక కార్టూన్ శీర్షికలు వెలువడ్డాయి. గజ్జెల మల్లారెడ్డి, రాంభట్ల కృష్ణమూర్తి, దేవిప్రియ, 'నిజం' లాంటి కవులు ఈ తరహా కార్టూన్ కవిత్వానికి ఎంతో ప్రాచుర్యాన్ని తీసుకువచ్చారు. రాంభట్ల కృష్ణమూర్తి 'చంద్రహాసాలు' 1990 ల్లో ఉదయం దినపత్రికలో శీర్షికగా వచ్చింది. ''జనతా, కురుపాండవ వాహినులెవిడిపోయినపుడు / ఉభయ సేనలనుగాని తావ్రాశ్రీ ఇట్లని ఉవాచ: / యదాయదా డెమోక్రసీ కెదోగ్లాని సోకినపుడు / నాయకత్వ మణచగలుగు నయాత్మలను సృజించెతను / మన నారి సముద్ధరణకు పరాయల నాశనముకు / జనతంత్ర స్థాపనకై జనియంతును యుగే యుగే / ఏకగ్రీవ నియంతల నేరికోరి సంహరింతు / శతగ్రీవ జనతా పద్ధతిని తిరిగి ప్రతిష్టింతు''[41]

గజ్జెల మల్లారెడ్డి 'అక్షింతలు' శీర్షిక కూడా ఎంతో ప్రసిద్ధమైనది. ''తెలుగునాట కాంగ్రెసైని / గెలిపించిన ఘనుడెవ్వడు? / ఎన్టీ ఆర్ కృషియేనని / ఎంచవచ్చు గురువరా! / అయినప్పుడు కాంగీలో అంతటి గొడవెందుకో? / వాదం లేనిది కాంగ్రెస్ కాదుగదా గురువరా!'' [42]

**దేవిప్రియ 'రన్నింగ్ కామెంటరీ':** ఢిల్లీలో మన పెద్దలు / ఎగగొట్టిన బిల్లుల కథ / రాజధాని నడివీధిలో / తెలుగువాడి పరువుల వధ! / అణాకాని బుద్ధులతో / వీళ్లా మన నేతలంతా / జనం ఇలా క్షమించడం / వింతలలో మహావింత!![43] అని ఆ రోజుల్లో ఆంధ్రప్రభలో ధారావాహికంగా దేవీప్రియ తన రన్నింగ్ కామెంటరీని ప్రత్యేక వ్యంగ్య శీర్షికగా వినిపించారు.

*ఇతర శీర్షికలు:* 'ఉదయం'లో జి.కృష్ణగారు రాసిన తెలంగాణా రచనలు ఒక మంచి శీర్షిక. చారిత్రకంగా విశ్లేషిస్తూ ప్రతీ వారం వచ్చిన శీర్షిక ఇది. ''హైదరాబాద్ నుంచి గోల్కొండ పత్రిక వెలువడేది. దాని అమ్మకాలు తక్కువే. దాని పాఠకులూ ఎక్కువే. దాని సందేశం ప్రజలకు ఎంతో ఉత్తేజకరమైనది, వికాసకరమైనది. కానీ హైదరాబాద్ సంస్థాన్ నికృష్ట నిష్ఠుర నిబంధనలను తప్పించుకుంటూ పత్రిక నడిపారు. సురవరం ప్రతాపరెడ్డిగారు పాండవ సోదరులలో ఒకడు (నకులుడు) వాన చినుకులకూ, చినుకులకూ మధ్యగా, తడవకుండా పోయినట్లు ప్రతాపరెడ్డిగారు ప్రభుత్వా

నియమనిబంధన వత్తిళ్ల నుంచి తప్పించుకుంటూ గడిపారు.''[44]

అదేవిధంగా 'నవరస బొమ్మకంటి' అన్న వ్యాసం కూడా పై శీర్షికలో వచ్చినదే. ''శ్రీ బొమ్మకంటి సత్యనారాయణ నవరస భరితమైన వ్యక్తి, ఎప్పుడైనా వొళ్లు మరచి ప్రవర్తించాడా? ఒక పర్యాయం ఒక ఊళ్లో రాత్రి భోజనానంతరం జమలాపురం కేశవరావుగారు ఎవ్వరికీ చెప్పకుండా వాహ్యాళి వెళ్లాడు. అవి కమ్యూనిస్టులు రైతాంగ విప్లవం నడుపుతున్న రోజులు. కేశవరావుగారు ఎక్కడరా అని ఒకణ్ణి ఆదుర్దాగా అడిగాడు బొమ్మకంటి. 'అట్లాపోయారు' అని అతడు చెప్పగానే బొమ్మకంటి చరచరా అటుపోయి, పది నిమిషాల్లో ఆయనను పట్టుకొచ్చాడు. కేశవరావుగారి క్షేమంపట్ల ఆసక్తితో తన క్షేమాసక్తిని ఆ క్షణంలో కోల్పోయాడు బొమ్మకంటి! అటువంటి ఉద్వేగాలు సకృతు.'' [45]

ఇదే రీతిలో ఉదయం దినపత్రికలో అబ్బూరి వరద రాజేశ్వరరావు జాతీయోద్యమ కాలంలో జ్ఞాపకాల గురించి వివరిస్తూ ' వరద కాలమ్' శీర్షిక నిర్వహించేవారు. '' ఆరోజుల్లో అద్దంకి శ్రీరామ్మూర్తి గారు వర్థమాన నటుడు, అంతేకాక జాతీయవాది. నాటకం ద్వారా సాంస్కృతికంగాభారతదేశపు పూర్వపు ఔన్నత్యాన్ని రంగస్థలం మీద అశేష ప్రజానీకం ముందు పునఃప్రతిష్ఠించాలని కలలు గనేవాడు. ఆయనకు ఆరోజుల్లో ఆరాధ్యదైవం దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు. వారి మీద ఆయనకున్న భక్తికి మూలకారణం గోపాలకృష్ణయ్యగారి అకుంఠిత దేశసేవాతత్పరతే కాక నిరుపమానమైన కంఠమాధుర్యమూ, అందుకు తగ్గ సంగీత వైదుష్యమునూ.[46]

పాదసూచికలు :

1. ఆరుద్ర, ఆరుద్ర వ్యాసపీఠం, 'తెనుగా? తెలుగా? ఏది ప్రాచీనం?', ఆంధ్రజ్యోతి దినపత్రిక, డిసెంబరు 4,1983.

2. కోడూరి శ్రీరామమూర్తి, 'మల్లాదివారి సర్వమంగళ', అందాల తెలుగుకథ శీర్షిక, ఆంధ్రజ్యోతి దినపత్రిక, డిసెంబర్ 22, 1986.

3. కోడూరి శ్రీరామమూర్తి, 'పద్మరాజు వెండిసీసా', అందాల తెలుగుకథ శీర్షిక, ఆంధ్రజ్యోతి దినపత్రిక, నవంబరు 24, 1986.

4. కోడూరి శ్రీరామమూర్తి, 'కుటుంబరావు ఫోర్త్ డైమన్షన్', అందాల తెలుగుకథ శీర్షిక, ఆంధ్రజ్యోతి దినపత్రిక, నవంబర్ 10,1986.

5. ''ఆధునిక తెలుగుకథాసాహిత్యానికి వాడి, వేడి యిచ్చినవాడు చలం. ఆధునిక తెలుగుకథకు శ్రీకారం చుట్టింది గురజాడ వారా? లేక ఆచంట వారా? అనే ప్రశ్న ఎలా ఉన్నప్పటికీ తెలుగు కథ వినూత్న పోకడలు పొందింది. చలం కలం వెలుగులలోనే! దాదాపు వందకథలు, తొమ్మిది నవలలు రాసిన చలం తాను చేపట్టిన ప్రతి సాహిత్య ప్రక్రియలోనూ ఒక కొత్తదనాన్ని చూపించాడు. తెలుగుసాహిత్యంలో ఒక ఉప్పెన చలం.

చలం గారి 'ఆమె త్యాగం' కథ చదివారా? 'నీతి' పేరిట సమాజంలో ప్రచారంలో ఉన్న విలువలకు, నిజమైన మానవతా విలువలకూ మధ్యగల తేడాను చూపుతూ మహోన్నతమైన మానవతావిలువల ముందు శారీరక సంబంధాలు సిగ్గుతో తలవాల్చుకోవలసిందేనన్న సత్యాన్ని చాటుతుంది కథ.'' కోడూరి శ్రీరామమూర్తి, 'చలం', 'ఆమెత్యాగం', అందాల తెలుగుకథ, ఆంధ్రజ్యోతి దినపత్రిక, నవంబర్3, 1986.

6.''శ్రీపాద వారి కథలలో 'వడ్లగింజలు' చాలా ప్రసిద్ధమైంది. శాస్త్రిగారికి యిష్టమైన కథలలో పెద్ద కథ కూడా ఒకటి. 'వడ్లగింజలు' కథలో ఒక గోచిపాత కట్టుకుని, మరో గోచిపాత కప్పుకుని వుండే గర్భ దరిద్రుడైన తంగిరాల శంకరప్ప చదరంగ విద్యావైదుష్యం ఉంది. లౌక్యము, బ్రతకనేర్చినతనమూ కూడా ఉంది. అంతేకాదు. పెద్దాపురం ప్రభువులు చతుర్వాజ తిమ్మజగపతి మహారాజు గారి చదరంగ క్రీడా ప్రయత్నమూ, రసికత, దానగరిమ ఉన్నాయి. '' కోడూరి శ్రీరామమూర్తి, 'శ్రీపాద వారి వడ్లగింజలు', అందాల తెలుగు కథ, ఆంధ్రజ్యోతి దినపత్రిక, డిసెంబర్ 15,1986.

7.కాంతం కాపురం లాగానే (పోనీ కాంతం మొగుడి గారి సంసారం లాగానే) ప్రతి ఇల్లూ ఆనందంతో కళకళలాడుతూ వుండాలని ఆయన కోరుకున్నాడు. ఇంటిపేరు చెప్పేసరికి మనకు జ్ఞాపకం రావలసినవి పాలవాడికి, కిరాణాకొట్టువాడికి, తీర్చవలసిన బాకీలు, చంటాడి జ్వరం, పెద్దపిల్ల పెళ్లి ఇదికాదనీ, వీటన్నింటికీ అతీతమైన ఆనందాన్నిప్రతి గృహస్తు తన యింటిలో తనకు తాను కల్పించుకోవలసి వున్నదని, ప్రతి కథలోనూ గిలిగింతలు పెట్టే ధోరణిలో చెబుతారు మునిమాణిక్యం.'' కోడూరి శ్రీరామమూర్తి, మునిమాణిక్యం 'బద్‌నసీహత్', అందాల తెలుగుకథ, ఆంధ్రజ్యోతి దినపత్రిక, డిసెంబర్ 29, 1986.

8.చేకూరి రామారావు, అంధబిక్షువుకీ అంధగీతికి మధ్య అనుభవ భేదాలు అనేకం , చేరాతలు శీర్షిక, ఆంధ్రజ్యోతి దినపత్రిక, జనవరి 7, 1988.

9.చేకూరి రామారావు,'రాత్రిలోంచి రాలిపడ్డ సైగల్ పాట', అఫ్సర్, చేరాతలు శీర్షిక, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆగస్టు 23, 1987.

10.చేకూరి రామారావు, 'జయప్రదంగా ఫెమినిస్టు జయప్రద', చేరాతలు, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఫిబ్రవరి 2, 1991.

11.టి.ఎల్.కాంతారావు,'కథలు కావు...జీవితాలు', 'కలాలు - సంకలనాలు' శీర్షిక, ఆంధ్రప్రభ దినపత్రిక, ఆగస్టు 7,1988.

12. టి.ఎల్.కాంతారావు, ప్రగతికవుల కవితాసంకలనం', పెన్గన్, ఆంధ్రప్రభ దినపత్రిక, నవంబర్ 22, 1987.

13. టి.ఎల్.కాంతారావు, 'కలాలు- సంకలనాలు' ఆంధ్రప్రభ దినపత్రిక, ఆగస్టు 28,1988.

14. జి.వి.సుబ్రహ్మణ్యం,' ప్రక్రియకు దర్శనం మూలం'' సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు', ఆంధ్రప్రభ దినపత్రిక, ఆదివారం, ఫిబ్రవరి 12,1989.

15. జి.వి.సుబ్రహ్మణ్యం,'నవ్యసాంప్రదాయం: జాతీయ దృక్పథం', సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు, ఆంధ్రప్రభ దినపత్రిక, మార్చి 4, 1990.

16. గుంటూరు శేషేంద్రశర్మ,'ఆత్మకళ', 'శేషేంద్ర లేఖలు', ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం, మే 31, 1987.

17. హరి పురుషోత్తమ్, 'దేశం తరపు వకాల్తా తీసుకుని మహోపన్యాసం చేసిన వక్త గురజాడ', తారీఖులు, దస్తావేజులు శీర్షిక, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఏప్రిల్ 17, 1988.

18. ఇల్లిందల సరస్వతీదేవి, 'బానిస కాని బానిస కథ' ' నీ బాంచన్ కాల్మొక్త' నవల,నేపథ్యం శీర్షిక, ఆంధ్రజ్యోతి దినపత్రిక, మే 9, 1988.19.రెంటాల గోపాలకృష్ణ, 'కమ్యూనిస్టు పార్టీ చీలిక అభ్యుదయ రచయితలను, కళాకారులను దెబ్బతీసింది', నేపథ్యం శీర్షిక, ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఫిబ్రవరి 26, 1996.

20. కె. శివారెడ్డి, 'బాల్యమే లేని బాల్యం! బాల్యం మిగిల్చిన జ్ఞాపకాల సంపుటి ఒక లఘుకావ్యం', నేపథ్యం శీర్షిక, ఆంధ్రజ్యోతి దినపత్రిక, నవంబర్ 9, 1986.

21. కె.పి., 'ఎప్పుడూ మాట తప్పని మా ధనికొండగారు స్మృతిపథంలో.... ధనికొండ', 'నా స్మృతిపథంలో శీర్షిక', ఆంధ్రజ్యోతి దినపత్రిక, జనవరి 22, 1990.

22. కె. శివారెడ్డి , 'దృక్పథం' శీర్షిక, ఆంధ్రభూమి దినపత్రిక, ఆగస్టు 13, 1988.23.కేతువిశ్వనాథరెడ్డి , 'దృక్పథం' శీర్షిక, నిర్వహణ: యం.కె.సుగమ్‌బాబు, ఆంధ్రభూమి దినపత్రిక, జూలై 30, 1988.

24. కాళీపట్నం రామారావు, నేటికథాకమామీషు, కథలెలా రాస్తారు? శీర్షిక, ఆంధ్రభూమి దినపత్రిక, మార్చి 5, 1988.

25. కాళీపట్నం రామారావు, 'కథలెలారాస్తారు?' ఆంధ్రభూమి దినపత్రిక, జూలై 18,1987.

26. కె.ఎన్.వై.పతంజలి, 'తెలుగువారి బంగారుకథలకొండ రాచకొండ విశ్వనాథ శాస్త్రి', 'సంతకాలు' శీర్షిక, ఉదయం దినపత్రిక, జూలై 28, 1985.

27. పరిచయకర్త, 'తెలుగుకథకు తూర్పుదిక్కు- చాసో' సంతకాలు శీర్షిక, ఉదయందినపత్రిక, జనవరి 27, 1985.

28. ''హరి ఆదిశేషువు గారు మద్రాసు ప్రెసిడెన్సి కాలేజీ రసాయన శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసరుగా పనిచేస్తూ ఉండగా 'జానపద సాహిత్యం' మీద మొట్టమొదటి పుస్తకం రాశారు. అంతకు ముందు విడివిడిగా శ్రీయుతులు ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు, చింతాదీక్షితులు, టేకుమళ్ల కామేశ్వరరావు, నేదునూరి గంగాధరం, కృష్ణశ్రీ, తిమ్మావఝ్ఝల కోదండరామయ్య, శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి, దేవులపల్లి రామానుజరావు వ్యాసాలు రాశారు. కానీ పుస్తకరూపంగా ఎవరిదీ రాలేదు. అది కోస్తాజిల్లాల్లో చివరిదైన శ్రీకాకుళంలో 1954లో అచ్చయింది.'' దేవరాజు మహారాజు, తెలుగుజానపద సాహిత్యంమీద మొదటి పుస్తకం వెలయించి మరుగున పడిన హరి ఆదిశేషువు , సంతకాలు శీర్షిక, ఉదయం దినపత్రిక, ఏప్రిల్ 7,1985.

29. కోట్ల వెంకటేశ్వరరెడ్డి, 'కవితాపయోనిధి దాశరథి', సంతకాలు శీర్షిక, ఉదయం దినపత్రిక, జూన్ 23, 1985.

30. డ్యాక్టర్ ఎస్. 'భాషా భాష్యకారుడు చేకూరి రామారావు', సంతకాలు శీర్షిక, ఉదయం దినపత్రిక, నవంబర్ 3, 1985

31. మా గడపెక్కిన కత్తెర పల్లాయన 'పచ్చనాకు సాక్షిగా', నామిని సుబ్రహ్మణ్యం నాయుడు, మే 8,1985 బుధవారం ఉదయం దినపత్రిక.

32. వుప్పుల నరసింహం, 'పల్లేరుగారు ఎట్లేసినా సక్కగానే', ఆంధ్రజ్యోతి దినపత్రిక, డిసెంబర్ 12, 1986.

33. వుప్పుల నరసింహం, 'కంటికి పుట్టెడు ఏడిశెటట్లు', ఆంధ్రజ్యోతి దినపత్రిక, నవంబర్ 18, 1986.

34. ఫణికుమార్ 'రాకితల్లి' గోదావరి గాథలు, ఆంధ్రప్రభ దినపత్రిక, డిసెంబర్ 4, 1988.

35. ఫణికుమార్, 'శాస్త్రిగారు' 'గోదావరి గాథలు' ఆంధ్రప్రభ దినపత్రిక, నవంబర్ 20, 1988.

36. గజ్జెల మల్లారెడ్డి, ''నా స్మృతిపథంలో శ్రీశ్రీ', 'మల్లారెడ్డి మాటకచేరి', ఉదయం దినపత్రిక, జూన్ 17, 1990.

37. ఇచ్చట రిటైర్ చేయబడును', 'పతంజలి భాష్యం', పతంజలి శీర్షిక, ఉదయం దినపత్రిక, మే 11,1985 శనివారం.

38. 'నగ్నముని', 'అంధకారంలో ఆంధ్రభాష', అక్షరాయుధం శీర్షిక, ఉదయం దినపత్రిక, జనవరి 18, 1985.

39. గొల్లపూడి మారుతీరావ్, 'సంపాదకునికో లేఖ', ఆంధ్రజ్యోతి దినపత్రిక,

జీవనకాలమ్ శీర్షిక.

40. గోపాల చక్రవర్తి, 'గోపాల భూపాలం శీర్షిక', 'మహాకవి శ్రీశ్రీ', ఉదయం దినపత్రిక, ఆదివారం, జూన్ 16, 1985.

41. రాంభట్ల కృష్ణమూర్తి, 'చందహాసాలు' శీర్షిక, ఉదయం దినపత్రిక, మే 7, 1990.

42. గజ్జెల మల్లారెడ్డి, 'గజ్జెల మల్లారెడ్డి అక్షింతలు', ఉదయం దినపత్రిక మే 13, 1990.

43. రన్నింగ్ కామెంటరీ, దేవీప్రియ, ఆంధ్రప్రభ దినపత్రిక, జూలై 30,1983.

44. జి. కృష్ణ, 'నిత్య విద్యాసక్తుడు సురవరం ప్రతాపరెడ్డి', తెలంగాణా రతనాలు శీర్షిక, ఉదయం దినపత్రిక , సెప్టెంబరు 1,1986

45. జి.కృష్ణ 'నవరస బొమ్మకంటి', 'తెలంగాణా రతనాలు' శీర్షిక, ఉదయం దినపత్రిక సెప్టెంబర్ 10, 1986.

46. ఈనాటికి సాధించాను, వరదకాలమ్, అబ్బూరి వరదరాజేశ్వరరావు, జూన్ 18,1985, ఉదయం దినపత్రిక.

★★★

# *vii.* చర్చలూ - వాదోపవాదాలు

1980 తరువాత దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో చర్చలూ - వాదోపవాదాలు ప్రధానంగా వచన కవిత్వం చుట్టూ తిరిగాయి. వచన కవిత్వంలోని కొత్త అంశాలు అనేకం చర్చకు వచ్చాయి. వచన కవిత్వానికి రూపపరంగా ఒక పరిమితి ఏర్పడిపోయిందని ఆ చట్రంలోంచే అది బయటపడటంలేదని విస్తృత స్థాయి చర్చలు - వాదోపవాదాలు కొనసాగాయి. వచన కవితకు సంబంధించిన ఇతివృత్తాల్లోనూ, నిర్మాణంలోనూ ప్రయోగాలకు అంతగా అవకాశం లేకపోవడం ఈ విమర్శలకు కారణమైంది. ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో చందు సుబ్బారావు 'వయసుమళ్ళిపోతున్న వచన 'కవిత ' శీర్షికన ఇలా అంటున్నారు. ''కనీసం వ్యూహాల్లోనూ, ఆలోచనా విస్తృతిలోను కూడా వచన కవులు (ముఖ్యంగా ప్రారంభకులు) ఓ పరిధిని దాటటంలేదు. కవితా భావుకత్వానికి దేశ,విదేశాల రాజకీయ సాంఘిక జీవితం, ఎల్లలు లేని విశాలమైన ఆలోచన, చారిత్రక అవగాహన, శాస్త్రీయమైన నేపథ్యం, ప్రజల మధ్య పలురకాల సంఘర్షణలు, ఉద్యమాలు, విప్లవాలు, తాత్త్వికమైన లోతులు, అనేక తరగతుల ప్రజల జీవన వైవిధ్యాలు, వైరుధ్యాలు కొంతైనా తెలుసుకోవాలన్న ఆపేక్ష లేనట్లు కనిపిస్తుంది''.[1] ప్రజా జీవనానికి సంబంధించిన విభిన్నాంశాలు కవిత్వానికి వస్తువులు కాలేకపోతున్నాయని, సమాజంలోని వివిధ ధోరణులు, ఉద్యమాలు, తాత్త్వికమైన అంశాలు వివిధ తరగతుల ప్రజల జీవన స్థితిగతులు కవిత్వ పరిధిలో చేరలేకపోతున్నాయని విమర్శకులు అభిప్రాయపడ్డారు.

వచన కవిత్వంలో అస్పష్ట, అయోమయ కవితాధోరణులు పెరిగిపోతున్నాయన్న విమర్శ కూడా ఈ దశాబ్దంలో మరింత పెరిగింది. 1982లోనూ ఆంధ్రప్రభ దినపత్రికలో వచన కవిత్వంపై జరిగిన చర్చలో విమర్శకులే కాకుండా కవులు కూడా అస్పష్టత గురించి ప్రస్తావించడం కనిపిస్తుంది. ''అన్నీ తెలిసి అస్పష్ట అయోమయ కవితా ధోరణుల్లోకి దూరిపోయి కొట్టుమిట్టాడే కవుల గురించి ఒకటి, వచన కవిత నుంచి మినీ కవితను వేరుచేసి పదే పదే పంక్తుల్నీ, పదాల్నీ, అక్షరాల్నీ లెక్కించే పరిశోధకుల గురించి రెండవది.''[2] అలాగే ప్రజా కవిత్వ అనే భావన గురించి విభిన్న నిర్వచనాలు ఇచ్చే ప్రయత్నం కూడా ఈ దశాబ్దంలో కనిపిస్తుంది. విశాలాంధ్ర

ఆదివారం అనుబంధంలో టి. యల్.కాంతారావు 'ఏది ప్రజా కవిత', అనే శీర్షికన ప్రజా కవిత్వ లక్షణాలను చెబుతూ ఇలా అంటారు. ''ప్రజా కవిత్వమంటే ప్రజల కొరకు రాసే కవిత్వం! వారికి అర్థమయ్యే రీతిలో ఉండే కవిత్వం. పీడిత ప్రజలు అనేక స్థాయిలలో ఉన్నారు. కనుక అనేక స్థాయిలలో వుండే కవిత్వం అంతా ప్రజా కవిత్వమే అవుతుంది. ప్రజా కవులలో మహాకవులుండరనీ, మహాకవులు, ప్రజా కవులు కారనే తీర్మానం అసంబద్ధమైనది, అక్రమమైనది.''[3] అయితే ప్రజా కవిత్వ నిర్వచనానికి సంబంధించి విమర్శకుల్లో రకరకాల అభిప్రాయాలున్నాయి. ప్రజా కవిత్వం పేరుతో కేవలం హింసను ప్రబోధించే లక్షణాలు అధికంగా వెలువడటాన్ని సాహిత్య విమర్శకులు వ్యతిరేకించారు. ఈ దశలో ప్రజా కవిత్వ పరిధి ప్రయోజనాలపైననే కాకుండా ఇతర సాహిత్య ధోరణుల్లో ప్రజా కవిత్వాన్ని సరిపోల్చుకునే ధోరణి కూడా మొదలైంది. ఉదాహరణకు ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలోనే 1987లో 'సాహిత్యం ఆయుధమే' అనే శీర్షికన వెలువడిన ఒక వ్యాసంలో '' ' ఇక నరికెయ్, పొడిచేయ్' మంటూ విరసం వాళ్లు ఎవరు రాయడంలేదు, విరసంలాగా కనిపించే కొందరిని పత్రికలు కావాలని ప్రోత్సహిస్తున్నాయి. నాకు తెలిసినంతవరకు బాధ్యతగల విరసం రచయితలు ఎవరు ఎప్పుడు నరికేయ్ నవలలు, కథలు రాసినట్టుగా గుర్తులేదు. కె. బి.గారు చెపితే సంతోషం. ఇవాళ విరసం కానివాళ్లు జుగుప్సాకరమైన, భయంకరమైన హింసను రాస్తున్నారు.''[4]

కవిత్వంలో వివిధ ధోరణులతోపాటు విడిగా కవుల దృక్పథాలపై కూడా విస్తృతమైన చర్చ జరిగింది. ఆంధ్రజ్యోతి దినపత్రిక సాహిత్య వేదికలో తిలక్ కవిత్వ తత్త్వాన్ని గురించి 1986లో ఒక ఆసక్తికరమైన చర్చ జరిగింది. తిలక్ భావకవి అని కొందరు, అభ్యుదయ కవి అని మరికొందరు, భావాభ్యుదయ కవి అని కొందరు వాదోపవాదాలు సాగించారు. తిలక్‌కు అనుభూతి ప్రధానమైన వచనా విధానాన్ని సాగించరు కాబట్టి అతనిది భావకవిత్వ మార్గమేనని ఒక అభిప్రాయం వ్యక్తమైంది. ''వ్యధార్థ జీవితాలను చూసి అభ్యుదయ కవులు ఆవేశపూరితులైతే తిలక్ మాత్రం కరుణలో కరిగిపోయాడు. అయితే ఈ కరుణ అతని భావుకతకు ఉద్దీపనమైందేకాని, పతిత లోకాన్ని ఉద్వేగపూరితం చేయలేకపోయింది. కాబట్టి తిలక్‌లో మనకు విభిన్న ప్రవృత్తులు దర్శనమిచ్చినా మౌలికంగా అతడు భావకవే''.[5] తిలక్ అభ్యుదయ కవి అంటూ వ్యక్తమైన అభిప్రాయాల్ని విమర్శిస్తూ మరో వ్యాసకర్త కంటాబత్తిన శ్రీనివాసులురెడ్డి ఇలా అంటారు. ''మీ దృష్టిలో తిలక్ ఎంత అభ్యుదయ కవో, అంతకు కొన్ని అంతలు భావకవులు అన్నది నా భావం. మీరు అవునన్నా, కాదన్నా!''[6] అయితే తిలక్‌లో అనుభూతి ప్రధానమైన అంశాలు ఎన్ని ఉన్నాయో ప్రగతిశీల భావాలు కూడా అంతేస్థాయిలో ఉన్నాయని వామపక్ష విమర్శకులు కూడా అభిప్రాయపడ్డారు. ఈ వివాదంలో తిలక్ ముద్రను గురించి చెబుతూ ద్వానాశాస్త్రి 'అందుకే తిలక్ కవిత కొత్త అనుభవాల కాంతిపేటికను తెరిచి కదిలించగలిగింది. అందం, ఆనందం తిలక్

కవిత్వానికి పరమావధి. అతడు అన్ని కిటికీల్ని తెరిచి, అన్ని పవనాల్ని ఆహ్వానించాడు. ఇప్పుడు కొత్తగా 'ముద్ర' వెయ్యవలసిన అవసరం లేదు గాక లేదు'' [7] అంటారు. దిగంబర కవితా ఉద్యమం మీద ఇప్పటికే చర్చలై - వాదోపవాదాలు సాగుతూనే ఉన్నాయి. ఈ ఉద్యమం ప్రారంభమైన నాటి నుంచి కవిత్వ వస్తువు, శిల్పాలపైన అనేక అంశాలు చర్చలో భాగమయ్యాయి. ఈ చర్చలలో భాగంగా దిగంబరకవులు కూడా అనేక సందర్భాల్లో తమ తమ ధోరణుల్ని సమర్థించుకోవడానికి ప్రయత్నించారు. ఆంధ్రజ్యోతి సాహిత్య వేదికలో 'దిగంబర కవిత్వ ఉద్యమంపై రాళ్లు వేయవద్దు ప్లీజ్' అంటూ ముగ్గురు దిగంబర కవులు ఈ విధంగా సమాధానమిచ్చారు.

''*నగ్నముని:*... మానవ విలువలను మింగేస్తున్న ఈ వ్యవస్థను ప్రతిఘటించిన దిగంబర కవులను ప్రజలు అక్కున చేర్చుకున్నారనేది నిరూపితమైంది పాతికేళ్ల తర్వాతనైనా గట్టిగా చెప్పవచ్చునని నేను అనుకుంటున్నాను. అందుకని రాళ్లు వెయ్యవద్దని, అర్థం చేసుకొమ్మని కోరుతున్నాను.''

*నిఖిలేశ్వర్:*.. 'నిజం కోసం అక్షరాల్లో నుండి, తటస్థతను, అరాచకత్వాన్ని ధ్వంసం చేసి ఒక సార్థకమైన దిశను చూసిన ఉద్యమం మాది. ఆ దిగంబర కవితోద్యమంలో బాధ్యతాయుతమైన కవిగా నిలిచినందుకు నేను గర్విస్తున్నాను.''

*జ్వాలాముఖి:* దిగంబర కవుల కవిత్వాన్ని చూచేటప్పుడు వారి లక్ష్యాన్ని యుగావసరాన్ని దృష్టిలో పెట్టుకుని విమర్శించాలి. సమాజంలో వుండే వైరుధ్యాలు ప్రతి సంస్థలోను, వ్యక్తిలోను ఏదో దశలో, ఏదో రూపంలో ప్రతిబింబిస్తాయి. దిగంబర కవుల్లోనూ వైరుధ్యాలున్నాయి.'' [8] దిగంబర కవిత్వాన్ని విమర్శించేటప్పుడు ఆ కాలానికి సంబంధించిన అంశాలను దృష్టిలో వుంచుకోవాలన్నది ఈ చర్చలూ వాదోపవాదాల్లో ఎక్కువ మంది విమర్శకులు అభిప్రాయపడ్డారు.

సమకాలీన కవిత్వ ధోరణులపైన సమకాలీన చర్చలకు ఈ దశాబ్దంలో దినపత్రికల్లో అవకాశం లభించింది. కవిత్వ నిర్మాణంలో పత్రికల వాడకం పెరిగిపోవడాన్ని విమర్శిస్తూ అనేక మంది విమర్శకులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేశారు. 'కవిత్వమంటే సింబాలిజాల సాలెగూడు కాదు' అని అలిశెట్టి ప్రభాకర్ ఆంధ్రప్రభ దినపత్రికలో 1982లో ఇలా అన్నారు. ''నల్లమేఘం రవికె వెనుక రవిస్తనం చూడు', గాయాల్ని నాలుకతో నాక్కుంటూ కూచుంటా!!! ఇలాంటి పిచ్చి పిచ్చి పదప్రయోగాలే, వాక్య నిర్మాణాలే చాలు.. వీళ్లు (శివారెడ్డి, సిధారెడ్డి) కవిత్వాన్ని రుజువు చెయ్యటానికి. ఒకవేళ మీకు నచ్చినవాళ్లే కవులనుకుంటే వాళ్లని కాపాడుకోవడానికి వాళ్లకోసం సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తామన్న అభ్యంతరం లేదు.'' [9]

కవిత్వంలో ప్రతీకవాదంతోపాటు వివిధ ఆధునిక నిర్మాణ పద్ధతులు విశేషంగా ప్రాధాన్యం సంతరించుకోవడంతో అస్పష్టత పెరిగిపోయింది. ఈ విషయంపైననే ఆంధ్రప్రభలో వెలుగు వివేకానంద ''కళలు, సాహిత్యం ఎవరి కోసమో కొత్తగా చెప్పాలా!

కేవలం వస్తువు ప్రజలదైతే కవిత్వం ప్రజా కవిత్వమవుతుందా? ప్రజలకు వెలుగుదారుల్ని చూపించాల్సిందిపోయి మీరే అస్పష్టతా దారుల్లో కొట్టుకుపోతే పోనీలే అని వూరుకోవాలా?' అని అంటారు. [10]

వర్తమాన కవిత కొత్తతరంలో కొత్త లక్షణాలను పుణికి పుచ్చుకుంటుందన్న అభిప్రాయాలను ఈ చర్చలో భాగంగానే డాక్టర్ సుమనశ్రీ వ్యక్తం చేశారు. వచన కవిత్వానికి అదనంగా చేరిన సమకాలీన కవితాలక్షణాల గురించి చెబుతూ ''వచన కవిత యువకవుల్లో కొత్త ఊపిరి పోసుకుంటోంది. కొత్త పోకడలు పోతోంది. బలమైన ప్రజా ఉద్యమాల్ని నిర్వహిస్తూ విప్లవ కవులు కవిత్వాన్ని పదునైన ఆయుధంగా ఉపయోగించుకొంటున్నారు. నిస్పృహ బురదలో కూరుకుపోతున్న సుబ్బారావుగారిని లేవదీయటం కష్టమేకానీ విలక్షణంగా వెల్లివిరుస్తున్న వచన కవితపై ఆశల్ని కలిగించటం కష్టమైన పని ఏ మాత్రం కాదు.'' [11] వచన కవిత్వం కొత్తతరం భావోద్వేగాలకు ప్రధాన వాహికగా రూపుదిద్దుకుందన్న వాస్తవాన్ని అగ్రశ్రేణి విమర్శకులు కూడా అంగీకరించాల్సి వచ్చింది. మహీధర రామమోహనరావు ఆంధ్రభూమి దినపత్రికలో ఈ అంశంపై చర్చిస్తూ ఇలా అంటారు. ''తెలుగునాట వచన కవిత ఒక భౌతికావసరంగా ఉద్భవించింది. ఆ అవసరమే శ్రీశ్రీ, పఠాభి ప్రభృతులను ఆ కవితా రూపానికి ద్రష్టల్ని చేసింది. కుందుర్తిని సిద్ధాంత ప్రవక్తగా చేసింది. శిల్పాన్వేషణ చేయించింది. ఆధునిక కవిత్వానికి వచన కవితే వాహికంగా ముందుకు వచ్చింది. [12]

ఆధునిక కవిత్వంలో 80లకు అటు ఇటుగా మినీ కవితపైన విస్తృతమైన చర్చ జరిగింది. ఆ కాలంలో మినీ కవిత్వాన్ని గురించి దాదాపు ప్రతీ ఆధునిక విమర్శకుడు పట్టించుకోక తప్పలేదు. మినీ కవితకు అనుకూలంగాను, ప్రతికూలంగాను అనేక రకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మినీ కవిత్వం ఒక సాహిత్యరూపంగా అంగీకరించడానికి కూడా కొంత మంది విమర్శకులు ముందుకు రాలేదు. అయితే యువతరంలో ఆ రూపానికి ఎక్కువ ప్రాధాన్యం దక్కింది. ఈ విషయాన్ని చెబుతూ విశాలాంధ్ర దినపత్రికలో వచ్చిన ఒక వ్యాసంలో కొల్లూరి ఇలా అంటారు. ''నేడు సాహిత్య ప్రక్రియల్లో అన్నిటికన్నా ముఖ్యంగా ఈ మినీ కవిత మీద ఒక చర్చ (రభస) జరుగుతుంది. మినీ కవితమీదే ఈ రచనలు ఎందుకు? మినీ కవితలు స్లోగన్సు అని, మినీ కవిత సాధించేది, సాధించగలిగేది శూన్యం అని, మినీ కవితలు కవిత్వమే కాదని రకరకాల పుకార్లు లేవదీస్తున్నారు. సాహిత్యంలో మిగతా ప్రక్రియలన్నీ వేళ్ల నిలదొక్కుకున్నవే'' [13]

మొత్తంగా ఆధునిక వచన కవిత్వం సాధించిన పరిణతి గురించి విమర్శకులలో కొన్ని స్థిరమైన అభిప్రాయాలు ఏర్పడ్డాయి. కవిత్వంలో కేవలం ఆవేశం, ఆక్రోశం మాత్రమే కాకుండా ఆలోచన, దృక్పథబలం వచన కవిత్వాన్ని శాసించే లక్షణాల్లో ఒకటయ్యాయి. ఈ విషయాన్ని ఉదయం దినపత్రికలో రాసిన ఒక వ్యాసంలో కృష్ణుడు ఈ విధంగా వ్యాఖ్యానించారు. ''అసలు ఇవాళ కవులు ఆవేశంతో రాయడం మాని

స్థిర చిత్తంతో ఆలోచించి రాస్తున్నారు. కవిత్వంలో గాఢత పెరిగింది. చెప్పదలచుకున్నదాన్ని బలంగా చెపుతున్నారు. ప్రజల ప్రయోజనాలకు కవులు దగ్గరగా వచ్చి సిద్ధాంతాన్ని కూడా ఆకళింపు చేసుకున్నారనడానికి ఇది నిదర్శనం.'' [14]

ఒక దశలో కవిత్వాన్ని కవులైన వారు మాత్రమే సరిగ్గా విశ్లేషించగలరన్న వాదాన్ని కూడా కొందరు సాగించారు. కవి విమర్శకుల సంఖ్య కూడా ఈ దశాబ్దంలో పెరగడం గమనించవచ్చు. అయితే సాధారణ విమర్శకుల మాదిరిగానే కవి విమర్శకులలో కూడా. కొన్ని పరిమితులు తప్పనిసరిగా ఉంటాయన్న అభిప్రాయాన్ని విమర్శకులు వ్యక్తం చేశారు. ''కానీ కవే విమర్శకుడు, కవి కాని వాడు విమర్శకుడు కావడానికి వీలులేదని కానీ, మామూలు విమర్శకుల కన్నా కవి విమర్శకుడు ఎక్కువగా విమర్శాధికారి అనీ అనడం అసమంజసం.'' [15]

## ఇతర చర్చలు - వాదోపవాదాలు:

1980 తరువాత తెలుగు సాహిత్యంలో పద్యాన్ని పునరుద్ధరించడానికి విశేషమైన కృషి ప్రారంభమైంది. ఆధునిక భావాల వ్యక్తీకరణకు పద్యం కూడా తగిన సాధనమేనని నిరూపించడానికి అనేక మంది పద్యకవులు కొత్త వస్తువుతో పద్య కవిత్వం రాయడం ప్రారంభించారు. దీనికి సంబంధించిన చర్చలు కూడా వివిధ దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో కనిపిస్తాయి. ఒక చర్చ సందర్భంగా ఆంధ్రభూమి సాహిత్య వేదికలో 1987 ఆగస్టు 8న ప్రచురితమైన ఈ లేఖ దీనికి ఉదాహరణ''. [16]

ఈ దశాబ్దంలో మరింత చర్చనీయాంశంగా మారిన ప్రక్రియ నవల. వారపత్రికల్లో మాత్రమే కాకుండా దినపత్రికల్లో కూడా నవలా సాహిత్యం విస్తృతంగా వెలువడటంతో సీరియస్ నవల, పాపులర్ నవల రెండూ విడిపోయాయి. వ్యాపార సాహిత్యాన్ని నిరసిస్తూ ప్రసిద్ధ రచయితలు ,విమర్శకులు అనేక వ్యాసాలు రాశారు. ప్రసిద్ధ కథారచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో నవలా వ్యాపారంపై జరిగిన చర్చలో ఇలా అంటారు. '' నేటి నవలా రచన ప్రచురణ ఫక్తు ''వ్యాపారం''గా పరిణమించింది. కాని వ్యాపారమనే పదానికొక అర్థం వుంది. ఏ వ్యాపారానికైనా కొన్ని ప్రిన్సిపుల్స్. కొన్ని పరిమితులు కొంత జ్ఞానం, నీతి నిజాయితీలు కావాలి. ఏ వ్యాపారంలోనైనా కల్తీనిగాని, మోసాన్ని కాని కనుక్కోవచ్చు .పాలలో నీళ్ళు విపరీతంగా కలిసి అమ్మడాన్ని కనుక్కోవచ్చు. కాని సాహిత్య వ్యాపారంలో కల్తీ అలాటిదీ ఇలాటిదీ కాదు. అది కానరాదు. కానవీలులేదు. కొలిచేందుకు ఏ పరికరాలు లేవు. ఏ చట్టాలు న్యాయస్థానాలు ఉపకరించవు .సాయం చెయ్యవు.'' [17] అదే చర్చలో పాల్గొంటూ యువతరంపై వ్యాపార నవల కలిగిస్తున్న దుష్ప్రభావాలను పులికంటి కృష్ణారెడ్డి వివరిస్తూ, ''యువతను చెడగొట్టకుండా కాపాడడం నేటి రచయితల కనీస కర్తవ్యం. కాని, నేటి రచయితలు కొందరు యువతను ఉద్యానవనాల చుట్టూ రమ్యహర్మ్యాల చుట్టూ నాలుగుబార్ల పొడవు కార్లలో కూర్చోబెట్టి తిప్పేస్తుంటే మరికొంత మంది దెయ్యాల

భూతాల కథలతో హడలగొడుతున్నారు. ఇది నిజంగా సాహితీ వ్యాపారమే''.[18] అని అంటారు. నవలా వ్యాపారం అభివృద్ధి చెందుతున్న క్రమాన్ని వివరించే వ్యాసాలు కూడా ఈ దశలో వెలువడ్డాయి. ప్రసిద్ధ పాత్రికేయుడు కాసుల ప్రతాపరెడ్డి ఉదయం దినపత్రికలో రాసిన వ్యాసం ఈ సందర్భంగా పేర్కొనదగింది. ''నవలా వ్యాపారం వివిధ స్థాయిల్లో జరుగుతున్నది. పత్రికాధిపతులు లాభాలను గడించడానికి తమకు అనుగుణంగా రచయితలచేత రచనలు చేయిస్తున్నారు. అవే నవలలు ప్రచురణ సంస్థలు పుస్తకాలుగా ప్రచురిస్తున్నాయి. వాటినే నిర్మాతలు కొనుగోలు చేసి కొన్ని మార్పులతో చలన చిత్రాలుగా రూపొందిస్తున్నారు. ఈ విధంగా నాలుగు స్థాయిల్లో నవలా వ్యాపారం లాభసాటిగా సాగుతున్నది.''[19]

1980-90ల మధ్య దినపత్రికల సాహిత్య అనుబంధాల్లో చెలరేగిన చర్చలూ - వాదోపవాదాలు ఆధునిక సాహిత్య చరిత్రలో అత్యంత కీలకమైనవి. దాదాపు అన్ని సాహిత్య ప్రక్రియల గురించి దినపత్రికలు విస్తృతమైన చర్చకు అవకాశం కల్పించాయి. పాఠకులలో సాహిత్య అభిరుచి పెంపొందించడానికి ఈ చర్చలు - వాదోపవాదాలు విశేషంగా ఉపయోగపడ్డాయి.

పాదసూచికలు :

1. చందు సుబ్బారావు, 'వయసు మళ్లిపోతున్న వచన కవిత', ఆంధ్రప్రభ దినపత్రిక, ఆదివారం అనుబంధం, ఆగస్టు 8, 1982.

2. 'అలిశెట్టి ప్రభాకర్, 'అస్పష్టతలో కొట్టుకుపోతున్న వచన కవులు, ఆంధ్రప్రభ దినపత్రిక, ఆగస్టు 29, 1982.

3. టి. యల్.కాంతారావు, 'ఏది ప్రజా కవిత?', సాహిత్యలోకం శీర్షిక, విశాలాంధ్ర ఆదివారం దినపత్రిక, ఫిబ్రవరి 22, 1981.

4. మైత్రి, 'సాహిత్యం ఆయుధమే', ఆంధ్రప్రభ ఆదివారం దినపత్రిక, మే 3, 1987.

5. వీరపల్లె వీణావాణి, 'భావకవుల కోవలోనే తిలక్', ఆంధ్రజ్యోతి దినపత్రిక, జనవరి 12, 1986.

6. కంటాబత్తిన శ్రీనివాసులరెడ్డి, 'తిలక్ మౌలికంగా భావకవే!' ఆంధ్రజ్యోతి దినపత్రిక, మార్చి 2, 1986.

7. ద్వానాశాస్త్రి, 'తిలక్ గురించి...', వివాదవేదిక శీర్షిక, ఆంధ్రజ్యోతి సాహిత్య వేదిక, మార్చి 2, 1986

8. నగ్నముని, నిఖిలేశ్వర్, జ్వాలాముఖి: 'దిగంబర కవితోద్యమంపై రాళ్లు

వేయవద్దు ప్లీజ్'!, ఆంధ్రజ్యోతి సాహిత్య వేదిక, మే 7, 1990.

9. అలిశెట్టి ప్రభాకర్, 'కవిత్వమంటే సింబాలిజాల సాలెగూడు కాదు' ఆంధ్రప్రభ దినపత్రిక, సెప్టెంబర్ 26, 1982.

10. వెలుగు వివేకానంద, 'అస్పష్టత పల్లకీకి అయోమయ బోయీలు?', ఆంధ్రప్రభ దినపత్రిక, సెప్టెంబర్ 26, 1982.

11. డా॥ సుమనశ్రీ, 'వచన కవిత నిత్య యవ్వని', ఆంధ్రప్రభ దినపత్రిక, సెప్టెంబర్ 26, 1982.

12. మహీధర రామమోహనరావు, 'యువకుల భావోద్వేగానికి వచన కవితే వాహిక', ఆంధ్రభూమి దినపత్రిక, శనివారం జులై 25, 1987.

13. కొల్లూరి, 'మినీ కవితకు మరణం లేదు', విశాలాంధ్ర దినపత్రిక, ఆదివారం అనుబంధం, ఏప్రిల్ 17, 1983.

14. కృష్ణుడు, 'సాహిత్యానికి పట్టిన చీడపురుగులు', ఉదయం దినపత్రిక, ఏప్రిల్ 14, 1988.

15. ముదిగొండ వీరభద్రయ్య, 'కవి మాత్రమే విమర్శకుడు కావాలా?', ఉదయం దినపత్రిక, సోమవారం, సెప్టెంబర్ 4, 1989.

16. ఛందస్సు ప్రగతి శీలక భావాలకి చుక్కెదురుకాదని కూడా తెలుస్తోంది. అందువల్ల 'నేటి సంక్లిష్ట జీవనతత్వాన్ని ప్రతిబింబించటానికి ఒక్క వచన కవితే వాహిక' అని కుదించుకుపోనక్కర్లేదు. సామాజిక అభ్యున్నతిని కాంక్షించే సమకాలీన కవులు ఒక్క వచన కవితను మాత్రమే ఆశ్రయించి ఇబ్బంది పడక్కర్లేదు. పద్యాన్ని కాని, గేయాన్నికాని, వచన కవితని కాని దేన్నయినా తమ సాధనంగా వాడుకోవచ్చు. ఛందస్సుకు భావాలతో పేచీలేదు - ఎస్. ఎం. వి. ఆర్. కృష్ణస్వామి, ఆంధ్రభూమి ప్రతిధ్వని శీర్షిక, 1987, ఆగస్టు 8.

17. 'సాహిత్యరంగంలో కొత్తరకం వ్యాపారం' - పెద్దిభొట్ల సుబ్బరామయ్య, ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం సాహిత్యవేదిక ఫిబ్రవరి 5, 1984.

18. పులికంటి కృష్ణారెడ్డి, 'వ్యాపారంగా మారిన నవలా రచన' ఆదివారం అనుబంధం, సాహిత్యవేదిక జనవరి 29, 1984.

19. కాసుల ప్రతాపరెడ్డి, 'నవల వ్యాపారం ఎలా అయింది', ఉదయం, ఆదివారం, జూన్ 22, 1988.

★★★

# నాలుగవ అధ్యాయం

## సాహిత్య సంపాదకీయాలు

# i. సాహిత్య సంపాదకీయం

దినపత్రికల్లో సంపాదకీయాలు ఒక కీలకమైన శీర్షిక. పత్రికకు, సంపాదకుడికీ సంబంధించిన దృక్పథానికి దర్పణం పట్టేది సంపాదకీయమే. ''నేడు తెలుగు పత్రికల్లో సంపాదకీయం తప్పనిసరి అంశంగా వుంది. ఇది దేశంలోని ఏ సమస్య మీదైనా వుంటుంది. రాజకీయ, ఆర్థిక, సాంఘిక విషయాలేకాక లలితకళల్లాంటి అంశాలు కూడా ప్రధానంగా గ్రహించి సంపాదకీయాలు భాసిస్తాయి. అవి రాజకీయ సాంఘికాది సమస్యలకు పరిష్కార మార్గం చూపుతాయి. సంపాదకీయం పత్రికా సౌందర్యానికి నుదుటి తిలకంగా భావిస్తారు. స్థూలంగా సంపాదకీయం పత్రికాత్మ. సంపాదకీయం పత్రికా లక్ష్యం.[1] సాధారణంగా సమకాలీన సమస్యలు రాజకీయ సామాజిక అంశాలు సంపాదకీయ ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటాయి. వివిధ సందర్భాల్లో రాజకీయేతర అంశాలు కూడా సంపాదకీయానికి వస్తువులు కావచ్చు. ముఖ్యంగా తెలుగు పత్రికలకు తొలినాటి నుంచీ సాహిత్యంతో అతి సన్నిహితమైన సంబంధం వున్నందున అనేక సందర్భాల్లో సాహిత్య అంశాలు సంపాదకీయాల్లో చోటు చేసుకున్నాయి.

తెలుగు దినపత్రికల్లో సాహిత్య సంపాదకీయాలకు ఒక నిర్దిష్టమైన స్వభావమంటూ ఏమీలేదు. సంపాదకుడు తన అభిరుచి మేరకు సాహిత్య సంపాదకీయం రాయవచ్చు. అలాగే సాహిత్య సంపాదకీయానికి నిర్దిష్టమైన కాలనియతి కూడా లేదు. సందర్భం వున్నా లేకపోయినా సాహిత్యానికి సంబంధించిన వివిధ అంశాలను సంపాదకీయానికి స్వీకరించవచ్చు. తొలినాళ్లలో సంపాదకీయాల్లో సాహిత్య సందేశాలను అందించిన ముట్నూరి కృష్ణారావులాంటి సంపాదకులున్నారు. సంపాదకీయ రచనల సాహిత్య బలాన్ని గ్రహించిన పత్రికా రచయిత శ్రీ కృష్ణారావు, సంపాదకీయ రచనల్లోనే కాకుండా తాను రాసిన వివిధ శీర్షికల్లో కూడా సాహిత్య మూలాల్లోకి వెళ్లి పత్రికా రచనకు మెరుగులు దిద్దారు ముట్నూరు కృష్ణారావు. ఉదాహరణకు ''నీలో దాగియున్న రసాన్నే కళలు ఉత్తేజనం చేస్తాయి. నీ నాలుకకు రుచి అనేది లేకపోతే ఎన్ని మధుర పదార్థాలను నీ ముందు పెట్టినా ఏమి ప్రయోజనం? వానిని చెత్తగా త్రోసివేస్తావు. సంగీతం శ్రావ్యంగా ఉన్నదంటే ఆ శ్రావ్యత నీదికానీ, సంగీతానిది కాదు. చిత్తరువు సుందరంగా ఉన్నదంటే ఆ సౌందర్యం నీదికానీ, చిత్తరువుది కాదు. కావ్యం శృంగారంగా ఉన్నదంటే ఆ శృంగారం

నీదికానీ, కావ్యానిది కాదు. నీలో ఏ శ్రావ్యత, ఏ సౌందర్యం, ఏ శృంగారం ఉన్నదో దానిని కళలు ఉద్దీపన చేయడానికి సమర్థములగుతున్నాయన్నమాట.'' [2]

సంపాదకీయాలలో సాహిత్య సంబంధం రెండు రకాలుగా వుంటుంది. ఒకటి ప్రత్యక్షమైనది. రెండు పరోక్షమైనది. ప్రత్యక్షంగా ఒక ముఖ్యమైన సాహిత్య ఉద్యమ సందర్భంలో కానీ, ఒక విశిష్టమైన రచయితకు ప్రసిద్ధ పురస్కారం లభించినపుడు కానీ, ప్రముఖ రచయిత కన్నుమూసినపుడు కానీ సంపాదకీయం రాసే పద్ధతి తెలుగు దినపత్రికల్లో సాంప్రదాయకంగా వుంది. అలాకాకుండా సంపాదకీయాలను విభిన్న శైలిలో రాయడానికి సాహిత్య సంబంధమైన అంశాలను జోడించే పరోక్ష పద్ధతి కూడా తెలుగు దినపత్రికల్లో ఉంది. (దీనికి ఉదాహరణ 'ఈనాడు' దినపత్రికలో ప్రతీ ఆదివారం వెలువడే వ్యంగ్య శైలితో కూడుకున్న సంపాదకీయాల్లో సాహిత్య గతమైన అంశాల ప్రస్తావన తప్పనిసరిగా వుంటుంది. సాంప్రదాయకంగా వస్తున్న ఈ పద్ధతులకు భిన్నంగా రెండు దశాబ్దాలుగా తెలుగు దినపత్రికల్లో సాహిత్య సంపాదకీయ రచన మరింత ప్రయోగాత్మకంగా రూపుదిద్దుకుంది. ఏదో ఒక సందర్భాన్నిబట్టి సాహిత్య సంపాదకీయం రాసే ధోరణి పోయింది. సాహిత్య సామాజిక రంగాలలో వేగవంతమైన మార్పుల పర్యవసానంగాను, అలాగే సాహిత్య ఉద్యమాలు బలపడుతున్న దశలోను పత్రికలకు, సాహిత్యానికి మధ్య సంబంధం కూడా బలపడింది. ఈ కారణంగా గతంలో ఎప్పుడో అరుదుగా తప్ప కనిపించని సాహిత్య సంపాదకీయం ఇప్పుడు తరచుగా కనిపిస్తోంది. ఈ పరిణామాన్ని దృష్టిలో వుంచుకుని 1980 నుంచి ఇప్పటివరకు సాహిత్య సంపాదకీయ రచనలో ఒక ముఖ్యమైన దశగా భావించవచ్చు. 1970-80 వరకు ఉన్న కాలాన్ని ఈ దశకు పూర్వరంగాన్ని సిద్ధం చేసిన దశాబ్దంగా భావించవచ్చు. ఈ మూడు దశాబ్దాల్లో వచ్చిన పరిణామాలను విశ్లేషించడానికి ముందు, 1970లకి ముందు సాహిత్య సంపాదకీయాల స్వరూప స్వభావాలను సింహావలోకనం చేయాల్సిన అవసరం వుంది.

గోలకొండ పత్రికలో సురవరం ప్రతాపరెడ్డి సంపాదకీయాల్లో కూడా సాహిత్య, సాంస్కృతిక అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. గోలకొండ కవుల సంచిక గురించి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న దశలో సురవరం ప్రతాపరెడ్డి రాసిన సంపాదకీయం పేర్కొనదగినది. నిజాం రాష్ట్ర కవులకు మాత్రమే ప్రత్యేక సంచిక ప్రకటించాల్సిన అవసరం ఎందుకో వివరిస్తూ సురవరం ఇలా అంటారు. ''నేను వృద్ధియైన నా ప్రక్క ఇంటివానికి నష్టమని తలపుకూడదు. మా రాష్ట్రముపై మాకభిమానముండిన మాకితరులపై ద్వేషమున్నదని వాదింపగూడదు. మా తల్లిని మేము ప్రేమించిన నితరుల తల్లులను నసహ్యముతో జూచితిమని తగవుపడకూడదు. ప్రతి దేశమునకు, తుదకు ప్రతి గ్రామముననను స్థానికాభిమానం మొదలు, తర్వాత ఇది వైశాల్యమందు హెచ్చుచుపోవును.'' [3] అదే కాలంలో భావికవిత్వంపైన ఆయన తన అభ్యంతరాలను స్పష్టంగా వ్యక్తం చేశారు. రాయప్రోలు సుబ్బారావు అభిప్రాయాలపై వ్యాఖ్యానిస్తూ

సురవరం 'నేటి కవిత్వ రచనలో అనేకములు రసగ్రహణ తత్పరులకు రసమునిచ్చుట లేదు. ఎక్కువగా అట్టి కవిత్వ రచనలను చూచినవారికి ఇదే భావకవిత్వమైనచో ఇదే ప్రాచీనమైనదానికి ప్రతికూలముగా పుట్టినదైనచో - ఇది నిరసింపదగినదే యను భావము కలుగకుండునా? కావున కొంతవరకు రసహీనవములైన కొన్ని కవిత్వ రచనలు భావకవిత్వమునకు ఉదాహరణముగా పేర్కొనబడుటయు భావకవిత్వమును నూతన మార్గముయొక్క ముఖ్య లక్షణము సుస్పష్టంగా తెల్పబడకుండుటయు జతయగుటయే చాలా వరకు కవిత్వ విషయమున ప్రాచీనాధునిక తీవ్రవైరమునకు ముఖ్య కారణము.'' [4]

సురవరం ప్రతాపరెడ్డి భాష, సాంస్కృతిక అంశాలపై రాసిన సంపాదకీయాలలో కూడా సాహిత్య, సంబంధ లక్షణాలు కనిపిస్తాయి. తెలుగు పత్రికల్లో సాహిత్య సంపాదకీయాల ద్వారా తొలినాళ్లలో జరిగిన చర్చలు, వాదవివాదాలు తెలుసుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి.

1944 మే 27న నార్ల వెంకటేశ్వరరావు, వీరేశలింగం పంతులు గురించి ఒక సంపాదకీయం రాశారు. ఈ సంపాదకీయంలో వీరేశలింగం పంతుల్ని రచయితగా మాత్రమే కాకుండా ఆయన బహుముఖ సేవల్ని కూడా నార్ల ప్రస్తావించారు. ''ఆంధ్రజాతికి ఆయన సర్వతోముఖమైన సేవ చేశాడు. అయినా ఆయన సేవ సారస్వత, సాంఘిక రంగాలను మించిపోలేదని ఒక దురభిప్రాయం పెక్కుమందిలో వున్నది. ఆయన జీవితచరిత్ర సమగ్రంగా తెలియకపోవడమే ఇందుకు కారణం. పారిశ్రామికాభివృద్ధి లేనిదే మన దేశానికి ఆర్థికంగా అభ్యున్నతి లేదని 1880 లోనే ఉద్బోధించారు. మన దేశానికి ఆహార పదార్థాలు, సమృద్ధిగా లేవనీ, విద్యాధికులైనవారు వ్యవసాయంలో శ్రద్ధ వహించి కొత్త పద్ధతులపై సేద్యం చెయ్యాలనీ ఆయన అప్పుడే హెచ్చరించారు కూడా. [5]

అయితే తెలుగు పత్రికల్లో తొలి దశలో వచ్చిన సాహిత్య సంపాదకీయాలకు ఆ తరువాత పత్రికా రంగం విస్తరిస్తున్నకొద్దీ వివిధ రూపాలలో మార్పులకు లోనైన సాహిత్య సంపాదకీయాలకు చాలా అంతరం కనిపిస్తుంది. సంపాదకీయ శైలి మొదలుకుని భావ ప్రకటన ద్వారా అనేక దశలో కనిపిస్తాయి. తొలినాటి సాహిత్య సంపాదకీయాలకు ఇప్పటి సాహిత్య సంపాదకీయాలకు దృక్పథం స్థాయిలో కూడా తేడాలు కనిపిస్తాయి. ఆ క్రమ పరిణామాన్ని సాహిత్య సంపాదకీయాలలో వివిధ రకాలుగా వర్గీకరించడం ద్వారా వివరించవచ్చు.

## ఎ. సాహిత్య సంపాదకీయాలు - వివిధ రకాలు:

స్వభావాన్నిబట్టి సాహిత్య సంపాదకీయాలను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. (1) వ్యక్తి ప్రధానంగా రాసిన సంపాదకీయాలు (2) సందర్భాన్నిబట్టి రాసినవి 3) దృక్పథం ప్రధానంగా రాసిన సంపాదకీయాలు.

1) వ్యక్తి ప్రధానంగా రాసిన సంపాదకీయాలు: ప్రసిద్ధ రచయితలకు విశిష్ట పురస్కారాలు లభించిన సందర్భాల్లోనూ లేదా ఆయా రచయితల జీవితంలోని ప్రధాన ఘట్టాలు (శతజయంతులు, వర్ధంతులు) సందర్భంలోనూ రాసిన సంపాదకీయాలు. ఇవి ఆయా రచయితల వ్యక్తిగత సాహిత్య కృషిని విశ్లేషిస్తూ సాహిత్య చరిత్రలో వారి స్థానాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడతాయి.

2) సందర్భాన్నిబట్టి రాసినవి: చారిత్రక పరిణామ క్రమంలో లేదా సామాజిక వికాస క్రమంలో అనేక ముఖ్య సందర్భాలు ఏర్పడుతూ వుంటాయి. ఒక ప్రధాన సాహిత్య సంస్థ చరిత్రలో కీలకమైన ఘట్టాల గురించి సాహిత్య చరిత్రలో ప్రధానమైన మలుపుల గురించి రాసిన సంపాదకీయాలను ఈ వర్గీకరణ క్రిందికి వస్తాయి.

3) దృక్పథం ప్రధానంగా రాసిన సంపాదకీయాలు:

సాహిత్య ప్రపంచంలో వివిధ దృక్పథాలుంటాయి. ప్రతీ రచయిత ఒక దృక్పథాన్ని కలిగివున్నట్లే. ప్రతీ సంపాదకుడికి ఒక దృక్పథం తప్పనిసరిగా వుంటుంది. సాధారణంగా ప్రతీ సంపాదకుడు సంపాదకీయాన్ని తన దృక్పథం నుంచే రాస్తాడు. సాహిత్యానికి వచ్చేసరికి దృక్పథ బలంతో రాసిన సంపాదకీయాలకు విశేష ప్రాధాన్యముంటుంది. అలాంటి సంపాదకీయాలు ఒక్కో సందర్భంలో సాహిత్య గతిని నిర్దేశించవచ్చుకూడా.

పాదసూచికలు :

1. డ్యాక్టర్ వి. లక్ష్మణరెడ్డి, 'తెలుగు జర్నలిజం - అవతరణ వికాసం.

2. ముట్నూరి కృష్ణారావు, ''లో వెలుగులు', కృష్ణాపత్రిక నుంచి పునర్ముద్రితం, పేజి 301, రసోదయం శీర్షిక.

3. సురవరం ప్రతాపరెడ్డి, 'గోలకొండ పత్రికా సంపాదకీయాలు', మొదటి సంపుటం, 1926-36, పేజీ 178.

4. సురవరం ప్రతాపరెడ్డి, 'గోలకొండ పత్రిక సంపాదకీయాలు', 'భావకవిత్వము', జులై 25, 1935.

5. నార్ల వెంకటేశ్వరరావు, 'మూడు దశాబ్దాలు', 1944-74 (ఎన్నిక చేసిన సంపాదకీయాల సంకలనం), నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, 'వీరేశలింగం' - 17వ పేజీ.

★★★

## ii. 1970-80ల మధ్య సాహిత్య సంపాదకీయాలు

తెలుగు సాహిత్య సామాజిక చరిత్రలోనూ, పత్రికారంగంలోనూ 1970 నుంచి 80 వరకు వున్న కాలం ప్రధానమైనది. ఈ దశాబ్దంలో ఈ మూడు రంగాల్లోనూ విశేషమైన పరిణామాలు జరిగాయి. సామాజిక రంగంలో వచ్చిన మార్పులు సాహిత్యంలో ప్రతిఫలించినట్టే పత్రికా రంగాన్ని కూడా ప్రభావితం చేశాయి. పాఠకుల సంఖ్య పెరగడం వల్ల పత్రికల్లో అదనంగా వివిధ శీర్షికలు కూడా పెరిగాయి. సాహిత్య సంపాదకీయాలకు సంబంధించినంతవరకు గతంలోకంటే ఈ దశాబ్దంలో మరిన్ని అంశాలపైన చర్చకు వీలు కలిగింది.

1970-80ల మధ్య వచ్చిన సాహిత్య సంపాదకీయాల్లో తెలుగు సాహిత్య సమకాలీన అంశాలు, వ్యక్తులు, ఉద్యమ సంబంధ అంశాలు, ఇతర భాషా సాహిత్యం గురించి వచ్చిన సంపాదకీయాలు కనిపిస్తాయి. అయితే వాదవివాదాలకు దారితీసిన సంపాదకీయాలు ఈ దశాబ్దంలో పెద్దగా లేవని చెప్పుకోవచ్చు.

### ఎ. తెలుగు సాహిత్యం - భాష :

తెలుగు సాహిత్యంలోని సమకాలీన అంశాలపై ఈ దశాబ్దంలో అనేక సంపాదకీయాలు వెలువడ్డాయి. సాహిత్య పరిణామాలకు సంబంధించి వివిధ దశలను, అంతర్దశలను విశ్లేషించే సంపాదకీయాలు అనేకం కనిపిస్తాయి. 1970లో ఆంధ్రజ్యోతి దినపత్రికలో నండూరి రామమోహనరావు 'సాహిత్యంలో అశ్లీలం' అనే శీర్షికన సంపాదకీయం రాశారు. ఒక బెంగాలీ కవి రచించిన నవలను అక్కడి ప్రభుత్వం నిషేధించినపుడు ఈ సంపాదకీయం వెలువడింది. ఈ నిషేధాన్ని ఖండిస్తూ సంపాదకీయం ఇలా పేర్కొంది. ''దురదృష్టవశాత్తు ఇండియాలో అశ్లీలంగా వున్నవనే పేరుతో కొన్ని నిజమైన సాహిత్యపు విలువలు కలిగిన గ్రంథాలపై నిషేధం కొనసాగుతున్నది. బుద్ధ దేవబసు రచనపై నిషేధం కూడా ఈ కోవకు చెందినదేనని పలువురు ప్రఖ్యాత బెంగాలీ రచయితలు అభిప్రాయపడుతున్నారు.

''అశ్లీలం పేరుతో నిషేధించవలసి వస్తే కోణార్క్ దేవాలయాన్ని పడగొట్టి బంగాళాఖాతంలోనికి త్రోసివేయాలి. ఖజరహో శిల్పాలను ధ్వంసం చేయాలి.

దక్షిణాదినగల పెక్కు దేవాలయాలను నేలమట్టం చేయాలి. మనకు వారసత్వంగా వచ్చిన ప్రాచీన కళాఖండాలలో పెక్కింటిని భూగర్భంలో పాతిపెట్టాలి.''[1]

సాధారణ వార్తల్లోంచి సాహిత్య సంబంధమైన విషయాలను గ్రహించి వాటికి సంపాదకీయ ప్రాముఖ్యాన్ని సంతరించడం కూడా ఈ దశాబ్దంలో కనిపిస్తుంది. 1976లో మద్రాస్‌లో ఒక సభలో అప్పటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ చెప్పిన ఒక విషయాన్ని సంపాదకీయాంశంగా గ్రహిస్తూ ఆంధ్రజ్యోతి దినపత్రిక బాలలసాహిత్యంపైన ఎడిటోరియల్ నిర్వహించింది. సమకాలీన బాలసాహిత్యంలో కేవలం ఉబుసుపోకకు తప్ప మరే ప్రయోజనం లేని సాహిత్యం మాత్రమే వెలువడుతోందంటూ, బాలసాహిత్యంలో రావాల్సిన మార్పును మరో సంపాదకీయంలో ఈ విధంగా సూచించారు. ''ఏమిటి, ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎందుకు... వీటిని ప్రశ్నాపంచకంగా పేర్కొంటారు. తమ చుట్టూ వున్న ప్రపంచాన్ని చూస్తున్నపుడు ప్రతి బాలునిలో, బాలికలో సహజంగా ఉదయించే ప్రశ్నలివి. వీటికి సమాధానాలు చెప్పి బాలబాలికల కుతూహలాన్ని తీర్చగల సాహిత్యం మనకు సమృద్ధంగా రావాలి. కుతూహలాన్ని సకాలంలో సక్రమంగా తీర్చకపోతే అది అసలే అణగారిపోతుంది. ఇట్టి కుతూహలం లేని బాలబాలికలు బాధ్యతాయుతులైన పౌరులుగా వికసించలేరు.''[2]

భాషా సంబంధమైన విషయాలపైన వెలువడిన సంపాదకీయాలు కూడా ఈ వర్గీకరణ క్రింద పేర్కొనదగినవి. తెలుగు అకాడమీ తెలుగు నిఘంటువును రూపొందించే బాధ్యతను స్వీకరించినపుడు వెలువడిన సంపాదకీయంలో భాషకు సంబంధించిన అంశాలను పేర్కొన్నారు. తెలుగులో రిఫరెన్స్ పుస్తకాలు చాలా తక్కువ అనే ఆవేదన వ్యక్తం చేస్తూ సాహిత్యం, రాజకీయశాస్త్రం, అర్థశాస్త్రం, భౌతిక రసాయన శాస్త్రాలు, వైద్యం ఇత్యాది విషయాల్లో వివిధ రిఫరెన్స్ పుస్తకాలు తెలుగులో రావలసిన అవసరాన్ని ఈ సంపాదకీయం పేర్కొంది.[3]

ప్రాంతీయ భాషలు అభివృద్ధి చెందాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ 1976 మే 18 విశాలాంధ్ర దినపత్రికలో ప్రాంతీయ భాషలు అనే శీర్షికన ఒక సంపాదకీయం వెలువడింది. హిందీని బలవంతంగా రుద్దే ధోరణిని విమర్శిస్తూ ప్రాంతీయ భాషల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలను ఈ సంపాదకీయం వివరించింది. ''ప్రాంతీయ భాషల అభివృద్ధికి రాష్ట్రాలతోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా సక్రమమైన చర్యలు తీసుకోవలసి వుంది. ఆర్థిక సాయంతోపాటు శిక్షణ పొందిన భాషా శాస్త్రవేత్తలను, నిపుణులను సమకూర్చుకునే క్రమంలో కేంద్రం తగు విధంగా సహాయం చెయ్యవలసిన అవసరం వున్నది. కేంద్రంలో అధికార భాషను మెరుగుపరచడానికి వీలుగా ఒక శాఖను ఏర్పాటు చేయడంలాంటి చర్యలను ప్రభుత్వం ఇప్పటికి తీసుకొన్నది. హిందీ భాషా ఉపయోగ అవసరాన్ని దృష్టిలో పెట్టుకొని దానిని మెరుగుపరుస్తున్నది.''[4]

అలాగే అధికార భాషగా తెలుగు అమలు జరుగుతున్న తీరును వివరించే సంపాదకీయాలు కూడా వెలువడ్డాయి. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలుగును అధికార భాషగా అమలు చేయాలన్న నిర్ణయాన్ని పేర్కొంటూ ''జిల్లా స్థాయిలో పరిపాలనా భాషగానూ, డిగ్రీ స్థాయిలో బోధనా భాషగానూ తెలుగును ప్రవేశపెట్టడం జరిగిన తరువాత అధికార భాషా చట్టం మేరకు దానిని రాష్ట్ర స్థాయి ప్రభుత్వ వ్యవహారాలకు పూర్తిగా అమల్లోకి తీసుకొని రావడానికి నిర్దిష్టంగా ప్రయత్నాలు జరగాలి. ఏ భాష అయినా అభివృద్ధి స్థాయిని బట్టే వినియోగంలోకి తెచ్చే క్రమవేగం వుంటుందన్నది ఎంత నిజమో, వినియోగే భాష అభివృద్ధి క్రమం శీఘ్రతరమవుతుందన్నది కూడా అంతే నిజం. ప్రజలలోకి భాష పోయినకొద్దీ అవసరాలు పెరుగుతాయి. అవసరం పెరిగినకొద్దీ ఆ మేరకు సాధన సంపత్తి సమకూర్చుకునే ప్రయత్నం తీవ్రతరమవుతుంది. జీవద్భాషలన్నింటి వికాస క్రమ పరిణామ మూల సూత్రమిదే''. [5]

అదే సందర్భంగా తెలుగు లిపిలో, భాషలో రావలసిన వెసులుబాటు గురించి ఈనాడు సంపాదకీయం రాసింది. ''మనకు వున్న మరొక పెద్ద సమస్య - ముద్రణా యంత్రాల ప్రవేశంతో, పత్రికల వ్యాప్తివల్ల లిపిలో ఏర్పడింది. ఇందులో గణనీయమైన సంస్కరణ అవసరం. భాషావేత్తలు పరిశోధించి పొల్లులూ, వత్తుల సంఖ్యను తగ్గించగలిగితే కొన్ని కొండ గుర్తులు రూపొందించగలిగితే, ఇంగ్లీషులో మాదిరే, మన వర్ణమాలలో కూడా గొప్ప విప్లవం రావచ్చు. అది మరింత సువర్ణమాల కావచ్చు. రోమన్ లిపిని అనుసరించడం మంచిది అనేది ఇందువల్లనే అయివుంటుంది.'' [6]

## ౨౭. వ్యక్తులపై వచ్చిన సంపాదకీయాలు:

వివిధ సందర్భాల్లో వ్యక్తులు సాహిత్య సంపాదకీయాలకు కేంద్ర బిందువుగా కనిపిస్తారు. 1970-80ల మధ్యకాలంలో తెలుగు దినపత్రికల్లో తెలుగు సాహిత్యానికి సంబంధించిన వ్యక్తులు మాత్రమేకాక ఇతర భాషా సాహిత్యాలకు సంబంధించిన రచయితలు సాహిత్య జీవులు కూడా సంపాదకీయాల్లో స్థానం సంపాదించుకున్నారు. 1971 లో నోబెల్ బహుమతి శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఒక సంపాదకీయం వెలువడింది. తీవ్రవాద భావాలు కలిగిన ప్రసిద్ధ కవి 'పాబ్లోనెరూడా'కు నోబెల్ బహుమతి వచ్చిన సందర్భంగా ఈ సంపాదకీయం రాశారు. సాధారణంగా వివాదాస్పదమైన నోబెల్‌సాహిత్య బహుమతి ఆ ఏడాది ఒక కమ్యూనిస్టు కవికి లభించడం విశేషంగా భావిస్తూ ఈ సంపాదకీయం ఇలా పేర్కొంది. ''రాజకీయంగానేకాక కవితా విషయంలో కూడా నెరూడా వివాదాస్పదుడైన వ్యక్తి అని తెలిసికూడా 'భంగపడిన మానవౌన్నత్యం' పక్షాన నిలబడిన కవిగా ఆయనకు సాహిత్య బహుమతి ఇస్తున్నట్లు స్వీడిష్ అకాడమీ తన నిష్పాక్షిక దృక్పథాన్ని మరొకసారి రుజువు చేసుకున్నది.'' [7]

స్త్రీ జనోద్ధరణకు కలం పట్టిన మహారచయిత గుడిపాటి వెంకటాచలం (1979,

మే 5), మహాకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి (ఫిబ్రవరి 24, 1980) లో మరణించినప్పుడు తెలుగు దినపత్రికల్లో ఆర్ద్రతతో నిండిన సంపాదకీయాలు వెలువడ్డాయి. 'అసాధారణ రచయిత' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రిక మే 6వ తేదీన రాసిన సంపాదకీయం విశేషంగా పేర్కొనదగినది. ''చలంగారిని పోలిస్తే ఒక నిర్నిద్ర సముద్రంతో పోల్చాలి. ఒక మహా జలపాతంతో పోల్చాలి, ఒక ఝంఝూనిలంతో పోల్చాలి.

చలంగారి అస్తమయంతో ఒక సముద్రం స్తంభించినట్లు ఒక జలపాతం నిశ్చలమైపోయినట్టు, ఒక ఝంఝూనిలం శాంతించినట్టు.

అర్వై ఏళ్లనాడు గుడిపాటి వెంకటచలంగారు ఆంధ్ర సాహిత్యంలో ఒక సుడిగాలివలె, ఒక పెద్ద వరదవలె ప్రవేశించారు. సంఘంలో,సాహిత్యంలో ప్రజల ఆలోచనలలో తరతరాలుగా పేరుకుపోయిన కశ్మలాన్ని కడిగివేశారు. చెత్తాచెదారం, దుమ్మూ దూగర ఎగరగొట్టారు. కొత్తగాలికి తలుపులు తెరిచారు. కొత్త భావాలకు లాకులు ఎత్తివేశారు.''[8] అలాగే కృష్ణశాస్త్రిగారు మరణించినపుడు 'సాహితీ యుగకర్త అస్తమయం' అనే శీర్షికన వెలువడిన సుదీర్ఘ సంపాదకీయం కృష్ణశాస్త్రి కవిత్వపంక్తులను ఉదహరిస్తూ ఇలా సాగుతుంది'' ప్రవాస యాత్రారతి నిటులే నేను / కదలిపోవుడు నా శవకాశములను / ఒక్క నిట్టూర్పు వొలిక, ఒక్క మౌన/ బాష్పకణమటుల, ఒక గాఢవాంఛ పగిది'' కృష్ణశాస్త్రి'' - మొన్న నడిరేయి తుదిసారిగా కనుమూసిన కృష్ణశాస్త్రిని తలచుకుని తెలుగులోకం మౌనంగా ఒక్క బాష్పకణం విడుస్తుంది. ఆదివారం రాత్రి తొమ్మిదిన్నర గంటల వరకూ కవిత రాస్తూ కూర్చున్న కృష్ణశాస్త్రి ఒక గంట తరువాత ప్రశాంతంగా తనువు చాలించారంటే ఆయన నిజంగా ధన్యజీవి. ఆయన మనకి ఒక పలుకు, ఒక కీర్తన, అర్ధశతాబ్దంపాటు ఆంధ్రకవితా లోకంలో చందమామవలె చల్లగా ప్రకాశించిన దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి నిర్యాణంతో ఒక యుగం సమాప్తమైంది. ఆయన మిగిల్చిన లోటు గురించి చెప్పడానికి మాటలు దొరకవు. ఎలా చెప్పినా... ఉంటుంది. 82 సంవత్సరాల పండు వయస్సు వరకూ కవితా తపస్సు కొనసాగించిన మహాకవి కృష్ణశాస్త్రి, మహాకవి పదం ఆయనకెన్నడూ నచ్చలేదు''. [9]

ఆంధ్రజ్యోతి దినపత్రిక కూడా కృష్ణశాస్త్రిగారికి నివాళులర్పిస్తూ సంపాదకీయం రాసింది. ''తన తరం కవులలో పెక్కుమందివలె ఆయన 1920లలోనో, 1930లలోనో ఆగిపోలేదు. కాలం నిత్యపరిణామ, ప్రగతిశీలమైందని ఆయనకు తెలుసు. కనుకనే, ఆయన కాలంతోపాటు ముందుకు నడిచారు. కొత్తవెలుగులను, కొత్తగాలులను ఆయన నిండు గుండెతో ఆహ్వానించారు. అభ్యుదయ భావాలకు ఆయన ఎప్పటికప్పుడు స్వాగతం చెప్పారు. కనుకనే ఆయన రచనా వ్యాసంగం పోనుపోను నవనవోన్మేషంగా బహుముఖంగా వికసించింది. యువకులలో యువకుడిగా వారితో ఆయన చేతులు కలిపి ముందుకు సాగిపోయారు. వివిధ సాహిత్య వేదికలపై నుంచి గడచిన మూడు, నాలుగు దశాబ్దాలుగా ఆయన చేసిన ప్రసంగాలు, వాటిలో వ్యక్తమైన కవిత తత్త్వ వివేచన, హేతువాద పటిమ, అభ్యుదయ భావస్ఫూర్తి, నేటి యువతరం

ఆకళించుకోదగినవి.''[10] అలాగే విదేశీ రచయితలు కన్నుమూసినపుడు కూడా కొన్ని సంపాదకీయాలు వెలువడ్డాయి. అస్తిత్వవాద తత్త్వవేత్త, ప్రసిద్ధ రచయిత జీన్ పాల్‌సార్త్రే చనిపోయినపుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ఒక సంపాదకీయం రాసింది. ''సార్త్రే వట్టి తాత్త్వికుడు మాత్రమే కాదు, క్రియావీరుడు కూడా. ద్వితీయ ప్రపంచ యుద్ధంలో ఫ్రెంచి సేనలో చేరి నాజీలతో పోరాడాడు. ఖైదీగా జర్మనీలో కొన్నాళ్లున్నాడు. ఆ తర్వాత పారిస్ ప్రతిఘటనోద్యమంలో పాల్గొన్నాడు. ఫ్రెంచివాడై వుండి కూడా ఫ్రెంచి వలసవాదాన్ని తీవ్రంగా నిరసించాడు. అల్జీరియా స్వాతంత్ర్యోద్యమాన్ని బలపరిచాడు. ఇందుకై అతడిని జైలులో పెట్టాలని కొందరు ఒత్తిడి తేగా ప్రెసిడెంట్ డిగోల్ 'సార్త్రే కూడా ఫ్రాన్స్ దేశమే.' (సార్త్రే ఈజ్ ఆల్సో ఫ్రాన్స్) అంటూ నిరాకరించాడు.''[11]

ప్రసిద్ధ వచన రచయిత కొడవటిగంటి కుటుంబరావు మరణించినపుడు ఆంధ్రజ్యోతి దినపత్రికలో వెలువడిన సంపాదకీయం కేవలం ఒక నివాళి కాదు. 'కొకు' సాహిత్య వ్యక్తిత్వంపైన ఒక విలువైన విశ్లేషణ.''కొడవటిగంటిలో ఒక ముఖ్య విశేషం, ఆయనవలె కరడుగట్టిన హేతువాదులుగానో, తీవ్రవాదులుగానో జీవితాన్ని ప్రారంభించిన అనేకులు జీవిత ద్వితీయార్థంలో ప్రవేశిస్తూనే కాలం తాకిడికి ఆధ్యాత్మిక వాదులుగా, ఛాందస మతవాదులుగా తిరోగమించారు. కుటుంబరావుగారు మాత్రం చివరివరకు హేతువాదిగా, వైజ్ఞానికవాదిగా మార్క్సిస్టుగా కొనసాగారు. జీవిత చరమ దశకంలో 'విప్లవ రచయతల సంఘంలో' ప్రముఖ పాత్ర వహించడం వరకు ఆయన విశ్వాస నైశ్చల్యం కొనసాగింది. తుది దశలో ఆయన దృష్టి అతీంద్రియ ప్రపంచంవైపు మళ్లకపోలేదు. కాని, దాన్ని సైతం కుటుంబరావుగారు ఒక హేతువాదిగా, తార్కికుడిగా, మార్క్సిస్టుగా పరిశీలించడానికి, అతీంద్రియానుభవజ్ఞానానికి పూర్తిగా ఆధునిక వైజ్ఞానికాధారాలను కనుగొనడానికి ప్రయత్నించారు.''[12]

ప్రముఖ విమర్శకులు కట్టమంచి రామలింగారెడ్డి శతజయంతి సందర్భంగా, ఆంధ్రజ్యోతి దినపత్రికలో డిసెంబర్ 10, 1980న 'సర్ సి. ఆర్.రెడ్డి' అన్న సంపాదకీయం వెలువడింది. ఈ సంపాదకీయం కూడా కట్టమంచి సాహిత్య వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది. ''కట్టమంచి వారి మితవాదం కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది. గిడుగువారి వ్యవహారిక భాషావాదాన్ని ఆయన అంగీకరించలేదు. విశ్వవిద్యాలయం ఆవరణలోనికి వ్యవహారిక భాషను రానీయలేదు. ఇది తెలుగు భాష త్వరితంగా ఆధునికం కావడానికి అవరోధమైందనడంలో సందేహంలేదు. రామలింగారెడ్డిగారు ఇంగ్లండ్, అమెరికాలలో విద్యాభ్యాసం చేసివచ్చారు. ఆధునిక భావాలెన్నో అలవరచుకున్నారు. కానీ భాషా విషయంలో ఆయన మితవాదిగానే వుండిపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రాచీనాంధ్ర సాహిత్య సంప్రదాయాలపట్ల ఆయన చిన్ననాటి నుంచి పెంచుకున్న మక్కువ ఇందుకు కారణమై వుండాలి.''[13]

## 9. ఉద్యమ సంబంధిత సంపాదకీయాలు:

తెలుగు దినపత్రికల్లో వివిధ ఉద్యమాల నేపథ్యంలో వెలువడిన పత్రికలలో ఆయా ఉద్యమాలకు సంబంధించిన సంపాదకీయాలు 1970-80ల మధ్య కనిపిస్తున్నాయి. ఈ విధమైన సంపాదకీయాలు ఉద్యమ ప్రాముఖ్యాన్ని వివరిస్తాయి. సమకాలీన సామాజిక వ్యవస్థలో ఒక సంస్థగా తాము చేయాల్సిన కృషిగురించి పేర్కొంటాయి. ఉదాహరణకు 1976లో అభ్యుదయ సాహిత్య ఉద్యమం అనే శీర్షికన విశాలాంధ్ర దినపత్రికలో వెలువడిన ఒక సంపాదకీయం ఇలా పేర్కొంది. ''ఫాసిస్టు మహమ్మారి నుండి అంతర్జాతీయంగా సంస్కృతిని పరిరక్షించుకుంటున్న సమయంలో ఆవిర్భవించిన అభ్యుదయ రచయితల సంఘం, చైతన్యవంతంగా పనిచేసింది. నిజాం ముష్కరుల పాలన మట్టుబెట్టడానికి జరిగిన వీర తెలంగాణా పోరాటానికి సాహితీపరంగా అభ్యుదయ రచయితల సంఘం చేసిన కృషి గణనీయమైనది. దాదాపు పదిహేనేండ్ల కాలంలో అభ్యుదయ రచయితల సంఘం అద్వితీయ సేవ చేసింది.''[14]

ఒక సంస్థగా సాగించవలసిన భవిష్యత్ కృషిని సూచించడానికి ఈ సంపాదకీయాలు ఉపయోగపడ్డాయి. ''జాతీయోద్యమ లక్ష్యాల పరిపూర్తికి సామాజిక న్యాయం, లౌకిక ప్రజాస్వామ్యం, సోషలిజం సాధనకు దేశ ప్రజలు నేడు సాగించుచున్న మహత్తర పోరాటంలో తిరిగి ప్రగతి భావాలుకల రచయితలు, కళాకారులందరూ సమైక్యమై ప్రజలనుత్తేజపరిచి వారితో పాటు తాము కూడా ముందంజ వేయవలసి వుంది. స్వాతంత్ర్య ఫలితాలను చేజిక్కించుకున్న స్వార్థపరవర్గాల పెత్తనాన్ని నిర్మూలించి నవసమాజ నిర్మాణానికి జరుగుతున్న విప్లవ పోరాటాలలో రచయితలు, కళాకారులు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలి.[15]

పాదసూచికలు :

1. నండూరి రామమోహనరావు, 'సాహిత్యంలో అశ్లీలం' ఆంధ్రజ్యోతి దినపత్రిక, డిసెంబర్ 24, 1970.

2. నండూరి రామమోహనరావు 'బాలల సాహిత్యం' ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఏప్రిల్ 20, 1996.

3. నండూరి రామమోహనరావు, 'తెలుగు శబ్దసాగరం', ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆగస్టు 28, 1977.

4. విశాలాంధ్ర దినపత్రిక, ప్రాంతీయ భాషలు, మే 1976, సంపాదకీయాలు.

5. విశాలాంధ్ర దినపత్రిక 'అధికార భాషగా తెలుగు' జూన్ 13, 1976.

6. ఈనాడు దినపత్రిక, 'తెలుగు లిపిలో భాషలో వెసులుబాటు', సంపాదకీయం, ఏప్రిల్ 15, 1975.

7. నండూరి రామమోహనరావు, నోబెల్ సాహిత్య బహుమతి, ఆంధ్రజ్యోతి దినపత్రిక, అక్టోబర్ 23, 1971.

8. నండూరి రామమోహనరావు, 'అసాధారణ రచయిత', ఆంధ్రజ్యోతి దినపత్రిక, మే 6, 1979.

9. గోరాశాస్త్రి, 'సాహితీ యుగకర్త అస్తమయం', సాహిత్య సంపాదకీయం, ఆంధ్రభూమి దినపత్రిక, మంగళవారం, ఫిబ్రవరి 26, 1980.

10. నండూరి రామమోహనరావు, 'మహాకవి అస్తమయం', ఆంధ్రజ్యోతి దినపత్రిక, సాహిత్య సంపాదకీయం, ఫిబ్రవరి 26, 1980.

11. నండూరి రామమోహనరావు, 'మానవతావాది సార్త్రే', ఆంధ్రజ్యోతి దినపత్రిక సాహిత్య సంపాదకీయం, ఏప్రిల్ 17, 1980.

12. నండూరి రామమోహనరావు, 'కొడవటిగంటి' ఆంధ్రజ్యోతి దినపత్రిక, సాహిత్యసంపాదకీయం, ఆగస్టు 19,1980.

13. నండూరి రామమోహనరావు, 'బహుముఖ ప్రజ్ఞాశాలి', ఆంధ్రజ్యోతి దినపత్రిక, సాహిత్య సంపాదకీయం, డిసెంబర్ 10, 1980.

14. అభ్యుదయ సాహిత్యోద్యమం, 'విశాలాంధ్ర దినపత్రిక, ఫిబ్రవరి 18, 1976.

15. అభ్యుదయ రచయితల ఉద్యమ కర్తవ్యం, 'విశాలాంధ్ర దినపత్రిక' ఆగస్టు 14,1973.

★★★

# iii.1980-90ల మధ్య సాహిత్య సంపాదకీయాలు

1980 తరువాత సాహిత్య, సామాజిక రంగాలతోపాటు పత్రికా రంగంలో విశేషమైన మార్పులు వచ్చాయి. దినపత్రికలకు పాఠకుల సంఖ్య పెరగడంతో పాటు పత్రికా వ్యవస్థ నిర్వహణలో సాంకేతిక మార్పులకు కూడా ఈ దశాబ్దంలోనే శ్రీకారం చుట్టారు. పాఠకుల సంఖ్య పెరగడంతో వివిధ శీర్షికల స్వభావంలో మార్పు వచ్చింది. అలాగే సాంకేతిక పరిణామాల వల్ల సమాచార సేకరణ వ్యవస్థ పటిష్టమైనది. మౌలికంగా వచ్చిన ఈ మార్పులు పత్రికల ప్రాముఖ్యాన్ని పెంచాయి. ఇక సాహిత్యపరంగా తెలుగునాట అనేకానేక కీలకమైన పరిణామాలకు ఈ దశాబ్ది నాంది పలికింది. విప్లవ సాహిత్య ఉద్యమ ఉధృతి తగ్గిపోయి మధ్యతరగతి కేంద్ర బిందువుగా కొత్త సాహిత్య రూపాలు తలెత్తాయి. సమాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం దక్కేటట్లుగా దళిత, స్త్రీవాదాలు ప్రారంభమయ్యాయి. సాహిత్యరంగంలో ఈ వాదాలన్నీ అంతకుముందు వున్న సాహిత్య ప్రమాణాలను ప్రశ్నించాయి.

ఇక కాలానుగుణంగా వచ్చిన ఇతరేతర మార్పులను కూడా దృష్టిలో వుంచుకుంటే పత్రికా రంగానికి, సాహిత్యరంగానికి మధ్య వివిధ అంశాలలో సామీప్యత ఏర్పడింది. దీనివల్ల పత్రికల్లో సాహిత్య సంబంధిత అంశాలకు విశేషమైన ప్రాధాన్యం దక్కింది. సాహిత్య సంపాదకీయాలపైన కూడా ఈ పరిణామాల ప్రభావం తప్పనిసరిగా కనిపిస్తుంది. గతంలో కొందరు వ్యక్తులు మరణించినపుడో ,శతజయంతుల సందర్భంలోనో అత్యంత కీలకమైన సాహిత్య పరిణామాలు సంభవించినపుడు మాత్రమే సాహిత్య సంపాదకీయాలు వెలువడేవి. అంటే చాలా అరుదుగా మాత్రమే సాహిత్య సంపాదకీయాలు వెలువడే అవకాశం వుండేది. '80ల తరువాత తరచూ సాహిత్య సంపాదకీయాలు రాసే సంప్రదాయం ఏర్పడింది. దీనికి కారణం ఆ రెండు వ్యవస్థల్లోనూ వచ్చిన మార్పులే. సమకాలీన సాహిత్య పరిణామాలను ఎప్పటికప్పుడు అంచనా వేయడానికి ఈ సంపాదకీయాలు ఉపయోగపడ్డాయి. అందుకే వ్యక్తులు, ఉద్యమాలు ప్రధానంగా వచ్చిన సాహిత్య సంపాదకీయాలతోపాటు సమకాలీన సాహిత్య చర్చోపచర్చలకు నాందిపలికే సంపాదకీయాలు కూడా ఈ దశాబ్దంలో కనిపిస్తాయి.

## ఎ. వ్యక్తులపై వచ్చిన సంపాదకీయాలు:

1980-90ల మధ్య వ్యక్తులపై వచ్చిన సంపాదకీయాలు ఎక్కువ సంఖ్యలో వివిధ పత్రికల్లో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా తెలుగు సాహిత్య చరిత్రను మలుపు దిప్పిన మహారచయితలు అస్తమించిన సందర్భాల్లో వెలువడిన సంపాదకీయాలు ఈ సందర్భంగా పేర్కొనదగినవి. 1983లో మహాకవి శ్రీశ్రీ కన్నుమూసినపుడు దాదాపు ప్రతీ తెలుగు దినపత్రిక ఆయనకు సంపాదకీయ రూపంలో నివాళులు అర్పించాయి. ఆంధ్రప్రభ దినపత్రిక మొదటి పేజీలో '1999 డిసెంబర్ 31' అనే శీర్షికన వెలువడిన సంపాదకీయం శ్రీశ్రీలోని బహుముఖీన వ్యక్తిత్వానికి అద్దంపడుతుంది. ''శ్రీరంగం శ్రీనివాసరావు ఒక వ్యక్తిగానేగాక, ప్రాచీన నవీన జాతీయ అంతర్జాతీయ కవితా శాఖలను పుక్కిన పట్టినవాడేగాక, స్థలకాలాలను సామాజిక దృష్టితో జయించి విశ్వమానవుడిగా, తానే ఒక వ్యవస్థగా మారి విలయతాండవం చేసిన మహాకవి. వెనక బాణభట్టు 'తిని వదిలినదే మిగతా ప్రపంచానికి తిరిపెం' అనుకునేవారు. అలాగే ఆధునిక యుగంలో శ్రీశ్రీ సాహితీ క్షేత్రంలో చేయని సాగులేదు. తీయని పంటలేదు. అతను చేయని ప్రయోగం లేదు. కనుకనే ఈ రోజుకీ సాహితీపరుల ఉపన్యాసాలలో, రేడియో ప్రసంగాలలో సభలలో, సమావేశాలలో ఏదో ఒక దశలో 'శబ్దబ్రహ్మ' శ్రీశ్రీ నీడలూ, క్రీనీడలూ వక్తల భావజాలాన్నీ వెన్నంటుతూనే వుంటాయి.'' [1] ఈ సంపాదకీయ శీర్షిక కూడా ఒక ప్రయోగమే, ఈ శతాబ్దం నాది అన్న మహాకవి శ్రీశ్రీ వాక్యానికి ప్రతిబింబంలాగా నిలిచిందిఈ శీర్షిక. ఈనాడు దినపత్రిక చిరంజీవి శ్రీశ్రీ అనే శీర్షికతో మహాకవికి నివాళులు అర్పిస్తూ వైతాళికులకు వైతాళికుడిగా శ్రీశ్రీని అభివర్ణించింది. ''మహాకవి అస్తమించాడు. మన ప్రపంచం విడిచి మరో ప్రపంచంలోకి మహాప్రస్థానం చేశాడు. దారిపొడుగునా గుండె నెత్తురులు అక్షరాలా అర్పణ చేస్తూ పతితుల కోసం భ్రష్టుల కోసం కవితాశ్రువులు తర్పణ చేస్తూ కుంగుతున్న శరీరంతో పొంగుతున్న కంఠంలో దేహి అంటే తప్ప మెతుకూ, పాహి అంటే తప్ప బతుకులేని 'దొంగలంజకొడుకులసలే మెసలే ధూర్త ప్రపంచం' నుంచి తానే సృష్టించుకున్న మరో ప్రపంచంలోకి మహాభినిష్క్రమణం చేశాడు. రెండు శ్రీశ్రీల ధన దరిద్రుడు, కవితా ఘన సముద్రుడు శ్రీశ్రీ''. [2] శ్రీశ్రీ లేని ఆధునికాంధ్ర కవిత్వాన్ని ఊహించుకోవడం కష్టం అంటూ ఆంధ్రజ్యోతి దినపత్రిక తెలుగు సాహిత్యానికి శ్రీశ్రీ అందించిన స్ఫూర్తి ఈ విధంగా పేర్కొన్నారు. '' ఒక తాత్విక సిద్ధాంతాన్ని కవితామయంగా పలకడం సాధారణులకు సాధ్యం కాదు. ఆ విధంగా మార్క్సిస్టు సిద్ధాంతాన్ని కవితాత్మకంగా పలికిన వారిలో ముఖ్యుడిగా జర్మన్ కవి బెర్టోల్ బ్రెక్ట్‌ను పేర్కొంటారు. తిరిగి తెలుగులో శ్రీశ్రీ ఆ 'ఫీట్' చేశాడు. ' ఏ దేశ చరిత్ర చూచినా ఏమున్నది గర్వకారణం. నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం' అని ప్రారంభమయ్యే గీతం 'కమ్యూనిస్టు మ్యానిఫెస్టో'లో ఇప్పటివరకు నడిచిన సమాజ చరిత్ర అంతా వర్గ సంఘర్షణల చరిత్ర అని ధ్వనించే ప్రారంభ వాక్యాలను

కవనీకరించినట్టు వుంటుంది. 'కాదేదీ కవితకనర్హం, ఔనౌను శిల్ప మనర్ఘం' అనే పాదాలతో కూడిన శ్రీశ్రీ రచన 'ఋక్కులు' రమ్యమైనదైనా, జుగుప్సితమైనదైనా ఏదైనా కవి భావుక భావ్యమానమై రసస్ఫోరకమవుతుందని సూత్రీకరించే సంస్కృతాలంకారిక శ్లోకానికి ఆధునిక రూపంవలె భాసిస్తుంది. [3]

ప్రసిద్ధ కథారచయిత కొడవటిగంటి కుటుంబరావు మరణించినపుడు 'ఆంధ్రజ్యోతి దినపత్రిక రాసిన సంపాదకీయం ఆయన రచనలపై సంయమనంతో కూడిన విశ్లేషణ. ''ముఖ్యంగా సెక్స్ స్వాతంత్ర్యం దృష్టి నుంచి సకల సామాజిక సమస్యలను పరిశీలించాడు. కథారచనలో ఒక విధంగా ఆయన వారసుడు కొడవటిగంటి. కాని చలం ప్రారంభించిన భావ విప్లవాన్ని ఆయన విశ్వతోముఖంగా విస్తరింపజేశారు. మార్క్సిస్టు సామాజిక దృక్పథాన్ని సంపూర్ణంగా స్వీకరించారు. ఫ్రాయిడ్ మనోవిశ్లేషణలోని సంకుచితత్వాన్ని నిరాకరించి, ఆ ప్రక్రియను మానవుడి సామాజిక వ్యక్తిత్వవగాహనకు వర్తింపజేశారు. మానవుడి ఆర్థిక, రాజకీయ లైంగిక తదితర సమస్యా సామస్త్యాన్ని తన సాహిత్య వస్తువుగా తీసుకుని తన హేతువాద దృక్పథం నుంచి నిశితంగా, నిర్దాక్షిణ్యంగా విశ్లేషిస్తూ రచనలు సాగించారు.'' [4]

రెండు తరాలకు సంబంధించిన వ్యక్తుల గురించి ఒకే సంపాదకీయం రాశారు ఎ.బి.కె.ప్రసాద్. జూలై 6, 1982లో ఆంధ్రప్రభలో రెండు జ్యోతులు అనే శీర్షికన గ్రంథాలయ ఉద్యమానికి, విజ్ఞాన వ్యాప్తికి నిర్విరామంగా కృషిచేసిన గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, నిజాయితీతో, చిత్తశుద్ధితో ప్రజా కవిత్వాన్ని గానం చేసిన చెరబండరాజు గురించి రాసిన ఈ సంపాదకీయంలో రెండు భిన్నమైన వ్యవస్థల మధ్య రెండు భిన్నమైన రూపాల్లో సాగే సమరాన్ని గురించి వివరించారు. ''నాడు గొర్రెపాటి సాగించిన సమరం, ఆయన పాల్గొన్న జమీన్ రైతు పోరాటాలు కాలం తీరిపోతున్న జమీందారీ వ్యవస్థతోనూ, దాని కొమ్ముకాస్తున్నవారితోనూ, నిన్న మొన్న చెరబండరాజు పెట్టుకున్న జగడం, గొర్రెపాటివారి తరం అసంపూర్ణంగా వదిలివెళ్లిన ఆనాటి జమీందారీ, ఫ్యూడల్ వ్యవస్థ అవశేషాలతో, కొత్త తరహా అక్రమాలతో, అన్యాయాలతో, ధాష్టీకాలతో, దౌర్జన్యాలతో..'' [5]

అలాగే వచన కవిత ఉద్యమ నాయకుడు కుందుర్తి ఆంజనేయులుపై, [6] హైదరాబాద్ మతకల్లోలాల్లో అసువులు బాసిన కవి గులాం యాసిన్‌పై [7], తెలుగు కథకు విశ్వవిఖ్యాతి తీసుకువచ్చిన పాలగుమ్మి పద్మరాజు కన్నుమూసినపుడు రాసిన సంపాదకీయాలు పేర్కొనదగినవి. [8] ఈ దశాబ్దంలో ఎబికె రాసిన సంపాదకీయాల్లో విశేషించి చెప్పుకోవలసింది 'బంగొరె' గురించి రాసినది. పరిశోధనారంగంలో నిజాయితీకి నిర్వచనంగా నిలిచిన బంగొరె చివరకు ఆత్మహత్యకు పాల్పడిన పరిస్థితులు ఏర్పడటాన్ని ఈ సంపాదకీయంలో తీవ్రంగా నిరసించారు. ''మనస్తత్వ శాస్త్రజ్ఞులైన ఫ్రాయిడ్‌గానీ, ఆధునికులైన ఎమిలీ డర్క్ హేమ్‌గానీ చివరకు అత్యాధునికులైన ఆర్.కె.మోర్టన్‌గాని, మెక్లోస్కీగానీ ఇతమిత్థంగా 'కారణం ఇదీ' అని చెప్పలేని అఘాయిత్యాలలో 'బంగొరె'

చర్య ఒకటి. ఇలాంటి ఘటనలు కేంద్ర శాస్త్ర పరిశోధనా సంస్థలలో కూడా చెదురుమదురుగా జరగకపోలేదు. కాని విలువైన వ్యక్తుల పరిశోధనల రక్షణ కోసం, తద్వారా ప్రయోజనకరమైన బ్రతుకుల పరిరక్షణ కోసం మార్గాలు అన్వేషించవలసిన అవసరాన్ని, పరిశోధనలకు అవసరమైన అన్నిరకాల ఆదర్శవంతమైన వాతావరణాన్ని కల్పించవలసిన ఆవశ్యకతను ప్రభుత్వాలు కూడా గుర్తించవలసి వుంది.'' [9]

## బి. సంపాదకీయాల్లో దృక్పథాంశాలు:

సాహిత్య సంపాదకీయాలు కేవలం వ్యక్తులకే పరిమితం కాలేదు. 1980-90ల మధ్య అనేక సామాజిక, రాజకీయ సాహిత్య ఉద్యమాలు తలెత్తడంతో సంపాదకీయాల స్వభావంలో మార్పు వచ్చింది. వ్యక్తి కేంద్ర బిందువుగా వుండే ధోరణికి స్వస్తిచెప్పి సమష్టి చైతన్యం ప్రధానాంశమైన దృక్పథం ఈ దశాబ్ది సంపాదకీయాల్లో కనిపిస్తుంది. సామాజిక, రాజకీయ ఉద్యమాలతో సంబంధం వున్న కవులు, రచయితలు మరణించినపుడు కూడా వారికి సంబంధించిన సంపాదకీయాల్లో దృక్పథాంశాలు చోటు చేసుకోవడం విశేషంగా చెప్పుకోవాలి. 1983, జనవరి 30న 'అగాథమీ - అకాడమీ' అనే శీర్షికన ఎబికె ప్రసాద్ రాసిన సంపాదకీయం వెలువడింది. ఒక అసంపూర్ణ నవలకు బహుమతి ఇవ్వాలన్న ఆలోచనమీద స్పందిస్తూ సాహిత్య సంస్థల అవినీతిని ఎండగట్టిన సంపాదకీయమిది. అకాడమీల పరువు, ప్రతిష్టలకు చెరుపు తెస్తున్న వివిధ పెడధోరణులను ప్రతిఘటిస్తూ ఈ సంపాదకీయంలో ఇలా పేర్కొన్నారు. ''ఒకే ఒక బృహత్ అకాడమీ సర్వసమర్థమైన ఛత్రచ్ఛాయల్లో విభిన్న శాఖలు వర్ధిల్లగల వ్యూహం మనకు అవసరం. ఏది ఏమైనా పాతనీరు పోవాలి. ప్రతి ఐదేళ్లకు సంస్థలో ఎన్నికలు జరగాలి. కొత్తతరం, యువ రక్తం అకాడమీలోకి ఎక్కిరావాలి. అప్పుడుగాని అది సుగంధాలు వెదజల్లదు! అంతవరకూ మనకి కూడా నోబెల్ ప్రైజ్ ప్రధాన పద్ధతులను ('ది ప్రైజ్') ఎండగట్టగల మరొక ఇర్వింగ్ వాలేస్ అవసరం కాదా?' [10] మళ్లీ 1985లో అకాడమీలమీద ఎబికె మరోసారి తీవ్రమైన సంపాదకీయ వ్యాఖ్య రాశారు. 'కళాప్రపూర్ణ' బిరుదుల వాదిరే అకాడమీ బహుమతులు కూడా 'ధర్మపిండాలు'గా మారిపోయాయి. అందువల్ల వస్తున్న నిధులు అంతంత మాత్రమైతే, వాటి తాలూకా దానాలు అపాత్రదానాలయ్యాయి! కనుకనే అకాడమీ ఎప్పుడూ అవార్డుల బహుకరణ కేంద్రంగా ఉండకూడదు. అది కేవలం విజ్ఞాన విస్తరణపీఠంగా, భాషా పరిశోధనా పారిజాతాలు పూయించే విశిష్టవనంగా వర్థిల్లాలి! నిధుల కొరత అనుకుంటే, డెన్మార్క్‌లో అకాడమీలను దేవస్థానాల నిధులు పోషిస్తున్నాయి. మరి ఇక్కడో, హుండీల్లో మూలుగుతున్నాయి. [11] ప్రభుత్వ వ్యవస్థ క్రింద సాహిత్య, సాంస్కృతిక రంగాలు ఏ విధంగా రూపుమార్చుకుంటున్నాయో వివరించే ప్రయత్నం ఈ సంపాదకీయాల్లో జరిగింది. అలాగే ఆస్థాన కవి పదవి రద్దు చేసినపుడు రాసిన సంపాదకీయం కూడా ఈ నేపథ్యంలోంచి విశ్లేషించదగినది. ఆస్థాన పదవులు అనే శీర్షికన ఏప్రిల్ 5, 1983న రాసిన సంపాదకీయంలో ఆస్థాన కవి అనే సంప్రదాయాన్ని

నిరసించారు. ''నిజాం కర్కశపాలనకు వ్యతిరేకంగా తెలంగాణా ప్రజలలో చైతన్యదీపాలు వెలిగిస్తూ చెరసాలనే రాజకీయ సాహిత్య నర్తనశాలగా మార్చుకున్న ఒకనాటి దాశరథి ఈ ఆస్థాన పదవులను 'గడ్డిపోచలు'గా ఏనాడో భావించి వుండవలసింది. నిజానికి ఆనాటి నుంచీ ఈనాటివరకూ దాశరథి కలానికి బలమిచ్చి నడిపించింది అతని 'అగ్నిధార'గాని ఆస్థాన పదవికాదు. గుండెలో 'కోటిరత్నాల వీణ'ను మీటుతూ దాశరథి కీర్తిచంద్రికలను వ్యాపింపజేసింది అతని 'మహాంధ్రోదయం'గాని నిన్న మొన్నటి ఆస్థాన కవి పీఠం కాదు. 'రాజుల బూజుల చరిత్రను దులిపి దులిపి వదిలింది అతని 'రుద్రవీణ'గానీ ఆస్థాన పదవికాదు.'' [12]

పాదసూచికలు :

1. ఎ.బి.కె.ప్రసాద్, '1999 డిసెంబర్ 31' ఆంధ్రప్రభ దినపత్రిక, జూన్ 16, 1983, సాహిత్య సంపాదకీయం.

2. రామోజీరావు సిహెచ్., ''చిరంజీవి శ్రీశ్రీ'' ఈనాడు దినపత్రిక, సాహిత్య సంపాదకీయం, జూన్ 17, 1983.

3. నండూరి రామమోహనరావు, 'యుగకర్త నిర్యాణం', ఆంధ్రజ్యోతి దినపత్రిక సాహిత్య సంపాదకీయం, జూన్ 17,, 1983.

4. నండూరి రామమోహనరావు, 'కొడవటిగంటి', ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆగస్టు 19, 1980.

5. ఎబికె ప్రసాద్, 'రెండు జ్యోతులు', ఆంధ్రప్రభ దినపత్రిక, సాహిత్య సంపాదకీయం, జూలై 6, 1982.

6. ఎబికె ప్రసాద్, 'కవి ఆంజనేయుడు', ఆంధ్రప్రభ దినపత్రిక, సాహిత్య సంపాదకీయం, అక్టోబర్ 26, 1982.

7. ఎబికె ప్రసాద్, 'యాసిన్ కవి', ఆంధ్రప్రభ దినపత్రిక, సాహిత్య సంపాదకీయం, జనవరి 19, 1983.

8. ఎబికె ప్రసాద్, 'పాలగుమ్మి' ,ఆంధ్రప్రభ దినపత్రిక, సాహిత్య సంపాదకీయం, ఫిబ్రవరి 18, 1983.

9. ఎబికె ప్రసాద్, 'సల్లైజ్ కడుపులో 'బంగారె', ఆంధ్రప్రభ దినపత్రిక, సాహిత్య సంపాదకీయం, నవంబర్ 21, 1982.

10. ఎబికె ప్రసాద్, 'అగాథమీ - అకాడమీ', ఆంధ్రప్రభ దినపత్రిక సాహిత్య సంపాదకీయం, జనవరి 30, 1983.

11. ఎబికె ప్రసాద్, 'అకాడమీలు: ఆంధ్ర జస్టీనియన్', ఉదయం దినపత్రిక సాహిత్య సంపాదకీయం, జూన్ 26, 1985.

12. ఎబికె ప్రసాద్, 'ఆస్థాన' పదవులు, ఆంధ్రప్రభ దినపత్రిక సాహిత్య సంపాదకీయం, ఏప్రిల్ 5, 1983.

★★★

# *iv.* ఇతర భాషా సాహిత్యాల గురించి సంపాదకీయాలు

తెలుగు దినపత్రికల్లో ఇతర భాషా సాహిత్యాలకు సంబంధించిన సంపాదకీయాలు మూడు విధాలుగా కనిపిస్తున్నాయి. ఎ. ప్రస్తావనగా చెప్పిన సాహిత్య అంశాలు బి. తులనాత్మకంగా చెప్పిన అంశాలు సి. ఇతర భాషా సాహిత్యాల గురించి మాత్రమే రాసిన సాహిత్య సంపాదకీయాలు.

## ఎ. ప్రస్తావనగా చెప్పిన సాహిత్య అంశాలు:

ఒక ప్రధాన అంశంలో భాగంగా సందర్భాన్నిబట్టి ఇతర భాషా సాహిత్యాల ప్రస్తావనను తీసుకువచ్చిన సాహిత్య సంపాదకీయాలు తొలినాళ్లలో ఎక్కువగా ఉండేవి. ఉదాహరణకు డిసెంబర్ 30, 1968న ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాసిన సంపాదకీయం. ''జూల్స్‌వెర్న్ 103 సంవత్సరాల క్రిందట - 1865లో తన నవల వ్రాశాడు. 'రవి కాననిచో కవికాంచునే కదా!' అనే లోకోక్తిని అతని రచనలు రుజువు చేస్తున్నాయి. ఇరవైయవ శతాబ్దంలో మనం జూల్స్ వెర్న్ నవలల్లోనే జీవిస్తున్నామని ఒక ప్రఖ్యాత శాస్త్రవేత్త అన్నాడు. ఆ వాక్యంలోని సత్యాన్ని మొన్నటి అపోలో యాత్ర మరొకసారి రుజువు చేసింది. జూల్స్‌వెర్న్ మానవ భవిష్యత్తులోనికి తొంగి చూచాడు. అతనిది ముందు చూపు, వెనుకచూపుకాదు. ముందుకు దారి చూపడంకంటె సాహిత్యానికి పరమ ప్రయోజనం మరేముంది? [1]. జులై 14, 1989లో ఫ్రెంచి విప్లవానికి సంబంధించి ఒక సంపాదకీయంలో ఆ విప్లవాన్ని కీర్తిస్తూ మహాకవి వర్డ్స్‌వర్త్ అన్న మాటల్ని పేర్కొన్నారు. ''ఆ ప్రభాతవేళ జీవించి వుండడమే ఒక మహానుభూతి. కాగా, యౌవన ప్రాయంలో వుండడం సాక్షాత్తూ స్వర్గతుల్యమే''. ( Bliss was it in that down to be alive. But to be young was very heaven) అని మహాకవి వర్డ్స్‌వర్త్ తన్మయత్వంలో ఫ్రెంచి విప్లవాన్ని కీర్తించాడు.'' [2]

అలాగే సోవియట్ యూనియన్‌లో వస్తున్న పరిణామాలను దృష్టిలో వుంచుకుని డిసెంబర్ 24, 1991న రాసిన సంపాదకీయంలో ఒక మహా ప్రపంచం కూలిపోయిన విషాదాన్ని చిత్రించటానికి సాహిత్య సంబంధమైన ప్రస్తావనల్ని ఈ సంపాదకీయంలో తీసుకువచ్చారు. ''మానవ చరిత్ర మరొకసారి మరొక కన్నీటి బొట్టు రాల్చింది. రామరాజ్యం నుంచి, ప్లేటో రిపబ్లిక్ నుంచి , థామస్ మోర్ యుటోపియా నుంచి,

రాబర్ట్ ఓవెన్ ఆదర్శ సమాజం నుంచి ,రూసో, వోల్టైర్, షెల్లీ వరకు ఎందరెందరో స్వాప్నికులు, భావుకులు కన్న కలల భస్మరాశిలో సరికొత్తగా మరొక చితాభస్మం చేరింది. తుర్గెనీవ్ తన 'వర్జిల్ సాయిల్' నవలలో పేర్కొన్న 'వీల్స్ ఆఫ్ జగ్గర్‌నాట్' శ్రీశ్రీ 'జగన్నాథ రథచక్రాల్' భూమార్గం పట్టకుండా మధ్యలోనే ఆగిపోయాయి.[3] తెలుగు భాష అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి చెబుతూ 1982 ఏప్రిల్ 22న ఆంధ్రప్రభ దినపత్రికలో సంపాదకీయం వెలువడింది. ఇందులో తెలుగు భాష అభివృద్ధికి జరగాల్సిన కృషి గురించి చెప్పడానికి ఇతర భాషా సాహిత్యాల్లో ఆయా వ్యక్తులు చేసిన కృషిని ప్రస్తావించారు. ''మనసంటూ వుండాలేగాని మార్గాలు లేకపోలేదు. అన్ని స్థాయిలలోను అధికారుల సహకారం అవసరం. మనం ప్రజల ' ఉప్పు' తింటున్నాం. ఆ ప్రజలకు అర్థమయ్యే భాషలోనే మన శాసనాలను వెల్లడి చేద్దామన్న చైతన్యం అధికారులకు, పాలకులకూ అవసరం. ఆ కృషి సమష్టిగా సాగిననాడు తెలుగు భాషకు కొత్త భూషలు తొడగడంలో ఎవరికివారే ఒక డెడిరో, ఒక శామ్యూల్ జాన్సన్ కాగలుగుతారు![4] నమీల్ -నమీబియా అన్న అంశంపై 1985లో ఆంధ్రప్రభ దినపత్రికలో రాసిన సంపాదకీయంలో అమెరికన్ నీగ్రోకవి 'లాగ్‌స్టన్' రాసిన కవితను కూడా ప్రారంభంలో పేర్కొన్నారు. '' ఆఫ్రికా! మేరుపర్వతం! / క్షణం క్షణం నిద్రాముద్రితం! / నీ చిరునవ్వులో నేడు / మేఘగర్జనలో వింటున్నా / మెరుపు తీగలు కంటున్నా! / మేలుకొన్న కళ్లల్లో మెదిలే / ఆ తుపాను మేఘాలు / ఆ మేను పులకరింపులు! / జనం బలం ధనం నీది / అడుగడుగూ ఆఫ్రికాది!

సోదర ఆఫ్రికన్ నీగ్రోల స్వాతంత్ర్య సమరాల గురించి, వారి కడగండ్ల గురించి రాబోయే మంచి రోజులను తలచుకుంటూ, ఆ రోజులు రావాలని కోరుకుంటూ అమెరికన్ నీగ్రో కవి లాగ్‌స్టన్ హ్యూస్ రాసుకున్న ఈ జ్ఞాపకాలు పెక్కు ఆఫ్రికా దేశాల విషయంలో వాస్తవాలయ్యాయి.''[5]

## బి . తులనాత్మకంగా చెప్పిన అంశాలు :

తెలుగు సాహిత్య పరిణామాలను ఇతర భాషా సాహిత్యాలతో సారూప్యత చూపించిన సంపాదకీయాలు అనేకం దినపత్రికల్లో వెలువడ్డాయి. చాసో సప్తతి సందర్భంగా 1985 మార్చి 10న ఆంధ్రజ్యోతి దినపత్రికలో రాసిన సంపాదకీయంలో చాసోను ప్రపంచ రచయితల సరసన నిలబెడుతూ ఇలా అంటారు.'' చాసో అనగానే కొందరికి ఫ్రెంచి వారిని భావ విప్లవోన్ముఖులను చేసిన రూసో జ్ఞాపకం వస్తారు. మాకు మాత్రం చెఖోవ్ జ్ఞాపకం వస్తాడు. ఎన్నో గొప్ప కథలు వ్రాసిన చెఖోవ్ కాదు, 'త్రీ సిస్టర్స్', 'షెర్రీ ఆర్చర్డ్' లాంటి గొప్ప నాటకాలు రాసిన చెఖోవ్ కూడా జ్ఞాపకం వస్తాడు. ఇంకా ప్రపంచ సాహిత్యంలో సూర్యాస్తమయాల గురించి, సూర్యోదయాల గురించి చీకటి లోకంలో మినుకు మినుకుమనే మానవత్వపు మహత్వం గురించి కథలు రాసిన గొప్ప రచయితలెందరో జ్ఞాపకం వస్తారు.[6] సాహిత్య సంపాదకీయాలలో తులనాత్మక అధ్యయనానికి విశాలమైన పరిధిని ఏర్పరచిన పత్రికా రచయిత ఎబికె ప్రసాద్. చాలా

మంది సమకాలీన విదేశీ రచయితలను, విమర్శకులను తెలుగువారికి ఈ విధంగా ఆయన పరిచయం చేశారు. ప్రసిద్ధ విమర్శకుడు చేకూరి రామారావు అన్నట్టుగా ''ఒక్కోసారి ఈయన విశ్వసాహిత్య పాండిత్యం పాఠకులను ఉక్కిరిబిక్కిరి చేసి ఊపిరాడనియ్యదు. ఈయన పేర్కొన్న రచయితల పేర్లను పలకటానికి కూడా కష్టపడతాం. ముకుంద రామారావును గురించి రాస్తూ ఆనటోల్ ఫ్రాన్స్‌ను రాబర్ట్ ఫ్రాస్ట్‌ను, ఎజ్రాపౌండ్, మేరీ మెకార్థిని, రాబర్ట్ లోవెల్‌ను ప్రస్తావిస్తాడు. కుప్పిలి పద్మను గురించి రాస్తూ సిల్వియా ప్లాత్ కవిత్వం గురించి చెపుతాడు. పాటిబండ్ల రజని, రావులపల్లి సునీతల గురించి రాసిన వ్యాసంలో విశ్వరచయితల పేర్లు అయితే చాలా మంది పాఠకులు వినే ఉండరు.''[7] ''ఎబికె వాల్కాట్‌ను గురించి రాసినా కృష్ణశాస్త్రిగారిని స్మరించగల భావుకుడు.''[8]

1990 సెప్టెంబర్ 9న సుప్రసిద్ధ రచయిత బీనాదేవిపై రాసిన సంపాదకీయంలో ప్రసిద్ధ ఆంగ్ల రచయిత 'మోబీడిక్' పోలిక తీసుకు వస్తారు. ఈ సంపాదకీయంలో ఇలా అంటారు. ''పది మందితో కలవడం, సరదాగా చర్చించడం విజ్ఞానంగా భావించిన న్యాయమూర్తి బీనాదేవి. ఈ దృష్ట్యా ఆయనను, ఇర్విన్‌కాబ్ రాసిన ' ఓల్డ్‌సౌత్' కథల్లోని టెన్‌జడ్జి' ప్రెస్‌బిల్లీ' పాత్రతో పోల్చుకోవచ్చు! సుప్రసిద్ధ నవలాకారుడు ఆంగ్ల భాషా నిఘంటువుకు ఎన్నో కొత్త పదాలను ప్రస్తావించిన 'మోబీడిక్' రచయత అయిన హెర్మన్ మెల్ విల్లీ గురించి మిసెస్ హాథార్నీ చేసిన వర్ణన మన బీనాదేవికి ప్రత్యక్షర సత్యంగా వర్తిస్తాయి: 'A man with a true, warm heart, and a soul and reverent, very tender, and modest, has keen perceptive a power ' ఏ నాటికైనా బీనాదేవి కల నిజమవుతుంది.[9] ఆధునిక కవిత్వ ధోరణుల్ని పరిచయం చేస్తూ ఏప్రిల్ 8, 1990న రాసిన సంపాదకీయంలో వర్తమాన తెలుగు కవిత్వాన్ని పాశ్చాత్య ధోరణుల్తో పోల్చుతారు. ''నువ్వు రక్తం పంచి... చిక్కి శల్యమైన నీ దేహంలోనే చాలీచాలని చోటిచ్చి, పెంచి పోషించుకున్న నీ కలల బిడ్డ మృతరూపాన్ని! తల్లీ క్షమించు! ఇది నిజం!'' అన్న యువకవి గొంతుక గాద్గదికమవుతున్నపుడు ఆధునిక బ్రిటీష్ కవి ఆడ్రియన్ మిషెల్ ''ఫైనల్ ఛాంట్'' అన్న కవితలో ''We have done enough killing Long live the man. Longlive the Woman. Who use both courage and compassion. Long live their Children'' అన్న వాక్చిత్రాలు జ్ఞప్తికి వస్తాయి.[10]

స్త్రీవాద సాహిత్యానికి సంబంధించి వెలువడిన అనేక సంపాదకీయాల్లో పాశ్చాత్య స్త్రీవాద రచయిత్రులంతా సారూప్యాన్ని అన్వేషించే ప్రయత్నం సంపాదకీయాల ద్వారా జరిగింది. ''ఉల్‌స్టోన్ క్రాఫ్ట్ సూత్రీకరణకు వీసమెత్తు కూడా లేకుండా స్త్రీవాదానికి ప్రతీకలుగా నిలిచేవి పి. సత్యవతి కథలు.''[11]

## సి. ఇతర భాషా సాహిత్యాలపై సంపాదకీయాలు:

పాశ్చాత్య రచయితల గురించి, సాహిత్య విశేషాల గురించి సంపాదకీయాలు రాసే ధోరణి తెలుగు దినపత్రికల్లో తొలినాళ్లలో అరుదుగా తప్ప కనిపించేవికావు. 70'ల

తరువాత రెండు దశాబ్దాలుగా పాశ్చాత్య సాహిత్య అంశాలపై వెలువడిన సంపాదకీయాల్తో పోల్చినపుడు ఇంతకుముందు సాహిత్య సంపాదకీయాల పాత్ర తక్కువే. అవి కూడా చిన్న సంపాదకీయాలు మాత్రమే అయివుండేవి. ఉదాహరణకు 1966 నవంబర్ 27న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'చైనాలో షేక్స్పియర్', శీర్షికన వెలువడిన సంపాదకీయం. చైనాలో సాంస్కృతిక విప్లవం పేరుతో షేక్స్పియర్, హ్యూగో వంటి ప్రసిద్ధ రచయితల గ్రంథాలను దగ్ధం చేసినపుడు ఈ సంపాదకీయం వెలువడింది. ఈ సంపాదకీయంలో ఇలా అంటారు. ''సూర్యుడు మీద దుమ్ముచల్లితే, చల్లినవారి కళ్లలోనే పడుతుంది. షేక్స్పియర్ రచనలను దగ్ధం చేస్తే షేక్స్పియర్‌కేమీ నష్టం లేదు. ప్రపంచంలో సాహితీ ప్రియులున్నంతకాలం ఆయన రచనలు నిత్య నూతనంగా భావిస్తూనే వుంటాయి. వాటిని నిషేధించడంవల్ల ఆ మేరకు నష్టపడేది చైనావారే.'' [12]

1986లో కన్నుమూసిన ' సైమన్ డిబోవియర్ ' అన్న స్త్రీవాద రచయిత్రిపై వెలువడిన సంపాదకీయంలో ''మానవాళిలో సగభాగంగా వున్న మహిళల బానిస బంధాలు తెగిన రోజున, కపట నాటకాలు తొలగిన రోజున మానవుల విలువ తెలిసి వస్తుందని చెప్పింది. స్త్రీ స్వేచ్ఛ కోసం తొలి బావుటా నెత్తిన మేరీ ఉలెస్ క్రాఫ్ట్ (1792) తర్వాత అంతటి మేధా సంపత్తితో ముందుకు దూసుకువచ్చిన కొద్ది మంది మహిళా విమోచనా కర్తలలో ఒకరు డిబోవియర్. ''స్త్రీతో పురుషునికి ఉన్న సంబంధం మానవ మాత్రునితో తోటి మానవునికి ఉన్న అతి సహజమైన అనుబంధం'' తప్ప మరొకటి కాదన్న కారల్ మార్క్స్ వాక్యాలతో ది బోవిర్ 'సెకండ్ సెక్స్' ముగించడం ఆమెపైన మార్క్స్ ప్రభావానికి నిదర్శనం.'' [13] అదే ఏడాది కన్నుమూసిన ప్రయోగవాద నాటకకర్త 'జీన్ జెనే ' గురించి వెలువడిన సంపాదకీయంలో అసంబద్ధ నాటక ధోరణి గురించి ఇలా వివరిస్తారు. '' ఒక క్రమపద్ధతిలో సంఘటనలకు ప్రాణం పోసేదిపోయి కేవలం ఊహాపోహలతో భావప్రతిమలను చూపించాలన్న తాపత్రయంలో అసలు భావాన్ని చంపే స్థితిలోకి అబ్సర్డ్ థియేటర్‌ను తరువాతి వారు నెట్టారు! కనుకనే క్రమంగా జెనే కళ్ళముందరే, అబ్సర్డ్ థియేటర్‌లో సంబంధమున్న నాటకకర్తలు పెక్కు మంది ఇతర నాటక ప్రక్రియలకు మళ్లవలసి వచ్చింది. మాటలు లేకుండా, భావప్రకటనతో నిమిత్తం లేకుండా కేవలం 'హావ' ప్రకటనతోనే సరిపుచ్చుకున్న థియేటర్ అది. అయినా అందులోనూ వెలుగులు చూపినవాడు జెనే!'' [14]

1990లకు అటూ ఇటూగా దాదాపు ప్రతీవారం సాహిత్య సంపాదకీయం వెలువడుతున్న దశలో అనేక మంది పాశ్చాత్య రచయితల గురించి తెలుగు దినపత్రికల్లో సంపాదకీయాలు వెలువడ్డాయి. అలాగే కొత్తగా వెలువడుతున్న పుస్తకాలపైన, నూతనంగా పొడచూపుతున్న ధోరణులపైనా సాహిత్య సంపాదకీయాలు ప్రచురితమయ్యాయి.

## ముగింపు :

తెలుగు దినపత్రికల్లో సాహిత్య సంపాదకీయానికి ఒక సమగ్రమైన ఆకృతి ఏర్పడింది. 1980ల తరువాతనే. అప్పటివరకు సాహిత్య సంపాదకీయానికి అంతగా ప్రాముఖ్యం లేదు. క్రమంగా దాదాపు ప్రతీ ఆదివారం సాహిత్య సంపాదకీయాన్ని రాసే సంప్రదాయాన్ని ఏర్పరచుకున్న పత్రికలు కూడా ఉన్నాయి. దీనికి కారణం సమకాలీన సాహిత్య సామాజిక సంబంధాలలో వచ్చిన మార్పులే. ఈ మార్పుకు, సాహిత్యానికి మధ్య ఉన్న సంబంధాన్ని తిరుమల రామచంద్ర మాటల్లో చెప్పాలంటే ఇలా చెప్పవచ్చు. ''ఇప్పటి సాహిత్యం - వాఙ్మయం ప్రాచీనాలంకారికులు చెప్పిన లక్షణాల పరిధిని తెంచుకుని వ్యాపించింది. అదొక పారావారం. ప్రపంచ సాహిత్య పరిచయంతో మన సాహిత్యంలోనూ ఎన్నో నూతన లక్షణాలు పుట్టుకువచ్చాయి, వస్తున్నాయి. వాటివల్ల అంతా చెడేననడం పొరపాటు. పూర్వం కావ్యాల విషయంలోనూ కొందరు సంఘంలో ప్రాబల్యం ఉన్నవారు 'కావ్యలాపాంశ్చ వర్జయేత్' అని శాసించినవారే. కాంతిని, గాలిని ఎలా నిరోధించలేమో నూతన ధోరణులనూ నిరోధించలేము. సాహిత్యంలో అన్నీ గ్రాహ్యాలే , ఉచితాలే. వాటిపై సంపాదకుడు వ్యాఖ్య చేస్తున్నపుడు ఒక సాహిత్య వర్గాన్ని దృష్టిలో పెట్టుకొని వ్యాఖ్యానించడం కాక సమగ్ర సాంఘిక వాఙ్మయ దృష్టితో వ్యాఖ్యానించవలసి వుంటుంది. అలాంటప్పుడు సంపాదకుని జగద్వ్యాపార విజ్ఞత, ధీరత, స్థిరత, ఉచితజ్ఞత, సూక్తి చతురత లోకానికి తెలియవస్తాయి. [15]

కొత్త సామాజిక ధోరణులకు తగినట్టుగా ఎప్పటికప్పుడు సాహిత్య పరిణామాలపై వ్యాఖ్యానించడానికి సాహిత్య సంపాదకీయం ఎంతగానో ఉపయోగపడింది. సంపాదకుల వ్యక్తిగత అభిరుచి కూడా దీనికి ఒక కారణం కావచ్చు. ''తెలుగువారికి ఒక అదృష్టం వుంది. తెలుగు పత్రికలకు తొలి రోజుల నుంచి మంచి విద్వత్తు, లోతైన సాహిత్యం పరిచయం ఉన్నవాళ్లే సంపాదకులుగా ఉన్నారు. ఒకనాటి ముట్నూరి కృష్ణారావుగారు, కాశీనాథుని నాగేశ్వరరావుగారి వంటివారి నుంచి ఇటీవలి నార్ల వెంకటేశ్వరరావు, నండూరి రామమోహనరావు, ఎబికె వరకు చూడండి. పూర్వపువారిలాగే ఇప్పటివారికి తెలుగ సాహిత్య పాండిత్యం బాగా ఉండటం అదనపు విశేషం.'' [16] అందుకే ఎబికె ప్రసాద్ సాహిత్య సంపాదకీయాలను Journeys into Liteatureగా పేర్కొన్నారు. సాహిత్య సంపాదకీయాలకు ఒక నిర్దిష్టమైన ఆకృతిని సంతరించడంలో ఎబికె చేసిన కృషి విశేషించి పేర్కొనదగినది. అనేక మంది రచయితల సృజన శక్తిని వారివారి రచనలను అంచనా కట్టడానికి సాహిత్య సంపాదకీయాన్ని ఆయన ఒక ప్రత్యేక వేదికగా ఎంచుకున్నారు. ఎందరో కవులు, నాటకకర్తలు, కథకులు నవలాకారుల తాత్త్విక చింతనకు, సృజనశక్తికి సంబంధించిన విశ్లేషణ కోసం ఆయన ప్రయత్నించారు. అంతేకాకుండా ప్రపంచ సాహితీవేత్తల రచనలతో తులనాత్మకంగా అధ్యయనం చేయడానికి ఈ సంపాదకీయాల ద్వారా ప్రయత్నించారు.

సాహిత్య సంపాదకీయాలు ఒక ప్రక్రియగా అభివృద్ధి చెందడానికి కావాల్సిన పూర్వరంగాన్ని ఏర్పరచడానికి ఈ కృషి దోహదపడింది. అయితే కాలాన్నిబట్టి, సంపాదకుల సాహిత్య అభిరుచినిబట్టి సాహిత్య సంపాదకీయాల స్వరూప స్వభావాలుంటాయి. 1980-90ల మధ్య వెలువడిన సాహిత్య సంపాదకీయాలు, 1990ల తరువాత వెలువడిన సాహిత్య సంపాదకీయాలకూ మధ్య కాలానుగుణమైన వ్యత్యాసాలను కూడా గమనించవచ్చు. వీటిని ప్రత్యేకించి అధ్యయనం చేయాల్సి వుంది.

పాదసూచికలు :

1. నండూరి రామమోహనరావు, 'ముందుచూపు', ఆంధ్రజ్యోతి దినపత్రిక, డిసెంబర్ 30, 1968

2. నండూరి రామమోహనరావు, 'ముందుచూపు', ఆంధ్రజ్యోతి దినపత్రిక, డిసెంబర్ 30, 1968.

3. నండూరి రామమోహనరావు, 'దస్విదానియా' ఆంధ్రజ్యోతి దినపత్రిక, డిసెంబర్ 24, 1991.

4. ఎబికె ప్రసాద్, ' ఈ తెలుగు వేళ్లూనుకోవలసిందే', ఆంధ్రప్రభ దినపత్రిక, ఏప్రిల్ 22, 1982.

5. ఎబికె ప్రసాద్, 'నమీల్ - నమీబియా', ఉదయం దినపత్రిక, ఏప్రిల్ 1985.

6. నండూరి రామమోహనరావు, చాసోసప్తతి, ఆంధ్రజ్యోతి దినపత్రిక, మార్చి 10, 1985.

7. చేకూరి రామారావు, 'సృజనాత్మక సంపాదక పరంపరలో కొసమెరుపు ఎబికె' నిబద్ధాక్షరి-2 ముందుమాట, ఎబికె సాహిత్యకీయాలు, పేజీ XI ఆగస్టు 1998.

8. చేకూరి రామారావు, 'నిబద్ధాక్షరి ముందుమాట, పేజీ XV ఆగస్టు, 1998.

9. ఎబికె ప్రసాద్ 'రాధమ్మ పెళ్లి జరిగి తీరుతుంది' ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకీయం, సెప్టెంబర్ 9, 1990.

10. ఎబికె ప్రసాద్, 'కాంతి గోపురాలు' ఆంధ్రప్రభ దినపత్రిక సంపాదకీయం, ఏప్రిల్ 8, 1990.

11. ఎబికె ప్రసాద్ ''స్త్రీవాద సాహితికి చిరునామా సత్యవతి'', 'వార్త దినపత్రిక'', సెప్టెంబర్ 1, 1996.

12. నండూరి రామమోహనరావు, 'చైనాలో షేక్స్పియర్', ఆంధ్రజ్యోతి దినపత్రిక, నవంబర్ 27, 1966.

13. ఎబికె ప్రసాద్, 'మహిళా దీపశిఖ సిమన్ ది బోవిర్', ఉదయం దినపత్రిక సాహిత్య సంపాదకీయం, ఏప్రిల్ 20, 1986.

14. ఎబికె ప్రసాద్ 'అధోలోకాలు చూచిన అసంబద్ధ నాటకకర్త', ఉదయం దినపత్రిక సాహిత్య సంపాదకీయం, ఏప్రిల్ 27, 1986.

15. తిరుమల రామచంద్ర, 'విప్పారిన అపరంజి రేకులు', ఎబికె నిబద్ధాక్షరి, ముందుమాట, పేజీ ii మార్చి 1997.

16. చేకూరి రామారావు, 'సృజనాత్మక సంపాదక పరంపరలో కొసమెరుపు ఎబికె, నిబద్ధాక్షరి-2, ముందుమాట పేజీ XI ఆగస్టు, 1998.

★★★

# ఐదవ అధ్యాయం

## ఉపసంహారం

తెలుగునాట పత్రికారచన మొదటినుంచీ సాహిత్య, సాంస్కృతిక రంగాలతో కలగలిసిపోయిన రంగం. సామాజిక వ్యవస్థలో వచ్చే అనేక మార్పులతో పాటు సాహిత్య సాంస్కృతిక రంగాల పరిణామాలన్నీ కూడా పత్రికారచనపై విశేష ప్రభావాన్ని చూపించాయి. నూటయాభై సంవత్సరాల పైబడిన చరిత్ర ఉన్న తెలుగు పత్రికారంగం ఒక సంక్లిష్ట దశలో క్రియాశీలక పాత్రను నిర్వర్తించింది. అనేక పత్రికలు సామాజిక సంస్కరణల్లో భాగంగా వెలువడినప్పటికీ వాటి ప్రధాన వ్యక్తీకరణ సాధనాలు సాహిత్య రూపాలే.

''విశేషం ఏమిటంటే 19వ శతాబ్ది ఉత్తరార్థంలో ప్రతి గొప్ప పండితుడూ నాటక రచన చేసినట్టుగానే పత్రికా నిర్వహణం కూడా చేశాడు. కొక్కొండ వేంకటరత్నం, కందుకూరి వీరేశలింగం పంతులు గార్ల వంటివారే కాక వేదం వేంకటరాయశాస్త్రి, దాసు శ్రీరాములు, వావిలాల వాసుదేవశాస్త్రి, చిలకమర్తి లక్ష్మీనరసింహం, జనమంచి శేషాద్రిశర్మగారు లాంటివారు కూడా పత్రికానిర్వహణకు పూనుకోవడం గమనార్హం.''[1]

తెలుగులో సాహిత్య పరిణామక్రమం పత్రికారచన పరిణామక్రమం పరస్పర ప్రభావాలతో కొనసాగాయని చెప్పటానికి అనేక ఉదాహరణలు దొరుకుతాయి. ముఖ్యంగా కవి పండితులు ఎక్కువ సంఖ్యలో పత్రికల నిర్వహణలో విశేషమైన బాధ్యతల్ని నిర్వహించడం వల్ల సాహిత్య ప్రక్రియలకు ఎక్కువ ప్రాధాన్యం లభించింది. ప్రాచీనకావ్యాలను పరిష్కరించి ఆయా పత్రికల్లో ప్రకటించడం ఒక ప్రధాన అంశంగా కనిపిస్తుంది. ఈ విధంగా వీరేశలింగంపంతులు గారు మొదటిసారిగా వివేకవర్ధని పత్రికలో అయ్యలరాజు రామభద్రుడి 'రామాభ్యుదయా'న్ని ప్రచురించారు. ప్రాచీన గ్రంథ ప్రచురణ, సమకాలీన గ్రంథాల ప్రచురణ, భాషాసాహిత్యాల చర్చ, కవిపండితుల ఉత్తరప్రత్యుత్తరాలు, గ్రంథ సమీక్షలు, ఇలా ఎన్నో రూపాల్లో సాహిత్యం తెలుగు పత్రికారచనలో ఒక విడదీయలేని భాగంగా ఉండిపోయింది. విశేషమేమిటంటే 19వ శతాబ్ది చివరిపాదంలో తెలుగునాట ప్రకటితమైన పత్రికల్లోచాలాభాగం సాహిత్య సంబంధమైనవే. అప్పటి పత్రికల్లో సాహిత్య విషయాలను గురించి స్థూలమైన అంశాలే కాకుండా శబ్దచర్చ లాంటి సూక్ష్మమైన అంశాలకు కూడా విశేష ప్రాధాన్యం లభించింది. వివిధ సాహిత్య ప్రక్రియల్లో విస్తృతమైన చర్చలకు అవకాశమివ్వడమే కాకుండా వాటిల్లో పోటీలను నిర్వహించడం కూడా గమనించవచ్చు.

అయితే కాలక్రమంలో పత్రికలకు విశేష జనాదరణ లభించడంతో అన్నివర్గాల

అయితే కాలక్రమంలో పత్రికలకు విశేష జనాదరణ లభించడంతో అన్నివర్గాల పాఠకుల అభిరుచికి తగ్గట్టుగా పత్రికలని తీర్చిదిద్దాల్సిన అవసరం ఏర్పడటంతో సాహిత్యానికి అంటూ వేరే పత్రికలు ఏర్పడ్డాయి. ఉదాహరణకు 'భారతి'. అలాగే, సమకాలీన అంశాలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చే పత్రికలు పెరిగాయి. దినపత్రికల సంఖ్య కూడా పెరుగుతూ వచ్చింది. దినపత్రిక ప్రధానంగా వార్తాంశాలకు ప్రాధాన్యమివ్వాల్సివుంటుంది కాబట్టి దినపత్రికల పరిధిలో సాహిత్య విశేషాలు ఒక పరిమితిని ఏర్పరచుకున్నాయి. అప్పటికీ ఆంధ్రపత్రిక లాంటి దినపత్రికలు విశేష సాహిత్యానుబంధాలను ప్రచురిస్తూనే వచ్చాయి. ఇతర దినపత్రికల్లో కూడా ఆదివారం అనుబంధాలు అంటే ప్రధానంగా సాహిత్య అనుబంధాలు గానే కొంతకాలం చెలామణీ అయ్యాయి. సాధారణ దినపత్రికలు (ఉదాహరణకు ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి) తో పాటు ఒక దృక్పథం ప్రాతిపదికగా ఏర్పడిన పత్రికల్లో (ఉదాహరణకు విశాలాంధ్ర) కూడా సాహిత్యం ప్రాధాన్యం వహిస్తూ వచ్చింది.

తొలినాటి తెలుగుపత్రికల్లో సాహిత్యం ప్రధానంగా గ్రంథ పరిష్కరణ, సమీక్షలు, వ్యాకరణ చర్చ మొదలైన అంశాలకే పరిమితమైతే ఆ తరువాత పత్రికల్లో కాలానుగుణంగా ఇతరేతర సాహిత్య అంశాలు కూడా విస్తరించాయి. ఈ మార్పు ప్రధానంగా స్వాతంత్ర్యానంతర కాలంలో కనిపిస్తుంది. స్వాతంత్ర్యానంతరం సాహిత్య ప్రక్రియలు ఒక స్వేచ్ఛా భావనను సంతరించుకోవడం వల్ల అవి మరింత విస్తృతమయ్యాయి. దాదాపు ప్రతి ప్రక్రియ సమగ్రంగా రూపొందటానికి అనువైన వాతావరణం ఏర్పడింది. స్వాతంత్ర్యానంతర దినపత్రికల్ని పరిశీలిస్తే ఈమార్పులన్నీ అవగతమవుతాయి. ఆయాప్రక్రియల్లో సృజనాత్మక రచనలకు ప్రోత్సాహం ఇవ్వడంతో పాటు వాటిపైన విమర్శనాత్మక చర్చలకు దోహదమిచ్చేవి ఈపత్రికలు. ఒక రకంగా దినపత్రికల సాహిత్య వ్యాసాలు, విమర్శలు, చర్చలు, వీటన్నింటినీ కలగలిపితే తెలుగుసాహిత్య చరిత్రని రచించవచ్చు కూడా. అంటే తెలుగుసాహిత్య చరిత్ర రచనకు దినపత్రికలు ఒక ప్రధాన ఆకరంగా ఉపయోగపడతాయన్నమాట.

## ఎ. *1970-80*ల మధ్య సాహిత్యంపై సమీక్ష :

ఇరవయ్యవ శతాబ్ది చివరి పాదంలో అంటే మామూలుగా 1970 నుంచి దినపత్రికల పరిణామక్రమాన్ని విశ్లేషిస్తే దినపత్రికలకూ, సాహిత్యానికి మధ్య ఉన్న అవినాభావ సంబంధం అర్థమవుతుంది. 1970 నుంచి పత్రికావ్యవస్థలో వచ్చిన మార్పులు విశేషంగా పేర్కొనదగినవి. ప్రధానంగా ఆధునిక సౌకర్యాలు పత్రికారంగంలో ఏర్పడ్డాయి. పాఠకుల సంఖ్య మారుమూల గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించింది. ఈ దశలో తెలుగు దినపత్రికల్లో మౌలికమైన సాహిత్య అంశాలకు ప్రాధాన్యం లభించింది. ఈ దశాబ్దంలో పత్రికావ్యవస్థలో వచ్చిన మార్పుల్ని రెండు విధాలుగా విశ్లేషించవచ్చు. మొదటిది సాంకేతికమైతే, రెండోది సాంస్కృతికమైంది. సాధారణ సాహిత్య అంశాలతో పాటు అభ్యుదయ, విప్లవోద్యమాలకు సంబంధించిన అంశాలు దినపత్రికల్లో ప్రాధాన్యం

రూపొందించుకోవడంతోపాటు విప్లవసాహిత్యోద్యమం వల్ల వచ్చిన కొత్త పరిణామాలు దినపత్రికల్లో కూడా చర్చలకు, వాదోపవాదాలకు దారితీశాయి. దీంతోపాటు ప్రాచీన ఆధునిక సాహిత్యాలకు సమానమైన ప్రాధాన్యం లభించింది. ఆదివారం అనుబంధాలతోపాటే సాహిత్య అనుబంధాలు కూడా ప్రచురితమయ్యాయి. కవిత, కథ, వ్యంగ్య రచనలతోపాటు విమర్శ వ్యాసాలు కూడా సమప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. అంతేకాక అనువాద సాహిత్యం కూడా ఈ దశాబ్దంలో వివిధ దినపత్రికల్లో కనిపిస్తుంది. దీనివల్ల ఇతర దేశాల్లోనూ, భాషల్లోనూ వివిధ సాహిత్య రూపాలలో వచ్చిన మార్పులను అవగాహన చేసుకునే వీలు కలిగింది. అలాగే తెలుగునాట ప్రసిద్ధులైన రచయితలూ కవుల ఇంటర్వ్యూలు ప్రచురించే సంప్రదాయం కూడా ఈ దశాబ్దంలో ఏర్పడింది. 1977 ప్రాంతాల్లో శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి, పుట్టపర్తి లాంటి ప్రసిద్ధుల ఇంటర్వ్యూలు ప్రచురితమయ్యాయి. ఆ తర్వాత దినపత్రికల్లో అదొక విశేష శీర్షికగా రూపుదిద్దుకుంది. ఇక సాహిత్య చర్చలూ వాదోపవాదాలకు వాడీ వేడీ అందించిన దశాబ్దం కూడా ఇదే. 1975 తర్వాత శ్రీశ్రీ యుగానికి సంబంధించిన చర్చలూ వాదోపవాదాలు సాగాయి. 'శ్రీశ్రీ యుగం అంతరించిందా?', 'ఆధునిక కవిత్వం ఎటు పోతున్నది?' లాంటి తర్జన భర్జనలు ఈ దశలో జరిగినవే. అనుభూతివాదానికి సంబంధించిన మౌలిక భావనలు ఈ దశాబ్దంలోనే ప్రవేశించాయి. తెలుగు కథానికా ప్రమాణాలపై జరిగిన చర్చలు కూడా విశేషించి పేర్కొనదగినవి. తెలుగు నవల క్రమంగా వ్యాపార నవలగా మారుతున్న క్రమంపైన కూడా చర్చలు ప్రారంభమయ్యాయి.

### *బి.1980-90ల మధ్య సాహిత్యంపై సమీక్ష:*

1980ల తర్వాత తెలుగు దినపత్రికల్లో మౌలికంగా అనేక మార్పులు జరిగాయి. వాటిల్లో ప్రధానంగా పేర్కొనవలసినది - సాహిత్యం కోసం ప్రత్యేకంగా పేజీలు నిర్వహించడం. 80 ల దాకా దినపత్రికల్లోని ఆదివారం అనుబంధాల్లోనూ, ఇతర ప్రత్యేక సందర్భాల్లోనూ సాహిత్యానికి తగినంత ప్రాముఖ్యం లభించినప్పటికీ ప్రత్యేకంగా సాహిత్యానికే పేజీలు కేటాయించడం జరగలేదు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆదివారం అనుబంధంలో భాగంగా ఉన్న సాహిత్యవేదిక సోమవారం నాడు పూర్తి పేజీగా రూపుదిద్దుకున్నది ఈ దశాబ్దంలోనే. ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి దినపత్రికలతో పాటు కొత్తగా వెలువడిన ఉదయం దినపత్రిక కూడా సాహిత్యానికి పూర్తి పేజీని కేటాయించింది. పత్రికలకూ, సాహిత్యానికీ మధ్య ఉండాల్సిన అనుబంధాన్ని ఈ ప్రత్యేక పేజీలు ఇంకా పటిష్ఠం చేశాయి. అటు ప్రాచీన సాహిత్యంతో పాటు సమకాలీనంగా సాహిత్య రంగంలో పొడచూపుతున్న వివిధ ధోరణులన్నింటికీ ఈ పేజీల్లో ప్రాధాన్యం లభించింది. సాహిత్యంలోని వివిధ ప్రక్రియలు సృజనాత్మకంగా, విమర్శనాత్మకంగా అభివృద్ధి చెందడానికి ఈ పేజీలు దోహదపడ్డాయి. ప్రధానంగా సమకాలీన ధోరణులకు పత్రికాముఖంగా విస్తృత ప్రాధాన్యం లభించడంతో సాహిత్య

సమకాలీన ధోరణులకు పత్రికాముఖంగా విస్తృత ప్రాధాన్యం లభించడంతో సాహిత్య పరిణామక్రమం వేగవంతమైంది.

సి. కొత్త ధోరణులు- కొత్త శీర్షికలు:

సాహిత్య ప్రక్రియలు సృజనాత్మకంగా బహుముఖీనతను సాధించడానికి ఈ దశాబ్ది దినపత్రికల సాహిత్య పేజీల ప్రోత్సాహం లభించింది. ముఖ్యంగా సాహిత్య పేజీల్లోనే కాకుండా ఇతర పేజీల్లో కూడా సాహిత్య ప్రభావం ఉన్న వివిధ శీర్షికలు ప్రయోగాత్మకంగా ప్రారంభించి కొనసాగించింది ఈ దశాబ్దంలోనే. దినపత్రికల సంపాదకీయ పేజీల్లో ఈ విధంగా చోటు సంపాదించుకున్న శీర్షికలు ఎన్నో కనిపిస్తాయి. గొల్లపూడి మారుతీరావ్ 'జీవనకాలమ్' నామిని 'పచ్చనాకు సాక్షిగా' పతంజలి 'భాష్యం' 'వరదకాలమ్' లాంటి శీర్షికలు పరోక్షంగా సాహిత్య ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నదే. అదే విధంగా ఆదివారం అనుబంధాల్లో 'జ్ఞాపకాలు' లాంటి శీర్షికలు కూడా ఈ సందర్భంగా పేర్కొనదగినవే.

ఇక సాహిత్యపరంగా కె.వి.రమణారెడ్డి 'అక్షరజగత్తు' ఆరుద్ర 'వ్యాసపీఠం' టి.ఎల్.కాంతారావు 'వారానికో రోజు' పేర్కొనదగినవి.

తెలుగునాట పత్రికారంగం ఒక విస్తృతిని సాధించుకున్నది సాహిత్య నేపథ్యం వల్లనే. అనేకమంది కవులు, రచయితలు, విమర్శకులు ప్రత్యక్షంగా, పరోక్షంగా పత్రికారంగంతో సన్నిహిత సంబంధాలను కలిగివుండటం వల్ల అది ఆ రెండు రంగాలకూ ఎన్నో విధాలుగా తోడ్పడింది. దినపత్రికలకు పాఠకులు వేల సంఖ్యలో ఉంటారు. వీరిలో సాహిత్య పాఠకులు పరిమిత సంఖ్యలో ఉన్నా ఒక సాంస్కృతిక అంశంగా సాహిత్య రంగాన్ని స్వీకరించి వాటికి సంబంధించిన ప్రక్రియల వ్యాప్తికి దినపత్రికలు దోహదపడ్డాయి. సాహిత్య ప్రభావం వల్ల పత్రికల రచనాశైలిలో వచ్చిన మార్పులనుకూడా ఈ సందర్భంగా పేర్కొనవలసినదే. కవితాత్మకమైన శీర్షికలు ఇవ్వడం, వార్తారచనలో భిన్నమైనశైలికోసం పత్రికాభాషకు తిలోదకాలిచ్చి సాహిత్య గౌరవం ఉన్న భాషను స్వీకరించడం లాంటి పరిణామాలు విశేషంగా చెప్పుకోవాలి.

సాహిత్యం, పత్రికలు రెండూ కూడా సామాజిక పరిణామక్రమంలో వేగాన్ని అందించే సాధనాలు. 1970 నుంచి 90 వరకూ ఈ రెండు రంగాల్లో వచ్చిన వివిధ పరిణామాల్ని దృష్టిలోకి తీసుకుంటే ఈ విషయం అవగతమవుతుంది. సామాజిక పరిణామాల్ని బట్టి సాహిత్య పత్రికా రంగాలు ఎంతగా ప్రభావితం అవుతాయో ఈ రెండు దశాబ్దాల దినపత్రికల సాహిత్యాన్ని విశ్లేషించడం ద్వారా తెలుసుకోవచ్చు. మార్పు అనేది సమాజంలోని వివిధ శక్తుల మధ్య పరస్పర సంఘర్షణలోనూ, సమన్వయం లోనూ సాధ్యపడుతుంది. ఆ మార్పుని ప్రతిబింబించడానికీ లేదా తగినంత ఉత్తేజాన్ని పొందడానికీ సమకాలీన సామాజిక వ్యవస్థలో నిర్దిష్టమైన కొన్నిఆధారాల్ని ఏర్పరచుకుంటాయి. దినపత్రికలూ, సాహిత్య

రంగం రెండూ అలాంటి అవిభాజ్యమైన ఆధారపీఠికలు.

పాదసూచిక :

1. అక్కిరాజు రమాపతిరావుపీఠిక, తెలుగుపత్రికల సాహిత్య సేవ, రచన : డాక్టరు తిరుమల రామచంద్ర.

★★★

# ఉపయుక్త గ్రంథ సూచిక

# ఉపయుక్త గ్రంథసూచిక


| | |
|---|---|
| అప్పారావు గురజాడ | వ్యాసచంద్రిక - గురజాడ రచనలు - 1<br>విశాలాంధ్ర ప్రచురణలు, విజయవాడ, 1953 |
| ఆంజనేయులు, కుందుర్తి | కుందుర్తి వ్యాసాలు - తెలుగు పరిశోధన<br>ప్రచురణలు, హైదరాబాద్,1987 |
| ఆంజనేయులు, కుందుర్తి | తెలంగాణా - రచయిత, హైదరాబాద్, 1956 |
| ఎహ్రాన్‌బర్గ్, ఇల్యా | రచయితా - శిల్పమూ - (అను.) తుమ్మల<br>వెంకటరామయ్య - విశాలాంధ్ర, పబ్లిషింగ్‌హౌస్,<br>విజయవాడ, 1955 |
| కుటుంబరావు, కొడవటిగంటి | సాహిత్య ప్రయోజనం -<br>విశాలాంధ్ర ప్రచురణ - అక్టోబర్, 1969 |
| కె.వి.ఆర్ | తెలంగాణా పోరాటం - సాహిత్యం -<br>సృజన ప్రచురణ - 1984 |
| గోపి .ఎన్ | ప్రజాకవి వేమన -<br>చైతన్య ప్రచురణలు, హైదరాబాద్, 1980 |
| గోపి .ఎన్ | నిలువెత్తు తెలుగు సంతకం - సి.నా.రె.వ్యక్తిత్వం -<br>హృదయభారతి ప్రచురణ, 1991 |
| గోపి .ఎన్ | గోపి సాహిత్య దర్శనం<br>(దృక్కోణాలు, సమీక్షణలూ) (సం.) అఫ్సర్,<br>ఎండ్లూరి సుధాకర్, యాకూబ్, జె.చెన్నయ్య,<br>ఎస్వీ సత్యనారాయణ, మచ్చ హరిదాసు,<br>పి.సంగారెడ్డి, మద్దాలి పద్మజ, హైదరాబాద్, 1998. |
| చెన్నకేశవ రెడ్డి. జి | ఆధునికాంధ్రగేయ కవిత్వం -<br>జయమిత్ర పబ్లికేషన్స్, హైదరాబాద్, 1988 |
| చెరబండరాజు | చెరబండరాజు కవితలు - పాటలు -<br>పీపుల్‌బుక్స్, విజయవాడ, 1982 |
| జె.సి. | కవిత్వం - గతితార్కికత -<br>సృజన ప్రచురణ - హైదరాబాద్ - జనవరి, 1991 |

| | |
|---|---|
| తిలక్, బాలగంగాధర్ | అమృతం కురిసిన రాత్రి - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1978 |
| ద్వానాశాస్త్రి | సాహిత్య సంస్థలు (ఉభయగోదావరి జిల్లాల ప్రత్యేక పరిశోధన) తెలుగు విశ్వవిద్యాలయ పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం. |
| నగ్నముని, నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, చెరబండరాజు భైరవయ్య, మహాస్వప్న | దిగంబర కవులు (మూడు కవితా సంకలనాల ఏకైక సంపుటి) - ఎం.శేషాచలం అండ్ కో, మద్రాస్, 1971 |
| నారాయణరావు, వెల్చేరు | తెలుగులో కవితా విప్లవాల స్వరూపం - హైదరాబాద్ బుక్‌ట్రస్ట్- హైదరాబాద్, 1987 |
| నారాయణ రెడ్డి , సి. | ఆధునిక కవిత్వం - సంప్రదాయములు - ప్రయోగములు - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1967 |
| ప్రతాపరెడ్డి, సురవరం | గోలకొండ పత్రిక సంపాదకీయాలు, మొదటి సంపుటం (1926-36) సం. దేవులపల్లి రామానుజరావు, డా.ఎల్లూరి శివారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి, ఆంధ్ర సారస్వత పరిషత్, తిలక్ రోడ్, హైదరాబాద్, 1989. |
| ప్రతాపరెడ్డి, సురవరం | గోలకొండ పత్రిక సంపాదకీయాలు, రెండవ సంపుటం (1936-45) సం. దేవులపల్లి రామానుజరావు, డా.ఎల్లూరి శివారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి, ఆంధ్ర సారస్వత పరిషత్, తిలక్ రోడ్, హైదరాబాద్, 1989. |
| ప్రతాపరెడ్డి, సురవరం | సురవరం ప్రతాపరెడ్డి పీఠికలు, సం. డా.ఎల్లూరి శివారెడ్డి, సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి, ఆంధ్ర సారస్వత పరిషత్, తిలక్ రోడ్, హైదరాబాద్, 1990. |
| ప్రసాద్ ఎ.బి.కె. | ఎ.బి.కె. సంపాదకీయాలు (రెండవ భాగం), స్నేహ పబ్లిషర్స్, హైదరాబాద్, జనవరి 1987. |

| | |
|---|---|
| ప్రసాద్ ఎ.బి.కె. | ఎ.బి.కె. సంపాదకీయాలు (మూడవ భాగం),<br>స్నేహ పబ్లిషర్స్, హైదరాబాద్, జనవరి 1987. |
| ప్రసాద్ ఎ.బి.కె. | ఎ.బి.కె. సంపాదకీయాలు<br>(నాల్గవ భాగం 1989-91),<br>నవ్య ప్రచురణ, హైదరాబాద్, ఏప్రిల్ 1995. |
| ప్రసాద్ ఎ.బి.కె. | ఎ.బి.కె. సాహిత్య కీయాలు<br>(నిబద్ధాక్షరి-1), క్యాంపస్ పబ్లికేషన్స్,<br>హైదరాబాద్, మార్చి 1997. |
| ప్రసాద్ ఎ.బి.కె. | ఎ.బి.కె. సాహిత్య కీయాలు<br>(నిబద్ధాక్షరి-2), ప్రగతి పబ్లిషర్స్,<br>హైదరాబాద్, ఆగస్టు 1998. |
| ప్రసాద్ ఎ.బి.కె. | సిరా సరాగాలు (చరిత్ర పలుకులు)<br>స్నేహ పబ్లిషర్స్, హైదరాబాదు. |
| బంగోరె | బ్రౌన్ జవాబులు,<br>తెలుగు జర్నలిజం చరిత్ర (1832-57)<br>ఫ్రీడమ్ ప్రెస్, మద్రాస్, అక్టోబర్ 1973. |
| బాలగోపాల్.కె | రూపం-సారం - స్నేహ ప్రచురణ<br>- హైదరాబాద్ - ఏప్రిల్, 1986. |
| బాలసుబ్రమణియన్.కె<br>కాచినేని రామారావు,<br>వడ్లా సుబ్రహ్మణ్యం<br>ఎం.వి. రమణయ్య | పత్రికా భాషా నిఘంటువు,<br>తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1995. |
| మధుసూదనరావు త్రిపురనేని | కవిత్వం చైతన్యం - విరసం - తిరుపతి, 1972. |
| మోహన ప్రసాద్.వేగుంట | చితి - చింత - ఎమెస్కో ప్రచురణ -<br>మచిలీపట్నం, 1969. |
| రఘునాథన్.టి.యం.సి. | భారతి : సమకాలీన భావములు,<br>అనువాదం : యన్.జి. జగన్నాథరాజు,<br>సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీ, 1998. |
| రవీంద్రారెడ్డి .యం | తెలుగు కవిత్వంపై మార్క్సిజం ప్రభావం,<br>ఫ్రెండ్స్ పబ్లికేషన్స్, నల్లకుంట, హైదరాబాద్. 1988. |

రంగనాథాచార్యులు కె.కె. సంపా : ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు ఆంధ్ర సారస్వత పరిషత్ - హైదరాబాద్, 1982

రంగనాథాచార్యులు కె.కె. తెలుగులో తొలి సమాజ కవులు - ఆంధ్ర సారస్వత పరిషత్ - హైదరాబాద్, 1983.

రంగనాథాచార్యులు కె.కె. తెలుగు సాహిత్యం - చారిత్రక భూమిక ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాద్.

రామచంద్ర, తిరుమల తెలుగు పత్రికల సాహిత్య సేవ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, జనవరి 1989.

రామచంద్రమూర్తి .కె వార్తా రచన (సూత్రాలు - సూచనలు) ప్రజాశక్తి బుక్‌హౌస్, కారల్ మార్క్స్ రోడ్, విజయవాడ, జనవరి 1993.

రామమోహనరావు, నండూరి చిరంజీవులు (ప్రసిద్ధ వ్యక్తులపై ఆంధ్రజ్యోతి సంపాదకీయాల సంకలనం 1963-86) నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, గుంటూరు, జనవరి 1987.

రామమోహనరావు, నండూరి స్వర్ణాభినందన, (సం) శ్రీరమణ, పానుగోటి కృష్ణారెడ్డి, లిఖిత ప్రచురణలు, విజయవాడ, జనవరి 1998.

రామమోహనరావు, నండూరి వ్యాఖ్యావళి (ఆంధ్రజ్యోతి సంపాదకీయాలు 1963-94) లిఖిత ప్రచురణలు, ఏలూరు రోడ్, విజయవాడ, నవంబర్ 1997.

రామారావు కాళీపట్నం (సం.) మనలో మనం, సామాజిక అభివృద్ధి తీరుతెన్నులు, సాగర గ్రంథమాల, విశాఖపట్నం, సెప్టెంబర్ 1990.

వరవర రావు సృజన సంపాదకీయాలు (1966-85) పర్‌స్పెక్టివ్స్ - హైదరాబాద్, 1990.

వరదాచారి .జి.ఎస్. నా మాట, వంశీ ఆర్ట్ థియేటర్స్, ఇంటర్నేషనల్, హైదరాబాద్, ఆగస్టు, 1990.

| | |
|---|---|
| వెంకటరామయ్య, తుమ్మల | తుమ్మల సాహిత్యం, (సం.) డా. ఏటుకూరి ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, విజ్ఞాన భవన్, హైదరాబాద్, మే 1990. |
| వెంకటేశ్వర్లు, పిరాట్ల | అజేయ భారత్‌శక్తి -1998, స్నేహమయ ప్రచురణలు, హైదరాబాద్, జులై 1998. |
| వెంకటేశ్వర్లు, నార్ల | మూడు దశాబ్దాలు (ఎన్నిక చేసిన సంపాదకీయాల సంకలనం 1944-74) నవోదయ పబ్లిషర్స్, విజయవాడ, గుంటూరు, ఆగస్టు 1976. |
| శివారెడ్డి కె. | శివారెడ్డి కవిత, ఝరి పొయెట్రి సర్కిల్, 1991. |
| శేషేంద్ర | ఆధునిక మహా భారతము, సంపూర్ణ గ్రంథావళి, శేషేంద్ర సాహిత్య పీఠం, 1985. |
| సంపత్కుమారా చార్యులు, కోవెల | పూర్వకవుల కావ్య దృక్పథాలు అభినవ ప్రచురణ, వరంగల్, 1990. |
| శ్రీశ్రీ | మహాప్రస్థానం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1987. |
| శ్రీశ్రీ | మరోప్రస్థానం, సంపాదకుడు : వరవర రావు, విరసం, 1980 |
| శ్రీశ్రీ | శ్రీశ్రీ సాహిత్యం - 2 (వచన రచనలు) కూర్పరి : కె.వి. రమణారెడ్డి, శ్రీశ్రీ షష్టిపూర్తి సన్మాన సంఘం, 1970. |
| శ్రీహరి రవ్వా | ఉభయ భారతి (భాషా, సాహిత్య వ్యాస సంపుటి) వరరుచి పబ్లికేషన్స్, హైదరాబాద్, 1996. |
| శేషగిరిరావు, చీమకుర్తి<br>రామచంద్ర, తిరుమల<br>శ్రీనివాస శర్మ, వఝ | లలితకళా పదకోశం, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1991. |
| శేషేంద్ర | సాహిత్య దర్శిని, జ్యోత్స్న ప్రచురణ, హైదరాబాద్, అక్టోబర్, 1995. |
| హెచ్చార్కె | లావా, నూతన ప్రచురణ, ఫిబ్రవరి, 1984 అభ్యుదయ సాహిత్యోద్యమ పత్రాలు, ఆంధ్ర ప్రదేశ్, అరసం, హైదరాబాద్, 29. |

సుబ్రహ్మణ్యం జి.వి. (సంపా.) మహతి, యువభారతి, సికిందరాబాద్.

సుబ్రహ్మణ్యం జి.వి సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు,
తెలుగు అకాడమీ, హైదరాబాద్ 1991

సుబ్రహ్మణ్యం జి.వి విశ్వనాథ నవ్య సాంప్రదాయం, (సం.)
డా. ముదిగొండ వీరభద్రయ్య,
జి.వి.ఎస్.షష్ఠి పూర్తి ప్రచురణ,
యువభారతి, హైదరాబాద్, సెప్టెంబర్ 1995.

సౌభాగ్యమ్మ .ఎస్.హెచ్. మనం - మన పాత్రికేయులు,
ఎస్.హెచ్. ప్రచురణలు, మారుతీ నగర్,
తిరుపతి, 1989.

భారతి గాంధీనగర్, విజయవాడ, 1927-80

# ENGLISH

Abrams, M.H. A Glossary of Literary Terms -
Macmillan, India, Hq. New Delhi, 1971.

Barbash, Yuri Aesthetics and Poetics -
Progressive publishers - Moscow, 1977.

Borev, Yuri Aesthetics -- A Text Book -
Progress Publishers Books - Moscow, 1985

Cuddon J.A. A Dictionary of Literary Terms
Clarion Books, Delhi - Jan, 1980.

Eagleton, Terry Marxism and Literary Criticism-
Rutledge Chapman, 1991.

Eliot T.S. The Sacred Wood - Faber & Faber - London, 1928.

Eryomin, Vladimir Marxist, Leninist Aesths and the Arts -
Progressive Publishers - Moscow, 1980.

Evans, Ifor A Short History of English Literature -
ELBS, Penguin, 1940.

Fox, Ralph The Novel and the People -
Foreign Languages.

Gupta, A.N. and Satish Gupta A Dictionary of Literary Terms.

Lenin V.I. On Literature and Art -
Progress Publishers - Moscow.

Plekhanov, G.V. Art and Social Life -
Progress Publishers - Moscow, 1977.

| | |
|---|---|
| Scherbina, Vladimir | Lenin and Problems of Literature - Progress Publishers - Moscow, 1974. |
| Stalin, J.V. | Marxism & Problems of Linguistics - Foreign Language Press - 1972. |
| Thompson, George | The Human Essence - New Version of Marxism and Poetry, 1948. |
| Trotsky | Literature and Revolution - University of Michigan Press, 1960. |
| Tungh, Mao Tse | Selected Works on Practice - Peking Publishers, 1937. |
| Wellek, Rene and Warren, Austin | Theory of Literature - Penguin Books - 1982. |
| Wiiams, Raymonds | Marxism and Literature - Oxford University Press - F.P. : 1977, reprinted 1978. |

***